ఆంధ్రమునిత్రయతత్త్వదర్శనము

1

ఆంధ్రమునిత్రయ తత్త్వదర్శనము

పూర్వార్ధము



DONATION

భాషాప్రవీణ

Dr. చిట్టావూరి శివరామకృష్ణ శర్మ. M.A. Ph.D

D-7483

DONATION

ఆంధ్రమునిత్రయ తత్త్వదర్శనము

(పూర్వార్ధము)

07483
DONATION
पुस्तकालय
गुरुकुल कांगड़ी विश्वविद्यालय

నాగార్జున విశ్వవిద్యాలయము డాక్టరేట్ పట్టమునకు
ఆమోదించిన సిద్ధాంత గ్రంథము

తెలుగు విశ్వవిద్యాలయం ఆర్థిక సహాయముతో ముద్రితం

భాషాప్రవీణ
Dr. చిఱ్ఱావూరి శివరామకృష్ణశర్మ
ఆంధ్రోపన్యాసకుడు
C. B. R. Govt. Oriental College
ఏలూరు

ప్రమోద - మధుమాసము - 1990
ప్రథమ ముద్రణము
సర్వస్వామ్యములు ప్రకాశకులవి

వెల : రు. 60-00

ప్రతులకు:
శ్రీమతి Ch. కృష్ణవేణి,
C/o Dr. Ch శివరామకృష్ణశర్మ
4-5-3 అగ్రహారం,
ఏలూరు - 534001

ముద్రణ:
'ముముక్షువు'
పవరుపేట, ఏలూరు.

Prof. BODDUPALLI PURUSHOTTAM
National Lecturer
Head : (Retired) Department of Telugu &
Oriental Languages, Nagarjuna University
Nagarjunanagar - 522510

30-4-90
GUNTUR

అభినందన

చిఱ్ఱావూరి వారిది గొప్ప పండితవంశం. ఇది లోక విదితం. 'అచట బుట్టిన చివురు కొమ్మైన చేవ' అన్నారు. ఆ వంశవృక్షపు చేవైన కొమ్మ డాక్టర్ శివరామకృష్ణశర్మగారు.

వారు తెలుగులో నాతో పరిశోధన చేస్తామని వచ్చారు. ఆనందించాను - ఇన్నాళ్ళకు మంచి పండితుడు చిక్కాడని. ఏ అంశం స్వీకరిస్తారని అడిగాను. ఏవేవో చెప్పారు. అప్పుడు నా మనోవేదన వారికిలా విదితం చేసాను. "ఆంధ్ర శబ్ద చింతామణి బాలసరస్వతి రచించాడట! అథర్వణ కారికావళి అహోబలపతి రచించి అథర్వణాచార్యుల పేరు పెట్టాట్ట!! తాను తృతీయాచార్యుడు కావటానికి అహోబలపతి అట్లా కావించాడట! వికృతి వివేక కారికలు, చింతామణి కారికలు చాలా లోపభూయిష్ఠాలట! ఇటువంటి మాటలు వినిపిస్తున్నాయి. సంప్రదాయాంధ్ర వ్యాకరణాల్ని ఛిన్నాభిన్నం చేయాలనే ప్రయత్నాలు కందుకూరి వీరేశలింగంగారి నుండి కొనసాగుతున్నాయి. మీరు వీటిని సమీక్షించి, పరిశోధించి సమన్వయ పూర్వకంగా ఆంధ్ర మునిత్రయ యథార్థ స్వరూపాన్ని ఆవిష్కరించాలి" అని అర్థించాను.

అందుకు శర్మగారు అంగీకరించారు. ఎంతో శ్రమ చేసారు. అన్ని వ్యాకరణాలు క్షోదక్షమంగా అవలోకించారు. ఎన్నో వాదాలు పూర్వపక్షం చేసారు; సమన్వయాన్ని సమకూర్చారు. "ఆంధ్ర

మునిత్రయ తత్త్వదర్శనాన్ని" రెండు సంపుటాలుగా ఆవిష్కరించారు. నా ఆత్మకు శాంతి కలిగించారు. వారికి నా అభినందనాలు.

'శ్రుతంచ బహునిర్మలం' అన్నారు. కొందరు పండితులు కేవల దోషదృష్టితో జీవిస్తుంటారని ప్రతీతి. ఆరోగ్యకరమైన సమన్వయ దృష్టి కావాలి. డాక్టర్ శర్మగారిలో ఆదృష్టి పుష్కలం. జాతి తనకున్న వాజ్మయ సంపదను సమీకరించుకొని సంప్రదాయాన్ని స్థాపించుకొని ముందుకు సాగాలి. ఈ విషయంలో తమిళుల్ని ఆదర్శం కావించుకోవాలి ఆంధ్రులు. డాక్టర్ శర్మగారు నిరంతరంగా అజీవిత పరిశోధన కావిస్తారని, కావించాలని నా ఆకాంక్ష.

డాక్టర్ శర్మగారి సిద్ధాంత వ్యాసాన్ని పూర్తిగా పఠించే వారుంటే, వారికి తప్పక ఆంధ్ర మునిత్రయ తత్త్వదర్శనమౌతుందని నా ప్రత్యయం. భావి వ్యాకరణ శాస్త్ర పరిశోధకులకు, అధ్యయన తత్పరులకు వారి పరిశోధన ఉపాదేయము, పాథేయము కాగలదని నా విశ్వాసం.

బి. పురుషోత్తం.

లక్ష్మణ యతీంద్రులు   ముముక్షుజన మహాపీఠము

శ్రీకృష్ణాశ్రమము: ముత్తీవి : కృష్ణా; శ్రీసత్యధర్మాశ్రమం, రా. పేట, ఏలూరు.

మంగళాశాసనము

బ్రహ్మశ్రీ చిఱ్ఱావూరి శివరామకృష్ణ శర్మగారు రచించిన "ఆంధ్ర మునిత్రయ తత్త్వదర్శనము" అన్న గ్రంథం శ్రద్ధగా- ఆమూలాగ్రం- చదివి ఆనందపడటమే కాదు - చిరంజీవి శర్మగారు చేసిన పరిశ్రమా, చూపిన ప్రతిభా గమనించి ఆశ్చర్యం కూడా పొందాను.

సాహిత్యోపాసకులుగా, ఆదర్శోపాధ్యాయులుగా, మంచివక్తగా, రచయితగా, బహువిధ అవధాన దక్షులుగా, ఆర్ష విజ్ఞాన ప్రచారకులుగా, పౌరాణికులుగా లబ్ధప్రతిష్ఠులైన శ్రీ శర్మగారు సంస్కృతాంధ్ర వ్యాకరణ శాస్త్రాల్లో బాగా పరిశ్రమ చేసిన ప్రజ్ఞావంతులు అన్న విషయం తెలుసుగాని, ఈ గ్రంథం చూచేవరకు శ్రీ శర్మగారి పరిశ్రమ లోతు తెలియలేదు. అదీ ఆశ్చర్యకారణం.

శ్రీ శర్మగారు శ్రీ చిఱ్ఱావూరి అనంత పద్మనాభశాస్త్రిగారి పుత్త్రులు - శ్రీ శాస్త్రిచరణులనే ఆచార్యులుగా వరించి, శ్రీవారి అనుగ్రహ పాత్రులైన భాగ్యశాలురు.

శ్రీ అనంత పద్మనాభశాస్త్రిగారు ఆర్ష విద్యా మహోదధి, మహాజ్ఞాని, మహాభక్తులు, రూపుదాల్చిన భాగవతతత్త్వం. అధీతి, బోధ, ఆచరణ, ప్రచారము అన్న నాల్గుదశలు అధిగమించిన మహావ్యక్తి.

శ్రీ శాస్త్రిగారి పుత్త్రిలుగా పరిచయం చేయబడటం శ్రీ శర్మగారికి గౌరవకారణం.

అట్టి శ్రీ శర్మగారి ఈ సిద్ధాంతగ్రంథం సమగ్ర సుందరంగా ఉంది.

ఈ గ్రంథంలో విమర్శింపబడిన ఆంధ్రశబ్ద చింతామణీ, వికృతి వివేకమూ, అహోబల పండితీయమూ - ఇత్యాదులు అధ్యయనం చేయటమే కాదు - ఆ యా గ్రంథములను గూర్చి, కర్తలను గూర్చి, వాటిలో ప్రతిపాదింపబడిన సిద్ధాంతములను గురించీ ఏవేవో అభిప్రాయాలు ఏర్పరచుకొనటమే కాక, చర్చావేదికలలో పాల్గొన్న వారిలో అస్మదాదులం కూడా ఉన్నాం.

అయితే, శ్రీ శర్మగారి సిద్ధాంతవ్యాసరూపమైన ఈ గ్రంథంలో హేతుబద్ధములైన వీరి ప్రతిపాదనలు చూచి, గతంలోని అభిప్రాయాలు కొన్ని మార్చుకున్నాను అన్న విషయం ఇక్కడ చెప్పటం ఉచితం.

ఈ సందర్భంగా శ్రీ శర్మగారి కృషిని అభినందిస్తూ, శాస్త్రీయములైన ఇట్టి గ్రంథ పుష్పాలతో ఆంధ్రసరస్వతీ చరణార్చన చేయగలుగుదురు గాక అని మంగళాశాసనం చేస్తున్నాను -

ఇతిశమ్ !

శుక్ల : ఫాల్గుణ బ॥ దశమి
బుధవారం ; 20.3.90

లక్ష్మణ యతీంద్రులు

Centre of Advanced Study in Linguistics
Annamalai University
Professor P. S. SUBRAHMANYAM, M. A., Ph.D., D.Litt.
Director

20-4-90

వేదాంగాలలో ప్రథమమైనది వ్యాకరణం. వ్యాకరణాన్ని సమగ్రమైన శాస్త్రంగా మొట్టమొదట తీర్చిదిద్దినవారు పాణిని మహర్షి. ఆధునిక భాషాశాస్త్రజ్ఞులందరూ ప్రపంచంలోని వైయాకరణులందరిలోనూ గొప్పవాడు పాణిని మహర్షి అని ఏకగ్రీవంగా ఒప్పుకొన్నారు. ప్రాచీన భారతీయ విజ్ఞానంలో ఏఅంశమైనా ఇప్పటికీ ప్రపంచానికంతకీ మార్గదర్శక మైనది అంటే అది వ్యాకరణ శాస్త్రమేనని నిస్సంశయంగా చెప్పవచ్చు. పాణిని వ్యాకరణంలో కొత్త కొత్త అంశాలు - భాషాశాస్త్రానికి ఉపయోగించేవి - ఇప్పటికీ పండితుల కృషివల్ల బయటికి వస్తూనే ఉన్నాయి.

పాణిన్యాది సంస్కృత వైయాకరణులను అనుసరించి తెలుగు వైయాకరణులు తెలుగు భాషకు వ్యాకరణాలు వ్రాశారు; వీరిది కేవలం అనుకరణ మాత్రమే కాదు. తెలుగు నిర్మాణం సంస్కృత నిర్మాణంతో భేదించే చోట్ల మన వైయాకరణులు కొత్తపుంతలు తొక్కేరు.

గహనమైన వ్యాకరణ శాస్త్రంలో పరిశోధనచేసేవారి సంఖ్య చాలా తక్కువ. అందువల్ల శ్రీ శివరామకృష్ణశర్మగారి కృషి ప్రోత్సాహ యోగ్యం, అబినందనీయం. ఈగ్రంథం బాగుంది. ఇది తెలుగు వ్యాకరణాల ఔన్నత్యాన్ని లోకానికి చాటుతుందని నమ్ముతున్నాను.

పి. యస్. సుబ్రహ్మణ్యం

ఓమ్

Bhashapraveena
PROF. S. RAGHUNATHA SARMA. M. A. Ph. D.,
DEPT. OF TELUGU
S. K. UNIVERSITY
SRI VENKATESWARAPURAM (P. O)
ANANTAPUR A.P. 515003.

5-5-1990

దీపిక

సంప్రదాయ వ్యాకరణముల అధ్యయన అధ్యాపనములపై అనురక్తి క్రమముగా క్షీణించుచున్నది. దానికి ప్రధాన కారణము అలసతయు, మందబుద్ధితయు. అశక్త దుర్జనత్వము ముదిరిన కొందఱు సంప్రదాయ వ్యాకరణాధ్యయనము వలన ప్రయోజనము మృగ్యమనియు పలుకుచున్నారు. మధ్యమాధికారులట్టి భావములపై మొగ్గు చూపకుండుటకై యీ విషయమున కొంత సమాధానము చెప్పవలసియున్నది.

ఆనంద వర్ధనులు "ప్రథమే హి విద్వాంసో వైయాకరణాః" అని వక్కాణించియున్నారు. ఇందులోని రహస్య మేమనగా ఏశాస్త్రమునకైనను సమ్యక్శబ్దజ్ఞానము నిదానము. శబ్దజ్ఞానము, సుశబ్దాపశబ్ద వివేకము, సముచిత శబ్దప్రయోగ పాటవము అను మహాగుణములు వ్యాకరణ శాస్త్ర సమ్యగధ్యయనము వలననే సిద్ధించుననుమాట అటుంచి, మేధకు నైశిత్యమును గూర్చి యెంత గహనమైన విషయమునైనను సుబోధము చేయగల విచారసరణిని కలిగించు శక్తిని వ్యాకరణశాస్త్రమే సమకూర్చును. ఇది ప్రపంచమందలి విద్వద్వరేణ్యులందఱు కూలంకషముగా శోధించి నిర్ణయించిన విషయము,

ఇట్టి బరువైన శాస్త్రమునందు గురువైన బాధ్యతను వీరుకొని పెట్టుకొనెడు బుద్ధిమద్వరేణ్యులు ఒక్కరుగాని నా దృష్టికి వచ్చినచో నాకు గలిగెడు ఆనందమున కవధులుండవు. అట్టి ఆనందమును అవ్యాజముగా అందించిన డా. చిఱ్ఱావూరి శివరామకృష్ణ శర్మ గారిని మనసార అభినందించుచు వారి కృషిని గూర్చి యొండు రెండు విషయములను ప్రస్తావించెదను.

శ్రీ శర్మగారు డాక్టరేట్ పట్టమునకై శ్రమించి సమర్పించిన సిద్ధాంత వ్యాసము 'ఆంధ్రమునిత్రయ తత్త్వ దర్శనము'. గ్రంథ నామమే గ్రంథకర్తకు గల సంప్రదాయ నిష్ఠను, దార్శనిక దృక్పథమును తెల్లము చేయుచున్నది. ఆంధ్ర శబ్ద చింతామణి, వికృతి వివేకము, కవిశిరోభూషణము అను పరమ ప్రామాణిక గ్రంథముల గౌరవము నీరు గార్చుటకై కొందఱు పనిగట్టుకొని పరిశ్రమించిరి. ఎన్నియో అపసిద్ధాంతములను ప్రచారమునకు తెచ్చిరి. డా. శర్మగారు కేవలము సత్యశోధన తాత్పర్యముతో ఆ అపసిద్ధాంతముల నన్నింటిని తుక్కుదూగఱగా కొట్టివైచి ఆంధ్ర మునిత్రయము వారి తత్త్వమును దర్శించి తెలుగు జాతి కందించుచున్నారు. ఆనువంశికముగా సిద్ధించిన విద్వత్తకు స్వీయమగు మేధా వైభవమును జోడించి సంప్రదాయమునందు ప్రమాణబుద్ధితో శ్రీ శర్మగారు కావించిన ఈ పరిశోధనము నా చూపు ప్రసరించినంత మేరకు నిర్దుష్టముగా, నిర్దిష్టముగా సాగినది.

ఈ నిబంధనమును పఠించునప్పుడు

రేఖామాత్ర మపి క్షుణ్ణాదామనో ర్వర్త్మనః పరమ్
నవ్యతీయుః ప్రజాస్తస్యనియన్తు ర్నేమి వృత్తయః

అను కాళిదాస శ్లోకమునందలి ఉపమానభావము మదిలో మెదలినది.

గ్రంథస్థ విషయములను పరామర్శించుట కిది యదను గాదని నా తాత్పర్యము. ఆ పనిచేయ బూనినచో ఎచట మునుగుటయో,

ఏచట తేలుటయో దేలని పరిస్థితి. ఇట్టి గ్రంథములలో ఆ బాధ్యత పాఠకునకే వదలి వేయుట ఉత్తమ మని నా అభిప్రాయము.

నా కభిమాన పాత్ర మగు ఆంధ్ర వ్యాకరణముపై మఱి యొక ప్రామాణిక గ్రంథ మందుబాటులోనికి వచ్చినదని సంతోషించుచు గ్రంథకర్త పడిన శ్రమకు విలువ కట్టుట సులభము కాదని సంభావించుచు ఈ గ్రంథము ద్వారమున వారే మహాఫలము నభిలషింతురో దానిని వారికి జగదంతర్యామి సమకూర్చుగాక! అని ఆశంసించుచు సెలవు తీసికొందును.

ఇతి శమ్

విద్వద్విధేయుడు
శలాక రఘునాథశర్మ

ఆచార్య బేతవోలు రామబ్రహ్మం
Dean,
సాహిత్య పీఠం
తెలుగు విశ్వ విద్యాలయం
బొమ్మూరు
రాజమండ్రి ౫౩౩ 124

5-4-90

డా. చిఱ్ఱావూరి శివరామకృష్ణ శర్మగారికి,

వందనాలు

మీ సిద్ధాంత నిబంధన అందింది. అభిప్రాయం అడిగారు కదా అని వెంటనే చదివాను. బాగుంది.

ప్రతి అక్షరంలోనూ మీ పాండితీ ప్రకర్షతో పాటు సత్య ప్రకటన దీక్ష ఆవిష్కృత మవుతోంది. ఇంతకుముందు వ్యాకరణంపై పరిశోధనము చేసిన వారి అభిప్రాయాలను కాదనవలసి వచ్చినచోట మీ నిగ్రహం, సంయమనం ప్రస్ఫుటంగా భాసిస్తున్నాయి. నా అభిప్రాయాలను కాదన్నచోట ఇది నన్ను మరీ ముగ్ధుణ్ణి చేసింది. దీనికి అభినందనలు అనాలో, కృతజ్ఞతలు అనాలో తెలియడంలేదు. పరిశోధనలో ఏ ఒక్కరిదీ శాశ్వతమైన తుది నిర్ణయం కాదు. అనంతర పరిశోధనలతో పూర్వ పూర్వ పరిశోధన ఫలితాలు మారుతుంటాయి. దీనికి మీ సిద్ధాంత నిబంధన మరొక నిదర్శనం. చాలా కొత్త విషయాలు తెలిసాయి. నా జ్ఞాన పరిధిని విస్తృత పరిచారు. ధన్యవాదాలు. సెలవు.

మీ

బేతవోలు రామబ్రహ్మం

నమస్సుమాంజలి

ఈ పరిశోధన మహా యజ్ఞానికి సర్వోపద్రష్టృత్వమునువహించి, అభినందన సుమాలతో ఆశీర్వదించిన గురువరులు ఆచార్య బొడ్డుపల్లి పురుషోత్తం గారికి,

'ఇది తెలుగు వ్యాకరణాల ఔన్నత్యాన్ని లోకానికి చాటుతుంద'ని మంగళాశాసనం చేసిన విద్వద్వరులు ఆచార్య పి. యస్. సుబ్రహ్మణ్యంగారికి,

తమ 'దీపిక'తో ఈ గ్రంథమును ప్రకాశింప జేసిన ఆచార్య వర్యులు ఆచార్య శలాక రఘునాథశర్మ గారికి,

విశాల హృదయంతో ఈ సిద్ధాంత వ్యాసమును తమ లేఖతో అలంకరించిన బుధవరులు ఆచార్య బేతవోలు రామబ్రహ్మంగారికి,

హృదయ పూర్వక నమస్సుమాంజలి.

— రచయిత

ముందిలోమాట

సత్యమును దర్శించుట తేలిక పనికాదు. మనసు నద్దమువలె చేసికొనవలెను. దానిపై ఏ మాలిన్యమును చేరనీయరాదు. పిదప పూర్వాపరములను జూచుకొనుచు ననేక విషయములను తటస్థ భావముతో బరిశీలింపవలెను. అపుడు సత్యము స్ఫురించును. ఇది కత్తిపై సాము. ఇట్లు జీవితము నొక తపస్సుగా మలచుకొనిన వారే శాస్త్ర ద్రష్టలు కాగలరు.

ఇంత కష్టపడి శాస్త్ర గ్రంథములను రచించి తరువాతి తరముల వారికి ధారవోయు మహనీయుల ఋణమును వారసులెట్లు తీర్చుకొనగలుగుదురు? వారు తెల్పిన వానిలో మేలు విషయములను గ్రహించుటయే వారి ఋణమును దీర్చుకొనుట.

ఆంధ్ర వ్యాకరణమును సంస్కృత ప్రాకృతవ్యాకరణ సంప్రదాయములనెడి గంగా యమునలతో కలిపి త్రివేణిగా మలచిన చింతామణి కర్తకు అతని ననుసరించిన అథర్వణాహోబలపతులకు తెలుగుజాతి కృతజ్ఞతను జూపనక్కర లేదను భావమారంభమయి సుమారు శతాబ్దమైనది. అది తీవ్రమయి చివరికి ఆసంప్రదాయమును త్రోసివేయు పరిస్థితి యేర్పడినది.

చింతామణిని బాలసరస్వతి వ్రాసి నన్నయ్యభట్టు పేరు పెట్టెనను నూహతో నారంభమైన యీవాదము చింతామణిలో పెక్కులోపములున్నవనియు, అది యప్రౌఢ గ్రంథమనియు, తత్కర్త అజ్ఞుడనియు వివిధారోపణములతో నభివృద్ధి నంది చివరికి చింతామణి

పూర్వ వైయాకరణుల రచనలకు సంస్కృతీకరణమే యనువాదముతో నమ్మింటినది.

అట్లే కారికావళి సహోబలపతి వ్రాసి అథర్వణుని పేర ప్రకటించెనను వ్రాతతో నారంభమైన వాదము కారికావళి యథార్థగ్రంథము కాదనియు, లోపభూయిష్ఠమనియు, నదిపూర్వాంధ్ర వ్యాకరణములకు సంస్కృతీకరణమే యనియు విమర్శల పాలైనది. గ్రంథకర్తలు వంచకులై గ్రంథములందలి విషయములు సొంతము కానపుడు గ్రంథములకు విలువ యేమి మిగులును? ఈనాటి నరకు ఆంధ్ర విద్యార్థి లోకము పఠించుచున్న వ్యాకరణ సంప్రదాయమునకు మూలమైన యీ గ్రంథము లిట్లప్రతిష్ఠ పాలగుటతో నీ సంప్రదాయ త్రివేణికి మూల జలమెండినట్లే.

ఈయారోపణము లన్నియు సత్యములేయైనచో మాత్రలు చేదుగ నున్నను ఆరోగ్యము కొఱకు స్వీకరింపక తప్పదు గావున సత్యమునకు తలనంచవలసినదే. ఆరోపణములసత్యములయినచో నీ గ్రంథకర్తల కింతకంటె అపచారము మఱియొకటుండదు. పాలిచ్చిన పొదుగును కోయరాదు గదా!

కావున చింతామణి, వికృతి వివేకము, కవి శిరోభూషణముల విషయములను సమభావముతో జర్చించుటకు జేసిన ప్రయత్నమిది. ఈ వ్యాసకర్త ఇందెంత వరకు కృతకృత్యుడయ్యెనో నిర్ణయించు భారము గుణగ్రహణ పారీణులగు సుధీవతంసులది.

ఈ గ్రంథత్రయ తత్త్వగ్రహణమునకు, తదావిష్కారమునకు పలుగ్రంథములు తోడ్పడినవి. పలు గ్రంథకర్తల అభిప్రాయములను కాదన వలసి వచ్చినది. ఈ వైయాకరణుల అభిప్రాయములతో నేకీభవించినను, కాదన్నను వీరందరికీ యీ వ్యాసకర్త ఋణపడియున్నాడు. ఒకొక్క సత్యము నావిష్కరించుటకు వీరందరు విలు

మయిన తమ జీవితమున కొంత భాగము నాహుతిగాఁజేసి వాఙ్మయ యజ్ఞమును గావించిన వారేయని యీ వ్యాసకర్త విశ్వసించుచున్నాడు.

తదనుగుణముగా వారి అభిప్రాయములు తనకుపాదేయము లయినపుడు వారినామములను సబహుమానముగా వ్యాసమున నుటంకించుటకు, అవి యనుపాదేయము లయినపుడు వారి గ్రంథనామములను మాత్రమధస్సూచికలో సూచించుటకు నిర్ణయించుకొనినాడు.

ఈ పద్ధతిలో గ్రంథము ద్వారా గ్రంథకర్త పేరు తెలిసికొన వలసియుండుటచే పాఠక మహాశయులకు కొంత క్లేశము కలుగునని యీ వ్యాసకర్త యెఱుగును. కాని యీ గ్రంథములపై విమర్శలను గుప్పించినవారు ప్రధానముగా నలుగురయిదుగురు మాత్రమే యున్నారు. మొదటిసారిగా వారినామములను వ్రాసినచో తరువాత పాఠకమహాశయులు వారిని గుర్తించుట సుకరమేయను తలంపుతోడ, అనుపదము విద్వచ్ఛిరోమణులు పూజ్యులునయిన ఆవిమర్శక వతంసుల అభిప్రాయములను నామగ్రహణ పూర్వకముగా ఖండించుటకు వారి మాన్యత అడ్డము వచ్చుటచేతను, ఖండనావసరమున వారి నామములను దలంపలేదు. ఇందసౌకర్యమున్నను దీనికి కారణమును గుర్తించిన పాఠక మహాశయులు వ్యాసకర్తను మన్నింతురని నమ్ముచున్నాడు.

'పరిశోధన వ్యాసములలో చదివించేశక్తి చాలడంలేదు' అనెడి వాదము వ్యావహారిక రచనను చేయుమనినది. వ్యాకరణ పరిశోధనమును వ్యావహారికమున జేయుటయా ? అను విద్వాంసుల ప్రశ్న నిలవేసినది. చివరకు సరళ గ్రాంథికము శరణ్యమయినది. కాన వచనములో అర్ధానుస్వారములు తొలగినవి. సంధులు యడాగమ నుగాగమాదులు వికల్పములయినవి. విసంధులు చేరినవి. వీనిని దోషములుగా భావింపవలదని ప్రార్థన.

ఈ వ్యాసరచనమునకు ప్రేరణ, ప్రోత్సాహము, ప్రసాదించిన వారు ఆచార్య బొడ్డుపల్లి పురుషోత్తముగారు. ఆ మూల బలము లేనిచో నీవ్యాసము వెలువడెడిది కాదనుమాట యథార్థము.

విషయ స్వభావమును బట్టి యిది చింతామణ్యాదుల సమీక్షలపై సమీక్షగా బరిణమించినది. వివిధ విషయములలో నిష్ణాతులును, ఉద్దండ పండితులు నయిన వారియభిప్రాయములతో గూడ అటనట ఏకీభవించుటకు వీలులేక పోయినది. సత్యావిష్కారమునకు జేయు నీప్రయత్నమును వారు గూడ ఆశీర్వచింతురనియు, తత్త్వాలోకమున మండన ఖండనములనెడి వెలుగునీడలు ప్రధానముగావనియు, సత్యదర్శనమే ముఖ్యమనియు వారెరుగుదురు గావున మన్నింతురని వ్యాసకర్త విశ్వాసము.

మహోపాధ్యాయులు వివిధ విషయ నిష్ణాతులునగు బాలసరస్వత్యాదుల వ్యాఖ్యల యందు కొన్ని లోపములను నామగ్రహణపూర్వకముగనే దెలుపవలసివచ్చినది. వారికంటె పండితుడనను నపోహ యీ వ్యాసకర్త కెంత మాత్రమును లేదు. ఆవ్యాఖ్యాలోపములను జూపుట వారిపై బడిన బురదను కడుగుటకు మాత్రమే యని విద్యా తపస్వులగు వారెరుగుదురు గావున శిశు పద తాడనము వలె వారి కానంద ప్రదము కాగలదని నమ్మిక.

చింతామణి శ్లోక గ్రంథముగాని సూత్ర గ్రంథము కాదని యీ వ్యాసకర్త ప్రతిపాదించెను. కాని చింతామణిని వ్యాఖ్యానించిన వారు దానిని సూత్ర రూపముగా విభజించినారు. వారు చెప్పిన విషయములను సమీక్షించునపుడు వారు తెల్పిన సూత్ర విభజనము ననుసరింపక తప్పదు. కావున నిందు గూడ సూత్రములుగనే వ్యవహారించుట జరిగెను. విజ్ఞులు దీనిని స్వవచో వ్యాఘాతముగా భావింపవలదని వేడికోలు.

వివిధ విషయ విలసితమగు నీ గ్రంథమున విషయ సూచిక కూడ సుదీర్ఘమయినది. దానిని సంక్షిప్త పఱచుటకు వర్గీకరించుట జరిగినది. పరస్పర సంబంధ ముండుట, సంబంధము లేకుండుట, ఈషత్సంబంధ ముండుట అనునవి ఇట వర్గీకరణ ప్రయోజకము లయినవి.

ఈ తత్త్వ దర్శనముచే చింతామణ్యాదులపై గలిగిన అపవాదములు తొలగినచో నీ పరిశోధనము సఫలమయినట్లే.

— డాక్టర్ చిఱ్ఱావూరి శివరామకృష్ణశర్మ

అక్షరార్చన

ఈ గ్రంథం వెలుగుచూడటానికి ఆర్ధికసహాకారం చేసిన వదాన్యులకు, తెలుగు విశ్వవిద్యాలయం వారికి, అమూల్య మయిన అభిప్రాయము లిచ్చి ఆశీర్వదించిన పండిత ప్రకాండులకు కృతజ్ఞతాంజలి.

ఈ పరిశోధన మహా యజ్ఞానికి జ్ఞాతంగా అజ్ఞాతంగా ఎందరో మహానుభావుల సహకారముంది. వారిలో

నాకు వ్యాకరణ వేదాంత శాస్త్రగురువు, వ్యాకరణ వేదాంత విశారదులు, సంస్కృత విశ్వపరిషత్ సమ్మాన భాజనులు, బహు బిరుద సముపేతులు పితృపాదులు కీ. శే. చిఱ్ఱావూరి అనంతపద్మనాభ శాస్త్రిగార్కి, ఈ పరిశోధనకు ప్రేరణ, ప్రోత్సాహము ప్రసాదించిన పర్యవేక్షణ గురువులు ఆచార్య బి. పురుషోత్తం ఎమ్. ఎ, పిహెచ్.డి, విశ్రాన్తాంధ్ర ప్రాచ్య విభాగాధిపతి, నాగార్జున విశ్వ విద్యాలయం వారికి, నాకు వేదాంత శాస్త్రగురువులు వ్యాకరణాచార్య కీ. శే. జయంతి సూర్యనారాయణ శాస్త్రిగార్కి, నాకు వ్యాకరణశాస్త్రాన్ని బోధించి, ఈ పరిశోధనలో సందేహాలను నివృత్తి చేసిన గురుపాదులు వ్యాకరణ పూర్వోత్తర మీమాంసా పండితులు పరిమి విశ్వనాథ శాస్త్రిగార్కి, ఆంధ్ర వ్యాకరణాలలో నాకు ప్రవేశము కలిగించిన అగ్రజులు ఉభయభాషా షోడశావధాని బహుబిరుద యుతులు డా॥ చిఱ్ఱావూరి శ్రీరామశర్మ ఎమ్.ఏ.,(తె)ఎమ్.ఏ.,(సం) పి. హెచ్.డి. గార్కి, మా కుటుంబారోగ్యాన్ని కాపాడుతూ నా పరిశోధన నిరంతరంగా సాగడానికి తోడ్పడిన మిత్రులు డా. కోట మాధవ శాస్త్రి, ఎమ్. ఏ., గార్కి, ఈ పరిశోధనను ప్రోత్సహించిన మా కళాశాల ప్రాచార్యులు శ్రీ అల్లూరి వేంకట నరసింహారాజు, ఎమ్. ఏ. ఎమ్. ఎడ్, పి హెచ్. డి గార్కి, నాకాంధ్ర భాషా ప్రవేశము కలిగించి, పరిశోధన కవసరమయిన గ్రంథములను ఎరువిచ్చితోడ్పడిన

శ్రీమాన్ మఱింగంటి అప్పలాచార్యులు, ఎమ్. ఏ, గారికి, ఉభయ భాషా ప్రవీణ శ్రీ ఇంద్రగంటి సూర్యనారాయణ మూర్తిగార్కి, క్లిష్టమయిన కొన్ని సమస్యల పరిష్కారములో తోడ్పడిన మాన్యులు, మిత్రులు శ్రీమాన్ కె. తిరుమలాచార్యులు ఎమ్. ఏ., వారికి, బహుబిరుద శోభితులు, గోదా గ్రంథమాల నిర్వాహకులు, శ్రీమాన్ కె. టి. యల్. నరసింహాచార్యులుగార్కి, శ్రీ విశ్వనాథ గోపాలక్రిష్ణశాస్త్రి ఎమ్. ఏ., వార్కి, శ్రీమతి కె. ఉదయలక్ష్మి ఎమ్. ఏ., వార్కి, తమ గ్రంథాలనేకం నాపరంచేసి యీ పరిశోధనకు సహకారము నందించిన ఉభయ భాషా ప్రవీణ శ్రీ ఆకెళ్ళ వెంకట నారాయణ శాస్త్రిగార్కి, దైవజ్ఞులు శ్రీ కుప్పా నాగేశ్వర శాస్త్రి ఎమ్. ఏ., వారికి, మహోపాసకుల కీ. శే. అమిరపు లక్ష్మి నారాయణ ఐ. ఆర్. ఎస్. గార్కి, ఈ పరిశోధన కవసరమయిన పుస్తకాలను ఆదరాభిమానాలతో ఎరువిచ్చి సహకరించిన ఉభయ భాషా ప్రవీణులు శ్రీమాన్ కె. సంపత్కుమారాచార్యులు గార్కి, శ్రీ బి. వి. వి. రాఘవేంద్రరావు ఎమ్. ఏ., గార్కి, తమ 'అపర నన్నయ భట్టు' ఆచూకీ తెలిపిన ఆచార్య కొర్లపాటి శ్రీరామ మూర్తి ఎమ్. ఏ., పిహెచ్. డి, డి. లిట్, గార్కి, నమస్సుమనస్సులు.

పుస్తకాలను సేకరించు నపుడు, ముద్రారాక్షసాలను తొలగించునపుడు మిక్కిలి శ్రమించిన శిష్యమిత్రుడు శ్రీ కె. నాగేశ్వర శాస్త్రి ఎమ్. ఏ, ఎమ్. ఫిల్. కు, జ్యోతిష వ్యవసాయి శ్రీ చిట్టావూరి సుబ్రహ్మణ్యము ఎమ్. ఏ. (సం) ఎమ్. ఏ. (తె) నకు, ఆది నుండి అంతము వరకు చిత్తుప్రతికి సాపును వ్రాయుచు పూర్ణభారాన్ని సహించిన అర్ధాంగి శ్రీమతి కృష్ణవేణికి, చిరంజీవులు చి. కృష్ణానంత పద్మనాభం, చి. సౌ. సత్యవతికి శుభాశీస్సులు.

నిరవధికంగా తమ గ్రంథాలయాన్ని నా కందుబాటులో ఉంచిన బ్రహ్మశ్రీ కలువలపల్లి సత్యానంద శాస్త్రిగారికి, కావలసిన పుస్తకాల నెరువిచ్చి సహకరించిన చింతలపాటి బాపిరాజు ప్రభుత్వ ప్రాచ్యకళాశాల లైబ్రరీవారికి, ఏలూరు కె. పి. డి. టి. ఉన్నత పాఠశాల గ్రంథాలయము వారికి, హేలాపురి సంస్కృత పాఠశాల గ్రంథాలయమువారికి, పోడూరు రామచంద్ర గ్రంథాలయము వారికి, మిత్రులు తంగిరాల మల్లిఖార్జున శర్మగారికి, గుడ్లవల్లేరు ఎఱ్ఱాప్రగడ గ్రంథాలయము వారికి, వేటపాలెం సారస్వత నికేతనం వారికి, మద్రాసు ప్రాచ్య లిఖిత భాండాగారము వారికి, ఏలూరు జిల్లా గ్రంథాలయం వారికి, రాజమహేంద్రవరం గౌతమీ విద్యాపీఠ గ్రంథాలయం వారికి, కాకినాడ ఆంధ్ర సాహిత్య పరిషద్గ్రంథాలయం వారికి, ఈ గ్రంథము నందముగా ముద్రించిన మిత్రులు ముముక్షువు ప్రెస్ అధినేత శ్రీమాన్ ముత్తీవి సీతారాంగార్కి, మేనేజర్ శ్రీమాన్ నండూరి గోపాలాచార్యులవార్కి, ప్రెస్ సిబ్బందికీ, నా హార్దిక కృతజ్ఞతలు.

మహాకవి,
కళాప్రపూర్ణ!
మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి
లలితానగర్, రాజమహేంద్రి - 533 105.

సాధువాదము

ఆంధ్ర మహాభారత సంహిత నాంధ్రావళికిఁ బ్రసాదించిన నన్నయ భట్టారకులే యాంధ్ర శబ్ద చింతామణి ననుగ్రహించెనని అప్పకవి ప్రభృతులగు లాక్షణికులు విశ్వసించినారు. కాని కవుల చరిత్రల లోతుపాతులను ద్రవ్వి చూచిన పరిశోధకులు దాని నంగీకరింపలేదు. అది చినికి చినికి గాలివానయై ఆ గ్రంథ ప్రామాణికతకు గ్రంథత్వమునకు గూడఁ జేటు నాపాదించు విధముగాఁ బరిణమించినది. ఈ చింతామణి ననుసరించిన వికృతి వివేక, కవిశిరోభూషణములకుఁ గూడ నిదేగతి పట్టుట విచిత్ర విషయము. చింతామణికి వ్యాఖ్య వ్రాసిన బాలసరస్వతి మహోపాధ్యాయుఁడు, అప్పకవి, అహోబలపతి, శేషగ్రంథమును నిరూపించిన అథర్వణుఁడు, వీరి గ్రంథములు గూడ విమర్శములకు గురియైనవి.

సుమారొక శతాబ్ది కాలము వివాదాస్పదముగా నున్న యీ విషయములను సహేతుకముగా, సప్రమాణముగా, సమగ్రముగా, నవ్యరీతిలోఁ బరిశీలించి నిగ్గుదేల్చుట యభినందింపఁదగిన విషయము. డాక్టర్ చిఱ్ఱావూరి శివరామకృష్ణశర్మ ఈ అభినందనమునకుఁ బాత్రుఁడు. కళాప్రపూర్ణ వజ్ఝల చినసీతారామస్వామిశాస్త్రి, డాక్టర్ చిలుకూరి నారాయణరావు మున్నగు మహావిద్వాంసుల

వాదములనుఁ బూర్వపక్షములుగాఁ జేయవలసివచ్చినను, సత్కీర్తి గౌరవమునకు భంగముగలుగని రీతిలో విషయ నిర్ణయము సేయుట యిందు పాటింపబడిన సముచితరీతి.

ఈ చింతామణి నాంధ్ర భారతకర్త వ్రాయకున్నను గ్రంథకర్త మరియొక నన్నయభట్టగుటచే బాలసరస్వతికి గలిగిన నీలాపనింద తొలగిపోయినది. తదనుయాయులు నిందా విముక్తులయిరి. ఇది సంతోషావహము. చింతామణీ సంప్రదాయమును విమర్శించినవారు చింతామణ్యాదులలో లోపములుగాఁ బేర్కొన్న వానిని లోపాభాసములేయని సమ్యక్పరిశీలనమున నిరూపించుట, అభినవ నన్నయభట్ట బిరుదాంచితుడగు నహోబలపత్యాచార్యుఁడు, కళాప్రపూర్ణ వఝల చినసీతారామస్వామి శాస్త్రిగారు ప్రభృతులు వ్యాఖ్యానించిన తరువాత గూడ చింతామణిలోని రహస్యములను వ్యక్తీకరించుట ఈ గ్రంథకర్త చేసిన ప్రగాఢ పరిశ్రమకు, ఈతని ప్రతిభాసంపత్తికిఁ జిహ్నము.

ఈ సిద్ధాంత వ్యాసము చింతామణీ వికృతివివేక కవిశిరోభూషణములపైఁ గల యపోహలను దొలగించగలదని యాశించుచు డా. శివరామకృష్ణశర్మ నభినందించుచున్నాను.

పౌషబహుళ షష్ఠి
బుధవాసరము

మ. సత్యనారాయణశాస్త్రి.


W
A
T
C
H
YOUR
Words
Action
Thought
Character
Heart

సఈశ స్సాయీశ స్సకల జగతా మాశ్రయ కరః
సఏవా న్తర్యామీ సకల జన చేష్టేక్షణ విభుః
సదాతా త్రాతా నో సతత హిత సన్మార్గదపటుః
సదా మద్బుద్ధీః ప్రేరయతు భగవాన్ చిద్ఘనవపుః

నివేదనము

ఇది నాలుగు సంవత్సరముల తీవ్ర తపస్సునకు ఫలము. దీనిని రచించుటకు కావలసిన సంస్కారమును విజ్ఞానమును ప్రసాదించిన వారు జననీ జననీ జనకులు; గురువులు.

గ్రంథ గ్రంథులను విడి వడజేసి, సత్యమును స్ఫురింపజేసి, దాని కక్షరాకృతి నిచ్చుటకు వలసిన బుద్ధి చోదనను, ఉత్తేజము నను గ్రహించినవారు జగన్మాత గాయత్రి, Master C. V. V.

ఇది అచ్చయి వెలుగుచూచుటకు ప్రేరణ ప్రోత్సాహముల నిచ్చిన వారు తెలుగు విశ్వ విద్యాలయము వారు; వదాన్యులు.

ఇందరి సహకారముతో లభించిన యీ ఫలము నెవరికి సమర్పించవలెను? వీరందరికి నంతర్యామిగా నున్న స్వామికి దీనిని నివేదించుచున్నాను.

'త్వదీయ మేవ దేవేశ తుభ్య మేవ సమర్పయే'

మలి పూజ

నాగార్జున విశ్వవిద్యాలయం ఆంధ్ర మునిత్రయ తత్త్వ దర్శన రచనమునకు 'డాక్టరేట్' ఇచ్చిన సందర్భంగా నా విద్యా కృషి నాశీర్వదిస్తూ సమ్మానం చేసిన పుష్పగిరి పీఠాధిపతులు జగద్గురు అభినవోద్దండ నృసింహ భారతీ స్వామివారికీ, తమ అమూల్యాభిప్రాయాన్ని యిచ్చి ఆశీర్వదించినవారు ముముక్షుజన మహాపీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ లక్ష్మణ యతీంద్రులవారికీ నా నమోవాకాలు.

ఈ ముద్రణ యజ్ఞం నెరవేరడానికి మధ్యలో ఎన్నెన్నో అవాంతరాలు. కాగితంధర 'నన్ను పట్టుకో చూద్దాం' అంటూ సవాలు చేస్తూ, చూస్తుండగానే ఆకాశాని కెగిరిపోయింది. వానలు వరదలు ముద్రణాన్ని ముందడుగు వేయనీయ కుండా కలతను కలిగించాయి.

సరస్వతీ సమారాధకులు తమ సహాయ హస్తం అందించకపోతే యీ కృతి అసూర్యం పశ్యగా ఉండిపోయేది.

ఈ గ్రంథ ముద్రణానికి సహకార మందించినవారు నాడు తెలుగు విశ్వ విద్యాలయ కులపతులుగా ఉన్న మహా పరిశోధకులు ఆచార్య తూమాటి దోణప్ప.

ఇపుడా సహకారాన్ని కొనసాగించిన వారు తెలుగు విశ్వ విద్యాలయ కులపతులు, జ్ఞాన పీఠ పురస్కార గ్రహీత, మహాకవి ఆచార్య సి. నారాయణరెడ్డి; రిజిస్ట్రార్ శ్రీ యన్. శివరామమూర్తి.

20 రీముల కాగితం 'హోల్ సేల్' వెల కందించినవారు రాజమండ్రిలోని ఆంధ్రప్రదేశ్ పేపరుమిల్లు అధినేత శ్రీ A.L. మహేశ్వరి. ఈ విషయంలో సహకరించిన వారు శ్రీ M. K. మిటల్ .

[illegible]

ఈ సిద్ధాంత వ్యాసానికి తన సాధు వాదాన్ని పలికి ఆశీర్వదించిన వారు కళాప్రపూర్ణ మధునా పంతుల సత్యనారాయణ శాస్త్రి.

దీనిని పరీక్షించి 'The thesis is of a very high standard' అనియు, 'An exllent thesis అనియు, out from the Normal Ph. D thesis' అనియు, ఉదాత్తాభిప్రాయము నిచ్చిన వారు ఆచార్య P. S. సుబ్రహ్మణ్యం, ఆచార్య గంధం అప్పారావు, ఆచార్య శ్రీమతి పి. యశోదారెడ్డి.

జగద్గురువుల సన్నిధిలో పురప్రముఖుల సమక్షంలో ఘన సన్మానం చేసిన వారు శ్రీ సముద్రాల లక్ష్మీనృసింహ శాస్త్రి; శ్రీ మందడపు సుబ్బారావు కుటుంబము. వీరందరికి నా కృతజ్ఞతాంజలి.

కృతజ్ఞతలు

శ్రీమతి నందిగం హేమలత శ్రీ అచ్యుత రామారావు విశిష్ట దంపతులు. వాణిజ్య వేత్త అయిన శ్రీ అచ్యుత రామారావు మహా గంభీరుడు; మనస్వి; శ్రీ వేంకటేశ్వర చరణారవింద ధ్యాన తత్పరుడు.

వీరి తండ్రి శ్రీ నందిగం వీర రాఘవయ్య సంపన్న గృహస్థుడు; వ్యవహార దక్షుడు; తన సోదరుల కుమారుల నభివృద్ధిలోకి తెచ్చిన విశాల హృదయుడు, వీరి ధర్మపత్ని సీతారామమ్మ భర్త అడుగు జాడలలో నడిచేవారు. ఆడంబరం లేని జీవితం ఆమె ప్రత్యేక లక్షణం.

శ్రీ అచ్యుత రామారావు సోదరుడు శ్రీ సత్యనారాయణ. ఈయన శ్రీ సత్యసాయీ సేవాసమితి ఏలూరు శాఖకు సారథ్యం వహిస్తున్న మధురభక్తి పూర్ణుడు. వీరి సేవాసహకార భావములు నిరుపమానములు వీరి ధర్మపత్ని పేరు కూడా హేమలతయే. ఈమె సాయీ భజన పరిపూత.

శ్రీ అచ్యుత రామారావు ధర్మపత్నియైన శ్రీమతి హేమలతను బంధుమిత్రులు అభిమానంతో రాజా అని పిలుస్తారు. ఆమె మనస్సు వెన్న. ధర్మాలు నోటితో చెప్పడం కాదు; చేసి చూపాలనేది ఆమె ఆదర్శం. భగవాన్ సత్యసాయి బాబా వారు ఆమెకు ఇలవేల్పు. తాను చేసే విశిష్ట కార్యాలన్నీ వారు జరిపిస్తున్నారని ఆమె దృఢ నమ్మకం. తానే ఉత్తమకార్యం చేయవలసి వచ్చినా అంతకు ముందు స్వామిఆమెకు కలలో కన్పడడం భగవాన్ సత్యసాయికి ఆమె పట్ల గల వాత్సల్యాతిశయానికి నిదర్శనం. ఆ తల్లి ఎంతమంది అన్నార్తులకు వేళ కాని వేళలో కూడా వండి అన్నపూర్ణలా ఆదరించి అన్నం పెట్టారో ! ఎంతమంది విద్యార్థులకు సహాయ హస్త మందించి అభివృద్ధిలోనికి తెచ్చారో! ఆమె నిండు హృదయంతో ఎందరు నవదంపతుల నాశీర్వదించి ఎన్ని వివాహాలకు హార్దికంగా, ఆర్థికంగా తోడ్పడ్డారో ! పేదసాదలకు బట్టలను పంచిపెట్టడమంటే ఆమెకు పరమా

నందం. సవతి తల్లిని కన్న తల్లిగా, ఆమె సంతతిని తోడ బుట్టిన వాడుగా ఆదరించి అభిమానించడం ఆమెకే చెల్లింది.

వీటి అన్నిటి వెనుక శ్రీ అచ్యుత రామారావు నిండు హృదయం ఉంది. ఆమె చేసే ప్రతి ధార్మిక కార్యానికి ఆయన ఆమోదం ఉంటుంది.

శ్రీమతి హేమలతకు దాతృత్వం, ధర్మ ప్రీతి, భగవద్భక్తి, మానవ సేవా భావం వంశాను గతంగా వచ్చాయి. వీరితండ్రి శ్రీ మోటూరి సీతారామ స్వామి యాదగిరి లక్ష్మీ నృసింహ శతకాన్ని అంకితం పొందారు. ఆయన భారత భాగవత రామాయణాలను నిత్యం పారాయణం చేసేవారు. వితరణం ఆయన శీలం. ఆయన గ్రామాన్నంతా ఒక బాటలో నడిపిన రాజకీయ ధురంధరుడు శ్రీమతి సత్యవతి, శ్రీమతి అన్నపూర్ణ వీరి ధర్మపత్నులు.

శ్రీ సీతారామస్వామి మాతామహుడు శ్రీ కంభంపాటి వియ్యన్న. వీరు శ్రీ రామాలయాన్ని నిర్మించారు. ద్రౌపదీ చరిత్రాన్ని కృతి పొందారు. వీరు కూడా భారత రామాయణాలను హృద్గతం చేసుకున్నారు. వీరి ధర్మపత్ని శ్రీమతి పడిగమ్మ. వీరందరి సద్గుణాలను రంగరించుకొన్నది శ్రీమతి హేమలత వ్యక్తిత్వం.

ఆంధ్ర మునిత్రయ తత్త్వదర్శనం వెలుగు చూడడానికి వీరి సహకారం చాలా ఉంది.

శ్రీ ఘండికోట సుబ్బారావు ఐక్య రాజ్య సమితిలో అత్యున్నతమైన ఉద్యోగములో ఉన్నా భారతీయ సంస్కృతీ విజ్ఞానాలలో తానవగాహన మొనర్చి విదేశాలలోని భారతీయులకు గూడా పంచిపెట్టిన మనిషి. వీరి ధర్మపత్ని శ్రీమతి లక్ష్మీదేవి విదేశాలలో గూడా నిజమయిన భారతీయ స్త్రీకి ప్రతినిధిగా నిలిచిన ఉత్తమ మహిళ.

శ్రీ సుబ్బారావు వార్ధకంలో తండ్రిగారి సేవ కోసం ఉద్యోగాన్ని త్యజించి స్వదేశానికి వచ్చిన పితృ భక్తుడు.

ఈ దంపతులు భగవాన్ సత్య సాయిబాబా వారికి తమను తాము సమర్పించుకొన్న ధన్యజీవనులు.

శ్రీమతి సూరికుచ్చి సుబ్బలక్ష్మి. ఆబాల్య శ్రీకృష్ణ భక్తురాలు. తన సమీపానికి వచ్చినవారి మనస్సులను గూడా శ్రీకృష్ణభక్తి పూర్ణంగా చేయగల్గిన తీవ్ర భక్తి సాధన ఆమె సొత్తు. సంగీత సాహిత్యాలను రెండింటిని శ్రీకృష్ణునకు సమర్పించిన ధన్యజీవితమామెది.

డాక్టర్ కొమ్మారెడ్డి భాస్కరరావు ప్రసిద్ధ వైద్యులు. శ్రీ సత్యసాయి సేవా సమితి పశ్చిమ గోదావరిజిల్లా శాఖకు సంయోజకులుగా ఉంటూ సత్యసాయి భక్తి గంగను జిల్లా అంతటా ప్రవహింపచేస్తున్న ధన్య జీవనులు. వీరి ధర్మపత్ని శ్రీమతి వసుమతీదేవి శ్రీ సాయి భక్తిని గుండెలలో పండించుకొని భర్తకు చేదోడు వాదోడుగా ఉంటూ భగవాన్ సత్యసాయి ప్రభువు అనుగ్రహానికి పాత్రం అయిన వారు.

ఈ సిద్ధాంత వ్యాసం వెలుగులోనికి రానడానికి వీరు, మరి కొందరు వదాన్యులు సహకరించారు.

వీరందరికి నా ధన్యవాదాలు.



శ్రీ నందిగం అచ్యుతరామారావు

శ్రీమతి హేమలత

ఈ కృతిని అక్షరాకృతితో అలంకరించుటకు

సువర్ణ సహకృతి నొసగిన

సరస్వతీ సమారాధకులు

తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు	రు. 7500-00
శ్రీమతి నందిగం హేమలత, ఏలూరు	5000-00
శ్రీమతి కొమ్మారెడ్డి వసుమతి, ఏలూరు	1116-00
శ్రీ ఘండికోట సుబ్బారావు, Chief of Energy (RETD) U. N. O. ప్రశాంతి నిలయం	1116-00
శ్రీమతి సూరకుచ్చి సుబ్బలక్ష్మి, రాజమండ్రి	1000-00
శ్రీ సత్యసాయి సేవాసమితి, మహిళామండలి, ఏలూరు	1300-00
శ్రీమతి కొనకళ్ళ సీత, ఏలూరు	500-00
కీ. శే. డి. రామకృష్ణగారి ధర్మపత్ని శ్రీమతి డి. బేబీ సరోజిని, కొవ్వలి	200-00
శ్రీమతి కనిగొళ్ళ సుహాసిని, ఏలూరు	116-00
కీ. శే. కవితా కామేశ్వరశర్మ, అవనిగడ్డ	116-00
శ్రీ కనగాల నానారావు, మచిలీపట్నం	116-00
శ్రీ అరిపిరాల సీతారామయ్య, మచిలీపట్నం	116-00

వీరందరికి ధన్యవాదములు.

సంకేతవివరణము

సంకేతము	వివరణము
అప్పక.	అప్పకవీయము
అ. కా. విమర్శనము	అథర్వణ కారికావళీ విమర్శనము
ఆ.	ఆశ్వాసము
ఆం. క. చ.	ఆంధ్ర కవుల చరిత్ర
ఆం. క. త.	ఆంధ్ర కవి తరంగిణి
ఆం. కౌ.	ఆంధ్ర కౌముది
ఆం. గ. ఓ. మా. లైబ్రరీ	ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఓరియంటల్ మాన్యుస్క్రిప్టు లైబ్రరీ
ఆం. చిం. వి. పరిశోధనము	ఆంధ్ర శబ్దచింతామణి విషయ పరిశోధనము
ఆది.	ఆదిపర్వము
ఆం. భా.	శ్రీమదాంధ్ర మహాభారతము
ఆం. భా. చ.	ఆంధ్ర భాషా చరిత్ర
ఆం. భా. భూ.	ఆంధ్ర భాషా భూషణము
ఆం. భా. వి.	అంధ్ర భాషా వికాసము
ఆముక్త.	ఆముక్త మాల్యద
ఆం. ర. సం.	ఆంధ్ర రచయితల సంఘము
ఆం. ల. సిద్ధాన్త కౌముది	ఆంధ్రీకృత లఘు సిద్ధాన్త కౌముది
ఆం. వి. క. ప.	ఆంధ్ర విశ్వకళాపరిషత్తు
ఆం. వి. సర్వస్వము	ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము
ఆం. వ్యా. వివేకము	ఆంధ్ర వ్యాకరణ వివేకము
ఆం. వ్యా. సం. సర్వస్వము	ఆంధ్ర వ్యాకరణ సంహితాసర్వస్వము
ఆం. శ. చిం. టీక	ఆంధ్ర శబ్ద చింతానుణి టీక

సంకేతము	వివరణ
ఆం. శ. ర.	ఆంధ్ర శబ్ద రత్నాకరము
ఆం. సా. అకాడమీ	ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ
ఆం. సా. ప	ఆం. సా. పరిషత్తు
ఆం. సా. ప. పత్రిక	ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక
ఉ.	ఉల్లాసము
కవి. అంజ.	కవి జనాంజనము
కవికర్ణ.	కవికర్ణ రసాయనము
కవిశిరో.	కవిశిరో భూషణము
కవి. సం.	కవి సంజీవని
కవి సంశయ.	కవిసంశయ విచ్ఛేదము
కం. వీ. పంతులు	శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులు
కళాపూ.	కళాపూర్ణోదయము
కా.	కారిక
కాం.	కాండ
కావ్యా. చూ.	కావ్యాలంకార చూడామణి
క్రియా.	క్రియాపరిచ్ఛేద టీక
ప	పద్యము
ప. బాలస.	ఆంధ్ర సాహిత్య పరిషత్తు ప్రకటించిన ఆంధ్రశబ్ద చింతామణి టీక బాలసరస్వతీయము
పరి.	పరిభాష
పు.	పుట.
ప్రాయ.	ప్రాయశ్చిత్త కాండము
ప్రౌఢ.	ప్రౌఢ వ్యాకరణము
బాలస.	బాలసరస్వతీయము

సంకేతము	వివరణము
భారత.	మహాభారతము
రా. పాం.	రాఘవ పాండవీయము
రా. యా. పాం.	రాఘవ యాదవ పాండవీయము
ల. సా. సం.	లక్షణ సార సంగ్రహము
వ.	వచనము
వసు.	వసుచరిత్ర
విజ్ఞా.	విజ్ఞానేశ్వరీయము
వే. వేం. శా.	వేదము వేంకటరాయశాస్త్రి అండ్ బ్రదర్స్
వై. చం. స్వ. స్వ. మహా గవేషణ	వైకృత చంద్రికా స్వరూప స్వభావ మహాగవేషణ
వై. పా.	వైయాకరణ పారిజాతము
వ్యా.	వ్యాఖ్య
వ్యా. మహాభాష్యమ్	వ్యాకరణ మహాభాష్యము
శబ్ద.	శబ్ద పరిచ్ఛేదము
శృం. నైషధము	శృంగార నైషధము
శ్లో.	శ్లోకము
సం.	సంపుటము
స. ఆం. సాహిత్యం	సమగ్రాంధ్ర సాహిత్యం
సం. ప్ర. వ్యాకరణాలు	సంస్కృతంలోని ప్రసిద్ధాంధ్ర వ్యాకరణాలు
సం. సూ. వ్యాకరణమ్	సంస్కృత సూత్రాంధ్ర వ్యాకరణము
సూ.	సూత్రము
సూ. ని.	సూర్యరాయాంధ్ర నిఘంటువు

విషయానుక్రమణిక

పుట

1. ఆంధ్ర మునిత్రయము 1
పరిశోధనా వశ్యకము 5
2. ప్రథమ మునితత్త్వ దర్శనము 9
చింతామణి ప్రాథమిక వ్యాకరణమా ? 10
దీని నాంధ్ర భారతకర్త వ్రాసెనను యుక్తుల పరిశీలనము 16
చింతామణి నీతడు వ్రాయలేదనుటకు యుక్తులు 23
3. కథ కాదిది కల 26
కల లెట్లు వచ్చును ? 28
4. చింతామణికర్త బాలసరస్వతియా ? 32
గ్రంథకర్త వివరించిన గాని తెలియని సూత్రములట
అపిశబ్దార్థ స్యైతః 39
తిదజ్మధ్య శేషష్ఠీ 41
5. గ్రంథకారానభిప్రేత వ్యాఖ్య 48
వికృతౌ సర్వే శబ్దాః
చింతామణి ప్రసిద్ధ గ్రామ్యము నంగీకరించునా ? 52
ప్రాకృత భవాది సూత్రములు 54
ఉన్న కల అనుబంధము 65
అస్పష్టతావాదము - కర్తృత్వ నిర్ణయము 68
బాలసరస్వతి గమనించని యర్థములు 74
6. వ్యాఖ్యాత వ్రాయదగని రీతిలో సూత్రరచన 77
గ్రామ్యము - సౌమ్యము 80
అనుచిత సూత్ర విభాగము 80
7. సూత్రకారుడుద్దేశింపని యర్థములు
అస్మద్యుష్మ ద్వాచ్యాత్ 85

పుట

కర్మాదేః కర్తృత్వం 89
వ్యాఖ్యాతల ప్రమాదము 96
వాయిరవు ర్వ్యక్రతహా 98
8. బాల సరస్వతి శీలము 99
ఈ భ్రాంతిని బాలసరస్వతి కలిగించెనా ? 106
9. బాలసరస్వతికి ముందు చింతామణికి టీక కలదా ? 108
ఉన్నది 11
ఆ టీక యేది ? 112
ఆ టీకకు ప్రచారము కలదు 118
10 చింతామణి కర్తృత్వము - కాలము 120
చింతామణి 16వ శతాబ్దిలోనిదను వాద పరామర్శ 123
లక్షణసార సంగ్రహమున కనువాదమా ? 127
11. రెండు చింతామణులకు దత్కర్తలకు బోలికలు 130
వీనిలో నేది యాద్యము ? 133
సామ్య భేదములు 147
చింతామణీ లక్షణ సారములను వ్రాసిన వాడొకడే 149
తాతంభట్టు లక్షణ సారజ్ఞుడు 156
12. చింతామణి కాలము 158
కొఱకు సాక్ష్యము 164
చింతామణి అనంతునికి దరువాతిది 165
ఇంద్ర విజయాదు లితనివేనా ? 169
కాల నిర్ణయమిది 172
13. ఈముడి యెట్లు విడును? 174
భారత కర్త వైయాకరణుడు గాడా ? 177
14. చింతామణి యనువాద గ్రంథమా ? 180
15. చింతామణిలో లోపాభాసాలు 228
సర్వత్రాజ్వత్కార్యం జ్ఞేయం యస్య 233

పుట

అద్ధ న్త్యృస్త్రాలన్యశ్చర్వ్రక్రసాన్యత్ 234
వర్ణకము 237
ప్రాణము - ప్రాణి 238
ద్రుతాఖ్యోనః 239
వక్ర వక్రతమములు 240
ఏని విషయము 248
సుమోచ్చాతః 250
సూత్రము నసమర్థముగా నిరూపించురీతి 251
అసంగతి ధ్వని 254
ప్రథమ లుగపి ద్వినుల్వోః 256
ఊహాల ఊసులు 259
ఇతడు సంప్రదాయానభిజ్ఞాతయా ? 261
లోపల చింత 263
సంబోధన ప్రశ్నలు 266
దిక్కు లేదా ? 267
దీనిని సాధింపలేదా ? 267
కర్మ ప్రవచనీయకే కూర్చిః 268
దీని ప్రయోజనమిది 271
‘అమహతీనామ్’ విమర్శ 272
స్త్రీ సమములకు సులోపము 273
హలంత శబ్ద విభాగము 274
ఇది అసమర్థ సూత్రమా ? 279
అర్థ గ్రహణ క్లిష్టత యట 283
న్నుమ్న్యాహా)స్వశ్చాదే రమిశసిచ 287
ఇది అనావశ్యకమా ? 294
ఇదముదసీత ద్యత్తచ్ఛబ్దాః 295
డొంక తిరుగుడు వ్యాఖ్య 297

	పుట
షష్ఠీ భవేద్ద్వితీయా తుల్యా	299
ఉపమాన సమాసము	303
చింతామణి సాధించిన క్రియారూపములు	304
వైరుద్ధ్యమున్నదా ?	310
వ్యాఖ్యానతో విశేష ప్రతిపత్తిః	312
అలిగాగమవిధి అతివ్యాప్తమా ?	318
చింతామణిలో ఛందో భంగమా ?	319
16. చింతామణిపై విమర్శ తీరులు	325
విషయాలు మరుగున బడినవా ?	328
దీనికి ప్రయోజనమున్నది	333
చింతామణి ప్రభావము లేదా ?	334
దీని నెవరు మార్చిరి ?	339
చింతామణి ప్రసిద్ధి	342
17. చింతామణీ విశేషాలు	344
అప్పకవి శీలము	349
ప్రక్షిప్తములను జేర్చిన వారెవరు ?	354
అతడు చింతామణి నెట్లతిశయిల్ల జేసెను ?	358
లిపి సంస్కారము	365
18. నామము	369
ఏజథోవక్రః	370
ద్రుతము - ద్రుత ప్రకృతి	372
పరుషములు-సరళములు	377
తద్ధర్మ క్రియలు - సంధి నిషేధము	381
స్త్రీ లిఙ్గకము	385
అనుచిత విభాగము	390
ఇవి రెండు సూత్రములా ?	392
నాస్తములు	394

పుట
శాస్త్రమపౌరుష మాద్యం 396
పర్యాప్తో మన్మతేతు సఙ్కేతః 400
చింతామణి కర్త లాఘవ ప్రీతి 404
ఆంధ్రశబ్ద చింతామణి సూత్ర గ్రంథమా ? 410
ఇది సంస్కృత సమ సాధన ప్రవణము గాదా ? 425
19. తెలుగున కపభ్రంశ వ్యవహారము 430
అపశబ్ద దుష్ట శబ్దములు పర్యాయములా ? 432
తెలుగునాట నపభ్రంశ ప్రాకృత వ్యవహారము 439
తెలుగుపై నపభ్రంశ ప్రాకృత ప్రభావము 442
20. చింతామణిపై త్రివిక్రమ ప్రాకృత వ్యాకరణ ప్రభావము 456
21. బాలసరస్వతీయ పాఠాంతరము లెట్లేర్పడినవి ? 465
ఏది బాలసరస్వతీయము ? 467
చెందుర్తి ప్రతి ప్రాచీనమా ? 469
22. బాలసరస్వతి ప్రమాదాభాసములు 472
బాలసరస్వతి పొరపాటా ? 475
సున్నకు మకారము చేసికొనుట 477
23. ఆంధ్రకౌముది రూపాంతరము నొందిన చింతామణి 486
ఆంధ్రకౌముది చింతామణి నేల దలపలేదు ? 488
ఆంధ్ర కౌముది బాలసరస్వతీయమునకు దరువాతిది 491

సాయిరాం

ప్రత్యక్ష దైవమై పలుదేశవాసుల
వెన్నంటి కాపాడు విశ్వగృహుడు
చిరునవ్వు ప్రేమలఁ జిందించి యందించి
మనసుల దోచెడి మర్మవేది
మహిమలఁజూపించి మనసుల మరపించి
వేదతత్త్వము విప్పు విశ్వగురుడు
కోటీశ్వరుల నైన గుండెలఁగరగించి
ప్రజల సేవకు సిద్ధ పరచుయోగి

సాయి నాథుడు హృదయాన సతమునిలిచి
సత్యమార్గము నొసంగి సాకుగాక
జ్ఞాన దీపము వెలిగించి శాంతినిచ్చ
గమ్యమును జేర్చుఁ గావుతఁ గరుణతోడ.

"Forwarded free of cost, and with the Compliments of the department of Education, Government of India, New Delhi."

ఆంధ్ర మునిత్రయ తత్త్వదర్శనము

మునిత్రయం నమస్కృత్య తదుక్తీః పరిభావ్యచ
ఆంధ్ర వ్యాకరణత్రయ తత్త్వసిద్ధ్యై ప్రయత్యతే.

ప్రథమ విభాగము

ఆంధ్ర మునిత్రయము

పాణిని కాత్యాయన పతంజలులను మునిత్రయముగా వ్యవహరించుట సంస్కృత వైయాకరణ సంప్రదాయము(1) వారు మువ్వురు సంస్కృత వ్యాకరణ సౌధమును సుందరముగా సమున్నతముగా నిర్మించినవారు.

పాణిని మునిసూత్రములకు కాత్యాయనముని పూరణము సవరణము చేయుచు వార్తికములను వ్రాసెను, రెండింటిని సమన్వయించుచు పతంజలిముని మహాభాష్యమును రచించెను.

---

(1) శ్రీభట్టోజీ దీక్షితులు, సిద్ధాంతకౌముది, వారాణసీ : మోతీలాల్ బనారసీదాస్ (1961) 1 శ్లో.

ఆ సంస్కృత వ్యాకరణ సంప్రదాయములతోపాటు ప్రాకృత వ్యాకరణ పద్ధతులను గూడ పుణికి పుచ్చుకొన్న తెలుగు వ్యాకరణమాంధ్రశబ్ద చింతామణి.

ఈ గ్రంథముతోపాటు మఱికొన్ని ప్రాచీన వ్యాకరణ గ్రంథములలో జెప్పబడిన విషయముల నందుకొనుచు వానికి సవరణము వివరణము పూరణము సంగ్రహీకరణమును జేయుచు వెలువడినది వికృతి వివేకము (1)

చింతామణికి వ్యాఖ్య వ్రాయదలచిన అహోబలపతి పలు విశేషాంశములను దెల్పుచు పెక్కు కారికలను సూత్ర వ్యాఖ్యానమున జేర్చి వివరించెను. అతడు చింతామణీ కర్తను; ప్రథమాచార్యునిగను, వికృతి వివేక కర్తను ద్వితీయాచార్యునిగను వ్యవహరించెను. మఱియు జింతామణీ వికృతి వివేకములు దెల్పని విశేషములను నన్నయగారి భారత ప్రయోగముల ద్వారా తానే సాధించినాడు. కేవలము చింతామణీ వికృతి వివేకములనే గాక ఆంధ్ర భాషా భూషణము, కవి జన సంజీవని, అప్పకవీయము మున్నగు తెలుగు లక్షణ గ్రంథములను, మహాభాష్య కైయటాది సంస్కృత వ్యాకరణ గ్రంథములను; కాళిదాసు, మాఘుడు. భారవి మున్నగు సంస్కృత కవీంద్రుల ప్రయోగములను. నన్నయ, తిక్కన్న, భాస్కరుడు, శ్రీనాథుడు మొదలగు తెలుగు కవిచంద్రుల ప్రయోగములను గూడ నుదాహరించుచు నీతని వ్యాఖ్య ప్రకర్షతో సాగెను. చింతామణి సూత్రములలోగాని, వికృతి వివేక కారికలలో గాని, కవిప్రయోగములలోగాని సందిగ్ధస్థితి, వైరుధ్యము కన్పడినపుడు సుదీర్ఘముగా జర్చించి, ప్రమాణ ప్రదర్శన పురస్సరముగా సిద్ధాంతమును జేసిన వాడహోబలపత్యాచార్యుడు.

---

(1) ఇవన్నియు ననువాదములేనా అను వ్యాసమును చూ.

ఇతడు చింతామణి నాధారముగా జేసికొని కవికి కావలసిన అనేక శాస్త్రవిషయములను వివరించి తన గ్రంథమును "కవి శిరోభూషణము"గా దీర్చినాడు.

కళాప్రపూర్ణులు కవితా భూషణులు విద్వత్కవిశేఖరులు వెంపరాల సూర్యనారాయణశాస్త్రిగారు 'ఈ యాంధ్ర వ్యాకరణమునకు నన్నయాథర్వణాహోబలపతులు వరుసగా సూత్రవార్తిక భాష్యకారులనుకోదగును' అని వ్రాసిరి. (1)

చింతామణి కారికావళి కవిశిరోభూషణముల రచనా పద్ధతిని బరికించినపుడీ మాట సముచితమే యనిపించును.

పాణిని కాత్యాయన పతంజలులు మువ్వురు. నన్నయాథర్వణాహోబలపతులును మువ్వురే. పాణిని సూత్రములకు కాత్యాయన వార్తికములు పూరణాదికమును జేసినవి. చింతామణి సూత్రములకు గూడ కొన్ని కారికలు పూరణాదికమును జేసినవి.

సూత్రవార్తికములను రెండింటిని సమన్వయించుచు పతంజలి విశేషాంశములను దెలిపెను. అహోబలపతి చింతామణి కారికావళులను సమన్వయించి వ్యాఖ్యానించుచు విశేషాంశములను దెలిపెను.

మహాభాష్యము వివిధ చర్చలతో అనేక విషయ గంభీరమై విలసిల్లును. కవిశిరోభూషణమున గూడ నాపోకడలున్నవి. ఆచార్య అమరేశం రాజేశ్వరశర్మగారు కవిశిరోభూషణ మాంధ్ర వ్యాకరణ మహాభాష్యమను ప్రసిద్ధిని బొంది యాతనికి ద్వితీయాచార్య స్థానమును గల్పించినది' అని తెల్పినారు.(2) కవిశిరోభూషణ చంద్రికను వెలయించిన వైయాకరణ వతంసులు శ్రీపాద లక్ష్మీనారాయణశాస్త్రి గారు కవిశిరోభూషణమును తెనుగు వ్యాకరణ ప్రస్థానమున భాష్య

---

(1) కవిశిరోభూషణము, హైద్రాబాదు : ఆం॥ ర॥ సం॥ (1965) పీఠిక 3 పు.

(2) ఆం. వ్యా. వికాసము, ప్రథమ, కామారెడ్డి ప్రాచ్య విద్యా పరిషద్ (1973) 430 పు.

స్థానీయముగా సంభావించుచు నందుగల మహాభాష్యచ్ఛాయలను సోదాహరణముగా వివరించినారు. (1)

ఏవంవిధ పండితాభిప్రాయముల ననుసరించి చింతామణి వికృతి వివేక కవిశిరోభూషణ కర్తలను ఆంధ్ర మునిత్రయముగా సంభావించి వారి తత్త్వమును, గ్రంథముల తత్త్వమును దర్శించు ప్రయత్నమే ఈ సిద్ధాంత వ్యాసము.

అహోబలాపత్యాచార్యుని గుఱించి మనకు గొన్ని విశేషములు లభించుచున్నను చింతామణి కర్తను, వికృతి వివేక కర్తను గుఱించి మనకు తెలిసిన విషయ మతి స్వల్పము. వారి జీవిత విశేషముల నెఱుగుట కాధారములు గూడ లభించుట లేదు. కాని వారిపై కొన్ని అపవాదములున్నవి. వారి గ్రంథముల గూర్చి కొన్ని అపోహ లున్నవి. వారు వ్రాసిన గ్రంథముల తత్త్వమును దర్శించి, వానికి బూర్వాపరములందున్న వ్యాకరణ వాఙ్మయమును బరిశీలించి సత్యమును వెల్లడించుట నా ప్రస్తుత కర్తవ్యము. గ్రంథ తత్కర్తల కభేదవ్యవహారముచేయు సంప్రదాయము ననుసరించి యీ వ్యాసము నాంధ్రమునిత్రయతత్త్వ దర్శనముగా వ్యవహరించుచున్నాను. (2) మహోపాధ్యాయుడు మహాకవియునైన బాలసరస్వతి చింతామణికి వ్రాసిన వ్యాఖ్య కవిశిరోభూషణకర్త కాధారము; కావున భాష్యగౌరవము నందవలసినది బాలసరస్వతీయము. దానిని బాలసరస్వతి భాష్యమని వ్యవహరించెనుగూడ. (3)

కాని యది చింతామణీ సూత్రముల కర్థమును మాత్రము వివరించుచున్నది. అందనన్వితాంశములకు చర్చాపురస్సర సిద్ధాంత

---

(1) కవిశిరోభూషణ చంద్రిక ప్రాజ్ఞనివేదనము పొడగట్లపల్లి, శ్రీపాద లక్ష్మీనారాయణశాస్త్రి, (1983) 6 పు.

(2) భారవి, కిరాతార్జునీయమును భారవియనియు, మాఘుని శిశుపాలవధమును మాఘమనియుననుట ఇట్టి సంప్రదాయమే.

(3) పు॥ బాలస. పీఠిక కాకినాడ : ఆంధ్రసాహిత్య పరిషత్తు, (1932) 6 పుట.

ములు, మహాకవుల ఉదాహరణములు మొదలగున వతిస్వల్పములు. దానికి భాష్యవ్యవహారము తగదని వైయాకరణ శ్రేష్ఠులు చర్ల నారాయణ శాస్త్రిగారు తెల్పియున్నారు. (1)

కేవల బాలసరస్వతీయమునకు భాష్యవ్యవహారము తగకున్నను కవిశిరోభూషణమును భాష్యముగా మన్నించుటచే బాలసరస్వతీయమును గూడ మన్నించినట్లే యగును. చింతామణ్యర్థ నిర్ణయమున నహోబల పత్యాచార్యుడు తొంబదిశాతము బాలసరస్వతి మహోపాధ్యాయుననుసరించుటయే యిట్లు చెప్పుటకు హేతువు.

కావున నీయాంధ్రమునిత్రయములో బాలసరస్వత్యహోబల పతులకిరువురకు గలిపి భాష్యకార స్థానమేర్పాటుకావించితిని. బాలసరస్వతీయమంతకాదుగాని అప్పకవీయము గూడ కవి శిరోభూషణమునకు నామకరణమునుండి యనేక విషయములలో తోడ్పడినది. కావున చింతామణి వికృతి వివేక కవిశిరోభూషణముల తత్త్వమును జూచుట కుపయోగించునంత మాత్ర మా గ్రంథములనుగూడ బరిశీలించుట తప్పనిసరి.

ఈ గ్రంథములపై పలులక్షణ గ్రంథముల ప్రభావమున్నది. వీని ప్రభావము పలు వ్యాకరణములపై నున్నది. దీనిపై బలు వ్యాఖ్యలున్నవి, పరిశోధనములున్నవి, విమర్శలున్నవి.

పై గ్రంథముల తత్త్వావిష్కారమునకు వలసినంత మాత్ర మితర గ్రంథములనుగూడ స్పృశించితిని.

పరిశోధనావశ్యకము

సంస్కృతభాషలో వ్రాయబడిన ఆంధ్ర శబ్దచింతామణి, వికృతి వివేక కవి శిరోభూషణములను బలువురు పరిశోధకులు పరిశీలించి

---

(1) అందే పీఠిక 2 పుట.

యున్నారు. ఈ గ్రంథములపై బలువ్యాఖ్యలు బయలుదేరినవి. అయినను ఇందుకొన్ని విషయములను బరిశీలించుట అవసరమని యెంచును.

ఆంధ్ర శబ్ద చింతామణి వికృతి వివేకముల కర్తృత్వ కాలములు వివాదాస్పదములు: ఆంధ్రమహాభారతమును వ్రాసిన నన్నయ భట్టారకుడే చింతామణిని వ్రాసెనని భావించిన వారప్పకవ్యాదులు. తత్ఫలితముగా కేతనాది ప్రాచీన వైయాకరణులను వారాధునికులుగా భావించినారు; చింతామణికి విరుద్ధముగా గన్పించిన కేతనాదుల లక్షణములు తిక్కన శ్రీనాథాది మహాకవి ప్రయోగములు గూడ నిర్మూలములని నిరసించినారు, (1)

ఆంధ్ర భారత కర్తనే చింతామణి కర్తగా నమ్మిన కొందరు చింతామణి సూత్రములకు భారత ప్రయోగములనే ఉదాహరణములుగా జూపుచు గ్రంథములను రచించినారు. (2) చింతామణిలో సాధింపబడని భారత ప్రయోగములు, చింతామణికి విరుద్ధములుగా నున్న భారత ప్రయోగములు వారికి సమస్యలయినవి. ఇట్లు కొందరు భారత కర్తయే చింతామణిని వ్రాసెననుటచేనది 11న శతాబ్దికి వెళ్ళుచున్నది.

---

(1) కవిశిరో. అజంత. 24,81 సూ. వ్యాఖ్య, పీఠిక 74 శ్లో.
అందే హలంత. 37 సూ.
కాకునూరి అప్పకవి, అప్పక, చెన్నపురి: వావిళ్ళ, (1934), 5-64 ప.

(2) పారనంది రామశాస్త్రిగారు, ఆంధ్రశబ్ద చింతామణి, ఉద్యోతి సటీక, మద్రాసు: ఆంధ్రపత్రికా ప్రెస్, 1923.
కళాప్రపూర్ణ వఝుల చినసీతారామస్వామి శాస్త్రిగారు, ఆం. చిం. వి. పరిశోధనము,
కాకినాడ: కాకినాడ ముద్రాక్షరశాల, (1937).

ఆంధ్ర భారత కర్త చింతామణిని వ్రాసెనని వాదించువారు దానిని ప్రమాణ మూర్ధన్యముగను, 'అఖిల గూఢభావము'గను, సుధీ జన శిరోమణిగను భావించుచుండగా(1)దత్కర్త బాలసరస్వతియే యని నిరూపింపదలచినవారు 'ఇది గొప్పవ్యాకరణం కాదనీ, దీనిలో ఎన్నో లోపాలున్నాయనీ, ఇందు శిథిలమైన సూత్ర నిర్మాణం కలదనియు, నిందలి లక్షణములు పూర్వ వ్యాకరణాలను సంస్కృతీకరించుటచే నేర్పడినవే యనియు నాక్షేపించుచున్నారు.(2)ఇట్లు చింతామణి కాలము గౌరవము కూడ గర్తతో ముడిపడినట్లనిపించుచున్నది. ప్రాచీనులు వికృతి వివేకము నథర్వణుడు వ్రాసినట్లు భావించిరి. అతడు 13వ శతాబ్దివాడని ప్రాచీన సంప్రదాయానుయాయుల భావము. ఆంధ్ర వ్యాకరణ ప్రస్థానమున వార్తిక కారస్థానమిచ్చి వీరథర్వణుని గౌరవించిరి. (3)

కొందరు విమర్శకు లహోబలపతియే వికృతి వివేకమును వ్రాసి యథర్వణుని పేరు పెట్టినట్లూహించిరి. వీరియభిప్రాయప్రకారము వికృతి వివేకమొక గ్రంథము కాదు. పూర్వవైయాకరణుల లక్షణముల కనువాదమాత్రము. (4) వీరి వాదము. నిజమయినచో వికృతి వివేకము 1700 ప్రాంతమున బయలుదేరెననవలెను.

ఇట్లు వికృతి వివేక కర్తృత్వముతో దాని కాలము, విలువ ముడిపడినవి.

---

(1) కవిశిరో కృత్యాది 62 శ్లో.

(2) డా॥ అకురాతి పున్నారావుగారు, సం. ప్ర. వ్యాకరణాలు, గుంటూరు: పద్మా ప్రచురణలు (1982) 191, 193, 280 పుటలు.

(3) వెంపరాల సూర్యనారాయణశాస్త్రిగారు, కవిశిరో. పీఠిక, 3వపుట

(4) సం. ప్ర. వ్యాకరణములు, 437 పుట.

చింతామణి సంప్రదాయము పట్ల గౌరవము కలవారహోబలపతి రచించిన కవిశిరో భూషణమునకు చింతామణి ప్రస్థానమున మహాభాష్యము వంటి స్థానము నిచ్చిరి. (1)

కాని కొందరు విమర్శకులు 'అనవసరంగా సంస్కృత వ్యాకరణ మర్యాదలు తెలుగులో చొప్పించినాడని, అసందర్భంగా ప్రాకృత, వ్యాకరణ పాండిత్య ప్రదర్శన చేశాడని' అహోబలపతిని విమర్శించుచు 'ఇతని రచనలో స్వవచన వ్యాఘాతాలున్నాయని' ఆక్షేపించుచున్నారు. (2) బాలసరస్వత్యహోబలపతులు తమ గ్రంథములకు వ్యాప్తిని సంపాదించుటకు ప్రసిద్ధులగు నన్నయాథర్వణులకు కర్తృత్వముల నంటగట్టిరని యీ విమర్శకుల ఆరోపణములు.

నేడు బాలప్రౌఢ వ్యాకరణములు తెలుగు భాషకు ప్రామాణిక వ్యాకరణములుగా బఠన పాఠములందున్నవి. వీనిలోగల పెక్కు విషయములు పై గ్రంథత్రయమునుండి గ్రహింపబడినవని అభిజ్ఞులు తెల్పుచున్నారు. (3)

నేటి తెలుగు వ్యాకరణ సంప్రదాయమున కాధారములయిన పై గ్రంథముల స్వరూప స్వభావములను, తత్కర్తలను గూర్చి కొన్ని సత్యముల నెరుంగవలసిన అవసరము నేటి తెలుగు వ్యాకరణ విద్యార్థికి గలదు కదా !

కావున సత్యాన్వేషణ దృష్టితో నీ గ్రంథముల దత్త్వమును నిగదించుటకీ ప్రయత్నమవసరమైనది.

---

(1) శ్రీపాద లక్ష్మీనారాయణ శాస్త్రిగారు, కవిశిరోభూషణ చంద్రిక ప్రాజ్ఞవేదనము, 6 పుట.

(2) సం, ప్ర. వ్యాకరణాలు, 438 పుట.

(3) కళాప్రపూర్ణ వజ్ఝల చిన సీతారామస్వామి శాస్త్రిగారు, అథర్వణ కారికావళి విమర్శనము వావిళ్ళ ప్రతి, 1955 11 పు.

ద్వితీయ విభాగము

ప్రథమ మునితత్త్వ దర్శనము

ఆంధ్ర మునిత్రయమున మొదటి వాడాంధ్రశబ్ద చింతామణీకర్త ఆ గ్రంథమున తత్కర్త నన్నయభట్టు అని కలదు. ఆయన గురించి స్వల్పముగానైన దెలియుటకు మనకాగ్రంథమే ఆధారము. ఆయనను మనము మునిగా సంభావించుటకూడ ఆ గ్రంథమును రచించుటచేతనే. కావున ఆంధ్ర శబ్ద చింతామణి తత్త్వమును గ్రహించినచో బ్రథమ మునితత్త్వ దర్శనమయినట్లే.

ఆంధ్ర శబ్ద చింతామణీ తత్త్వమును సరిగా గ్రహింపవలెనన్న దాని కర్తను కాలమును గూడ గ్రహింప వలసియున్నది.

ఆంధ్ర శబ్ద చింతామణిని భారతకర్తయగు నన్నయ భట్టు రచించెనని ఆధునిక పరిశోధకులొకరు సిద్ధాంతము చేయుటకు బూనుకొనిరి. (1)

---

(1) కళాప్రపూర్ణ వఝుల చినసీతారామస్వామిశాస్త్రి, ఆం. చి. వి, పరిశోధనము, కాకినాడ: కాకినాడ ముద్రాక్షరశాల (1937).

(2)

చింతామణి ప్రాథమిక వ్యాకరణమా ?

ఆంధ్రశబ్ద చింతామణిలో కొన్ని విషయము లాగ్రంథము ప్రాథమిక వ్యాకరణమనియు, ప్రాచీనమనియు నిరూపించునని కూడ వారు భావించిరి. ఆ యభిప్రాయములు పరిశీలింపదగినవి. (1)

చింతామణిలో "సిద్ధిర్లోకాద్దృశ్యా" శబ్దసాధుత్వము లోకము వలన తెలియదగినది) అని కలదు. (2)

వాఙ్మయము వెలసినచో సాధుశబ్ద సిద్ధిదానివలననే కలుగును. వాఙ్మయము బయలుదేరని కాలమున వ్యాకరణ నియమములను గ్రహించుటకు బండిత వ్యవహారము దప్ప వేరొక యాధారముండదు. కావున శబ్ద సిద్ధిలోకము వలననే తెలియవలయునని చింతామణి తెలిపినదని వారి యభిప్రాయము. (3)

చింతామణిలో

"స్వస్థాన వేషభాషాభిమతాస్సన్తో రసప్రలుబ్ధ ధియః
లోకే బహుమన్యన్తే పైకృతకావ్యాని చాన్య దపహాయ.(4)

(స్వస్థాన వేషభాషాభిమానముగల సత్పురుషులు రసలుబ్ధ మనస్కులై యితర కావ్యములను విడిచి తెనుగు కృతులను గౌరవించుచున్నారు) అని కలదు.

చింతామణికి ముందు తెనుగు కావ్యములు లేనిచో వానిని సత్పురుషు లెట్లాదరించిరి ? ఆ విషయమును చింతామణి యెట్లు చెప్పినది ?

---

(1) అందే.

(2) కవిశిరో. సంజ్ఞ 6 సూ.

(3) ఆం॥ చిం॥ వి॥ పరిశోధనము. 15, 16 పుటలు.

(4) కవిశిరో. సంజ్ఞ 5 సూ.

"ఉభయ భాషాకావ్యరచనా శోభితుడైన నన్నపార్యుని యాంధ్రభారతమును రచింపుమని రాజనరేంద్రుడు కోరెను. (1) ఆ ఉభయభాషలు సంస్కృతాంధ్రములు గావలెను. తెనుగు కావ్యములు రచించినకవినే రాజనరేంద్రుడట్టి యుద్గ్రంథ నిర్మాణమునకు బురికొల్పి యుండుట యుక్తము. ఆనరేంద్రుడట్లు కోరిన పద్యమున భారతము రచన చేయుటకుదగు నర్హతలు పెక్కు పేర్కొనబడినవి. అందుభయ భాషా కావ్యరచనాభిశోభితత్వ మొకటి. కావున నందు దెనుగు కావ్యములున్నవనుటలో నౌచిత్యమున్నది. ఇట్లు చెప్పుటచే నాంధ్రభారతరచనకు బూర్వమే నన్నయగారి కృతులే కలవని చెప్పవలసియున్నది. కావున చింతామణి రచనకు బూర్వము కావ్యవాఙ్మయము లేదనుట కుదురదు. మఱియు 7, 8 శతాబ్దులలో తెలుగున సాహిత్యదశ ఆరంభమయిన దనియు, కొన్ని ఛందస్సులు గూడ నన్నయకాలమున, నంతకు ముందునున్న శాసనములందు గన్పడుచున్నవనియు పరిశోధకులు తెల్పియున్నారు. (2) కావున నన్నయ యేర్పరచుకొనిన నియమములన్నియు నాయన క్రొత్తగా గనిపెట్టినవని చెప్పుటయు గుదురదు. (3)

ఇంతకును "సిద్ధిర్లోకాద్దృశ్యా" వంటి సూత్రము త్రివిక్రమముని ప్రాకృత వ్యాకరణమునందుగూడ కలదు: 'సిద్ధిర్లోకాచ్చ' అని యచ్చటి సూత్రము. (4) ఈ గ్రంథమునకు ముందు ప్రాకృతమున కావ్యములు వ్యాకరణములు గూడ పెక్కు కలవని పలువురకు తెలిసిన విషయమే.

---

(1) నన్నయభట్టు, ఆం. భా. వేమూరు వెంకట కృష్ణమసెట్టి అండ్ సన్స్, (1915), ఆది 1-9 ప.

(2) డా. బూదరాజు రాధాకృష్ణ, ప్రాచీనాంధ్రం: శాసనభాషా పరిణామం, తె. భా. చ. శ్రీభద్రిరాజు కృష్ణమూర్తి, సంకలనం హైదరాబాదు: ఆం. సా. ఆకాడమి, (1974) 100, 101 పుట.

(3) అందే 99 పుట.

(4) ప్రాకృత శబ్దానుశాసనము, శోలాపురీయ జైన సంస్కృతి సంరక్షక సంఘము (1954) 1-1 సూ.

తెలుగుభాష బాగుగా వికసించిన తరువాత బయలుదేరిన వాసుదేవుడు గూడ 'సిద్ధిర్వ్యవహారాచ్చ' సిద్ధి రిహ త్రిలింగ వ్యాకరణ సంబంధినీ, సా లోక వ్యవహారాద్భవతియతః ఋ ౡ ప్రభృతిభిర్వర్ణైః ద్వివచనేనచ విరహితః శబ్దోచ్చారః లౌకిక వ్యవహార దేవభవతి. (తెలుగు వ్యాకరణ సిద్ధి లోకవ్యవహారమువలన గలుగును. ఋ ౡ మొ॥ వర్ణములు ద్వివచనములేని శబ్దోచ్చారణము, లౌకిక వ్యవహారమువలననే తెలియుచున్నది) అని చెప్పెను. (1) కావున నిది చింతామణి ప్రాథమికత్వమును నిరూపించజాలదు.

చింతామణి సంకేతిత సుప్రసిద్ధ పదములనే వాడవలయునని నియమించెను. (2) సంస్కృత వైయాకరణులలో గొందరు వ్యాకరణముచే సాధింపబడిన పదములన్నిటి నంగీకరించుచుండిరి. చింతామణి సంకేతిత సుప్రసిద్ధ సంస్కృత పదములనే తెలుగులోనికి దెచ్చుకొనవలెనని నియమించుటచేతనది ప్రథమాంధ్రవ్యాకరణమని వెల్లడియగుచున్నదని పరిశోధకుల తలంపు. (3) కాని యిది సార్వకాలిక నియమము. నన్నయ మొదలు కొని నేటివరకు సంస్కృతాదీతర భాషల నుండి పదములనెరవు దెచ్చుకొను కవులకీ నియమ మవసరమేయగును. నిఘంటువులలోని మారుమూల పదములనువాడి రచన సాగించినచో పాఠకుల కర్థముగాకుండుటయు, దానివలన గ్రంథమునకు దగిన ప్రచారము రాకుండుటయు నెప్పుడును జరుగుచుండును.

ఆంధ్రవాఙ్మయమున భారతాదీతిహాసపురాణానువాదకాలమున సంస్కృత పదములను దెనుగులోనికి దెచ్చుకొను నావశ్యకము

---

(1) శ్రీ మంచెళ్ళ వాసుదేవకవి, వైకృత చంద్రిక, హైదరాబాదు: ఆం. గ. ఓ. మా. లైబ్రరీ, 1975 సంజ్ఞ 1 సూ.

(2) కవిశిరో. సంజ్ఞ 43 సూ.

(3) ఆం. చిం. వి. పరిశోధనము, 21, 22 పుటలు.

పెరిగినది. భారతాద్యనువాదము భావానువాదముగాన నాకవులకు స్వాతంత్ర్య మెక్కువ కలదు. నైషధాది కావ్యానువాదమున శయ్యాసౌభాగ్యము చెడకుండ మూల భావమును రప్పించుట అనువాదకునకు బరీక్షయగును. అప్పుడు కవి మూల పదములను యథాతథముగా వాడుకొనుచుండును. ఆస్థితిలోగూడ చింతామణి కర్తయిట్టి హెచ్చరికను జేసియుండవచ్చును. కావుననిది చింతామణి ప్రాథమిక వ్యాకరణమని నిరూపింపలేదు.

చింతామణిలో యెవడు ఇత్యాదులలో యకారమా, ఎకారమా? వదలు ఇత్యాదులలో అత్వమా, ఎత్వమా? అను సందేహములను దీర్చు సూత్రములున్నవి. వాఙ్మయ మేర్పడిన పిదప ఇట్టి విషయములను నిర్ణయించుటకు వాఙ్మయము సాయపడును. చింతామణి రచన కాలమునాటికి వాఙ్మయ మేర్పడనందున నదియే యిట్టి సందిగ్ధాంశమును నిర్ణయించినదని ఒక పరిశోధకుని మతము. (1) ఇట్టి యుచ్చారణ సందేహములను దీర్చు పద్ధతి చిన్నయసూరి వరకు సాగినది. (2) వాఙ్మయమున్నచో వీని యవసరము లేనినాడు చింతామణికి తరువాత నైయాకరణులీ విషయమునేల విస్తరించిరి? పూర్వపు దెలుగు నధ్యయనము చేయువారున్నంతసరకు నీ నియమము లవసరములే యగును. కొందరు శాసనములలో యవ్వరు వంటి రూపములను ప్రయోగించిరి. (3) అట్టి వ్రాత దోషములను సవరించుటకు గూడ నీ సూత్రములు బయలుదేరి యుండవచ్చును. ఈ సందర్భమున బదాది యకారము నంగీకరించుట కూడ చింతామణి ప్రాచీనత్వమును వెల్లడించునని వారభిప్రాయపడిరి.(4) అప్పకవ్యాదులు పదాదియకా

---

(1) ఆం. చిం. వి. పరిశోధనము, 47వ పుట.

(2) బాలవ్యా. సంజ్ఞ 17 సూ.

(3) శ్రీ ఎ. కందప్పశెట్టి, "శాసన భాషాపరిణామం" తె. భా. చ.

(4) ఆం. చిం. వి. పరిశోధనము, 47వ పుట.

రమును నిరాకరించినను నేటికిని 'ఎవడు' ఇత్యాదులలో పదాది యకారము వినబడుచునేయున్నది. తాలవ్యస్వరమైన ఎకారమును పదాదిలో నుచ్చరించుటలో నుండు క్లేశము చేతనే పదాది యకార శ్రుతి గల్గుచున్నది. కేవలము ప్రక్రియా సౌలభ్యకాంక్షతో దీనిని గ్రంథములలో నిరాకరించిరి. కాని మనుష్యుల ఉచ్చారణము నెట్లు మార్చగలరు ? ఉచ్చారణవిరోధము గలుగకుండుటకే పదాది యకారము నంగీకరించవలెనని బాలసరస్వతి మహోపాధ్యాయుడు స్పష్టముగా జెప్పెను.(1).

కావున నిదిగూడ చింతామణీ ప్రాచీనత్వమును నిరూపింపదు. త్రాడులు అనుచోట

'డలటామదితాంతస్యచవాలుక్' అని చింతామణి ఉత్వ లోపము విధించి త్రాళ్లు అని చేసినది. కాని డకారమునకు ళత్వమును విధింపలేదు. అనగా చింతామణి కాలమునకు త్రాడ్లు అను రూపము వ్యవహారమున నుండెననియు తరువాతికాలమున త్రాళ్లు వంటి రూపము లేర్పడెననియు నిదిగూడ చింతామణి ప్రాచీనత్వము నిరూపించుననియు, బరిశోధకులభిప్రాయపడిరి.(2)

డకారములళ లుగా మారుట ఏడవశతాబ్దిలోనే కలదని భాషా చరిత్రజ్ఞులు బూదరాజు రాధాకృష్ణగారు తెలుపుచున్నారు.(3)

కావున ళత్వ విధానము చింతామణికిష్టముకాదనియైన ననవలెను. లేదా సంక్షిప్తగ్రంథమైన చింతామణి యిట్టి చిన్న మార్పులను జెప్పదలచలేదనియైన భావింపవలెను.

---

(1) బాలస, మదరాసు, వావిళ్ళప్రతి, సంధి, 26 సూ.

(2) ఆం. చిం. వి. పరిశోధనము 36వ పుట.

(3) డకారముల ళ లుగా మారుట.

ఉదా :-గుళ్ళవు, (సె. శా. 3-115 2-55-44, 7)
రట్టగుళ్ళు (ఎపి. ఇం. 27-234-36-14, 625-50)

మఱియు నన్నయ భారత భాగమున నాళ్ళు (1) వరవుళ్ళు (2) అనురీతిగా డకారమునకు ళత్వము వచ్చిన రూపములు కన్పట్టుచున్నవి.

చింతామణి ప్రాథమిక వ్యాకరణమనియు, కావున నన్నయ కృతమనియు చెప్పుటకు బరిశోధకులిచ్చిన పై ప్రమాణము 'నాళ్ళు' వంటి భారత ప్రయోగములవలన జింతామణిని భారతకర్త వ్రాయ లేదని చెప్పుటకు సహకరించుచున్నది. తానే చింతామణిని వ్రాసినచో భారతకర్త చింతామణిలో తనకు సమ్మతములయిన నాళ్ళు వంటిరూపములను సాధించి యుండుననుట యుక్తి సహజమే కదా!

'ఆంధ్రశబ్ద చింతామణి సంస్కృత శబ్దములను దెనుగులోనికి దెచ్చికొనుటకు దగు నియమములనుపదేశించినది. వానికి సుప్తిఙ్విభక్తులను జేర్చు పద్ధతులనుపదేశించుట ప్రధానముగా జేసికొని రచింపబడినదగుటంజేసి యది యాంధ్ర వాఙ్మయారంభదశలోనిదని సిద్ధాంతితము (3) అని పరిశోధకులు భావించిరి.

తెలుగుపై నపభ్రంశ ప్రాకృత ప్రభావమున్నది. తెలుగును కొందరు వైయాకరణులు ప్రాకృతముగా వ్యవహరించిరి. (4)

అపభ్రంశము గ్రామ్యముగా దిరస్కరింపబడుచున్నది. ఈ స్థితిలో దెలుగునకు మర్యాద కలిగించుటకు ప్రతిష్ఠనందిన సంస్కృత

---

(1) అధ్వరోత్సవంబు నన్నినాళ్ళు.
ఆం. భా. సభా 2-200 ప॥

(2) వరవుళ్ళ గలసితనయులు
ఆం. భా. సభా 2-200 ప॥

(1) ఆం. చిం. వి. పరిశోధనము 24వ పుట.

(2) చిన్నకోట పెద్దన, కావ్యా. చూ. మదరాసు: వే. వేం. శా. ౨ ఉ. ౭ప.

ప్రాకృత వ్యాకరణమార్గమున సంస్కృత భాషలో సంస్కృతపదములను దెలుగులోనికి దెచ్చు మార్గములనుపదేశించిన చింతామణి పండితలోకమున దెలుగుభాషా ప్రతిష్ఠను బెంచినది. (1)

ఇట్టి ప్రయత్నము దెనుగు భాషపై తిరస్కారభావము తొలగు వరకు సాగునట్టిది. ఆనాడు సంస్కృత పండితులకు, ఈనాడు ఆంగ్ల పండితులకు గూడ దెలుగుపై చిన్నచూపుండనేయున్నది. సంస్కృతాంగ్ల పండితులకీ యహంకారము గలుగుట కాయా భాషలలో గల విషయమహత్త్వమే కారణము. అహోబలపతి నాటికి గూడ నాంధ్ర భాషపై దేలిక భావముండుటచేతనే అతడు పీఠికలో నట్టి వారిని విమర్శించుచు ఆంధ్రభాషా మహత్త్వమును దెలిపియున్నాడు. అతడు గూడ దెనుగు ప్రతిష్ఠను బెంచుటకే సంస్కృతమందలి శాస్త్ర విషయములను చర్చలను దెలుగున ప్రవేశపెట్టినాడు. కావున సంస్కృతపదములను దెచ్చుకొను పద్ధతుల నుపదేశించినంత మాత్రమున చింతామణి వాఙ్మయారంభదశలోనిదని సిద్ధాంతము చేయుటకు వీలులేదు.

ఇక దీని నాంధ్రభారత కర్త వ్రాసెననువాదములోని బలమును బరిశీలింతము.

శబ్ద శాసన బిరుదము :-

ఆంధ్ర మహాభారతాదిలో నన్నయభట్టునకు 'విపుల శబ్ద శాసన' అను విశేషణము వాడబడెను. అది బిరుదమనియు ఆంధ్రశబ్ద చింతామణిని రచించుటచేతనది వచ్చెననియు పరిశోధకులు తెల్పిరి.(2)

చింతామణి సంక్షిప్తగ్రంథము. దానిని వ్రాయుటచే విపుల శబ్దశాసన బిరుదము వచ్చెననుట అయుక్తము.

---

(1) 'తెనుగుపైన పభ్రంశప్రాకృతప్రభావము" అను వ్యాసము చూ.
(2) ఆం. చిం. వి. పరిశోధనము 2 పు.

శబ్దాను శాసన పదము వ్యాకరణ పర్యాయము (1) మహాభారతము అతిక్లిష్టమైన ఘట్టములతో గూడినది. వానికర్థ నిర్ణయము చేయుటకు సంస్కృత వ్యాకరణ పరిజ్ఞాన మత్యవసరము. మహాభారతానువాదారంభమున అది తనకు గలదని నన్నయభట్టు చెప్పుకొని యుండును. లేదా విపులమైన సంస్కృత పదములను దత్సమములుగను, తెలుగు శబ్దములు కావ్యోపయోగములుగను ప్రయోగించుటకు వలయు నాంధ్ర వ్యాకరణము కలవాడని కూడ జెప్పవచ్చును. ఆ వ్యాకరణము పరిజ్ఞానరూపమై యాతని బుద్ధిస్థమని చెప్పవలసి యుండును.

ఈ విపుల శబ్దశాసనుడనునది ఆంధ్ర భారతరచనచే వచ్చెనని కొందరు భావించిరి. (2)

"తనకుల బ్రాహ్మణు ననురక్తు నవిరళ జపహోమ తత్పరు విపుల శబ్ద
శాసను సంహితాభ్యాసు బ్రహ్మాండాది నానాపురాణ విజ్ఞాననిరతు,
బాత్రునాపస్తంబ సూత్రు ముద్గల గోత్రజాతు సద్వినుతావదాతచరితు
లోకజ్ఞునుభయ భాషా కావ్య రచనాభి శోభితు సత్ప్రతిభాభియోగ్యు
నిత్యసత్యవచను మత్యమరాధిపా, చార్యు సుజను నన్న పార్యుజూచి
పరమ ధర్మవిదుండు వర చళుక్యాన్వయా, భరణుడిట్టులనియె
గరుణతోడ.(3)

ఇందు కుల బ్రాహ్మణత్వాది లక్షణములుగల నన్నయ భట్టును జూచి రాజనరేంద్రుడు ఆంధ్ర మహాభారత రచన చేయుమని కోరిన

---

(1) పతంజలి వ్యా. మహాభాష్యమ్ కాశీ: పట్టసర్ధన నారాయణశాస్త్రి (శ్రీసంవత్ 1943) 1 పుట.

(2) సం. ప్ర. వ్యాకరణాలు 15 పుట.

(3) ఆం. భా. ఆది 1-9ప

(3)

ట్లుండుటచేత ఆంధ్ర భారత రచనకుముందే పై లక్షణములన్నియు నాయనకు గలవని చెప్పవలసి యుండును. కావున ఆంధ్రభారతానువాదముచే నీ విపుల శబ్దశాసన నామమేర్పడెననుట కుదురదు.

ఈ విమర్శకుల భావనకు జక్కనామాత్యుని పద్యమాధారము. అతడు

వేయి విధంబులందు బదివేవురు పెద్దలు సుప్రబంధముల్
పాయక జెప్పిరట్లు రస బంధురభావ భవాభిరామధా
రేయులు శబ్దశాసన వరేణ్యులు నాగ బ్రశస్తికెక్కరే
యేయెడ నన్నపార్యుగతి నిద్ధరనట్టి మహాత్ము గొల్చెదన్.(1)

అని నన్నయభట్టును బ్రశంసించెను. ఈ ప్రశంస కొక హేతువు కనబడును. కవి రాక్షసీయమను నొక వ్యాకరణము కాకునూరి యప్పకవి కాలమునకు గలదు.(2) అందాతడొక నియమము చేసి యుండును. దాని నప్పకవి యిటుల దెల్పెను.

ఉ- ఆదిని శబ్దశాసన మహాకవి భారతంబులో
నేది వచింపగాఁ బడియె నెందునుఁజెప్పినదానినేకాని సూత్రసం
పాదన లేమిచేఁ దెనుగు పల్కుమఱొక్కటిఁ గూర్చి చెప్పగా
రాదని దాక్షవాటి కవి రాక్షసుఁడీ నియమంబుఁ జేసినన్.(3)

ఇట్లు నన్నయ భారత భాగమందలి పదములను వైయాకరణుడు వ్యాకరణదృష్టితో పరిశీలించి నియమము లేర్పరచు ధోరణి నచ్చినది. కావున జక్కన శబ్దశాశన వరేణ్యులుగా బ్రశంసించి యుండును.

---

(1) విక్రమార్క చరిత్ర పీఠిక సం. ప్రి. వ్యాకరణాలు, 15 పు.

(2) అప్పకవీయము, 1 ఆశ్వా-5.

(3) అందే 46వ.

ఇంతకును సంక్షిప్త చింతామణి రచనముచే విపుల శబ్దశాసన నామమేర్పడుట కుదురదుగాన నీ బిరుదము భారత కర్తయే చింతామణిని వ్రాసెనని నిరూపింపలేదు.

పండిత సభలు :-ఆంధ్ర మహాభారతమున పలుచోట్ల సత్సభల ప్రశంసలున్నవి (1) చింతామణిలో

“స్వస్థాన వేష భాషాభిమతాస్సంతో రసప్రలుబ్ధధియః
లోకే బహు మన్యన్తే వైకృత కావ్యాని చాన్యదపహాయ(2)

(స్వస్థాన వేష భాషాభిమానము గలవారు రసలోలుప బుద్ధులు నగు సత్పురుషులు ఇతర కావ్యములను వదలి వైకృత కావ్యములను గౌరవించుచున్నారు. అను శ్లోకమున ‘సన్తః’ అని సత్పురుషుల ప్రసక్తికలదు. ఈసామ్యము ఆరెండు గ్రంథముల యేక కర్తృత్వమును దెలుపునని చిం. వి. పరిశోధనకారు అభిప్రాయము.(3)

ఆంధ్ర భారతాదిను శ్లోకమున శ్రేయః పదమున్నది, ‘విశ్వశ్రేయః కావ్యమ్’ అని చింతామణిలో గూడ శ్రేయః పదమున్నది.’ ఇది గూడ గ్రంథ కర్త్రైక్యమునకు సాధకమని వారు చెప్పిరి.(4)

ఆంధ్ర మహాభారతమున నున్నది సత్సభల ప్రశంస. ఆంధ్ర శబ్ద చింతామణిలో నున్నది సత్పురుషుల ప్రశంస. ఇచట భేదముగూడ కలదు.

కొందరు సత్పురుషులొక విషయముపై నొకచోటచేరి నడపుకొనునవి సత్సభలు. ఒకచోట చేరకపోయినను సత్పురుషులు తమ

---

(1) ఆం. భా. ఆది 1-23వ.

(2) కవిశిరో, సంజ్ఞ 5 సూ.

(3) ఆం. చిం. వి. పరిశోధనము, 12 పుట.

(4) అందే, 13 పుట.

తమ తావులందే ఉండి తెనుగు గ్రంథములను జదువుకొనవచ్చును. ఇందు మొదటి వాంధ్ర భారతమున పేర్కొనబడినవి. రెండవవిషయము చింతామణిలో కలదు.

ఆంధ్ర భారతకర్త పాఠకులకు శ్రోతలకు శ్రేయస్సు కలుగవలెననుచున్నాడు. చింతామణిలోని శ్రేయః పదమునకు పలువురు శ్రేష్ఠమను నర్థమును జెప్పినారు. (1) ఒక వేళ చింతామణిలోని శ్రేయ: పదమునకు గూడ శ్రేయస్సు అనునర్థమే చెప్పికొనినను ఈ సామ్యము యాదృచ్ఛికముగా నచ్చినదిగా నచ్చును. "1005 సం॥ శక్తివర్మశాసనమున తలకట్టు - అను నాకారముతో లిఖింపబడి యుండగా 1022 సం॥ రాజరాజనరేంద్రుని కోరుమిల్లి శాసనమున నన్నయ (చింతామణి) వర్ణించిన అర్ధ చంద్రాకారపు గుర్తు అగు అను నదే తలకట్టుగ లిఖింపబడినది. .... ఈయొక్క నిదర్శనమే చింతామణి నన్నయ రచితమని స్థిర పరచుటకు సమర్థమైనద" నివారు తలంచిరి. (2)

తనకు ముందు లిపిలో నున్న తలకట్టునే చింతామణి పేర్కొని యుండవచ్చును. నన్నయ తాను రూపొందించిన లిపినియమములే శాసనములలో వాడదలచినచో మొత్తము వాడియుండవలెను. అట్లు వాడలేదు. అవితానే వాడనప్పుడు ఇతరులెట్లు గ్రహింతురు? కావున నిదియేకకర్తృత్వమును నిరూపింపలేదు. నన్నయభట్టు భారతభాగ పద్యములలో దద్ధర్మార్థకములగు ఎడు, ఎడి అనువానితో నున్న రక్షించెడి, రక్షించెడు అను సంస్కృత సమధాతుజవిశేషణ రూపములగపడవు. ఎదగాగమరూపముతోనున్న రక్షించెద అనురీతిగల ధర్మార్థక దత్సను క్రియారూపములు నన్నయ భారత భాగములో రెండుచోటు లందు మాత్రమే యగపడుచున్నవి. అట్లే విచారింతము

---

(1) ప. బాలస, సంజ్ఞ 1సూ; కవిశిరో, సంజ్ఞ 1సూ.

(2) ఆం. చిం. వి. పరిశోధనము, 73 పుట.

అనురీతిగల యుభయ కర్తృక ప్రార్థనా ద్యర్థక తత్సమ క్రియారూపములు సైతము రెండు స్థలములందు మాత్రమే యగపడుచున్నవి. విచారింపకు అనునీ వ్యతిరేక ప్రార్థనార్థక రూపమొక్క చోటను మాత్రమే యగపడుచున్నది. ఆంధ్ర వాఙ్మయమున నొక్క నన్నయ భారత భాగమునందు మాత్రమే తత్సమ క్రియల యందట్టి రూపములు సాధారణముగా ప్రయోగింప బడకుండుటయు, నాంధ్ర వ్యాకరణములన్నిటిలో నొక్క యాంధ్ర శబ్ద చింతామణి మాత్రమే తత్సమ ధాతువు లందటి రూపములను బూర్ణముగ సాధింపకుండుటయు ... తద్గ్రంథములేక కర్తృకమ్ములని నిరూపించునని వారి యూహ. (1)

पुस्तकालय गुरुकुल कांगड़ी विश्वविद्यालय 07483

ఇది నిలువని మాట. చింతామణిలో చెప్పబడని ఎడి,ఎడు. ఎదమొ॥ వానితో గూడిన తత్సమ రూపములు కొలదిగనైనను భారతమున నున్నందున భారత చింతామణు లేక కర్తృకములు గావని యేల చెప్పరాదు? 'నిత్య మనుత్తమ పురుష క్రియా స్వితః (ఉత్తమ పురుషేతర క్రియలయికారమునకు సంధి నిత్యము) అను సూత్రముచే ప్రథమ మధ్యను పురుష క్రియల యికారములకు నిత్య సంధి విధింపబడెను. (2)

ప్రాయస్తు స్యాత్క్కమాదిక స్యైతః (3)

(ఏమ్యాదుల యికారమునకు సంధి తఱచుగనగును) అను దానిచే ఏమ్యాదులలోనవగు ఉత్తమ పురుష క్రియలకు ప్రాయస్సంధి గలుగును. నన్నయ భారత భాగమున ప్రథమ మధ్యమ పురుషలకు నిత్య సంధియు, ఉత్తమ పురుషకు ప్రాయస్సంధియు. కాన

---

(1) ఆం. చిం. వి. పరిశోధనము. 74, 75, 76 పుటలు.

(2) కవిశిరో. సంధి 4 సూ.

(3) అందే 9 సూ.

నచ్చును. కావున నీ రెండు గ్రంథములేకకర్తృకములేయని వారి యుద్దేశ్యము. (1)

ఏది ప్రశ్నార్థక సర్వనామమో, అది శబ్దముచే గ్రంథకర్త వేనిని గ్రహింపదలచెనో మనకు తెలియదు. ఆకృతి గణములో సమానాకృతి శబ్దములను గ్రహించుట న్యాయ్యము. కాని దానిచే పూర్తి భిన్నాకారముతో గూడిన ఉత్తమ పురుష క్రియలను గ్రహింపనేల? చిన్నయ సూరి ఏమ్యాదులలో క్రియాపదములను గ్రహింప కుండుట గమనింపదగినది. చింతామణి కర్తకు పరిశేష న్యాయముపై మక్కువ యెక్కువ యని పలు సూత్రములు దెలుపును. (2)

ఉత్తమ పురుష భిన్నములకు నిత్య సంధియని చెప్పినపుడుత్తమ పురుషక నిత్యసంధియని (వికల్పమని) చెప్పినట్లే.

ఇంతకు నీసందర్భము గ్రంథ కర్త్రైక్యనిర్ణయమునకు సహకరింపదు. వ్యాకరణ పారిజాత పీఠికలో శ్రీవఝులవారు నన్నయ భారతమునకు చింతామణికి గల యాంతరంగిక సంబంధమును తెల్పినారు. అహోబలపతి, పారనంది రామశాస్త్రిగారు మొ॥వారు నన్నయ భారతోదాహరణములను ప్రమాణముగా జూపుచు వ్యాఖ్యలను వ్రాసిరి. అట్లే చింతామణి కర్త గూడ నన్నయ భారత భాగమునకు ప్రాధాన్యము నిచ్చుటచే పెక్కు భారత లక్ష్యములకు జింతామణిలో లక్షణములు గన్పడవచ్చును. వన్నయ భారతమును మాత్రమే గ్రహింపవలెనను నియమములేదు గావున తదితర లక్షణములును గానవచ్చును. (3) కావునవారు చూపెడి యాంతరంగిక సంబంధమే

---

(1) ఆం. చి. వి. పరిశోధనము, 76 పుట,

(2) చింతామణి కర్త లాఘవ ప్రీతి అనువ్యాసము చూ.

(3) కూర్చి, కొరకు, పట్టి విభక్తులు నన్నయ భారతమున లేవు, చింతామణి చెప్పినది. కవిశిరో, అజంత 2, 4, 5 సూ.

కర్తృకత్వమును స్థాపింపజాలదు. కొన్ని భారత ప్రయోగములు చింతామణిలో సాధింపబడకుండుట గూడ నిచట గమనింపదగిన విషయము. (1)

చింతామణి నితడు వ్రాయలేదనుటకు యుక్తులు

పై పరిశీలనముచే చింతామణిని ఆంధ్రభారత కర్తయగు నన్నయభట్టు వ్రాసెనను వాదములో బలములేదని తేలినది.

చింతామణి నాంధ్ర భారత కర్త వ్రాయలేదనుచు బలువురు పండిత పరిశోధకులు చెప్పిన వానిలో గొన్ని ప్రబల ప్రమాణములను గమనింతము.

(1) ఆంధ్రభారత కర్త నన్నయభట్టు చింతామణిని రచించె ననుట కప్పకవి చెప్పిన కలకథ ఆధారము. అది చరిత్రకు విరుద్ధ మగుటచే విశ్వాసానర్హము.

(2) చింతామణికి గల అన్ని ప్రతులయందు కవిభల్లటుడు పేర్కొనబడెను. ఒక కవిభల్లటుడు బుద్ధనృపాలుని కాలమున కలడు. ఈ బుద్ధనృపాలుడు రంగనాథరామాయణ కర్తయగు బుద్ధారెడ్డి కావచ్చును. చింతామణిలో పేర్కొనబడిన కవి భల్లటుడు బుద్ధనృపాలునియొద్దనున్న కవి భల్లటుడు ఒకడే యగుచో నితని కాలము పదుమూడవ శతాబ్ది ప్రథమపాదాంతమని చెప్పవచ్చును.

ఈకవి భల్లటుడు విక్రమార్క విజయమను పద్యకావ్యమును, ఒక లక్షణ గ్రంథమును గణమంజరియను సంస్కృత వ్యాకరణమును, పదమంజరియను నిఘంటువును వ్రాసెను.

---

(1) 'భారతంలో ఉండి చింతామణిలో సూత్రితం కానివి' డాక్టర్ ఆకురాతి పున్నారావు, సం. ప్ర. వ్యాకరణాలు 45 పుట.

ఈవిషయములు కందుకూరి వీరేశలింగము పంతులుగారు తెల్పినవి (1).

ఆంధ్రశబ్దచింతామణికర్త ఒక సామాన్య వైయాకరణునిగాక అనేక గ్రంథకర్త గొప్ప వైయాకరణుడు ఆంధ్రుడునగు పైకవి భల్లటునే స్మరించియుండునని ఆచార్య అమరేశం రాజేశ్వరశర్మగారు చెప్పిరి. (2)

ఆంధ్రశ్య చింతామణిపై త్రివిక్రమ (వాల్మీకి) వ్యాకరణ ప్రభావమున్నదని ఆచార్య అమరేశం రాజేశ్వరశర్మ డాక్టర్ ఆకురాతి పున్నారావుగారలు సోదాహరణముగా జెప్పియున్నారు. (3)

త్రివిక్రమ వ్యాకరణమునకు సూత్రకర్తయగు వాల్మీకి (?) (1). ఆంధ్రభారత కర్తయగు నన్నయభట్టుకు తరువాతివాడైన హేమచంద్రాచార్యునికంటె (క్రి. శ. 1110) దరువాతివాడు (2). పై హేతువులు చింతామణి భారతకర్తది కాదనియు నది కవిభల్లటునికి దరువాతిదనియు వెల్లడించును.

డాక్టర్ చిలుకూరి నారాయణరావుగారు నన్నయ (భారతకర్త) ప్రయోగాలు చింతామణి సాధ్యములు కావనియు చింతామణి సాధిం

---

(1) ఆచార్య అమరేశం రాజేశ్వర శర్మగారు, ఆం. వ్యా. వికాసము ప్రథమ 58, 59 పుటలు.

(2) అందే 60 పు.

(3) కవిశిరో. ఉపక్రమణిక ఆంధ్రరచయితల సంఘముద్రణము. నాగరి ప్రతి, 33వ పు.
ఆం. వ్యా. వికాసము. ప్రథమ 155 పు.
స. ప్ర. వ్యాకరణాలు, 232 పు.

(1) ఆం. వ్యా. వికాసము, ప్రథమ 143 పు.

(2) అందే, 81 పు.

చిన రూపములు నన్నయ భారతమునగాని నాకాలమునగల శాసనములందుగాని లేవనియు ననినారు. (1) వారు చింతామణీ హృదయమున నీవిషయమును సోదాహరణముగా నిరూపించిరి. ఈవిషయము చింతామణి ఆంధ్రభారతకర్త రచనము కాదని స్పష్టపరచునుగదా ?

పరిశోధకులోకరు ఆంధ్రశబ్ద చింతామణిని, ఆంధ్రభాషా భూషణమును, కావ్యాలంకార చూడామణిని బోల్చి చూచుచు చింతామణి పై రెండు గ్రంథముల లక్షణములకంటె పరిణతినందిన లక్షణముల నందించినదని తేల్చిరి. (2)

చింతామణికర్త ఆంధ్ర భారతకర్త ఒకరే యను వాదములో బలములేదని లోగడ గమనించితిమి. పై పరిశోధక పండితుల పరిశీలనములు ఆంధ్రభారతకర్త చింతామణిని వ్రాయలేదనియే తేల్చుచున్నవి. ఈ వాదము లింతవరకు ఖండింపబడలేదు. ఆంధ్రభారతకర్తకు తరువాతనే చింతామణి బయలుదేరెననుటకు మరికొన్ని ప్రమాణములు సందర్భానుసారముగా తరువాత వ్యాసములలో జూపబడును.

నిజమునకాంధ్రభారతకర్త చింతామణిని వ్రాసెననుటకు మనకు దొరకు ప్రథమ గ్రాంథికాధార మప్పకవి కల. మొదటనది ప్రత్యక్షర సత్యముగా భావింపబడి, తరువాత పుక్కిటిపురాణముగా తిరస్కరింపబడి కూడ రెండుమారులు చరిత్రగతిని మార్చివైచినది. ఆకలను కలగా ప్రక్కకునెట్టి చూచినచో నాంధ్ర భారతకర్తకు నాంధ్ర శబ్ద చింతామణికి నేమియు సంబంధముండదు. మహాపండితులను గూడ భ్రమలో పడవేసిన ఆ వింతకలనరయుదము.

---

(1) సం, ప్రి. వ్యాకరణాలు, 26 పు.

(2) డా. వారణాసి బాలకృష్ణ అనంత పద్మనాభశాస్త్రి, ఆం. వ్యా. వివేకము. అనంతపురం : (1935), 417, 443. 460 పుటలు.

(4)

కథకాదిదికల

ఆంధ్రశబ్ద చింతామణి పుట్టుక గురించి అప్పకవి ఒక వృత్తాంతము చెప్పినాడు. అతడు చెప్పిన వృత్తాంతమే చింతామణికి లోగడ గౌరవమును దరువాత నగౌరవమును దెచ్చిపెట్టినది. వీరేశలింగం పంతులుగారికి పూర్వమీ కథను సంపూర్ణ సత్యముగా విశ్వసించి, ఆంధ్రశబ్ద చింతామణిని భారతకర్తయే వ్రాసెనని తలంచినారు. (1) వీరేశలింగముగారిది యవిశ్వసనీయమైన కథయని విమర్శించిరి. (2) తరువాతి వారందరే కథను కాదనిన వారైనను గొందరు చింతామణిని భారత కర్తయే వ్రాసెననుచుండగా (3) మరికొందరు దానినాతడు వ్రాయలేదని నిరూపించుచున్నారు. అంతటితో నాగక అందలి విధానము బాగులేదనువారు, అదియొక ఉత్కృష్ట గ్రంథముకాదను వారు, చిన్నయసూరి మూలముగా చింతామణి మార్గమునకు బ్రఖ్యాతి వచ్చినదనువారు గూడ దయారయినారు. (4)

ఒక గ్రంథమునకు విలువ యున్నదా? లేదాయను విషయమును కర్తపేరునుబట్టి నిర్ణయించుట సముచితముగాదు. అది గ్రంథవివేచనము ద్వారా జరుగవలసిన పని.

---

(1) అహోబలపతి, కవిశిరో. పీఠిక 63 నుండి 68 శ్లో.

(2) ఆం. క. చ. మధ్యకవులు, రాజమండ్రి : మనోరమాముద్రాక్షరశాల, (1917), 128 పు.

(3) కళాప్రపూర్ణ వఝల చినసీతారామస్వామి శాస్త్రిగారు, ఆం. చిం. వి. పరిశోధనము.

(4) డాక్టర్ ఆకురాతి పున్నారావుగారు, సం. ప్ర. వ్యాకరణాలు, 173, 475 పుటలు.

నిజమునకు భారతకర్త చింతామణిని వ్రాసెనని ప్రసిద్ధ వ్యాఖ్యాతయగు బాలసరస్వతి చెప్పలేదు. అప్పకవి కూడ చింతామణ్యుత్పత్తి కథను కలయని తెల్పినాడు.

అతడొక కావ్యమును వ్రాయదలచుకొనినాడు. అతనికొక కలవచ్చినది. 'స్వప్న ప్రకారమను శీర్షికతో నాకల నాతడు లిఖించినాడు. (1) కాని యీ కలనాతడు సత్యముగా నమ్మినాడు. అతడు నమ్ముటకు తగిన పూర్వరంగమున్నది.

ఆనాడు కృష్ణాష్టమి. శ్రీ గోపాలస్వామి ఆలయమందు పూజాదికము గావించుకొనినాడప్పకవి. ఆరోజుపవాసము చేయుదురు. వేకువ జామున నీతనికి కలలో మహావిష్ణువు కనబడి చింతామణి ఉత్పత్తి కథను జెప్పెను.

దానికి సాయము తెల్లవారి లేచిన పిదప నొక బ్రాహ్మణుడొక పుస్తకమును బట్టుకొని వచ్చినాడు. ఆతనికాతిథ్యమీయగా నతడు సంభాషణ మధ్యమున చింతామణిలోని మొదటి శ్లోకమును జదివినాడు. ఎచటిదిది యని ప్రశ్నింపగా నన్నయ భట్టీయములోనిదని చెప్పి యందు 82 ఆర్యలున్నవనినాడు. అతడాశ్చర్యపడి బంధుమిత్రులకీ విషయములను వినిపింపగా వారు కలకు ఫలమును జెప్పిరి. కలలో విష్ణుడు చింతామణికి వ్యాఖ్య వ్రాయుమనెను. ఇలలో చింతామణి యితనిచే లభించినది. మనకిది సాక్షియని యతని వంశమును వర్ణించి దాని నాంధ్రీకరింపుమనినారు. దాని నకలును వ్రాసికొని యా బ్రాహ్మణుని పంపినాడు. ఆస్తికుడైన అప్పకవి పై పరిస్థితిలో తనకలలోని వృత్తాంతమును సత్యముగా భావించుట సహజమే. అయినను అతడు కథగాకాక కలగనే తెల్పుట యభినందింపదగినది. చింతామణికర్తృత్వ విషయమున నప్పకవి పుక్కిటి కథను కల్పించెనని దూషించుట న్యాయ్యము గానేరదు.

---

(1) అప్పక (1-33.

ఆంధ్ర శబ్ద చింతామణిని భారతకర్త వ్రాసెనని కొందరు భావించుటకే కలయే యాధారము. కాని కలలు సత్యసూచకములు కూడగావచ్చునా? యథాతథముగా సత్యములగునా యను విషయము పరిశీలింపదగినది.

కలలెట్లు వచ్చును? చూచినవియు, వినినవియు జదివినవియు గలలోనికి రావచ్చును. మెలకువగా నున్నప్పటి వాసనలు (ప్రపంచ మండలి పదార్థముల సూక్ష్మరూపములు) కలలో వివిధ సన్నివేశ రూపములలో ననుభవమునకు వచ్చునని బృహదారణ్యకోపనిషత్తు చెప్పుచున్నది. (1)

అనారోగ్యమువలన గూడ కలలు రావచ్చును. హోమియోపతివైద్య శాస్త్రమున రోగనిర్ణయమునకు కలలు గూడ ప్రాధాన్యము వహించును. వచ్చుచున్న కలనుబట్టి వానిరోగము నిర్ణయమగును.(2) ఒక్కొక్కప్పుడు కలలు భావిని సూచించుట కలదు.

రామాయణమున ద్రిజటా స్వప్నమున్నది. అందు ఏనుగు దంతముల పల్లకిని వేయి హంసములు మోయుచున్నవి. అందు రామలక్ష్మణులుండిరి. శుక్లాంబరమును ధరించిన సీత తెల్లని కొండ నెక్కినది. కొండచుట్టును సాగరమున్నది. రాముడు లక్ష్మణ సహితుడై చతుర్దంతములుగల యేనుగునెక్కి విహరించుచుండెను. శుక్లమాల్యాంబరధరులైనవారు జానకి యొద్దకు వచ్చిరి. ఆమె ఆకాశమునందున్న ఆఏనుగును రామునితో నెక్కినది. అచట నిలబడి చంద్ర సూర్యులను

---

(1) ఉపనిషద్భాష్యమ్ ద్వితీయ, పూనే; అష్టకర్ అండ్ కో, (1918. 4-3-9)

(2) శ్రీ వేమవరపు వేంకటరమణాచర్మ, కేస్ టేకింగ్ ఫారమ్ ఫర్ ఫిమేల్స్, కొత్తపేట : విజ్ఞాన ప్రచార నిలయము, 34, 35 పుటలు.

దాకినది. "త్రిజట కల ఇట్లు సాగినది. (1) తరువాతి కథలో పై దృశ్యములేవియు జరిగినట్లు కానరావు. మరియు చంద్రసూర్యులను దాకుట యసంభవముగదా ! కాని పై వృత్తాంతమంతయు రామచంద్రునకు విజయము గలుగునని సూచించినది. అది మాత్రము సత్యమయినది. ఒక్కొక్కప్పుడు కలలోని విషయములలో కొన్ని యథార్థములగుటగూడ గలదు. కాని యది అసాధారణ విషయము. ఉషాదేవికి అనిరుద్ధునితో సంగమించినట్లు కలవచ్చినది. నిదురలేచు సరికామె కన్యాత్వమునకు భంగము గలిగినట్లు తెలిసికొన్నది. బాధపడినది. చెలికత్తె యిది పార్వతీదేవి వరమని గుర్తించినది. తరువాత కలలో కనబడిన పురుషుడు ఇలలో పతి అయినాడు. (2)

అప్పకవి యిట్టిదే తన కలయనుకొని యుండవచ్చును. కాని యతని స్వప్న మిట్టిదికాదు. అప్పకవి కలలో బ్రాహ్మణుడుగాని ఆంధ్రశబ్ద చింతామణిగాని కనబడలేదు. మహావిష్ణువు కనబడి ఆ గ్రంథమునకు వ్యాఖ్యానమియుమని చెప్పినాడు. చింతామణి పుట్టుకకథ చెప్పెను. మతంగ నగనివాసిచే ఆ పుస్తకము నీసగనము చేరునని చెప్పెను. ఇలలో నొక బ్రాహ్మణుడు చింతామణిని వెంటబెట్టుకొని కాశీకి వెళ్ళుచు నప్పకవి యింట బసచేసెను. కావున కలలో జెప్పిన దానిలో నొకటి యిలలో జరిగెను. కలలో ప్రసక్తమైన చింతామణి నాతడు మరునాడే యిలలో కనుట విశేషము. కల యీ విషయమునే సూచించియుండవచ్చును. ఈ కలలో కొన్ని యసంగతములు గూడ నున్నవి. చింతామణికి పిదప భారతము రచితమని చెప్పబడినది. భారత రచనచే నన్నయ రాఘవ పాండవీయము నణచెననియు తన ఛందము

---

(1) వాల్మీకి, శ్రీమద్రామాయణము; చెన్నపురి; వావిళ్ళప్రెస్. (1925) సుందర 27 సర్గ.

(2) వేదవ్యాసుడు. హరివంశః. పూనా : శంకర్ నరహరి జోషి. (1857), 118 సర్గ.

నడచుటకే వ్యాకరణము వ్రాసెననియు భీమన భావించెను. ముందు రచింపబడిన చింతామణిచే ముందు ఛందమణగవలయును. పిదప రచింపబడిన భారతముచే రాఘవపాండవీయ మణగినది. వెనుక ఛంద మణగునని భీమన భయము. ఈ క్రియావ్యత్యయము యుక్తము కాదుగదా !

ఒక ఉత్తమ వ్యాకరణగ్రంథము వేఱొక వ్యాకరణగ్రంథమును త్రోసిరాజనవచ్చును. అది ఒక ఛందోగ్రంథము నణచుటయేమి? ఇంతకును భీమన పేర వాడుకలోనున్న ఛందము రేచన వ్రాసెనని పరిశోధకులు చెప్పుచున్నారు. రాజనరేంద్రునకు సారంగధరుడను కొడుకే లేడు. 11వ శతాబ్దివాడు 17వ శతాబ్దిలో నున్నవానికి పుస్తకము నిచ్చుటయేమి? నన్నయ ఆంధ్ర శబ్ద చింతామణి సూత్రముల ననుసరించి భారతము రచించెనని యిందున్నది. కాని భారతమునకు చింతామణికి అనేక భేదములున్నవి. వీనిని పరిశోధకులు వెల్లడించినారు.(1) అది కలగదా! అందసంగతములుండుటలో వింతయేమి? బుద్ధిపూర్వకముగా గల్పించిన కథలో నిట్టివి యుండవు. అప్రయత్నముగా వచ్చు కలలో నెట్టి యసంగతములైననుండుట పరిపాటియే.

ఈకల కథనీతడు కల్పించెనా? తెలియదు. అయినను నిరాధారముగా నట్టి యారోపణము చేయనేల? ఇట్టికల వచ్చుటకు గావలసిన పూర్వరంగమితనికి గలదు. ఈ కలలోనేమి యున్నది? గోపాలస్వామి సతీ సమేతుడై కనబడెను. నన్నయ ఫక్కి ననువదింపుమని చెప్పెను. “నన్నయ ముందు చింతామణిని రచించెను. దాని ననుసరించి భారతమును జేసెను. భారతరచన ముందు భీమన వ్రాసిన రాఘవ పాండవీయము నిలుపలేక పోయినది. (దానికి జనాదరణము లభించలేదన్న మాట) తన ఛందము ప్రసిద్ధిని తొలగించుటకే చింతామణిని రచించె

---

(1) డా. చిలుకూరి నారాయణరావుగారు, ఆం. భా. చ, ‘చింతామణి హృదయము’ వ్రాసేరు : ఆం. వి. క. ప. (1937)

నని భావించి భీమన దానిని దొంగిలించి గోదావరిలో పారవైచెను. వ్యాకరణము పోవుటచే భారతములోని ప్రయోగములను బట్టి తరువాతి కవులు ప్రవర్తింపవలెనని కవిరాక్షసుడు నియమము జేసెను. రాజనరేంద్రుని కుమారుడు చింతామణిని ముందే పఠించెను. అతని కాళ్ళుచేతులు మతిచెడిన తండ్రి నరికెను. సారంగధరుడు మత్స్యేంద్రుడను సిద్ధుని స్నేహముచే సిద్ధుడయ్యెను. అతడే మతంగగిరి యొద్ద బాలసరస్వతి కాచింతామణి నీయగా నతడు దానికి టీక వ్రాసెను. 82 ఆర్యలుగల ఆప్రతి మతంగనగ నివాసిచే నీయింటిని చేరును” ఇది గోపాలస్వామి చెప్పిన కలకథ.

(1) అప్పకవి అంతకు ముందు గోపాలస్వామిని ధ్యానించెను. ఆయనమూర్తి కలలోగనబడవచ్చును.

(2) అతడొక కావ్యము వ్రాయవలయునని అంతముందే సన్నద్ధుడై యుండెను. దేవుడు వ్యాకరణము ననువాదము చేయుమనినట్లు కలవచ్చెను.

(3) అతడు గౌరవ నవనాథ చరిత్రమున మాళవదేశ రాజైన రాజనరేంద్రుని కథ చదివి యుండును.

(4) భీమకవి రాఘవ పాండవీయమును రచించినట్లు పింగళ సూరన కావ్యములోనున్నది. భీమన ఛందమును గూడ వ్రాసినట్లు లోకములోని వాడుక.

(5) బాలసరస్వతి కెవరో శివయోగి చింతామణి నిచ్చినట్లితడు వినియుండును.

(6) కవి రాక్షసుడు వ్రాసిన కవిరాక్షసీయము నప్పకవి చూచి యుండవచ్చును. (1)

---

(1) అప్పక 1-5 వచనము.

ఇవన్నియు నాతనికి కలలో వచ్చినవి. చిత్రమేమనగా నీవిషయములన్నియు నొక విచిత్ర బంధముతో నిజమేయని భ్రాంతి కల్గించునంత యను బంధముతో కలలోకి వచ్చినవి. అతడు భ్రాంతి పడినాడు: అయినను ఇది కలయే అని చెప్పినాడు. అతి విచిత్రమేమనగా నట్లు చెప్పినప్పటికి అది నిజమేయని తరువాతివారు భావించుట. అంతకన్న యద్భుతమేమనగా నిదియంతయు నప్పకవి కల్పనమని యతని పై బురద చల్లుట.

ఆ కలకథను ప్రక్కకు బెట్టినచో భారతకర్త చింతామణిని వ్రాసెననుటకు ప్రమాణముండదు అది కలగా గుర్తించినచో నప్పకవి నాడిపోసికొనవలసిన యవసరమును లేదు.

చింతామణికర్త బాలసరస్వతియా ?

చింతామణి నాంధ్రభారత కర్త వ్రాయనిచో మఱియెవరు వ్రాసిరి ? బాలసరస్వతియే వ్రాసెనని విమర్శకులు చెప్పుచున్నారు(1) మహోపాధ్యాయుడైన బాలసరస్వతి కొగ్రంథమును వ్రాయు సామర్థ్యము లేదనలేము. కాని అతడే వ్రాసినచో గ్రంథ ప్రతిష్ఠను బెంచుటకొఱకు దానినాంధ్ర భారతకర్త కంటగట్టెనన లెను. విమర్శకుల వాదమదియే. బాలసరస్వతియే చింతామణిని వ్రాసెననుటకు విమర్శకులు చెప్పిన కొన్ని బలమైన యుక్తులున్నవి. ఆ యుక్తులను పరిశీలింతము.

ఆంధ్ర శబ్ద చింతామణీ కవిజన సంజీవనులయందు కొన్ని లక్షణములకు బోలికలు కన్పట్టుచున్నవి. కవిజనసంజీవనీ లక్షణములను సంస్కృతీకరించుటచేతనే ఆ చింతామణీ లక్షణము లేర్పడినవని కొందరు విమర్శకుల తలంపు. వారి అభిప్రాయము ననుసరించి యీ సంజీవని కంటె చింతామణి అర్వాచీనము.

---

(1) సం. ప్ర. వ్యాకరణాలు, 280 పు.

కవిజన సంజీవనీ కర్త ముద్దరాజు రామన్న. చింతామణికి ప్రథమ వ్యాఖ్యాతయగు బాలసరస్వతియే కవిజన సంజీవనీ లక్షణములతోఁగూడ పూర్వ లక్షణములను సంస్కృతీకరించి చింతామణిని రచించి, దానికి బ్రసిద్ధిఁ రప్పించుటకై నన్నయభట్టు పేరుపెట్టెనని యీ విమర్శకుల ఉద్దేశ్యము (1). బాలసరస్వతి కంటే రామన పూర్వుఁడయినచో నీ ఊహ సత్యమగుట కవకాశమున్నది. కావున వీరి కాలమును బరిశీలింతము.

బాల సరస్వతికి చింతామణి 1608 లో దొరకెనని యప్పకవి చెప్పెను.(2) దొఱకిన కొంత కాలమునకు తరువాత కాని బాలసరస్వతి వ్యాఖ్య వ్రాయలేదు. (3) చింతామణి దొరకుటకు, బాలసరస్వతి వ్యాఖ్యానించుటకు నడుమ రెండు సంవత్సరములు జరిగెనని భావించినచో 1610 లో బాలసరస్వతీయము రచింపబడెననవలెను. ఆ గ్రంథమును రచించునాటికి బాలసరస్వతి మహాపండితుడు. భాష్యాది బహు శాస్త్ర పరిచయము గలవాడు. అప్పటికి ప్రాకృత వ్యాకరణమునకు భాషా వివరణమను వ్యాఖ్యను వ్రాసెను. బాహట స్థానమును రచించెను. కౌముదీ నాటకము, చంద్రికా పరిణయము, విప్రవామన పురాణ ప్రబంధము, భ్రామరీ గీత ప్రబంధము, యాదవ రాఘవ పాండవీయమను త్ర్యర్థి కావ్యమును రచించెను.

ఇతడు దక్షిణ కాళికా తంత్రచణుడు. ఇట్లు బహుముఖ ప్రజ్ఞావంతుడగుటవలన ఆత్మ విశ్వాసముతో అఖిల కవితా స్వతంత్రు

---

(1) సం. ప్ర. వ్యాకరణములు, 280 పు.

(2) ఆం. క. చ, శ్రీ కం. వీ. పంతులు, రాజమండ్రి : మనోరమా ముద్రాక్షరశాల, (1917). ద్వితీయ 130 పు.

(3) బాలసరస్వతి. ప. బాలస కృత్యాది, కాకినాడ: ఆం. సా. పరిషత్తు (1932) 3వ.

డను, బహుకళాధరుడను, జగన్నుతుడను అని చెప్పుకొన గల్గెను(1). ఈ బాలసరస్వతి నామము బిరుదమందురు. దాని యాకార మట్లే ఉన్నది. పై రచనములను దిలకించినపుడీ బిరుదమున కీతడు తగినవాడని తెలియును. సకల భాషా స్వతంత్రభట్టారక, మహోపాధ్యాయ అను విశేషణములు గ్రంథాంత గద్యలో నున్నవి. (2) ఇవిగాక యాదవ రాఘవ పాండవీయ పీఠికలో శతాధిక ప్రబంధకర్తనని, వేదశాస్త్ర పురాణ వివిధ సంగీత సాహిత్యాది విద్యోప బృంహణుడనని చెప్పుకొనెను.(3) వేదము బాల్యమున జదువదగిన విద్య. ఇన్ని విద్యలను సాధించుట, ఇన్ని గ్రంథములను రచించుట, ఇట్టి బిరుదులను సంపాదించుట సుమారు ఏబది సంవత్సరములు దాటినగాని జరుగని పని. బాలసరస్వతీయ రచనా కాలమున కీతనికి 52 సం॥ కలవని భావించినచో నీతడు 1558 ప్రాంతమున జన్మించి యుండవలెను.

రాఘవ పాండవీయమును వ్రాసిన పింగళి సూరన పైన, హరిశ్చంద్ర నలోపాఖ్యానమును వ్రాసిన రాజరాజభూషణుని పైన స్పర్ధతో బాలసరస్వతి త్ర్యర్థి కావ్యరచనకు బూనుకొనియుండును (4)

---

(1) బాలసరస్వతి, బాలసకృత్యాది, చెన్నపురి: వావిళ్ళముద్రణము, (1971), 9, 10 పు.

(2) అందే.

(3) శ్రీ కందుకూరి వీరేశలింగము పంతులు, ఆం. క. చ. గద్య, 276 పుట.

(4) మెండైనట్టి విచిత్రవైఖరులచే మీఁదౌ మహాకావ్యముల్, దండిం దొల్లియె చేసిరాదిములు తత్కావ్యాధిక శ్లాఘమై, నుండం న్రాఘవ కృష్ణ పాండవ కథాయుక్త ప్రబంధంబువా, క్పాండిత్యం బలరార శ్లేష రచనైక ప్రౌఢినే జేసెదన్ యాదవ రాఘవ పాండవీయము. ఆం. క. చ. ద్వితీయ 128 పు.

ఇతడు చిన్నతనమున ప్రత్యక్షముగనో, పరోక్షముగనో వారి నెరిగినవాడుగూడ కావచ్చును. స్పర్థ సమకాలికులందు, పరిచితులందు గలుగుట సహజ విషయము గదా !

పింగళి సూరన 1570 వరకు జీవించినవాడు(1). రామరాజ భూషణుడు 1590 వరకు నున్నాడని చారిత్రికులు చెప్పుచున్నారు(2). కావున వారిని మించవలయునను కోరిక బాలసరస్వతికి గలుగ వచ్చును. కాని వారి జీవిత కాలములో నీతని కోరిక తీరు నవకాశము లేదు. 30 సం. వయసువారు త్ర్యర్థి కావ్యమును వ్రాయుట సామాన్యముగా జరుగని పని.

బాలసరస్వతి ముత్తాతకు అన్నయగు తిరుమలయ్య అళియ రామరాయలచే నెడవల్లి యగ్రహారమును బొందెను(3). రామరాయలు 1665న జరిగిన రక్షస తంగడి యుద్ధమున మరణించినాడు. రామరాయలచే సత్కరింపబడిన తిరుమలయ్యకు అతని తమ్ముని మునిమనుమడగు బాలసరస్వతికిని దగిన కాలవ్యవధాన ముండవలదా అని ప్రశ్న.

అళియ రామరాయలు మరణించుకాలమునకు 90 సం॥ దాటిన వాడు(4).

ఆచ్యుత దేవరాయల మరణానంతరము విజయనగర సామ్రాజ్యము నాక్రమించిన సలకము తిమ్మయ్యను జంపి అళియ రామరాజు 1542లో సదాశివరాయలను సింహాసన మెక్కించెను. బాలుడయిన అతనిపేర తానే రాజ్యభారము వహించెను. కావున తిరుమలయ్య

---

(1) అందే.

(2) అందే 92 పు.

(3) బాలస కృత్యాది వావిళ్ళప్రతి, 7 పు.

(4) శ్రీవఝల చిన సీతారామస్వామిశాస్త్రి, అందే పీఠిక, 132 పుట.

కగ్రహారమును 1542 కు తరువాత ఇచ్చియుండవచ్చును. ఒక ప్రభువు నుండి యగ్రహారమును సామాన్యుడు పొందలేడు. కనుక అప్పటికే తిరుమలయ్య పరిణతుడై యుండవలెను. 50 సం॥ కలిగిన తిరుమలయ్య 1544 ప్రాంతమున నగ్రహారమును బడసెనని భావించినచో నప్పటి కతని తమ్ముడగు రామనకు 51 సం॥ లుండవచ్చును. రామనకు, నతని కుమారుడగు భైరవునకు నిరువది సంవత్సరములకు కుమారుడు గలిగెనని యూహించినచో 1544 సం॥న రామనకు 11 సం॥ వయస్సు గల మనుమడుండుట కవకాశమున్నది. అతడు బాలసరస్వతి తండ్రి యగు కృష్ణయ్య. ఇతనికి 23 సం॥ ప్రాంతమున బాలసరస్వతిపుట్టినచో నితని జనన కాలము 1558 ప్రాంతమగుట కభ్యంతరములేదు. ఇచట స్పష్టతకై తిరుమలయ్యనుండి బాలసరస్వతి వరకు వంశ వృక్ష మీయబడుచున్నది. ఇచట నీయబడినవి వారి జనన సంవత్సరములు. (ఊహా సిద్ధములు)


తిరుమలయ్య
1491
(రామనకు జ్యేష్ఠుడు)
రామన
1493
భైరవుడు
1513
నాగన్న
1515
అప్పన
1517
రామన
1519
ఆదిత్యుడు
1553
కృష్ణకవి
1535
అబ్బన
1537
బాలసరస్వతి
1558
ఆదిత్యకవి
1560

కావున బాలస్వతి ముత్తాత అన్న అళియరామ రాయలచే సత్కరింప బడుటకు, మొదట నూహించిన బాలసరస్వతి కాలమునకు వైరుధ్యము లేదు. ఇక రామన జీవితకాలమును గుర్తింపవలెను. ముద్దరాజురామన్న యన్న పెదరామన్న పింగళి సూరన్న రాఘవ పాండవీయమునకు వ్యాఖ్యానము వ్రాసెనని విద్వాన్ రావూరి దొరసామిశర్మ నిరూపించినారు. (1)

గ్రంథకర్త సమకాలమున నాతని గ్రంథమునకు వ్యాఖ్య వ్రాయుట కెవరును సామాన్యముగా సాహసింపరు. అందునను ప్రథమ ద్వ్యర్థి కావ్యమున కట్టి ప్రయత్నము గ్రంథకర్త అనంతరమున జరిగి యుండవచ్చును. పింగళి సూరన 1570 వరకు జీవించి యున్నాడు.

ఒక మహాకవి ద్వ్యర్థి కావ్యమునకు వ్యాఖ్యానము వ్రాయువాడు భాషలో మంచి పాండిత్యమును సంపాదించి యుండవలెను. సంస్కృతాంధ్రములలో బాగుగా పాండిత్యము లేనిచో రాఘవ పాండవీయమును వ్యాఖ్యానింపలేరు. పాండిత్యముతో పాటు వయః పరిణతి లేనిచో వ్యాఖ్యారచనమునకు సామాన్యముగా సిద్ధపడరు.

పెదరామనకు వ్యాఖ్య రచించునాటికి 40 సం॥ కలవని భావింపవచ్చును. అతడు సూరన అవసాన దశలో 1570 ప్రాంతమున జన్మించియున్నచో వ్యాఖ్యా రచనమునాటికి 1610 ప్రాంతమగును.

కవిజన సంజీవని ప్రామాణికముగా గ్రహింపబడిన లక్షణ గ్రంథము. అందలి విశేషమేమనగా పూర్వ లాక్షణికులు చెప్పిన దానిని బునరుక్తము చేయకుండ వారు విడచిన విశేషములనే

---

(1) పరిశోధన పత్రిక, ఆగష్టు సెప్టెంబరు (1954)
లక్షణశిరోమణి పీఠిక, హైదరాబాదు : ఆం. సా. అకాడమి, (1979), 17 పు.

గ్రథించుట. ఇట్టి రచనము సలుపుటకు బూర్వలక్షణములను జదువవలెను. ఎన్నియో ప్రబంధములను బరిశోధనాత్మకముగా జదువవలెను. తాను గ్రహించిన నూతన విషయముల నొకచో జేర్చియపుడు గ్రంథమును వ్రాయవలెను. ఇంతటి కృషిచేసినవాడు కావుననే రామన "శ్రీమన్మదన గోపాల కృపా కటాక్ష సంప్రాప్తసారస్వత సంపదానంద" అని కవిజన సంజీవనిలో జెప్పుకొనినాడు.

కవిజన సంజీనిని రచించునాటికి రామనకు 38 సం॥ కలవనియు, పెదరామన కంటె చినరామన 2 సం॥ చిన్నవాడనియు భావించినచో కవిజన సంజీవని రచనాకాలము 1610 ప్రాంతమగును. విద్వాన్ రావూరి దొరసామి శర్మగారు ముద్దరాజు రామన 1580-1650 నడిమివాడని తెల్పియున్నారు. (1)

పెదరామన రాఘవ పాండవీయా దర్శము(రాఘవ పాండవీయ వ్యాఖ్యానము) నందు ఆముక్తమాల్యద, పాండురంగ మాహాత్మ్యముల నుండి ఉదాహరణము లీయబడినవి (2) పాండురంగ మాహాత్మ్యము 1565 ప్రాంతమున రచింపబడెనని పండిత పరిశోధకులు భావించిరి. (3) కాని యా గ్రంథమున ఆముక్తమాల్యద వసుచరిత్రల స్మరణము కానవచ్చుచున్నది. (4) వసుచరిత్ర 1577 కు దరువాతనే ముగింప

---

(1) లక్షణ శిరోమణి పీఠిక, హైదరాబాదు : ఆం. సా. అకాడమి' (1979), 17 పుట.

(2) ఆచార్య అమరేశం రాజేశ్వర శర్మగారు ఆం. వ్యా. వికాసము, ప్రథమ 57 పు.

(3) శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి, మీగడతరకలు, 'ఉద్భటారాధ్య చరిత్రము' మణిమంజరి ముక్త్యాల : (1951), పుట 143.

(4) తెనాలి రామకృష్ణుడు, పాండురంగ మాహాత్మ్యము, రాజమండ్రి : కొండపల్లి వీర వెంకయ్య, (1934), 4 ఆ. 242, 244 పు.

బడెనని రావుబహదూర్ కందుకూరి వీరేశలింగంగారు నిర్ణయించిరి.(1) శ్లేషయమకములతో నపూర్వముగానున్న వసుచరిత్ర వ్రాయుచున్న కాలమునందే ప్రసిద్ధిని బడసెనని భావించినచో దానిని రామకృష్ణుడు సూచించుట కవకాశమున్నది. కావున వసుచరిత్ర పాండురంగ మాహాత్మ్యములు కనీస మొక కాలమందైన రచింపబడవలెను. లేదా వసుచరిత్ర తరువాత పాండురంగ మాహాత్మ్యము రచింపబడియుండవలెను.

ఒక గ్రంథమును ప్రమాణముగా జూపుటకు దానికి గొంత ప్రసిద్ధిరావలెను. సమకాలికుల రచనలను ప్రమాణముగా జూపుట సామాన్యముగా జరుగనిపని. పాండురంగ మాహాత్మ్యమును ప్రమాణముగా జూపిన పెదరామన 1570 ప్రాంతమున జన్మించినచో లోగడ భావించినట్లాతడు తన 40వ సం॥మున రాఘవ పాండవీయాదర్శమును రచించి యుండవచ్చును.

కావున కవిజన సంజీవిని, రాఘవ పాండవీయాదర్శము, బాల సరస్వతీయము 1610 ప్రాంతమున రచింపబడినవని చెప్పవలెను.

అప్పటికి బాలసరస్వతి ఉద్దండ పండిత కవిగా, జగన్నుతునిగా, బహుకళాధరునిగా నుండుటయు, రామన మంచి లాక్షణికుడు మాత్రమే అగుటయు బరిశీలింపగా గవిజన సంజీవినీ లక్షణమును బాలసరస్వతి సంస్కృతీకరించెననుట అసంగతమని స్పష్టమగును.

గ్రంథకర్త వివరించిన గాని తెలియని సూత్రములకు
“అపిశబ్దార్థ స్యైతః”

చింతామణిలో నుండు కొన్ని సూత్రాలు సూత్రకర్త వివరించిన గాని తెలియుట లేదనియు, వానిని బాలసరస్వతి వివరించెను కాన నతడే చింతామణిని వ్రాసెననియు గొందరు పరిశోధకులు భావించిరి.(2)

---

(1) ఆం. క. చ. ద్వితీయ 95 పుట.

(2) సం. ప్ర. వ్యాకరణాలు 248 పు.

దానికి వారు నిదర్శనముగా చూపిన వానిలో "అపిశబ్దార్థస్యైతః" ఒకటి "తెలుగు వాడికెవడికైనా సంస్కృతంలోని 'అపి' శబ్దానికి తెలుగు పర్యాయమనగానే వెంటనే స్ఫురించేది 'కూడ' అనే అవ్యయం. కాని సూత్రం అప్యర్థక తెలుగు పర్యాయంఏని అంటున్నది. ఏనిశబ్దానికి అప్యర్థముండవచ్చుగాని ప్రసిద్ధంగా బాలసరస్వతి ఉదాహరణమును బట్టే పర్యాయార్థమున్నట్లు తెలుస్తుంది. అయినపుడు ప్రసిద్ధంగా పర్యాయార్థమయిన శబ్దాన్ని పట్టుకొని అప్యర్థమని సూత్రీకరించి వ్యాఖ్యానం చేయాలంటే సూత్రకర్తావ్యాఖ్యానకర్త ఒక్కరే కాకపోతే సంభవమా...(1) అని వారి ప్రశ్న.

ఈ సందర్భమున సంస్కృతము నందలి 'అపి' శబ్దమునకుగల అర్థములను గమనించుట అవసరము.

అపి - గర్హాయాం, (నింద) సముచ్చయే (చేరిక) ప్రశ్నే (ప్రశ్న) శఙ్కాయాం) సందేహం), సమ్భావనాయాం (ఊహ) అనుజ్ఞాయాం (అనుజ్ఞ) అపధారణే (నిశ్చయము) యుక్తపదార్థే (యుక్తమైన పదార్థము) పునరర్థే (మరల, మఱియు) కామకార క్రియాయాం, (ఇచ్చవచ్చినట్లు చేయుపని) ఇవి 'అపి' శబ్దమున కర్థములు (2)

ఏని శబ్దమునకు గల అర్థములను గమనింపవలెను.

ఏని - 1. చేదర్థకము,
2. వికల్పమును తెలుపును.
3. సందేహము లేమిని తెలుపును.

---

(1) అందే 259 పు.

(2) శ్రీ మామిడి వెంకటార్యుడు, శబ్దార్థకల్పతరువు, మచిలీపట్టణము : శ్రీ వాసవి గ్రంథప్రచురణ సమితి, (1951), 71 పు.

అప్యర్థకము

1. ఉత్కర్షను తెలుపును.
2. అపకర్షను దెలుపును.
3. అనిర్ధారణమును దెలుపును.
4, వాక్యాలంకారము. (1)

నిఘంటువులో 'ఏనిని' అప్యర్థకముగా గుర్తించుటయే కాక అందలి విశేషార్థములు గూడ గ్రహింపబడినవి. 'కూడ'అను నవ్యయం. 'అపి'కి పర్యాయమైనను అది ఇదంతము కాదు. కాన "అపిశబ్దార్థస్యైతః" అను సూత్రమున కది యుదాహరణము కాదనుట స్పష్టము.

అప్యర్థమున 'కాని' యను పదము గలదని విమర్శకులనిరి. పైన శబ్దార్థకల్పతరువు తెల్పిన అర్థములలోనది లేదుగదా. (2)

'అపి'కి పర్యాయములుగా 'ను' 'ఉను'లు వాడబడినవికాని యవి యిదంతములు గావు కదా. కనుక "అపిశబ్దార్థస్యైతః" అను సూత్రమున అపి శబ్దమునకు 'ఏని' యను నర్థమును చెప్పుటకు ఆటంకము లేదనియు, నీ సూత్రవ్యాఖ్య సూత్రకర్తయు వ్యాఖ్యాతయు నొకడేయని నిరూపించుటకు బ్రమాణముగాదనియు స్పష్టము.

"తిజ్మధ్యశేషషష్ఠీ"

సూత్రకర్త వివరించిన గాని తెలియని సూత్రములుగా విమర్శకులుదాహరించిన వానిలో 'తిజ్మధ్య' సూత్రమొకటి. కళలేవియో వివరించు సూత్రమిది.

---

(1) సూ. ని ప్రథమ భాగము, కాకినాడ: ఆం. సా. ప్ర (1936) 337 పు.

(2) సం. ప్ర. వ్యాకరణాలు 259 పు.

'తిఙ్మధ్య శేషషష్ఠీ సుస్కర్మ ప్రవచనీయజవిభక్తీః, కించిత్ప్రశంస నాద్భుత సంతాపయదాతదా కిమే వాంశ్చ, క్త్వాకిల తూష్ణీమాద్యానభిదధతి కళాద్రుతో నయేషాంస్యాత్" దీనికి బాలసరస్వతి వ్యాఖ్య యిది. తిఙ్మధ్య = తిఙ్మధ్యములను క్రియలను ప్రబలితివి, సంతోషించితివి, ప్రకాశించిరి, సంతోషించితిమి ఇత్యాది క్రియలు తిఙ్మధ్యములనిపించుకొనును. శేషషష్ఠీ = యొక్క షష్ఠియు, హరి యొక్క గిరియొక్క అను షష్ఠియును, సుస్ = వనము, వనములు ఇత్యాది ప్రథమా విభక్తియును, కర్మప్రవచనీయ జవిభక్తీః= రాముంగూర్చి, కృష్ణుంగూర్చి ఇత్యాది ద్వితీయయు, కించిత్ = ఇంచుకంత కాసంత, సుంత మొదలయిన కించిదర్థములును, ప్రశంసన = బళీ మజ్ఝా మొదలైన ప్రశంసార్థములును, అద్భుత=అహో, ఓహో, ఔరా మొదలయిన అద్భుతార్థములును సన్తాప = అక్కటా, అయ్యో మొదలైన సంతాపార్థములును, యదా + తదా = ఎప్పుడు, అప్పుడు అనెడివియు, కిం=ఏమి అనునదియు, ఏవాంశ్చ = నిన్నే, నన్నే అను ఏవార్థములును క్త్వా = ప్రకాశించి, హరించి, విహరించిక్త్వాప్రత్యయాంతములును, కిల = చేసెనట అనెడి కిలార్థమును, తూష్ణీం – ఊరక, మిన్నక మొదలైన తూష్ణీమర్థములును ఆది శబ్దముచేత పట్టి యను విభక్తియు, మఱి, సుమ్ము, కదా మొదలైనవియును, కలాః= కళలని, అభిదధతి,= చెప్పుదురు. ఏషాం = ఏవీనికైన, ద్రుతః = పైనకారము, నస్యాత్ = లేదు. కూర్చిరి కీర్తి, హరియొక్క చరణములు, శివుడు కర్త ఇత్యాది. వించున్నాము, ఘటింపగలడు, చనఁడు అనెడివి తిఙ్మధ్యములుగా కున్నను, ప్రథమాసమములు గనుక సుస్సులోనివిగానే తెలియునది ...... (1)

"పై వ్యాఖ్యలో ...... కొన్నిచోట్ల తెలుగు పర్యాయాలు ఇస్తూ, కొన్నిచోట్ల పర్యాయాలుగాక స్వసంకేతితార్థాలు ఇవ్వడం

---

1. ప. బాలస, సంజ్ఞ. 13, 14 శ్లో, వ్యాఖ్య

జరిగింది." "కించిత్ శబ్దానికి పర్యాయంగా ఇంచుకసుంత శబ్దాలు తెలుగులోనివి ఇవ్వబడ్డాయి. కాని దాని అనంతర పదానికి (ప్రశంసన) పర్యాయం ఒసగబడలేదు. (ప్రశంసనం = పొగడ్త) ప్రశంసనంలో చేసే ధ్వనులు బళి మజ్జ అనేవి ఒసగబడినాయి. అలాగే అద్భుత శబ్దానికి గూడా తెలుగు పర్యాయం గాకుండ (అచ్చెరువు) తద్భావ ప్రకటనలో వెలువడే శబ్దాలు అహో, ఓహో, ఔరా అనేవి కళలుగా చూపబడినాయి. బళి మజ్జా అనేవి అద్భుతార్థాలు ఎందుకు కావు? అదేవిధంగా సంతాప శబ్దానికి గూడా తెలుగు పర్యాయం (వేడిమి, కాక) ఇవ్వకుండా సంతప్తుల వ్యవహారంలోని ఆక్రందనాన్ని సూచించే శబ్దాలు అయ్యో! అక్కటా అని యిచ్చాడు" (2)

"పైన విమృష్టాలైన పదాలకి అవే అర్థాలని (వ్యాఖ్యాత చెప్పినది) ఆపద ప్రయోక్తకు తప్ప తెలియవు. కారణం ఆ అర్థాలు అతనిచే సంకేతితమైనవే తప్ప యథార్థాలుగావు" (3) అని విమర్శకులు భావించినారు.

పై శ్లోకములో శేష షష్ఠి, కర్మప్రవచనీయము పాణినీయ సంజ్ఞలు, సుస్ ప్రాకృతీయ సంజ్ఞ, తిజ్మధ్యము చింతామణిదే.

కించిత్, యదాతదా, కిమ్, కిల, తూష్ణీమ్ అనువానికి దెలుగులో పర్యాయ పదములు గ్రహింపబడినవి.

'క్త్వా' భూతకాలికా సమాపక ప్రత్యయము. ఈ యర్థమున దెనుగున ఇ' ప్రత్యయము వచ్చును. కావున లక్షణావృత్తిచే ప్రత్యయము గ్రహింపబడినది.

ప్రశంసనము క్రియ. అద్భుత సంతాపములు భావ వికార విశేషములు. వీనికి గళాత్వము కుదురదు. కళయను సంజ్ఞ చివర ద్రుతము

---

2. సం. ప్ర. వ్యాకరణాలు, పుట 253.
3. అందే.

తెలుగులేని పదములకు బెట్టబడుచున్నది. కావున తద్భావమును వ్యక్తీకరించునపుడు వాడబడు' ఓహో మొ॥ పదములు గ్రహింపబడినవి. కళలను గణములో వేలు వేలు రకములకు జెందిన పదములున్నవని పై పరిశీలనచే వెల్లడియైనది. ఇట్టివానిని గుది గుచ్చుటలో గొంత అస్పష్టత యేర్పడినను, మూలకారుని భావములను వ్యాఖ్యాత గమనింపలేకపోయినను అది క్షంతవ్యమే యగును.

ఒక భాషా వ్యాకరణమును తద్భిన్న భాషలో వ్రాసినచో గర్త ఉద్దేశ్యము వ్యాఖ్యాతలకు దెలియుట కష్టమని యీ విమర్శకులు గూడ గుర్తించిచారు. (1)

పై శ్లోకవ్యాఖ్యలో ప్రశంసనాది పదములకు దెనుగున పర్యాయము నీయక తద్భావవ్యక్తీకరణమున వాడు పదము నిచ్చుటచే దీనిని స్వసంకేతితమనుచు వారే తప్పు బట్టుచున్నారు (2)

“ప్రశంసనము = పొగడిక, అద్భుతము = వింత, సంతాపము= కాక, వేడిమి, నొవ్వు ప్రశంసనాదులకు దెలుగు పర్యాయములివి. ఇవి కళలే. కాని ప్రథమాంతములు. కాన ‘సుస్’ అనుదానిచే వీనికి కళాత్వము సిద్ధించెను.

ఈస్థితిలో శ్లోకమందున్న ప్రశంసనాది పదములకు సార్థక్యమును గల్గించుటకై వ్యాఖ్యాత యత్నింపడా ? అపుడద్భుతాది భావములను వ్యక్తీకరించు పదముల నుదాహరించుటలో నబ్బురమేమి ? ఇంత మాత్రపు వ్యాఖ్య సూత్రకారుడుగాని చేయలేడా? విమర్శకులు స్వసంకేతితాస్త్రముచేత సూత్రకారునసమర్థునిగను, వ్యాఖ్యాతను మోసగానిగనుజేయ జూచుచున్నారు. విభిన్న విషయములను గ్రథిం

---

1. అందే.

2. అందే.

చుటలోని క్లిష్టతను జూచుటలేదు. వ్యాఖ్యాత సమర్థుడైనపుడు సూత్ర కర్త భావములను దెలిసికొనగల్గును. ఒకచో నెఱుగక పోయినను మార్గాంతరమున సమర్థించును. పాణినీయమున ప్రత్యాహార సూత్రములున్నవి. వానిచే 'అక్' వంటి ప్రత్యాహారము లేర్పడినవి. అ ఇ ఉ ణ్ ఋ ఌ క్ అనుచోట అకార కకార ప్రత్యాహారము చే అక్ అను సంజ్ఞ సిద్ధించినది. అక్ = అ ఇ ఉ ఋ ఌ అను వర్ణములు, కాని దీర్ఘాచ్చులకు గూడ ఇట్టి ప్రత్యాహార సంజ్ఞలు వాడబడినవి. 'ల్వాదిభ్యః' అని పాణిని ముని సూత్రము. (1) లూ + ఆదిభ్యః అని పదచ్ఛేదము. ఇచట యణాదేశము రావలెను. దీర్ఘ స్వరమునకు 'అచ్' సంజ్ఞ వర్తించనిచో యణాదేశము రాదు. అణుదిత్సవర్ణస్యచాప్రత్యయః (2) అను సావర్ణ్య విధాయక శాస్త్రము మాహేశ్వర సూత్రములందలి స్వరములచే దీర్ఘాదులు గ్రహింపబడునని చెప్పుచున్నదిగాని ప్రత్యాహార సంజ్ఞలచే దీర్ఘాదులు చెప్పబడునని కాదు. ఈ స్థితిలో లూ + ఆదిభ్యః అనుచోట యణాదేశము వచ్చుటెట్లు?

సూత్రకారుడైన పాణిని మునియందు పుష్కలముగా గౌరవ భావమున్న భట్టోజీ దీక్షితులు "ప్రత్యాహారేషు తద్వాచ్యవాచ్యే నిరూఢా లక్షణా" ప్రత్యాహారవాచ్యములు అ ఇ ఉ మొ॥ వర్ణములు. వీనిచే దీర్ఘాదులు చెప్పబడును. ఇట్లు ప్రత్యాహారములు దీర్ఘాదులను జెప్పుట నిరూఢా లక్షణచే జరుగును(3). అని చెప్పికొని దానికి 'ల్వాదిభ్యః' అను సూత్ర నిర్దేశమును బ్రమాణముగా జూపెను.

ఇట్లే ప్రశంసన పదము ప్రశంసా సూచకములగు బళి మొ॥ వానిని, అద్భుత సంతాప పదములు ఆద్భుత సంతాప సూచకము

---

1. సిద్ధాంతకౌముది 3018 సూ.
2. అందే 14 సూ.

(3) ప్రౌఢమనోరమ, అచ్సంధి ప్రారంభము, బెనారస్ కాశీసాంస్కృత్ సీరీస్ 58, (1984), 67 పు.

లగు ‘ఓహో’ ఇత్యాదులను లక్షణావృత్తిచే దెలుపుచున్నవనియేల చెప్పరాదు?

లక్ష్యార్థము నంగీకరింతుముగాని యాపదమునకు లక్ష్యార్థమిదియని వ్యాఖ్యాతకు దెలియుట అసంభవమందురా? ఇది బుద్ధిదేవత శక్తిని కించపఱచుటయే. మానవ మేధ తన అద్భుతశక్తిచే గని విని యెఱుగని మహా విషయములను గనుగొనుచున్నదే. బాలసరస్వతి మహోపాధ్యాయునికి, త్ర్యర్థి కావ్యమును వ్రాసిన కవి పండితునకు ఇట్టి చిన్న విషయము తోచదందురా? ఇక రవి కాననిచో గని గాంచునన్న కవి సూక్తి యసత్యమనవలెను. అష్టావధాని సమస్యాపూరణము చేయుట అభూత కల్పన అనవలెను. కావున నీ సూత్ర వ్యాఖ్య వ్యాఖ్యాతయే సూత్రకర్త అని నిరూపింపలేదు.

విమర్శకుడు “బళి, మజ్ఝా అనేవి అద్భుతార్థాలు ఎందుకు కాకూడదు” అని యీ సందర్భమున ప్రశ్నించిరి(1). నిఘంటువులలో నా పదముల కద్భుతార్థము కానరాలేదు(2).

“ఏవాన్ + చ” అనేదానికి తెలుగులో నిశ్చయార్థకాలైన ‘ఏ’వంటి శబ్దాలే యర్థమని తెలియడం కేవలం వ్యాఖ్యాతకు అసాధ్యమైనపని” అని విమర్శకుల భావన(3).

పై శ్లోకమున క్త్వాశబ్దము లక్షణావృత్తిచేత ప్రత్యయాంతములను దెలిపినది. అట్టి సంస్కృత నిశ్చయార్థకమయిన ‘ఏవ’ యను దానిచే తెలుగు నిశ్చయార్థకము లయిన ‘ఏ, అ’ అనువానిని గ్రహించుటలో నసాధ్యమేమి యున్నది?

---

(1) సం. ప్ర. వ్యాకరణాలు, 253 పు.

(2) విద్వాన్ ముసునూరి వెంకటశాస్త్రి, తెలుగు నుడికడలి, రాజమండ్రి (1982), ఉత్తరభాగము 173 పుట.

(3) సం. ప్ర. వ్యాకరణాలు పుట 253.

'ఏవ ఆనేది అవ్యయుం - సంస్కృతంలో దాన్ని ఈ తెలుగు వ్యాకర్త అకారాంత పుంలింగం చేసి ద్వితీయాంత బహువచనంగా ఇక్కడ ప్రయోగించాడు. ఇది ప్రప్రథమంగా కర్తకు తప్ప తెలియదు (1). అని వారు భావించినారు.

శబ్దస్వరూపమును దెలుపునపు డవ్యయములకు విభక్తులను జేయుట నూతనమును, దుష్టమును గాదు. పాణిని ముని సూత్రములలోనే యిట్టి ప్రయోగము లనేకమున్నవి(2). సూత్రకర్తకు దప్ప తెలియని క్లిష్టత యిందేమియు గానవచ్చుటలేదు. కావున పై సూత్రవ్యాఖ్య వ్యాఖ్యాతను, మూలగ్రంథకర్తగా నిరూపింపలేదు. ఈ వ్యాఖ్యలో యొక పొరపాటు దొరలి అద్భుతార్థకములలో 'అహో' అని యుదాహరింపబడినది. ఇది సంస్కృతావ్యయము(3). చింతామణి సంస్కృతాది పదములకు కళాద్రుత ప్రకృతిక విభాగము చేయబూనలేదుకదా ! ఇది ప్రామాదికము (4). విమర్శకు లీ సందర్భమున కాసంత అని యుదాహరించుటను విమర్శించుచు "కాసంత ఏకపదం కాదు. కాసు + అంత = కాసంత అని పదద్వయఘటిత రూపం. సుంత కూడ ఇటువంటిదే. ....ఇది పొరపాటో గ్రహపాటో ...." అని అధస్సూచికలో వ్రాసిరి(5).

---

(1) అందే.

(2) "అక్షశలాకా సంఖ్యా పరిణా", సుప్పితినా సూత్రార్థే" సిద్ధాంత కౌముది, 664 సూ.

(3) సూ. ని. 1 సం. 368 పుట.

(4) శబ్దార్థకల్పతరువు 122 పుట.

(5) సం. ప్ర. వ్యాకరణాలు 252 పు.

'కాసంత' అనుదానికి కొంచెమను నర్థము కలదు. అది కళయే. అది ఏకపదమని బాలసరస్వతి చెప్పలేదు. ఏకపదము మాత్రమే కళలలో నుదాహరింపదగినదని చింతామణికారు డనలేదు. కావున తప్పు బట్టనక్కఱలేదు.

బాలసరస్వతి వ్యాఖ్యలో ఘటింపగలడు, చనడు అనువానిని సుప్సులుగా భావించి కళలుగా లెక్కించెను. సుప్ అనునది సు, ఔ, జస్ అనువానికి ప్రత్యాహారము. సుప్సులు నామ విభక్తులు. ఘటింపగలడు, వినడు మొదలగునవి క్రియాపదములు. క్రియా విభక్తులకు తిజ్జులని వ్యవహారము. కావున 'సుప్' ప్రత్యాహారముచే తిజన్తము లనదగిన క్రియాపదములను గ్రహించుట వింతగానుండును, ఇంతకంటె 'ఆద్యాన్' అనుదానిచే వీని గ్రహించుట ఉచితము. బాలసరస్వతియే సూత్రకర్తయైనచో మూల శ్లోకమందలి కళల పట్టికయందే వీనిని గూడ చేర్చి మూలశ్లోకమును సమగ్రముగా జేసియుండును. కాని యిట్లు సర్దుబాటు వ్యాఖ్యను జేసియుండడు. ఈ వ్యాఖ్య బాలసరస్వతి మూలకర్త కాడని నిరూపించుచున్నది.

గ్రంథకారానభిప్రేత వ్యాఖ్య
'వికృతౌ సర్వే శబ్దాః'

చింతామణిలో

వికృతౌ సర్వే శబ్దాః క్లీబసమాః స్త్రీసమాశ్చ నాన్యేస్యుః
క్లీబసమా అమహద్వత్, స్త్రీవత్స్న్యః స్త్రీసమాః సమాస్తు సమాః

అను సూత్రమున్నది. దీనికి బాలసరస్వతి "తెలుగునందు దేశ్య శబ్దము లన్నిటిలో నపుంసక సమములును, స్త్రీ సమములును గలవుగాని, పుంసమములు లేవు. నపుంసక సమములు అమహత్తులై నతత్సమముల వంటివగును. 'మురమహాతాం' అని మువచ్చుననుట

అందము, చందము, గుజ్జము ఇత్యాది స్త్రీసమములు స్త్రీలింగతత్సమముల వంటివగును. హ్రస్వవిభక్తి లోపములగు ననుట. గోడ, మేడ, మోవి, బావి ఇత్యాది. తత్సమములు యథాపూర్వ సమములై యుండును. రాముడు, సీత, రఘు కులము" అని వ్రాసెను. [1]

పై శ్లోకము తెలుగున గల మొత్త మన్నిరకముల శబ్దముల నుద్దేశించుచున్నదనుటకు 'సర్వేశబ్దాః' (అన్ని పదములు) అను దళము ప్రమాణము.

'నాన్యేస్యుః'అనుదానిని 'ఇతరములు లేవు అని నిషేధపరముగా వ్యాఖ్యానించుటచే 'మగడు' ఇత్యాది దేశ్యడువర్ణకాంత శబ్దములు నిరాకరింపబడినట్లగును. ఇట్టి దేశ్య పదములు చింతామణి కర్త కంటబడలేదందుమా ? "ఏకాదేరమహత్తాంచడావున్న" (ఒక మొ॥ వానికి, కత్రళ మొ॥ అమహద్వాచకములకు డువర్ణకము పరముగానున్నపుడు ఉత్వము రాదు)అని 'ఒకడు' వంటి డువర్ణ కాంత దేశ్యశబ్దములు కలవని అతడే సూచించెను. [2] అచ్చట దేశ్య మహద్వాచకములు లేవనుచు నిచట వానిని గూర్చి చెప్పుట స్వవచోవ్యాఘాతముకదా ! దీని మాట అటుండనిండు. తెలుగులో దేశ్యమహద్వాచకములు లేవనుట ఎట్లు కుదురును ?

కావున నిటు బాలసరస్వతి వ్యాఖ్య సముచితముగా లేవనక తప్పదు. అహోబలపతి బాలసరస్వతినే అనుసరించినను పై ప్రశ్నలాతని కుదయించుటచే "నిషేధము దేశీయ పదములకు మాత్రము వర్తించునదగుటచే తద్భవములందు మూడు రకములయిన శబ్దము

---

1. బాలసరస్వతి ప్రతిపదార్థముగా వ్రాసెను. ఇచట భావము గ్రహింపబడెను.

   చూ. బాలస అజంత 22 శ్లో॥వ్యా॥
2. కవిశిరో అజంత 82 సూ.

లుండుట దోషము కాదు. దేశ్యములలో గూడ ఒక్కడు ఇత్యాదులు మహత్సమము లయినప్పటికి నవి ప్రత్యేకముగా విధించిన వగుటచే నవి యుండవచ్చు"నని సమాధానము చెప్పుకొనెను.[1] చింతామణి 'ఒక్కడు' ఇత్యాదులకు డువర్ణకమును,[2] మగువ ఇత్యాదులకు సులోపమును[3] అమహద్వాచకములకు మువర్ణకమును[4] గూడ విధించెను.

కాగా దేశ్యశబ్దములలో మూడు వర్గములకు ఏదో విధాన ముండనే ఉన్నది. ఈ స్థితిలో దేశ్యపదములలో పుంలింగసమములు లేవనుటెట్లు కుదురును ?

ఏకాదులకు డుజ్విధి కలదు కాన తదితరములు లేసను వ్యాఖ్యాతృవచనమెట్లు కుదురును ? చింతామణి ఏకాదులేవో వివరింప లేదు. అవి యేవో తెలియనిదే తదితరము లెట్లు తెలియును ? తెలియనివానికి నిషేధమేమి ? అసలీశ్లోకము విధించు విషయమేమి ? తరువాతి సూత్రములను గూడ పరిశీలింతము.

క్లీబసమా అమహద్వత్ (నపుంసక సమములు అమహత్తులైన తత్సమములవంటివి యగును) స్త్రీవత్స్యుః స్త్రీసమాః (స్త్రీ సమములు స్త్రీలింగ తత్సమముల వంటివగును).

ఇందు దేశ్య స్త్రీ వాచకామహద్వాచకములకు క్రమముగా స్త్రీలింగ నపుంసకలింగ పదతుల్యత్వము విధింపబడినది. అనగా చింతామణి తత్సమ శబ్దములకు తాను విధించిన కార్యములు దేశ్య శబ్దముల

---

1. అందే వ్యాఖ్య.
2. అందే 52 సూ.
3. అందే 80 సూ.
4. అందే 84 సూ.

కతిదేశించు చున్నదని భావము. మఱి యిట్టి అతిదేశము దేశ్యములయిన మహద్వాచకముల కవసరము లేదా? తరువాతి సూత్రము 'సమాస్తు సమాః' అనునది. దీనికి తత్సమములు యథాపూర్వసమములై యుండునని బాలసరస్వతి వివరణము.[1] 'రాముడు, సీత, రఘుకులము' దీనికుదాహరణములు.

దీని వలన తెలియు విశేషమేమి? ఈ సూత్రము లేనిచో నష్టమేమి? అహోబలపతి దీనికి 'సమములు ప్రకృతి ద్వయ తుల్యములగుచున్న' వని వ్రాసెను.[2] ఈ యర్థము నంగీకరించినచో తుల్యాతు సమా' సంస్కృత ప్రాకృత తుల్యమయినది సమము[3] అనుదానికిది పునరుక్తముకాదా? పై రెండు సూత్రములలో అతిదేశము కన్పట్టుచున్నది.

ఈ సూత్రమున నది యేమైనది? ఇచ్చట తత్సమములకు యథాపూర్వసమత్వమును విధించు సందర్భమేమి వచ్చినది? దానిచే గల్గు ప్రయోజనమేమి? వికృతౌ = తెనుగునందు, సర్వేశబ్దాః = అన్ని శబ్దములు, క్లీబసమాః = నపుంసక లింగతుల్యములు, స్త్రీసమాః = స్త్రీలింగ తుల్యములు, అన్యే = ఇతరములయినవి, నా = పుంలింగ (సమములు), స్యుః = అగును.

ఇట్లీ సూత్రమున కర్థమును చెప్పుటచే సర్వేశబ్దాః (అన్ని శబ్దములు) అను దళము సార్థకమగును. 'అన్యేనాస్యుః' (ఇతరములు లేవు) అను నిరర్థక నిషేధము తొలగును. డు వర్ణకాంత దేశ్య శబ్దములగు మగాది శబ్దములను సూత్రకారుడు గ్రహించినట్లే అగును. ఈ రీతిచే 'సమాస్తు సమాః' అను సూత్రము వ్యర్థమగుటలేదు.

---

1. ప. బాలస అజన్త 22 శ్లో. వ్యాఖ్య.
2. కవిశిరో. అజంత 85 సూ. వ్యాఖ్య.
3. అంధే సంజ్ఞ 42 సూ.

పునరుక్తి గూడ కలుగుటలేదు. పుంలింగ సమములు సంస్కృత సమములవలె కార్యముల నందునని దీని భావమును చెప్పుకొనవచ్చును. మఱి నా అను దానికి పుంలింగమను నర్థము ప్రచారములో కలదా ? అని ప్రశ్న. 'నిధిర్నా శేవధిః' అని అమరుడు 'నా' పదమును పుంలింగ పర్యాయముగా వాడెను[1] చింతామణిపై త్రివిక్రమ ప్రాకృత వ్యాకరణ ప్రభావము బాగుగానున్నది. అందు నృశబ్దము పుంలింగ సంకేతము. దానికి ప్రథమైకవచనము 'నా' అనునది.[2] తరువాతి వైయాకరణులు గూడ ఈ సంజ్ఞను గ్రహించిరి.[3] కావున నాశబ్దమునకు పుంలింగమను నర్థమును జెప్పుట కభ్యంతరము లేదు. ఇచట పూర్వ సూత్రములలో నున్న 'సమ' శబ్ద సందర్భమును బట్టి పుంలింగ సమములను నర్థమును జెప్పుకొనుటలో ననౌచిత్యము లేదు. ఇంతకు నీశ్లోకమునకు సరియగు వ్యాఖ్య వ్రాయనందున బాల సరస్వతి చింతామణికి కర్తయగుట అసంభవము.

చింతామణి ప్రసిద్ధ గ్రామ్యము నంగీకరించునా ?

కొన్ని చింతామణి సూత్రముల కర్థ వివరణము చేయుటలో వ్యాఖ్యాతలయం దభిప్రాయ భేదములున్నవి.

"విరళాన్ పేచో పాదిక శబ్దాన్, ప్రవ్యాహరన్తు శబ్ద జ్ఞాః ఇహతు ప్రవ్యాహార్యం సంకేతిత సుప్రసిద్ధ మేవపదమ్" ఈశ్లోకమున

---

1. అమరుడు అమరకోశము, చెన్నపురి : వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్ (1938), 1 కాల, స్వర్గ 71 శ్లో.
2. 'నృనపి జ సి జ సోః' పుంలిఙ్గే నపుంసకలిఙ్గే వర్తమానా దిదుతః పరయోః జ సి జ సోః ణో ఇత్యాదేశోభవతి ప్రాకృత శబ్దానుశాసనము 2-2-27 సూ.
3. 'నృనప్ ఇత్యేతౌ పుంనపుంసక వాచకౌ' మంచెళ్ళ వాసుదేవ కవి, వైకృత చంద్రిక సంజ్ఞ 18 సూ.

కర్థమును నిర్ణయించుటలో బాలసరస్వతికి నహోబలపతికి నభిప్రాయ భేదములున్నవి. అం దెవరి అభిప్రాయము సముచితమో పరిశీలింపవలెను.

'శాబ్దికు లప్రసిద్ధములయిన పేచ, ఊష శబ్దములను బ్రయోగింతురు గాక. ఇందయిన (ఈ తెలుగుననయిన) కవిసమయసిద్ధమై సుప్రసిద్ధమైనటువంటి పదమే ప్రయోగింపదగును' ......ఇట్లన్నందుచేతం బ్రయోగ సిద్ధమయినదైన గ్రామ్యమయినను యోగ్యమేయని వాగనుశాసనులు వివక్షించినారు) అని బాలసరస్వతి వ్యాఖ్య.[1]

'శబ్దశాస్త్రవేత్తలు లోకమున అప్రసిద్ధమయిన పేచ, ఊష మొ॥ శబ్దములను ఒకచో సంస్కృత భాషా కావ్యములందు ప్రయోగింతురు గాక. ఈ తెనుగున సంకేతిత సుప్రసిద్ధ పదమునే ప్రయోగింపవలెను. ఇచట తాత్పర్యమిది. .... అసంకేతితము, అప్రసిద్ధము నైన పదమును వాడరాదు. వివక్షితార్థమును బ్రతిపాదించు ప్రసిద్ధపదమునే ఇచట (తెలుగున) వాడవలెనని మావట్టు. సూత్రమున నిశ్చయార్థమును దెల్పు "ఏవకారముచే అసంకేతితాప్రసిద్ధనము, ప్రయోగ నిషేధము,' ప్రవ్యాహార్యమ్' అనుచోట విధి రూపకృత్య ప్రత్యయముచే తప్పక ప్రయోగించవలె ననుట సూచితములు"[2] అని దీని కహోబలపతి వ్యాఖ్య.

ఇట అహోబలపతి శ్లోకమును యథాతథముగా వివరించినందున నిచట చెప్పవలసినది లేదు. బాలసరస్వతి సుప్రసిద్ధ పదమును వాడుమను చింతామణిని ప్రసిద్ధమయినచో గ్రామ్యము గూడ వాడుకొనవచ్చునని వ్యాఖ్యానించుచున్నాడు. శ్లోకములో గ్రామ్య పద ప్రసక్తి లేదు.

---

[1] ప. బాలస సంజ్ఞ 10 శ్లో.

[2] కవిశిరో. సంజ్ఞ 43 సూ. వ్యాఖ్య.

చింతామణి "సంస్కారార్థో నియమః, అనియమాద్గ్రామ్యంహి, యత్త్వపభ్రంశః" (నియమించుట సంస్కారము కొఱకు, నియమము లేనిచో గ్రామ్యమగును. ఏది గ్రామ్యమో అది అపభ్రంశమనిపించుకొనును) [1] అని తెలుగుభాషకు గ్రామ్యత్వము, అపభ్రంశత్వము నంటకుండుటకై లక్షణముచే సంస్కరించినది. ఇట్టి చింతామణి ప్రసిద్ధగ్రామ్యము నంగీకరించెనని చెప్పుటకు దగిన ప్రమాణమును జూపవలెను. అట్లు చూపనందున ప్రసిద్ధగ్రామ్యమును వాడవచ్చుననునది బాలసరస్వత్యభిప్రాయమే కాని, చింతామణి అభిప్రాయమని చెప్పుటకు వీలు లేదు.

బాలసరస్వతియే చింతామణి కర్త అయినచో సూత్రమునందే ప్రసిద్ధగ్రామ్యమును వాడవచ్చునని సూత్రించి యుండవలెను.

ప్రాకృత భవాది సూత్రములు

బాలసరస్వతి సరిగా వ్యాఖ్యానింపని దానిలో ప్రాకృత భవ సూత్రమొకటి. దీనికి వావిళ్ళ వారి బాలసరస్వతీయ ప్రతిలో నున్న వ్యాఖ్య యిది.

ప్రాకృతభవ సంస్కృతభవ సంస్కృతవత్ ప్రాకృత భవ వికృతి భవాః

"ప్రాకృతము వలనను కేవలాంధ్రభాష వలనను బుట్టినటువంటి శబ్దములు ప్రాకృత దేశభాషాభవముల వంటివియు, సంస్కృత భవ ప్రాకృతముల వంటివియు నగును." [2]

ఇచట కేవలాంధ్రభాషవలన పుట్టుట యననేమి? ప్రాకృతాంధ్ర శబ్దములకు ఏ విషయమున ప్రాకృత దేశ్య సంస్కృతభవ ప్రాకృతములతో పోలిక చెప్పబడుచున్నది? సూత్రములోని సంస్కృత

---

[1] ప. బాలస. సంజ్ఞ 2శ్లో.

[2] బాలస. హలంత వావిళ్ళప్రతి 11 సూ.

వత్’ అను పదమేల విడువబడెను ? ఈ ప్రశ్నలకు సమాధానములు లేవు. కావున నీ టీక అసంగతముగా నున్నది.

ఈ శ్లోకము కొన్ని మాతృకలలో లేదు. ప. బాలసరస్వతీయ ప్రతిలో “నీ ఆర్యావృత్తము సంప్రదాయ శేద్యము”అని వ్రాయబడి ఉన్నది.[1] కొన్ని మాతృకలలో హలంత పరిచ్ఛేదము పూర్తియైన పిదప, కొన్నిటిలో అజంత పరిచ్ఛేదాంతమున వ్రాయబడినది.

తాళపత్ర ప్రతులలో ఈశ్లోకటీక ఇట్లున్నది. “ప్రాకృతభవ సంస్కృతభవ సంస్కృతవత్ = ప్రాకృతమందు పుట్టినషువంటిన్ని, సంస్కృతమందు పుట్టిన వలెనెవె? ప్రాకృతభవ = ప్రాకృతమందు పుట్టినషువంటిన్ని సూరసేని మాగధ పైశాచిక చూళిక అపభ్రంశలు మొదలయిన భాషలయందు పుట్టిన శబ్దములవును. ఆ శబ్దములు వ్యతిరిక్తాః = ప్రసిద్ధములైనవి, అవ్యతిరిక్తాః = అప్రసిద్ధములైనవి, భూయాంసః=తఱచుగా, సంప్రదాయతః = మహాకవిముఖోదితాలాట బట్టి గ్రహించ్చిది” (?) [2]

వ్యతిరిక్త పదమునకు ప్రసిద్ధములైనవి అనునర్థము కానరాలేదు.[3] పైవ్యాఖ్యకు సారమిట్లు గ్రహింపవచ్చును. ‘ప్రాకృత భేదములయిన శౌరసీని మొదలగు వానిలోగల శబ్దములు ప్రాకృత భేదముల వలె, సంస్కృత భవములవలె సంస్కృతములవలె ఉండును’ అని. కాని శౌరసేన్యాది ప్రాకృతములకు ఏ విషయమున ప్రాకృత భనాదులతో పోలిక చెప్పబడినదో తెలియుట లేదు.

---

1. ప. బాలస. హలంత 4 శ్లో,
2. కళాప్రపూర్ణ వఝుల చినసీతారామశాస్త్రిగారు, బాలస. పీఠిక 44 పుట.
3. శ్రీ మామిడి వెంకటార్యులు, శబ్దార్థకల్పతరువు 1317 పుట.

ఇచట శౌరసేన్యాది ప్రాకృతము లయిదు పేర్కొనబడినవి. అవి ప్రాకృతములే కదా ! ఏ ప్రాకృతమందలి శబ్దములకు శౌరసేన్యాది ప్రాకృత శబ్దములతో పోలిక చెప్పబడినదో ఇచట తెలియుటలేదు. కావున నీవ్యాఖ్య శ్లోకోద్దేశమును వెల్లడి చేయుట లేదు.

ఈ శ్లోకమున పూర్వార్ధమునకు అహోబలపతి వ్యాఖ్య కొంత ఉచితముగా నున్నది.

అతడు "తెలుగున చేరిన ప్రాకృత శబ్దములు ప్రాకృత దేశ్యములవలె, ప్రాకృతస్థ సంస్కృత భేనములవలె, ప్రాకృతస్థ సంస్కృత సమములవలె" నుండునని యర్థ వివరణము చేసి "ప్రాకృత భవ వికృతియందు (తెలుగున చేరిన ప్రాకృత శబ్దముల యందు) ప్రాకృత భాషకు చెందిన త్రివిధ శబ్దములు (తత్సమ తద్భవ దేశ్యములు) ప్రవేశించునని ఫలితార్థమును వ్రాసినాడు [1]

వావిళ్ళ బాలసరస్వతీయము చెప్పిన అర్థమునకంటె నిందు స్పష్టత ఉన్నది. కాని అర్థ వివరణమునకు,ఫలితార్థమునకు సంబంధము కానరాదు. అర్థము తెలుగునగల ప్రాకృత శబ్దములకు ప్రాకృతమున గల త్రివిధ పదజాలముతో పోలిక చెప్పుచుండెను. ఫలితార్థమున తెలుగునగల ప్రాకృత శబ్దములలో త్రివిధ ప్రాకృత పదజాలము గలదని చెప్పబడెను. అర్థమునకు, సారాంశమునకు సంబంధము వలదా!

మఱియు "ఆద్యప్రకృతిః ప్రకృతిశ్చాద్యే ఏషాతయోర్భవేద్వికృతిః"(సంస్కృతము ప్రాకృతము తెలుగునకు ప్రకృతులు. ఇది దానికి వికృతి యగును.) [2] "తజ్జా సమాచ దేశ్యా(గ్రామ్యా

---

1. కవిశిరో°, హలన్త, 11 సూ. వ్యాఖ్య.
2. కవిశిరో°, సంజ్ఞ 11 సూ.

చేయం చతుర్విధాభవతి, ప్రకృతి ద్వయజాతజ్జా తుల్యాతు సమా” (తెలుగు తజ్జ, సమ, దేశ్య, గ్రామ్య అని నాల్గు విధములు,సంస్కృత ప్రాకృతముల నుండి పుట్టినది తజ్జ, సంస్కృత ప్రాకృత తుల్యసమ).

అను సూత్రములచేత ప్రాకృత పదజాలమునకు తెలుగులో ప్రవేశము తెలుపబడినది.[1] ఈ శ్లోకము మరల ఏమిచెప్ప యత్నించినది ? ప్రాకృతమునగల త్రివిధ పదజాలము తెలుగున ప్రవేశించునని స్పష్టతకై చెప్ప యత్నించిన దందుమా ? ఆ శ్లోకములోగల అస్పష్టతయే వ్యాఖ్యాతల నయోమయములో పడవేసినది కదా ?

ఇచట పరిశీలింపదగిన విషయమున్నది. ‘సంస్కృతవత్’ అను చోట వతి ప్రత్యయమున్నది. ఆ ప్రత్యయమును విధించినది “తేన తుల్యం క్రియాచేద్వతిః” అను సూత్రము.[2] క్రియాతుల్యతను చెప్పునపుడు మాత్రమే యీ వతి ప్రత్యయము వచ్చును. క్రియేతర తుల్యతయం దిది ప్రవర్తించదు.

ఇచట బాలసరస్వతిగాని, అహోబలపతిగాని శబ్దతుల్యతను తెలిపిరేకాని, క్రియాతుల్యతను తెలుపుటలేదు. కావున నీ యర్థము సరికాదు.

పోనీ “తత్ర తస్యేవ” అను తరువాతి సూత్రముచే సప్తమ్యర్థమున తుల్యార్థమునందు వతి ప్రత్యయమును ప్రవర్తింప జేయుదుమా అనినచో నదియు కుదురదు. సప్తమ్యర్థములో ‘మథురాయామివ స్రుఘ్నే ప్రాకారః” అను రూపమేర్పడును.[3] ప్రాకృత భవేత్యాది

---

1. కవిశిరో, సంజ్ఞ 42 సూ.
2. క్రియా చేదితి కిమ్ ? గుణ తుల్యేమాభూత్.
   సిద్ధాంత కౌముది - తద్ధిత 1778 సూత్రవృత్తి.
3. సిద్ధాంతకౌముది-తద్ధిత 1779 సూ.

ఇచట శౌరసేన్యాది ప్రాకృతము లయిదు పేర్కొనబడినవి. అవి ప్రాకృతములే కదా! ఏ ప్రాకృతమందలి శబ్దములకు శౌరసేన్యాది ప్రాకృత శబ్దములతో పోలిక చెప్పబడినదో ఇచట తెలియుటలేదు. కావున నీవ్యాఖ్య శ్లోకోద్దేశమును వెల్లడి చేయుట లేదు.

ఈ శ్లోకమున పూర్వార్థమునకు అహోబలపతి వ్యాఖ్య కొంత ఉచితముగా నున్నది.

అతడు "తెలుగున చేరిన ప్రాకృత శబ్దములు ప్రాకృత దేశ్యములవలె, ప్రాకృతస్థ సంస్కృత భవములవలె, ప్రాకృతస్థ సంస్కృత సమములవలె" నుండునని యర్థ వివరణము చేసి "ప్రాకృత భవ వికృతియందు (తెలుగున చేరిన ప్రాకృత శబ్దముల యందు) ప్రాకృత భాషకు చెందిన త్రివిధ శబ్దములు (తత్సమ తద్భవ దేశ్యములు) ప్రవేశించునని ఫలితార్థమును వ్రాసినాడు[1]

వావిళ్ళ బాలసరస్వతీయము చెప్పిన అర్థమునకంటె నిందు స్పష్టత ఉన్నది. కాని అర్థ వివరణమునకు,ఫలితార్థమునకు సంబంధము కానరాదు. అర్థము తెలుగునగల ప్రాకృత శబ్దములకు ప్రాకృతమున గల త్రివిధ పదజాలముతో పోలిక చెప్పుచుండెను. ఫలితార్థమున తెలుగునగల ప్రాకృత శబ్దములలో త్రివిధ ప్రాకృత పదజాలము గలదని చెప్పబడెను. అర్థమునకు, సారాంశమునకు సంబంధము వలదా!

మఱియు "ఆద్యప్రకృతిః ప్రకృతిశ్చాద్యే ఏషాతయోర్భవేద్వికృతిః"(సంస్కృతము ప్రాకృతము తెలుగునకు ప్రకృతులు. ఇది దానికి వికృతి యగును.)[2] "తజ్జా సమాచ దేశ్యాగ్రామ్యా

---

[1] కవిశిరో, హలన్త, 11 సూ. వ్యాఖ్య.

[2] కవిశిరో, సంజ్ఞ 11 సూ.

చేయం చతుర్విధాభవతి, ప్రకృతి ద్వయజాతజ్జా తుల్యాతు సమా” (తెలుగు తజ్జ, సమ, దేశ్య, గ్రామ్య అని నాల్గు విధములు, సంస్కృత ప్రాకృతముల నుండి పుట్టినది తజ్జ, సంస్కృత ప్రాకృత తుల్యసమ).

అను సూత్రములచేత ప్రాకృత పదజాలమునకు తెలుగులో ప్రవేశము తెలుపబడినది. [1] ఈ శ్లోకము మరల ఏమిచెప్ప యత్నించినది ? ప్రాకృతమునగల త్రివిధ పదజాలము తెలుగున ప్రవేశించునని స్పష్టతకై చెప్ప యత్నించిన దందుమా ? ఆ శ్లోకములోగల అస్పష్టతయే వ్యాఖ్యాతల నయోమయములో పడవేసినది కదా ?

ఇచట పరిశీలింపదగిన విషయమున్నది. ‘సంస్కృతవత్’ అను చోట వతి ప్రత్యయమున్నది. ఆ ప్రత్యయమును విధించినది “తేన తుల్యం క్రియాచేద్వతిః” అను సూత్రము. [2] క్రియాతుల్యతను చెప్పునపుడు మాత్రమే యీ వతి ప్రత్యయము వచ్చును. క్రియేతర తుల్యతయం దిది ప్రవర్తించదు.

ఇచట బాలసరస్వతిగాని, అహోబలపతిగాని శబ్దతుల్యతను తెలిపిరేకాని, క్రియాతుల్యతను తెలుపుటలేదు. కావున నీ యర్థము సరికాదు.

పోనీ “తత్ర తస్యేవ” అను తరువాతి సూత్రముచే సప్తమ్యర్థమున తుల్యార్థమునందు వతి ప్రత్యయమును ప్రవర్తింప జేయుదమా అనినచో నదియు కుదురదు. సప్తమ్యర్థములో ‘మధురాయామివ స్రుఘ్నప్రాకారః” అను రూపమేర్పడును. [3] ప్రాకృత భవేత్యాది

---

[1] కవిశిరో, సంజ్ఞ 42 సూ.

[2] క్రియా చేదితి కిమ్ ? గుణ తుల్యేమాభూత్.
సిద్ధాంత కౌముది - తద్ధిత 1778 సూత్రవృత్తి.

[3] సిద్ధాంతకౌముది-తద్ధిత 1779 సూ.

శ్లోకమున చివర "ప్రాకృత భవ వికృతి భవే" అని యున్నపుడు తప్ప 'తత్రతస్యైవ' అను సూత్రమును అచట వర్తింప చేయుట కుదురదు. కావున ప్రాకృత భవేత్యాది శ్లోక పూర్వార్ధమున కిట్లర్థమును చెప్ప వలయును.

ప్రాకృత భవ వికృతి భవాః = ప్రాకృత భవములు, వికృతి భవములు అయిన శబ్దములు(అనగా ప్రాకృతమున నుండి తెలుగునకు వచ్చిన శబ్దములు) ప్రాకృత భవ = ప్రాకృతమందున్న, సంస్కృత భవ = సంస్కృత భవముల వలె సంస్కృతవత్ = సంస్కృత పదముల (సంస్కృత సమము) వలె వ్యాకరణ కార్యముల నందును. ఇచట క్రియా తుల్యత చెప్పబడుటచే పాణినీయ వైరుధ్యము తొలగినది. సూత్రమున వాచనికముగా లేని వ్యాకరణ కార్యతుల్యత నధ్యాహారము చేయుటకు ప్రమాణ మేమియని ప్రశ్నింపవచ్చును.

క్రియాతుల్యతలో మాత్రమే వతి ప్రత్యయము వచ్చుట అనునదొక ప్రబల ప్రమాణము. ఇంతకుముందు చింతామణికారుడు 'వతి' ప్రత్యయమును ప్రయోగించిన ప్రదేశములందు వ్యాకరణ కార్యతుల్యతను విధించినట్లు చెప్పుటకు అవకాశముండుట రెండవ కారణము.

ఇతడు వతి ప్రత్యయమును ప్రయోగించిన ఇతర ప్రదేశములివి:

సర్వత్రో దోతోర్వ్యర్భవతి మువత్ [1] ఈనంతా ఇద్వదేవ కృత హ్రస్వాః [2] స్త్రీవద్గ్లా: [3] క్లీబసమా అమహద్వత్ [4]

---

1. బాలస. అజంత వావిళ్ళప్రతి 44 సూ.
2. అందే 41 సూ.
3. అందే 65 సూ.
4. బాలస, అజంత 84 సూ.

స్త్రీవత్ స్యుః స్త్రీసమాః[1] భూయ ఉభయార్థ వాచీ..... ప్రాగ్వత్ ...[2] కర్మాదేః కర్తృత్వం ప్రథమాచన వర్ణకశ్చ తద్వత్ స్యాత్[3] పరేషాంతు ధర్మోత్తమ మధ్యమవత్[4] బహుషు నమధ్యమవత్[5] కార్యా ఔప విభక్తికవదంత విధయశ్చ[6] కర్తృవచ్చ తద్విధయః[7] ఈ సూత్రములన్నిటిలో వ్యాకరణ క్రియాతుల్యత చెప్పుట కుదురుచున్నందున ఆ అర్థమునే చెప్పుట సముచితము.

పై తీరున ప్రాకృత భన సూత్రమున వ్యాకరణ కార్యతుల్యత చెప్పినందువలన సూత్రమున కొక ప్రయోజనము సిద్ధించినది.

సంస్కృత వ్యాకరణముచే సంస్కృత వ్యాకరణ ప్రయోగములు సాధింపబడును. అవి తత్సమములగు పద్ధతిని తెలుగు వ్యాకరణము సాధించును. ప్రాకృతమున గల తత్సమ తద్భవములు గూడ తెలుగులోనికి వచ్చుచున్నవి: వానిని సాధించుకొనుట ఎట్లు? చింతామణి సంస్కృత పదములకు సంస్కృత నామక్రియా విభక్తులను విధించి వానికి తెనుగు ప్రత్యయములను విధించుకొన్నది.

ప్రాకృతమున సంస్కృత తద్భవముల స్వాది విభక్తులకు ప్రాకృత విభక్తులను విధించుకొనిరి.[8] తిఙ్ఙులకు ప్రాకృత క్రియా

---

1. బాలస. అజంత 85 సూ.
2. అందే హలంత 18 సూ.
3. అందే 27 సూ.
4. 5, అందే 33, 34 సూ.
6. అందే 40 సూ.
7. బాలస, క్రియ వావిళ్ళ ప్రతి 42 సూ.
8. వరరుచి ప్రాకృత ప్రకాశము 5 పరిచ్ఛేదము, వారణాసి: చౌఖాంబా సంస్కృత సీరీస్ (1920).

విభక్తులను విధించుకొనిరి.[1] ఆ ప్రాకృత శబ్దములను తెలుగులోనికి తెచ్చుకొనుటకు చింతామణి ఏమియు ప్రత్యేక మార్గము నవలంబింపలేదు. కావున వానిని సాధించి తెలుగులో ప్రయోగించుకొనుట ఎట్లు? ఈ ప్రశ్న కీ శ్లోకము సమాధనము చెప్పును.

తెలుగులో చేరిన ప్రాకృత తత్సమములు, ప్రాకృత తద్భవములు ప్రాకృత తత్సమముల వలె ప్రాకృత తద్భవముల వలె వ్యాకరణ కార్యములను పొందును అని. ప్రాకృతమును తద్భవము, తత్సమము దేశి అని మూడు విధములుగా పండితులు విభజింతురు.[2]

అందు తద్భవమునే ప్రాకృత వైయాకరణులు వ్యాకరించిరి. దేశ్య పదములను వారు వ్యాకరించుటకు పూనుకొనలేదు. సంస్కృత సమ ప్రాకృత శబ్దముల లక్షణము సంస్కృత లక్షణముచే తెలియదగినదని వారు తలంచిరి.[3] కాని అటనట సూత్రములందు ఆది పదముచే దేశ్య శబ్దములను గ్రహించవలెనని వ్యాఖ్యాతలు మాత్రము సూచించిరి.[4] కాన ప్రాకృత వైయాకరణులు ప్రాకృత దేశ్యములను సమగ్రముగా సాధించలేదని తెలియుచున్నది.

ప్రాకృత తత్సమములను ప్రాకృత భాషాజ్ఞులవలె సంస్కృత వ్యాకరణముచేత సాధించుకొనవలెను. ప్రాకృత తద్భవములను

---

1. అందే 7వ పరిచ్ఛేదము చౌఖాంబా సంస్కృత సీరీస్ (1920).
2. 'తద్భవ స్తత్సమో దేశీ త్యనేకః ప్రాకృత క్రమః' పర్వతీయ ఉదయరామ డవరాల్, ప్రాకృత ప్రకాశ ప్రాస్తావికం విక్రమ సం (1971) 5 పు.
3. “తద్భవ ప్రాకృతస్య” తస్యలక్షణమ్. న దేశ్యస్య. సంస్కృత సమ లక్షణంతు సంస్కృతేనైవ గతార్థమ్, అందే
4. అందే 4వ పరిచ్ఛేదము 83 సూత్రవ్యాఖ్య.

ప్రాకృత వ్యాకరణములచే సాధించుకోవలెను అని చింతామణి శ్లోక పాదమునకు సారాంశమగును.

ఇక ఉత్తరార్ధమును పరిశీలించవలెను. 'వ్యతిరిక్తా భూయాంసః వ్యతిరిక్తా స్సంప్రదాయతో వేద్యాః' దీనికి బాలసరస్వతీయము వ్రాసిన ప్రసిద్ధము అనునర్థము నిఘంటువులలో లేదని పూర్వ మనుకొంటిమి. అహోబలపతి "వ్యతిరిక్తాః = వర్ణలోపాగమముల చేత ఈషద్వికృతములుగా నుండుటచేత భిన్నములయిన సంస్కృతభవ ప్రాకృతములు, భూయాంసః = అపరిమితముగా నున్నవి. వ్యతిరిక్తాః = ఇవిగాక తక్కిన సంస్కృత భవములును దేశ్యములును లింగవచన భేదాది విశేషములును, సంప్రదాయతో వేద్యాః = సంప్రదాయమువలన నెఱుగదగినవి అను నర్థమును వివరించెను.[1] ఇదియే వావిళ్ళ ప్రతి బాలసరస్వతీయమున గూడ కలదు.[2]

ఈ యర్థమున కొన్ని లోపములున్నవి.

1. వ్యతిరిక్తపదము సాపేక్షము. దానికి 'భిన్నము' అని యర్థము.[3] పూర్వార్ధమున జెప్పబడిన త్రివిధ ప్రాకృత పదజాలము కంటె భిన్నమయిన పదజాల మిట చెప్పబడవలసియున్నది. కాని యహోబలపతి పూర్వార్ధమున నున్న సంస్కృతభవ ప్రాకృతములను వ్యతిరిక్త పదముచే జెప్పుచున్నాడు. ఇది యయుక్తము.

2. ఇట సంస్కృత భవ ప్రాకృత పదము లపరిమితముగా నున్నవను నర్థమును వ్యాఖ్యాత వ్రాసెను. ఇవి వేని కంటె అపరి

---

[1] కవిశిరో°. హలంత 13 సూ 11.
[2] బాలస. హలంత వావిళ్ళ ప్రతి, 11 శ్లో. వ్యాఖ్య.
[3] శబ్దార్థకల్పతరువు 1316 పు.

మితములు ? అపారమయిన సంస్కృత శబ్దరాశిని దత్సమముగా జేయుటకు వీలున్నది. కాన తత్సమ పదరాశి యపరిమిత మనవచ్చును.

ప్రాకృత వ్యాకరణము సాధించనిది దేశ్యపదరాశి. ఈ పదముల సంఖ్య అల్పము కాదను భావముతో 'వ్యతిరిక్తా భూయాంసః' అని చెప్పియుండవచ్చును. కాని ప్రాకృత వ్యాకరణముచే సాధింపబడి పరిమితముగా నున్న సంస్కృత భవ ప్రాకృత పదము లపరిమితములని చెప్పుటెందులకు ?

3. "ప్రాకృత భవ .... భూయాంసః" అను మూడు వంతుల శ్లోక భాగము ప్రాకృతము నుండి తెలుగునకు వచ్చిన పదజాలమును గూర్చి చెప్పినది. చివరిభాగము ప్రాకృత సంబంధము లేని సంస్కృతభవములను, దేశ్యములను, లింగ వచన విశేషములను గూర్చి చెప్పుచున్నదని యితని వ్యాఖ్య. ఇది ప్రకరణ విరుద్ధము. దీనికి ముందు, తరువాత సంస్కృతభవముల ప్రసంగములేదు.

4. కొన్ని దేశ్య పదములను చింతామణి సాధించినది. మఱికొన్నిటి నతిదేశ విధిచే సాధించినది. కావున వీనిని, కేవలము సంప్రదాయవేద్యములని చెప్పనక్కరలేదు. పెక్కు వ్యాకరణములు దేశ్యపద విశేషములను బెక్కింటిని చెప్పినవి.[1] కావున నీయర్థము గ్రంథకృదభిప్రేతమని చెప్పుటకు వీలులేదు.

ఈ శ్లోకమున రెండు వ్యతిరిక్తపదములున్నవి. ఈ వ్యతిరిక్త పదమున కీయర్థము చెప్పవలెనను విషయము సూత్రమున సూచనామాత్రముగా నైన కానరాదు. శ్లోక రచనా క్రమమును బరిశీలించినచో పూర్వార్ధమున చెప్పబడిన వానికంటె భిన్నములు ఉత్తరార్ధ

---

[1] కేతన ఆం. భా. భూ, 169, 171, 172 ప. మొదలగునవి.
పెద్దన కావ్యా చూ. 9 ఉ. మొ 11 వి.

ముచే చెప్పబడినట్లు తెలియును. అనగా తత్సమ తద్భవ ప్రాకృతముల కంటె ఇతరములగు దేశ్య ప్రాకృతములు అను నర్థము సిద్ధించును. ఇవి అధికముగా నుండుట, సంప్రదాయ వేద్యము లగుట నిజమే కదా ! [1]

మొదటి వ్యతిరిక్త పదముచేత ప్రాకృత దేశ్యములను పేర్కొనవలెను. త్రివిధ ప్రాకృత శబ్దజాలములో తత్సమ తద్భవముల కంటే ఇతరమైనవవియే. అవి సంప్రదాయ వేద్యములని "వ్యతిరిక్తా స్సంప్రద్రాయతో వేద్యాః" అను తరువాతి సూత్రము చెప్పిన దనుటలో ఔచిత్యము కలదు.

ఈ శ్లోకము బాలసరస్వతికి సరిగ నర్థము కాలేదని ఇతర పరిశోధకులు గూడ తెల్పియున్నారు. ఈ పరిశోధకులు చెప్పిన అర్థమిది :

ప్రాకృతభవ వికృతిభవాః = ప్రాకృత భాషా మూలమున దెనుగులోనికి వచ్చిన శబ్దములు, ప్రాకృతభవ సంస్కృతభవ సంస్కృత వత్ = ప్రాకృత దేశ్యములు, సంస్కృతభవ ప్రాకృత శబ్దములు, సంస్కృత సమ ప్రాకృత శబ్దములు అని మూడు విధములుగా నుండును. వ్యతిరిక్తాః = ప్రాకృత భాషనుండి వచ్చిన వానికి భిన్నములగు నాంధ్రశబ్దములు, భూయాంసః = పెక్కుగలవు. ప్రాకృత భాషలోనికి రాకయే తెలుగులోనికి ప్రత్యేకముగా వచ్చు సంస్కృత భవ శబ్దములును నాంధ్రదేశ్యములు ననునవి యీ వ్యతిరిక్త కోటిలోనివని యెఱుంగునది. వ్యతిరిక్తాస్సంప్రదాయతో వేద్యాః = వ్యతిరిక్తకోటిలోని శబ్దములు లోక వ్యవహార మాత్రవేద్యములు [2].

---

[1] కవిశిరో. హలంత 12, 13 సూ.

[2] 'కళాప్రపూర్ణ' వఝలచిన సీతారామస్వామిశాస్త్రి బాలస. పీఠిక, వావిళ్ళప్రతి 46, 47 పుటలు.

వీరు పూర్వార్ధమునకు అహోబలపతి త్రొక్కినదారినే త్రొక్కి ఉత్తరార్ధమందలి మొదటి సూత్రమైన “వ్యతిరిక్తా భూయాంసః” అను దానికి మాత్రము సంస్కృతభవములు, ఆంధ్రదేశ్యములు అను నర్థము చెప్పియున్నారు [1]. ఇది వీరు చెప్పిన విశేషము. వీరు అహోబలపతి చెప్పిన లిఙ్గాది విశేషములను వదలిరి. “వ్యతిరిక్తా స్సంప్రదాయతో వేద్యాః” అను సూత్రమున కహోబలపతి ననుసరించిరి.

వీరి యర్థము నంగీకరించినచో క్రింది దోషములు కలుగును :

1. పై పాదములో నుపక్రమించిన త్రివిధ ప్రాకృత పదజాలమునకు సంబంధింపని సంస్కృతభవాంధ్రదేశ్యముల విషయ ముత్తర పాదములో గ్రహించుట.

2. చింతామణి అతిదేశ విధిద్వారమున, ప్రత్యేకముగను సాధించిన దేశ్య పదములను సంప్రదాయ వేద్యము లనినదని యంగీకరింపవలసి వచ్చుట.

3. “ప్రాకృతభవ” ఇత్యాది పూర్వార్ధమున వతి ప్రత్యయమునకు పాణినీయ విరుద్ధముగా నర్థమును జెప్పుట.

4. సంప్రదాయ వేద్యములయి వర్ణలోపాగమాదులతో గూడిన ప్రాకృత దేశ్యములను “వ్యతిరిక్తా స్సంప్రదాయతో వేద్యాః” అను సూత్రముచే గ్రహింపక పోవుట.

కావున నిది యుచితము కానేరదు.

ఇంతకును బాలసరస్వతి వ్రాసినదిగా నమ్మదగియున్న కృష్ణాపురాగ్రహార ప్రతిలో నీశ్లోకము సంప్రదాయ వేద్యమని వ్రాసి యుండుట. వావిళ్ళ బాలసరస్వతీయ ప్రతి వ్యాఖ్య గూడ సరిగా

---

(1) 'శశాప్రపూర్ణ' వఝుల చిన సీతారామస్వామిశాస్త్రి భాలస. పీఠిక వావిళ్ళ ప్రతి 47 పుట.

లేకుండుట’ అను హేతువులచే బాలసరస్వతి యీశ్లోకమును వ్రాసెననుట అసంగతమగును. ఈశ్లోకము పలు చింతామణి ప్రతులలోను, కవిశిరోభూషణమందును గలదు. కాన చింతామణిలోనిదే యని చెప్పవలెను. కాగా బాలసరస్వతి చింతామణికర్త యనెడి వాదము సరికాదనుట స్పష్టము.

‘ఉన్న’ ‘కల’ అనుబంధములు

చింతామణి వర్తమానార్థమున వస ధాతువు అనుప్రయుక్తమగునని చెప్పెను. చింతామణిలో అనుసరించబడిన సంప్రదాయము ప్రకారము ఆ ధాతువునకు తెనుగు పర్యాయములను అనుబంధములుగా విధించవలెను. అవి యేవి? వసధాతు పర్యాయము ‘ఉన్న’ అనియు అసధాతు పర్యాయము ‘కల’ అనియు బాలసరస్వతి చెప్పెను. [1]

“వసధాతువుకు నివాసమే అర్థం - - - - - నివసించడం అంటే ఉండటం అని చింతామణి కర్త అనుకొని వసతిక్రియను ‘ఉన్న’ అనే విశేషణ రూప అనుబంధానికి సంకేతంగా వాడాడు. ఆ సంకేతం ఇతరులకు తెలియదు - - - - - - - - కాగా చింతామణిని నిర్మించిన వాడూ, వ్యాఖ్యానించినవాడూ భిన్న వ్యక్తులు కాజాలరని సులభంగానే గ్రహించవచ్చు” అని విమర్శకులు భావించినారు. [2]

వస ధాతువునకు ‘ఉండుట’ అను అర్థము చింతామణి కర్త కల్పించినది కాదు. వస నివాసే = ఉండుట [3]

---

1. ప. బాలస. క్రియ 4. శ్లో. టీక.
2. సం. ప్ర, వ్యాకరణాలు 266 పుట.
3. శ్రీ మామిడి వెంకటార్యులు శబ్దార్థ కల్పతరువు 1378 పుట.

పై విమర్శకులు నివసించుటకు, ఉండుటకు భిన్నార్థాల నూహించుకొనినారు గాని నిఘంటువులు మాత్రము వానిని పర్యాయాలుగా గుర్తించినవి.

నివసించు = వసించు, ఉండు [1] వసియించు = ఉండు [2]

ఈ విమర్శకులు అస ధాతువుకు ‘కల’ అని అర్థము చెప్పుటను గూడ ఆక్షేపించినారు. “అస ధాతువుకు ఉనికి అర్థం. అస్తి అనే క్రియకు ‘ఉన్నాడు’ అనే అర్థం పొసగడమే కాకుండా అదే సహజమైంది. అయినపుడు ‘అస్తి’ అనే క్రియ కేవలం ‘కల’ అనే విశేషణ రూప అనుబంధానికి సంకేతంగా చింతామణి కర్త వాడినట్లు తెలుస్తుంది. ఆ సంకేతం తత్కర్తకు తప్ప ఇతరునికి తెలియదు. తెలియడానికి వీలులేదు. పైగా ఈ రెండు సూత్రాల్లో వసతి, అస్తి అనే క్రియాపదాలు ఆయా ధాత్వర్థాలలో కాకుండా వాటి భవత్ భావి శత్రర్థాల్లో ప్రయుక్తాలైనాయి. ఇది మరొక స్వసంకేతితార్థం. కర్తకు తప్ప అన్యునికి తెలియని వీ సంకేతితార్థాలు. కావున బాలసరస్వతియే చింతామణిని వ్రాసెనని వారివాదము. [3]

ఇందు పరిశీలింపవలసిన విషయము చాలా ఉన్నది. చింతామణి వసతి, అస్తి అను క్రియాపదములను వాడినట్లు విమర్శకులు భ్రమించినారు. చింతామణి వాడినవి “వసతిః” అస్తిః’ అను తిబంత రూపాలు. ‘ఇక్ శ్తిపౌ ధాతునిర్దేశే’ అను వార్తికముచే ధాత్వనుకరణమున తిప్ వచ్చుటచే నేర్పడిన రూపములివి. [4]

---

1. సూ. ని. 4 సం, 745 పుట.
2. అందే 119 పుట.
3, సం. ప్ర. వ్యాకరణాలు 865 పుట.
4. సిద్ధాంత కౌముది 3285 సూత్రవృత్తిలోని వార్తికము.

"ఇవి ధాత్వర్థాలలో కాకుండా భవద్ భావి శత్రర్థాలలో ప్రయుక్తాలైనాయి. ఇది మరొక స్వసంకేతితార్థం" అని వారనుచున్నారు. చింతామణియందు అల్పాక్షరములలో అనల్పార్థగ్రథనము కలదని పలు సందర్భములు స్పష్టపరచును. భూధాతువునకు వర్తమానార్థమున శతృప్రత్యయాంత రూపము భవత్ అనునది. ఆ ధాతువునకే భవిష్యదర్థక శతృప్రత్యయాంత రూపము 'భవిష్యత్' అనునది. ఇవి సమాపక క్రియారూపములు కావు; కృదంత రూపములు. వాక్య సమాప్తికి వేరే క్రియ లవసరములు.

చింతామణికారుడు వస ధాతువు పర్యాయమును వర్తమానార్థమున అనుబంధముగా విధించెను. అనుబంధము సమాపక క్రియ కానేరదు. ఉండు అను ధాతువుయొక్క వర్తమానాసమాపక క్రియ ఏది? 'ఉన్న' అనియే కదా! అస ధాతువునకు పర్యాయమగు 'కలుగు' అనుదానికి భవిష్యదర్థమున శత్రర్థ రూపము 'కల' అనునది. భవిష్యదర్థము వివక్షితమయినపుడు అస ధాతు పర్యాయమయిన కలుగు ధాతువు అనుబంధముగా చేరునని చెప్పుటచే కలుగు ధాతువుయొక్క భవిష్యదర్థక శతృప్రత్యయాంత రూపమగు 'కల' చేరుననియే అర్థమును గ్రహింపవలెను. అనుబంధముగా చేరునది సమాపక ధాతువెట్లగును? కావున ఇందు స్వసంకేతితార్థ మేదియును లేదు. అర్థగ్రహణమున క్లిష్టత కలదు. బుద్ధిమంతుల బుద్ధికి ఇట్టి విషయము లందుటలో ఆశ్చర్యములేదు.

"అసధాతువునకు 'కలుగు' పర్యాయమగునా?" అని ప్రశ్న. అసధాతువునకు ఉండుట అను అర్థము నిఘంటువుల కెక్కినది.[1] కాని 'కల' అను నర్థము లేదనరాదు.

"తదస్యాస్త్యస్మిన్నితి మతుప్" అది వీనికి కలదు, అది దీనియందు కలదు అను నర్థములలో మతుప్ ప్రత్యయము విధింపబడినది.

---

[1] శబ్దార్థ కల్పతరువు 112 పుట.

[1] ఇచట అస్తి అనుదానికి కలదు అనునర్థమును చెప్పుటయే సంప్రదాయము. [2] ధనుష్మంతుడు అను మతుప్ ప్రత్యయాంతమునకు ధనుస్సు కలవాడు అనియే నిఘంటువులు గూడ అర్థమును వ్రాసినవి. [3]

కావున భవిష్యదర్థమున శతృ ప్రత్యయాంతమగు అస ధాతువునకు పర్యాయముగా 'కల' అనుదానిని భావించుట దోషము కానేరదు. ఇది సూత్రకర్త క్రొత్తగా కల్పించుకొనినదియు గాదు. కాగా ఇవి వ్యాఖ్యాతయే సూత్రకర్త అని నిరూపింపలేవు.

విషయ మిట్లున్నందున చింతామణిలోని అస్పష్టత నాధారముగా జేసికొని చింతామణీ కర్తృత్వమును నిర్ణయించుటకు ప్రయత్నించుట ఉచితముకానేరదు. ఈ విషయము మరింత పరిశీలింతము.

అస్పష్టతావాదము - కర్తృత్వ నిర్ణయము

ముందు లక్ష్యజ్ఞానము లేనిచో చింతామణిలో కొన్ని సూత్రములకు సరిగా నర్థమును గ్రహించునవకాశము లేదని యొకరుటంకించిరి. [4] దీనికి వారు జూపిన అనేకోదాహరణములలో నిది యొకటి.

'వ్యతిరేకాదా భావిని చాత్స్యాత్' వ్యతిరేకాద్యర్థములయందు భవిష్య దర్థమునందు ధాతువునకు అత్తు వచ్చును [5].

---

1. సిద్ధాంత కౌముది, 1894 సూ.
2. చంద్రాభొట్ల సూర్యనారాయణశాస్త్రిగారు, పంచాంగం వెంకట నరసింహాచార్యులుగారు, ఆం. ల. సిద్ధాంత కౌముది, చెన్నపురి : వావిళ్ళ ప్రెస్, (1933), 424 పు.
3. సూ. ని. 4 సం. 469 పుట.
4. ఆం. భా. చ. రెండవ భాగము చింతామణి హృదయము 1667, 1668, 1669 పుటలు.
5. కవిశిరో. క్రియ 16 సూ.

ఈ సూత్రమున బూర్వ వ్యాఖ్యాతలు చ + అత్ అని పదచ్ఛేదము చేసిరి. కాని చ + ఆత్ అనియు పదములు విరుగును. అప్పుడు పోషింపా + డు అను ననిష్టరూపము సిద్ధించును. కావున మొదట 'పోషింపడు' అను రూపము తెలిసిన దప్ప ఈ చింతామణి సూత్రము సరిగా నర్థము కాదని వీరి యాశయము.

వ్యాకరణ సూత్రములను వ్రాసిన పాణినిముని, బ్రహ్మ సూత్రములను వ్రాసిన వ్యాసమహర్షి తమ సూత్రములకు దాము వ్యాఖ్యానమును వ్రాయలేదు. సంస్కృత భాష తెలిసినవానికైనను గురుముఖమున నభ్యసించనిదే పాణిని సూత్రములు గాని, వ్యాస సూత్రములుగాని యర్థము కావు. మఱి వీరి గ్రంథముల కర్థములు లోకమున కెట్లు తెలిసినవని ప్రశ్న.

తర్క శాస్త్రమునకు విశ్వనాథ పంచాననుడు కారికావళిని వ్రాసెను. అది శిష్యునికి బోధింపగా నాతనికి వివరణ మవసరమైనది. ఆ వివరణమును గూడ వచన గ్రంథముగా సిద్ధాంత ముక్తావళి యను పేర వ్రాసెను.[1] దీనిని బట్టి సంక్షిప్తపఱచి శాస్త్ర గ్రంథములను వ్రాసినవారు తమ శిష్యుల కా గ్రంథముల యర్థమును వివరింపగా నట్లు గురుశిష్య పరంపరగా నా గ్రంథములు లోకములో వ్యాప్తి నందినవని యూహించుట కవకాశమున్నది.

పాణినీయములో స్వరితేనాధికారః (స్వరిత స్వరముతో గూడిన శబ్దము తరువాతి సూత్రములలోనికి అధికారముగా వెళ్ళును.)

---

[1] నిజ నిర్మిత కారికావలీ మతి సంక్షిప్త చిరంతనోక్తిభిః
విశదీకరవాణి కౌతుకాన్నను రాజీవ దయావశంవదః
సిద్ధాంత ముక్తావళీ, ముంబఈ;, పాండురంగ
జావజీ సన్ (1933), 2శ్లో.

అను సూత్రమున్నది.[1] సూత్రములలో దేనికి స్వరిత స్వరోచ్చారణ మున్నదో గురువు చెప్పనిదే తెలియదు. అది తెలియనిచో తరువాతి సూత్రములలోని కధికారముగా వెళ్ళునవేవో తెలియదు. కాగా గురువు స్వరిత స్వరముతో శిష్యుని కధ్యాపనము చేసెడివాడని దీనివలన స్పష్టమగును. తమ భావములు మరుగునబడునను భయము గలవారు తమ గ్రంథములకు దామే వ్యాఖ్యాతలగుటయు కద్దు. శతాధికగ్రంథ కర్తయైన బెల్లంకొండ రామరాయ కవీంద్రులు తమ వేదాంత ముక్తావళికి తామే వ్యాఖ్య వ్రాసిరి. తమ మాటలను తామే వివరించుకొనుచు రచన సాగించుట భాష్య లక్షణములలో నొకటి.[2]

కొన్నిచోట్ల గ్రంథకర్త శిష్యులకు బోధించుటకాని, తాను వ్యాఖ్యానించుటకాని చేయకపోవుటచే నా గ్రంథ భావములు కొంత కాలమువరకు లోకమున వెల్లడి కాకుండుటయు లేకపోలేదు. క్షుద్ర వ్యాఖ్యా విషార్తములయిన శ్రీహర్ష మహాకవి వాక్కులను తన జీవాతు వ్యాఖ్య ఉజ్జీవింపజేయునని మల్లినాథసూరి చెప్పికొనెను[3].

మూలగ్రంథకర్త భావములు తదనంతరుల కాతడు వివరించినచో బూర్తిగా దెలియుననియు, నట్లు కానినా డాతని భావములలో

---

[1] సిద్ధాంతకౌముది, పరిభాష. 46 సూ॥

[2] సూత్రస్థం పద మాదాయ వాక్యైస్సూత్రానుకారిభిః
స్వపదానిచ వర్ణ్యన్తే భాష్యం భాష్యవిదో విదుః
కవిశిరోభూషణచంద్రికా, పాజ్ని వేదనము, 6 పు.

[3] క్షుద్రవ్యాఖ్యా విషార్తానాం శ్రీహర్ష కవిరాడ్గిరామ్
ఉజ్జీవనాయ జీవాతుర్జీయాదేష మయాకృతః
నైషధవ్యాఖ్యాన పీఠిక మైసూరు : విద్యాతరంగిణిప్రెస్ & సన్ (1907) 3 శ్లో.

గొన్ని మరుగునబడుట, మరికొన్ని గ్రంథకర్త ఉద్దేశించని యర్థముల నొసగుట కూడ జరుగుచుండుననియు సారాంశము.

బహిరంత స్ఫురద్రసములుగా నుండదగు కావ్యములలో గూడ ఇట్టి స్థితి యున్నప్పుడు సంక్షిప్తముగా వ్రాయబడిన శాస్త్రగ్రంథములలో నీస్థితి యుండుటలో వింతయేమి ?

భాషకున్న అనంతశక్తిచే గ్రంథకర్త వాక్కుల కపార్థములను గూడ చెప్పి మూలోచ్ఛేదము చేయు ప్రబుద్ధు లుండవచ్చు నను నూహచేతనే కాబోలు సందేహము గల్గినచోట వ్యాఖ్యానము వలన విశేష జ్ఞానమును బొందవలెను. మన బుద్ధికి సందేహము గల్గినంతమాత్రమున శాస్త్ర మలక్షణము గాదని సంస్కృత వైయాకరణులు చెప్పినారు[1].

మఱియొక మాట. నాటి కేతన మొదలుకొని మొన్నటి చిన్నయసూరి వరకు లక్ష్యపరిజ్ఞాన మసలు లేనివారికి తమ గ్రంథములచే లక్షణ పరిజ్ఞానమును గలిగించెదమని కాని, తమ గ్రంథములు సకల లక్షణ విషయములను దెల్పుచున్నవని కాని భావింపలేదు.

లక్ష్య పరిజ్ఞానమే శ్రేష్ఠమనియు, శబ్దసిద్ధి లోక వ్యవహారము వలన నెఱుగవలెననియు, శాస్త్రము లక్షణ జ్ఞానము నందదలచినవారికి దిక్ప్రదర్శనముగా దారి మాత్రము చూపుననియు స్పష్టపరచిరి[2].

---

1. 'వ్యాఖ్యానతో విశేష ప్రతిపత్తిః, నహి సందేహాదలక్షణమ్. శ్రీ నాగేశభట్టు, పరిభాషేన్దుశేఖరః - కలకత్తా : జీవానన్ద విద్యాసాగర భట్టాచార్య (1892), 1 ప.
2. శ్రేయః ప్రమేయ విజ్ఞానమ్, సిద్ధిర్లోకతః, శాసనమిదం దిక్ప్రదర్శనమ్ (అజ్ఞాత దేశం జిగమిషోః పాన్థస్య మార్గం పృచ్ఛతః పురుషేణ కేనచిదేవం యాహీతి హస్తనిర్దేశేన దిశోదర్శనవ దిదం శాసన మధిజిగమిషూణాం ప్రథమ ప్రవృత్తా వుపకారకం భవతీత్యర్థః) శ్రీ పరవస్తు చిన్నయసూరి, సూత్రాంధ్ర వ్యాకరణము. కాకినాడ : ఆం. సా. ప. (1931), సంజ్ఞ 1, 2, 3 సూ.

చింతామణి కర్త గూడ 'సిద్ధిర్లోకాద్ధ్రుశాస్త్య'(శబ్దసిద్ధి లోకము వలన జూడదగినది. పర్యాప్తో మన్మతేతు సంకేతః (నా మతమున సంజ్ఞలే వ్యాకరణ స్వరూపమును జూపుటకు సమర్థములు.) ఇత్యాది సూత్రములచే తన గ్రంథము సంక్షిప్తమను విషయమును దెలివినాడు[1].

ఇక అస్పష్టత అందురా? ఇప్పటి కింకను సంస్కృత సూత్రాంధ్ర వ్యాకరణమున కొఱుకుడు పడని సూత్రములు పెక్కులున్నవి. చిన్నయసూరిగారి వ్యాకరణముల నన్నింటి నాపోశనము పట్టిన విద్వాన్ కట్టి సాంబమూర్తి శాస్త్రిగారివంటి వ్యక్తి పరిష్కరించిన పిదప గూడ అందలి సూత్రము లస్పష్టముగా నుండుటేమి?[2].

(71 వ పేజీ అధస్సూచికకు తరువాయి)

కంచినెల్లూరు మఱి యోరుగల్లయోధ్య
యను పురంబులపై గంగ కరుగుమనిన
పగిది నొక త్రోవ జూపెద బహుపథంబు
లాంధ్ర భాషకు గలవని యరసికొనుడు

మూల ఘటిక కేతన, ఆం. భా. భూ. పొన్నూరు: కళా కృష్ణుల కావ్యమాల, (1953), 13ప.

[1] కవిశిరో°, సంజ్ఞ 6 సూ. క్రియ 42 సూ.

[2] "పై రెండింటి యందును (సూత్రాంధ్ర వ్యాకరణమునందు, ఆంధ్ర శబ్దానుశాసనమందు) వ్రాత తప్పులు, కొన్ని ద్విరుక్తములు, గ్రంథపాతములు కొన్ని, అస్ఫుట సూత్రములు కొన్నియు గలవు. బ్ర. శ్రీ విద్వాన్ కట్టి సాంబమూర్తి శాస్త్రిగారు వారి బుద్ధికి దోచిన ట్లుంచవలసిన సూత్రముల నుంచి, ద్విరుక్తములు తొలగించి, ప్రమాదములను గొంతవరకు సవరించి, చెప్పినరీతిని బ్రతివ్రాసి యీరూపమున బరిషత్పత్రికలో బ్రకటించుటకు సిద్ధము చేసినాడను. అభిజ్ఞులు రెండవ ప్రతి సంపాదించిగాని, యున్న లోపములు సమర్థతచే సవరించి గాని యుపయోగించుకొందురుగాక-" కొత్తపల్లి సూర్యారావుగారు, సూత్రాంధ్ర వ్యాకరణములు పీఠిక 3 పు.

సూత్రాంధ్ర వ్యాకరణమున నున్న కొరతలను తొలగించుకొనుటకు, అందలి సూత్రాలలో స్వాభిప్రాయావిష్కరణము దుష్కర మయ్యెనని గుర్తించి ఆలోపములను గలుగ నీయకుండ దరువాత వ్యాకరణములను, బాలవ్యాకరణమును చిన్నయ సూరి వ్రాసెనని యొక రూహించిరి. [1]

కాని చిన్నయసూరి బాలవ్యాకరణము బాలురనుద్దేశించి నిర్మించితి ననియు, నదియసమగ్రమనియు, విశేష లక్షణముల నెఱుంగ దలచిన పండితులు సూత్రాంధ్ర వ్యాకరణాదులను జదువ వలెనని పలుచోటుల స్పష్టము చేసెను. [2]

---

[1] సం. ప్ర. వ్యాకరణాలు. 462, 463 పుటలు.

[2] పెక్కు లక్ష్యములు పలుమాఱు సావధానముగా బరిశీలించి రచనా ప్రణాళిక నిర్ణయించుకొని నా నేర్పు కొలదిని సంస్కృత భాషలో సూత్ర గ్రంథమొకటి కావించితిని. ఈ గ్రంథము బాలురకు సుసాధము గాకుండుట వలన దానియందలి సూత్రములు కొన్ని తెనిగించి ప్రకృత గ్రంథరూపముగా (బాలవ్యాకరణముగా) రచించినాడను”

బాలవ్యాకరణ పీఠిక తెనాలి: ది ఓరియంట్ పబ్లిషింగ్ కంపెనీ, (1940)

కం. మునుమదు పజ్ఞంబగుచుం
దనరిన వ్యాకృతిని సూత్రతతి యొక కొంతం
దెనిగించి యిది ఘటించితి
ననయము బాలావబోధమగు భంగి దగన్

కం. తెనుగునకు శబ్ద లక్షణ
మనయం బరయంగ పేష్కనందిన వారల్
తనరగ నీవ్యాకరణం
బున మూలంబయిన కృతిని బోల గన దగున్

బాలవ్యాకరణము దూసి వారి టీకా ప్రతి, చెన్నపురి : వావిళ్ళ ముద్రణము, (1937), 334 పుట.

కావున పై విమర్శకుల ఊహ చిన్నయసూరి అభిప్రాయమునకు విరుద్ధము. పై పరిశీలనముచే ఆంధ్ర శబ్దచింతామణి సూత్రకర్త వివరించినగాని తెలియని సూత్రములతో నున్నదనియు, ముందు లక్ష్యజ్ఞానము లేనిచో చింతామణి సూత్రములర్థముగావనియు, జేయు విమర్శలు యుక్తములు గావని చెప్పవచ్చును. మఱియు నీయస్పష్టతచే వ్యాఖ్యాతయగు బాలసరస్వతికి చింతామణి కర్తృత్వము గట్టబెట్టుట మిక్కిలి యసంగతమని వేరే చెప్పనక్కఱలేదు.

బాలసరస్వతి గమనించని యర్థాలు

చింతామణిలోని కొన్ని సూత్రముల అర్థములను బాలసరస్వతి గమనించలేదు. ఆవిషయము గూడ చింతామణి కర్తృత్వ నిర్ణయమున సాయపడును. కావున నా విషయమును బరిశీలింతము. 'తేస్యేచాను ప్రవిశన్తి శబ్దయోగవశాత్' తక్కిన కడమవి తత్సమములతోడి యోగమువలనను ప్రవేశించును). అని యీ సూత్రమునకు బాలసరస్వతి వివరణము. [1] దీనికిముందు సంస్కృతమునకు వర్ణములేబడి

73వ పేజీ అధస్సూచికకు తరువాయి

కొందరు సంస్కృతసూత్రాంధ్రవ్యాకరణము సంపూర్ణముగావింపబడలేదని చెప్పుచున్నారు; కాని పై చిన్నయసూరి వాక్యములను జదివినచో నది సమగ్రమే యని తోచును. బాలవ్యాకరణ రచనకు బూర్వమే అది సంపూర్ణముగా రచింపబడెనని స్పష్టమగును.

ఇపుడు లభించు పరిషత్తువారి సూత్రాంధ్ర వ్యాకరణ ప్రతిలో గ్రంథపాఠాదులు లేఖన దోషములు గల్గుటకు కారణము లేఖకపాఠకులుగావచ్చును. లేదా చిన్నయసూరిగారిచిత్తు ప్రతి మాత్రమే వీరికి లభించి యుండవచ్చును.

సూత్రాంధ్ర వ్యాకరణ పీఠిక 1 పుట.

[1] ప. బాలస. సంజ్ఞ 4 శ్లో. వ్యాఖ్య.

యని చెప్పి, వానిలోపది తగ్గినచో ప్రాకృత నర్ణమాల ఏర్పడునని చెప్పబడినది. తరువాత తెలుగునకు వర్ణములు ముప్పదియారని తెలుపబడినది [1], ఆ తరువాత ప్రస్తుత సూత్రమున్నది.

'తే, అన్యే' అను రెండు పదములకు బాలసరస్వతి చెప్పినట్లు తక్కిన వర్ణములు అని అర్థమును జెప్పినచో ఋ ౠ మొదలగు బందొమ్మిది వర్ణములు తత్సమ పదములతోగూడి తెనుగున ప్రవేశించునని చెప్పవలెను. తెలుగున 36 వర్ణములు కలవు. వానిలో పెక్కు సంస్కృతమందును గలవు. వానికి తత్సమముల ద్వారా తెలుగున ప్రవేశము కలదా ? లేదా యని ప్రశ్న. దానికి బాలసరస్వతి చెప్పిన సూత్రార్థము సమాధానము నీయదు. సూత్రము తత్సమముద్వారా తెలుగులోనికి వచ్చు వర్ణములను గురించి చెప్పుటచే నిందావిషయము గూడ ఉండుట లెస్స. కాగా ఆ అర్థ మీ సూత్రములో కలదేమో చూతము.

సర్వనామములకు రెండు రకములుగా నర్థమును జెప్పవచ్చును. (1) పూర్వ పరామర్శ (2) బుద్ధిస్థ పరామర్శ. ప్రకృత సూత్రములో 'తే' అన్యే అని రెండు సర్వనామములున్నవి. అందు అన్యే అను పదముచేతనే 'తక్కినవి' అను నర్థము సిద్ధించుచుండగా 'తే' అను పదమేల వాడబడెను ? బాలసరస్వతి 'తే' 'అన్యే' అను రెండింటిని కలిపి 'తక్కినకడమవి' అను నర్థమును వ్రాసెను. అనగా తచ్ఛబ్దమునకు బుద్ధిస్థములైన తక్కిన వర్ణములను అర్థముగా జేసినాడు. దీనిచే పునరుక్తి వచ్చుచున్నది. ఈయర్థమును జెప్పుపక్షమున 'తే' అను పదమును దొలగించినను నష్టముండదు.

---

1. ఆద్యాయాః పఞ్చాశ ద్వర్ణాః,
   ప్రకృతేస్తుతే దశో నాస్స్యుః,
   షట్త్రింశదత్ర
   ప. బాలస. సంజ్ఞ 4 శ్లో.

ఇక 'తే' అను దానికి బూర్వ పరామర్శను జెప్పినచో అన్యే= తెలుగులోని ముప్పదియారు వర్ణములకంటె యితరములయిన 19 వర్ణములు, తేచ=పూర్వమందు పేర్కొనబడిన సంస్కృత ప్రాకృత శబ్ద సంబంధవశమున తెలుగులోనికి, అను ప్రవిశన్తి = అనుసరించి ప్రవేశించును అను నర్థమును జెప్పవచ్చును. అనగా సంస్కృత ప్రాకృత వర్ణాలన్నియు తత్సమ శబ్దములద్వారా తెలుగున బ్రవేశింపవచ్చునన్న మాట.

ఇట్లు చెప్పుటచే 'తే' అను దానికి చకారమునకు గూడ సార్థక్యము గల్గినది. సంస్కృత ప్రాకృత వర్ణములన్నియు తత్సమములద్వారా తెలుగున ప్రవేశింపవచ్చునన్న విషయమును సూత్రకారుడు గుర్తించినట్లు వెల్లడియైనది.

అప్పకవి గూడ పైభావము వచ్చునట్లే వ్యాఖ్యానించెను "అయిదు పదులగు సురభాష కక్షరమ్ము, లందు బది ప్రాకృతమునకు నడగిపోవు, దొలగిచను బదియును మూఁడు దెలుఁగు బాస, కెసగు దత్సమ పదములనేబదియును[1]" తత్సమ పదములద్వారా సంస్కృతాక్షరము లేబదియు వచ్చునని యితడు స్పష్టముచేసినాడుగదా!

అహోబలపతి గూడ సూత్రములోని చకారమున కావృత్తి నంగీకరించి "అన్యేచ షట్త్రింశద్వ్యతిరిక్తాః, తేవర్ణాశ్చ శబ్దయోగవశాత్ తత్సమాది శబ్దయోగవశాదను ప్రవిశన్తి"

(అన్యేచ = 36 వర్ణములకంటె నితరములును, తే వర్ణాశ్చ = (సంస్కృత ప్రాకృతములలోని) ఆవర్ణములును, శబ్దయోగవశాత్ = తత్సమాది శబ్దయోగవశము వలన తెలుగున ప్రవేశించుచున్నవి.) [2] అని వ్రాసెను.

---

[1] అప్పకవి, 2 ఆ. 48 ప.

[2] కవిశిరో°. సంజ్ఞ 15 సూ. వ్యాఖ్య.

ఇతడుఁగూడ బాలసరస్వతికివలె 'అన్యే' 'తే' అనువానికి విశేషణ విశేష్యభావము నంగీకరింపదలచినచో చకారము నావృత్తి సేయుట వ్యర్థము. కావున నిచట బాలసరస్వతి కంటె అప్పకవి, అహోబలపతి మూలకారుని భావమును వ్యక్తము చేసిరని చెప్పవలసియున్నది. కాగా బాలసరస్వతియే మూలమును వ్రాసెననుట అసంగతమగుచున్నది.

వ్యాఖ్యాత వ్రాయదగని రీతిలో సూత్రరచన

బాలసరస్వతియే చింతామణిని వ్రాసినచో మూలాభిప్రాయముల నాతని వ్యాఖ్య బాగుగా వ్యక్తీకరించెడిది. కాని కొన్ని చోట్ల వ్యాఖ్యానములో సూత్రములనుండి భావమును ఎట్లో రాబట్టిన ధోరణి కనవచ్చును. సూత్రకర్త, వ్యాఖ్యాత భిన్నులయినపుడు వ్యాఖ్యాత ఏదో ఒక తీరుగా సూత్రార్థమును జెప్పుట కలదు కాని సూత్రకర్తయే వ్యాఖ్యాత అయినపుడు మొక్కుబడి ధోరణి వ్యాఖ్య ఉచిత మనిపించదు.

చింతామణి 'నుమ్ చోతః' అని ఉదంత శబ్దములకు 'నుమ్'ను విధించెను. సూత్రములో నామాటలేకున్నను ఇది సమాసములందు వచ్చు విధి యని బాలసరస్వతి తెలిపెను.[1] కాని మరియొకచోట రామునందు అను రూపములో పై సూత్రముచే నుమ్ వచ్చునని చెప్పెను.[2] రామునందు సమాసము కాదుగదా! ఇచట బాలసరస్వతియే సూత్రకర్తయైనచో "నుమ్‌చోతః సమాసేన్దా" అని సూత్రమందే ఇది సమాసమున, అందు పరమగునపుడు గూడ వర్తించునని తెల్పియుండెడివాడు. అట్లు చెప్పినచో పైన చెప్పిన రీతిగా సూత్రమున లేని విషయమును జెప్పవలసిన అవసరము కల్గియుండెడిది కాదు.

---

[1] ప. బాలస. సంధి 10 శ్లో. వ్యా.

[2] అందే. అజంత 7 శ్లో. వ్యా.

'అంద్విందు నాస్తు సప్తమీ'(అందు, ఇందు,న, అనునవి సప్తమీ విభక్తి కగును.)[1] అందు జేపః (సప్తమీ విభక్తికి అందువచ్చును)[2] సవిధ వర్తినా మిందు (సమీపమందున్న వానికి సప్తమ్యర్థమున ఇందు కలుగును.)[3] అని చింతామణి సూత్రములు. ఇచట 'అందు,న' అనువానితో పాటు ఇందు పేర్కొనబడినది. ఇందు విభక్తిప్రత్యయము కాదు. చింతామణి దీనిని విభక్తి ప్రత్యయములలో ఏల పేర్కొనెను? స్వతంత్రపదమయిన ఇందునుగూడ విభక్తి ప్రత్యయములలో లెక్క పెట్టినపుడు ఎందును ఏలవదలెను? తానే సూత్రకర్తయు వ్యాఖ్యాతయు నయినచో పై ప్రశ్నలకు సమాధానమును జెప్పియుండవలెను. బాలసరస్వతి అట్లు చేయలేదు. మూలములోని ఆశంకలకు సమాధానమును జెప్పు బాధ్యతను భుజములపై వేసికొనక, తనకు దెలిసిన విషయములను పాఠకుల ముందుంచెను.

'అభినవనన్నయభట్టు' అను బిరుదముగల అహోబలపతి పై ప్రశ్నలకు సమాధానమును జెప్పుటకు యత్నించెను.) "ఇందును సప్తమీ విభక్త్యాదేశముగా గ్రహించుటచే "జేలిరచ"(సప్తమికి 'అలి' అను నాగమము వచ్చును.) అను దానిచే దానికి గూడ 'అలి' వచ్చును. కాన ఇందలి రత్నసానువులను రూపము సిద్ధించును." ఇది యాతని సమాధానము.

చింతామణికర్త ఇందును సప్తమియని చెప్పినను సంస్కృత సప్తమీ విభక్తి ప్రత్యయమగు 'జి' అను దానికాదేశముగా విధింపలేదు. కావున దీనిని తత్సమ శబ్దములకు విభక్తిగా జేర్చుటకు వీలులేదు. చింతామణిలో తత్సమ శబ్దములకు విధింపబడిన విభక్తి

---

1. ప. బాలస. 2 శ్లో.
2. అంధే 7 శ్లో.
3. అంధే.
4. కవిశిరో. అజంత 27 సూ. 1 వ్యాఖ్య.

విధ్యాదికము తద్భవ దేశ్యములకతిదేశింపబడెను. కావున ఇందును తద్భవ దేశ్యపదములకు జివర విభక్తిగా జేర్చుటకు వీలులేదు. మఱి దీనిని సప్తమిగా జెప్పుటలో గ్రంథకర్త అభిప్రాయమేమి ? దీనికి చింతామణి టీకలో నున్న వ్యాఖ్య ఇది. "సవిధవర్తినామ్ ఇందు, సమీప బోధక శబ్దములకు ఇందు వర్ణకము, స్యాత్ = అగును. అనగా సమీపవర్తియగు నిదంశబ్దార్థమును వివక్షించునపుడు ప్రకృతి ప్రత్యయ సముదాయంబునకు ఇందువర్ణకము వచ్చునని తాత్పర్యము[2]" కావున 'ఇందు' అను దానియందు గూడ సప్తమ్యర్థము కలదని తెల్పుటకు గ్రంథకారుడిట్లు చెప్పియుండును.

'విషయ నిమిత్తాదిజాతష్షైవాన్యా' "విషయ నిమిత్తాద్యర్థములందు బుట్టిన సప్తమి ఆ విషయ నిమిత్తాది శబ్దములతోడనేయుండును హరి విషయము, హరి నిమిత్తము. ఆది శబ్దముచేత సతిసప్తమియు వర్తమానార్థమయియే యుండును. హరిరక్షించుచుండుగాను" అని బాల సరస్వతి వివరణము. [1]

ఇచట విషయ నిమిత్తార్థములందు విషయ నిమిత్త పదములు ప్రథమాంతముగా వాడబడుచున్నవి. దానికిముందున్నది మాత్రము ప్రథమాంతములో నుండుటలేదు.

ఉ॥ భృత్యుల విషయము, దంతముల నిమిత్తము. సతి సప్తమిలో క్రియ వర్తమానార్థములో నున్నది. కర్త ప్రథమాంతముగా నున్నది. ఈ స్థితిలో 'తథైవ' (అట్లే ఉండును) అనుదానికి "విషయ నిమిత్తాద్యర్థములందు విషయ నిమిత్త పదములు వాడబడుననియు,

---

1. నన్నయభట్టు ఆంధ్రశబ్ద చింతామణి మద్రాసు : వావిళ్ళప్రతి (1968), అజంత 28 సూ. వ్యాఖ్య.
2. ప॥ బాలస. అజంత 8 శ్లో॥ వ్యాఖ్య.

సతి సప్తమిలో వర్తమానార్థమయియే ఉండు"నని వ్యాఖ్యానించుటలో ఔచిత్యమేమి ? ఒక గణమందున్న పదములకు కార్యవిధులలో సారూప్యముండవలదా ? సాదృశ్యము లేనిదానిని అట్టి పదముచే నెట్లు సాధింతురు ? సూత్రవ్యాఖ్యానములకు కర్త ఒకడే యయినచో నిట్టి వ్యాఖ్య ఉచితము కానేరదు. సూత్రవ్యాఖ్యానములకు కర్తలు భిన్నులయినపు డగతికముగా నిట్టి వ్యాఖ్య చేయుట కలదు. కావున పై పరిశీలనముచే చింతామణిని, బాలసరస్వతీయ వ్యాఖ్యను ఒకవ్యక్తి వ్రాసెననుట అసంగతమని తేలును.

గ్రామ్యము - సౌమ్యము

సలక్షణములైన పదములను సౌమ్యములనియు, లక్షణ విరుద్ధమైన పదములను గ్రామ్యములనియు బాలసరస్వతి వ్యవహరించెను.[1] ఇందు గ్రామ్యమను సంజ్ఞను చింతామణి వాడినను సౌమ్య సంజ్ఞను వాడలేదు. సూత్రకర్త వ్యాఖ్యాత ఒకరైనచో సౌమ్య సంజ్ఞను గూడ సూత్రములలో పేర్కొని యుండెడువాడు గదా !

ఈ సౌమ్య సంజ్ఞ నథర్వణుడు వాడలేదు. అహోబలపతియు గ్రహింపలేదు.

అనుచిత సూత్రవిభాగము

శ్లోక రూపములో వ్రాయబడిన చింతామణిని సూత్ర రూపముగ విభజించి వ్యాఖ్యాతలు వివరించినారు. ఆ విభజనము లేకున్నను శ్లోకములోని పదము లన్వయ మార్గమున ఆ యర్థము నీయజాలియే యుండును. సూత్ర విభజనముచే కొన్నిచోట్ల అనవసర కల్పనలను జేయవలసిన పరిస్థితులు గూడ ఏర్పడినవి,

---

[1] ప. బాలస. సంజ్ఞ. 2వ శ్లో.టీక

సర్వత్రాజ్వత్కార్యం జ్ఞేయం యస్యద్రుత ప్రకృతికేభ్యః
లుక్సంశ్లేషౌ నాచిద్రుతస్య సర్వత్ర లుక్సమాసేషు.

అను శ్లోకమును సర్వత్రాజ్వత్కార్యం జ్ఞేయం యస్యద్రుత ప్రకృతికేభ్యః (ద్రుతప్రకృతికము కంటె బరముగా నున్న యకార మంతటను అచ్చునకువలె వ్యాకరణ కార్యముల నందును.) లుక్సంశ్లేషౌనాచి, (అచ్చుపరముగా నున్నపుడు నకారమునకు లోప సంశ్లేషములు రావు) ద్రుతస్య సర్వత్ర లుక్సమాసేషు, (సమాసములయందంతటను ద్రుతమునకు లుక్కు వచ్చును.) అని పూర్వ వ్యాఖ్యాతలు దీనిని మూడు సూత్రములుగా విభజించిరి.[1]

ద్రుత ప్రకృతికము కంటె పరముగా నున్న యకారమునకు మొదటి సూత్రముచే అజ్వద్భావము విధింపబడినందున ద్రుతమచ్చుతో కలిసినట్లే యకారముతో గూడ కలియగా కలిగెనెమ్మ వంటి రూపములు సిద్ధించుచున్నవి. ఇక 'లుక్సంశ్లేషౌనాచి' యను నిషేధ ప్రయోజనము మృగ్యము. అచ్చు పరముగా నున్నపుడు సకారమునకు లోప సంశ్లేషముల నెవరును విధింపలేదు. ప్రాప్తి లేకుండ నిషేధముండునా? పై సూత్రముయొక్క వివరణమే రెండవ సూత్రమని వ్యాఖ్యాతలు అగతికముగా జెప్పికొనవలసివచ్చినది. అనగా బునరుక్తియే కదా !

రాముడు + యెవడు అనుచోట రాముడు ద్రుత ప్రకృతికము కానందున 'సర్వత్రాజ్వత్కార్యం జ్ఞేయం యస్యద్రుత ప్రకృతికేభ్యః', అను నజ్వద్భావ సూత్రము ప్రవర్తించదు. కాగా పూర్వుల విభజనము ననుసరించి 1. పునరుక్తి, 2. ప్రాప్తి రహిత నిషేధము,

---

[1] కవిశిరో. సంధి 23, 29, 30 సూత్రాలు.
ప. బాలస. సంధి 9 శ్లో. వ్యాఖ్య,

3. రాముడు + యెవడు అనుచోట సంధి ప్రాప్తికాటంకము గలుగును. ఈ దోషత్రయమును వారించుటకు 'సర్వత్రాజ్వాత్కార్యం జ్ఞేయం యస్య' 'ద్రుత ప్రకృతికేభ్యః లుక్సంశ్లేషా నాచి' అను సూత్ర విభజనమును కళాప్రపూర్ణ వఝల చిన సీతారామస్వామి శాస్త్రిగారు చేసి యున్నారు.[1]

ఈ విభజనచే కళకంటె గాని ద్రుత ప్రకృతికముకంటె గాని పరముగానున్న యకారమునకజ్వద్భావము సిద్ధించుటచే 'సర్వత్ర' అను దళము సార్థకమగును. మొదటి సూత్రమున 'ద్రుత ప్రకృతికేభ్యః' అను దళము నన్వయించుటచే గలుగు దోషములపైన జూచితిమి. 'లుక్సంశ్లేషానాచి' అను సూత్రమున నీ దళము నన్వయించుట అవసరము. దీనికి బాలసరస్వతియిచ్చిన ఉదాహరణములు 'భజియింతునంబను, త్యజియింతు నఘములు అనునవి. ఇందు పూర్వపదములయిన భజియింతున్, త్యజియింతున్, అనునవి ద్రుతప్రకృతికములే కదా! కావున నీ సూత్రములోనికి 'ద్రుత ప్రకృతికేభ్యః' అన్వయించుట సముచితము.

పూర్వుల విభజనము ననుసరించి యీ సూత్రమున ద్రుత పదము లేదు. కాని యీ కార్యములు ద్రుతమునకే ప్రవర్తించుచున్నవి. కావున 'ద్రుతస్య' అను దళమును గూడ ఈ సూత్రములోనికన్వయించుట ఉచితము. అపుడు 'ద్రుత ప్రకృతికేభ్యః లుక్సంశ్లేషా నాచి ద్రుతస్య' అను సూత్ర మేర్పడును.

చివరి సూత్రములో 'ద్రుతస్య' అను దళమును దొలగించినచో 'సర్వత్రలుక్సమాసేషు' అను భాగమున కర్థమేమి? యను ప్రశ్న కలుగును. లుక్ అనునది పాణినీయ సంజ్ఞ. లుక్ శబ్దముచేత ప్రత్యయ

---

[1] ఆం. చిం. వి. పరిశోధనము 182 పుట.

ములోపించుటకు 'లుక్' అని పేరు. [1] కాన సమాసము లందంతటను ప్రత్యయము లోపించునను భావము వచ్చును. సందర్భమును బట్టి అవి విభక్తులని చెప్పికొనవచ్చును.

ఈ యర్థమును జెప్పని యెడల కొన్ని చిక్కులేర్పడును. 'లోపశ్చ విభక్త్యాదేః శబ్దేషు స్యాత్సమాసకాఙ్క్షేషు' అను సూత్రము సమాసకములందు (ఆచ్ఛిక సమాసము లందున్న) విభక్త్యాదులకు లోపమును జెప్పినది. [2] ఇక మిశ్ర సమాసములందు, తత్సమ సమాసములందు, విభక్తికి లోపమును విధించు సూత్రమేది ? అయినను సమాస విభక్తికి లోపమును విధించినచో విభక్తి నాశ్రయించిన ద్రుతము గూడ లోపించును గదా ! విభక్తి లోపమును విధించుట మాని ద్రుతమునకు లోపమును విధించుటెందులకు ? కావున 'సర్వత్ర లుక్సమాసేషు' అని సూత్రమును విభజించి, దీనికి 'సమాస విభక్తికి లోపంబగు' నని యర్థమును జెప్పుకొనుట సముచితము.

చిన్నయసూరి పూర్వవ్యాఖ్యాతల వ్రాతలననుసరించి 'ద్రుతస్య సర్వత్ర లుక్సమాసేషు' అను దానికనుగుణముగా 'సమాసంబునందు ద్రుతంబునకు లోపంబగు' నని సూత్రించినను, వారికి వలె అతని యాకృతి 'రాముని గుణములు, వంటి విభక్తిలోపోదాహరణముల నిచ్చుట మాని 'ఎల్ల యర్థములు, ఎల్ల కలుషములు' అను నుదాహరణముల నిచ్చెను. సూత్రమందలి 'సర్వత్ర' అను దళ బలము వలన 'ఎల్లన్' అను నవ్యయమందలి ద్రుతమునకు గూడ లోపము నంగీకరింప వచ్చును. లేదా ఈ అవ్యయీ భావములు చింతా

---

[1] 'ప్రత్యయస్య లుక్ శ్లులుపః' లుక్ శ్లు లుప్ శబ్దైః కృతం ప్రత్యయాదర్శనం' క్రమాత్తత్తత్సంజ్ఞంస్యాత్. శ్రీ భట్టోజీ దీక్షితులు సిద్ధాంత కౌముది 230 సూ.

[2] కవిశిరో. హలంత. 45 సూ.

మణి కర్త దృష్టిలో లేవన వచ్చును. అంతియే కాని ప్రధానమైన సామాసిక విభక్తిలోపమును పై చింతామణి సూత్రముచే జెప్పకుండుట అనుచితము. ఈ సూత్రముచే ద్రుతము లోపించుటకు బాల సరస్వతి విరికల్వ, తెల్లదమ్మి అను నుదాహరణముల నిచ్చెను.[1] విరికల్వ అను సమాసమున ద్రుతమును విధించు సూత్రము కానరాదు. తెల్ల దమ్మి అను సమాసమున 'కృత చిదతః' అను నథర్వణకారికచే 'నుమ్' ప్రాప్తించును.[2] కాని క్వాచిత్కవిధి కనుక 'నుమ్' లేని రూపముండుట కభ్యంతరము లేదు. అచట 'నుమ్' నకు లోపమును వేరే చెప్పుకొన నక్కరలేదు,

అహోబలపతి యీ సూత్రమునకు 'అతని యాకృతి, రాముని గుణములు, వారల యాకృతి వంటి షష్ఠీ తత్పురుషములలో ద్రుత లోపము వచ్చిన వాని నుదాహరించెను.[3] ఒక్క షష్ఠీతత్పురుషము నందలి ద్రుత లోపమును మాత్రమే యుద్దేశించినచో సూత్రమున 'సర్వత్ర' అను పదము వ్యర్థమగును. ఇంకొక విషయము 'రాముల యొక్క గుణములు' అనుచోట ద్రుతము లేదు. కావున 'షష్ఠీ భవేద్ద్వితీయా తుల్యా తత్పురుష సంస్థితా (తత్పురుషమందున్న షష్ఠి ద్వితీయ వంటిది) అను దానిచే షష్ఠిస్థానమున ద్వితీయను జేసికొని దానికి 'ద్రుతస్య సర్వత్రలుక్సమాసేషు' అను సూత్రముచే లోపమును జెప్పికొనవలయును. ఇది అనవసర కల్పనము. షష్ఠికి లోపమును జెప్పిన జాలదా ?

ఇంతకును చింతామణి విధించినది ద్వితీయాతుల్యతనే కాని ద్రుతమును గాదు. కావున పై క్లిష్ట కల్పనను, సూత్రకర్త ఉద్దేశిం

---

[1] ప. బాలస. సంధి 9 శ్లో.

[2] కవిశిరో. సంధి 31 సూ॥ వ్యాఖ్యలో.

[3] అందే 30 సూ. వ్యాఖ్యలో.

చెననుట కాధారము లేదు. 'సర్వత్ర లుక్సమాసేషు' అని సూత్ర విభజనము చేసి దాని ద్వారా సమాసాదులందున్న విభక్తికి లోపమును జెప్పుకొనుట సముచితము.

తెలుగు సమాసకములకు వేఱుగా, తత్సమ మిశ్రసమాసములకు వేరుగా విభక్తి లోపమును జెప్పుకొనుటెందులకని ప్రశ్న. చింతామణి రచనా ప్రణాళిక ననుసరించి యట్టి విధానము జరిగి యుండును. తత్సమాజంత హలంత క్రియా శబ్దములను సాధించి, దేశ్య శబ్దములకు గూడ నాకార్యవిధుల నతిదేశము చేయుట చింతామణి అవలంబించిన పద్ధతి.

ఇట్లు తత్సమ దేశ్య శబ్దములను వేఱుగా సాధించు ధోరణి తోడనే సమాసములకు సమాసకములకు విడివిడిగా విభక్తి లోపమును చింతామణి కర్త విధించు కొనియుండును.

పై పరిశీలనముచే 'సర్వత్రాజ్వాత్కార్యం' ఇత్యాది శ్లోకమును బాలసరస్వతి మొ॥ ప్రాచీన వ్యాఖ్యాతలు సరిగా విభజింపలేదని వెల్లడి యగుచున్నది. ఈ శ్లోకమును వ్రాసిన వాడు బాలసరస్వతియే అయినచో దాని విభజనము నాతడు సరిగా చేయకుండుట సంభవింపదు. కావున చింతామణి కర్త బాలసరస్వతి కాజాలడు.

గ్రంథకర్తయే వ్యాఖ్యాత యయినచో నాతని భావములు వ్యాఖ్యలో స్పష్టపడును. గ్రంథకర్త వ్యాఖ్యాత భిన్నులయినపుడు గ్రంథకర్త ఉద్దేశించని యర్థములను గూడ వ్యాఖ్యాత చెప్పు నవకాశమున్నది. అట్టి సందర్భమును గమనింతము.

సూత్రకారుడుద్దేశించని యర్థములు

“అస్మద్యుష్మ ద్వాచ్యాదేకత్వ ఇతోనిపీ” (నేను నీవు అను వానికి విశేషణములయిన ఇదంత శబ్దములకు ఏక వచనమున క్రమ

ముగా ని, వి, అనునవి చేరును.) దీనిచే నేను కవిని, నీవు కవివి, అను రూపములు సాధింపబడెను.

'పరేషాంతు ధర్మోత్తమ మధ్యమవత్' (పై వానికంటె నితరములగు నామములకు తద్ధర్మార్థమున మధ్యమోత్తమ పురుష ప్రత్యయములగు ను, వు, రు, ము, అనునవి వచ్చును.) నేను భక్తుడను, నీవు దేవుడవు, మేము భక్తులము. [1] ఇట మీరు దేవులరు అను రూపము గూడ సిద్ధించు చున్నది. చివరి రూపము చింతామణి కిష్టము లేకపోయినది. కావున 'బహుషు నమధ్యమవత్' (బహువచనమున మధ్యమ పురుషవర్ణకమైన రువర్ణకము రాదు.) అని నిషేధించినది.

“ఉతోచ్చ సర్వేషు” (ఈ ప్రత్యయములు పరముగా నున్నవు డుత్తునకత్తు వచ్చును.) ఈ నాలుగు సూత్రములును కలిపి యొక శ్లోకము. ఇందు 'బహుషు నమధ్యమవత్' అను సూత్రమునకు “బహువచనమందు తద్ధర్మమునకు చెందిన ప్రథమోత్తమ పురుషముల వంటివౌను. మురు వర్ణకములౌననుట” అని బాలసరస్వతి వ్రాసెను [2]. ఇచట నిషేధ రూపముగా సూత్రమును రచింపనేల ? ప్రథమ పురుషమునకు మధ్యమ పురుషమునకు రువర్ణకమే బహువచనము. మధ్యమ పురుష వర్ణక నిషేధముచే ప్రథను పురుష వర్ణకమును విధించుటలోని ఔచిత్యమేమి ?

మొదటి సూత్రమున అస్మ ద్యుష్మచ్ఛబ్దములకు ని, వి, వర్ణకములు క్రమముగా విధింపబడినని. రెండవ సూత్రమున అదే క్రమమును గ్రహించి అస్మద్యుష్మచ్ఛబ్ధములకు 'ను, వు, రు, ము, వర్ణకములు చెప్పబడినవి. బాల సరస్వతి 'బహుషు నమధ్యమవత్' అను

---

[1] ప. బాలస. 39 పుట.

[2] అందే.

నిషేధ రూప సూత్రమును విధి రూపముగా వ్యాఖ్యానించుటచేత ఆక్రమమును వ్యత్యయము చేయవలసి వచ్చును.

మధ్యమ పురుష వర్ణకము రాదనుటచే ప్రథమోత్తమ పురుష వర్ణకములు వచ్చునని వ్యాఖ్యాత చెప్పినాడుగదా! అస్మచ్ఛబ్దమునకు రువర్ణకమును యుష్మచ్ఛబ్దమునకు మువర్ణకమును వచ్చినచో మేము దేవులరు, మీరు దేవులము, అను దుష్టరూపము లేర్పడును. కాన పై రెండు సూత్రములలో గ్రహించబడిన క్రమమునుమార్చి యుష్మచ్ఛబ్దమునకు రువర్ణకమును, అస్మచ్ఛబ్దమునకు మువర్ణకమును చెప్పుకొనవలెను. అపుడు మీరు దేవులరు, మేము దేవులము అను రూపములు సిద్ధించును.

మేము దేవులము అను రూపము సిద్ధించుటకీవిధి అవసరము లేదు. పై నాలుగు సూత్రములలో మొదటి సూత్రము ఏకవచనమునకు చెందినది. రెండవసూత్రమున నేకవచన ప్రసక్తిలేదు. కావున దానిచే దేవులము అనుచోట మువర్ణకము రావచ్చును. కాని వ్యాఖ్యాత రెండవ సూత్రము నేకవచన పరముగా వ్యాఖ్యానించి యీరూప సాధనమునకు వేరొకదారి త్రొక్కినాడు.

రెండవ సూత్రములోని 'పరేషాం' అను దానికి పూర్వసూత్రములో చెప్పబడిన వానికంటె ఇతరములు అని చెప్పవచ్చును. అట్లు చెప్పుటచే ఇదంత బహువచన రూపములగు 'కవులు' ఇత్యాదులకు గూడ మువర్ణకము వచ్చి 'కవులము' మున్నగు రూపములుసిద్ధించును. కాని వ్యాఖ్యాతలు "ఇకారాంతవ్యతిరిక్తములు" అని చెప్పిరి. దీనిచే కవులము ఇత్యాది రూపములు సాధించునవకాశము లేకపోయినది.

వ్యాఖ్యాతలు చేసిన క్లిష్టకల్పనచే మీరు దేవతలరు వంటి రూపములు సాధించబడుట విశేషము. 'బహుషు న మధ్యమవత్'అను దానిని యథాతథముగా నిషేధార్థకముగా గ్రహించినచో నిట్టి రూపములు నిషేధింపబడును. దేవతలరువంటి రూపములు భాషలో నరు

దుగా నున్నవి. సంకేతిత సుప్రసిద్ధ పదములను వాడవలెనను నియమముగల చింతామణి యిట్టివానిని నిషేధించుటలో వింత లేదు.

పరిస్థితి యీ తీరుగా నుండగా తాము సాధించిన క్లిష్ట కల్పనముచే సిద్ధించిన ఋవర్ణకాంత రూపమును వాడలేదని 'కోవిదులుగాని' అను మహాకవి ప్రయోగమును అహోబలపతి తిరస్కరించినాడు. కాని వాడుకలో గూడ అట్టి రూపములే ప్రచారమున నున్నవి కదా !

(1) నిషేధ రూపముగా నున్న సూత్రమును విధి రూపముగా వ్యాఖ్యానించుట.

(2) సూత్రమున లేని యేకత్వమును తెచ్చిపెట్టుకొనుట.

(3) పై రెండు సూత్రములలో సూత్రకర్త గ్రహించిన క్రమమును వ్యత్యయము చేయుట.

అను హేతువులచే సూత్రకర్త యుద్దేశింపని యర్థమును వ్యాఖ్యాతలు చెప్పిరని స్పష్టపడుచున్నది. ఇచట బాల సరస్వతి మార్గమునే తరువాతివారు అనుసరించినారు.

సటీకాంధ్ర శబ్ద చింతామణి మాత్రము "పరేషాంతు ధర్మోత్తమ మధ్యమవత్" అను సూత్రమును బహువచనాంతములకు గూడ వర్తింపజేసి మేము కవులము వంటి రూపములను సాధించినది. కాని 'బహుషునమధ్యమవత్' అను దానికి యుష్మ దస్మ దుభయార్థక విశేషణంబునకు దద్ధర్మోత్తమ పురుష బహువచనమునకువలెమువర్ణకంబు వచ్చునని విధి రూపమయిన మఱియొక అర్థమును ప్రతిపాదించి మనము భక్తులము అను రూపమును సాధించినది. చింతామణిలో అస్మద్యుష్మచ్ఛబ్దవాచ్యములయిన నేను నీవు ఇత్యాదులను సాధించినట్లే మన అనుదానికి చెందిన రూపములను గూడ సాధించుకొనవచ్చును. 'పరేషాంతు' అను సూత్రమున పూర్వ సూత్రముచే

సాధించబడగా మిగిలిన అస్మద్యుష్మ దుభయార్థక సర్వనామములను గ్రహించినచో మనము కవులము వంటి రూపములు సాధింపబడును.

ఇది యుభయార్థక మైనందున దీని విశేషణమునకు **రు**, ము, వర్ణకములలో నేది వచ్చునని సంశయము గలుగవచ్చును. ఈ సర్వనామముల అంత్య విభక్తులే విశేషణములకు చివర జేరుచున్నవిగదా! మన శబ్దమునకు 'తస్యజసోముః' అని మువర్ణకము విధింపబడినందున దీని విశేషణమునకును అదియే వచ్చునని చెప్పవచ్చును.[1] ఆరూపమును సాధించుటకు 'బహుషు న మధ్యమవత్' అను సూత్రమున స్పష్టముగా కానవచ్చు నిషేధార్థమును వదలుట యుక్తము గాదు.

ఈ సూత్రమునకు వ్యాఖ్యాతలు చెప్పిన యర్థము సూత్రకర్త ఉద్దేశించినది గాదనుట స్పష్టమే కదా !

ఈ విషయము గూడ వ్యాఖ్యాతయగు బాలసరస్వతి చింతామణికి కర్తగాదని దృఢపరచును.

ఇట్టిదే మరియొకటి 'కర్మాదేః కర్తృత్వం ప్రథమాచ నవర్ణకశ్చ తద్వత్ స్యాత్' 'నీచే నుతింపబడిన రాజ'ను కర్మార్థక వాక్యము నీవు నుతించిన రాజని కర్త్రర్థక వాక్యముగా మారునని బాలసరస్వతి భావించెను. అతడు 'నీచేతనను తృతీయకు ప్రథమ వచ్చును. నుతింపబడినయను కర్మార్థమునకు గర్తృత్వము వచ్చెను. 'కర్మాదేః' అను నాదిశబ్దము చేత అధికరణార్థములందును నట్టిలాగుననే వచ్చును. నే భుజించిన చోటు......'అని వ్రాసెను.[2]

---

1. కవిశిరో. హలన్త. 21 సూ.
2. ప. బాలస. హలంత. 13 శ్లో. వ్యాఖ్య.

సూత్రమున కర్మాదులకు కర్తృత్వము వచ్చునని మాత్రమే కలదు. కర్మార్థక వాక్యము కర్త్రర్థక వాక్యముగా మారునను మాట మూలకర్త అభిప్రాయ మనుట కాధారము లేదు. కర్త యందుండు ధర్మము కర్తృత్వము. 'నుతింపబడిన' యనునది కర్మార్థక వాక్యము నందలి క్రియ. దానికి కర్తృత్వము వచ్చుట యేమి? కర్త్రర్థక వాక్యమునందలి క్రియవలె మారుట యని లక్షణావృత్తిచే జెప్పవచ్చును. అట్లు చెప్పుటకు ముందచట వాచ్యార్థము కుదురుట లేదని నిర్ణయింపవలెను. వాచ్యార్థము కుదురనపుడే గదా లక్షణను జెప్పుట!

తెలుగున కర్తకు ప్రథమయు దృతీయయు వచ్చుచున్నవి. ఇచట విశేషము 'పడు' అను ననుబంధము లేకుండ కర్మార్థక వాక్యమేర్పడుట. ఆమాటనే సూటిగా చెప్పరాదా? ఈ కర్తృత్వము నంటగట్టుటేల? చెప్పినంత మాత్రమున నీవు నుతించిన రాజను చోట రాజునకు కర్తృత్వము వచ్చునా? కావున నీయర్థ ముచితముగా లేదు. దీనికహోబలపతి "కర్మాదికారకాణాం కర్త్రర్థతాస్యాత్ కర్త్రర్థతా ప్రయుక్తాయాః తృతీయాయాః ప్రథమాచస్యాత్ తద్వద్భూతార్థే నవర్ణకశ్చస్యాత్." "కర్మార్థతాయాం చద్వయం త్రయాణాం సముచ్చయద్యోతకమ్, ఇతరత్రతు ద్వయోస్సముచ్చయద్యోతకమ్. కర్త్రర్థత్వం చాత్ర కర్తృగత క్రియావాచక క్రియాపద సామానాధికరణ్యమ్ వివక్షితమ్,"[1] (కర్మాదికారకార్థములకు కర్త్రర్థత వచ్చును. కర్మార్థత్వముచేగలుగు దృతీయకు ప్రథమ గూడ వచ్చును. అట్లే భూతార్థమున నవర్ణకము వచ్చును. కర్మార్థక వాక్యమున కర్త్రర్థత్వము, ప్రథమ, నవర్ణకము మూడును వచ్చునని చకారద్వయము తెల్పును. తక్కినచోట్ల ప్రథమ, నవర్ణకములు మాత్రమే వచ్చునని చకారద్వయము సూచించును. ఇచ్చట

---

[1] కవిశిరో. హలంత ౩౩ సూ. వ్యాఖ్య. 481 పుట.

కర్త్రర్థత్వమనగా కర్తృగత క్రియావాచక క్రియాపద సమానాధికరణత్వము) అని వ్రాసెను.

సూత్రమున కర్మాదులకు కర్తృత్వము, ప్రథమ, సవర్ణకము మూడును వచ్చునని యుండగా వ్యాఖ్యాత 'కర్మార్థక వాక్యమున మూడును వచ్చును. తక్కిన చోట్ల రెండును వచ్చు'ననుటకు ప్రమాణము లేదు.

కర్తృత్వమను దానికి కర్త్రర్థత అనునర్థము చెప్పుట గూడ ప్రమాణ రహితమే.

సంస్కృతమున కర్తరి ప్రయోగము, కర్మణి ప్రయోగము, ద్వికర్తృక కర్తరి ప్రయోగము, ద్వికర్తృక కర్మణి ప్రయోగము, ద్వికర్మక కర్మణి ప్రయోగము, కర్మ కర్తరి ప్రయోగము, భావే ప్రయోగమునను వాక్య ప్రయోగములున్నవి.

చింతామణిలోని కర్మశబ్దమునకు కర్మార్థక ప్రయోగము (కర్మణి ప్రయోగము) కర్తృత్వ శబ్దమునకు కర్తరి ప్రయోగమునను నర్థములు చెప్పబడినచో ఆది శబ్దముచే తక్కిన ప్రయోగములు చెప్పబడవలసి యుండును. అహోబలపతి అట్లు చెప్పుట లేదు. కరణము, సంప్రదానము మొదలగు కారకములతో కూడిన వాక్యములను గ్రహించుచున్నాడు. 'కర్మాదేః' అనునొక సమాసములో కర్మపదముచే కర్మణి ప్రయోగమును ఆదిశబ్దముచే కరణాది కారకములతో గూడిన వాక్యములను గ్రహించుటలో నౌచిత్యమేమి ?

కర్తృత్వ పదమునకు కర్త్రర్థత్వమనియు, దానికి కర్తృగత క్రియావాచక క్రియాపదసామాన్యాధికరణ్యమనియు వివరణము నిచ్చెను. 'నీవు నుతించిన రాజు' అనుచోట నీవు అనుకర్తయందున్న పొగడుట అనుక్రియకు రాజునకు సామానాధికరణ్య మెట్లు కుదురును ?

కుదురనందుననే వీనిని కర్మధారయాభాసములుగా నహోబలపతియే యుదాహరించెను.[1] ఈ కుదురని సామానాధికరణ్యమునకీవింత నిర్వచనము లేల ? కావున పై వాఖ్యలు సూత్రమున కేదో యొక అర్థమును చెప్పుటకు జేయబడినవే కాని గ్రంథకారుని హృదయమును వెల్లడించునవి కావు.

చింతామణిలోని పలు సూత్రములను గ్రహించిన చిన్నయసూరికీసూత్రమున కర్మాదులకు కర్తృత్వము వచ్చుటనునది కుదుర లేదు. కావున “కర్మాదులకు బ్రాధాన్య వివక్షయందు ధాతుజ విశేషణంబులు కర్తతోడంబోలె వానితోడ సమసించు” నని వ్రాసెను.[2] ఇది గూడ అగతిక న్యాయముగా సరిపెట్టుకొను నర్థమే. రాముడు రక్షించిన భృత్యుడను నుదాహరణమున ‘రక్షించిన’ అనుధాతుజ విశేషణము కర్తతోవలె కర్మమగు భృత్యునితో సమసించెనా యని ప్రశ్న. సమసించుట యనగా సమాసము పొందుట. సమర్థంబులగు పదంబు లేక పదంబులగుట సమాసంబు గదా !

‘పృథగ్భూతంబులగు నర్థంబుల కేకార్థీభావంబు సామర్థ్యంబు”[3] రాముడు రక్షించిన భృత్యుడను చోట రక్షధాతువు నర్థమునకు భృత్య పదార్థమునకు యేకార్థీభావము వచ్చుచున్నదా ?

ధాత్వర్థ వ్యాపారాశ్రయము కర్త. ధాత్వర్థ ఫలాశ్రయము కర్మ. రక్షింపబడిన భృత్యుడను చోట ధాతుజ విశేషణమునకు గర్మకు గల్గిన యేకార్థీ భావము, రక్షించిన రాముడను నపుడు ధాతుజ విశేషణమునకు కర్తకు గల్గిన యేకార్థీభావము, రాముడు రక్షించిన భృత్యు

---

1. నీవు పోషించిన భర్తులు ఇత్యాదాః కర్మధారయాభాసాః కవిశిరో. హలన్త 43 సూ. వ్యాఖ్య (1965), 520 పుట.
2. బాలవ్యా. సమాస 26 సూ.
3. బాలవ్యా. సమాస 1 సూ. వృత్తి.

డను చోట గల "రక్షించిన భృత్యుడ"ను పదములకు గలుగ దనుట స్పష్టము. కల్గినట్లు కనుపించును. కావుననే దాని నాభాస కర్మధారయమని యథర్వణుడు పిలిచినాడు.[1]

మఱియొక మాట. ప్రాధాన్య వివక్ష లేకున్నను ధాతుజ విశేషణమునకు కర్మాదులతో ఆభాసరూపమైన అన్వయము గలుగుట కభ్యంతరము లేదు. "తాను వశపఱచుకొనిన సేన తోడ రాజు రాజధానిని చేరెను" అను వాక్యమున సహార్థయోగమున సేనా శబ్దమునకు దోడ వర్ణకము వచ్చినది. 'సహయుక్తే౽ప్రధానే'[2] అను పాణినీయమీ తృతీయ అప్రాధాన్యమున వచ్చునని తెలుపుచున్నది. ప్రాధాన్యము లేని యీ సేనాశబ్దముతో ధాతుజ విశేషణమున కాభాసాన్వయము గలిగినది గదా!

చిన్నయసూరికి చింతామణిపై నపరిమిత గౌరవమున్నది. మహా పరిశోధకుడై కొన్ని శతాబ్దులకాలమాంధ్ర కవులను భయపెట్టగలిగిన[3] అప్పకవి మతమును[4] పేరెత్తకుండ నిరాకరించిన సూరి[5] చింతామణికారుని బహువచనముతో, బిరుద వాచకముతో దప్ప వ్యవహరింపలేదు.[6] అంతటి గౌరవమున కాస్పదుడైన వ్యక్తి వ్యర్థ

---

1. కవిశిరో. హలంత 43వ సూ. వ్యాఖ్య (1965), 520 పుట.
2. సిద్ధాంత కౌముది కారక, 564 సూ.
3. శ్రీ ఆరుద్ర, స. ఆం. సాహిత్యం మచిలీపట్నం: యమ్. శేషాచలం, 11 సం. 218 పు.
4. అప్పక. 5 ఆ. 98 ప.
5. 'అనుకృతిని నిడుదకుంగుఱుచ యగునని యొకండు వలికె నది నిరాకరంబు'
   'దుర్బలస్య బలం రాజాయన వినవే' బాలవ్యా. సంధి 54 వృత్తి.
6. 'వాగను శాసనులు యదాతదాయని గ్రహించుట ప్రపంచార్థమని యెఱుంగునది,' బాలవ్యా. సంధి, 13 సూ. వృత్తి.

ముగా సూత్రము వ్రాయడను నమ్మికతో నందలి యర్థమును వీలయినంత సమంజసముగా గ్రహించుటకు సూరి యత్నించెను. ఆయత్నము సఫలముగాకున్నను ఆ నమ్మిక మాత్రమసత్యము గాదని పరిశీలించినచో బయట పడును.

నుతింపబడిన రాజువంటి పద్వాను బంధముతో గూడిన ప్రయోగముల కంటె నుతించిన రాజువంటి ప్రయోగములు తెలుగు భాషకు సహజములని భాషా వేత్తలందురు.[1] వింతయేమనగా తెలుగున 'నుతించిన రాజు' వంటి ప్రయోగమున రాజునకు కర్తృత్వముగాని కర్మత్వముగాని రావచ్చును. ఇట్లే రాముడు గోవునిచ్చిన విప్రుడు, నీవు పరమాత్మ భావత నుండినవారు మొదలగు ప్రయోగములలో కర్తలను ప్రయోగింపనిచో గోవునిచ్చిన విప్రుడు, పరమాత్మ భావత నుండినవారు అను వాక్యములలో విప్రుడు, ఉండినవారు అనువానిని సంప్రదానాధికరణములుగా గ్రహించినట్లే కర్తలుగా గూడ గ్రహింపవచ్చును. ఇది తెలుగు భాషకు ప్రత్యేకమయిన లక్షణము. దీనిని జెప్పుటకే కర్మాదేః అను సూత్రము బయలుదేరి యుండును. ఇచట కర్మ, సంప్రదానము, అధికరణము అను కారకములకు కర్తృత్వము, ప్రథమా విభక్తియు వచ్చినవి. అవి కర్మాదులుగా వ్యవహరింపబడినపుడు వాడిన భూతార్థక విశేషణమునకు నర్ణకము వచ్చినట్లే అవి కర్తలుగా నున్నపుడు నవర్ణకము వచ్చుచున్నది. ఇట్లు సమన్వయించినచో బూర్వ వ్యాఖ్యలలో గలిగిన యనుపపత్తులు దొలగును.

చింతామణి కర్త ఉపలక్షణ ప్రీతి గలవాడు. కావున భూతకాల ధాతుజ విశేషణములతో గూడు కర్మాదులు కర్తలుగా నగుట కవకాశమున్నట్లే భవిష్యద్వర్తమాన తద్ధర్మక్రియాజన్య విశేషణములతో

---

1. డా. బూదరాజు రాధాకృష్ణ, "ప్రాచీనాంధ్రం - శాసన భాషా పరిణామం" తె. భా. చ. 97, 98 పు.

గలసిన కర్మాదులకు గూడ కర్తృత్వము వచ్చునని యాతని కభిప్రాయ ముండవచ్చును. కావుననే ప్రథమాచ నవర్ణకశ్చ తద్వత్ స్యాత్ (ప్రథమయు నవర్ణకమును నట్లే వచ్చును) అని చెప్పినాడు. ప్రథమ కూడ వచ్చుననుటచే ప్రథమేతర విభక్తులుగూడ ఉండవచ్చుననియు నవర్ణకముగూడ వచ్చుననుటచే నవర్ణకేతర వర్ణకములు రావచ్చునని సూచించినట్లు భావింపవచ్చును.

భూతార్థమున నవర్ణకము[1] ప్రతిషేధార్థమున నివర్ణకము[2] వర్తమాన కాలమున చువర్ణకము[3] విశేషణములకు వచ్చుచున్నవి. వానితోఁగూడ నీరూపము లేర్పడినచోఁ నుతింపనిరాజు, గోవు నిచ్చుచున్న విప్రుడు ఇత్యాది రీతిగా నుండును. సూత్రమున 'తద్వత్' అనుచోట వతిప్రత్యయమున్నది. ఇది కార్యాతిదేశమున మాత్రమె వచ్చును. తచ్ఛబ్ద వాచ్యమేది? నీవు నుతించిన రాజు ఇత్యాది వాక్యములలోఁ కర్మకు ప్రథమ, క్రియాజన్య విశేషణమునకు నవర్ణకము వచ్చినట్లే కర్మాదులకు కర్తృత్వము వచ్చినపుడు గూడ వచ్చుచున్నవని తెలుపుట ఈయతిదేశమునకు ఫలము.

చింతామణి కర్మణి ప్రయోగమున 'పడు' ధాత్వనుబంధమును విధించినది. నీవు నుతించిన రాజు అనుచోట 'పడు' అనుననుబంధమేల రాదని శంకింపవచ్చును. 'కర్మణ్యనుబంధ స్స్యాత్పతిధాతుః కర్తృవచ్చ తద్విధయః' అను సూత్రమున చకారము అనుబంధః అను పదముతోఁ నన్వయించినచోఁ కర్మణి ప్రయోగమున పడు అనునది యనుబంధముగా గూడనగును. దాని విధులు కర్తరి ప్రయోగము నందు

---

[1] 'భూతార్థానాంతునః క్రియాణాం స్యాత్' కవిశిరో. హలంత.32 సూ.

[2] 'ప్రతిషేధ వాచినాం నిః' కవిశిరో. హలంత, 31 సూ.

[3] 'చురితి క్రియా పదానాం సర్వేషాం వర్తమాన కాలేస్యాత్' కవిశిరో. హలంత, 30 సూ.

వలెనే యుండును అను నర్థముగలుగును.[1] అనగా 'పడు' అనుబంధము వికల్పమని సిద్ధించునన్నమాట. కర్తృవత్ అనుదానితో చకారము నన్వయించినచో 'కర్తరి ప్రయోగము వలె కూడ దాని విధులుండును.' అని చెప్పవలసి వచ్చును. అట్లు చెప్పుటవలన చకారమునకానర్థక్యము చెప్పుటగాని, కర్తరి ప్రయోగ భిన్నమగు మఱియొక ప్రయోగమువలె గూడ నుండునని యంగీకరించుట గాని చేయవలెను. నుతించినరాజు ఇత్యాదులలో నుతించిన అనుదానికి కర్మణి కర్తరి ప్రయోగముల విధులకంటె నితరమగు విధులేవియు వచ్చు నవకాశము లేనందున నీయన్వయము సరిగాదు. కాన పైన చెప్పినట్లు చకారము 'అనుబంధః' అను పదముతో నన్వయింపవలెను. ఇంతకును బాలసరస్వతి చేసిన వ్యాఖ్య ఉచితముగా లేదని పైన స్పష్టమైనందున నాతడీ సూత్రమును రచించెననుట అసంగతము గదా !

వ్యాఖ్యాతల ప్రమాదము

కొన్ని చింతామణి సూత్రములకు భావమును వ్యాఖ్యాతలు సరిగా గుర్తించలేరని మఱికొందరు పరిశోధకులు గూడ భావించినారు.

'అగుణసతాం సర్వహలాం సోర్లోపః' అను సూత్రమున కహోబలపతి 'గుణవద్గణ వ్యతిరిక్తానాం మహతా మమహతాం శబ్దానాం సోర్లోపస్స్యాత్.

(గుణవద్గణ భిన్నమైన మహదమహ చ్ఛబ్దముల ప్రథమైక వచనమునకు లోపము వచ్చును) అని వ్రాసెను.[2]

ఇట్లు వ్రాయుటచే ఆత్మన్ శబ్దమునకు, ఇమనిచ్ ప్రత్యయాంతములకు గూడ ప్రథమైక వచన లోపము సిద్ధించుచున్నందున 'ఆత్మన ఇమనంతానాండావా (ఆత్మన్ శబ్దమునకు, ఇమనిచ్

---

[1] కవిశిరో. క్రియ 49 సూ.

[2] కవిశిరో. హలంత 5 సూ. వ్యాఖ్య.

ప్రత్యయాంతములకుడాప్రత్యయము వికల్పము) అను విధి వ్యర్థమగును. [1] ఏలయన 'ఆత్మా అను ప్రథమైక వచనాంత ప్రాతిపదికకు 'దీర్ఘాణాం హ్రస్వస్స్యాత్' అను సూత్రముచే హ్రస్వమువచ్చి, ఆత్మ అని కాగా 'అగుణవతాం సర్వహలాం సోర్లోవః' 'అను సూత్రముచే సులోపము వచ్చి ఆత్మ అని యగును. కాన షేరేడా ప్రత్యయ విధి అనవసర మగుచున్నది.

చింతామణిలో 'సాంతా దపయః ప్రభృతేః స్లోపః' అను సూత్రముచే మనస్ ప్రచేతస్ మొదలగు చోట్ల సకార లోపము విధింపబడు చున్నది.

'అగుణవతాం' ఇత్యాది సూత్రముచే నిచట గూడ ప్రథమైక వచనము లోపించినచో మనము ప్రచేతుడువంటి రూపములు సిద్ధింపవు. కాన చింతామణి కర్త గుణవద్గణ భిన్న హలంత శబ్దముల కన్నిటికి 'అగుణవతాం' అనుదానిచే పథమైక వచన లోపమును జెప్పదలచ లేదని సూచితమగుచున్నది. [2] కావున నహోబలపతి చెప్పిన అర్థము సరిగాదని ఆచార్య బేతవోలు రామబ్రహ్మము తెల్పినారు. 'ద్విత్వోత్వే సర్వహలాం హ్రస్వాత్' 'ద్విత్వంతు దీర్ఘతో బహుళమ్' అను సూత్రములచే ద్విత్వోత్వములను బొందు హలంత శబ్దములకు మాత్రమే 'అగుణవతాం సర్వహలాం సోర్లోపః 'అనుదానిచే ప్రథమైక వచన లోపము గల్గునను నియమమును జెప్పవలెనని వారు చెప్పినారు. [3] అహోబలపతి 'అగుణవతాం' ఇత్యాది సూత్రమునకు బై రీతిగా నర్థము వ్రాయుటకు కారణము బాలసరస్వతి. ఆయన చెప్పిన

---

1. కవిశిరో. హలంత 7 సూ.
2. తె. వ్యా. సం. ప్రా. వ్యాకరణాల ప్రభావం నాగార్జుననగర్ డా. బేతవోలు రామబ్రహ్మం,(1983), మొదటి అనుబంధం v పుట.
3. అందే iv, v పుటలు.

అర్థమిది. "అగుణవత్ప్రభృతి = గుణవర్ధన వ్యతిరిక్తమైన, హలన్తం= హలన్త శబ్దజాతము, సర్వత్ర = ఈ తెనుగున నంతటను, ప్రథమైక వచన తుల్యం = సంస్కృతములో బ్రథమైక వచన మెట్లుండునో యట్లు నిలుచును." "అగుణవతాం = అగుణవత్ప్రభృతులయిన, సర్వ హలాం = సమస్తమైన హలన్తములకును, సోర్లోపః = ప్రథమైక వచన లోపమగును.[1] డాక్టర్ బేతవోలు వారు చెప్పిన దానిని బట్టి కూడ బాలసరస్వతి చింతామణి సూత్రమును సరిగా వ్యాఖ్యానింప లేదని చెప్పవలెను. ఈ విషయము గూడ మూలకర్త బాలసరస్వతి గాడని వెల్లడించును.

వాయిరవుర్వ్రకతమౌ

ఈ సూత్రమును బాలసరస్వతి 'ఐఔలు వికల్పముగా అయి, అవు అని యుండునని వివరించి కైలు, కయిలు ఔరా, అవురా, అని యుదాహరించెను.[2]

ఆంధ్ర శబ్దచింతామణిని బాలసరస్వతియే వ్రాసెనని పలుచోట్ల ప్రతిపాదించిన డాక్టర్ ఆకురాతి పున్నారావు గారు కూడ "ఈ సూత్రం అయి అవులకు ఐ ఔ లను విధించేది : అగుధాతు నిష్పన్నాలయిన అయి అవులే ఉచ్చారణవశాన ఐ ఔ లని ఏకాక్షర పదాలుగా కాలక్రమాన మారాయి. కాని బాలసరస్వతి వ్యాఖ్యానంలో ఆ విషయం వ్యత్యస్తం చేయబడింది" అని తెలిపినారు.[3] వీరికి ముందు నారాయణీయాంధ్ర వ్యాకరణ కర్తలు శ్రీ చర్ల నారాయణశాస్త్రి "...... తెనుగుననుదంత ధాతువులే గాని యితరములు లేవు ...... కాన అయి అవులే ప్రకృతులనియు ఐ ఔ లే ఆదేశము

---

[1] ప. బాలస. హలంత. 33 పుట.

[2] ప. బాలస. అజంత. 16 శ్లో.

[3] సం. ప్ర. వ్యాకరణాలు 299 పుట.

లనియు జెప్పవలయును. ...... ఈ సూత్రము దగ్గఱ బూర్వ వ్యాఖ్యాతలందఱును బొరపడి యున్నారు. అహోబలుడు మాత్రము రెండు విధములుగను వ్యాఖ్యానము చేసెను." అని 'వాయిఃపుర్వ క్రతమా' అను సూత్ర వ్యాఖ్యానమున బొరపడిన వారిలో బాలసరస్వతిని గూడ జేర్చియున్నారు.[1]

సూత్ర రచన క్రమమును జూచినను అయి అవులకు వక్రతమములను విధించిట్లే కనబడుచున్నది. మూలమును బాలసరస్వతియే రచించి యున్నచో అయి అవులకు ఔ ఐ లను విధించు సూత్రమును వ్యత్యస్తముగా వ్యాఖ్యానించుట జరుగదు గదా! కావున బాలసరస్వతి చింతామణిని వ్రాసెనను పున్నారావు గారి వాదము వారి అభిప్రాయమునకే విరుద్ధము.

బాల సరస్వతి శీలము

ఆంధ్ర శబ్దచింతామణిని బాలసరస్వతి వ్రాసి నన్నయ పేర ప్రకటించినాడని కొందరు తలంచుచున్నారు.[2] అది సత్యమో కాదో నిర్ణయించుకొనుటకు బాలసరస్వతి శీలమును గూడ పరిశీలింపవలయును. వ్యక్తి శీలమతని ప్రవర్తనను నియమించుచుండును గదా!

బాలసరస్వతీయ గ్రంథారంభమున నతడు వ్రాసిన పద్యముల వలన నతని శీలము వ్యక్తమగును. ఇతడు హరి హర భేద భావము లేని యద్వైత భక్తుడు. బాలసరస్వతీయమునందలి మొదటి పద్యమున శివ కేశవ పరములగు ప్రకృతార్థములు రెండును, అప్రకృత కల్ప

---

1. ప. బాలస. పీఠిక ౫ పుట.
2. శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులు, డా. ఆకురాతి పున్నారావు ప్రముఖులు, సం. ప్ర. వ్యాకరణాలు 280 పు.

శాఖ పరమగునర్థ మొకటియు గలవని విమర్శకులు తెలిపిరి. [1] ఇతడు కాళికాదేవి నుపాసించిన వాడు. ఆమెను తన యిష్టదైవముగా చెప్పికొనినాడు. [2]

శ్రీ విద్యోపాసకులు ఆత్మను దేవీరూపముగను సదాశివుని భర్తగను భావించి మధురభక్తితో నారాధింతురు. [3] అందుకే కాబోలు విరూపాక్షుని గూడ ఇష్టదేవతగా జెప్పుకొనినాడు. [4]

ఆంధ్ర వ్యాకరణ భాష్యముగా తాను సంభావించిన బాలసరస్వతీయము నతడు 'ఆత్మదేవత' అగు నంబాదేవికే అర్పించినాడు. [5] "లోకోపకారార్థంబు" రచింప బూనితినని తన టీకా రచనకు ప్రయోజనమును దెలిపియున్నాడు.[6] దానితోపాటు సుకృతకీర్తి లాభములు గూడ కల్గునని ప్రహర్షించినాడు. [7] ఇట్లు నిర్మలమనస్సుతో జగజ్జననికి నివేదించిన పనిలో "కూటకరణమునుచేసెననుట" వినుటకుగూడ బాధ గలిగించు విషయము. [8] బాలసరస్వతి మహోపాధ్యాయుడు, మంచి కవి, మహాపండితుడు. అతడాంధ్ర శబ్ద చింతామణికి టీక వ్రాయక

---

1. శ్రీ వఝుల చినసీతారామస్వామి శాస్త్రి, బాలసరస్వతీయ పీఠిక వావిళ్ళ ప్రతి, 138 పు.
2. అందే 141, 142 పుటలు. 2 ప. 3 వ.
3. భావనోపనిషత్ 27, 28 మంత్రములు, శ్రీ విద్యా సపర్యా పద్ధతి మద్రాసు : శ్రీ యన్. సుబ్రహ్మణ్య అయ్యర్ సంకలితము. (1938), 183 పు.
4. బాలస. వావిళ్ళ ప్రతి, గ్రంథారంభము 5 ప.
5. అందే 144 పు. 11వ.
6. అందే 3వ.
7. అందే 143 పు. 5వ.
8. డా. ఆ. పున్నారావు, సం. ప్రి. వ్యాకరణాలు 280 పు.

పోయినను ప్రాకృత వైయాకరణునిగా, ఆంధ్రమహాకవిగా సారస్వత చరిత్రలో నిలువదగినవాడే.[1] మృదుమధుర పదజాలముతో మెత్తటి భావములతో నున్న బాలసరస్వతి రచన లాయనకు కీర్తిని సంపాదింపగలిగినవే. ఇతని రచనలలో గీత ప్రబంధము, త్ర్యర్థికావ్యము, నాటకము, ప్రబంధములు, పురాణ ప్రబంధములు, శాస్త్రములు గూడ కలవు. ఇతడఖిల కవితా స్వతంత్రుడు. శతాగ్రప్రబంధకర్త. వేద శాస్త్ర పురాణ సంగీత సాహిత్యాది బహుకళాధరుడు.[2] మహోపా

---

1. ‘భర్తృహరి శతకములను బాలసరస్వతి, పుష్పగిరి తిమ్మన, ఏనుగు లక్ష్మణకవియు నాంధ్రీకరించియుండిరి. బాలసరస్వతి పద్యములు తిమ్మకవి పద్యములకంటె రసవంతములుగా నున్నవి’ శ్రీ చాగంటి శేషయ్య ఆం. క. త. 11 సం. కపిలేశ్వరపురము: హిందూధర్మ శాస్త్రగ్రంథనిలయం, (1959), 139పు. బాలసరస్వతి యసాధారణ శేముషీ మహిమ కలవాడు. ఈతని కవిత్వము నిర్దుష్టమై ప్రౌఢమై హృదయంగమముగా నున్నదనుటకు సందియములేదు.
అందే 147 పుట.

2. “భాష్యాది బహుశాస్త్ర పరిచయోదాత్తుండ, గౌముదీ నాటక కావ్య కవిని, భాషా వివరణాఖ్య భవ్య శాస్త్ర కరుండ, బాహట స్థాన నిబంధనుండ, జంద్రా పరిణయాది సత్కృతి స్రష్టను, విప్ర వామన పురాణ ప్రబంధ, భ్రామరీగీత ప్రబంధాఘు కర్తను, దక్షిణ కాళికా తంత్ర చణుడ, బ్రకట రాఘవ యాదవ పాండవీయ, నామక శ్లేష కవితా ప్రణాయకుండ, ననఘ కౌండిన్య గోత్రుండ నఖిల సుకవి, తాస్వతంత్రుడ బహు కళాధరుడ నేను” బాలసరస్వతీయ గ్రంథారంభము “సారసారస్య సచ్చంద్రికా పరిణయ ప్రముఖ శతాగ్రప్రబంధకర్త ... వేదశాస్త్రపురాణ వివిధసంగీత సాహిత్యాది విద్యోప బృంహణుండ...” రా. యా. పాం. ఆం. క. త. 11 సం. 136 పు.

ధ్యాయుడు, మహాభాష్యాది బహుశాస్త్ర పరిచయము గలవాడు. ద్వ్యర్థి కావ్య రచనమే క్లిష్టము. త్ర్యర్థి కావ్యమును రచించినవాడు సామాన్యుడెట్లగును ? ఈ బహుముఖ ప్రజ్ఞాశాలి పండితుల వంశములో జనించెను. కావున నితని మేధాసంపదకు తగు విద్యలభించినది. ఇతని పిన ముత్తాత తిర్మలయ్య అళియ రామరాయలచే గౌరవింపబడిన పండితుడు.[1] తండ్రి పాకనాటి సకల పండిత కవి జనాచార్యుడు.[2] సోదరు డాదిత్యకవి. మహాభక్తుడు, లోకోపకారము చేయగోరువాడు, మహాకవి, పండితుడు, మహోపాధ్యాయ బిరుదాంచితుడునగు బాలసరస్వతి వంటివాడు కూటము చేసెననుటకు బలీయ సాక్ష్యము దొరకినగాని వీలులేదు. ఈ సందర్భమున మఱియొక విషయముగూడ గమనింపదగినది. తనకు ఆంధ్ర శబ్ద చింతామణినిచ్చిన శివయోగిని గూర్చి వివరములు బాలసరస్వతికి దెలియుననుట కాధారములు లేవు. బాలసరస్వతి "అచింత్య కారణోపాగమ స్నేహ సాహచర్యుండ"ను నొక్క విశేషణమును మాత్రమే శివయోగికి వాడినాడు.[3] మఱియు చింతామణి గ్రంథకర్తను గూర్చి వివరములు బాలసరస్వతికి తెలియవనిపించుచున్నది. అతని వ్రాతయిది. "అని యిష్టదేవతా ప్రార్థనంబు జేసి మున్నొకనాడు విద్యానగరిలో నచింత్య కారణోపాగమ స్నేహ సాహచర్యుండగు శివయోగి వర్యుచే దైవచోదనం బరిప్రాప్తమైన యాంధ్ర శబ్ద చింతామణి గ్రంథంబునకు లోకోపకారార్థంబుగా టీక గావింపగోరి నెమ్మనంబున,

ఉ॥ "ఏమి మహాద్భుతం బిది హరీ హరియెక్కడి యాంధ్ర శబ్ద చిం
తామణి ఫక్కి ? యెక్కడి మతంగనగంబు ? యుగాది సంభవుం

---

1. బాలస. వావిళ్ళ ప్రతి, సంజ్ఞ, గ్రంథారంభము 9 ప.
2. బాలస. వావిళ్ళ ప్రతి, సంజ్ఞ, గ్రంథారంభము 7 ప.
3. అందే గ్రంథారంభము 8 ప.

డై మని చన్న నన్నయ మహాకవి యెవ్వడు ? సిద్ధుడెవ్వడా
హా ! మదగణ్య పుణ్య సముదగ్రత జేకురెగాదె యిన్నియున్".[1]

ఇందు "నన్నయ మహాకవి యుగాది సంభవుడై మనిచనుట, ఆగ్రంథము పెక్కు వత్సరములంతర్భూతమై యుండుట" యనునవి బాలసరస్వతికి సిద్ధునివలన తెలిసియుండును. ఇవి తప్ప గ్రంథకర్తకు గ్రంథమునకు సంబంధించిన విశేషముల నతడేమియు జెప్పలేదు. ఆంధ్ర మహాభారత కర్తయైన నన్నయయే ఆంధ్ర శబ్ద చింతామణికిని కర్తయను దృఢవిశ్వాసమాతనికున్నచో గ్రంథకర్తకు చెందిన విశేషములను దెలుపడా ? ఇతడు తనకు చెందిన విశేషములన్నిటిని దెలుపుకొనెను. ఆంధ్రశబ్దచింతామణి వ్యాఖ్యచే దనకు కీర్తి సుకృతములు గలుగునని భావించినవాడు : గ్రంథకర్త గొప్పవాడైనచో దనకు మరింత గౌరవ కారణముగదా ! ఆ వివరములనేల చెప్పలేదు ? తన కాతనిగుఱించి తెలిసినచో "నన్నయ మహాకవి ఎవ్వడు?" అను ప్రశ్నార్థక వాక్యమును వ్రాయునా ? కావున భారత కర్తయు చింతామణి కర్తయు నొకడే యని బాలసరస్వతి చెప్పలేదనియు, నతనికి చింతామణి కర్త వివరములు దెలియవనియు చెప్పవచ్చును. కాని భారత చింతామణులకు కర్త యొకడు కావచ్చునను నూహ బాలసరస్వతికుండ వచ్చును. అతనికే యన నేల ? నామ సామ్యమును బట్టి యిట్టి యూహ యెవరికైన గల్గును. ఉకారాంత మహత్తులకు ప్లుతమును విధించు సందర్భమున ప్లుతమునకు "ప్రయోగమును వాగనుశాసనులు తామే చెప్పినారు. 'జరత్కారూ^{3}ముని శ్రేష్ఠ" అని భారత ప్రయోగమును బాలసరస్వతి యుదాహరించినాడు.[2]

ఇచట భారతకర్తకు వాగనుశాసన బిరుదమును వాడుటచేత, వాగనుశాసనులు తామే చెప్పినారను వాక్యమున "లక్షణమును

---

[1] అంకే 3, 4 వ, ప.

[2] ప. బాలస. 27 పుట.

లక్ష్యమును తానే చెప్పె" ననునర్థస్ఫూర్తి గలుగు చుండుటచేత నితనికి చింతామణికి భారతమునకు కర్త యొకడను నూహకలదని తోచుచున్నది. భారతకర్త తనను విపుల శబ్ద శాసనునిగా జెప్పుకొనినాడు. చింతామణికారుడు తనను సకల భాషా వాగనుశాసనునిగా బేర్కొనినాడు.[1] ఇందు భారత ప్రయోగము నుదాహరించి యది వాగను శాసనులది యని చెప్పుట గ్రంథద్వయమునకు గర్త యొకడే యని స్ఫురింప జేయుచున్నది.

కాని భట్టుమూర్తి[2] అడిదం సూరకవి[3] భారతకర్తను వాగను శాసనునిగా జెప్పిరి. భట్టుమూర్తి ప్రభావముచే భారత కర్తను బాలసరస్వతి వాగను శాసనునిగా వ్యవహరించి యుండవచ్చును. కావున గ్రంథకర్త విషయమున బాలసరస్వతికి గల అభిప్రాయము నిదమిత్థముగా నిర్ణయింప వీలులేదు. సారంగధర కథ బాలసరస్వతికి దెలియదు. అతని కాశ్చర్యమును గలిగించిన విషయ మొకటే. 'ఎవడో తెలియని నన్నయ మహాకవి వ్రాసిన గ్రంథము నెవడో శివయోగి తన కిచ్చుట యేమి? అతడుయుగాది సంభవుడట! నాటి నుండి తన నాటి వఱ కా గ్రంథ మంతర్భూత మైయుండెనట! ఈ స్థితి యెవరి కాశ్చర్యమును గలిగింపదు?

అతనికీ యాశ్చర్యము పుస్తకము దొరికినపుడు గలుగలేదు, ఆంధ్రశబ్ద చింతామణి దొరకి కొంతకాలమైనది. దానికి టీక వ్రాయ బూనుకొనెను. అపుడతని కా సన్నివేశములో వైచిత్రి గోచరించినది.

---

1. సటీకాంధ్ర శబ్ద చింతామణి పరిచ్ఛేదాంత గద్య, చెన్నపురి : వావిళ్ళ ముద్రణము, (1956).
2. రామరాజ భూషణుడు, వసుచరిత్ర రాజమండ్రి : కొండపల్లి వీరవెంకయ్య 1 ఆ. 10 ప.
3. కవి సంశయ ప్రథమ. 45 ప.

ఎక్కడి యాంధ్ర శబ్ద చింతామణి ఫక్కి ? యను ప్రశ్నలో సుదూర కాలములోని దను భావముతో పాటు ఏ ప్రదేశములో బయలు దేరినదో అను ప్రశ్న గూడ తొంగిచూచు చున్నది. పై సన్నివేశ మును పరికించినచో చింతామణ్యవతరణ కథ బాలసరస్వతికి దెలియ దనియు నతనికి సిద్ధుని గుఱించి, చింతామణి కర్తను గుఱించియు తెలిసిన దతి స్వల్పమే యనియు స్పష్టమగుచున్నది. ఇచట మఱియొక విషయము గమనింపవలయును. బాలసరస్వతి తనకు దానై చింతా మణికి టీక వ్రాయుదలచ లేదు. సిద్ధుని ప్రేరేపణముచేతనే యతనికా బుద్ధి గల్గినది.[1]

అసలు మతంగనగమునకు చింతామణికి గల సంబంధము గూడ పరిశీలించదగినది. బాలసరస్వతికి చింతామణి నిచ్చినవాడు మతంగ నగమందలి సిద్ధుడు. అప్పకవికి చింతామణి నొసగినవాడు గూడ మతం గనివాసియే.[2] అతడు భాషించునపుడడుగ కుండగనే విశ్వశ్రేయంబను వచనమును జదివినాడు.[3] కావున మతంగ నివాసియగు సిద్ధునకు తదితరులకు చింతామణిపై ప్రత్యేకాభిమానమున్నదని చెప్పవలెను. వారు దాని ప్రచారమును కాంక్షించిరి. కావున వారికిని చింతామణికి సంబంధము కలదని చెప్పవలయును. ఆ సంబంధమెట్టిదో భావిపరి శోధన వలన దేలవలయును. బాలసరస్వతి శీలము స్వచ్ఛమైనదని యు, నతడు మహాభక్తుడనియు, సిద్ధుని ప్రేరేపణచే లోకోపకారార్థము టీక వ్రాసి యిష్ట దేవతకు సమర్పించిన వాడనియు, నతనికి గ్రంథ కర్తను గుఱించి కాని సిద్ధుని గురించి కాని వివరములు స్పష్టముగా దెలియవనియు పై చర్చ వలన తేలినది.

---

[1] "ఈ తెనుగు వ్యాకరణంబు నాకొసగె బ్రీతిన్ డీకగా వింపు మంచలసిద్ధుండు..."బాల స. గ్రంథారంభము 5 ప.

[2] అప్పక. 1వ ఆ. పీఠిక 63 ప. [3] అందే 64 ప.

ఈ భ్రాంతిని బాలసరస్వతి కలిగించెనా ?

బాలసరస్వతి విరాగియు వంచకుడునుగాడు. లోకోపకార సుకృతకీర్తి లాభములకు ప్రవర్తించు సత్పురుషుడు,[1] తాను వ్రాసిన గ్రంథముల పట్టికను, తన విద్యలను బిరుదమును దన గ్రంథములలో చేర్కొనెను.[2]

చింతామణీ కర్తగూడ విరాగి కాడు. చింతామణి చిన్నగ్రంథమైనను తాను 'సకలభాషా వాగనుశాసను' డనని చెప్పుకొనినవాడు. బాలసరస్వతి 'చింతామణిని భారతకర్త వ్రాసెనని లోకమును భ్రమింపజేయదలచినచో చింతామణిలోని పరిచ్ఛేదాంత గద్యమందుగాని, బాలసరస్వతీయ పీఠికలోగాని భారత రచన ప్రసక్తి తేవలదా? అట్లు జరుగలేదు.

నిజమునకు చింతామణి కర్తకు గూడ తాను, భారతకర్త ఒకరే అను భ్రాంతి కల్గింపవలెనను ఆలోచన ఉన్నట్లు తోచదు. భారతకర్త తనను 'విపులశబ్ద శాసనుని'గా సూచించుకొనెను.[3] కాని చింతామణి కర్తసకలభాషావాగనుశాసనుడు. ఆంధ్ర భారతమునకు చింతామణికి కర్త ఒకడేయను భ్రాంతిని కలిగించ దలచినవాడు భారతకర్త బిరుదమునే వాడుకొనవలెను గాని వేఱొక బిరుదమును వేసికొనునా?[4] భారతకర్త పేర వ్రాయబడినను పరిశోధకులచేత నన్నయ కృతము కాదని నిరాకరింపబడిన చౌడేశ్వరీ విలాసమున తత్కర్త తాను భారత కర్తనని చెప్పుకొనలేదా?[5] ఇట్లు బిరుదులో మార్పు,

---

1. ప. బాలస. కృత్యాది 6 వచనము.
2. అందే పరిచ్ఛేదాంత టీకా గద్య.
3. ఆం. భా. ఆది 1-9 ప.
4. నిజమునకు 'విపుల శబ్దశాసన' బిరుదము కాదు.
5. శ్రీ కె. వెంకటనారాయణరావు, ఆంధ్ర వాఙ్మయచరిత్ర సంగ్రహము చెన్నపురి : వావిళ్ల ముద్రణము, (1967), 62 పు.

భారతమును పేర్కొనకపోవుట అను విషయములు బాలసరస్వతికి గాని, చింతామణి కర్తకు గాని, చింతామణికి నాంధ్ర భారతమునకు కర్త ఒకడేయను భ్రాంతి గలిగించు నాలోచన లేదనుటకు ప్రబల సాక్ష్యములు.

ఆంధ్ర భారతమునకు, చింతామణికి కర్త ఒకడేయని విశ్వసించిన అహోబలపతి చింతామణి సూత్రములకు వీలయినంత వరకు నన్నయ గారి భారతోదాహరణములనొసగెను.[1] చింతామణి సాధించని రూపములను నన్నయగారి ప్రయోగములచే సాధించెను.[2] బాలసరస్వతికిగూడ 'భారత చింతామణులకు గర్త ఒకడే అను భావమున్నచో భారత ప్రయోగముల నుదాహరింపడా ?

భారతమందున్న పెక్కు ప్రయోగములను చింతామణి సాధించుట లేదు. భారత విరుద్ధ రూపములను బెక్కిటిని చింతామణి సాధించుచున్నదని పరిశోధకుల నిర్ణయము.[3]

చింతామణిని భారతకర్త పేర బాలసరస్వతియే రచించినచో ఆకూట సృష్టి కనుగుణముగా నాంధ్ర మహాభారత మందలి నన్నయ ప్రయోగములను చింతామణిచే సాధింపడా ? అతడు మహాపండితుడు, మహాకవి, తలచుకొనినచో భారత ప్రయోగానుగుణముగా చింతామణిని రచింపకపోలేడు : అట్లు జరుగలేదు. కావున ఆంధ్రభారత కర్తపేర బాలసరస్వతి చింతామణిని రచించెనను వాదము సరికాదు. అట్లే బాలసరస్వతికిగాని చింతామణి కర్తకుగాని, చింతామణిని భారతకర్త వ్రాసెనను భ్రాంతిని గలుగజేయు నుద్దేశ్యము గూడ లేదనవలెను.

---

1. కవిశిరో. అజంత 28 సూ. వ్యా.
2. అందే 33 సూ. వ్యాఖ్య.
3. సం. ప్ర. వ్యాకరణాలు. 24, 26 పుటలు.

బాలసరస్వతికి ముందు చింతామణికి టీక కలదా ?

బాలసరస్వతి కంటె పూర్వమాంధ్ర శబ్దచింతామణి కొక టీక కలదని క్రింది శ్లోకము తెలుపును.

ప్రసిద్ధ సారంగధరేణ టీకా మపిస్ఫుటీక ర్తుమతీవహర్షాత్,
వాతూల వంశే వతతార భూయః శ్రీనన్న విద్వానహమేవ సోస్మి.[1]

ఈ శ్లోకము నుదాహరించి శ్రీ చాగంటి శేషయ్య సారంగధరుడను పండితుడు చింతామణికి టీకను రచించెనని తెలిపిరి.[2] కాని కవిశిరోభూషణము ననువదించిన ఒకరు 'ప్రసిద్ధుడయిన సారంగధరునిచే ప్రాప్తమైన యీ శబ్ద చింతామణికి వ్యాఖ్యను గూడ లోకమున వెలయింప నుత్సహించుచు శ్రీ నన్నయ భట్టారకుడే వాతూలవంశమునందు నా రూపమున నిప్పుడావిర్భవించెను' అని దీనికి తాత్పర్యమును వ్రాసిరి.[3] దీని ప్రకారము సారంగధర టీక పై శ్లోకములో సూచితము కాలేదనవలెను. కాని పై తాత్పర్యము శ్లోకము నుండి రావలెననిన శ్లోకాన్వయమును క్లిష్టముగా కల్పింపవలెను.

“శ్రీనన్న విద్వాన్ ఏవ ప్రసిద్ధసారంగధరేణ (ప్రాప్తాయాః, ఆంధ్ర శబ్ద చింతామణ్యాః) టీకాం (కర్తుం) (తాంటీకాం) స్ఫుటీకర్తుం అతీవహర్షాత్ భూయః వాతూల వంశే అవతతారసః అహమస్మి” ఇట్లన్వయము చెప్పినగాని పై తాత్పర్యమురాదు. ఈ అన్వయములో 'ప్రాప్తాయాః' కర్తుం 'తాం' అను పదములధ్యాహారములు చేసికొనవలసియున్నది. 'ప్రసిద్ధ సారంగధరేణ' అను

---

1. కవిశిరో. కృత్యాది 75 శ్లో.
2. కవి తరంగిణి. 1 సం. 41 పు.
3. శ్రీ చెలమచర్ల రంగాచార్యులు, కవిశిరో. హైద్రాబాద్ : ఆం. ర. సం. (1965), కృత్యాది 75 శ్లో. తాత్పర్యము.

దళమునకు శ్లోకముతో సముచితమగు నన్వయము కనబడదు. ప్రసిద్ధ సారంగధరుడు ఆంధ్రశబ్ద చింతామణిని బాలసరస్వతి కిచ్చుట ద్వారా అహోబలపతి కా గ్రంథము చేరినది. కావున సారంగధరున కిచట కరణార్థమును చెప్పవలెను. అహోబలపతి టీకను వ్రాసినవాడు. ఈ అన్వయమున 'టీకను వ్రాయుటకు, దానిని స్ఫుటముగా జేయుటకు,' అనునర్థములను చెప్పుటకు టీకా శబ్దము నావృత్తి చేయవలెను. అట్లు చేయనిచో 'టీకాంస్ఫుటీకర్తుం' టీకనుస్ఫుటముగా జేయుటకు అనునర్థము వచ్చును. స్ఫుటము కాని దానిని స్ఫుటముగా జేయుట స్ఫుటీకరణము. ఇన్ని క్లిష్ట మార్గముల నవలంబించుటెందుకు ? సూటిగా వచ్చు నర్థమును గ్రహింప రాదా ? 'శ్రీ నన్నవిద్వాన్ ప్రసిద్ధ సారంగధరేణ కృతాం టీకామపి స్ఫుటీకర్తుం అతీవ హర్షాత్ భూయః వాతూల వంశే అవతతార, సః అహమేవాస్మి' అనునది సుగమాన్వయము. ఇందు 'కృతాం' అను చిన్న పదమును దప్ప అధ్యాహారము తెచ్చుకొననక్కర లేదు. దీని ప్రకార మీ శ్లోకమునకు వచ్చు భావమిది.

'ప్రసిద్ధుడైన సారంగధరునిచేత వ్రాయబడిన టీకను స్ఫుటముగా చేయుటకుచాలా సంతోషముతో నన్నయభట్టే గాలి వారి వంశములో మరల బుట్టెను. అతడే నేను.'

ఈ భావము నంగీకరించినచో ఆంధ్రశబ్ద చింతామణికి మఱియొక టీక కలదని అంగీకరింపవలెను. అది సారంగధరునిదని యిచట నున్నది. అహోబలపతి అభిప్రాయములో బాలసరస్వతికి చింతామణి నిచ్చిన వాడు సారంగధరుడు. అతడు వ్రాసిన టీక బాలసరస్వతీయమునకు బూర్వమందలిదే కావలెను. కాని ఆటీక దొరకెనా ? అది కలదనుటకు నితరాధారము లేవైన కలవా ? అను ప్రశ్నలు తల యెత్తును ?

బాలసరస్వతి 'ఉర్ద్వంద్వేరః క్వచిత్' అను సూత్రమును వివరించుచు 'కొండతే క్వచిచ్ఛబ్దము నుత్తర సూత్రముతో నన్వయింతు'రని తెలిపెను.[1]

అహోబలపతి తరువాతి సూత్రములోనికి అన్వయించి, ఆ కొందతే పాఠమునకే విలువ నిచ్చెను.[2] చింతామణికి ప్రథమ వ్యాఖ్యాత బాలసరస్వతియే అయినచో నతనికి పూర్వమే వేఱొక వ్యాఖ్యాత మతమును పేర్కొనుటకుదురదు గదా! ఇట్టి స్థలము లింకను గలవని ముందు నిరూపింపబడును.

సారంగధర కథ చరిత్రలోలేదు. అప్పకవికి గల్గినది కల మాత్రమే. కాన బాల సరస్వతికి సంగ్రహ టీకతో గూడిన చింతామణి లభించినదని మనము భావించుటకు వీలున్నది.

అహోబలపతి చింతామణిని వ్యాఖ్యచేయుటకు బాలసరస్వతి, అప్పకవి, చేసిన వ్యాఖ్యానములను సంపాదించినాడు. అతనికి అజ్ఞాతకర్తృకమయిన వేరొక టీక గూడ లభించి యుండును. అప్పకవి చెప్పిన కలకథను బట్టి ఆ టీకా కర్త సారంగధరుడై యుండునని అహోబలపతి భావించి యుండును. ఆ కల కథ ప్రకారము నన్నయకు బాలసరస్వతికి నడుమ చింతామణిని వ్యాఖ్యానించుటకు సారంగధరునకు దప్ప వేఱొకని కవకాశము తక్కువ.

కావున నహోబలపతి శ్లోకము, బాల సరస్వతి వ్యాఖ్య, బాల సరస్వతికి బూర్వము చింతామణికి వేఱొక వ్యాఖ్య కలదని సూచించుచున్నవి. ఈ వ్యాఖ్యా విషయమును నిర్ధారణము చేయుటకు మరింత పరిశీలింపవలయును.

---

1. ప బాలస. అజంత 16 శ్లో. వ్యాఖ్య.

1. కవిశిరో°. అజంత 67 సూ.

ఉన్నది

బాలసరస్వతికి పూర్వమే ఉన్న చింతామణి టీకను బాలసరస్వతి చూచెను. తన యభిప్రాయములకు టీకాభిప్రాయములకు భేదము వచ్చినపు డాతడు సూచించి యున్నాడు.

(1) "డు ము వు ల వః ప్రథమాస్యాత్......చతుర్థ్యాస్తసః" పట్టి వలన కంటె ఇతి పంచమీ......వికృతౌస్యాత్.[1]

ఈ ఆర్యాయుగళ మేక సూత్రము, కొందరెనిమిదందురు.

(2) కొందరు ద్వివిధములైన వకారములకు తొల్లి మైత్రి లేదందురు.[2]

(3) ఉర్ద్వంద్వేరః క్వచిత్ అను సూత్ర టీకలో "కొందరీ క్వచిత్ శబ్దము ఉత్తరసూత్రమునకే అన్వయించుకొందురు".[3]

(4) "హనుమద్భగవత్ శబ్దములు కొందర మతమున గుణవద్గణములు కావు.[4]

పై వచనములలో మొదటిది మూడవది సూత్ర విభజనమున, తక్కినవి సూత్రోక్త విషయమునగల మతభేదములు.

బాల సరస్వతికి పూర్వమే టీక యున్నచో అది ఏది అని ప్రశ్న వచ్చును. అహోబలపతి పేర్కొన్న సారంగధర టీక అదియే కావచ్చును. సారంగధరుడు లేనప్పుడు అతని టీక శశ విషాణ సదృశముగాదా ? నిజమే. రాజనరేంద్రునకు సారంగధరుడను కొడుకు

---

1. ప. బాలస. 21 పుట.
2. అందే 10 పుట.
3. అందే 29 పుట.
4. అందే 32 పుట.

లేకున్నను సారంగధరుడను పండితుడు చింతామణికి టీక వ్రాయుట కభ్యంతరము లేదు. కాని బాల సరస్వతి ఈ సారంగధర నామమును దలపనైన లేదు. కావున అప్పకవి చెప్పిన కలనాధారముగ చేసికొని ఈ టీక సారంగ ధరునిదేయని యహోబలపతి యూహించి యుండ వచ్చును. ఆ కలను వాస్తవవృత్తముగా నమ్మినవాడు సారంగధరునకు బాలసరస్వతికి నడుమ మఱియొక వ్యక్తి టీక వ్రాసెననుటకు వీలుండదు కదా ! కావున బాల సరస్వతికి బూర్వ మాంధ్ర శబ్ద చింతామణికి టీక కలదనియు, నహోబలపతి దానిని సారంగధర కృతముగా భావించినాడనియు చెప్పవచ్చును.

ఆ టీక ఏది ?

ఆ టీక యేదని ప్రశ్న ? కళాప్రపూర్ణ శ్రీ వఝల చిన సీతారామస్వామి శాస్త్రి ఎనిమిది బాల సరస్వతీయ మాతృకలను చూచిరి.[1]

(1) గంజాము జిల్లా కరకవలస యగ్రహారమున లభించిన తాటియాకుల పుస్తకము.

(2) విశాఖపట్టణము జిల్లా విజయనగరవాసులు శ్రీ నిడదవోలు సుందరం పంతులుగారిచ్చిన తాటియాకుల పుస్తకము.

(3) విద్వాన్ అంగలూరి శ్రీనివాస తాతాచార్యులుగారిచ్చిన మాతృక.

(4) శ్రీ రావుసాహెబు గిడుగు రామమూర్తి పంతులుగారిచ్చిన తాటియాకుల మాతృక.

(5) ఆంధ్రసాహిత్య పరిషత్తువారి మాతృకకు బ్రతిక. ఇది కాగితపు పుస్తకము.

---

1. బాలస. పీఠిక. వావిళ్ళ ప్రతి. (1971): 20 నుండి 23 పుటలవరకు.

(6) మద్రాసు ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారములోని 322 నెంబరుగల ముద్రిత మాతృక, (కవి జనాంజనము).

(7) పై భాండాగారము నందే 11-12-5 అను నెంబరుగల మాతృక. (ఈ భాండాగారములోగల ప్రతులలో నిది యొకటియే బాల సరస్వతీయమను పేరుతో నున్నది. ఈ భాండాగారములో నున్న చింతామణి టీకలలో నిదియే యెక్కువ మాతృకలతో ముఖ్యముగా గరకవలస మాతృకతోను, విజయనగరపు మాతృకతోను బూర్ణమగు సంవాదము గల్గియున్నది). [1]

(8) ఆర్ 28 = కె. 3-75 అను నెంబరుతో గల గ్రంథము. ఇది ఆంధ్రశబ్ద చింతామణి టీక యను పేరుతో నున్నది. ఇది "యెంత మాత్రమును బాలసరస్వతీయము కాదు. దీనిని కొంత సవరించి ముద్రించినదే వావిళ్ళ వారిచే విక్రయింప బడుచున్న యాంధ్రశబ్ద చింతామణి టీక. దీనిని బాలసరస్వతీయమను పేరుతో పురాణం హయగ్రీవ శాస్త్రులు గారు (క్రీ. శ. 1846) కో. అనంతాచార్యులు గారు (కీ. శ. 1895) ముద్రించినారు. ఈ టీక వ్రాసినవారు నిజమగు బాలసరస్వతీయమును జూడనైన లేదనియు, జింతామణికి బాల సరస్వతీయమను టీక గలదని వ్రాసిన యప్పకవీయ గ్రంథమును జూచి యానలకు బాలసరస్వతీయము బయలుదేరి యుండకుండుటచే (తమకు కనబడకుండుటచే) దమటీక కాపేరు పెట్టివేసిరనియు దోచుచున్నది." [2] అని వారు వ్రాసినారు.

ఇవిగాక (1) ఆర్ (296)= కె. 25 - 16.3, (2) (ఆర్. 142)= కె. 25 - 8 - 9) అను నెంబరులు గల రెండు సమగ్ర మాతృకలలో బాలసరస్వతీయమే యున్నట్లు వారు తెల్పియున్నారు.

---

1. బాలస. పీఠిక, వావిళ్ళప్రతి, 15, 16, 17, 18 పుటలు.
2. అందే (1971), పుట 16

పై యంశములలో

(ఎ) మాతృకలలో బాలసరస్వతీయమను పేరుతో నున్నవి కొన్ని మాత్రమే.

(బి) అందులో నాంధ్రశబ్ద చింతామణి టీక పేరుతోనున్న ఆర్. 28=కె. 3. 75 నెంబరు టీకను పలువురు పూర్వులు పరిష్కరించి బాలసరస్వతీయమను పేరుతో ప్రకటించిరి. ఈ టీకయే పరిష్కరణము నంది వావిళ్ళవారి ఆంధ్రశబ్ద చింతామణి టీకారూపము నందెను.

(సి) ఆంధ్రశబ్ద చింతామణి టీకా కర్త బాలసరస్వతీయమును జూడనైన లేదు అను విషయములు గమనింపదగినవి.

వారు ఆర్ - 28 = కె. 3-75 అను మాతృక టీకా కర్త బాలసరస్వతీయమును చూడలేదనుటకు 4 హేతువులు చూపినారు.

(ఎ) టీకలో 'విశ్వశ్రేయః కావ్య'మను సూత్రమునకు కావ్యము ప్రపంచమునకు శ్రేయస్కరమను నర్థము గలదు.

బాలసరస్వతీయములో కావ్యము సర్వధర్మములలో శ్రేష్ఠమని యున్నది. [1]

(బి) టీకలో శాస్త్రమపౌరుషమాద్యం 'అను శ్లోకమునకు వ్యాఖ్య కలదు. బాల సరస్వతీయ మాతృకలలో నా శ్లోకమునకు టీక లేదు.

(సి) టీకలో నసాన్యత్తద్ధర్మోతః అనునది తద్ధర్మార్థక విశేషణోకారమున కచ్చు పరమగునపుడు నకారము వచ్చునని నుగాగమవిధిగా వివరింపబడెను.

బాల సరస్వతీయములో తద్ధర్మార్థకోకారమునకు సంధినిషేధపరముగా వ్యాఖ్య కలదు. [2]

---

1. ప. బాలస. సంజ్ఞ 1 సూ. వ్యాఖ్య.
2. ప. బాలస. సంధి 2 శ్లో.

(డి) 'బాల సరస్వతీయము'లో గలవనుచు నహోబలపతి తన వ్యాఖ్యలో నుదాహరించిన కొన్ని విషయములు టీకలో లేవు :

బాల సరస్వతీయ మాతృకలలో నున్నవి.

(అ) "మహాకవి ప్రయోగగాఢంచే గ్రామ్యమపి ప్రయోగార్హమిత్యాచార్య తాత్పర్యమితి బాల సరస్వత్యోక్తమ్ 1"

ప్రయోగ ప్రసిద్ధము గ్రామ్యమైనను యోగ్యమేయని వాగనుశాసనుల వివక్ష. 2

(ఆ) బాల సరస్వత్యా త్వత్రాహమాది శబ్దానామంతగస్యానుస్వారస్య ద్విత్వాయోగాత్తత్స్థానే మకారం కృత్వా తస్య ద్విత్వమిత్యుక్తమ్. 3

"సున్నకు ద్విత్వము రానేరదు గాన మకారము చేసికొనునది. 4

(ఇ) సరస్వత్యాతు మిన్నేరు శివ జటావాసినీత్యు దాహృతమ్ 5

'మిన్నేరు శివజటావాసిని. 6

(ఈ) ఆది శబ్దేన మురువు, ముర్వు, దొరువు, దొర్వు, ఇత్యాది గ్రాహ్యమ్. ఆది శబ్దేన కార్వోతు ఇత్యాది గ్రాహ్యమిత్యుక్తం బాలసరస్వత్యా 7

---

1. కవి శిరో. సంజ్ఞ 43 సూ. వ్యాఖ్య 217 పుట.
2. ప. బాలస. సంజ్ఞ 16 సూ. వ్యాఖ్యలో.
3. కవి శిరో. సంధి 19 సూ. వ్యాఖ్య 244 పుట.
4. ప. బాలస. సంధి 5 శ్లో. వ్యాఖ్యలో
5. కవి శిరో. అజంత 59 సూ. వ్యాఖ్యలో.
6. ప. బాలస. అజంత 15 శ్లో. వ్యాఖ్యలో.
7. కవి శిరో. సంధి 42 సూ. వ్యాఖ్యలో.

ఆది శబ్దముచే రేఫాదులకు సులోపమని తెలియునది. ఎట్లన కారుపోతు, కార్పోతు, గోరుపులి, గోర్పులి.[1]

ఈ నాలుగంశములలో నస్స్యాత్తద్ధర్మోతః అను సూత్రవ్యాఖ్యానము, ఆర్ 28=కె. 3-75 అముద్రిత టీకలో నుగాగమ విధి రూపముగా నుండగా వావిళ్ళవారి ఆంధ్ర శబ్ద చింతామణి టీకలో నిషేధరూపముగా మార్చబడినది.[2]

అట్లే (డి. ఈ) అంశమున ఆదిశబ్దముచే మరువు, మర్వు, దారువు, దార్వు, కారుపోతు, కార్పోతు ఇత్యాదు లూహ్యంబులు అని వావిళ్ళవారి టీకలో నున్నది.[3] ఇవి రెండును బరిష్కర్తలు చేసిన మార్పులయి యుండును. తక్కిన 1, 2, 4, అంశములు ఆర్. 28 = కె 3-75 అను నెంబరు ప్రతిలోనున్నట్లే వావిళ్ళవారి ఆంధ్ర శబ్ద చింతామణి టీకలో నున్నవి.

కావున కళాప్రపూర్ణ వఝుల వారన్నట్లు వావిళ్ళవారి ముద్రిత టీకకు ఆర్. 28 = కె. 3-75 నెం. టీకయే మూలమయి యుండును. కానీ పరిష్కర్తలితర గ్రంథములలోని విషయమునుబట్టి కొంత యీ టీకను మార్చియుందురు. శ్రీ పారనందిరామశాస్త్రి

---

[1] ప.బాలస. సంధి. 13 శ్లో. వ్యాఖ్య.

[2] తద్ధర్మోతః = తద్ధర్మార్థక విశేషణము యొక్క ఉకారమునకు అచి=అచ్చుపరమగుచుండగా నః = నకారము, స్యాత్ = అగును. అనగా తద్ధర్మాత్మక క్రియా జన్య విశేషణమున కచ్చు పరమగునపుడు నకారం బంతాగమంబుగా వచ్చుననుట.

ఉదా :-వచ్చు నచ్యుతుండ వచ్చెదు నచ్యుతుండ ఇత్యాదులు. (అముద్రిత టీక) ఇది తిరుపతిలోని ప్రాచ్యలిఖిత భాండాగారమున గలదు.

[3] ఆంధ్ర శబ్ద చింతామణి టీక. సంధి. 42 సూ. వ్యాఖ్య,

గూడ ఈ యముద్రిత టీకనే యాధార పరచుకొనినట్లున్నారు. వారి టీకలోగూడ సూత్రము నకార విధాయకముగానే వ్యాఖ్యానింప బడినది.

బాల సరస్వతికి బూర్వమే చింతామణికి టీక కలదనుకొంటిమి. బాల సరస్వతీయమున 'ఉర్ద్వంద్వేరః క్వచిత్' అను సూత్ర వ్యాఖ్యలో 'కొందఱు క్వచిచ్ఛబ్దము నుత్తరమునకే యన్వయించు కొందురు' అని వ్రాసెను.[1]

(అ) ఈ అముద్రిత టీకలో క్వచిత్ అనునది **తరువాతి** సూత్రముతో కలిసి "క్వచిద్గకారోవః, క్వచిత్=ఒకానొక చోట గకారము వః = వకారము, స్యాత్ = అగును. తా. అనగా నాంధ్ర (మందొ) కానొకచోట గకారంబునకు వకార మాదేశముగా (నగు) ననుట. ఉ. ప్రోగు (పోవు) యి (యీ) గి, యీవి తోగ (?) త్రోవ యిత్యాదులందును సదాది గంతల (?) యందును ద్విరుక్తంబునకు లేదు" అని కలదు. మరియు ఉర్ద్వంద్వేరః అను సూత్రవ్యాఖ్యలో "ఇచట ఉత్తర సూత్రమందు అవి (మందలి ?) క్వచిత్తను నదియు య (న ?) పకర్షింపబడుచున్నది గావున నీ కార్యంబు వైకల్పికంబు" అని కలదు.[2]

(ఆ) డు ము వు ల వః ప్రథమాస్యాత్ ...చతుర్థ్యాః స్తః
పట్టినలన కంటె ఇతి పంచమీ...వికృతౌస్యాత్.

ఈ ఆర్యాయుగళమేక సూత్రము. కొందరెనిమిదందురు.[3] అని బాలసరస్వతి వ్రాసెను. చింతామణి టీకలో ఎనిమిదింటికి[4] విడిగా

---

1. ప. బాలస. అజంత 16 సూ. వ్యాఖ్యలో 29 పు.
2. ఆంధ్రశబ్ద చింతామణి టీక. అముద్రిత ప్రతి.
3. ప. బాలస. 21 పుట.
4. ఆంధ్రశబ్ద చింతామణి టీక వావిళ్ళ ప్రతి 39, 40 పుటలు.

టీక గలదు. ఇట్లు బాలసరస్వతి కొందరి మతముగా జెప్పినవి చింతామణి టీకలో స్వీయ మతముగా నుండుట గమనింపదగినది. పై పరిశీలనముచేత

(అ) ఆంధ్రశబ్ద చింతామణికి గల వ్యాఖ్యానములలో వావిళ్ళ వారు ప్రకటించిన ఆంధ్రశ॥ చింతామణి సటీకము, దానికి మాతృక అయిన ఆర్ 28. కె. 3-75 అను నెంబరు గల టీకయు బాలసరస్వతీయములు గావు.

(ఆ) బాలసరస్వతి కొందరి మతములుగా జేర్కొన్న కొన్ని విషయములాటీకలో నున్నవి అని తెలిసినది. కావున నా టీక బాలసరస్వతికి ముందున్న టీకయును, అహోబలపతి సారంగధరకృత టీకగా జేర్కొన్నదియు గావచ్చును. కాని బాగుగా శిథిలమైన యీ మాతృక గాని ముద్రితమయిన వావిళ్ళవారి టీక గాని పలు మార్పులకు లోనయినట్లు పైన స్పష్టమగుట చేత నేది టీకా కారుని రచనము? ఏవి లేఖకాదుల ప్రక్షేపములను విషయమును నిర్ణయించుట మిక్కిలి కష్టసాధ్యము.

ఈ టీకకు ప్రచారము గలదు

శ్రీ పురాణం హయగ్రీవశాస్త్రిలు, కొ. అనంతాచార్యులు, వావిళ్ళవారు దీనిని ముద్రించినారని శ్రీ వఝులవారు తెల్పినారుగదా! శ్రీ పారనంది రామశాస్త్రి గూడ ఈ టీకను చూచినట్లు తెలియును. 'నసాన్యత్తద్ధర్మోత్రః' అను సూత్రమునకు నుగాగమ విధిగా వీరు గూడ వ్యాఖ్యానించిరి. అట్టి యర్థమీ టీకా సంప్రదాయములో మాత్రము కానవచ్చు చున్నదని పైన యనుకొంటిమి.

"విశ్వశ్రేయః కావ్యమ్" అను సూత్రమునకు కావ్యము ప్రపంచమునకు శ్రేయస్కరమని యీ టీక వ్రాసినది.[1]

---

[1] ఆంధ్రశబ్ద చింతామణి టీక సంజ్ఞ 1 సూ. టీక.

శ్రీ పారనంది రామశాస్త్రి "విశ్వశబ్దమునకు ప్రపంచమర్థ ముండుటచేత ప్రపంచమునకు శ్రేయస్కరమని కొందరు చెప్పుదురు.--- శ్రేయః పదమునకు శ్రేయస్కరమనునది లక్ష్యార్థముగాని వాచ్యము గాదు. వాచ్యము సిద్ధించుచుండ లక్ష్యము సంగతము గాదు" అని టీకామతమును ఖండించిరి.[1]

కావున వారు ఆంధ్రశబ్ద చింతామణి టీకను చూచిరనుట స్పష్టము. ఆంధ్రరచయితల సంఘమువారు ప్రకటించిన కవిశిరోభూషణాంధ్ర వ్యాఖ్యానమున సూత్రార్థమును వివరించునపుడు కొన్నిచోట్ల యీ టీక ననుసరించిరని తెలియును. అందు మొదటి సూత్రటీకలో "కావ్యము ప్రపంచమునకు క్షేమము గలుగజేయునది" అని కలదు. అహోబలపతి "కీర్త్యాది, సమస్త శ్రేయస్సాధనం కావ్యమ్" అని వ్యాఖ్యానించినాడు.[2] ఇచట అనువాదకులు అహోబల పండితీయమును గాక ఆంధ్రశబ్ద చింతామణి టీకనే యనుసరించిరనుట స్పష్టము. కావుననే పీఠికా కర్తలగు శ్రీ వెంపరాల సూర్యనారాయణశాస్త్రి, "బాలసరస్వతీయము వంటి టీకతో గూడ జక్కని యాంధ్ర వివరణమును గూడ జేర్చి యహోబలపండితీయమును సిద్ధముగావించినారని ప్రశంసించినారు.[3]

బాలసరస్వతీయము ముద్రిత మగుటకు ముందీ టీకయే బాలసరస్వతీయమని భావింపబడుచుండునని శ్రీ చర్ల నారాయణశాస్త్రి తెల్పియున్నారు.[4] శ్రీ వెంపరాల వారు పైనటీకను బాలసరస్వతీయముగా భావించిరన్నమాట.

---

[1] ఉద్యోతసి ఆంధ్రశబ్ద చింతామణి టీక, మద్రాసు :
శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు (1923), 2వ పు.

[2] కవిశిరో. సంజ్ఞ 1 సూ. వ్యాఖ్య, 31 పుట.

[3] కవిశిరో. పీఠిక 1 పుట.

[4] ప. బాలస. పీఠిక 20 పు.

కావున ఈ ఆంధ్రశబ్ద చింతామణి టీకకు మిక్కిలి ప్రచారము గలదనుట స్పష్టము.

పై సుదీర్ఘ పరిశీలనముచే నాంధ్రశబ్ద చింతామణిని బాలసరస్వతి వ్రాయలేదని స్పష్టపడినది. ముందు ఆంధ్రభారత కర్తయగు నన్నయ భట్టు చింతామణిని వ్రాయలేదని తేలినట్లే దీని కర్తత్వ భారము బాలసరస్వతి నుండి కూడ తొలగినది.

చింతామణి కర్తృత్వము - కాలము

ఆంధ్రభారత కర్తనుండి చింతామణి కర్తృత్వము తొలగుటచే నన్నయ్యభట్టు భీమకవుల మాత్సర్యవృత్తము, పరస్పర గ్రంథ నాశనము ననెడి మకిలి పోయినది. ఆద్యులగు తిక్కనాది మహాకవుల రచనలు లక్షణ విరుద్ధములనెడు కొందరి వ్రాతలు,[1] ప్రాచీన లాక్షణికుడగు కేతన నాధునికునిగా వ్యవహరించు రీతులు[2] తొలగిపోయినవి. మహాకవి, మహాపండితుడు, మహోపాధ్యాయుడునైన బాల సరస్వతి భుజస్కంధముల నుండి చింతామణి కర్తృత్వ భారము దిగిపోయినది. చెట్టు పేరు చెప్పి కాయలమ్ముకొను దుస్థితి కాతడు దిగిపోయినాడను నపప్రథతొలగిపోయినది. నిగూఢ భావ గంభీరమైన చింతామణి హృదయమును దర్శించి లోకమునకు చాలవరకు దాని ప్రకాశము నందజేసిన అతని మేధావిత్వము ప్రశంసా పాత్రమయినది. ఇక చింతామణి కర్తను ఆయన కాలమును స్వప్రమాణముగా గ్రహింపవలెను.

చింతామణి గద్యలలో తత్కర్త నన్నయభట్టు అని కలదు. ఇతడు సకల భాషావాగను శాసనునిగా గూడ జెప్పబడెను. ఇతడు వేఱొక నన్నయ భట్టని యేల భావింపగూడదు ? కవి తరంగిణీ నిర్మాణ

---

1. అహోబలపతి, కవిశిరో. హాలంత 37 సూ. వ్యాఖ్య.
2. అందే, సంజ్ఞ కృత్యాది 74 శ్లో.

ధురంధరులయిన శ్రీ చాగంటి శేషయ్య[1] ఆచార్య అమరేశం రాజేశ్వర శర్మ[2] ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి[3] ఈ యభిప్రాయమును వెల్లడించిరి. దీనికి బాధకములగు హేతువులేవియు కానరావు. కావున చింతామణి గద్యలోనున్నట్లు తత్కర్తపేరు నన్నయ భట్టు అని నిర్ణయించుకొనుట కభ్యంతరములేదు. ఇతని కాలమును నిర్ణయించుకొనుట కర్తవ్యము.

చింతామణి వ్యాఖ్యాతయగు బాలసరస్వతి 1600 ప్రాంతము వాడు. బాల సరస్వతి కంటె చింతామణికర్త పూర్వుడేకదా! కాకమాని గంగాధర కవి భారతకర్తయైన నన్నయ నిట్లు ప్రశంసించెను.

> శబ్దార్థ రస విశారదు శాబ్దిక మూర్ధన్యు శబ్దశాసన బిరుదున్
> శబ్దాయమాన విస్ఫుర దబ్దసుటాకరఘటి నన్నపార్యు దలంతున్.

ఇందు నన్నయభట్టు శాబ్దిక మూర్ధన్యుడనియు, శబ్దశాసన బిరుదము కలవాడనియు విశేషించబడెను. ఇతడు 1550కి పూర్వుడు.[4] రామరాజ భూషణుడు నన్నయభట్టును వాగనుశాసనుడని ప్రశంసించెను.[5] భారత కర్తయగు నన్నయభట్టు పీఠికలో దనను గురించి చెప్పుకొనిన విశేషణములు కొన్ని కలవు.

---

[1] ఆం. క. త. 1 సం. 41 పు.

[2] ఆం. వ్యా. వికాసము ప్రథమ 363 పు.

[3] 'అపర నన్నయభట్టు' భారతి ఏప్రియల్ (1983), 15,16, పుటలు.

[4] పెదపాటి జగ్గన 1550 ప్రాంతము వాడని కవి తరంగిణిలో చెప్పబడినది. జగ్గన ప్రబంధ రత్నాకరమున కాకమాని గంగాధర కవి బాలభారత పద్యములుదాహరింపబడినవి. కావున నీతడు 1550 కి పూర్వుడని మాత్రము చెప్పవచ్చును. ఆం. వ్యా. వికాసము ప్రథమ 38 పు.

[5] వసు. 1-10 ప.

తనకుల బ్రాహ్మణు ననురక్తు నవిరళ
జపహోమ తత్పరు విపుల శబ్ద
శాసను సంహితాభ్యాసు బ్రహ్మాండాది
నానాపురాణ విజ్ఞాన నిరతు
బాత్రునాపస్తంబ సూత్రు ముద్గలగోత్ర
జాతు సద్వినుతావదాత చరితు
లోకజ్ఞు నుభయభాషా కావ్య రచనాభి
శోభితు సత్ప్రతిభాభియోగ్యు

నిత్యసత్య వచను మర్త్య మరాధిపా
చార్యుసుజను నన్నపార్యు జూచి.[1]

ఇందు సంహితా భ్యాసున్, విపుల శబ్దశాసనున్ బ్రహ్మాండాది నానాపురాణ విజ్ఞాన నిరతున్, లోకజ్ఞున్ అనునవి కవి వ్యుత్పత్తిని దెలుపునవి. నిత్య సత్య వచనత, అవిరళ జపహోమతత్పరత, సద్వినుతావదాత చరిత్ర, సుజనత్వము కవి శీలమును వెల్లడించునవి. సత్ప్రతిభాభియోగ్యత, ఉభయ భాషా కావ్యరచనాభి శోభితత్వము కవి సృజనాత్మక శక్తిని దెలుపును. మత్య మరాధిపాచార్యత్వము కవి మేధను వ్యక్తము చేయును.

రామరాజ భూషణుడు, గంగాధరకవి కవులు. కావున నన్నయ కవిత్వమును ప్రశంసింపవలెను. ఒకవేళ నాతని పాండిత్యమును ప్రశంసింపదలచినచో సంహితాభ్యాసిత్వమునుగ్గడింపవచ్చును. వేదము అంగి - వ్యాకరణాదు లంగములు - ప్రధానమైన అంగిని విడచి అప్రధానమైన అంగమును చదివిన వాడని యుగ్గడించుటలో నౌచిత్యమేమి ?

---

[1] ఆం. భా. ఆది. 1-9 ప.

నన్నయభట్టు బ్రహ్మదేవుడునను నర్థద్వయమునకై భట్టుమూర్తి వాగనుశాసన పదమును సృజించెనని యొకరు పల్కిరి.[1] బ్రహ్మదేవుడను నర్థమున నీ పదప్రయోగములో నౌచిత్యమేమి? వాక్కును శాసించువాడు వాక్శాసనుడు. ఇచట 'అను' అనునుపసర్గ వ్యర్థము. వాణీపతిగా బ్రహ్మదేవుడు ప్రసిద్ధుడుగాని వాక్శాసనుడుగా గాదు. నన్నయభట్టు పరముగా గూడ నీపదము సారవంతము గాదు. ఒక మహాకవిని అతని కవిత్వ వైశిష్ట్యముతో సంబంధము లేని పదముతో ప్రశంసించుట అర్హమా?

ఇదంతయు బరిశీలింప వాగనుశాసన పదము నాటికి ప్రసిద్ధమగుట చేతనే దానితో భారతకర్తను వ్యవహరించుట జరిగెనని తోచుచున్నది. శాబ్దిక మూర్ధన్యుడని, శబ్దశాసన బిరుదము గలవాడని గంగాధర కవి చేసిన ప్రశంస ఆనాటికి నన్నయభట్టుకు మహా వైయాకరణ ప్రసిద్ధి కలదని తెలుపును. కావున గంగాధర కవి రామరాజభూషణుల కాలమునకు నన్నయభట్టు ఆంధ్రశబ్ద చింతామణిని వ్రాసెనను ప్రసిద్ధి యేర్పడెనని యంగీకరింపవలెను.

చింతామణికి సమీప కాలమందు వారున్నచో భారతకర్తయే చింతామణి కర్తయను భ్రాంతి వారికి గలుగు నవకాశముండదు. కావున వారికంటె చింతామణి కర్త కొంచెము పూర్వుడే కావలెను.

చింతామణి 16వ శతాబ్దిలోనిదను వాద పరామర్శ

ఒకరు చింతామణి 16వ శతాబ్దిలోనిదని చెప్పిరి.[2] దానికి వారు చెప్పు ప్రధాన హేతువుల బరామర్శింతము.

---

1. సం. ప్రి. వ్యాకరణాలు 17, 18 పుటలు.
2. ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి. 'అపర నన్నయభట్టు' భారతి ఏప్రియల్ (1983), 15, 16 పుట.

చింతామణి "దీర్ఘాణాం హ్రస్వస్స్యాత్ నచ దేశ్య పదే నచైక వర్ణేపి" (దీర్ఘాంత శబ్దములకు హ్రస్వము వచ్చును. దేశ్య పదములందు, ఏక వర్ణ శబ్దములందు నీ హ్రస్వము రాదు.) [1] అని చెప్పెను.

"నిజమైన దేశ్య శబ్దములు దీర్ఘాంతములు కావు. కాని దేశ్య శబ్దములుగ వ్యవహృతము లయిన అన్యదేశ్య శబ్దములు దీర్ఘాంతములు కలవు. ఉదా :- నవలా మొదలగునవి. దీర్ఘాంతమైన అన్యదేశ్య శబ్ద ప్రయోగము మొదట శ్రీనాథుని హర విలాసము నందు కలదు. "ఖుసి మీఆన్ సురధాణి నిండు కొలువై" ఇందు ఖుసి అను పదమునకు ఖుషీ అను పారసీక పదము మూలము. దీనికి హ్రస్వము వచ్చుటచే ఖుసి అయినది. జక్కన విక్రమార్క చరిత్రమున 'అన్నవల ముద్దు మోమును [2] అను ప్రయోగమున్నది. ఇందలి నవల పదమునకు 'సుబలా' అను పారసీక పదము మూలము. కవి దీనికి హ్రస్వము చేసెను. "నతనాభిన్ నవలానొకానొక మరున్నారీ శిరోరత్నమున్" అను పెద్దన ప్రయోగముననిది దీర్ఘాంతముగనే యున్నది. అన్యదేశ్య శబ్దములోని అంతిమ దీర్ఘమునకు హ్రస్వమురాని సందర్భమిది. వచ్చిన సందర్భము ముందు కలదు. రాని సందర్భము తరువాత కలదు. వచ్చునా రాదా యను సందేహము తరువాత వచ్చును. రాదని యాంధ్రశబ్ద చింతామణి యందు కలదు. కనుక ఆంధ్రశబ్ద చింతామణి పెద్దన మను చరిత్ర (1525) కు అనంతర గ్రంథమని" వారి ప్రతిపాదనము.[3]

---

1. కవిశిరో. అజంత. 46 సూ.
2. విక్రమార్క చరిత్ర 5 ఆ. 13 ప. అపర నన్నయభట్టు భారతి ఏప్రియల్ (1983).
3. 'అపర నన్నయభట్టు' 'భారతి' ఏప్రియల్ (1983), 15, 16 పుటలు,

ఇది పరిశీలింపదగినది. ఈవాద మంతయు నిజమైన దేశ్య శబ్దములు దీర్ఘాంతములు కావను నిర్ణయముపై నాధారపడినది. కాని కొన్ని దేశ్య శబ్దములు దీర్ఘాంతము లున్నవి. వానిలో కొన్నిటిని చింతామణి గూడ పేర్కొనినది.

జావళీ [1] లాచీ [2] లాడా, నాడా [3] బాగురే [4] బళా [5] లాపరా [6] గే [7] వా [8] ఆణీ [9] ఇసీరో [10] అనునవి దేశ్య పదములని నిఘంటువులు తెల్పుచున్నవి.

బళీ [11] నిన్నే (వ్) కదా [12] అనువానిని చింతామణి పేర్కొనినట్లు ప్రాచీన వ్యాఖ్యాతలు దెలిపిరి. [13]

వీనిలో కొన్నింటికి హ్రస్వాంత రూపములు గూడ నున్నవి. అవి చింతామణి కర్తృ క్షిప్తము గావనవలెను. లేదా అవి శబ్దమునకు

---

1. ఆం. శ. ర. 1 భా. 1277 పు.
2. అందే. 1649 పు.
3. అందే.
4. అందే. 1 భా. 1154 పు.
5. అందే 3 భా. 1264 పు,
6. శ్రీ నాదెళ్ళ పురుషోత్తమ కవి, పురుషోత్తమ కవీయము, మచిలీపట్టణము : (1918), 308 పుట.
7. అందే 306 పుట.
8. అందే 311 పు.
9. అందే 332 పు.
10. అందే 333 పు.
11. ఆం. శ. ర. 3 భా 1264 పుట. కవిశిరో. సంజ్ఞ 40 సూ. వ్యాఖ్య.
12. ఆ. శ. ర. 1 భా. 607 పు. కవిశిరో, సంజ్ఞ 40 సూ. వ్యాఖ్య.
13. కవిశిరో. సంజ్ఞ 40 సూ. వ్యాఖ్య.

"Forwarded free of cost, and with the Compliments of the department of Education, Government of India, New Delhi."

వికల్పార్థము చెప్పుట వైయాకరణుల కిష్టమయినందున [1] "నచ దేశ్య పదే నచైక వర్ణేపి" అను రెండు సూత్రములందు అపి శబ్దము నన్వయించి వికల్పమని చెప్పవలెను. ఇట్లు చెప్పినచో ఏకవర్ణ సంస్కృత పదములకు గూడ హ్రస్వము వికల్పముగా వచ్చు నిబ్బంది గలుగును. కావున వికల్పమును వ్యవస్థావాచిగ జెప్పి ఏకవర్ణ సంస్కృత పదములకు సమాసమున హ్రస్వము గలుగుననియు, వ్యస్తముగా నున్నపుడవి దీర్ఘాంతములుగానే యుండునని వ్యాఖ్యానించుకోవలెను.

ఏది యేమైనను కొన్ని దేశ్యపదములు దీర్ఘాంతము లున్నందున "నచదేశ్య పదే" యను సూత్రము దేశ్యములుగా వ్యవహరింపబడుచున్న అన్యదేశ్యములకు వర్తించునదని చెప్పుట కుదురదు. దానిని బట్టి చింతామణి కాలమును నిర్ణయించుటకు వీలులేదు.

లక్షణసార చింతామణు లేక కర్తృకములనుటకు కొన్ని హేతువులు చూపబడును. గణపవరపు వేంకటకవి, విన్నకోట పెద్దన కావ్యాలంకార చూడామణిలోని యొక పద్యమును (3ఉల్లా-32ప.) నన్నయభట్టు లక్షణ సారమున నుదహరించినట్లు తెల్పెను. [2] కాగా లక్షణ సారము విన్నకోట పెద్దనకు దరువాతి దగును.

ఇతరుల పద్యముల నుదాహరించు నలవాటు వెల్లంకి తాతంభట్టు కవిచింతామణితో నారంభమగుటచే దానికి (1480-1520) దరువాతనే లక్షణ సారము బయలుదేరెనని యొకరు చెప్పిరి. [3] ఇట్లు చెప్పినచో చింతామణి 16వ శతాబ్దిదే కావలెను. వీరు దొరికిన లక్షణ గ్రంథములను బరిశీలించి వానిలో నితరుల లక్ష్యముల

---

1. కవిశిరో. సంధి 36 సూ. వ్యాఖ్య.
2. 'అపర నన్నయ భట్టు' భారతి ఏప్రిల్ (1983), 21 పుట.
3. అందే 23 పుట.

నుదాహరించు పద్ధతికి దాతం భట్టు శ్రీకారము చుట్టెనని చెప్పుచున్నారు. లక్షణ సారము దొరకని గ్రంథము. అంతకు ముందీ పద్ధతి నెవరు నవలంబింప లేదని దృఢముగా చెప్పుటకు వీలులేదు. ఇది కాల నిర్ణయమునకుపయోగింపదు. కాగా లక్షణ సారము 16వ శతాబ్దిలోని దనుటకు వీలులేదు.

కావున చింతామణీ లక్షణసారములను రచించిన నన్నయభట్టు 16వ శతాబ్దిలో నుండెనని నిర్ణయించుట కాధారము లేదు.

లక్షణ సార సంగ్రహమున కనువాదమా ?

చింతామణి కర్త "అద్దన్త్యస్తాలవ్యశ్చవర్గస్స్యాన్మిథ స్సవర్ణశ్చ"అని చెప్పెను. దీనిని బాలసరస్వతి "దంత్యమైన చవర్గము అకారము, తాలవ్యమయిన చవర్గము ఎకారము (కలవి) అవును. దంత్య తాలవ్యములు రెండును దమలో తాము సవర్ణము లవును" అని వివరించెను. [1].

చాట - చేట జాన - జేన మొదలగువానిలో అకార మున్నదా ? ఎకారమున్నదా ! అను సందేహమునునివారించుటకే యీ సూత్రము బయలుదేరెనని కళాప్రపూర్ణ వఝల చిన సీతారామ స్వామి శాస్త్రి తెలిపినారు. [2] లక్షణ సార సంగ్రహము

"తలకట్టుగాక యెత్వమే,
యలవడు జజసలను మూటనది మొదలగుచో,
దెలుగుల మొదళ్ళ నెయిలివి,
యల హల్లులు గావు స్వరములగు వ్రాయంగన్."

---

1. ప. బాలస. సంజ్ఞ 10 పుట.
2. వై - పా. 57 పు.

ఉదా :- చెలువ చేకటొప్పు జేన యనంగను,
సీస కొప్పనంగ జెల్లు మాట,
నెఱుక యిరవనంగ నీరెండు వర్ణంబు,
లచ్చులగును హల్లు లాది గావు"

అని వ్రాసెను.[1] ఈ రెండు లక్షణములందును విషయమున కొంత పోలిక యున్నది. ఒకరు చింతామణి లక్షణ సారసంగ్రహ లక్షణము ననువదించిన దనియు, కాన దానికంటె చింతామణి యర్వాచీనమనియు భావించుచున్నారు.[2]

ఇందు దేనికేది యనువాదమగునో పరిశీలించవలయును.

పై వ్యాఖ్యల ననుసరించి చింతామణి చాట చేట జాన జేన అనువానిలో సందేహమును నివారించి చేట జేన అను రూపములే సాధువులని తెల్పుచున్నదనవలెను.

లక్షణ సారసంగ్రహము సేస కొప్పనుచోట గూడ నీ సందేహమును తొలగించుచున్నది. సకారము తాలవ్య స్వరముతో గూడినపుడు శకారోచ్చారణము నందుట వ్యావహారిక భాషలో నున్నదే.
ఉదా :- సెనగలు / శెనగలు, సెలవు / శెలవు.

ఇచట ఎత్వ విశిష్టమైన సకారమే కలదని చెప్పుట అవసరమే. చింతామణి లక్షణ సార సంగ్రహమునకు తరువాతిదైనచో పై విలువైన లక్షణము నేలవదలును ? ఇట్లు చింతామణి లక్షణము కంటె లక్షణసార సంగ్రహ లక్షణము విస్తృతముగా నున్నందున చింతామణియే ప్రాచీనమనవలెను.

---

1. చిత్రకవి పెద్దన, ల. సా. సం. కాకినాడ : ఆంధ్ర సాహిత్యపరిషత్తు (1938), 3-6, - 7 ప.
2. సం, ప్ర. వ్యాకరణాలు 278 పు.

చింతామణిలో దంత్య తాలవ్య చవర్ణములకు జెప్పబడిన సావర్ణ్యము లక్షణసార సంగ్రహములో లేదు గదా! కావున నిదియే ప్రాచీన మనరాదా యని ప్రశ్న.

దంత్య తాలవ్య చజలకు జెప్పబడిన సావర్ణ్యము రెండుచోట్ల నుపయోగించును. (అ) యతి ప్రాసలు (ఆ) పరుష సరళ సంజ్ఞలు, అకారమునకు ఎకారమునకు మైత్రి లేనందున నిచట యతి కుదురదు. ప్రాస మైత్రి మాట ప్రాసప్రకరణములో జెప్పవచ్చును. పరుష సరళ సంజ్ఞలనే లక్షణ సారసంగ్రహము గ్రహింపనందున దానికీ దంత్యతాలవ్య చజల సావర్ణ్య విధి యవసరముగాదు.

చింతామణిలో పరుష సరళ ప్రయుక్త విధులెన్నో కలవు. ఆగ్రంథము సంస్కృతమున వ్రాయబడినందున దానిలో పరుషసరళ సంజ్ఞలను విధించునపుడు తాలవ్య చ వర్ణమునే యుచ్చరింపవలెను. సంస్కృతములో దంత్య చజలు లేవు గదా! ఈ స్థితిలో దాలవ్య చవర్ణమునకు విహితమయిన పరుష సరళ సంజ్ఞలు దంత్య చజలకు గూడ అవసరమగుటచే నిచట సావర్ణ్య విధి ముఖ్యము.

దంత్య తాలవ్య చజల సావర్ణ్యము లక్షణ సార సంగ్రహమున కవసరము కాకుండుటచే నది వదలియుండును. కావున 'అద్దంత్యైతాల్యాది సూత్రము లక్షణ సార సంగ్రహ లక్షణమున కనువాదమను మాట సత్యదూరము.

చిత్రకవి పెద్దన చజసలలో అత్వముండదు ; ఎత్వముండునని తెల్పుచు

“తెలుగుల మొదళ్ళ నెయిలివి యల హల్లులు గావు స్వరములగు వ్రాయంగన్” అను లక్షణమును “ఎచుకయురవనంగ నీ రెండు

వర్ణంబు లచ్చులగును హల్లులాది గావు"[1] అను నుదాహరణము నిచ్చెను. పిదప "ఆంధ్ర సంస్కృత పదములయందు మొదలిః పైన ఉ ఊలు ఓకార మనెడి లిపులు,స్వరములగుగాని హల్లులై చొరవు గనుక, వాకు నుత్వోత్వముల నవి వ్రాయరాదు" "ఉల్లమువిద యుదుట నూఱను నోపిక, యనెడు పలుకు లెల్ల దెనుగు లౌను,ఉదధి యున్నతంబు నూర్వశి యోంకార, మకురు ననగ సంస్కృతమున జెల్లు[2]

అని పువ్వూవోలు తెనుగు మాటలకు మొదట లేవని నిషేధించినాడు. ఇది బాలసరస్వతి చింతామణిలో లేదు. పదాది యకార విషయము చెప్పిన చింతామణి పదాది వకార విషయము నేల వదల వలెను. అప్పకవీయ చింతామణిలో పలు ప్రక్షిప్తములున్నవి. వానిలో పదాది వకార నిషేధ మొకటి. బాల సరస్వతీయ చింతామణి కంటె అప్పకవీయ చింతామణిలోని అధిక పాఠములు ప్రక్షిప్తములు నవీనములునని వేఱొకచో నిరూపింపబడెను.

దీనిని చింతామణికర్త గ్రహింపలేదు : కావున చిత్రకవి పెద్దన కంటె చింతామణి కర్త ప్రాచీనుడని చెప్పవలెను. పెద్దన 16వ శతాబ్ది పూర్వార్థము వాడు.

రెండు చింతామణులకు దత్కర్తలకు బోలికలు

చిత్రకవి పెద్దనకంటె బూర్వుడు తాతంభట్టు. ఆంధ్రశ చింతామణి కర్త నన్నయభట్టుకు కవి చింతామణి కర్త తాతంభట్టు పలు పోలికలున్నవి. ఇరువురి పేరులందు భట్టు నామమున్నది. నన్నయభట్టు సకల భాషావాగను శాసనుడు.[3] ఇచట సకల భా లనగా షడ్విధ ప్రాకృతములు, సంస్కృతాంధ్రములు నని ఆచార్య

---

1. ల. సా. సం. 3-6, 7 ప.
2. ల. సా. సం. 3-8-19 ప.
3. ఆంధ్రశబ్ద చింతామణి పరిచ్ఛేదాంతగద్యం.

అమరేశం రాజేశ్వర శర్మ తెలిపిరి.[1] అనగా సీ నన్నయభట్టు అష్ట భాషా వాగను శాసనములు నేర్చిన వాడన్నమాట. తాతంభట్టు 'అష్టభాషా విశేష శేషావతారుడు,'[2]

ఇట్లే వీరి కృతులయిన ఆంధ్ర శబ్ద చింతామణికి కవిచింతామణికి గూడ నామ మందు వలెనే విషయమునందు గూడ పోలి కలున్నవి. ఆంధ్ర శబ్ద చింతామణిలో నైదుపరిచ్ఛేదములున్నది, కవి చింతామణిలో నైదధికారములున్నవి. అందు మొదటిదయిన భాషా లక్షణాధికారము వ్యాకరణమునకు సంబంధించినది. ఇందలి పెక్కు విషయములు, ఆంధ్రశబ్ద చింతామణిలోని విషయములు సమానముగా నున్నవి. భాషాలక్షణాధికారములోగల కావ్య ప్రశంస, కావ్య స్వరూపము, దేశ్య ప్రతిష్ఠ, సంజ్ఞావిధి, భాషా వివరణము, పలుకు బళ్ళు అను విషయములు ఆంధ్రశబ్ద చింతామణిలో గూడ నున్నవి. లింగ వివేకము, విభక్తులు, సమాసములు అను విషయములు ఆంధ్ర శబ్ద చింతామణిలో చెప్పబడిన విషయములకు జేర్చుకొనవలసిన విశేషములు.

నన్నయభట్టు తాతంభట్టులలో నొకరు వేరొకరి గ్రంథమును జూడకున్నచో నింతటి పోలిక సంభవించదు. పూర్తి పోలికలున్న కొన్ని లక్షణములను గూడ పరిశీలింతము. ఆంధ్ర శబ్ద చింతామణి సోర్లుగితః (ఇదంత శబ్దముల ప్రథమైక వచన ప్రత్యయము లోపించును.)[3]

---

1. ఆం. వ్యా. వి. కాసము ప్రథమ. 368 పుట.
2. వెల్లంకి తాతంభట్టు; కవి చింతామణి భాషా లక్షణాధికారగద్య, హైదరాబాద్; ఆం. గ. ఓ. మా లైబ్రరీ.
3. కవి శిరో. అజంత. 36 సూ,

'అనుతాంస్త్రియాం సమానాం సర్వస్య స్త్రీసమస్య చసులోపః' (ఉదంత భిన్న తత్సమ స్త్రీ లింగ శబ్దములకు అన్ని స్త్రీ సమ శబ్దములకును ప్రథమైక వచన లోపము వచ్చును) [1]

అని చెప్పినది. కవి చింతామణి

పృథివి నికారాంతము నుత్పథగతి స్త్రీలింగ సరణిబరగిన పదముల్
ప్రథమైక వచన లోపము ప్రథితముగా నుండి యుండు బంక
జనాభా.[2]

అని పై విషయములను జెప్పెను.

ఆంధ్ర శబ్ద చింతామణిలో 'స్త్రోవావౌరై నావోః'(రై నౌ శబ్దములకు క్రమముగా 'ఓ ఆవ' అనునవి వచ్చును.) రో, నావ అని యుదాహరణములు. 'భూదివోస్తుజౌయత్తత్' భూదివ్ శబ్దములకు సంస్కృత సప్తమ్యంత రూపములు తెలుగున ప్రాతిపదికగా నుండును. భువి దివి అని యుదాహరణములు. [3] 'డుసాన్యత్సదారాజ్ఞః' (రాజన్ శబ్దమున కెప్పుడును 'డు' వర్ణకము వచ్చును) 'ఇందు డకార మిత్తు' రాజు అను రూపమగును. [4] అను విషయములున్నవి. కవి చింతామణిలో

ద్యోశబ్దమునకు దివియును భూ శబ్దంబునకు భువియుబూనగవలయున్
నౌ శబ్దము నావయురోరై శబ్దము రాజపదము రాజన జెల్లున్.[5]

---

1. అందే 80 సూ.
2. కవి చింతామణి. భా. ల. అధికారము 51 ప.
3. కవి శిరో. అజంత 62, 64 సూ.
4. అందే హలంత. 8. సూ.
5. కవి చింతామణి. భాషా లక్షణాధికారము 56 ప.

అని యున్నది. ఆంధ్రశబ్ద చింతామణిలో 'ఉభయ విధమమహతీనామ్' అమహత్తులైన స్త్రీలింగములకు రెండు విధములైన (స్త్రీలింగ నపుంసకలింగ) విశేషణములును వచ్చును.) అని నన్నయభట్టు చెప్పెను.[1]

"చెలువ పేరుగాని స్త్రీ లింగములకు వి, శేషణములుగా రచించు పదము, లొక్కరూపయుక్తి నుభయ లింగత జెల్లు, నుల్కయుష్ణ ముల్క యుష్ణ మనగ"[2]

అని తాతంభట్టు గూడ బై విషయమును జెప్పెను. ఇట్లు పెక్కు పోలికలుండుటచే నన్నయభట్టు తాతంభటులలో నొకరు వేరొకరి గ్రంథమును జూచెనని చెప్పవలెను. వీరిలో నెవరు పూర్వులో బరిశీలింపవలెను.

వీనిలో నేది యాద్యము ?

ఆంధ్రశబ్ద చింతామణి ఆంధ్ర శబ్దముల నొసగుటలో చింతామణి వంటిది. కవి చింతామణి కవులకు వలయు ననేక విషయముల నందించుటలో చింతామణి వంటిది. కవులకు శబ్దములతోపాటు వళి ప్రాసలు, దోషములు, గుణములు, వృత్తులు, రీతులు గణస్వరూపము వంటి అనేక విషయములు గావలెను. వానినందించునది కవి చింతామణి. ఇట్లు ఆంధ్ర శబ్ద చింతామణి శబ్దార్థములకంటె కవి చింతామణి శబ్దార్థములు వైశిష్ట్యమును వ్యక్తముచేయును.

నన్నయభట్టు 'సకల భాషా వాగను శాసనుడు. అనగా అన్ని భాషల వ్యాకరణములు గలవాడని యర్థము. సకల భాషలనగా షడ్విధ ప్రాకృతములు సంస్కృతాంధ్రములు నను నష్ట భాషలు.

1, బాలస. అజంత. వ్యావిళ్ళ ముద్రణము 60 సూ.

2. కవి చింతామణి భా. ల. అధికారము 68 ప.

తాతంభట్టు 'అష్ట భాషా విశేష శేషావతారుడు' అష్ట భాషల యందలి విశేషములకు ఆదిశేషుని యవతారమైన వాడు. ఇట్లు వీరు వాడు కొనిన బిరుదములలో తాతంభట్టు బిరుదము నన్నభట్టు బిరుదము కంటె విశిష్టమైనది.

ఆంధ్ర శబ్ద చింతామణి పదాది యకారము నంగీకరించినది. కవి చింతామణి దానిని ఖండించుచు

"తెలుగునకు మొదల యాలే, దిల యావలె నుండు వర్ణమేకార
మగుఁన్, అలవడ హాఁకును స్వరములు, నెలకొను నిగమంచ యోర
నీ యెద మేలల్"

అని చెప్పినది. హిమము ఇగము, హంస అంచ, హోర ఓర, హృదయము ఎద, హేల ఏల అని సంస్కృత పదాదిలో నున్న హకారము లోపించి స్వరమే నిలుఁచు నను విశేషము గూడ నిచట తాతంభట్టు చెప్పెను.[1]

ఆంధ్ర శబ్ద చింతామణి 'అద్దంత్య స్తాలవ్య శ్చుర్వక్రస్యాత్' అను సూత్రమున దంత్య చవర్గ మకారముతో గూడినదని సూచింపగా కవి చింతామణి దానిని సవరించుచు

"మంచ కుంచ మొజ్జ మంచంబు చంచులు
జడలు కచ్చ లెందు శచజలకును
దద్భవంబు లైన దలకట్టుగా గూడ
వలయు నలిన నయన వార్ధిశయన"
"చేతమున నచ్చ తెనుగని
భూతలమున నెత్వమునకు బూనుదురజ్ఞుల్
బాతిగ జం చః పామర
జాతీయ యటన్న చంచ శబ్దము గానన్"[2]

---

[1] కవి చింతామణి వర్ణ నిర్ణయాధికారము 4, 5 ప.

[2] కవి చింతామణి వర్ణ నిర్ణయాధికారము 18, 19 ప.

అని 'చంచ' శబ్దము తాలవ్యయుతమైన ఎత్వముతో వ్రాయ రాదని సప్రమాణముగా వ్రాసినాడు. ఆంధ్ర శబ్ద చింతామణి 'క్వచి ద్గకారోవః' (ఒకచో గకారము వకారమగును) అని చెప్పగా [1] కవి చింతామణి

'అరయ దఱచుగా ననాది వకారంబు
కవిత మెప్పుగా గకారమగును' [2]

అని పూరణము చేసినది. నన్నయభట్టు "ఏదంతతా చ నామ్నా మన్యతరస్యామియాన్తానామ్' 'ఇయు' అంత మందు గల నామముల కేదంతతగూడ వికల్పముగా వచ్చును. [3] అని ముత్తియము ముత్తెము వంటి రూపములను సాధింపగా తాతంభట్టు

"పుడమి (స్త్రీ) లిఙ్గ శబ్దంబుకడ కకార
మునకు వచ్చు యకారంబు కనగ గొన్ని
యెడల నెత్వంబునకు గియ్యవడియునగును
జడ్డయగుచోట నైశాటవక్త్రదమన

అని చెప్పెను. ముత్తియము ముత్తెము అని ఎత్వము మాత్రమే కాక ముత్యము వంటి రూపము గూడ నీతడు సాధించెను. [4]

ఈ సందర్భముననొక విమర్శకులు 'కొన్ని యెడల నెత్వంబునకు గియ్య వడియునగును జడ్డలగు చోట నైశాటవక్త్రదమన' అను తాతంభట్టు లక్షణ భాగమును మాత్రముదాహరించి దీనిని "ఏదంత

---

1. కవి శిరో. అజంత 67 సూ.
2. కవి చింతామణి. వర్ణ నిర్ణయాధికారము 13 ప.
3. కవి శిరో. అజంత 81 సూ.
4. కవి చింతామణి. వర్ణ నిర్ణయ 20 ప.

తాచనామ్నా మన్యతరస్యామి యాన్తానామ్" అని ఆంధ్రశబ్ద చింతామణి యనుసరించెనని యారోపించినారు.[1]

కాని తాతంభట్టు చెప్పిన పై పద్యములో నన్నయభట్టు చెప్పి ముత్తియము ముత్తెము వంటి రూపములతో పాటు అతడు చెప్ప ముత్యము అని కియ్య వడితో గూడిన రూపము గూడ సాధింపబడుట నీ యుదాహరణము 'ఆంధ్రశబ్ద చింతామణికి దరువాతిదే కవి చింతామణి' యని వెల్లడించును.

ఆంధ్రశబ్ద చింతామణి "నియతః స్త్రీ ప్రత్యయస్తు సర్వా సామ్" (సమస్త స్త్రీ లింగశబ్దములకు స్త్రీ ప్రత్యయము నియత ముగా వచ్చును.) అని మాత్రము చెప్పి యూరకుండగా [2] కవి చింతామణి

ఆయతముగ స్త్రీలింగము చేయందగు పదము మీద
స్త్రీ ప్రత్యయముల్
ధీయుక్తి యుక్త సుకవులు సేయుదు రవి తేట పడగ జెప్పెదగృష్ణ

అని స్త్రీలింగ శబ్దములకు స్త్రీ ప్రత్యయము వచ్చునని చెప్పి[3] సుమారు 30 పద్యములలో స్త్రీ ప్రత్యయములను గూర్చి తెలిపెను.

ఆంధ్రశబ్ద చింతామణి 'నపదాన్యవ్యయసుప్తిఙ్క్త్వాతుమునామ్' అవ్యయములు, సుబంతములు, తిజంతములు, క్త్వాప్రత్యయాంతములు, తుమున్ ప్రత్యయాంతములు నగు పదములు తెలుగున ప్రవేశించవు అని నిషేధించినది.[4] క్త్వా, తుమున్ ప్రత్యయాంతములయిన పదముల

---

[1] సం. ప్ర. వ్యాకరణాలు. 278 పు.

[2] కవి శిరో. అజంత 59 సూ.

[3] కవి చింతామణి వర్ణ నిర్ణయాధికారము 39 ప.

[4] కవి శిరో. సంజ్ఞ 38 సూ.

వ్యయములే, అవ్యయములను నిషేధించుటచే వానిని గూడ నిషేధించినట్లే. మరల వానిని నిషేధించుటచే నీ నిషేధము వ్యర్థమయి క్త్వాతుమున్ భిన్నమయిన కొన్ని యవ్యయములకు బ్రవేశము కలదని తెలిపినదని యహోబలపతి వ్యాఖ్యానించెను. [1] ఇట్లు సూత్ర రచనమున కొన్ని పదములు వ్యర్థములయి యర్థాంతములను సూచించుట సంస్కృత వ్యాకరణ సంప్రదాయము. కవి చింతామణి

:“క్త్వవతు క్వనీయసునులకు నవిరత మేకాక్షరావ్యయములకు
మఱియున్.
వివరింపఁ దిజంతములకు భువిలో ముఖ్య ప్రయోగములు లేవు హరీ.

వ. క్త్వవతు ప్రత్యయాంతాలు - దత్తవాన్ కృతవాన్ ఇవి మొదలగునవి. క్వసు ప్రత్యయాంతాలు యేయివాన్ పేచివాన్, ఊచివాన్ ఇవి మొదలైనవి, ఈయసున్ ప్రత్యయాంతాలు - గరీయాన్ వరీయాన్ ఇవి మొదలైనవి. ఏకాక్షరాలు. కం, ఖం, మా ఇవి మొదలైయినవి. అవ్యయాలు తు, చ, దృష్ట్వా, విచార్య, కర్తుమ్ ఇవి మొదలైనవి. తిజంతాలు - భవతి, పచతి, ఏధతే ఇవి మొదలైనవి; వీనికి ముఖ్య ప్రయోగాలు లేవు.

“అవ్యయంబులందు నహహా కించిన్మిథ్య
సకృదవశ్యములు మృషా వృథాది
గాఁగఁ గొన్ని ప్రౌఢ కవులు ప్రయోగింతు
రక్కడక్కడను మహాబ్ధిశయన
హేల గౌణ వృత్తి నేకాక్షరాదిగా
సకలమైన శబ్ద జాతమునకు
నుచితమెఱిఁగి కృతిఁబ్రయోగంబు గావింతు
రఖిల వాఙ్మయజ్ఞులైన కవులు [2]

---

1. అందే అజంత. 35 సూ. వ్యాఖ్య.
2. కవి చింతామణి భాషా లక్షణాధికారము. 42, 43, 44 45 ప.

అని సవివరణముగా సోదాహరణముగా సవిశేషముగా తెలిపినాడు. క్త్వాతుమున్ ప్రత్యయాంతములగు (దృష్ట్వా, కర్తుమ్) నవ్యయములను వేరే పేర్కొనుట మాని అవ్యయములందే యుదాహరించెను.

ఆంధ్రశబ్ద చింతామణి సుబంతములను నిషేధించినది. 'రామః' రామమ్ మొదలగు సంస్కృత విభక్తి ప్రత్యయాంతములగు పదములు దెనుగున (అనుకరణము లేకుండ) ప్రయోగింపరాదని దాని ఆశయము. ఈ నిషేధము తఱచుగా వర్తించుచున్నను వాక్ మొదలగు ప్రథమైక వచనాంతములు 'గుణవంతమ్' 'అనడ్వాహమ్' మొదలగు ద్వితీయైక వచనాంతములు భువి దివి మున్నగు సప్తమ్యేక వచనాంతములు తెలుగున ప్రవేశించుచున్నవి. సమాస మధ్యమున గల అన్ని సంస్కృత పదములకు దెనుగున ప్రవేశము లభించుచున్నది. నన్నయ వాక్ మొదలగువానిని ప్రథమైక వచన తుల్యములు, ద్వితీయైక వచన తుల్యములు మొదలగు రీతిగా గ్రహించి వీనికి విభక్తులను విధించెను. తాతంభట్టు ఇన్ని తిప్పలు పడుటకంటె సుబంత నిషేధమునే తొలగించుట మేలని భావించెను. ఇతడు

"సనకార విసర్గములన వెనుకటి యక్షరము మీఁద వెలయు విభక్తుల్"[1]

అని సంస్కృత పదములకు జివరనున్న సకార నకార విసర్గలకు ముందే తెలుగు విభక్తులు వచ్చునని విధించి యా వర్ణములకు లోపము గలుగునని ధ్వనింపజేసెను. నన్నయ 'గోవు' నావ అను రూపములను మాత్రము సాధింపగా[2] తాతంభట్టు 'హిమగుధరుని సఖుడు, అతిను

---

1. కవి చింతామణి భాషా లక్షణాధికారము 50 ప.
2. కవి శిరో. అజంత 43 సూ. అంతే 62 సూ.

జలవిహారి అని గోనా, శబ్దములకు సమాసమున హ్రస్వము వచ్చిన 'గు' 'ను' శబ్దములను గూడ వివరించెను.[1] నన్నయ 'ఇతరత్రచ ద్వితీయా' (ఇతర స్థలములందును ద్వితీయ వచ్చును.)అని చెప్పగా [2] దాతంభట్టు

"వినుత ద్వితీయ సప్తమికిని మఱి మూఁడవ విభక్తికిని నిడఁగానౌ
విననింపు పుట్టు పట్టున నను వెల్యేఁగి ప్రబంధములఁ బరాం
బుధిశయనా !"

అని తృతీయా సప్తముల స్థానమున ద్వితీయ వచ్చునని స్పష్టము చేసెను.[3] నన్నయభట్టు 'తస్యాః ప్రథమాచ. జడపదానాం స్యాత్' (జడ వాచకముల ద్వితీయకు ప్రథమ వచ్చును) అని విధింపగా [4] దాతంభట్టు.

చేతనంబు పేరు చెప్పని శబ్దంబు
పై ద్వితీయ లెల్లఁ బ్రథమ లగును
గదియ మీఁదఁ గ్రియలు ఘటియించునప్పుడు
తరువు లెక్కె మిన్ను దన్నె ననఁగ

అని యీ ద్వితీయకు ప్రథమ వచ్చుట, తరువాత క్రియలతోఁ గూడిక యున్నప్పుడే యని నవరించెను.[5] మరియు నిచట కాలవాచకముల కడనున్న సప్తమికి గూడ ప్రథను విధించెను. నన్నయభట్టు

---

1. కవి చింతామణి భాషాలక్షణాధికారము. 57, 58, 59, 60.
2. కవి శిరో. అజంత 60 సూ.
3. కవి చింతామణి. భాషా లక్షణాధికారము 85 ప.
4. కవి శిరో. అజంతము 61 సూ.
5. కవి చింతామణి భాషాలక్షణాధికారము 82 ప.

'సామానాధి కారణ్యేషూఽదన్తానాం టుగాగమోఽచిస్యాత్' (కర్మధారయములందుత్తునకచ్చు పరంబగు నపుడు టుగాగమము వచ్చును.)[1] అని చెప్పగా దాతంభట్టు.

వెలయంగను (ఉ)ములు తుదిఁగల
తెలుఁగైన విశేషణంబు తేట పడంగాఁ
గలయు టుకారముతోఁ గృతి
నలపడఁగా మీఁద నచ్చు లంటిన చోటన్.

అని పై విషయమును జెప్పి ఒకచో షష్ఠీ సమాసమున గూడ నీ టుగాగనుము వర్తించుననుచు 'దంతపుటాకులు' అని యుదాహరించినాడు,[2]

మఱియుటుగాగమ విధి రువర్ణాన్తములపై బహుళమనుచు
రూలపై టూలనశ్యంబు గీలుకొనవు
తనరఁ జికురాకు చికురు టాకనఁగఁ గొన్ని
యెడల రూవచ్చుఁ బొదరిండ్లు పుడమిఁ గొన్ని
యెడల నీరెండు రావు మిన్నే అనంగ

అని పలు విశేషములను దెలిపినాడు.[3] నన్నయభట్టు 'దీర్ఘాణాం హ్రస్వస్యాన్నచదేశ్య పదే నచైక వర్ణేపి' (దీర్ఘాంతములకు హ్రస్వము వచ్చును. దేశ్య పదములందు, ఏకవర్ణ సంస్కృత పదములందు నిదిరాదు)[4] అని విధించుకొనెను. దేశ్య పదములకు హ్రస్వము రాదను నిషేధమును దరువాతి వారంగీకరింపలేదు.[5] తాతంభట్టు

---

[1] కవి శిరో. సంధి 33 సూ.

[2] కవి చింతామణి భాషాలక్షణాధికారము, 109, 108 ప.

[3] కవి చింతామణి భాషాలక్షణాధికారము 111 ప.

[4] కవి శిరో. అజంత 46, 47 సూ.

[5] శ్రీ చిన్నయసూరి బాలవ్యా. తత్సమ 54, 55 సూ.

"- - - - విను గోశబ్దము వెలిగాఁ
దెనుఁగున దీర్ఘంబు మునుఁగు - - - -" [1]
స్త్రీలింగ శబ్ద వితతికి
నోలిందుది దీర్ఘముడుపనుండును దెనుఁగై
కీలిది యేకాక్షర శ
బ్దాలి విసర్జించి నిర్జితాసుర కృష్ణా! [2]

అని దేశ్యపద నిషేధమును వదలుటయే కాక ఆ యేకాక్షర పదములు స్త్రీలింగములు మాత్రమే యని వెల్లడించినాడు.

నన్నయభట్టు "స్త్రీత్వ బహుత్వే సురాదే రసమాసే (సురాదుల కసమాసమున స్త్రీత్వ బహుత్వములు గలుగును) అని సురాదుఁలను గణముగా జెప్పెను.[3] కాని తరువాత పెక్కురు సురశబ్దమువలె స్త్రీత్వ బహుత్వములను బొందిన శబ్దమును జేర్పక దానిని జూపలేక పోయిరి. తాతంభట్టు

సురశబ్దము స్త్రీలింగతఁ బరఁగున్ బహువచన మగుచుభాసురముగ భూ
సురశబ్దము దక్కఁగనొక సరణినిఁ గ్లీబత్వ మొందు జనశబ్దమిలన్ [4]

అని సురాది గణమును వీడుటయే కాక సమాసమున నున్న భూసుర శబ్దమును, నపుంసక లింగము నందిన జన శబ్దమును దెలిపెను. మఱియు

క్షితిఁ బురుషులకును స్త్రీలింగతయైనఁ దదీయ భేదకములకుఁబుంలిం
గతమై సురలు గరిష్ఠులు దితి సుతు లసురలు, దలంపదేవతలర్హాల్

---

1. కవి చింతామణి భాషాలక్షణ. 50 ప.
2. అందే 54 ప.
3. కవి శిరో. తత్సమ 53 సూ.
4. కవి చింతామణి భాషా లక్షణ. 74 ప.

అని సురలు అనువాని విశేషణము పుంలింగ రూపముతో నుండ వచ్చునను విశేషము దెలిపినాడు.[1] ఇట్లు చింతామణిలోని పలు లక్షణముల కింద విశేషములు చేరినట్లు స్పష్టమగుటచే గవి చింతామణి యాంధ్ర శబ్ద చింతామణికి దరువాతిదేయని చెప్పవచ్చును.

కవి చింతామణిలో లేని విశేషము లాంధ్రశబ్ద చింతామణిలో లేవా అని ప్రశ్న. ఉండ వచ్చును. వానిని బట్టి ఆంధ్రశబ్ద చింతామణి కవి చింతామణికి తరువాతిదే యన వచ్చును గదా అని శంకింప వచ్చును. కాని తాతంభట్టు గ్రంథాదిలో చికీర్షిత ప్రతిజ్ఞలో

విరివిగ గ్రంథము చేసిన సరసతఁ జూడంగ వ్రాయఁ జదువఁగఁ జెప్పన్
విరసంబగు ననుతలఁపున సురుచిరముగఁ గొంత త్రోవఁ జూపెదఁ
దెలియన్

అని కొన్ని విషయములనే వ్రాయదలచినట్లు స్పష్టము చేసెను.[2] కావున కొన్ని చింతామణీ విషయముల నాతడు వదలుట కవకాశమున్నది.

తాతంభట్టు సంస్కృత ప్రియుడు, నన్నయభట్టు సంస్కృత ప్రాకృత వ్యాకరణ పద్ధతులలో నాంధ్ర శబ్ద చింతామణిని రచింపగా సంస్కృత వ్యాకరణ పద్ధతులనే యితడు స్వీకరించెను. అంతస్థములు, ఊష్మములు, వృద్ధి, స్పర్శలు, అనునాసికములు, విసర్గ మొదలగు సంజ్ఞలనితడు విధించుకొనెను.[3]

నన్నయభట్టు సంస్కృత ప్రాకృతములను రెండింటిని దెనుగునకు ప్రకృతులుగా స్వీకరింపగా నీతడు ప్రాకృత ప్రకృతిత్వమును గ్రహింపలేదు. 'సంస్కృతంబుపైఁ బొసంగు తెలుంగు విభక్తులిడఁగఁ

---

[1] కవి చింతామణి భాషాలక్షణాధికారము 75 ప.

[2] అందే 22 ప.

[3] అందే 24, 25, 26 ప.

దత్సమంబహీంద్ర శయన'అని యీతని తత్సమ నిర్వచనము.[1] నన్నయ సంస్కృత ప్రాకృత జన్యములను దద్భవములని చెప్పగా నితడు సంస్కృతసమభిన్నములనన్నిటిని తద్భవములుగా భావించినాడు. కావుననే రాణి యను ప్రాకృత సమమును దద్భవములలోనే చూపినాడు.[2]

“ప్రాకృత లక్షణ యుతమై శ్రీకరమగుఁ దద్భనంబు”[3] అని యీతని తద్భన నిర్వచనము.

తాతంభట్టు సంగ్రహ ప్రియుడు. అనంతుడు 24 యతులను జెప్పగా నీతడు 15 యతులతో సరిపెట్టుకొనెను. కేతన, పెద్దన దేశ్యమును అచ్చ తెనుగును వేరుగా గుర్తించిరి. పెద్దన

> ‘శ్రేయములై బహుదేశా నేయములై చక్కఁదనము నెఱ తనములునై
> యాయా నెలవులఁ జెవులకుఁ దీయముల, పలుకు లెల్ల దేశ్యముల రయన్
> ఈ మూఁడు తెఱుంగులలో నేమటనున్ దొరలకున్న నెల్లజనులకున్
> లోమిగులఁ దేట పడియెడు నా మాటల యచ్చ తెనుఁగులన నెగడొందున్’

అని దేశ్యమును నచ్చ తెనుగును విడిగా నిర్వచించెను.[4] ఆయా మండలముల వారికి బ్రత్యేకమగు దెనుగును దేశ్యమనియు, నన్ని మండలముల వారికి దెలియు దెలుగు నచ్చ తెనుగనియు బెద్దన భావము.

---

1. కవి చింతామణి భా. లక్షణాధికారము 29 ప.
2. అందే 32 ప.
3. అందే 30 ప.
4. కావ్యా. చూ. 2 - 16, 17 ప.

నన్నయభట్టు ఆ రెండింటిని కలిపి దేశ్యములనియే వ్యవహరించెను. తాతంభట్టు నన్నయ పద్ధతిని సమర్థించుచు

ఇలఁ దెలుఁగు పెక్కునాడై
యలవడు నేనాటి వారికానాటి తెలుం
గులు మంచి యచ్చ తెలుఁగులు
తెలియంగా నచ్చ తెలుఁగు దేశ్యము వేరా?

అని చెప్పినాడు.[1] నన్నయభట్టు గ్రామ్యముతో గలిపి భాషను నాల్గు విధములుగా విభజించెను. తాతంభట్టు

ధరణిఁ దత్సమంబు తద్భవంబును దేశ్య
మనఁగఁ ద్రిప్రకార మయ్యెఁ దెలుఁగు

అని గ్రామ్య విభాగమును వదలినాడు.[2] దానిని సమర్థించుకొనుచు

'గ్రామ్య జనులు పల్కఁగానగు గ్రామ్యంబు
వినఁగ వీనికంటె వేఱుగాదు
పరులఁ దెగడు చోట భాసిల్లునా గ్రామ్య
ఫణితి తగదు సత్ప్రబంధములను' అని వ్రాసినాడు.[3]

నన్నయభట్టు హలంత శబ్దములలో గొన్నిటికి సంస్కృత ప్రథమైక వచనాంతములను ప్రాతిపదికలుగను, కొన్నింటికి సంస్కృత ద్వితీయైక వచనాంతములను ప్రాతిపదికలుగను, మఱికొన్నింటికి

---

1. కవి చింతామణి భాషాలక్షణ. 35 ప.

2. అందే 29 ప.

3. కవి చింతామణి భాషాలక్షణ. 37 ప.

సంస్కృత ప్రాతిపదికలను బ్రాతిపదికలుగను గ్రహించెను.[1] తాతంభట్టు

మహి హల్లు ద్విత్వ మొందును రహినిల్చిన చోట దిక్కు-
స్రక్కులనంగా
బహువచనాంత ప్రథమన్ మహితముగా నిలుచు సమిధ మధులిహ
మనఁగన్

అని చెప్పెను.[2] దిక్, స్రక్ వంటి శబ్దములు సంస్కృత ప్రథమైక వచనములందు సంస్కృత ప్రాతి పదికలందు నీ రూపముతోనే ఉండును. కావున వానికి దాతంభట్టు సంస్కృత ప్రథమైక వచన తుల్యతను జెప్ప లేదు. కర్మన్, వర్మన్ వంటి శబ్దములకు ప్రథమైక వచనమయిన కర్మ, వర్మ వంటి రూపములను బ్రాతి పదికలుగా గ్రహింపవలసి యున్నది. కాని తాతంభట్టు సంస్కృత శబ్దములకు గడనున్న సకారనకార విసర్గలకు ముందే దెనుగు విభక్తులు చేరునని చెప్పికొని వానికి లోపమును ధ్వనింపజేసినాడు. కావున నాతనికి ప్రథమైక వచన తుల్యమును బ్రాతిపదికగా గైకొనవలసిన యవసరము తప్పినది. నన్నయభట్టు ద్వితీయైక వచన తుల్యమును బ్రాతి పదికగా గ్రహింపగా దానికి తాతంభట్టు ప్రథమా బహువచనమును బ్రాతి పదికగా గ్రహించి సమిధ, మధులిహము వంటి రూపములను సాధించుకొనెను. ఇతని మతమున విసర్గకుముందే విభక్తి చేరుటచే నీ పద్ధతి కుదురును. నన్నయభట్టు "కవిభల్లటైః క్రియాణాంనామ్నాంచోల్లోప ఇష్యతే హ్యేషు" (క్రియలకు నామములకు ఉల్లోపము గలుగునని కవి భల్లటులు తలంచిరి.)[3] అని చెప్పెను.

---

[1] కవి శిరో. హలంత. 1, 2, 7 సూ.

[2] కవి చింతామణి భాషాలక్షణ 49 ప.

[3] కవి శిరో. హలంత 23 సూ.

వేఱొకచో ‘నలడాదేరంతికుశ్చ’ అనుదానిచే పదమధ్యమున నున్న నులుడు అనువానిలోని ఉకారమునకు లోపమును జెప్పెను.[1] ఇంకొకచో ‘పోశ్చతదాదర్థ వాచకేషూతః’ (అపుడు మొదలగు వానిలోని పువర్ణమునకు జెందిన ఉకారమునకు లోపము వచ్చును) అని విధించెను.[2] తాతంభట్టు వీని నన్నిటిని గలిపి

మానుగ విభక్తులందును బూనిన నురులులకు నచ్చుబోయినఁ
బోవున్
వీనికి మఱియున్ బుధులకు భానుతముగ బదము మధ్యమున
నుంబోవున్

అని నన్నయ చెప్పిన విషయము నంతను నొక్క పద్యములో చెప్పి తన సంగ్రహీకరణ నైపుణ్యమును తెలిపెను.[3]

ఇట్లు సంస్కృత పద్ధతి ప్రీతి చేతను, సంగ్రహీకరణ ప్రీతి చేతను ఆంధ్రశబ్ద చింతామణి మార్గమునకు కవి చింతామణి మార్గమునకు గొన్ని భేదము లేర్పడినను ఆంధ్రశబ్ద చింతామణిలోని పలు విషయములకు దాతంభట్టు పలు విశేషములను జేర్చెననియు, గావున నీ నన్నయభట్టు తాతంభట్టునకు బూర్వుడే యనియు స్పష్టమగుచున్నది.

ఇచట నింకొక విషయము గూడ గమనింపదగినది. కవి చింతామణికి ఆంధ్రశబ్ద చింతామణికి వ్యాఖ్య అయిన అప్పకవీయమునకు కొన్ని విషయములందు సామ్యములు, కొన్నిట భేదములు గలవు.

---

1. కవి శిరో. సంధి 15 సూ.
2. అందే 42 సూ.
3. కవి చింతామణి భాషాలక్షణ. 94 ప.

సామ్యభేదములు

అప్పకవి ఆంధ్రశబ్ద చింతామణిలోని విషయములను విసరించుచు నందలి చిన్న విషయముల నాధారముగా గొని అనేక విశేషాంశములను దెలియ జేసెను.

అతడు చింతామణీ ప్రక్షేపముల యందొక శ్లోకమున గల యతిప్రాస ప్రసంగము నందుకొని 395 పద్య గద్యములు గల 3వ ఆశ్వాసమును రచించెను.

చింతామణి ప్రక్షేపములలో గణ ప్రసంగము గల 5 శ్లోకముల నాధారముగా జెప్పుచు 442 పద్యగద్యములు గల 4వ అశ్వాసమును రచించెను. ఇంత విస్తృతముగా గాకపోయినను నిట్టి విస్తరణ పద్ధతి కవి చింతామణిలో గనబడుచున్నది. తాతంభట్టు కవి చింతామణిలోని భాషాలక్షణాధికారమున నాంధ్రశబ్ద చింతామణిలో లేని విశేషాంశములను జెప్పుట యింతకుముందు జూచితిమి.

నన్నయభట్టు పదాది యకారము, దంత్య తాలవ్యచజలు వంటి కొలది వర్ణనిర్ణయ విషయములను దెలుపగా దాతంభట్టు వర్ణనిర్ణయాధికారమున నిట్టి విశేషములనేకములను దెల్పెను.

నన్నయభట్టు 'వళిరాద్యమనంత రాక్షరం ప్రాసః' (పాదాది వర్ణమునవళి, తరువాతి యక్షరము ప్రాస)' అని మాత్రము చెప్పి యూరకొనగా[1] దాతంభట్టు 'వళి ప్రాసాధికార'మను పేర37 పద్యములను వ్రాసెను. నన్నయభట్టు "నియతః స్త్రీప్రత్యయస్తు సర్వాసాం" (సంస్కృత స్త్రీలింగ శబ్దముల కన్నిటికి స్త్రీ ప్రత్యయము తప్పక చేరును.) అని మాత్రము చెప్పగా[2] దాతంభట్టు స్త్రీ ప్రత్యయములను పేర 35 పద్యములను వ్రాసెను.[3]

---

1. కవిశిరో°. సంజ్ఞ 37 సూ.
2. కవిశిరో°. అజంత 59 సూ.
3. కవి చింతామణి వర్ణనిర్ణయ. 39 ప.

నన్నయభట్టు 'తదదోషౌ పరికృతౌచవాగర్థౌ (దోషములు లేనివి, గుణాలఙ్కారములు కలది గూడ కావ్యమగును) అని మాత్రము చెప్పగా[1] దాతంభట్టు దోషాధికారమున గుణాలంకారములతో పాటు రీతిపాక వృత్తి శయ్యారస విషయములను గూడ దెలిపినాడు. నన్నయభట్టు "ఇంద్రాద్యాఅపిచ గణాః" అని మాత్రము చెప్పగా తాతంభట్టు గణస్వరూప మను పేర భీమన ఛందములో లేని దోషములను దెలిపినాడు.[2]

ఇన్ని పోలికలతోపాటు కవి చింతామణ్యప్పకవీయములకు భేదములు లేకపోలేదు.

అప్పకవి తన కృతి ఆంధ్రశబ్ద చింతామణి వ్యాఖ్యాన మని చెప్పికొనినాడు. తాతంభట్టు చింతామణి పేరెత్తలేదు. అప్పకవి తనకృతిని వీలయినంత విస్తృత పరచగా దాతంభట్టు తన కృతిని వీలయినంత సంగ్రహ పఱచినాడు.

అప్పకవీయము కేవలము చింతామణి వ్యాఖ్యానము కానట్లే కవి చింతామణి కేవలము ఆంధ్రశబ్ద చింతామణి సంబంధము లేనిది కాదు. ప్రౌఢ వ్యాకరణమును దత్కర్త త్రిలింగ లక్షణ శేషమని పిలుచుకొనినను పాఠకులు దానిని బాల వ్యాకరణ శేషముగా జదువుచున్నారు. తాతంభట్టు తన కవి చింతామణిని 'భువిశేఖరమైన గ్రంథ విశేషముగా నభివర్ణించినను[3] ఆంధ్రశబ్ద చింతామణీ శేష గ్రంథముగా బరిఃపవర్హమైనది.

---

[1] కవిశిరో. సంజ్ఞ 2 సూ.

[2] కవి చింతామణి గణాధికారము 38 ప.

[3] కవి చింతామణి భాషాలక్షణ. 23 ప.

విషయమిూ తీరున నుండగా నొక విమర్శకులాంధ్ర శబ్ద చింతామణి కవి చింతామణి కర్వాచీనమనుచు బ్రతిపాదించిరి.[1] తాతంభట్టు భేద్య భేదక శబ్దాలను నిర్వచించి సోదాహరణముగా వివరించినాడు.[2] నన్నయభట్టు 'ఏకత్వం భేదక గత బహువచనానాంచ దృశ్యతే వికృతౌ' అను చోట భేదక శబ్దమును బ్రయోగించినాడు. కావున తాతంభట్టునకు దరువాతిదే ఆంధ్రశబ్ద చింతామణి"యని వారభిప్రాయపడినారు. భేదక శబ్దము విశేషణ పరముగా సుప్రసిద్ధమైనది. అమరసింహుడు భేదక పదమును బ్రయోగించినాడు.[3] "అమరము రానివాని నోట సరస్వతి అమరనన్నదట" అను సామెత తెనుగునాట దీనికున్న ప్రచారమునకు నిదర్శనము. కాశికావృత్తిలో గూడా దీనికి బ్రయోగమున్నట్లు యీ విమర్శకులే అంగీకరించినారు.[4] ప్రచారమున గల యీ పదమును కవి చింతామణి నుండియే ఆంధ్రశబ్ద చింతామణి గ్రహించెననుటకు వీలు లేదు. ఇది పౌర్వాపర్యనిర్ణయమున కుపయోగింపదు. కావున లోగడ చెప్పినట్లు కవి చింతామణి కంటె పూర్వమందే ఆంధ్రశబ్ద చింతామణి బయలుదేరెనని చెప్పవలెను.

చింతామణి లక్షణ సారములను వ్రాసినవాడొకడే

ఆంధ్ర శబ్దచింతామణి కర్త పేరు నన్నయభట్టు; అతడు లాక్షణికుడు.

---

1. సం. ప్ర. వ్యాకరణాలు. 277 పు.
2. కవి చింతామణి భాషాలక్షణ. 76 ప.
3. (స్త్రీ) దారాద్యైర్యద్విశేష్యం యాదృశైః ప్రస్తుతం పదైః
గుణద్రవ్యక్రియాశబ్దాస్తథాస్యుస్తస్య భేదకాః అమరకోశ
3 కాం. 2శ్లో.
4. సం. ప్ర. వ్యాకరణాలు 278 పు.

లక్షణ సారమును రచించిన నన్నయభట్టును ఈతడు నొకడ యని తోఁచుచున్నది. ఇతని పేరును నన్నయ భట్టే. ఇతడును లాక్షణికుడే గదా !

వ్యాకరణ పరిజ్ఞానముమ సంపాదించి తెనుగునకు బ్రాకృతము ద్వితీయ ప్రకృతి యని వెల్లడించిన మొదటి లాక్షణీకుడు చింతామణికారుడు. లక్షణ సారకర్త

తొలుత బ్రాకృత సూత్రంబు వలన జ్ఞకు
నాణ్ణ మాదేశముగ వచ్చి యమరు కతన
బ్రాకృతాదేశ సరసవిరామమై త
నర్చు గృతుల శుకుండు సుజ్ఞాని యనగ [1]

అని ప్రాకృతాదేశ సరస విరామమును జెప్పినాడు. ప్రాకృత సూత్రము వలన జ్ఞ కారమునకు నకార మాదేశముగ వచ్చుచున్నదని తెలిపినాడు.[2] ఇది కర్త్రైక్య సాధక ప్రమాణము. ఇతని కాలమును కనుగొనవలయును. గణపవరపు వేంకటకవి ప్రయోగసారమున

సుకవిస్తుత్యముగా నఖండ రుచి నిల్చున్ విశ్రుతంబై యొకా
నొకచోటన్ జలజాత జాత శతమన్యుల్ సన్నుతుల్ సేయగా
సకలోర్వీ వలయంబు చూచుటకు కంసాది ప్రమత్తాభియా
త్రికులంబెల్ల నశించినాడు జిత దైత్యుండు పేంద్రుండనన్ [3]

---

1. ఆం. క. త. 1 సంపుటము 46 పు.
2. ప్రాకృత ప్రకాశము "మ్నజ్ఞ పఞ్చాశత్పఞ్చదశేషుణః". (3-44) అను సూత్రముచే జ్ఞ కారమునకు ణకారమును 'ణోనః' (10-5) అను సూత్రముచే ణకారమునకు నకారమును విధించుచున్నది.
3. కవి. సం. 1 త-89 ప.

అను పద్యము నన్నయభట్టు లక్షణ సారమందలిదనియు, దీనిని కవి సంజీవనీకారుడుదాహరించెనని వ్రాసెను. కవి సంజీవనిలోనిది లక్షణ సారమునందలిదని వ్రాయబడలేదు. కాని కవిసంజీవని లక్షణ పద్యములన్నియు గంద గీతములందే వ్రాయబడినవి. ఇది వృత్తము గదా ! కావున గణపవరపు వేంకటకవి చెప్పినట్లు లక్షణ సారములోనిది అయి యుండుట యుక్తమని ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి తెల్పియున్నారు. [1]

కావున లక్షణసారము కవిజన సంజీవని (1580-1650) కంటె ముందుది కావలెను. గణపవరపు వేంకటకవి ఆంధ్ర ప్రయోగరత్నాకరమందు కస్తూరి రంగ కవి ఆనంద రంగ రాట్ఛందము నందు లక్షణ సారములోనిదనియుట్టంకించిన

వపయోర భేద యని యెడు
నెపమున పఫ బభలు వాకు నిడుదురు ఎళిగా
నుపమింప వచ్చుకృతులన్ (?)
దుపని ప (ష?) దుచితాప్త సూక్తులానరుట వలనన్

అను పద్యము లింగమకుంట తిమ్మ కవి సులక్షణ సారమునందు గైకొనబడినది. [2] కావున లక్షణ సారకర్త తిమ్మ కవి కంటె (16వ శతాబ్ది) బూర్వుడు కావలెను.

లక్షణసారము, సులక్షణ సార సంగ్రహము సర్వలక్షణ సార సంగ్రహము అనునామములలో నొక క్రమాభివృద్ధి కనపడుచున్నది.

సర్వ లక్షణ సార సంగ్రహము కూచిమంచి తిమ్మ కవి వ్రాసినది. (1700-1757) లక్షణ సార సంగ్రహము చిత్ర కవి పెద్దన

---

1. 'అపర నన్నయభట్టు' భారతి (మార్చి 1983), 21, 22 పు.
2. లింగమకుంట తిమ్మన, సులక్షణసారము చెన్నపురి : (1950), 146 పు.

వ్రాసినది. (1518-1570) సులక్షణసారము లింగమకుంట తిమ్మకవి వ్రాసినది. (16వ శతాబ్ది) పై నామ పరిణామ క్రమముననుసరించి లక్షణ సారము 15వ శతాబ్దిలో నుండవచ్చును.

అప్పకవి ప్రాచీన లాక్షణికులు చెప్పిన యతి సంఖ్య నిట్లు తెల్పెను.

"భీమన పది చెప్పె ననంతామాత్యుడు చేసె యతు లిరువదినాల్గా
మీదఁ గొందఱు కవి గ్రామణు లిరువదియు నేడు గావించిరాగిన్"[1]

ఇందిరువదేడు యతులను చెప్పిన వారి పేరు వ్రాయబడలేదు. "కొందఱు కవిగ్రామణులు" అని బహువచన ముండుటచే నొకరికంటె నెక్కువ మంది కావచ్చును. వారనంతుని కంటె దరువాతి వారు కావలెను. అనంతుడు చెప్పినవి పదునాల్గుగదా!

లక్షణ సార సంగ్రహ కర్తయగు చిత్రకవి పెద్దన యిరువదేడు యతులను బేర్కొనెను.

సీ. స్వర విభాగ ప్రాది వర్గ నిత్యాదేశ
సరసమా వృద్ధ్యను స్వర వికల్ప
భిన్న కాకు స్వరా భేదో భయా ఖండ
ఋ ప్రభు దేశీయ రిప్లుతజ్ఞ
యుత శకంధు గణాఖ్య యతులును మఱి చక్క
టియు నెక్కటియు బోలిక యును గూడి
సప్త వింశతి యతుల్ సత్కవుల్ పనిగొన్న
శరణి వళ్ళన్నియు గా నరాగ ఆంజనేయ.[2]

లక్షణ సారము గూడ 27 యతులను జెప్పినది.

---

[1] అప్పక. 3 ఆ. 7 ప.

[2] ల. సా. సం. 1-68.

స్వర వర్గప్లుతముల్ శకంధుగణ ఋత్వ ప్రాద్య భేదోర్వ్యను
స్వర భిన్న ప్రభు కాకునిత్యములు దేశ్యజ్ఞోభయా ఖండముల్
సరసాదేశ విభాగ వృత్తులను మా సంయుక్త వైకల్పముల్
గరిమంబోలిన చక్కటెక్క (టి?) లియనంగా నిర్వదేడా
యతుల్ [1]

పై రెండు పద్యములందును యతుల సంఖ్య మాత్రమేకాక యతుల పేరులును దాదాపు సమానముగా నున్నవి. [2]

---

[1] ఈపద్యము లక్షణ సారములోనిదని రంగ రాట్ఛందము (3ఆ.13ప) చెప్పినది. డా. కొర్లపాటి శ్రీరామమూర్తిగారు, 'అపర నన్నయ భట్టు - లక్షణసారము - ఆంధ్రశబ్ద చింతామణి' భారతి (మార్చి 1983), 20 పు.

ఇట్టి పద్యము కొన్ని మార్పులతో ననంతుని ఛందముననున్నట్లు ప్రయోగ రత్నాకరము చెప్పినది. కాని అనంతుని ఛందములో నట్టిది లేదనియు, నుండుటకు వీలులేదనియు ప్రయోగరత్నాకర కర్త పొర పడెననియు పై వ్యాసములోనే ఆచార్య కొర్లపాటి వారు నిరూపించిరి.

[2] పెద్దన 'వృద్ధి' ఎక్కటి 'పోలిక' అని పేర్కొన్న వళులీ పద్యమున 'వృత్తి, ఎక్కలి' పోలిన' అను పేర్లతో నున్నవి. లేఖకప్రమాదముచేనీమార్పులు వచ్చియుండును. అభేదోర్వ్యను స్వర అను చోట "అభే దర్వ్యనుస్వర' అను పాఠముండినచో 'రి + అనుస్వర అను పదచ్ఛేదముచే రివడి గూడ వచ్చును. అట్లుగానిచో 'అభేద + ఉరు + అనుస్వర' అని పదచ్ఛేదము చేయవలసియుండును. ఉరు యతియను నదెచ్చటను వినలేదు. దానిని పాదపూరణ పదముగా బరిగణించినచో 27 యతుల సంఖ్య రాదు. కావున నిదియు లేఖకప్రమాదమేఅయి యుండును. ఇవి నాలుగును లేఖక ప్రమాదములే అయినచో పై రెండు పద్యములు పూర్తిగా సమానముగా నున్నవని చెప్పవచ్చును.

అట్లే విషయమునందు గూడ నీరెండు గ్రంథములకును సామ్యమున్నది. వాడుకలో 'వబయో ర భేదః' యను వచనమున్నది.[1]

కాని లక్షణ సారమునందు లక్షణ సార సంగ్రహమునందును 'వపయో ర భేదః' అనునది అభేదయతియందు ప్రమాణముగా చూపబడెను.[2] ఇందను స్వర పదము వాడబడినది. ఇది నిఘంటువులలో కనబడలేదు.[3]

"స్వృ" (శబ్దోపతాపయోః)అను ధాతువునకు అచ్ ప్రత్యయము చేయగా స్వరశబ్ద మేర్పడినది. స్వర ఏవ స్వారః అను గతః స్వారః అను స్వారః (అచ్చునకు ననుసరించి ఉండునది) అని దీనికి వ్యుత్పత్తి చెప్పబడినది.[4]

---

1. అప్పక. 3-87 ప.
2. "వపయో ర భేదయని యెడు నెపమున పఫ బభలు వాకునిడుదురు వలిగా నుపమింపవచ్చు కృతులం దుపనిప (ష?) దు చిత్త సూక్తులోనరుట వలనన్" ఇది ఆంధ్ర ప్రయోగ రత్నాకరమందు, ఆనందరంగరాట్ఛందమునందు లక్షణసార పద్యముగా తెల్పబడినది. (ఆచార్య శ్రీ కొర్లపాటి శ్రీరామమూర్తి 'అపర నన్నయ భట్టు' భారతి మార్చి (1983), 21, 22 పుటలు.

   పృథివి సుకవులు వపయో ర భేద యనెడి
   పలుకుచే బప బభలవి వాకు గృతుల
   విరతులుంచుచు రవిగా యభేదయతులు
   భంజితాసుర సముదాయ యాంజనేయ! ల. సా. సం. 1-68 పు.
3. శబ్దార్థ కల్పతరువు, సంస్కృతనిఘంటువు, సూర్యరాయాంధ్ర నిఘంటువు.
4. ఆం. శ. రత్నాకరము. ప్రథమ 147 పు.
   25, 23, 26 పుటలు.

ఇచట స్వరశబ్దమునకు స్వార్థమున అణ్ ప్రత్యయము చేయుటచే స్వార పదమేర్పడినది. ఆ అణ్ చేయకపోయినచో అనుస్వర పదమేర్పడును. అర్థము మాత్రము సమానమే.

ఇది వ్యుత్పత్తిచే సిద్ధించిన పదము. దీనికేదైన మారుమూల ప్రయోగముండి యుండ వచ్చును.

పెద్దన సీసము వ్రాసెను. అందనుస్వరమనుచోట 'అనుస్వార' యని వాడుట కష్టము గాదు. "సరసమా వృద్ధ్యను స్వర వికల్ప' అను పాదమును సరసమా వృద్ధ్యను స్వార దేశ్య'అని వ్రాసినచో అను స్వర పదమును వాడనక్కర లేదు.

లక్షణ సారము నందలి వృత్త పద్యమున అనుస్వార పదము యతి ప్రాస స్థానములందు వాడబడెను. ఆపదమును తీసివేసి యనుస్వార పదమును వాడుటకు కొంచెము శ్రమమగును. దానికై మొత్తము పద్యము మార్చవలసి యుండును. కావున లక్షణసార ప్రయోగమే ముందటిదన జెల్లును. అందున్న దిగదా యని పెద్దన యనుసరించి యుండును.

లక్షణసార, లక్షణసార సంగ్రహములలో యతి సంఖ్య, విషమైక్యము నీరెండు గ్రంథములలో నేదో ఒకటి రెండవ దాని నాధారముగా జేసికొని బయలుదేరెనని తెల్పుచుండగా పేరు, అనుస్వర పద ప్రయోగము లక్షణసారమే ముందున్నదని తెలుపుచున్నవి. గణపవరపు వేంకటకవి తన యాంధ్ర ప్రయోగ రత్నాకరమున పెద్దిరాజు అలంకారము (విన్నకోట పెద్దన కావ్యాలంకార చూడామణి) నుండి యొక లక్ష్యము లక్షణ సారమున నుదాహరింపబడెనని వ్రాసెను.[1]

---

[1] అది కావ్యాలంకార చూడామణిలో 3-ఉ-32 పద్యము. ఈ విషయమును గూడ ఆచార్య కోర్లపాటి శ్రీరామమూర్తిగారు తెల్పినారు. 'అపర నన్నయభట్టు' భారతి మార్చి (1983), పుట,

కావున లక్షణ సారము విన్నకోట పెద్దన కావ్యాలంకార చూ
మణికి (1402-1407కు) దరువాతిది.

అనంతుడు యతులిరువది నాల్గింటిని చేర్కొనగా ల
సారము 27 యతులను దెల్పినది. కావున లక్షణ సార మనంత
(1437 ప్రాంతము) దరువాతిది.

ఇట్లు లక్షణసారమనంతునికి చిత్ర కవి పెద్దనకు నడిమిదని స
మగుటచే 15వ శతాబ్ది నడుమ బయలుదేరినదని చెప్పవలసి యుం
ఆంధ్రశబ్ద చింతామణి, లక్షణసారములను వ్రాసిన వ్యక్తులనామ
భిన్నములగుట, యీ రెండు గ్రంథములందు దెలుగునకు ప్రా
ప్రకృతిత్వ మంగీకరింపబడుట జూడగా చింతామణి లక్షణ సారమ
గర్త యొకడేయని తెలియును.

తాతంభట్టు లక్షణ సారజ్ఞుడు

లక్షణ సారమును తాతంభట్టు చూచెను. దీనికొక
ప్రమాణ మున్నది. లక్షణ సారమున చక్కటి వడి యున్న
తత్కర్త 'వపయో ర భేదః' అను నుక్తి నుదాహరించి వ
మునకు పఫ బభలకు యతిని విధించినాడు.[2] తాతంభట్టు దా
ఖండించినాడు.

---

1. "గరిమంబోలిక చక్కటెక్కటి యనంగా నిర్వదేడౌ యతు
ఇది రంగరాట్ఛందమున నన్నయభట్టు లక్షణ సారములో
నుదాహరింపబడెను. రంగరాట్ఛందము 3-13 ప.
డా. కోర్లపాటి శ్రీరామమూర్తిగారు, 'అపర నన్నయ
భారతి (మార్చి 1983), 20 పు.

2. 'వపయో ర భేదయనియెడు నెపమున పఫ బభలు వారు నిడ
వళిగా'– ఇదిగూడ నన్నయభట్టు లక్షణసారము. 'చింతా
లక్షణసారమును వ్రాసిన వాడొకడే' అను వ్యాసమును

క. చక్కటి వళియని కొందఱు
మొక్కలమున పుఫు బుభు లకు మావెట్టుదురో
కొక్కక్కప్పుడు చెవులకు విన
గక్కసమగు గవి మతంబుగాను ముకుందా!

తే. పృథివినెక్కడ వపయో రభేదయన గ
వినము వబయోరభేద యన్వినుట గాని
అదియు యానన్న మఱి యతి వ్యాప్తి యగుచు
వచ్చి ప్రాసంబు లెక్కటి వళులు చెడును.[1]

చక్కటి వళి ననంతుడు చెప్పలేదు. లక్షణ సార సంగ్రహమును వ్రాసిన చిత్రకవి పెద్దన చెప్పెను గాని అతడు గ్రంథాదిలో తాతంభట్టును ప్రస్తుతించుటచే నతడు తాతంభట్టున కర్వాచీనుడని చెప్పవలెను.[2] కావున నితని విమర్శ అతని నుద్దేశించినది కాదు. కావున నీ విమర్శ చక్కటి యతిని, 'వపయో రభేదః' అను సూక్తిని చెప్పిన లక్షణ సార కర్తయగు నన్నయభట్టు నుద్దేశించినదని చెప్పవచ్చును.

తాతంభట్టు చెప్పిన ఎక్కటి వడిలో "— ల, మ, అ, వ, రలుంగృతి తమక తమక వళులు ముకుందా" అని వకారము గూడనున్నది.[3] కావున నాతడు వకారమునకు, పవర్గాద్యక్షరముతో యతిని నిషేధించినాడు.

ఆంధ్ర శబ్ద చింతామణిలో 'రయోస్తు నిత్యంస్యాత్' అని సాధుశకట రేఫలకు వైధర్మ్యము నిత్యమని విధింపబడగా కవి చింతామణిలో "...... వెలయు అకారములు కొన్ని ద్వివిధాకృతులై"

---

1. కవిచింతామణి వళిప్రా స, 57, 58 ప.
2. ల. సా. స. 3-3 ప.
3. కవిచింతామణి వళిప్రాస 36 ప.

అని శకటరేఫ కొన్ని చోట్ల సాధుశకట ద్వివిధ రూపములలో నున్నట్లు విశేషము తెలుపబడినది. ఇది

లఘుర్భవేద్గురుః కుత్రచిద్ గురుశ్చ లఘుస్తథా

(ఒకచో సాధురేఫ శకటరేఫ యగును. శకటరేఫ సాధు యగును) అను నథర్వణ కారికవలె శేషపూరణము చేసినది.[1] ఇ గూడ తాతంభట్టు అర్వాచీనతను సూచించును.

కావున లక్షణసార కర్తయగు నన్నయభట్టు కంటే తాతంభట్టు అర్వాచీనుడని చెప్పవచ్చును. లక్షణసార చింతామణులకు క యొకడే అయినచో చింతామణి కర్త తాతంభట్టుకు బూర్వము గలడని చెప్పవచ్చును. ఇంతవరకు జరిగిన సుదీర్ఘ పరిశీలనముచే నాంధ్ర శబ్ద చింతామణి బాలసరస్వతి కాలమునుండి తాతంభట్టు పూర్వము బోయినది. ఇక నాంధ్ర భారతకర్తయగు నన్నయభట్టుకు తా భట్టుకు నడుమ చింతామణి బయలుదేరిన కాలమును గుర్తింపవలెను.

చింతామణి కాలము

చింతామణి దెలుగునకు వ్యాకరణము. కాని సంస్కృతములో వ్రాయబడినది. భాషా స్వరూపమును సులభముగా గ్రహించుటకు వ్యాకరణ మవసరము. మఱి తెలుగు భాషకు తెలుగులో వ్యాకరణ మును వ్రాసినచో దెనుగు వారికుపకారమగును. ఇతడు సంస్కృత ములో నేల వ్రాసెను?

చింతామణి రచనాక్రమమును గుర్తించినచో సంస్కృత ప ములను తత్సమములుగా జేయు పద్ధతులను ప్రధానముగా జెప్పినట్లు మనము గమనింతుము. తెనుగు భాషకు వ్యాకరణమును వ్రాయ

---

1. కవిశిరో. సంజ్ఞ 19 సూ. వ్యాఖ్య.

వాడు తత్సమ పదముల నేర్పరచుకొను పద్ధతులకు ప్రాధాన్యము నొసగుటేల ? దేశ్య పదములకు ప్రాధాన్యము నీయవలదా ?

చింతామణి ప్రారంభమున కావ్య ప్రయోజనము, కావ్య లక్షణము, కవి కర్తవ్యము తెల్పబడినవి. చింతామణి అలంకార శాస్త్రము కాదు : వ్యాకరణము. పై విషయములలంకారశాస్త్రము నందుండును. మఱి వీనిని చింతామణి కర్త యేల చెప్పెను ?

పై ప్రశ్నలకు సమాధానములను వెదకునపుడీ క్రింది జవాబులు వచ్చును.

గ్రంథకర్త వాడుకలోనున్న భాషను సులభముగా గ్రహించుటకు వ్యాకరణమును వ్రాయదలచలేదు. సంస్కృతమున అనేక సుందర కావ్యము లున్నవి. వానిని దెలుగులోనికి దేవలెనన్న సంస్కృత పదములను సులభముగా దెలుగులోనికి దెచ్చుకొను మార్గములు దెలియవలెను. దీనికి సంస్కృత భాషా పండితులయి దెలుగు తెలిసినవారు కావలెను. సంస్కృత పండితులకు దెలుగుపై మక్కువ గల్గించుట ద్వారా దెలుగులోనికి సంస్కృత కావ్యముల ననువదింప జేయుటకు చింతామణి వెలువడినది. నాడు పండిత భాష సంస్కృతము. కావుననే యిది సంస్కృతమున వ్రాయబడినది.

నేడు పండిత భాష ఆంగ్లము, కావున ప్రసిద్ధినిగోరు విద్వాంసు లితర భాషలలో వ్రాసిన దమ పుస్తకములను గూడ నాంగ్లములో ననువదించుకొనుట కలదు. [1]

తెలుగున నాంధ్ర భాషా భూషణము నందు కావ్య ఫలాదికము చెప్పబడలేదు. విన్నకోట పెద్దన కృతిపతి కోరిక ననుసరించి కవుల

---

1. కవి కోకిల దువ్వూరి రామిరెడ్డి తన 'కడపటి వీడ్కోలు' దెలుగు కావ్యమును, విశ్వకవి రవీంద్రనాథ టాగూరు తన గీతాంజలిని ఆంగ్లములోనికి పరివర్తించుట జగద్విదితము.

సౌకర్యార్థము అచ్చటచ్చట నున్న అలంకార వ్యాకరణ ఛందో విషయముల నన్నిటిని క్రోడీకరించుటచే నతడు కావ్యఫల, కావ్యాత్మ లను జెప్పుటలో నౌచిత్యమున్నది. కాని కేవల వ్యాకరణమును వ్రాయదలచిన చింతామణి కావ్య ఫలాదికము నేల జెప్పుట?

విశ్వనాథ కవిరాజు సాహిత్య దర్పణమును వ్రాయుచు ఈ గ్రంథము కావ్యమున కఙ్గము, కావ్య ప్రయోజనములే దీనికిని ప్రయోజనము లగును. కావున కావ్య ఫలములను చెప్పుచుంటెననెను.[1] ఈ వచనములు చింతామణికి ప్రేరణ నిచ్చియుండ వచ్చును.

తెలుగులో నుత్కృష్ట కావ్య నిర్మాణ ప్రోత్సాహముకొఱకే చింతామణిని వ్రాయుచుంటెనవి తెలుపుటకు గ్రంథాదిలో నీతడు కావ్య ప్రయోజనాదికమును దెలిపియుండును.

కావ్యప్రయోజనాదికమును సంస్కృతాలంకారికులు తెలిపి యున్నారు. చింతామణి కర్త వాని ననువదించుకొనవలయును. కాని ప్రతిభావంతుడు ప్రతిపనిలో దనబ్రత్యేకతను వెల్లడించును. చింతామణిలో కావ్యప్రయోజనాదికథనమున గల ప్రత్యేకతను గుర్తింతము. మమ్మటుడు

కావ్యం యశసేర్థకృతే వ్యవహారవిదే శివేతర క్షతయే
సద్యః పర నిర్వృతయే కాన్తా సమ్మిత తయోపదేశయుజే

(కావ్యము యశస్సు, ధనము, వ్యనహారజ్ఞానము, అమంగళక్షతి కలిగించును. చదివిన వెంటనే అలౌకికానందము నొసంగును. కాన్తా సమ్మితముగా నుపదేశము నిచ్చును) అని పలు కావ్యప్రయోజ

---

1. శ్రీ విశ్వనాథ కవిరాజు, సాహిత్య దర్పణము వారణాసి: చౌఖాంబా సంస్కృత్ సిరీజ్. (1967), 3 పు.

నములను జెప్పెను.[1] వానినన్నిటిని సంగ్రహించుచు విశ్వనాథ కవిరాజు

చతుర్వర్గ ఫలప్రాప్తిః సుఖాదల్ప ధియామపి
కావ్యాదేవ యతస్తేనతత్స్వరూపం నిరూప్యతే

(సామాన్య బుద్ధిగలవారికి గూడ కావ్యమువలన నాలుగు పురుషార్థములు సుఖముగా లభించును. కావున కావ్యస్వరూపము నిరూపింపబడుచున్నది.) అని వ్రాసెను.[2]

చింతామణి కారుడు "విశ్వశ్రేయః కావ్యమ్" (కావ్యమన్ని శ్రేయస్సులను గల్గించును,) అని యొక్క చిన్న వాక్యముతో దీనిని తెల్పినాడు.[3] మమ్మటుడు "తదదోషౌ శబ్దార్థౌ సగుణా వనలంకృతీ పునః క్వాపి" (దోషములు లేనివియు గుణములతో గూడినవియు నగు శబ్దార్థములు కావ్యము. ఒకచో అలంకార రహిత శబ్దార్థములు గూడ కావ్యము కావచ్చును.) అని కావ్యస్వరూపమును నిర్వచించెను.

విశ్వనాథుడు దీనిని ఖండించుచు "దోషరహితమే కావ్యమయినచో నొక దోషముతో గూడియున్న ధ్వని కావ్యము గూడ కావ్యము కాకపోవును. కాన 'అదోషౌ' అను విశేషణము వేయరాదు. గుణములతో గూడిన శబ్దార్థములు కావ్యమున ఉత్కర్షమును గల్గించును గాని గుణములు కావ్యస్వరూపమును గల్గింపవు. కావున సగుణౌ అను విశేషణము చెప్పరాదు. అలఙ్కార రహిత శబ్దార్థములు గూడ క్వాచిత్కముగా కావ్యము కావచ్చుననుట గూడ తప్పే.

---

1. కావ్యప్రకాశ చెన్నపురి : వావిళ్ళ, (1861), 11 పు.
2. సాహిత్య దర్పణము 1 పు,
3. కవిశిరో. సంజ్ఞ 1. సూ.

ఈ విశేషణముచే అంతటను అలంకారముతో గూడిన శబ్దార్థములే కావ్యము. ఒకానొకచో అస్ఫుటాలంకారముతో గూడినది కూడ కావ్యము కావచ్చునను నర్థము వచ్చును. అలంకారముతో గూడిన శబ్దార్థములు కావ్యమున కుత్కర్ష గలిగించునవేకాని అవియే కావ్య స్వరూపము కానేరదు." అని వ్రాసి "వాక్యం రసాత్మకం కావ్యమ్" (రసాత్మకమైన వాక్యము కావ్యము) అని తాను నిర్వచించెను.[1] చింతామణి కర్తపై రెండు నిర్వచనములను సమన్వయించుచు

'తదదోషౌ పరిష్కృతౌ చ వాగర్థౌ సావాగ్యారసవృత్తిః"

(దోషరహితమైనవి గుణాలంకార సహితమైనవియు నగు శబ్దార్థములుగూడ కావ్యమగును. రసమందు వర్తించునదే కావ్యమందలి శబ్దము) అని చెప్పెను.[2] ఈనిర్వచనముచే కావ్యమందలి వాగర్థములలో దోషమున్నను గుణాలంకారములు లేకున్నను కావ్యత్వమునకు భంగము లేదని చెప్పినట్లయినది. విశ్వనాథ కవిరాజు చేసిన ఆక్షేపములంటకుండ చేసినట్లైనది.

దోషరహితత్వము గుణాలంకార సహితత్వమను లక్షణద్వయ విశిష్టములయిన వాగర్థములు కావ్యములని చింతామణి సూత్రమున కర్థమునేల జెప్పరాదని ప్రశ్న.

ఈ వాక్యమునకు మూలమనదగిన మమ్మట వచనమందే "అనలంకృతీ పునఃక్వాపి" (క్వాచిత్కముగా నలంకార రహితము గూడ కావ్యమగును) అని యుండగా నాసిద్ధాంతమును గ్రహించుచు

---

1. సాహిత్య దర్పణము ప్రథమపరిచ్ఛేదము 8 నుండి 14 పుటలు, 20, 21 పుటలు.

2. కవిశిరో. సంజ్ఞ 2 సూ.

దద్విరుద్ధముగా అలంకార సహిత మయినదే కావ్యమని యెట్లు చెప్పును ? రసమునకు ప్రాధాన్యమిచ్చు వాడలంకారములను కావ్య స్వరూపములో జేర్చుననుట యుక్తముగా దోపదు. కావున మొదట జెప్పిన వ్యాఖ్య ఉచితమనిపించును.

విశ్వనాథుడు రసాత్మకమైన వాక్యము కావ్యమనినాడు. రసము ఆత్మ. శబ్దము కావ్యము.

ఇక అర్థము గతియేమి ? కావ్యమున శబ్దార్థములు రెండు నుండునుగదా ! శబ్దము బాహిర రూపము. అర్థ మాంతర రూపము. దానిని వీడుటెట్లు ?

కావున చింతామణి కావ్యస్వరూపమున నర్థమును వదలకుండగనే రసమునందు వర్తించునదియే కావ్యవాక్కు అని యొక సమన్వయమును జేసినది.

వ్యాకరణరచనకు మొదట కావ్య ప్రయోజనాదికమును జెప్పుట, ఇట్లు అదోషములు పరిష్కృతములు నగు వాగర్థములు గూడ కావ్యమే యనుట, రసవృత్తియైనదే వాక్కు అనుట, కావ్యమిచ్చు ఫలములను విడివిడిగా జెప్పక కావ్య మన్ని శ్రేయస్సుల నొసగునని చెప్పుట పరిశీలింపగా చింతామణి మమ్మట విశ్వనాథ కవిరాజుల యనంతరమే బయలుదేరెనని స్పష్టపడును.

విశ్వనాథునకు ముందు రసవాదమున్నను అలంకార శాస్త్ర చరిత్రలో రసమున కత్యధిక ప్రాధాన్యము గన్పట్టునది సాహిత్య దర్పణమునందే కదా !

మమ్మటుడు భోజరాజు త్యాగమును బేర్కొనినాడు.[1] భోజుడు క్రీ. శ. 996-1051 నడిమివాడు. కావున మమ్మటుడు భోజునకు దరు

---

[1] 'భోజనృపతే స్తత్త్యాగ లీలాయితమ్'
కావ్యప్రకాశ 10 ఉ. ఉదాత్తాలంకారము.

వాతివాడని చెప్పవచ్చును. మమ్మటునివాదమును ఖండించినవిశ్వనాథ కవిరా జాతనికి దరువాతి వాడే గదా! ఇతడు 14వ శతాబ్ది పూర్వ భాగమున నుండెనని పరిశోధకులు దెల్పినారు. [1] వారిద్దరి యభిప్రాయములను గ్రహించిన చింతామణి వానికి దరువాతిదని చెప్పవచ్చును.

'కొఱకు' సాక్ష్యము

కేతన 'కొఱకు' ను చతుర్థీ విభక్తిగా చెప్పలేదు. [2]

ఆతడు 'కున్ కిన్' అను వానిని చతుర్థీ విభక్తి ప్రత్యయములుగా నుదాహరించెను. పెద్దన గూడ దానిని చతుర్థీ విభక్తి ప్రత్యయముగా జెప్పలేదు. [3] కాని ప్రయోగించెను. [4] ఇతడు 'కై' అనుదానిని చతుర్థిగా జెప్పెను. అనంతుడు "ఈతని కొఱకతనికై యన చతుర్థి" అని 'కొఱకు' 'కై' అను వానిని రెండింటిని చతుర్థులుగా జెప్పెను.[5] ఆంధ్ర శబ్ద చింతామణి గూడ "కొఱకు కై చతుర్థ్యాః స్తః" అని చెప్పినది. [6] ఇందు క్రమ పరిణామము స్పష్టముగా గోచరించున్నది.

శాసన భాష యందు గూడ 14వ శతాబ్దికి పూర్వము "చతుర్థీ విభక్తిని'కి (న్) కు (న్), కూ, క్, అనే పదాంశంతోను 'షాష్టి' అనే అనుబంధంతోను సూచించెడి వారు." [7] "కొఱకు ప్రత్యయం 14వ

---

1. సాహిత్య దర్పణ ప్రాస్తావికమ్ - 33 పుట.
2. ఆం. భా. భూ. 89 ప.
3. కావ్యా - చూ. 9-76 ప.
4. 'సుతు కొఱకునుసుతుని కొఱకు' అండే. 110 ప.
5. ఛందో దర్పణము 4 ఆ. 107 ప.
6. కవిశిరో. అజంత 4 సూ.
7. శ్రీ ఎం. కందప్ప శెట్టి. ప్రాచీనాంధ్రం - శాసన భాషా పరిణామం. తెలుగు భాషాచరిత్ర 25 పు.

శతాబ్దిలో రెండుచోట్ల మాత్రం కనిపించినది.[1] తరువాతి యుగంలో (15, 16 శతాబ్దులలో) చాలా తఱచుగా కనిపించినది. తరువాత (క్రీ.శ. 1600-1899) వరకు కొఱకు అనేది కనిపించటం లేదని భాషా శాస్త్రజ్ఞులు తెలిపినారు.[2] పై లక్షణ గ్రంథములు, శాసనములు నొసగు సాక్ష్యమును బట్టి కొఱకును చతుర్థీ విభక్తి ప్రత్యయముగా జెప్పిన చింతామణి 15, 16 శతాబ్దులకు చెందినది కావలెను.

చింతామణి అనంతునకు తరువాతిది

అనంతుడు ఛందోదర్పణమును రచించెను. దాని ప్రభావము చింతామణిపై గనబడుచున్నది. దానిని బరిశీలింతము. అనంతుడు "మఱియుం బంచాశద్వర్ణంబులు" అని సంస్కృతమునకు గల యేబది వర్ణముల వర్ణమాలను వ్రాసెను.[3] సంస్కృత వర్ణ సంఖ్యా పరిగణనము ఆంధ్ర భాషా భూషణములోగాని కావ్యాలంకార చూడామణిలోగాని కనబడదు. చింతామణి మాత్రము "ఆద్యాయాః పఞ్చాశద్వర్ణాః"[4] (సంస్కృతమునకు వర్ణములేబది) అని సంఖ్య చెప్పి ఊరకున్నది. అనంతుడు

క్రియనైయాలకు హ్రస్వ
ద్వయము లమరు నాంధ్ర భాషిత ప్రకరములో
నయిదనఁ దగు నైదనుచో
జయకీర్తీ! యవుననంగఁ జను నౌననుచోన్.[5]

---

[1] డాక్టర్ బూదరాజు రాధాకృష్ణ, 'ప్రాచీనాంధ్రం - శాసన భాషా పరిణామం' తెలుగుభాషా చరిత్ర ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి సం. 72 పు.

[2] అందే. 157 పుట.

[3] ఛందో. 4-123, 125, 124, 126. ప.

[4] కవిశిరో. సంజ్ఞ 11 సూ.

[5] ఛందో 1-85 ప.

అని చెప్పిన విషయమును "వాయిరవుర్వక్రతమా' (వక్రతమములు వికల్పముగా అయి అవు అనియగును) అని చింతామణి దెల్పెను.[1]

పై విషయములను చింతామణి నుండియే యనంతుడు గ్రహించి యుండరాదా? అని ప్రశ్నించినచో నట్లును జరుగవచ్చును. కాని యీ క్రింది విషయ మనంతునిదే ముందు గ్రంథమని నిరూపించుచున్నది. కేతన సమాసములను పూర్వపదార్థ ప్రధానము, ఉత్తరపదార్థ ప్రధానము, అన్యపదార్థ ప్రధానము, ఉభయపదార్థ ప్రధానమని నాలుగు తెఱగులుగా విభజించెను.[2] ద్వంద్వాది నామముల బేర్కొనలేదు. పెద్దన తత్పురుష, కర్మధారయ, బహువ్రీహులు మూడింటినే పేర్కొనెను.[3] అనంతుడు

లలిత ద్వంద్వబహువ్రీహులు తత్పురుషము నలుక—
నుద్యద్ద్విగువున్
నలి కర్మధారయము నిర్మలా వ్యయీభావమును సమాసము
లరయన్[4]

అని వ్రాసెను. మఱియు నితడుత్తరపదోపమానసమాసమును గూడ బేర్కొనినాడు. చింతామణిలో

"ద్విగుకర్మధారయా తత్పురుష ద్వంద్వా బహువ్రీహిః
అన్యేచ కేచిదుపమానోత్తరపదలోప రూపకా ఖ్యాద్యాః[5]

(తెలుగున ద్విగు కర్మధారయములు, తత్పురుష ద్వంద్వములు, బహువ్రీహి, ఉపమాన సమాసము, ఉత్తరపదలోపము,

---

1. కవిశిరో. అజన్త - 65 సూ.
2. ఆం. భా. చూ. 110 ప.
3. కావ్యా. చూ. - 9-122 ప.
4. ఛందో. 4-86 ప.
5. కవిశిరో. హలంత 43 సూ.

రూపకము మొదలయినవి కలవు) అని కలదు. ఇచట కేతన నుండి చింతామణివరకు క్రమాభివృద్ధి కనబడును. అనంతుడుత్తర పదోపమాన సమాసమును పేర్కొనెను గదా! ఉపమానోత్తర పదము, ఉపమాన పూర్వపదమునని ఉపమాన కర్మధారయములు రెండున్నవి. అనంతునిచే నొకటి మాత్రమే గ్రహింపబడెను. సంస్కృతమున గల ఉత్తరపదలోపము ననంతుడు స్పృశింపనేలేదు. ఆలోపముల దీర్చుచు చింతానుణి చేసిన మార్పు యుక్తముగా ఉన్నది. ఉపమాన సమాసమనుటచే నా రెండు భేదములు గ్రహింపబడెను. ఉత్తర పదలోప సమాసముతోపాటు రూపక సమాసమును గ్రహించుట చింతామణిలో గల విశేషము. అనంతుడు చెప్పిన అలుక్సమాసమును చింతామణి వీడినట్లు కనబడును. కాని యది యాద్యశబ్దముచే గ్రహింపవలసియున్నది. చింతామణికి సంగ్రహీకరణ మిష్టమని పెక్కు విషయములు నిరూపించును.

'ఇచ్చ విభక్త్యంతిమస్య జే రలిచ' (చేతతోడ వలన విభక్తుల చివరి వర్ణమునకికారాదేశము వచ్చును. సప్తమీ విభక్తుల చివరి వర్ణమునకు అలియనునది వచ్చును.)[1] అనుచోట నలుక్సమాసాగమములు పేర్కొనబడినవి గావున నవి యిట మరల దలంపబడలేదు. అనంతుడు పరికృతమను పదమును బ్రయోగించెను.[2] అతడు దీని నెచ్చటనుండి గ్రహించెనో! సంస్కృత నిఘంటువులలో నిది కనబడలేదు. చింతామణి గుణాలఙ్కార యుతములను నర్థమున నీ పదమును ప్రయోగించెను.[3] సంకేతిత సుప్రసిద్ధ పదములనే వాడవలయునని నియమించిన చింతామణి అనంతునివంటి పండితకవి వాడినందువలననే దీనిని గ్రహించి యుండును.

---

[1] కవిశిరో. సంజ్ఞ 37, 38 సూ.

[2] ఛందో. 4-85 ప.

[3] కవిశిరో. 1-2 సూ.

ఈ పరికృతపదము పరిశీలనీయము. 'సంపరిభ్యాంకరోతౌ భూషణే' (సం, పరి అను నుపసర్గలు పూర్వమందున్న కృఞ్ ధాతువునకు భూషణమనునర్థమున సుట్ అనునాగమము వచ్చును.)[1] భూషణమను నర్థమున పరిష్కృతమను పదము మాత్రమే యేర్పడును. గుణాలఙ్కారములు, భూషణ భిన్నములను తలంపున చింతామణికర్త తద్వాచకముగా పరికృత పదమును వాడెను. మమ్మటుడు

'తదదోషౌ శబ్దార్థౌ సగుణా వనలంకృతీ పునఃక్వాపి'

అని కావ్యస్వరూపమును నిరూపించెను..[2] ఇందున్న గుణాలంకారములను పరికృత శబ్దముచే చింతామణి కారుడు గ్రహించెను. అలంకార రహితముగా గూడ కావ్యముండవచ్చునని మమ్మటుడు చెప్పుటచే 'చ' శబ్దము నీతడుపయోగించెను. దీనిచే దోషములు లేనివి, గుణాలంకార రహితములును గూడ కావ్యము కావచ్చునని తెలియును. గుణాలంకారముల నలంకారములుగా వాడుటగలదు. దండ్యాచార్యుడు కావ్యాదర్శ ప్రథమ పరిచ్ఛేదమున గుణములను బేర్కొని ద్వితీయ పరిచ్ఛేదమున నలంకారములను జెప్పుచు బూర్వము కొన్ని యలంకారములను జెప్పితిననినాడు.[3] ఇచ్చట టీకాకారుడగు తరుణవాచస్పతి దండిమతమున గుణాలంకారములు రెండు నలంకారములేయని స్పష్టము చేసెను.[4] దండి మహాశయుడు కావ్యశోభాకర ధర్మములలంకారము

---

1. సిద్ధాంత కౌముది 25. 50 సూ.
2. మమ్మట, కావ్యప్రకాశ మద్రాసు : వావిళ్ళ ప్రతి, (1891), 1వ పు
3. కాశ్చిన్మార్గ విభాగార్థముక్తా ప్రాగప్య లఙ్క్రియాః కావ్యా
   హైదరాబాదు : ఆం. ప్ర. సా. అకాడమీ, (1981), 2-3
4. కవిశిరో. సంజ్ఞ 65 పుట 3సూ. వ్యాఖ్య.

లనే నిర్వచించెను.[1] ఈ లక్షణము గుణములకు గూడ వర్తించునదే. కావున చింతామణిలోని పరిష్కృత శబ్దమునకు అలంకారమను నర్థమును చెప్పక తప్పదు. ఇంతకును ఈ పదము అనంతుని మీద గల గౌరవముచే చింతామణి గ్రహించినదనియు గావుననిది ఛందోదర్పణమునకు దరువాతిదనియు నిశ్చయింపవచ్చును. ఈ రెండు సందర్భములును చింతామణి ఛందో దర్పణమునకు దరువాతిదేయని నిరూపించుచున్నవి.

ఇంద్ర విజయాదు లితనివేనా ?

ఆంధ్ర శబ్ద చింతామణి, లక్షణసారము, ఇంద్ర విజయము, రాఘవాభ్యుదయము, చౌడేశ్వరీ విలాసమను గ్రంథములు భారతకర్తకంటె భిన్నుడగు నన్నయభట్టుచే రచింపబడినవని యొకరి ప్రతిపాదనము.[2] లాక్షణికుడగు చింతామణి కర్త కవిగూడయని నిరూపింపబడుట సంతోషమే కాని యీ నిర్ణయమునకు గొన్ని ప్రతిబంధకములున్నవి. వానిని జూచెదము.

పై గ్రంథములలో నాంధ్ర శబ్ద చింతామణి, చౌడేశ్వరీ విలాసము తప్ప తక్కినవి సమగ్రముగా లభించుట లేదు. లక్షణ గ్రంథములలో కొన్ని పద్యములు మాత్రము లభించుచున్నవి. గణపవరపు వేంకటకవి తన ప్రయోగ రత్నాకరమున

"నన్నయభట్టింద్ర విజయము ఆంధ్ర శ్రీధర చ్ఛందో లక్ష్యము.
ఒక పలువాత గొన్నకిటియున్ దలలో నిడు కూర్మి భర్తనా
లికె (క ?) లిరుగొన్న శిదిరపురెం (రే ?) డు పయోధర ధారపు

---

1. కావ్యా, 2-1
2. 'అపర నన్నయభట్టు లక్షణసారము ఆంధ్రశబ్ద చింతామణి' భారతి (మార్చి, ఏప్రియల్ 1983).

(పా ?) ట్టబెం, చు కులనగాలి యీాడు ప్రతిజోడెన యంచన గూడ
దేరిన (కె ?), న్నికగ యయాతి యొంటి ధరణీన్ భజయించె (చి)
చెలంగ (గు ?) వానికిన్

అని యున్నదని ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి తెలిపిరి. శ్రీధర చ్ఛందము దొరకుటలేదు. కాని అందలి పద్యములలో

"అరిరాయ విఘాల సోమయవనీపాలా! పిన్న భూవరుని సోమా! పిన్నయ సోమా!"

అను సంబుద్ధులున్నవి.[2] కనుక శ్రీధర చ్ఛందస్సు పిన్నయ సోమ భూపాలునికి అంకితము కావలయును. అతడు ఆరవీటి తా పిన్నయ సోమ భూపాలుడయినచో శ్రీధర చ్ఛందము 14వ శతాబ్ది ఉత్తరార్ధ మందలిది కాపలెనని ఆచార్య కొర్లపాటి శ్రీరామమూ తెలిపియున్నారు.[3]

శ్రీధర చ్ఛందమును గౌరన (క్రీ. శ. 1385-1445) పేర్కొనెనని సమగ్రాంధ్ర సాహిత్యము నాపోశనము బట్టిన శ్రీ ఆరుద్ర తెల్పియున్నారు.[4]

---

1. అపర నన్నయభట్టు, భారతి (మార్చి 1983), 22, 23 పు.
2. అందే 22, 23 పుటలు.
3. ఇట్టి ప్రబలాధారము జూపియు 'పూర్వకవి ప్రయోగ ప్రదర్శనమున కాద్యుడు వెల్లంకి తాతంభట్టే యను నమ్మకతో వారు శ్రీధరచ్ఛందము తాతంభట్టునకు దరువాతిదని యూహించిరి. కాని యీ యూహ పైన వారే చూపిన ప్రమాణము కంటె బలీయము కానేరదు. అందే.
4. సమగ్రాంధ్ర సాహిత్యం 2 సం. 132 పు.

జగమెఱిగిన లక్షణ వేత్తలు విద్వాన్ రావూరి దొరసామిశర్మ గూడ శ్రీధర చ్ఛందము 1350 ప్రాంతమందలిదని చెప్పుట గమనింపదగినది.[1] శ్రీధర చ్ఛందమున నుదాహరింపబడిన ఇంద్ర విజయమంతకు ముందున్నదని స్పష్టము. అనంతునికి దరువాతి వాడైన చింతామణి కర్త యింద్ర విజయమును వ్రాయుట కుదురదని వేరే చెప్పబనిలేదు.

చౌడేశ్వరీ విలాసకర్త ప్రక్షేప పాఠములను కల్పించి చింతామణిలో జేర్చెనని వేఱొకచోట జెప్పబడెను.[2] ప్రక్షేప పాఠములలో నథర్వణుని పేరున్నది.[3] కావున నీతడథర్వణునికి దరువాతి వాడు కావలెను. చింతామణికి బూరణ శ్లోకములను వ్రాసిన అథర్వణుడు చింతామణికి దరువాతి వాడని వేఱే చెప్పనక్కఱలేదు. చౌడేశ్వరీ విలాసకర్త చింతామణికి ఆంధ్ర భారతమునకు కర్త ఒకడేయను భ్రమను గలిగించిన వాడు.[4] ఇట్టి కుటిల యత్నము ఆంధ్ర శబ్ద చింతామణిలో గాని లక్షణ సారమున గాని కనబడదు. చౌడేశ్వరీ విలాస కర్తకు చింతామణి కర్తకు గల భేదము వేఱొక చోట స్పష్టపరుపబడినది. కావున చౌడేశ్వరీ విలాస కర్త చింతామణి కర్త ఒకడు గాడు.

ఇక రాఘవాభ్యుదయ మలభ్య గ్రంథము. లాక్షణికులైన నన్నయకు ప్రమాణాంతరము లేకుండ నీ అల్ప గ్రంథమును అంటగట్టుట అనవసరము. లక్షణ సారమును చింతామణికి దరువాతివారు ప్రమాణీకరించిరి. చౌడేశ్వరీ విలాస రాఘవాభ్యుదయముల నట్లు

---

1. లక్షణ శిరోమణి పీఠిక హైద్రాబాదు : ఆం. ప్ర. సా. అకాడమీ (1979), 14 పు.
2. ప్రక్షిప్త పాఠములను జేర్చిన వారెవరు ? అను వ్యాసము చూ.
3. 'సుమోచ్చతో హల్యథర్వణాచార్య మతాత్' అప్పక. 5 ఆ-శెసూ. 129 ప. ఒద్ద
4. ప్రక్షిప్తపాఠలను జేర్చిన వారెవరు ? అను వ్యాసము.

కవి పండితులెవ్వరును ప్రమాణముగా గ్రహించినట్లు తెలియదు కావున నీరెండు గ్రంథములను చింతామణి కర్త రచనములని యననక్కరలేదు.

కాలనిర్ణయమిది

అనంతుని ఛందోదర్పణములోని విషయమును చింతామణి కొంత విస్తరించుటచే చింతామణి యతనికి దరువాతిదియని యనుకొంటిమి. అనంతుడు క్రీ. శ. 1435 ప్రాంతము వాడు.[1]

ఆంధ్రకవి రామయ్య తన విష్ణుకాంచీ మాహాత్మ్య పీఠికలో పూర్వకవులను స్తుతించుచు

> "శబ్దశాసన కావ్య సంఘట్టన క్రమానందిబుధవర్యు నన్నపార్యు
> నుభయభాషా రచనోన్నిద్ర వచోరాజిఁ దిక్కనసోమయాజి
> లక్ష్యలక్షణ కళాలంకార సౌభాగ్య సత్కావ్యవిన్యాసుశంభుదాసు
> ఛందోనిబంధన చాతురీ ధౌరేయ వాగ్ధాము వేములవాడభీము
> రసిక జన పద్మ దిననాథు రంగనాథుఁ బ్రకట కృతికర్మనిస్తంద్రు భాస్కరేంద్రు
> నమిత రసరావు శ్రీ త్రిపురారిదేవు సూక్తి తిమిధాము నాచనసోముఁ దలతు"

అని వ్రాసినాడు. ఇందు నన్నయ శబ్ద శాసనమును కావ్యమును బాగుగా నిర్మించుటచేత పండితుల నానందింప జేసినట్లు చెప్పబడినది.[2]

---

1. శ్రీ ఆరుద్ర, సమగ్రాంధ్ర సాహిత్యం 5 సం. మద్రాసు. ఎమ్. శేషాచలం అండ్ కంపెని, (1965), 102 పు.
2. ఇచట అభిప్రాయము సరిగా తెలియుట లేదని యొకరు భావిం నారు. (సం. ప్ర. వ్యాకరణాలు పుట 16) శబ్ద శాసనమనే కావ్య నిర్మాణంలో ఆనందితులయిన బుధవర్యులు గల నన్నయ" మొదటి పాదమునకు వారర్థము జెప్పినారు. "లేకపోతే శబ్దశాస

అనగా నప్పటికి చింతామణికర్త భారత కర్తగా భావింప బడుచుండెనన్నమాట.

---

172 పు. అథ సూచికకు తరువాయి వలన, కావ్య సంఘట్టనం వలన, ఆనందితులయిన బుధులు గల వాడని ఎట్లో సమర్థించవచ్చు. కాని అప్పుడైనా శబ్దశాసనమేమిటి? ఏ కావ్య సంఘట్టనం అనే ప్రశ్నలు సమాధానాలు లేక మిగిలి పోతాయని" వారూహించినారు. ద్వంద సమాసమునకు చివర నున్న పదము ద్వంద్వ మందున్న పదములతో వేరువేరుగా నన్వయించుట సంప్రదాయము. (ద్వంద్వాన్తే శ్రూయమాణం పదం ద్వంద్వ ఘటిత పదైః ప్రత్యేకం ప్రత్యేకం సమ్బధ్యతే) క్రమ మనగా విధమను నర్థమున్నది (సూ. ని. 2 సం. 584 పు.) శబ్దానుశాసన మనగా వ్యాకరణము - 'అను' అను నుపసర్గమును తొలగించి శబ్దశాసన పదమిచట వ్యాకరణ పర్యాయముగా వాడ బడినది. 'విపుల శబ్దశాసనున్' అని ఆంధ్ర భారత కర్తకు వాడబడిన విశేషణ పద బంధమున గూడ నిట్లే శబ్ద శాసన పదము వ్యాకరణ పర్యాయమగును.

ఘట్టిత మను పదమునకు నిర్మితమను నర్థమున్నది. (శబ్దార్థ కల్పతరు 506 పుట) ఇచట ఘట్టన పదము నిర్మాణార్థమున వాడ బడినది. కావున శబ్దశాసనము యొక్క, కావ్యముయొక్క నిర్మాణ విధముచే నానందింపజేయబడిన బుధులు గలవాడు నన్నయ అని రామయ్య స్తుతి. ఈ కవి దృష్టితో శబ్దశాసనము చింతామణి, కావ్యము భారతము నగును. అట్లుగాక శబ్దశాసన మనెడి కావ్య నిర్మాణ విధమని యర్థము చెప్పినచో చింతామణి నిర్మాతనే యితడు స్తుతించె ననవలెను. పై పద్యమున కవిత్రయము స్తుతింపబడినారు. వారిలో మొదటివాడు నన్నయభట్టు. అతని పేరనున్న రచనలలో మిక్కిలి ప్రసిద్ధమైనది మహాభారతము. దానిని వదలుటకు హేతువు కనబడదు. కావున మొదట చెప్పిన విగ్రహమే సముచితము.

రామయ్య నాచన సోముని వరకుగల కవులను స్తుతించినాడు. నాచన సోమనాథుడు 1344 ప్రాంతమువాడు.[1] ఇందు పేర్కొనబడిన త్రిపురారి దేవుడు ప్రేమాభిరామాది కృతికర్తయగు త్రిపురాంతకుడు కావలెను. అతడు 1370 ప్రాంతము వాడని తెలియుచున్నది.[2] రామయ్య వారికి తరువాతివాడు కావలెను. రామయ్యది 15 శతాబ్ది కావచ్చునని పరిశోధకు లూహించుచున్నారు.[3]

అనంతునికి తరువాత రామయ్యకు బూర్వము చింతామణి రచింపబడెననుట స్పష్టము. కావున 1450 ప్రాంతమున చింతామణి రచింపబడి యుండవలెను. భారతకర్త చింతామణిని వ్రాయలేదని నిర్ణయింపబడెను. వేఱొక నన్నయభట్టు వ్రాసిన దానిని భారతకర్త వ్రాసినట్లు భ్రాంతిపడుటకు కొంతకాలము కావలెను. కావున రామయ్య 15వ శతాబ్ది చివరివాడని భావించినచో చింతామణి కర్తయగు నన్నయభట్టు అనంతునికి తరువాత సమీప కాలమున నున్న వాడని నిశ్చయించవచ్చును.

ఈ ముడి ఎట్లు విడును ?

అనేక కారణములచేత చింతామణి కర్త కేతన కంటె నర్వాచీనుడని తెలియుచున్నది. కాలక్రమమున లక్షణ మభివృద్ధి చెందుట సామాన్య విషయము. కేతన

---

1. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, ఉత్తర హరివంశము పీఠిక, చెన్నపురి: వావిళ్ళ ప్రతి, (1967), 5 పు.
2. తురగా కృష్ణమూర్తిగారు, రెడ్డియుగమున ఆంధ్ర గీర్వాణ సాహిత్య వికాసము పిట్టల వేమవరం: (1962), 31 పుట,
3. శ్రీ ఆరుద్ర తెలుగు సాహిత్య కోశము హైదరాబాదు : తెలుగు అకాడమి (1980), 1010 పుట.

క. రు, లు, డు డులంత్యములైనన్ లు ల నడచి తదంత్యములకుళ్ళుఱ్ఱగు
బహుతన్,బలుగోళ్ళని కొనవేళ్ళని కలగూళ్ళున్ లేళ్ళు నాగ్రగమ
మయ్యునికిన్.[1] అని 'రు, లు, డు, డి' అను వర్ణములు చివర నున్న
వానికి 'లు, ల' లు పరమగునపుడు 'ళ్ళు' (ఱ్ఱు) ను విధించినాడు.

దీనిచే గోరు + లు - గోళ్ళు, వేలు + లు - వేళ్ళు, గూడు + లు - గూళ్ళు లేడి + లు - లేళ్ళు అను రూపములు సాధించినాడు.

చింతామణిలోని 'రోలః' డలటా ముదితాం తస్య చవాలుక్, (రేఫకు లకారము వచ్చును. డ ల ట వర్ణముల ఉకారేకారములకు, పై రేఫలోని ఉకారమునకు లోపము వికల్పము) అను సూత్రములచే గోరు + లు - గోల్లు, పాడి + లు - పాడ్లు త్రాడు + లు - త్రాడ్లు, అంబలి + లు - అంబల్లు, రోలు + లు - రోల్లు, జెట్టి + లు - జెట్లు అను రూపములు గలుగుచున్నవి.[2] పూర్వుడైన కేతన సరియగు రూపములను సాధింపగా నీతడిట్లు సమగ్ర రూపములను సాధించుట యేల? పోని మరచెనందుమా? గోరు + లు అనుచోట రేఫకు లకారమును విధించిన వాడు తరువాతి సూత్రమునందే లడలకు లకారమునైన విధింపవచ్చును గదా! అప్పుడే మరచునెట్లు?

ఆంధ్ర భాషా భూషణమును జింతామణి చూచెనని కొన్ని సూత్రములు సాక్ష్య మిచ్చుచున్నందున చింతామణి కర్త కేతన లక్షణము జూడలేదని చెప్పుటకు వీలులేదు.

త్రాడులు - త్రాడ్లు, - త్రాళ్ళు అనునది పదపరిణామ క్రమము. కేతన గూళ్ళు వంటి రూపములను సాధింపగా చింతామణి శత్వమును విధింపలేదు. కాన గూడ్లు వంటి రూపములే సాధించినట్లై

---

1. ఆం. భా. భూ. 78 ప.
2. కవిశిరో. అజంత. 73, 74 సూ.

నది. కాన చింతామణి కర్త కేతన కంటె ప్రాచీనుడనియు నతడే భార కర్త యనియు నొకరు చెప్పిరి.[1]

కాని నన్నయ భారత మందే అన్ని నాళ్ళు[2] రెన్నాళ్ళు[3] వ వుళ్ళున్[4] వంటి ళత్వ ఘటిత రూపములున్నందున దీనిచే కర్తృ మును నిర్ణయించుటకుదురదని ఆచార్య అమరేశం రాజేశ్వర శర గారు ఖండించిరి.[5]

చింతామణీకర్త లాఘవ ప్రియుడు, ఇచట రడలకు ళత్వము వచ్చు మార్గమేదో యుండుటచే వేరే విధింపలేదనిపించును. అదియే భోజుడు

> 'రల యోర్లడయోస్తద్వల్లళ యోశ్న సయోరపి
> నబయోర్నణ యోశ్చాంతే సవిసర్గా విసర్గయోః
> సబిందుకా బిందుకయో స్స్యాదభేదేన కల్పనమ్"

అని రల, లడ, ల ళ, మొదలగు వానికి అభేదమును జెప్పినాడు.

> 'లడయోర్లళయోరైన్వరలయోర్వబయోర్భిదా'

(ల-డ, ల-ళ, ర-ల, వ-బలకు భేదములేదు) అని వేరొ వచనము గూడ నున్నది.

ఇందు ల-డ లకు, ల-ళలకు అభేదము వైయాకరణ వ్యవహా మున బాగుగా నున్నదని యహోబలవతి చెప్పెను.[6]

---

1. ఆం. చిం. వి. పరిశోధనము 40 పు.
2. ఆం. భా. సభా. 2-115 ప.
3. అందే. ఆది. 1-68 ప.
4. అందే. సభా. 2-200 ప.
5. ఆం. వ్యా. వికాసము ప్రథమ. 78 పుట.
6. కవిశిరో. సంజ్ఞ 13 సూ. 166 పు.

అప్పకవి

పెద్దలాకును దనకు నభేద మగుట
లళలకు నభేద మట్లన గలుగు కతన
క్షితిని మూడవ సరళంబు యతుల ప్రాస
ములను లఘ్వలఘు లకారములకు నిలుచు [1]

అని లళలకు లడలకు నభేదమును జెప్పినాడు. తాతంభట్టు 'లళలేకము' అని వీని యభేదమును జెప్పినాడు. లడల కాతడు సార్వత్రిక ప్రాసము నంగీకరింపలేదు కాని ...

వెలలె ననుచో డకారము
బల వాచకమైన దడము పట్టునళత్వం
బిల పలుకఁ బడును గాని సు
లలిత ప్రాసమున కవ్వి లడకారంబుల్

అని వెలలె / వెడలె, దళము / దడము అను రూపములలో మాత్రము లడలకు ప్రాసము వర్తించునని అతడు చెప్పెను.

ప్రసిద్ధమైన ఈ ల/ళ ల/డ ల అభేదమును దృష్టిలో నిడుకొనియే చింతామణి కర్త ళకార విధానమును వదలి యుండును.

అహోబలపతి యీ పద్ధతిలోనే సాధించెను. కాన దీనిచే చింతామణి కేతనకంటె ప్రాచీనమని చెప్పనక్కరలేదు.

భారతకర్త వైయాకరణుడు గాడా ?

చింతామణిని భారతకర్తయగు నన్నయ వ్రాయలేదని స్థిరపడినది. నిన్న మొన్నటి వరకు భారతకర్తను వైయాకరణునిగా

---

[1] అప్పక. 3-366 ప.

తెలుగు వారు గౌరవించుచున్నారు. ప్రస్తుత నిర్ణయము వలన నన్నయ వైయాకరణుడు గాడాయను సందేహము గలుగవచ్చును.

నన్నయ తనను గురించి పరిచయము చేసికొనిన పద్యములో గొన్ని విశేషణము లున్నవి. అందు విపుల శబ్ద శాసనుడనునది యొక్కటి.

"తనకుల బ్రాహ్మణు ననురక్తునవిరళ
జపహోమ తత్పరు విపుల శబ్ద
శాసను సంహితాభ్యాసు.........
ఉభయ భాషా కావ్యరచనాభి శోభి
తు.........నన్న పార్యుఁజూచి [1]"

ఇట్టి విశేషణములతో గూడిన నన్నపార్యుని జూచి రాజనరేంద్రుడు ఆంధ్ర మహాభారతమును రచింపుమని కోరినాడు. కావున భారత రచనకు పూర్వమే నన్నయకు విపుల శబ్ద శాసనత్వము కలదని పరిశోధకులు నిర్ణయించినారు. [2]

శబ్దాను శాసన పదము వ్యాకరణమునకు పర్యాయము. కావున విపులమైన వ్యాకరణము కలవాడు అని విగ్రహము చెప్పుకొనవచ్చును. వ్యాకరణము బాగుగా చదివిన వాడనికాని, వ్యాకరణమును రచించిన వాడని కాని యర్థమును జెప్పవచ్చును. ఇచటి శబ్దాను శాసనము సంస్కృత వ్యాకరణము నుద్దేశించినదో తెలుగు నుద్దేశించినదో తెలియదు. సంస్కృత వ్యాకరణము నుద్దేశించినచో సంస్కృత వ్యాకరణమును జదివినవాడని చెప్పవలెను.

తెలుగు వ్యాకృతి నుద్దేశించినచో భారత రచన చేయుట కనుగుణముగ తెలుగు భాషకు కొన్ని నియమము లేర్పరచిన వాడని

---

[1] ఆం. భా. ఆది. 1-9 ప.

[2] ఆం. చిం. వి. పరిశోధనము 1 విషయు.

చెప్పవచ్చును. ఈ రెండును ఆంధ్ర మహాభారత రచన చేయుట కాయనకు గల అర్హతను సూచించునవి. కావున నెట్లు చెప్పినను దోసగులేదు. కవి రాక్షసుని నియమమును, నన్నయ భారతమును లాక్షణికులు సర్వ లక్ష్య సంగ్రహముగా 'భావింతురనుటయు రెండవ అర్థమును గూడ చెప్ప వచ్చుననుట కుపపత్తులు. [1]

అప్పకవి కవిరాక్షస నియమమును గురించి యిట్లు చెప్పెను.

ఆదిని శబ్ద శాసన మహాకవి చెప్పిన భారతంబులో
నేది వచింపగాఁ బడియె నెందును దానినేకాని సూత్ర సం
పాదన లేమిచేఁ దెనుఁగు పల్కు మఱొక్కటి గూర్చి చెప్పగా
రాదని ద్రాక్షవాటికవిరాక్షసుఁ డీ నియమంబుఁ జేసినన్. [2]

కవి రాక్షసీయ మొకటి కలదని యప్పకవి పేర్కొనెను. అందీ నియమముండి యుండవచ్చును. [3] ఆదిని బద్య వ్యాకరణమును వ్రాసిన కేతన

'నన్నయ భట్టాది కవి జనంబుల కరుణచే'

తెనుగునకు లక్షణమును వ్రాయుచుంటినని చెప్పికొనెను. [4]

అసలు నన్నయ భట్టే వ్యాస భారతమును బ్రశంసించుచు దానిని లాక్షణికులు సర్వ లక్ష్య సంగ్రహముగా భావించెదరని చెప్పి యున్నాడు.[5] - తన భారతమునట్లు లక్ష్యరూపముగా దీర్చ నుద్దేశ్యము కలదని యిందు ధ్వనించును.

---

1. ఆం. చిం. వి. పరిశోధనము, 1 విషయ.
2. అప్పక. పీఠిక. 1-46 ప.
3. అప్పక. 1-5 ప.
4. ఆం భా. భూ. 6 ప.
5. ఆం. భా. ఆది. 1-31 ప.

ఇవన్నియు జింతామణి వెలుగులోనికి వచ్చుటకు పూర్వ విషయములు. అది వెలుగులోనికి వచ్చిన పిదప అహోబలపతి మొదల వారు దొరకినంత వరకు నన్నయ గారి ప్రయోగములనే యిచ్చి నవి దొరకనపుడు తక్కిన వారి ప్రయోగముల నుదాహరించిరి.

కావున చింతామణిని నన్నయ వ్రాయకపోయినను ఆయన శ శాసన వరేణ్యత్వమున కేమియు క్షతి యుండదని తలంపవచ్చును.

చింతామణి యనువాద గ్రంథమా ?

చింతామణి కాల నిర్ణయమయినది. దీనికి గర్త ఆంధ్రభార కర్తయగు నన్నయభట్టు కాడని తేలిపోయినది.

కొందరు దీనికర్తృత్వము నాంధ్ర భారత కర్తనుండి తొల చుట కడ్డదారిని ద్రొక్కిరి. చింతామణి కేతనాదుల గ్రంథము సంస్కృతీకరణమే అనియు, నిందనేక దోషములున్నవనియు వా చేసిన ఆరోపణములు.

పూర్వులందించిన వ్యాకరణ విజ్ఞానముపై నుత్తర వైయా ణులు తమ గ్రంథభవనములను నిర్మింతురు. అట్లా ధారపడినంత మా మున కేతనాదుల గ్రంథములకు జింతామణి కేవల సంస్కృతీకర మనుట పాడిగాదు. విమర్శకులు చింతామణికి మూలపాఠములుగ జెప్పిన వానిని బరిశీలింతము.

కేతన ఆంధ్ర భాషా భూషణమున 193 పద్యములున్న బాలసరస్వతీయ చింతామణిలో 88 శ్లోకములున్నవి. అనగా పరి మమును బట్టి చూచినచో భాషాభూషణముకంటె చింతామణి సగము నకు దక్కువగా నున్నదన్న మాట. కాని చింతామణి శ్లోకము సంక్షిప్తముగా నున్న విషయముతో నలరారుచుండుటచే వ్యాఖ్యా తలు దీనిని సూత్రములుగా విడగొట్టిరి. అహోబలపతి చింతామ

శ్లోకములను (43 + 43 + 84 + 49 + 51 =) 271 సూత్రములుగా విభజించెను. అందు 46 సూత్రములకు భాషాభూషణములో మూలములు గలవని ఉదాహరించిన విమర్శకులు[1] "కేతన రచన మొత్తాన్ని చింతామణికర్త తన గ్రంథంలో ఉపయోగించుకున్నాడని యారోపించినారు.[2] భాషా భూషణము మొత్తము చింతామణిలో నిమిడ్చినచో పట్టికలో చింతామణిలో గల 271 సూత్రములకు మూలములను జూపవలెను. అట్లుగాక పట్టికలో గూడ 23 సూత్రములకు మాత్రమే మూలములను జూపుటచే 225 సూత్రములు స్వతంత్రములని తెలియును. కాని వారు కొన్నిటినే చూపియుండవచ్చును. మొత్తము 271, అనువాదముగా జూపినవి 46, 271 - 46 = 225. వారుచూపిన 46 సూత్రములలో గూడ కొన్ని యనువాదములనుటకు వీలుగాలేదు. ఆ విషయములను బరిశీలింతము.

సీ. "వృక్షేణ దక్షాయ పక్షిభిః పుత్రస్య
యను విభక్తులు తెనుంగునకుఁ జొరవు
అస్తి ప్రయాతి గాయంతి భుంక్తే సంతి
నయతి స్మరతి యనుక్రియలు సొరవు
గత్వాహసిత్వా ప్రకాశ్య సంత్యజ్య నాఁ
దనరుక్త్వాంతల్యబంతములు సొరవు
గంతుం పురీం రిపుం హంతుం సుతం పాతు
మను తుమున్నంతమ్ములరయఁ జొరవు

అపిచ తుహివై న వా నను లనఁగఁ బెక్కు-
లవ్యయంబులు చొఱవెందు నాంధ్ర కవితఁ

---

[1] ఇందు 23 సూత్రములకు మూల పద్యములుగా భావించిన వానిని తాముదాహరించి, 23 సూత్రములకు మూలములని భావించిన వాని పద్య సంఖ్యలను గ్రంథాంతమున పట్టికగా జూపిరి.

[2] సం. ప్ర. వ్యాకరణాలు 271 పు. చివరి అట్టలోపలి పుట.

బెఱు పదంబుల తోఁడను దోఁఱలి నిలుచు
నవి తెలుంగులు గావింతు నభిమతముగ"[1]

అని కేతన వ్రాసినాడు. చింతామణికర్త 'నపదాన్యవ్యయ సుప్తి క్త్వాతుమునామ్ అనుకృతేస్తి వాక్యంతు' (అవ్యయ సుప్తి క్త్వాతుమున్‌లపదములు తెలుగునకు రావు. అనుకరణ మందయిన వాక్యముకలదు) అనెను.[2] భాషాభూషణములో నొక సీసములో చెప్పబడిన విషయము చింతామణిలో నొక చిన్న వాక్యములో సంగ్రహింపబడినది. అనుకరణమున బ్రయోగము కలదని చింతామణి విశేషమును జెప్పినది.

అనుకరణమున నయిన వాక్యము కలదనుటకు రెండు విధములుగా నర్థమును జెప్పవచ్చును. సంస్కృత వాక్యము ననుకరణ పదముతో దెనుగున వాడవచ్చును. అనుకరణమందు సంస్కృత పదములతో గూడిన తెలుగు వాక్యము గలదు. పైన సంస్కృత పదములు నిషేధింపబడినందున ఇచట 'సంస్కృత పదములతో' అనునదధ్యాహార్యమగును.

కావున నిచట చింతామణి మూలమును సంక్షిప్తము చేసినదనియు విశేషాంశములను చెప్పినదనియు జెప్పవలెను.

"ఇచట 'క్త్వాతుమున్' ప్రత్యయాంతాలు అవ్యయాలే అయినా తిరిగి వ్యర్థంగా అవ్యయ శబ్దం సూత్రంలో చోటు చేసుకొన్న"దని విమర్శకులనిరి.[3]

కాని గొప్ప వ్యాకరణ పండితులయిన కేతన చిన్నయసూరులు గూడ నిట్లే జెప్పుటచేత నిది వ్యర్థముగా వాడబడిన దనుటకంటె

---

1. ఆం. భా. భూ. 29 ప.
2. కవిశిరో. సంజ్ఞ 38 సూ.
3. సం. ప్ర. వ్యాకరణాలు 72 పు.

భావగర్భితమనుట యుక్తము. [1] మొదటివాడు వ్యర్థముగా ప్రయోగించినచో దరువాతివారు దీనిని వదలియుందురు.

అహోబలపతి "అవ్యయ నిషేధముకంటె వేరుగా క్త్వాతుమున్లను నిషేధించుటచే నవ్యయ నిషేధ మనిత్యమని జ్ఞాపనము చేయుచున్నట్లు చెప్పెను. ఇట్లు కొన్ని పదములు విశేషార్థమును జ్ఞాపనము చేయుపద్ధతి పాణినీయమందు ప్రసిద్ధము. [2] కేతన, చింతామణికర్త, చిన్నయసూరి పాణినీయమందు పండితులు. కావున వారీభావముతోనే అవ్యయ నిషేధమును వేరేచేసి యుందురు. కావున దీనిని కేవలము వ్యర్థముగా బరిగణింపరాదు. కేతన

'కుఱుచల పై సరబిందులు, నెఱుగ నూదినను
జెల్లు నిడుపుల మీదన్, నెఱయవు గద్యంబులలో
నెరబిందువు లూఁదుఁ బద్యనికరములోనన్

అని వ్రాసెను. చింతామణికర్త

సిద్ధ స్సాధ్య శ్చానుస్వారః పూర్ణార్ధభేదతోద్వివిధః
హ్రస్వాత్పూర్ణోపి భవేద్దీర్ఘాచ్చేత్ఖండ ఏవసజ్ఞేయః

(సిద్ధము సాధ్యమునగు అనుస్వారము పూర్ణము అర్ధమునని రెండు విధములు. హ్రస్వముకంటె పరముగా నున్నఖండము పూర్ణ

---

1. అవ్యయములు సుప్తిఙంతములు క్త్వాతుము
న్నంతములును గలుగ పవికృతంబు
లనుకరణమునందు నగును వాక్యంబును
బరమపురుష వృషభధర నివాస

పద్యాంధ్ర వ్యాకరణము 45 పు-

2. "అర్థవద్గ్రహణే నానర్థకస్య గ్రహణమ్' ప్రశ్చేతిసూత్రే రాజ్ఞః పృథక్ భ్రాజిగ్రహణాద్ జ్ఞాపకాత్"
సిద్ధాంత కౌముది 72 సూ. వృత్తి.

బిందువుగూడ నగును. దీర్ఘమునకు దరువాతనున్న దానిని ఖండము గనే యెఱుగవలెను.) అని వ్రాసెను.[1]

ఇచట చింతామణి కేతన చెప్పిన దానిని గ్రహించుటయే కాక అనుస్వారమునకు జెందిన విభాగములను గూడ దెలియ జెప్పెను. కేతన

నాంతంబైన పదంబుల
పొంతన్ పైనున్న శబ్దముల కచటతపల్
దొంతి గజడదబలగు న
య్యంత నకారమగు సున్న యభినవ దండీ [2] అని చెప్పెను.

పరుషాద్రుత ప్రకృతి కాత్సరళాస్స్యు స్తద్ద్రుతంచబిందుస్స్యాత్
అవికార గతే తస్మిన్నపి సరళా ఏవ సన్తితే పరతః

(ద్రుత ప్రకృతికము కంటె పరముగానున్న పరుషములు సరళములగును. ఆ ద్రుతము బిందువగును. ద్రుతము బిందువుగా మారకున్నను పరమున నున్నవి సరళములుగానే ఉండును గాని పరుషములుగా మారవు.) అని చింతామణి చెప్పినది.[3] నకారము సున్నగా మారని రూపముగూడా గలదను విశేషమిచట నున్నది. కేతన

పొసఁగన్ బల్కెడు నెడఁ
బొల్పెసగిన ప్రథమాంతముల పయిన్ గదిసి కడున్
బసనారు కచటతప లను
గసడదవల్ ద్రోసివచ్చుఁ గవిజనమిత్రా.

అని గసడదవాదేశమును జెప్పెను,[4] చింతామణి

---

1. కవిశిరో. సంజ్ఞ 18 సూ.
2. ఆం. భా. భూ. 54 ప.
3. కవిశిరో. సంధి 21, 22 సూ.
4. ఆం. భా. భూ. 62 ప.

గసడదవాస్స్యుః ప్రథమా మాత్రాదాత్మాస్మదో ర్వినైవై తే

(తాను నేను పదములకు దప్ప ప్రథమ మీఁది పరుషములకు గసడదవ లగును.) అని చెప్పినది.[1] ఇచట తాను నేను పదములు ప్రథమాంతములయినను వీనికి దరువాతనున్న పరుషములకు గసడదవాదేశము రాదనుట చింతామణి చెప్పిన విశేషము. కేతన పద్యములో 'తాఁజుట్టమగు' అను ప్రయోగము ద్వారా చింతామణి యీ విషయమును గమనించినదని విమర్శకులూహించిరి.[2] కావచ్చును. లాక్షణికుడు తనకు బూర్వమందున్న ప్రయోగములను గమనించియే లక్షణమును వ్రాయును గదా. కావున చింతామణి కేతన లక్షణమును బూరించెనని చెప్పక తప్పదు. కేతన

'డుఙ్ఙగుఁ బురుషాఖ్యలపై నఙ్ఙుఙ్ఙగు నట్టియెడల నభినవదండీ' అని వ్రాసెను.

చింతామణి 'మహాత్తోత ఉద్విభక్తౌ; మహతస్సోర్డు జనితో భశేత్పుంసి' (మహద్వాచకముల అత్తునకు విభక్తి పరమగునపుడు ఉత్వము వచ్చును. పుంలింగమున ఇదంతము కాని మహద్వాచకము యొక్క ప్రథమైన వచనమునకు 'డు జ్' వచ్చును,) అని చెప్పినది. ఈ సూత్రములకు కేతన వచనమే మూలమని విమర్శకుల భావము.[3] కేతన చెప్పిన మొత్తము పద్యమిది.

పుఙ్ఙగు నుఙ్ఙంతము పై
ముఙ్ఙగు న ఙ్ఙంత శబ్దములపై రెంటన్
డుఙ్ఙగుఁ బురుషాఖ్యలపై
నఙ్ఙు ఙ్ఙగు నట్టి యెడల నభినవదండీ.

---

1. కవిశిరో. సంధి 23 సూ.
2. సం. ప్ర. వ్యాకరణాలు 273 పు.
3. అందే.

అమహాదుదంతములకు వు వర్ణకము, అమహాదదంతములకు ము వర్ణకము, మహాత్తులందు ఉదంతములకు, అదంతములకు గూడ 'డు' వర్ణకమును వచ్చుననియు నట్టిచోట అత్వమునకుత్వమువచ్చుననియు బద్య భావము.[1]

ఇందు ఇదంత పదములమాట లేదు. చింతామణి 'అనిత్యః' ఇదంత భిన్నమునకే డుఙ్ వచ్చునని స్పష్టము చేసినది. కేతన ఉదంత పురుషాఖ్యలకు 'డు' వచ్చు ననినాడు గదా ! చింతామణి "సర్వత్రోదోతోర్ద్వ్యర్భవతి మువత్" డు ఙ్మహత్పదానాం వా' (అంతట ఓదంతములకు ము వర్ణకము వలె (ప్రథమైక వచనమున ప్రత్యయముగను ప్రథమా బహువచనాదులు పరమగునపుడు ఆగమముగను) వు వర్ణకమువచ్చును. ఉదంత మహద్వాచకములకు డుఙ్ వికల్పముగా వచ్చును.)[2]

అను సూత్రములచే ఉదంత పురుషాఖ్యలకు డుఙ్ వికల్పమనియు నదిరానపుడు పువర్ణకము గూడ రావచ్చునని తెల్పినది. ఇది సవరణము పూరణమునగును. కేతన

లలి నేకాక్షరపదములు
వెలిగాఁదక్కిన పదముల వెలసిన తుదయ
చ్చుల నిడుపులుడుపఁ దెనుఁగగు
నిలనెప్పటి యట్లనుండు నీయంతంబుల్.

అని వ్రాసెను.[3] చింతామణి

---

[1] ఆం. భా. భూ. 34 ప.

[2] కవిశిరో. అజంత 43, 44 సూ.

[3] ఆం. భా. భూ. 31, ప.

'దీర్ఘాణాం హ్రస్వ స్స్యాన్నచ దేశ్యపదే నచైక వర్ణేపి'

(దీర్ఘాంతపదములకు హ్రస్వము వచ్చును. దేశ్య పదముల దీర్ఘమునకు ఏకవర్ణ పదముల దీర్ఘమునకు హ్రస్వము రాదు) అని చెప్పెను. [1]

ఇచట దేశ్యపదముల విషయము చింతామణి అదనముగా జెప్పినది. ఇది పూరణము. కేతన

వానునకున్ వంతుండును
మానునకున్ మంతుండును గ్రమంబున నగు శ
బ్దానీకాంత నకారము
మానించి విభక్తి లెక్క మఱియొక్కొకచోన్.

ఇని తెల్పెను. [2] ఇతడు సంస్కృతాజంత శబ్దములు హలంత శబ్దములు తెనుగగు పద్ధతిని వివరముగా జెప్ప బూనలేదు. తత్సమ సాధనమున హలంత శబ్దములలో మతుప్ ప్రత్యయాంతమును గూర్చి నకారాంతముల గూర్చి ఈ యొక్క పద్యమును జెప్పెను.

తక్కిన హలంతముల విషయమును గూడ దెల్పుచు చింతామణి మూడు శ్లోకములను వ్రాసినది.

తెలుగున సంస్కృత ప్రథమైకవచనముతో తుల్యమైన ప్రాతిపదిక గల హలంత శబ్దములు అగుణవత్ప్రభృతి, సంస్కృత ద్వితీయైకవచన తుల్య మయిన ప్రాతిపదిక గల హలంత శబ్దములు గుణవద్గణము అని విభాగించి యీ రెండు రకముల శబ్దముల ప్రక్రియను దరువాత జెప్పినది.

మఱియు ఆత్మన్ శబ్దము, ఇమనిచ్ ప్రత్యయాంతములు, రాజన్ శబ్దము, పయః ప్రభృతులు, అపయః ప్రభృతులు, ఇతర హలంత

---

[1] కవిశిరో. అజంత 46, 46 సూ,

[2] ఆం. భా. భూ. 35 ప.

శబ్దములుగూడ తెలుగున కెట్లు వచ్చునో సంగ్రహముగా సూ
చెను. [1] కావున నీ సందర్భమున కేతన చెప్పిన దానికంటె చింతా
మణిలో బలువిశేషములు చెప్పబడిన వని గుర్తింపవలెను. కేతన

ముదమున నాయీ యేలను
పదముల తుద నూష్మలు డుగఁ బై వర్ణముతో
నదుకునెడఁ గుదియు సాగును
గుదియునెడన్ జడ్డ వ్రాలగున్ బైహల్లుల్

అని వ్రాసెను. [2] చింతామణి

ఇదమధసీత ద్వృత్తచ్ఛబ్దాశ్శబ్దాన్తరాన్వయే బహుళమ్
హ్రస్వం ప్రపద్య దీర్ఘా ద్విత్వముపర్యక్షరస్యజనయన్తి

(ఈ ఏ ఆ అను శబ్దములు శబ్దాంతరాన్వయమందు బహు
ముగా హ్రస్వమును బొంది తరువాతి యక్షరమునకు ద్విత్వము
గలిగించును.)

అని చెప్పినది. [3] ప్రార్థనార్థకములగు ఈ, ఏ అను నవ్య
ములున్నవి. ప్రశ్నార్థములగు ఏ, ఆ, అనునవ్యయములున్నవి.
వానికీవిధి వర్తించదు. 'ఇదమద సీతచ్ఛబ్దాః' అనుమాట ఆ సంస్కృ
సర్వ నామములకు పర్యాయము లయిన 'ఆ ఈ ఏ'లకే వర్తించు
సూచించును. ఈ విషయము కేతన యిచ్చిన ఆకాముని, ఈకొ
ఏకార్యము, ఈయూరు. ఆకథ అనునుదాహరణముల ద్వారా
గ్రహింపవచ్చును.

---

1. కవిశిరో. హలంత 1 నుండి 10 సూ.
2. ఆం. భా. భూ. 136 ప.
3. కవిశిరో. హలంత 24 సూ.
4. కవిశిరో. క్రియ 33, 44, 45సూ.

ఈత్రిక సంధి విషయమున మతాంతరములున్నవి. కేతన ఆ ఈ ఏ ల కు ఊష్మభిన్నములు పరమగుచో నీకార్యము వర్తించునని తెలిపెనుగదా ! పెద్దన

'అరయ నానీలు హల్లుతో నదుకుచోట
నొనర నుగ్గను నిడుపయి యున్ననుండుఁ
గవుల యనుమతి నిది గృతిఁ గానవలయుఁ
జాల వర్ణంబు గదిసినఁ జడ్డయగును.'

అని అ ఈ లకు హల్లు పరమగునపుడీకార్యము వచ్చునని చెప్పెను.[1] ఇది కృతులలోని ప్రయోగములను బట్టి నిర్ణయించుకొనదగిన విషయమని 'కవుల యనుమతి నిది గృతిఁ గానవలయు' అను పెద్దన వచనము తెలుపును. అనంతుడు ఆ ఏ లకు రహలు పరమగునపుడీ ద్విత్వ హ్రస్వములు రావని సూచించెను.[2]

ఇట్లీ విషయమున పలునభిప్రాయములు కానవచ్చుటచే జింతామణి ఈవిధి బహుళమని చెప్పినది. ఈ బహుళ పదార్థమును బ్రయోగముల బట్టి నిర్ణయించుకొనవలసియున్నది.

తరువాత నథర్వణుడు

ఊష్మరేఫాన్ వినా ద్విత్వ మయుక్తస్య హలో మతమ్
ఋకార ఇచ్చ విముచ్య స్యాత్ప్రాణానాం ద్విత్వ సఙ్గతిః

(శషసహర అను వర్ణములను సంయుక్తమును విడిచి తక్కిన వర్ణములకీద్విత్వము వచ్చును. ఋకారమును విడచి తక్కిన అచ్చులకు

---

1. కావ్యా. చూ. 9 ఉ. 136 ప.
2. ఛందో దర్పణము. 1-39 ప.

ద్విత్వము గలుగును.[1] అని పై విషయమున విశేషములను దెలిపినాఁడు, కేతన

"స్థావర తిర్యక్ప్రతతుల
కేవెరవునఁ గ్రియలు పొందు నేక వచనమున్
....
శిలగదలె శిలలు గదలెను
బులి గఱచెన్ బులులు గఱచె ......

అని చెప్పెను.[2] చింతామణి 'తిర్యగ్జడేషు కర్తృషు బహువచన స్యైకవచనమేవస్యాద్భూతే తద్ధర్మేచ' (స్థావర పశు పక్ష్యాదులు కర్తలగుచుండగా భూత తద్ధర్మములందు బహువచన మేక వచనమగును.[3] 'అన్యత్ర వువీ' (భూత తద్ధర్మ భిన్న స్థలము లందు తిర్యగ్జడములు కర్తలగుచుండగా బహువచనమున 'వువి' వర్ణకములు వచ్చును.)

'స్త్రీవదేక వచనంతు' (తిర్యగ్జడములు కర్తలగుచుండగా భూ తద్ధర్మ భిన్నార్థము లందు' (భవిష్య ద్వ్యతిరేక వర్తమానార్థము లందు)' ఏకవచనము స్త్రీ వాచకము కర్త అయినప్పటివలె 'దుది' లను బొందును.) అని చెప్పినది.[4] ఇందు కేతన చెప్పిన దానికి బలు విషయములు చేర్చబడినవని స్పష్టమగుచున్నది. కేతన

అసమస్త లఘు ద్వ్యక్షర

---

[1] కవిశిరో°. హలంత 24 సూ. వ్యాఖ్యలో°.

[2] ఆం, భా. భూ. 147, 148 ప.

[3] కవిశిరో°. క్రియ 22 సూ.

[4] కవిశిరో°. క్రియ 22, 23, 24 సూ.

లసితములగు తత్సమంబులన్ జెప్పెడిచోన్
బొసఁగు నియించుటయున్ గ్రియ
లసదృశ ! యించుట యెఁగ్రియలనగుఁ బెఱయెడలన్
వరియించుటయు వరించుట
తిరముగ నుతియించుటయు నుతించుట బలిమిన్
బరు భజియించుటయును సం
హరించుటయు వరుసతో నుదాహరణంబుల్
అని చెప్పినాడు. [1]

దీనికి 'లఘ్వేకాక్షర పూర్వక్రియాన్తిమస్యానయో భవేదిద్వా' ('అయ్' అంతముగా లేనట్టిదియు, లఘువైన యేకాక్షరము చివరి వర్ణమునకు బూర్వమున నున్నట్టిదియునగు గ్రియల చివరి వర్ణమునకు ఇ కారము వికల్పము గావచ్చును.)[2] అను చింతామణి యనువాదమని విమర్శకుల తలపు. వారు కేతన పద్యములోని అసమస్త పదము చింతామణిలో లఘువుగా మాఱెనని వ్రాసిరి. [3]

కేతన పద్యములో గూడ లఘుపదము వేరే యున్నందున పై వ్రాత సరికాదని చెప్పవలెను. సమస్త పదమునకు పూర్ణము, సమాసమునందిన పదము మొదలగు నర్థములున్నవి. కాన స్వయంవరము భగవన్నుతి ఇత్యాది సమాస పదములను క్రియలుగా మార్చునపుడీ విధి వర్తించదని కేతన భావము గావచ్చును. వ్యాఖ్యాత దేవినేని సూరయ్యగారు అసమస్త పదమునకు 'కొన్ని' యను నర్థమును వ్రాసిరి.[4] అట్లు చెప్పినచో 'అనయః'(అయంతములుకాని)అనునది దానికి వివరణ

---

1. ఆం. భా. భూ. 152, 153 ప.
2. కవిశిరో. క్రియ 36 సూ.
3. సం. ప్ర. వ్యాకరణాలు 275 పుట.
4. ఆం. భా. భూ. దివ్య ప్రభా వివరణము 114 పుట.

ప్రాయమనవలెను. అనగా కేతన చెప్పిన కొన్ని యేవనగా 'అయంత భిన్నధాతువులు'అను నర్థము వచ్చును. కేతన పద్ధతిలో 'వరి,నుతి' అని ద్వ్యక్షర రూపములుగా వీనిని గ్రహింపవలెనన్న మాట. 'నుతి'' క్తిన్ ప్రత్యయాంతముగాన ద్వ్యక్షర తత్సమముగా గ్రహింప వీలున్నను వృధాతువునకు తెనుగున అర్ వచ్చుటచే ఏర్పడిన 'వర్' అను దాన్ని ద్వ్యక్షర తత్సమముగా గ్రహించుట చింతామణీ కర్త కిష్టము లేక పోయినది. 'క్తిన్' అను కృత్ప్రత్యయ మంతమున గల 'నుతి' మున్నగు వానిని ఉపకృతులుగను, 'వర్' అను పరిణామమును పొందిన వృ మొదలగు వానిని పరిణతి క్రియలు గను, తెనుగునకు యథాతథముగా వచ్చిన సంస్కృత ధాతువులను సంవృతి క్రియలుగను నతడు గ్రహించినాడు. ఇచట కేతన లక్షణముదాహరణమును బట్టి యూహింపదగినదిగానున్నది. చింతామణి లక్షణము వివరణాత్మకతను సంతరించుకొన్నది. కావునదీనిని కేవల సంస్కృతీకరణమనుట అయుక్తము. కేతన

ఇల్లు కల్లు ముల్లు పల్లు విల్లనవి
బహువచనములగుచుఁ బఱగునెడల
నిండ్లు కండ్లు ముండ్లు పండ్లు విండ్ల నఁజను
నుత గుణాభిరామ నూత్నదండి.

అని చెప్పెను.[1] చింతామణి

'సలలోర్బిందు యుతో డుర్వా లులయోః'

(లులలు పరమగునపుడు లవర్ణముతో గూడిన లు అను దానికి పూర్ణ బిందు పూర్వకడు వర్ణము వికల్పము.) అని చెప్పెను.[2] చింతామణి విధి వికల్పమనుట వలన విల్లులు, విండులు, అను రూపములు

---

[1] ఆం. భా. భూ. 75 ప.

[2] కవిశిరో. అజంత 70, సూ.

గూడ సాధువులయినవి. కావున నీసూత్రములు పూరకములని చెప్పనగును. కేతన

"చేయి వాయి నేయి యనుచుఁ జెప్పుచోటఁ
బ్రీతిఁ జేతులు వాతులు నేతు లయ్యె .....
............"

అని చెప్పెను. [1] చింతామణి

‘జౌపవిభక్తిక వర్ణాష్టింట్యాదయోభవన్తీహ
రుల్వాదే ర్నామ్నాం స్యుస్తేహ విభక్తౌ సమాసేచ’

(తెలుగునటింటి మొదలగునవి జౌపవిభక్తిక సంజ్ఞ కలవి. అవి నామముల ‘రులు’ మొదలగు వానికి విభక్తి పరమగునపుడు సమాసమునందు వచ్చును) అని చెప్పెను. విమర్శకులు పై పద్య మీశ్లోకమునకు మూలముగా జూపిరి. [2] చింతామణి శ్లోకములో నున్న జౌప విభక్తిక సంజ్ఞ, ప్రత్యయములు నాంధ్ర భాషాభూషణ పద్యములో లేవుగదా! భాషాభూషణ పద్యమునందున్న యి, తి, వర్ణములు చింతామణిలో స్పృశింపబడలేదు.

కాని చింతామణి శ్లోకములోని ‘టింట్యాదయః’ ‘రుల్వాదేః’ అను దళము లందలి ఆదిశబ్దములచే కేతన ఉదాహరణములను గూడ గ్రహింప వచ్చును. ఇంతమాత్రముచే చింతామణి శ్లోకమునకు కేతవ పద్యము మూలమనుట పొసగదు. కేతన

చెలియలన నాలన మఱం
దలు కోడలు నాఁగఁజను పదంబుల తుదలన్

---

1. ఆం. భా. భూ. 77 ప.
2. సం. ప్ర. వ్యాకరణాలు చివరి అట్టలోపలి పుట.

లు ల కుండ్రలగున్ బెక్కుటఁ
జెలియండ్రన నాండ్రనంగఁ జెల్లుట వలనన్

అని చెప్పెను,[1] ఇచట కేతన చెలియలు, ఆలు మున్నగ వానిలో చివర నున్న 'లు' వర్ణములకు 'ండ్ర' అను వర్ణముల విధించెను.[2] చింతామణి లు వర్ణమును బహువచన మనినది. దా బాలురు ఇత్యాదులలో 'రు' వర్ణము నాదేశముగా వచ్చునని చెప్పినది. కాని ఒక వర్ణమునక నేక వర్ణము లాదేశముగా వచ్చుట దా పద్ధతికాదు. కావున

'నిత్యం దారాదేశ్చ స్యాల్లోరులయోరురాచతత్ర స్తః'

(ఆలు మొదలగు శబ్దముల లువర్ణమునకు బిందు పూర్వక డ వర్ణమును, ఆడువర్ణమునకు ఉకార లోపమును నిత్యముగా గలుగును, అచట 'లుల' అనువానికి 'రుర'లు వచ్చును.) అని చెప్పినది.[3] ఇచట కేతన చెప్పిన విషయమును దన పద్ధతి కనుగుణముగా మార్చుకొను టయే కాక ద్వితీయాదులలో బహువచనమున వచ్చు లడాగమము నకు గూడ 'ర' అనునది వచ్చునను విశేషమును గూడ దెల్పినది. మఱి యొకమాట. ఇచట కేతన బహువచనలు వర్ణమునకు 'ండ్రు' అను దా నాదేశముగా జేసెను. ఇట్లే అనేకాక్షరములు గలవానిని ప్రత్యయ ములుగను ఆదేశములుగను విధించుట కేతన కలవాటు.'డును,''దరులు'

---

1. ఆం. భా. భూ. 81 ప.

2. లు వర్ణమునకు విధింప వలసినది 'ండ్రు' అనుదానిని గాని 'ండ్ర' అను దానిని గాదు. ఇది లేఖక దోషమేమో! వ్యాఖ్యాత గూడ బూర్ణ బిందు పూర్వకడ్ర కారమునే విధించెను. (దివ్య ప్రభా వివరణము 76పు.) ఉత్వము వచ్చుటకు మార్గము వేఱు కలదేమో! ఇదిపరిశీలనీయము.

3. కవిశిరో. అజంత 72 సూ.

అనురీతిగా రెండు మూడక్షరములు గల వానిని క్రియా విభక్తులుగా నితడు చెప్పినాడు.[1] గోరు తేలు మొదలగు వానికి 'ళ్ళు' (ల్లు) అను బహువచన ప్రత్యయమును విధించినాడు.[2] గురునకు ఇత్యాదులలో 'నకు' ను విధించినాడు.[3] దీనిని బట్టి

కొఱను నెఱను నాఁగఁ గొలను నామ్రాననఁ
గలను గవను కెలను వలవ నాఁగఁ
బరగు శబ్దములకు బహువచనంబుల
నులకు కులు విధించె నూత్న దండి
ఇల్లు కల్లు ముల్లు పల్లు విల్లన నివి
బహు వచనములగుచుఁబఱగు నెడల
నిండ్లు కండ్లు ముండ్లు పండ్లు విండ్లనఁ జను
నుత గుణాభిరామ నూత్నదండి.[4]

అను కేతన పద్యములలో గూడ 'కొఱనులు' లోని 'నులు' అనుదానికి 'కులు' అను దానిని, ఇల్లులోని'ల్లు' అనుదానికి 'ండ్లు' అను దానిని కేతన విధించెనని చెప్పవలసియున్నది. 'నులకు కులు విధించె' అనుచోట కొఱను మొదలగు శబ్దములలో నున్న 'ను' అను వర్ణములకు 'కు' అను వర్ణములు వచ్చుననియు, ఉదాహరణ బహుత్వమును బట్టి ప్రత్యయములకు బహువచనము వాడబడెనని గూడ చెప్పవచ్చును. అట్లు చెప్పినచో ఆవిషయమును స్పష్టము చేయుటకై (అనగా ఆదేశము, బహువచన ప్రత్యయము ఏకాక్షర రూపములే యని తెలుపుటకై) చింతామణి కర్త మరల చెప్పెనని భావింపవచ్చును.

---

1. ఆం. భా. భూ. 143 ప.
2. అందే 78 ప.
3. అందే 85, 86 ప.
4. అందే 73, 75 ప.

అనగా నిచట చింతామణి కేతన పద్యమును వివరించెనని భావము, లేనిచో మరెచ్చను లేని పునరుక్తి పద్ధతి యిక్కడ మాత్రమే కలదని చెప్పవలసివచ్చును.

ఇట్టి వాని నన్నిటిని దన పద్ధతి కనుగుణముగా సాధించుటకై చింతామణి మరల విధించెనని చెప్పవలెను. కేతన

జంగమ పదములు దక్కథ
రంగల పదముల ద్వితీయ ప్రథమయు నగు రా
జంగదము లూగ్చెఁ బటినూ
త్నాంగదములఁ దాల్చె ననఁగ ననువై యునికిన్

అని విధించెను.[1] చింతామణి కర్త 'ఇతరత్రచ ద్వితీయా'

(ద్వితీయా విభక్తి కర్మార్థమునందేగాక ఇతర స్థలములందును (తృతీయా సప్తమ్యర్థములందును) వచ్చును. జడ వాచకముల ద్వితీయకు ప్రథమకూడ వచ్చును.) అని విశేషములను జేర్చినాడు.[2]

“వలసినప్పుడు చేతకై వలన యొక్క యందు నను నివి యగుఁ దృతీయాదులందు” అని కేతన చెప్పినాడు.[3] ఇది చింతామణి అజంతము నందలి 41 సూత్రమునకు మూలమని విమర్శకులారోపించిరి.[4]

---

1. ఆం. భా. భూ. 82 ప.
2. ఆం. భా. భూ 82 ప.
3. ఆం. భా. భూ. 83 ప.
4. సం. ప్ర. వ్యాకరణాలు చింతామణికి మూల పాఠాలు అనుబంధము క్రమ సంఖ్య. 9

ఆ సంఖ్యగల సూత్రము 'ఈదంతా ఇద్వ దేవ కృత హ్రస్వాః' (హ్రస్వము చేయబడిన ఈకారాంత శబ్దములు ఇదంత శబ్దముల వలె కార్యములనందును) అనునది. పద్యమునకు సూత్రమునకు, సంబంధ మేమియు లేదు గదా! కేతన

ఏక వచనపుఁదుదలందు వెలసినిలుచు
నుత్వ మత్వమా నిత్వమ్ము నీత్వమందు
నార బహువచనంబుపైఁ జేరినిలుచు
హ్రస్వములు నిడుపులగుఁ గవ్యను మతమున

అని సంబోధనమునగలుగు విశేషముల నెఱింగించెను.[1] చింతామణి 'ఆమన్త్రిణ సు జసోస్తః క్రమేణచాదార దాగమావన్తే' (సంబోధనమున ఏకవచన బహువచనములందు క్రమముగా అత్ ఆరత్ అను నాగమములు వచ్చును.) అని మాత్రము చెప్పినది.[2] కేతన పద్యములోనున్న 'ఇత్వము నీత్వమందు, హ్రస్వములు నిడుపులగు' అను విశేషములు చింతామణిలో లేవు. ఈ లక్షణమును బట్టి మాత్రము చూచినచో కేతనకంటె జింతామణి కర్త ప్రాచీనుడనిపించును. కాని యితర హేతువులచే జింతామణియే యర్వాచీనమని తెలియుచున్నది. చింతామణి యీవిషయముల నేల వదలినది? కేతన చెప్పిన రెండు విషయములను పద్ధతిని మార్చి యెందులకు జెప్పినదని ప్రశ్న? కేతన 'ఏకవచనపుఁ దుద లందు వెలసి నిలుచు నుత్వ మత్వమా' అని చెప్పినాడు. దీనిచే రాముడు అను దాని ఉత్వమునకత్వము వచ్చి రాముడు + అ = రాముడ అయినది. కేతన

"...............
డుఱ్ఱగుఁ బురుషాఖ్యలపై నఱ్ఱుఱ్ఱగు నట్టి యెడల నభినవదండీ."

---

1. ఆం. భా. భూ. 102 ప.
2. కవిశిరో. అజంత 13 సూ.

అని 'సుత' మొదలగు వానికిడువర్ణకమును ఉత్త్వమును విధించి 'సుతుడు' మొదలగు రూపములను సాధించెను.[1]

'అమరెఁడు సంబోధన తత్స
మములఁ బొడసూపు నొక్కఁటటె నో పురుషో
త్తమ యో పురుషోత్తముఁడా
విమలయశా! విమల యశుఁడ వినుమని చనుటన్

అని సంబోధమున 'డు'వర్ణకమును క్వాచిత్కముగా మాత్రము విధించెను.[2] దీని ప్రకారము 'డు' రాగా పురుషోత్తముడు' అను రూపమగును. ఇచట ఉత్త్వము రానిదే 'పురుషోత్తము డ' వంటి సంబోధన రూపము లేర్పడవు. ఉత్త్వము గూడవచ్చునని చెప్పికొని సంబోధనమున 'డు' వర్ణము లోపించినపుడు దానికి గూడ లోపము గల్గినట్లూహింపవలెను. ప్రథమలో జెప్పికొనిన యుత్త్వము సంబోధన ప్రథమలో గూడ వర్తించును. దానిని వేరే చెప్పనక్కరలేదని భావించుట కవకాశము లేకపోలేదు : కాని కేతన విభక్తులను జెప్పునపుడు ప్రథమనుండి సప్తమి వరకు జెప్పి పిదప సంబోధనంబును జెప్పెను. అది ప్రథమ వంటిదే యని వ్యక్తమగునట్లు 'సంబోధన ప్రథమ' అను పేరును గూడ నాతడు పెట్టలేదు. 'సంబోధనంబు' అని మాత్రము వాడినాడు.[3] కావున సంబోధనంబున ఉత్వప్రాప్తి, డువర్ణకము ప్రాప్తింపనపుడు ఉత్వము ప్రవర్తింపకుండుట అను విషయములు చెప్పదగినవే. ఆతడిచ్చిన యుదాహరణములను బట్టి మనమా విషయముల నూహించుకొనవలెను.

చింతామణి కర్త యీ పద్ధతిని వదలి సంబోధనమునకు జెందిన 'సు' ప్రత్యయాంతమునకు 'అత్' ను ఆగమముగా చెప్పెను.

'నామన్త్రిణేడుజి త్యన్యే' (సంబోధనమున డు జ్ రాదని కొందరందురు.) అను సూత్రముచే డు జ్ రానప్పుడు రాము + అ= రామ ! అను సంబోధన రూపము గూడ నేర్పడును. ……

---

1. ఆం. భా. భూ. 34 ప.
2. అందే 104 ప.
3. ఆం. భా. భూ. 68 ప.

ఇట్టి రూపమేర్పడుట కేతనకు గూడ నిష్టమే. అతడు డువర్ణకము లోపించినపుడు పురుషోత్తమ ! వంటి సంబుద్ధి రూపముల నంగీకరించెను గదా ! [1]

కేతన 'ఆర బహువచనంబుపైఁ జేరి నిలుచు' అని చెప్పినాడు. బహువచన మన్ని విభక్తులందును గలదు. కాని 'ఆర' అనునది ప్రథమా బహువచనమందే వచ్చును. కావున 'జస్'కు మాత్రమే 'ఆర' అంతాగమముగా వచ్చునని చింతామణి స్పష్టము చేసినది.

కావున చింతామణి సూత్రము కేతన లక్షణమును వివరించెనన వచ్చును. 'ఇత్వము నీత్వ మందుట' హ్రస్వములు నిడుపులగుట అను విషయములలో చింతామణి సవరింపదగినవి, వివరింపదగినవి లేకుండుటచే చింతామణి వానిని దాక లేదు. ఇట్లు సవరణము పూరణము చేయదగిన విషయములను మాత్రమే గ్రహించి వ్రాయుట శేషగ్రంథము చేయదగినపని. కేతన

లుల మీద లులకు ఱుత్వగు
నిలఁబెక్కెట బాలురన మహీపాలురనన్
లలిత దయాళు రనంగా
నలవడ వర్తిల్లుఁ గాన నభినవ దండీ.

అని బాలు, మహీపాలు, దయాళు మొదలగు వానియందు చివరనున్న లు వర్ణములకు బరముగా నున్న బహువచన లు వర్ణకములకు ఱుత్వమును విధించినాడు. [2]

చింతామణి కర్త 'లాన్తాత్తు ఱరా తయోః క్రమేణ స్తః

(లకారాన్త శబ్దములకంటె బరముగానున్న లు, ల అను వానికి క్రమముగా ఱు, ర అను నవాదేశములగును.) అని రత్వము బహుత్వ

---

[1] ఆం. భా. భూ. 140 ప.

[2] ఆం. భా. భూ. 71 ప.

మున వచ్చు ల డాగమమునకు గూడ గలుగునని పూరించినాడు.[1] కేతన

ఇల్లు కల్లు ముల్లు పల్లును పిల్లును
కన్ను మున్ను చన్ను వెన్ను నాఁగఁ
బఱఁగు శబ్దమునకుఁ బైహలాదులతోడ
నదుకునపుడు జడ్డలడపఁ జెల్లు

అని ఇల్లు మొదలగు వానికి వడి మొదలగు హలాది పదము నదుకు నపుడు ద్విత్వము లోపించి 'ఇలువడి' వంటి రూపములగు న తెల్పెను.[2] చింతామణి

క్వ్రత చిన్న లోపశ్చ (నువర్ణ మంతమందు గల శబ్దము బహువచనము పరమగు నపుడు నువర్ణము లోపించును.) అనిచెప్పి చేను + లు = చేలు వంటి రూపములను సాధించెను.[3] పై పద్యమి సూత్రమునకు మూలమని విమర్శకులనిరి.[4] కాని పై రెంటికి గ సంబంధమల్పమని స్పష్టము. కేతన

ధీనిధి గుణపదములపై
మానుగ హల్లున్న నంతిమము లగు ములకున్
బూని పునాదేశంబగు
భూనుత! పైనచ్చులున్నఁ బుటలగు ములకున్

అనిచెప్పినాడు.[5] చింతామణి 'మోస్తు విభక్త్యేక వచన పుంపూ'(ప్రథమా విభక్త్యేక వచనములందు విధింపబడిన ము వర్ణ

---

1. కవిశిరో. అజంత 15 సూ.
2. ఆం. భా. భూ. 122 ప.
3. కవిశిరో. అజంత 69 సూ.
4. సం. ప్ర. వ్యాకరణాలు. అనుబంధము. 13 క్రమసంఖ్య.
5. ఆం. భా. భూ. 119 ప.

నకు గర్మధారయమున బు, ంపు లు వచ్చును.) అని చెప్పినది.[1] ఇచట పుంవ్వాదేశ విషయమున జింతామణి 'ంపు' అనుదానిని గూడ నాదేశముగా విధించుట, అను విశేషమును జెప్పినది. పద్యములో 'గుణపదము' లని కలదు. దీనికి గేతన యిచ్చిన ఉదాహరణములలో 'వాదపుఁబంతములు, ముత్యపు సరులు' అనుచోట్ల వాదము, ముత్యము అనునవి గుణ వాచకములు గావు. కావున 'గుణ పదము'లను మాటకు వ్యాఖ్యాతలు 'విశేషణములు' అని యర్థమును జెప్పిరి.[2] ఈవివరణముతో బని లేకుండ జింతామణి 'గుణపదములను' మాట వీడియుండును. విశేషమును జెప్పుటచే సిది పూరకమగును. కేతన

తెనుఁగు పదంబులపైఁ బెం
పొనరగ సంస్కృతముఁ జెల్లు నొక్కొక చోటన్
మును సుకవీంద్రులు గృతులన్
బనిగొని రచియించునట్టి పరిపాటి మెయిన్.

అని చెప్పి వాడి మయూఖముల వంటి ఉదాహరణముల నిచ్చెను.[3]

చింతామణి 'సంస్కృత పదేన పరిమిత మాంధ్ర పదం కర్మధారయో భవతి' (సంస్కృత పదముతోడ పరిమితమయిన దెనుఁగు పదము కర్మధారయమగును.[4] అని చెప్పినది. ఇచట ఆంధ్ర పదము పరిమితముగా నుండవలయు ననియు, కర్మధారయమున నిట్టి మిశ్ర రీతి కలదనియు చింతామణి చెప్పిన విశేషము. పాణినిముని సమాస

---

1. కవిశిరో. సంధి 35 సూ.
2. దేవినేని సూరయ్యగారు. దివ్యప్రభావివరణము. 119 ప.
3. ఆం. భా. భూ. 133, 134 ప. ఆం. భా. భూ. 119 ప. వ్యాఖ్య.
4. కవిశిరో. హలంత 48 సూ.

విధాయక శాస్త్రమున ప్రథమా నిర్దిష్టమునకుపసర్జన మని సంజ్ఞను విధించి దానిని సమాసమున బూర్వమందు బ్రయోగించవలెనను నియమము నేర్పరచిరి.[1] సూత్రమున బ్రథమాంతముగా నున్న ఆంధ్ర పదము మొదటను, సంస్కృత పదము తరువాతను గలవు. దాని ననుసరించి బాలసరస్వతి కలికి భుజంగ కన్యలు, వేలుపు వీర భట వర్గము అని యుదాహరించెను.[2]

కాని సంస్కృత వ్యాకరణ సంప్రదాయములలో గొన్నిటిని చింతామణి గ్రహింపలేదు. కావున నిచట సంస్కృత వ్యాకరణ సంప్రదాయము పాటింపలేదని చెప్ప వచ్చును. పాణినీయము చెప్పిన తపరకరణము విషయమున గొన్ని యెడల చింతామణి కర్త అశ్రద్ధ వహించెనని పరిశోధకు లంగీకరించినారు.[3] ఇట్లు చెప్పుటచే తెలుగు పదమే పూర్వమున నుండవలెనను నియమముండదు. విన్నకోట పెద్దన

సంస్కృతములయ్యుఁ దెనుఁగులై చాఁగుఁ గొన్ని
శబ్దములు వాని చందంబుఁ జను నెఱుంగఁ
బనస పండును గుండలోపల ననంగఁ
గంద దుంపలు నా జీరకఱ్ఱ యనఁగ

అని లక్షణమును జెప్పెను.[4] ఇందు పనసపండు కంద దుంపలు అని సంస్కృత పదముతో తెనుగునకు గర్మధారయము గల్గుచున్నది.

---

1. 'ప్రథమా నిర్దిష్టం సమాస ఉపసర్జనమ్' "ఉప సర్జనం పూర్వమ్' సిద్ధాన్తకౌముది అవ్యయీ భావ. 653, 654 సూ.
2. ప. బాలస. హలంత. 19 శ్లో. వ్యాఖ్యలో.
3. ఆచార్య అమరేశం రాజేశ్వర శర్మగారు ఆం. వ్యా. వికాసము. ప్రథమ 456, 467 పుటలు.
4. కావ్యా. చూ. 9. 138 ప.

దానినే చింతామణి కర్త యీ సూత్రమున జెప్పియుండ వచ్చును. పూర్వ వ్యాఖ్యాతల రీతి ననుసరించినచో తెలుగు పదము బూర్వమున గల మిశ్ర సమాసము కర్మధారముము గావలెనని చింతామణికర్త చెప్పెననవలెను. దానిలో బూర్వ పదము పరిమితముగ నుండవలెనని గూడ నాతడుద్దేశించెననవలెను. కాని నన్నయ భారత మందే తెనుగు పదము మొదట నున్న సమాసములలో బూర్వపదము పరిమితికి లోబడి యుండలేదు.[1] కావున నీపరిమిత విశేషణ మసంగత మగును.

పనసపండు ఇత్యాది సమాసముల విషయమీవిధి యనుకొనినవుడు 'పరిమితపదము' కర్మధారయ సమాసము' అను విశేషణములు సార్థకములగును. ఆపక్షమున నిది పెద్దన యిచ్చిన యుదాహరణము లాధారముగా జింతామణి చెప్పిన విశేషలక్షణ మగును.

విమర్శకు లాంధ్ర భాషా భూషణములోని 228 పద్యము చింతామణి యందలి హలంతమునగల 26 సూత్రమునకు మూలమని చెప్పిరి.[2]

కాని భాషాభూషణమున 193 పద్యములే యుండుటచే నిచ్చట పొరపాటు కలదని చెప్పవలెను. 128 కి బదులు 228 పడియుండును.

"తన నా నీయను పలుకుల
నెనయుంగ హలాదులదుకునెడదుఙ్బు నగున్
దన దు ధనము నాదుగుణం
బన నీదు యశంబు నాఁగ ననువై యునికిన్

---

1. ఆం. భా. ఆది. 1-34 'తొమ్మన్నూట యెనుబదినాలుగు శ్లోకంబులు.'
2. సం. ప్ర. వ్యాకరణాలు అనుబంధము. 15 క్రమ సంఖ్య.

అను పద్యము 128 సంఖ్య కలది. చింతామణిలో "యుష్మదస్మదాత్మభ్యో ద్వితి వర్ణకః" (నీ, నా, తన శబ్దములకు సంబంధార్థమున 'దు' అను వర్ణకము వచ్చును.[1] అనికలదు.

ఇచట హలాదులు పరమగునపుడీ కార్యమువచ్చునని కేతన స్పష్టము చేయగా జింతామణి 'హలాదు' లను దళమును వీడినది. విన్నకోట పెద్దన 'ఆగట నానీ తనయనుచోదుత్వము గలుగు షష్ఠి చూపెడు నెడలన్' అని చెప్పి 'హల్లు పరమగునపుడు' అను దళమును వీడెను. అంతటితో నాగక

'నా నీ త న య ను పలుకుల
తో నదుకు దుకారమపుడు దొలఁగిన దొలఁగుం
బూని సమాసము సంస్కృత
మైనను షష్ఠ్యర్థ హేతువై సత్కృతులన్'[2]

అని లక్షణమును వ్రాసి '...... తన యుద్యత్కీర్తి విస్ఫూర్తియన్ ...' అని యుదాహరించెను.[3]

అనగా "తన + ఉద్యత్' అను చోట దుకారము తొలగినదను భావము వచ్చుచున్నది. అనగా నచ్చు పరమగునపుడు గూడ దుగాగమము ప్రవర్తించుట పెద్దనకు సమ్మతమన్న మాట.

కావున జింతామణి కర్తగూడ హలాదులను దళమును వీడి యుండును. పెద్దన 'షష్ఠి చూపెడు నెడ దుత్వము' కలుగునని యీ 'దు' షష్ఠీ స్థానములో వచ్చు ప్రత్యయమని సూచించెను. వాసుదేవ కవి యీవిషయమును మరింత స్పష్టము సేయుచు 'ఒక్క శేషే' షష్ఠీ శేషే. ఇతి విహితాయాః షష్ఠ్యాః స్థానే ఒక్క ఇతి స్యాత్. దొరయొక్క మానిసి, సుబ్లోపే దొరమానిసి (శేష షష్ఠి స్థానమున

---

[1] కవిశిరో. హలంత 25 సూ.

[2] కావ్యా. చూ. 9-133 ప.

[3] అందే 134 ప.

'ఒక్క' యను ప్రత్యయము వచ్చును. దొర యొక్క మానిసి, విభక్తి లోపించినపుడు దొరమానిసి)

'ఒక్కస్య దుషేత్యేకే' యుష్మదస్మదోః స్వస్యచ శేష షష్ఠ్యాః స్థానే దువర్ణకోవా

నీదుకొడుకు, నాదుకొడుకు, తనదు కొడుకు (నీ, నా, తన శబ్దముల 'ఒక్క' స్థానమున 'దు' వికల్పముగా వచ్చునని ఒకరనిరి.) అని చెప్పెను.[1]

అనగా వీరిమతమున 'ఒక్క' అను విభక్తి ప్రత్యయము వంటిదే 'దు' అనునది. 'నాదుకొడుకు' వంటివి వ్యస్త ప్రయోగములన్న మాట. వాసుదేవ కవిచే 'ఏకే' అని చెప్పబడినవాడు పెద్దనయే కావచ్చును. చింతామణి 'దిస్స్వత్సంబంధార్థే సర్వస్మాత్ (అన్ని శబ్దములకంటె బరముగా సంబంధార్థమున 'ది' వర్ణకము వచ్చును.) 'యుష్మదస్మదాత్మభ్యో ద్వితి వర్ణకః' (నీ నా తన శబ్దముల కంటె 'దు' అను వర్ణకము వచ్చును.) అని చెప్పినది.[2]

అనగా జింతామణి మతమున సంబంధార్థమున వచ్చు ది వర్ణకము వంటిదే దు వర్ణకము. ఇది విభక్తి ప్రత్యయము వంటిది కాదు. కావున 'నీదు కొడుకు' అనునది నీయొక్క కొడుకు వంటి వ్యస్త ప్రయోగమనుటకు వీలులేదు. మఱి దీనినేమనవలెను? 'ఈ సూత్ర రచన చూడగా వీనిని చింతామణి కర్త తద్ధిత ప్రత్యయములుగా నెంచినట్లు కానవచ్చుచున్నది' అని ఆచార్య అమరేశము రాజేశ్వర శర్మగారు వివరించినారు.[3] ది వర్ణకము చేరిన రాజుది వంటి వానిని

---

1. వైకృత చంద్రిక - సమాస 3, 4 సూ.
2. కవిశిరో. హలంత. 25, 26 సూ.
3. ఆం. వ్యా. వికాసము ప్రథమ 394 పుట.

తద్ధితాంతములని చెప్పవచ్చును. ఈ 'దు' ఆగమమనియు నిది యుత్తర పదము పరమగునపుడు మాత్రమే వచ్చునని శ్రీ చిన్నయసూ చెప్పిరి.[1] అనగా నిది సామాసిక కార్యమన్నమాట. శ్రీ వావిలికొలను సుబ్బారావు బహువచనంబున నీ 'దు' గాగమము ప్రవర్తింపదని తెలిపినారు.[2] ఈ విషయమున గలిగిన క్రమ వికాసములో ఈ 'దు' అనునది షష్ఠిస్థానమున వచ్చిన విభక్తి అనియు నది వ్యస్త ప్రయోగమని యనుట కంటె సంబంధార్థమున వచ్చినదని చెప్పుట ఉచితమను విషయము చింతామణి చెప్పిన విశేషమని తెలియనగును. కేతన

ప్రార్థనార్థంబు చోటను బ్రశ్నచోట
సంశయంబుండు చోట నిశ్చయముచోటఁ
దెగడుచోటను నెత్వంబు తెనుఁగునందు
నోయొ లందును సంశయం బొందు చోట

అని చెప్పెను.[3] చింతామణి యందు

'ఏదాతౌ ప్రశ్నలక్షణౌ భవతః'(ఏత్, ఆత్ అనునవి ప్రశ్నార్థకములగును) "ఏదోతౌ వ్యతి రేకాదపి సమ్ప్రార్థన పరౌ క్రియాణాం స్తః" (క్రియలలో వ్యతిరేకార్థముల కంటె గూడ 'ఏ',

---

[1] యుష్మ దస్మ దాత్మార్థకంబుల కుత్తర పదంబు పరంబగునపుడు దుగాగమంబు విభాషనగు' బాల. వ్యా. సమాస. 11 సూ.

[2] సులభ వ్యాకరణము సమాస 49 సూ.

[3] ఆం. భా. భూ. 154 పు.

‘ఓ’ అనునవి సంప్రార్థనార్థకములయి వచ్చును.[1] ‘సంప్రార్థ నార్థ కాదీత్’ (ప్రార్థనార్థకము కంటె ‘ఈ’ అనునది వచ్చును)[2] అని కలదు.

ఇందు ‘ఈ’ కారము ప్రార్థనార్థకమనియు ‘ఆ’ అనునది గూడ ప్రశ్నార్థకమనియు ‘ఏ’ ‘ఓ’ లు వ్యతిరేక క్రియల కంటె సంప్రార్థన పరములయి వచ్చుననియు చింతామణి చెప్పిన విశేషములే.

కేతన సంశయార్థమున ఒ ఓ లను రెండింటెని జెప్పెనుగదా! ప్రార్థనాద్యర్థములందు ‘ఎ’త్వము వచ్చునని చెప్పెను. కాని యుదాహరణములలో పోవే, కలవే మొదలయిన ‘ఏ’ కారాన్తములనే యుదాహరించెను.[3]

చింతామణి ‘ఎ’ ‘ఏ’ లను రెండింటిని గూడ ప్రశ్నవాచకములుఁగా జెప్పియుండవచ్చును. సంస్కృతమున ఎకారము లేనందున గ్రంథకర్త ఎ కారము నుద్దేశించినను ఏ కారము నుద్దేశించినను రెంటి నుద్దేశించినను సూత్రములో ‘ఏ’కారమే కనబడును. కేతన

అచ్చ తెనుఁగు మాట నసువైనచో వ కా
రము గకారరూపమమరఁదోచుఁ
దీవె తీఁగె యనఁగఁ జేవ చేగ యనంగఁ
బవలు పగలు నాఁగఁబరగుఁగాన

అని వకారము గకారమగునని చెప్పెను.[4] కాని తరువాతివారు గకారమునకు వకారమగునని చెప్పినారు.[5] అగు మొదలగుచోటుల

---

[1] కవిశిరో. క్రియ 44, 45 సూ.

[2] కవిశిరో. అందే 43 సూ.

[3] ఆం. భా. భూ. 155 ప.

[4] ఆం. భా. భూ. 169 ప.

[5] అథర్వణుడు చింతామణిని సవరించుచు ‘ఆద్యగస్య గకారస్య వకారస్తు న దృశ్యతే’ అని పదాది గ కారమునకు వకారమున్న

గకారమునకువకారమువచ్చెనని అంగీకరించుట ఉచితమనిపించును. వకారము గకారముగా మారెనని కేతన యిచ్చిన ఉదాహరణములలో తీగ చేగపగలు అనునవి మొదట గకారముతో గూడినవై పిదప వకారయుతముగా మారెనని తెలియును.[1] ఈవిధము నుద్దేశించి చింతామణి 'క్వచిద్గకారోవః' (ఒకచో గకారము వకారమగును.) అని చెప్పియుండును.[2] కేతన

చునులపై నకారము పొడసూపుఁబోవు
నొప్పు నచ్చులుపై డాసి యుండెనేని
యొదవు చున్నచో నొదవుచునున్న చోటఁ
బొడుచు చడరెను బొడుచుచు నడరె ననఁగ

---

207 పుటకు అధస్సూచిక

నిషేధించెను. కవిశిరో. అజంత. 67 సూ. వ్యాఖ్య. 'అపదాద్యంబయి యసంయుక్తంబయిన గకారంబునకు వకారంబు విభాషనగు' చిన్నయసూరి బాలవ్యా. అచ్చిక 27సూ. 'అనాద్యంబును న సంయుక్తంబును నగు గకాంమునకు నొకానొకచో వకారంబగు.' శ్రీ వావిలికొలను సుబ్బారావు సులభవ్యాకరణము అచ్చిక. 61 సూ.

1. తీఁగ (సం. దీర్ఘా, ప్రా. దీహో, పా. దీఘో,క. తీగె) తీవె సూ. ని. 3వ భా. 852 పు. ఘ<గ చేగ (క. చేగు. త. చేకకు క<గ) చేవ అందే 290 పుట.

పగలు = పవలు (క. పగలు, హాగలు, త. పకల్ పహల్) క<గ సూ. ని. 5 సం. పునర్ముద్రణము 46 పుట. ప్రకృతి భాషయందు సోదర భాషలలోన ఘ/క/గ/లు కానవచ్చుచున్నందున గకారయుతరూపములే ప్రాచీనములనుటస్పష్టము.

2. కవిశిరో. అజంత 67 సూ.

అని ఒదవుచున్ ఇత్యాదులకు స్వరము పరమగునపుడు నకారము వికల్పముగా బ్రాప్తించునని చెప్పెను.[1] అతడిచ్చిన ఉదాహరణములలో చు వర్ణమునకు ద్రుతము లోపించినపుడు సంధి వచ్చుట, లోపింపనపుడు ను వర్ణమునకు సంధి వచ్చుట జరిగినది. కాని యీసంధిని కేతన చెప్పలేదు.

చింతామణి 'చోర్వాస్యాద్వర్తమాన విహితస్య' (వర్తమాన కాలమున విధింపబడిన చువర్ణకమునకు సంధి వికల్పము) అని వికల్ప సంధిని విధించినది.[2] అన్వర్థమగు ద్రుత సంజ్ఞాబలముచే, సంధి విధాన సామర్థ్యముచేత సంధివేళ నకారము లోపించునన్న మాట. పై పద్యమీసూత్రమునకు మూలమని విమర్శకులనిరి. కేతన యిచ్చిన ఉదాహరణములు చింతామణి కర్తకీ సూత్ర రచనమున బ్రేరకములని చెప్పవచ్చును గాని విషయ భేదముండుటచే బద్యము సూత్రమునకు మూలము కాజాలదు. పద్యము నకారమునకు వికల్ప ప్రాప్తిని జెప్పగా సూత్రము చు వర్ణకమునకు వికల్ప సంధిని జెప్పును. ఆ చు వర్ణకము వర్తమానమున విధింపబడినదను వివరణమును గూడ సూత్రము చెప్పుచున్నది. లేదా కేతన పద్యముచే నకారము పోయినపుడే సంధి ప్రవర్తించుననియు జెప్పవచ్చును. అపుడే సూత్రము కేతన పద్యమునకు పూరకమగును. కేతన

సల్లలితైక పదముపై
నిల్లునిలును గ్రియలఁగొన్న యెడలను దగ సం
ధిల్లుట శోభిలుటయుఁ బ్రభ
విల్లుటయన జగతిలోన బెడఁగై యుండున్

---

[1] ఆంభా. భూ. 173 ప.

[2] కవిశిరో. సంధి. 7 సూ.

అని క్రియలపై 'ఇల్లు' 'ఇలు' అనువానిని విధించెను.[1] చింతామణి ధాతువునకు 'ఇంచు' అను నాగమమును విధించినది. 'రఞ్జిఘట్యాదీనాం బిన్దోశ్చ స్యాపి లావుభాభవతః' (రంజ, ఘట మొదలగు ధాతువులకు విధింపబడిన ఇంచుగాగమమునందలి బిందు పూర్వక చకారమునకు లకారద్విత్వముగలుగునని విధించినది.[2] ఇచట కేతన ధాతువునకే. ఇల్లు/ఇలు అనునాగమములను విధింపగా జింతామణి ఇంచుగాగమ మందలి బిందు పూర్వక చకారమునకే లకార ద్విత్వమును విధించినది. ఇది పద్ధతి భేదము. కేతన రీతిలో ధాతువునకు ఇల్లు, ఇలు, ఇంచు అని మూడాగమములను చెప్పుకొనవలెను. చింతామణి పద్ధతిలో ఇంచుగాగమము ద్వారముననే ఇలు అనువానితో గూడిన రూపములు గూడ సిద్ధించునన్న మాట. పైన ఇంచుగాగమమునందలి బిందు పూర్వక చకారమునకు లకార ద్విత్వము విధింపబడినది గదా! 'ప్రథమలుగపిద్విసులోప్వాః' ద్విత్వముతో గూడిన నులు మొదటి 'న్ ల్' అనువానికి లోపముగూడవచ్చును.)[3] అను సూత్రముచే నొకలకారము లోపించి 'శోభిలు' వంటి రూపములు సిద్ధించును. కావున చింతామణి వేరే 'ఇలు' అను నాగమమును విధించుకొననక్కరలేదు.[4] కేతన

---

1. ఆం. భా. భూ. 176 ప.
2. కవిశిరో. క్రియ 39 సూ.
3. కవిశిరో. సంధి 36 సూ.
4. అహోబలపతి యీసూత్రము సమాసము లందు వర్తించునదని చెప్పెను. (కవిశిరో. సంధి 36 సూ - వ్యాఖ్య) దీనిని వ్యస్త పదములకు గూడ వర్తింపజేయవచ్చుననుటకు "అకారంబు క్రింది అకారంబునకుండుది నులుల క్రింది నలలకు లోపంబు బహుళంబుగ నగు" అల్లు, అలు, గొల్లియు, గొలియు, అనుజిన్నయ సూరి పలుకులు ప్రమాణములు. (బాలవ్యా. ప్రకీర్ణక. 7 సూ.)

ఇన భూతార్థము దెలుపును గనుఁగొనఁగా గర్తృకరణ కర్మంబులఁబం
డిన వాఁడనఁబొడిచినవాలనఁ బండిన కొలుచు నాఁగననువై యుండున్

అని కర్తృ కరణ కర్మములలో 'ఇన' భూతార్థమున వచ్చుననెను. [1] చింతామణి "కర్మాదేః కర్తృత్వం ప్రథమాచ నవర్ణకశ్చ తద్వత్ స్యాత్" (కర్మాదికారకములకు కర్తృత్వమును, ప్రథమావిభక్తియు నవర్ణకమును అట్లే వచ్చును.) అని చెప్పినది. [2] 'నీవు నుతించిన రాజు' అనుచోట కర్మగా నున్న 'రాజు' శబ్దము 'నుతించినరాజు' అను ప్రయోగమున కర్త అయినది. తెనుగునకు స్వాభావిక మయిన యిట్టి ప్రయోగములను జింతామణి చెప్పినది. కర్మాదులకు గర్తృత్వము, ప్రథమ వచ్చుట, కర్మార్థక వాక్యమందలి క్రియకు వలె నిచటి క్రియకు నవర్ణకము వచ్చుటనను విశేషములు చింతామణి చెప్పినవి. కేతన పద్యము 'ఇన' కు భూతార్థకత్వమును మాత్రమే విధించెను.

ముందు సూత్రమున చింతామణి నవర్ణకమును భూతార్థమున విధించుటచే గేతన చెప్పిన భూతార్థకత్వమిందు గూడ సంగృహీత మయినట్లే. [3] కేతన

మానయు జేనయు లోనగు
నానా పరిమాణములు జనముగొలుచునెడన్
మానెఁడు జేనెఁడు నన్క్రియ
మానకెఁడుల నొందు మీఁద మ్రానయ కేతా !

అని 'మాన' మొదలగు వానికి 'ఎడు' వచ్చునని చెప్పెను. [4] చింతామణి 'పరిమితౌ సమస్తానామ్' (పరిమాణార్థక ప్రత్యయము పర

---

1. ఆం. భా. భూ. 180 ప.
2. కవిశిరో. హలంత 33 సూ.
3. భూతార్థానాంతునః క్రియాణాం స్యాత్
   కవిశిరో. హలన్త 32 సూ.
4. ఆం. భా. భూ. 189 ప.

మగునపుడు అన్నియచ్చులకు సంధినిత్యము.) అని బాగ ఎడః ఇత్యాదులలో నిత్యసంధిని విధించెను.[1]

కేతన పరిమాణార్థమున 'ఎడు' వచ్చునని చెప్పగా చింతామణి కర్త పరిమాణార్థక ప్రత్యయము పరమగునపుడచ్చులకు నిత్యసంధిని విధించినాడు. కేతన లక్షణమునకు చింతామణి లక్షణమునకు విషయ భేదము కలదని వేరే చెప్పనక్కరలేదు. కేతన

పదము తుది యిత్వ ముత్వము
పదిలంబుగ బహువచనముపై నొందినచో
నది తెలియఁడు మణులు ఘృణులు
సుదతులు సన్మతులు సఖులు సుకవులనంగన్.

అని ఇకారాన్త శబ్దముల ఇకారములకు బహు వచనము పరమగునపుడు ఉత్వమును విధించెను.[2] ఇది చింతామణి అజన్త పరిచ్ఛేదమునందలి 7 వ సూత్రమునకు మూలమని విమర్శకులనిరి.[3]

ఆ సూత్రము 'అంద్వింందు నాస్తు సప్తమీ'

(అందు, ఇందు, న, అనునవి సప్తమీ ప్రత్యయములు) అనునది. పద్యమునకు సూత్రమునకు సంబంధమేదియు లేదనుట స్పష్టమే. ఒకవేళ అంకె తప్పుపడియుండవచ్చును. అజంతమున 37వ సూత్రము 'ఉద్బహుత్వే' (ఇదంత శబ్దముల ఇకారమునకు బహువచనము పరమగునపుడు ఉత్వము వచ్చును.) అనునది; దానినే యీ విమర్శకులుద్దేశించియుందురు. స్థూలముగా జూచినచో నీ సూత్రమునకు పద్యము మూలముగనే కనబడుచున్నది. కాని యిచటగూడ పద్ధతి భేదమున్నది.

కేతన బహువచనము పరమగునపుడు పదము తుది యిత్వము నకుత్వము విధించినాడు. అతని అభిప్రాయములో మణిపదము; దానికి

---

[1] కవిశిరో. సంధి 5 సూ.

[2] ఆం. భా. భూ. 79 ప.

[3] సం. ప్ర. వ్యాకరణములు అనుబంధము. 6 క్రమసంఖ్య.

'లు' పరమైనపుడుత్వము వచ్చి మణి+లు=మణులు అయినది. తెలుగున నీడ, మేడ మొదలగు అచ్చిక పదములలో ప్రథమైక వచనమును, ప్రాతిపదికము సమానముగా గనబడును. కావున మణి యను దానిని ప్రథమాన్తముగా భావించినచో బదమగును. దానిపై లు వర్ణాదులు జేరినవని చెప్పుట కేతన పద్ధతి. ఈ పద్ధతి చింతామణికర్త కిష్టముగాదు. ఇతడు విభక్త్యంతములను పదములనెడి సంస్కృత వ్యాకరణమర్యాద ననుసరించి వాడినవాడు.[1] కావున మణి పదమగుచో నది విభక్త్యంతము కావలెను. అచట ఏ విభక్తియు కానరానందున ప్రథమా విభక్తి లోపించిన దనవలెను.[2]

మణి మణులు అనునపుడు మణి ప్రాతిపదిక. దానికి బహువచనముచేరిన పిదపనే పదత్వము వచ్చును. 'పదము తుది యిత్వము బహువచనము పరమగునపుడుత్వమగును.' అను కేతన వచనము చింతామణి పద్ధతికి భిన్నము, కావున పదము అను శబ్దమును దొలగించి యీవిధిని జెప్పినది. తన గ్రంథ ప్రణాళిక కనుగుణముగా పై పద్య లక్షణమును చింతామణి మార్చుకొనినదని సారాంశము.

చింతామణికి మూలములుగా డాక్టర్ ఆకురాతి పున్నారావు గారు చూపిన 46 లక్షణములను దులనాత్మకముగా బరిశీలించుటచే చింతామణి కర్త తనకు బూర్వుడైన కేతన లక్షణములలో గొన్నింటికి పూరణమును, గొన్నింటికి వివరణమును జేసి వానిని దనగ్రంథమున జూపెననియు, నట్లు పూరణాదికము నపేక్షించని లక్షణములను తాను పునరుక్తము చేయలేదనియు స్పష్టమయ్యెను. తన ప్రణాళికకు భిన్నముగానున్న కేతన లక్షణములను మాత్రము చింతామణి కర్త తన ప్రణాళిక కనుగుణముగా మార్చుకొనుటకు వానిని గూడ గ్రహించె

---

[1] 'సుప్తిఙన్తం పదమ్'. సిద్ధాంతకౌముది సంజ్ఞ 29 సూ.

[2] సోర్లు గితః (ఇదంతముల ప్రథమైక వచనమునకు లుక్కు వచ్చును) కవిశిరో. అజంత 38 సూ.

ననియు దేలినది. కావున ఆంధ్రశబ్ద చింతామణి ఆంధ్ర భాషా భూషణమునకు తరువాత చదువదగిన గ్రంథమే కాని దానికి కేవల సంస్కృతీకరణము గాదు. ఆంధ్ర భాషా భూషణము కావ్యాలంకార చూడామణి లక్ష్య లక్షణములను రెండింటిని చూపుటచేత, తాను వేరె లక్ష్యములను జూపకున్నను తన గ్రంథమర్థమగునను నూహతోడనే ఆంధ్ర శబ్ద చింతామణి లక్ష్య ప్రదర్శనము మానియుండునని గూడ ఊహింపవచ్చును. "బహుశః ఛందస్సు అడ్డంవచ్చో, సంస్కృతీకరణానికి ఆనుకూల్యం చాలకో చింతామణికర్త కేతన లక్షణాన్ని (కొన్నింటిని) విడిచిపుచ్చి ఉంటాడని తెలిసికోవచ్చు" అను విమర్శకుల వచనము, వారి ఊహా మాత్రమే కాని వాస్తవము కాదని చెప్పవలెను.[1]

ఇవిగాక విమర్శకులు విన్నకోట పెద్దన, వెల్లంకి తాతంభట్టు, చిత్రకవి పెద్దన, ముద్దరాజు రామన లక్షణములకుగూడ జింతామణిలో ననువాదములు గలవని భావించినారు.[2]

కాని తాతంభట్టు కవి చింతామణి. ఆంధ్రశబ్ద చింతామణికి తరువాతి దరువాతిదే యని వేఱొకచో నిరూపింపబడుటచేత, తరువాతి వారందరు తాతంభట్టునకు యనంతర కాలికులేయగుట చేత పెద్దన[3] రచన తప్ప మిగిలిన వేవియు చింతామణికి మూలములు కాజాలవు.

విమర్శకులు చింతామణి లక్షణములకు మూలముగా జూపిన పెద్దన లక్షణములను గూడ బరిశీలింతము. పెద్దన "మఱియు సంధి విభక్తులకుంగల నామాంతరంబు లెఱిగింతు స్థావర తిర్యఙ్మనుష్య

---

[1] సం. ప్ర. వ్యాకరణాలు 275 పు.

[2] సం. ప్ర. వ్యాకరణాలు చింతామణికి మూలపాఠాలు అను వ్యాసము చూ.

[3] "రెండు చింతామణులలో నేది యాద్యము" అను వ్యాసము చూ.

పదవక్తిక్రియగు ప్రథమావిభక్తికిం గ్రమంబున ముకారంబును, డు కారంబును, ద్వితీయకు ను కార ని కారంబులును, దృతీయకు జేతతోడ యనునవియు, జతుర్థికిం గొఱకు కై యనునవియు బంచమికి వలన పట్టి యుండి, కంటె, అనునవియును షష్ఠికిం గికు కారంబులును యొక్క లోపలయను పదములును, సప్తమికి అందు, న, యను పదంబులు నయ్యె" అని వ్రాసెను.[1]

చింతామణి 'డుములవః ప్రథమాస్యాత్' (డుమువు లు ప్రథమ అగును) 'కూర్చిలనునయోథవేద్ద్వితీయాతు' (కూర్చి, ల, ను, ని ద్వితీయ అగును.) 'తో,చేత, తోడ, చేస్స్యుస్తృతీయాయాః' (తో, చేత, తోడ, చే తృతీయకగును) 'కొఱకు కై చతుర్థ్యాః స్తః' (కొఱకుకై చతుర్థి కగును.) 'పట్టి, వలన, కంటె, ఇతి పఞ్చమీ' (పట్టి, వలన, కంటె అనునవి పంచమి యగును.) 'అథలోపల కికు యొక్కాన్యా' (లోపల, కి, కు, యొక్క షష్ఠి) 'అద్వ్యందు నాస్తు సప్తమీ'(అందు, ఇందున, సప్తమి యగును.)'ఓ యీత్యామన్త్రిణ ఇచ్చ వికృతౌ స్యాత్' (తెలుగున ఓయి అనునది సంబోధనార్థక మగును) అని చెప్పినది.[2] పెద్దన చెప్పని "వు, లు, కూర్చి, ల, చే, తో, ఇందు, ఓయి" అనువాని గూడ చింతామణి అదనముగా బేర్కొనినది.

పెద్దన వీనిని విభక్తులకు నామాంతరములనినాడు. ఆమాట చింతామణికి నచ్చక వీడినది. అట్లే లోపల, అందు, న అను వానిని పెద్దన పదములనెను. విభక్త్యంతము పదమను సంస్కృత సంప్రదాయము నవలంబించిన చింతామణి కది గూడ నచ్చలేదు. ఆ 'పద' పదమును గూడ వీడినది. కావున పెద్దన రచనకిచట సవరణము పూరణము జరిగిన దనవలెను. పెద్దన

---

1. కావ్యా. చూ. 9-97 వచనము.
2. కవిశిరో. అజంత 1 నుండి 8 సూ. వరకు.

ఐ కారాన్తములోకా రాకారాంతములు దెనుఁగు లైనప్పుడు పూ
ర్వాకృతి తోడన యుండును నోకారాంతంబుపై బహుత్వము నొందున్
రై వరగును నడు గోవున గోవులు విదుకంగ గ్లానికుల నృపతులు ధ
ర్మావిష్కృతి బడయుదురన గావెలయుఁ గవి ప్రయోగగతిఁ దెలియన్

అని ఐ, ఓ, ఔ లంతమందు గల శబ్దములు తత్సమములైనపుడట్లే యుండునని తెలిపినాడు. ఓ కారాంతంబుపై బహుత్వ ప్రత్యయము వచ్చుననినాడు.[1]

చింతామణి 'స్తోఽచా వౌరైనావోః (రై శబ్దమునకు ఓకారమును, నౌ శబ్దమునకు ఆవ అనునదియు నంతాదేశముఁగును) 'స్త్రీవద్గ్లాః' (గ్లా శబ్దము స్త్రీలింగ శబ్దములకు వలె కార్యమునందును) అని చెప్పెను.[2] "పై పద్యాల భావం చింతామణి కర్తచే సంస్కృతంలోకి అనూదితమైందని" విమర్శకులు ప్రతిపాదించిరి.[3]

కాని పెద్దన సాధింపని 'రో, నావ' యను రూపములను జింతామణి సాధించినది. గ్లా శబ్దమునకు స్త్రీలింగత్వాతిదేశముచే 'స్త్రీలింగ శబ్దములకు వచ్చు సులోపమును జెప్పికొనినట్లైనది.' విభక్తిప్రత్యయాంతమునే ప్రయోగింపవలెనను చింతామణికీరీతి యనవసరము. కావున వీనిని కేవలానువాదములుగా జెప్పరాదు.

---

1. కావ్యా. చూ. 9-36, 37 ప.
2. కవిశిరో. అజంత. 62, 63 సూ.
3. సం. ప్ర. వ్యాకరణాలు 220 పుట.
4. 'అనుతాం స్త్రియాం సమానాం సర్వస్య స్త్రీ సమస్యచ సులోపః' కవిశిరో. అజంత 80 సూ.

రై, నౌ శబ్దముల విషయమున బూరణము, గ్లౌ శబ్ద విషయమున దన ప్రణాళిక కనుగుణమైన మార్పు కలవని చెప్పవలెను. విషయమిట్లుండుటచే 'చింతామణి లోని సూత్రాలు అనేకం బాల సరస్వతికి పూర్వం ప్రసిద్ధమయిన దేశీయ వ్యాకరణాలలోని లక్షణాల సంస్కృతీకరణాలే' అను విమర్శకుల వ్రాత సత్యదూరమని స్పష్టమగుచున్నది. [1]

పరిశోధకులొకరికి చింతామణిని చదువుచున్నప్పుడు కొన్ని సందేహాలు తలెత్తినవట. [2] వానిని దీర్చుకొనుటకు ప్రాచీన వ్యాకరణాలను బరిశీలించుచుండగా నాంధ్ర భాషా భూషణ రచనా ప్రణాళికలో జింతామణి పద్ధతి కానవచ్చినదట. [3] ఆరెండింటి యందలి లక్షణ లక్ష్యములను తులనాత్మకముగా బరిశీలించి, కేతననే జింతామణి కర్త అనువదించెనని వారు నిర్ణయించుకొనిరి.

వారు చూపిన సందర్భములను బరిశీలింతము. చింతామణిలో 'తద్వత్తదాదిజస్య' (అది మొదలగువాని చివరి హ్రస్వేకారమునకు సంధి వికల్పము) అని యున్నది. [4] దీనికి దరువాతి సూత్రము "ప్రాయస్తు స్యాత్కిమాదికస్యేతః" (ఏమి మొదలగు శబ్దముల హ్రస్వేకారమునకు సంధి తఱచుగానగును.) [5] ఇచట అది మొదలగు వానిని గూడ ఏమి మున్నగువానిలో వేసి ఒక సూత్రము సాధించుకొనవచ్చునుగదా! రెండు సూత్రములను రచించుటెందులకని వారి ప్రశ్న. [6] కేతన

---

1. సం. ప్ర. వ్యాకరణాలు 280 పు.
2. సం. ప్ర. వ్యాకరణాలు 297 పు.
3. అందే 268 పుట.
4. కవిశిరో. సంధి 8 సూ.
5. కవిశిరో. సంధి 9 సూ.
6. సం. ప్ర. వ్యాకరణాలు 287 పుట.

అచ్చుగ నట్టి ట్టు ట్టి ను
నచ్చులె యంతమునఁ దెనుఁగుటభిధానములన్
విచ్చలవిడిఁబల్కుటఁబెఱ
యచ్చులు చనుదెంచు మానవాఖ్యల యందున్.

(తెనుగు పేరుల చివర అ, ఇ, ఉ అను స్వరములే యుండును. స్వేచ్ఛగా బలుకుచుండుటచే మనుష్యుల పేరుల యందు ఇతర స్వరములా యచ్చులతో గలియును.)
తత్సంధి క్రమం బెట్టిదనిన

అవని నాథుఁడు దయచూడ కనిపి నాఁడు
రాజు దయలేక యున్నాడు రమణి యెడల
అలరు బంతిది మేల్బంతి యది యనంగ
నెల్లఁగృతులను మిక్కిలిఁ జెల్లుగాన.

అని పై లక్షణ పద్యమునకుదాహరణములను జూపినాడు.[1] ఇందు చూడక + అనిపినాడు = చూడకనిపినాడు, దయలేక + ఉన్నాడు = దయలేకయున్నాడు. అలరు బంతి + ఇది = అలరు బంతిది, మేల్బంతి + అది = మేల్బంతియది. అని అ, ఇ లకు స్వరము పరమగునపుడు సంధి వికల్పమనుట కుదాహరణము లీయబడినవి.

చింతామణి అది మొదలగువాని ఇకారమునకు వికల్ప సంధిని జెప్పగా, కేతన ఉదాహరణము లలో, అ, ఇ వర్ణము లంత మందు గల శబ్దములకు వికల్ప సంధి కన్పడును. కేతన ఉదాహరణ మును మాత్రమీయగా జింతామణి 'అ' వర్ణమునకు వికల్ప

---

[1] ఆం. భా. భూ. 46, 47, 48 ప.

సంధిని [1] ఇ వర్ణమునకు ఒకచో నిత్యసంధిని [2] ఒకచో వికల్పసంధిని [3] ఒకచో ప్రాయిక సంధిని [4] చెప్పినది. ఈ స్థితిలో కేతన లక్షణమునకు జింతామణి యనువాద మెట్లగును? పూరణ మగును. ఇంతకు గేతన రచనలో నీవిమర్శకుల సందేహమునకు సమాధానమేమి లభించినది? మఱియు ఇకార సంధిని విధించిన చింతామణి సూత్రములు మూడింటియందును వాని ప్రత్యేకత స్పష్టముగా గనబడుచుండగా ఏమి మొదలగు వానిని అది మొదలగువానిని గలుపుట యెందులకు? తరువాతి కాలమున ఏమ్యాదులకు గూడ వికల్ప సంధి వచ్చినను, చింతామణి కాలమున ఏమ్యాదులకు సంధి తఱచుగ వచ్చుచుండుటచే దత్కర్త ప్రాయిక సంధిని చెప్పియుండును.

చింతామణిలో 'శబ్దాత్తచ్ఛబ్దాతః'

(కావు మొదలగు శబ్దముకంటె బరముగానున్న అది శబ్దమునకు జెందిన అ కారమునకు లోపము వికల్పము.) అని యున్నది. [5] "అది శబ్దానికి ప్రత్యేకతను అనవసరంగా కల్పించినట్లు" విమర్శకులు భావించినారు. [6] ఇది యనవసర కల్పనమైనచో చిన్నయసూరి యేల పరిగ్రహించును? [7] దీనికి వారు మూలముగా జూపించిన కేతన పద్యము

---

1. 'వాతః' కవిశిరో. సంధి 2 సూ.
2. 'నిత్యమనుత్తమపురుష క్రియాస్వితః.' అందే 4 సూ.
3. 'తద్వత్తదాదిజస్య' అందే 8 సూ.
4. 'ప్రాయస్తు స్యాత్కిమాదికస్యేతః' అందే 9 సూ.
5. కవిశిరో. సంధి 14 సూ.
6. సం. ప్ర. వ్యాకరణాలు. 267 పు.
7. 'అది యవి శబ్దముల యత్తునకు వృత్తిని లోపంబు బహుళంబుగ నగు' బాలవ్యా. సంధి, 45 సూ.

అదియుట్టంతము మీఁ దనుగదిసిన
నాద్యచ్చుడుగు వికల్పముతోఁ గా
లిదికాలియది యనఁగఁ జే
తిదిచేతియదియని పలుకఁ దెల్లంబగుచున్[1]

ఇందు ఇ కారాంత శబ్దములకు 'అది' పరమగుచో దాని ఆద్యచ్చునకు లోపము చెప్పబడినది. చింతామణి 'ఇకారాంతము' అను దళమును వీడి 'శబ్దాత్' అను దళమును జేర్చెను. కావుననేశబ్దమునకు 'అదిశబ్దము' బరముగానున్నను 'నీ అవర్ణ' లోపము గలుగ వచ్చునన్నమాట. సూత్రమందలి తచ్ఛబ్దముచే బూర్వ వ్యాఖ్యాతలు 'అది' అనుదానిని మాత్రము గ్రహింప జిన్నయసూరి దాని బహు వచనమయిన 'అవి' యనుదానిని గూడ గ్రహించెను.[2]

ఇవి కేతన చెప్పని విశేషములు. కావున నీసూత్రముగూడ బూరకమన దగినదే కాని యనువాదము కానేరదు.

చింతామణి సంధి పరిచ్ఛేదాంతమున 'నలడాదేరంత రుతశ్చ' (నలడ మొదలగు వర్ణములందుగల ఉత్తునకు సంధి వైకల్పికము) 'అన్యేషా ఇచ్చ ప్రయోగ మహితానామ్' (ప్రయోగ ప్రసిద్ధములయిన యితరాచ్చులకును లోపము వికల్పము) అను సూత్రములున్నవి.

"సంధి అనేది రెండు భిన్న స్వతంత్ర పదాల కలయిక వల్ల కలుగుతుందని వైయాకరణు లందరూ ఎరిగిన విషయమే. అయినపుడు చింతామణిలో పద మధ్యా జ్లోపం గూడా సంధి పరిచ్ఛేదంలో చెప్పడమెందుకు జరిగిందని విమర్శకు ల సందేహాము.[3]

---

1. ఆం. భా. భూ. 51 ప.
2. బాలవ్యా. సంధి 45 సూ.
3. సం. ప్ర. వ్యాకరణాలు 268 పుట,

పరిమితౌ సమస్తానామ్ (పరిమాణార్థక ప్రత్యయము పరమగు నపుడు దాని యచ్చుతో నన్ని యచ్చులకు సంధినిత్యము) అని చింతామణియు [1] 'అంద్వవగాగమంబులందప్ప నపదాది స్వరంబు పరంబగు నపుడచ్చునకు సంధియగు' నని చిన్నయ సూరియు, ప్రకృతి ప్రత్యయములకు నడుమ సంధినంగీకరించుటచే బై విమర్శకుల సంధి నిర్వచనము తెలుగు వ్యాకరణ సంప్రదాయవిరుద్ధమగును. [2] సంధి నిర్వచనము వర్తించని ఆగమాదేశ లోప విషయములను గూడ సంహితగలవి కనుక సంధికి సన్నిహితములుగా భావించి వానినిగూడ సంధి పరిచ్ఛేదములో వ్రాయు సంప్రదాయము శ్రీ చిన్నయసూరి మొదలగు నాధునిక వైయాకరణులు గూడ పాటించినదే. [3] కావున నిది సంశయింపదగిన విషయము కాదు. ఈ సూత్రములకు మూలములని విమర్శకులు చూపిన పద్యములివి. [4]

తెలుఁగులలో నచ్చంబులు
డులు ఱులు నులు పదము తుది నడుమ గల్గినని
మ్ముల దాని మీది యుత్వము
పొలుపుగ హల్లుండెనేని పోవున్ నిలుచున్

మాఱు మండఁ జొచ్చె మార్మ్రండె వేల్మ్రట్టె
వ్రేలు మట్టె వేడ్క వేడుకయ్యె
గాఱు కాలమనఁగ గార్కాల మనఁ గాన్పు
కాను పనఁగ నెల్లకడల ఁ జెల్లు

---

1. కవిశిరో. సంధి 5 సూ.
2. బాలవ్యా. సంధి 11 సూ.
3. బాలవ్యా. సంధి 47 సూ. చూడుముచూడు. మువర్ణకలోపము, 32 సూ.ఆదేశము, 31 సూ. ఆగమము, ప్రౌఢవ్యా. సంధి 19సూ. ఆగమము, 20 సూ. ద్విరుక్తము, 16 సూ. ఏమిలోనిమి వర్ణలోపము, 17 సూ. ఆదేశము.
4. సం. ప్ర. వ్యాకరణాలు 269 పుట.

ఏక పదము నడిమి యిత్వ మొక్కొక తఱి
నచ్చతెనుఁగు లోననడఁగుఁ బోడముఁ
గూర్మి తాల్మి యనఁగఁ గూరిమి తాలిమి
యనఁగఁగృతులఁ జెల్లు చునికిఁ జేసి

అన కేతన పదమధ్యాంత స్వరములకు లోపములను జెప్పెను.[1]

ఇక చింతామణిలోని 'నలడాదేః' 'అన్యేషాం...' అను సూత్రము లీ పద్యములకనువాదములేనా యను విషయము పరిశీలింప దగినది. 'నలడాదేః ......' ఇత్యాది సూత్రము కేతన చెప్పని లకారమందలి ఉత్తునకు గూడ వికల్పలోపమును జెప్పినది. కావుననిది పూరకమగును.

ఇవిగాక 'చారేరుపధాత్మనశ్చలు గ్వాస్యాత్' (చివర్ణము పరమగునపుడు ఉపధగానున్న రివర్ణమందలి ఇకారమునకు లోపము వికల్పము) శత్రర్థే తూతశ్చనోః (శత్రర్థ చువర్ణము పరమగునపుడు ఉపధగానున్న ను వర్ణ మందలి ఉత్తునకు లోపము వికల్పము.) పోశ్చ తదాద్యర్థ వాచకేషూతః (అపుడు మొదలగు శబ్దములందు గల పువర్ణ మందలి ఉత్తునకు లోపము వికల్పము) అని మధ్యాజ్లోప విధులను జెప్పెను.[2]

ఇవి గాక ఉంగ్రము అనుచోట గ కారములోని అ కారము, ఇట్టులు మొదలగు పదములలో 'ట్టు'లోని టువర్ణము, అబ్బురము, అను చోట 'బ్బ' అను దానిలో 'బు' వర్ణము లోపించుచున్నవి. కప్పురములో పువర్ణము లోపించి క్రపము అయినది. తేటి తేంట్లు' పెండిలి పెండ్లి, అను శబ్దములందు టి, డి, అను వాని యందలి 'ఇత్తు' లోపించుచున్నది. దృష్టి అనుచో 'ష్టి' అనుదానిలో 'ఇత్తు' పోయినది'

---

[1] ఆం. భా. భూ. 64, 65, 66 ప.

[2] కవిశిరో. సంధి 11, 12, 15 సూ.

ఇందు క్రమము తేంట్లు పెండ్లి అనురూపములు ఆంధ్రశబ్ద చింతామణికి గొంచెము తరువాత వెల్లంకి తాతంభట్టు చెప్పినాడు.[1] ఇట్లు అనుదానికి నన్నయ భారత ప్రయోగము,[2] దృష్ట్లు అనుదానికి తిక్కన ప్రయోగము నున్నవి.[3] ఇందులో కొన్నియైన జింతామణి కర్త కంటబడి యుండును. వీనికన్నింటికి ప్రత్యేక లక్షణములను వ్రాయుట సంక్షేప ప్రియుడగు నాతనికి నచ్చియుండదు. కావున 'అన్యేషా ఇచ్చ ప్రయోగ మహితానామ్' అని వ్రాసియుండును.

కావున నీసందర్భమును గూడ కేవలానువాదముగా జెప్ప వీలులేదు. అనువాదమునే చేయదలచినచో కేతన 'ఏకపదము నడిమి యిత్వమునకు' వికల్ప లోపమును స్పష్టముగా జెప్పుచుండ నా విషయము నెత్తక ప్రయోగ ప్రసిద్ధములగు నితరములకు గూడ లోపము వికల్పమని సామాన్యాకారముతో నేల జెప్పును?[4] చింతామణి 'షష్ఠ్యాఉతోచినుమేన్' (షష్ఠ్యేకవచన సమాసమున ఉదంత పదమునకచ్చు పరమగునపుడు నుమ్ వచ్చును.)[5] అని చెప్పినది. సమాసములో వచ్చు నీఆగమమును సంధి పరచ్ఛేదములో నేల చెప్పవలెను? సమాస పరిచ్ఛేదములో చెప్ప వచ్చుగదా! తెలుగులో తక్కిన విభక్తులలో గూడ సమాస మేర్పడును గదా! ఈ సమాసమున షష్ఠీ విభక్తి నిర్దేశమేల చేయబడెనని విమర్శకుల సందేహములు.[6]

---

[1] కవి చింతామణి 1 - 99 ప.

[2] 'మీ జన్మములు ఇట్లు కాలె వినగ' ఆం. భా. ఆది. 6-59 ప.

[3] 'నృపతనయు దృష్ట్లు' ఆం.భా. విరాట. మద్రాసు: వావిళ్ళ, (1968), 4-114 ప.

[4] ఆం. భా. భూ. 66 ప.

[5] కవిజో. సంధి 17 సూ.

[6] సం. ప్ర. వ్యాకరణాలు 358 పుట,

చింతామణిలో వేరే సమాస పరిచ్ఛేదములేదు. అనగా సమాసములకు సంబంధించిన విషయముల నెక్కువగా జింతామణి చెప్పదలచలేదన్నమాట. సంహితకు కారణమైన ఆగమాదేశములను సంధికి సన్నిహితములుగా భావించి సంధి పరిచ్ఛేదములోనే తెలుగు వైయాకరణులు చేర్చిరని లోగడ యనుకొంటిమి. సమాసపరిచ్ఛేదమును వేర చెప్పిన శ్రీ చిన్నయ సూరి గూడ దీనిని సంధి పరిచ్ఛేదమందే చేర్చుట గమనింపదగినది.[1]

ఇక విభక్తి నిర్దేశము మాట. చిన్నయసూరి సూత్రమందు గూడ 'షష్ఠీ సమాసమునందు' అని విభక్తి నిర్దేశ పూర్వకముగనే పై విషయము చెప్పబడినది.[2] తత్పురుష సమాసమే విభక్తులలో నేర్పడునో ఆ విభక్తితో నా తత్పురుషమును నిర్దేశించుట సంప్రదాయము.[3]

ఇచట షష్ఠీ తత్పురుష సందర్భము వచ్చినది గనుక నాసమాసమట్లు విభక్తి నిర్దేశ పూర్వకముగా పేర్కొనబడినది. లక్షన ద్వితీయా తత్పురుషాదులలో నీ 'నుమ్' వచ్చుటలేదు. కావున వానికట ప్రసక్తి లేదు. 'నామైక దేశే నామ గ్రహణమ్' (పేరు యందొక భాగముచే మొత్తము పేరును గ్రహింపవచ్చును. 'భీమసేనుని భీముడు' అని వ్యవహరించినట్లు) అను సంప్రదాయముననుసరించి షష్ఠీ తత్పురుష సమాసమును షష్ఠీ సమాసమనుట దోషము కానేరదు. కేతన

---

1. షష్ఠీ సమాసము నందు కార ఋ కారముల కచ్చు పరమగునపుడు నుగాగమంబగు 'బాలవ్యా. సంధి 34 సూ.

2. అందే.

3. శ్రీనడిమింటి సర్వమంగళ శాస్త్రికృత సమాసకుసుమావళి శబ్దమంజ తత్పురుష సమాస నిరూపణమ్, హైదరాబాదు: శ్రీరామాబుక్ డిపో, 130 పు.

ఒనర నుఱ్ఱంత షష్ఠిపై నున్న యచ్చు
మొదలఁ బొల్లు నకారంబు గదిసినిల్చు
కొడుకు నాల్గూతు నొడమి నాఁగూడుఁగాని
కూతొడమి కొడుకాలనఁ గూడ జెందు

అని చెప్పెను. [1] కేతన షష్ఠీ సమాసమున బూర్వపదముదంత మగునపుడే దానికచ్చు పరమగునపుడు పర పదాద్యచ్చునకు మొదట నకారపు బొల్లు వచ్చుననెను. అతని విధానము ప్రకారము పొల్లు నకారము పరపదాంగ మగును. కాని పూర్వపదాంతమున గల షష్ఠీ విభక్తి లోపించుటచే నాయర్థమును సూచించుటకు వచ్చిన నువాగ మము పూర్వపదాంగమగుట ఉచితమను నుద్దేశ్యముతో చింతామణి దీనిని నుమ్ గా, ఉదంతమునకు జేయునదిగా జెప్పినది. [2] కేతన యిది షష్ఠీ సమాసమున వచ్చునని చెప్పలేదు. అతడిచ్చిన 'కొడుకునాలు' కూతునొడమి' అనునుదాహరణములను బట్టి యిది సమాస విషయ మని యూహింవపలెను. చింతామణి ఇది సమాస విషయమని స్పష్టము చేసినది. కాగా సిదియు గేవలాను వాదము కాదు.

చింతామణి నా, నీ, మన అను శబ్దములకు వివిధ విభక్తులలో బ్రక్రియను జూపినది.

తెలుగులో వాడు మొదలగు సర్వనామములనేకములుండగా చింతామణి పై మూడు సర్వనామములకే ప్రక్రియ నేల జూపెనని విమర్శకుల సందేహము. [3] వాడు అను సర్వనామము 'ఏకాదే రమహా

---

[1] ఆం. భా. భూ. 50 ప.

[2] "మిద చోఽంత్యాత్పరః" అను పాణినీయ పరిభాష ననుసరించి మకార మిత్తుగా గలది అంత్యాచ్చునకు బరముగను, దానికంతా వయవముగను వచ్చును. సిద్ధాంతకౌముది పరిభాష 37 సూ.

[3] సం, ప్ర. వ్యాకరణాలు. 268 పు.

తాంచడావున్న' (ఒక మొదలగు 'కొన్ని' అమహాద్వాచకములకు డు పరమగునపుడుత్వము రాదు.) అనుదానిచే సాధింపవచ్చును.[1] స్త్రీవాచకమైన అది అనుశబ్దము 'శబ్దాత్తచ్ఛబ్దాతః' (కాపు మొదలగు శబ్దము కంటె బరముగా నున్న అదియనుదాని 'అ' కారమునకు లోపము వికల్పము) అనుచోట చేర్కొనబడినది. ఆమె అనునది అర్వాచీనరూపమని తోచును. సూర్యరాయాంధ్ర నిఘంటువులో 'ఆమె' కు బ్రయోగము లేవియు నివ్వలేదు.[2] అనేక సర్వనామములను సాధించిన అథర్వణుడు' 'ఆమె' యను రూపమును సాధింపలేదు.[3] ప్రయోగములను దాహరించు నలవాటు గల ప్రౌఢ వ్యాకర్త గూడ 'ఆమె'కు బ్రయోగమును జూపలేదు.[5] కావున నీ పదమర్వాచీనమని పించును.

తెలుగు సర్వనామముల సాధనము గజిబిజి గానుండును. కావుననే శ్రీ చిన్నయ సూరి బాలవ్యాకరణమున సర్వనామరూపములను బ్రదర్శించెనే కాని వాని ప్రకృతి ప్రత్యయ విభాగము చూపుటకు బూనుకొనలేదు.[5] పరిణతుల నుద్దేశించి సూత్రాంధ్ర వ్యాకరణాదులలో సర్వనామములకు గూడ రూపసాధనము నాతడు చూపినాడు.

సంక్షిప్త ప్రియుడగు జింతామణి కర్త గజిబిజితనము సంగీకరింపక తక్కిన సర్వనామప్రక్రియను వీడి యుండవచ్చును. అట్లు జింతామణి కర్త అది మొదలగువానికి రూప సాధనమును వీడి యుండవచ్చును.

---

1. కవిశిరో. అజంత. 52 సూ.
2. సూ. ని. 1 భా. 430 పుట,
3. కవిశిరో. అజన్త. 59 సూ.
4. ప్రౌఢ. సర్వనామ. 56 సూ. వృత్తి.
5. బాలవ్యా. అచ్ఛిక. సర్వనామ. 24 సూ. వృత్తి.

కేతన[1] పెద్దన[2] అస్మద్యుష్మత్సర్వనామములకు రూప ప్రదర్శనమును మాత్రమే చేసిరి. చింతామణి వీనికి, ఆత్మార్థకమునకు, ఉభయార్థకమునకు గూడ ప్రకృతి ప్రత్యయ విభాగ పూర్వక రూప సాధనమును జేసియున్నది.[3] కావున వానికిది పూరక మనవలసి యున్నది.

పై పరిశీలనముచే కేతన లక్షణములకు చింతామణి కేవలానువాదము కాదనియు నది కేతన లక్షణములకు వివరణ పూరణములను చేసినదనియు స్పష్టమైనది.

కావుననే ‘చింతామణి కర్త కేతననే అనుసరించాడని’యు,[4] ‘ఒక క్రియా విభక్తుల ప్రతిపాదనంలో క్రియాపద నిష్పాదనంలో తప్ప చింతామణీకర్త ఆంధ్ర భాషా భూషణాన్ని అధికంగా అనుకరించి అనువదించి ఉన్నాడు’ అనియు[5] భావించిన డాక్టర్ ఆకురాతి పున్నారావుగారు గూడ అతని (కేతన) రచనా ప్రణాళిక స్వీకరించినా దానిని మెరుగుపరచి పెంచి ఉపయోగించుకొన్నా’డని అంగీకరించినారు.[6] కేతన వ్రాసిన 193 పద్యములలో 48 పద్యములకు మాత్రమే చింతామణి సంబంధమును విమర్శకులు చెప్పిరి.

మొత్తము	193
చింతామణి సంబంధము గలవిగా విమర్శకులు చెప్పినవి	48
చింతామణికి మూలములుగా జెప్పనివి	145

---

1. ఆం. భా. భూ. 105 నుండి 109 ప.
2. కావ్యా. చూ. 9-116 నుండి 120 వరకు.
3. కవిశిరో. హాలన్త. 14 నుండి 22 వరకు.
4. సం. ప్ర. వ్యాకరణాలు 270 పు.
5. అందే 371 పు.
6. అందే 270 పు.

చింతామణి సంబంధములేని లక్షణము లాంధ్రభాషా భూషణములో 63 కలవు. అందు క్రియా సంబంధమైనవి 17 ఉన్నవి.

అనగా దాదాపు సగము గ్రంథమును చింతామణి గ్రహింప లేదన్నమాట.[1] ఆ లక్షణములలో తాను బూరణాదికమును జేయ వలసిన అవసరము లేకుండుటచేత జింతామణి వానిని స్పృశింపలేదని భావింపవచ్చును.

వాస్తవమిట్లున్నందున మొత్త మాంధ్ర భాషా భూషణమును జింతామణి ఉపయోగించు కొనినదనియు, అందలి లక్షణములనే చింతామణి కర్త సంస్కృతీకరించెననియు జెప్పుట సత్యదూరము.

చింతామణి కేతనాదుల వ్యాకరణములకు కేవలానువాదమను వాదము వీగిపోయినది. ఇక చింతామణిలో లోపములుగా జూపబడిన వానిని బరిశీలింతము.

చింతామణిలో లోపాభాసములు

విమర్శకులు చింతామణిలో పలులోపములున్నవని చెప్పుచున్నారు. వారు చెప్పిన వన్నియు లోపములే అయినచో చింతామణి అధమ గ్రంథము కావలెను. మహోపాధ్యాయుడగు బాలసరస్వతి, అనేక గ్రంథ పరిశీలన దక్షుడగు నప్పకవి, అభినవ నన్నయభట్టారకుడు మహోపాధ్యాయ భట్టారకుడైన అహోబలపతి, అష్టభాషాకవిత్వ సామ్రాజ్య పట్టభద్రుడైన వాసుదేవ కవి, వ్యాకరణ తపస్వి చిన్నయసూరి మొదలగు పండిత కవులొక అధమగ్రంథమును బరమ ప్రమాణముగా గ్రహింతురా? అను సంశయము కలుగును. కాన విమర్శకులు లోపములుగా జెప్పిన వానిని జూచి యవి లోపములగునేమో పరిశీలింప వలెను.

---

[1] అనుబంధము ఇ - 'చింతామణి స్పృశింపని ఆంధ్ర భాషా భూషణ లక్షణములు.

'అద్యః క్రియాసు భూతార్థద్యోతిన మాద్యగం వినాసర్వః' ఈ సూత్రమునకు బాలసరస్వతి వ్యాఖ్య యిది. "క్రియా పదములయందు భూతార్థములం గనిపించునవియు, నామాది నుండునవియు, వినాగాను, సమస్తమైన యకారమును అకారము, అనగా తలకట్టనుట. చనియె వినియె మొదలైనవి క్రియా భూతార్థ స్థితయెకారములు. యెమ్మె, యెప్పుడు మొదలైనవి నామాదినున్న యెకారములు. ఈ రెండును విడిచిపెట్టి కడమ యకారములెల్ల దలకట్టుగా దెలియునది." [1]

ఈ సూత్రం తాను నిర్దేశించిన స్థానంలో ఏ అచ్చు ఉంటుందో చెప్పకపోవడం, నిరుద్దేశంగా ఇతర స్థానాల్లో అన్నిచోట్ల అకారంతోటే యకారం ఉంటుందనడం ఏమి రచనో తెలియదు. ఈ సూత్రానికి అవ్యాప్తులు, అతివ్యాప్తులు కొల్లలు. దాని ప్రకారం వ్రాయుట, చేయము, అయ్యెడన్, ఏయుచున్, కొనియెడువారు, చేయుదురు, దోయిలి, చెయిది, అయారె, ఊయెల వంటి పదాలు తప్పుకావలసి వస్తుంది. అంత అసంబద్ధంగా, అస్పష్టంగా చేసిన సూత్ర రచన నన్నయ్య కంటగట్టుట యెందుకని విమర్శకులు ప్రశ్నించిరి. [2] ఈ విషయము పరిశీలింపదగినది.

బాల సరస్వతి వ్యాఖ్య ననుసరించుటచే కలిగిన అసందర్భమిది. ఇచట ఆయన వ్యాఖ్యలో కొన్ని లోపములున్నవి. ఇందు ఆద్యగమను పదమునకు నామాది నుండునవని యర్థమును వ్రాసెను. ఆది యందుండునది ఆద్యము. ఆద్యమును బొందినది ఆద్యగము. యెనడు అనుపదమున కాది యందున్నది యకారము. కావున అది ఆద్యము. దానిని ఆద్యగ మననక్కర లేదు. ఇది పదాది యకార విషయమని చెప్పుటకు సూత్రములో ఆధారము లేదు.

---

1. ప. బాలస. సంజ్ఞ 8 శ్లో.

2. సం. ప్ర. వ్యాకరణాలు 205 పు.

'యః, అత్' అనుచోట యకారము అకారము తలకట్టనుట' అని యితడు వివరణమును వ్రాసెను. దీనికి యకార మకారముతో కూడియుండునను విధి స్ఫురించును. ఇచ్చట సూత్రములో విధిలేదు. లేని విధిని కల్పించుటచే వ్రాయుట చేయుము అయ్యెడున్ మొదలయిన పట్టికలో అకార ముండునను నపార్థము కలుగు చున్నది. కావున నీవ్యాఖ్యపై నాధార పడుటచే పై విమర్శలు కలిగినవనవలెను.

ఈసూత్రమున కిట్లర్థమును జెప్పవచ్చును. సర్వఃఅద్యః=సమస్తమైన అకార మిశ్రయకారము, క్రియాసు = క్రియలయందు, భూతార్థద్యోతినం=భూతార్థమును తెలుపుదానిని, ఆద్యగం=తద్ధర్మవర్తమానాతీతాగామి క్రియలలో ఆద్యమైన తద్ధర్మ క్రియ యందున్న దానిని, వినా=విడచిఉండును.

చింతామణి తద్ధర్మవర్తమానాతీతాగామి క్రియలను వరుసగా చేర్కొనినది [1] అందాద్యమయిన తద్ధర్మమునిచట ఆ ఆద్యశబ్దముచే చేర్కొని యుండును. ఈ క్రమము ననుసరించి వర్తమానాగామి క్రియలను ద్వితీయ తుర్యములుగా చింతామణి వ్యవహరించినది. [2] తద్ధర్మమును వేరొకచో ఆద్య శబ్దముచే నీ గ్రంథము వ్యవహరించినది గూడ. [3] కావున నీయర్థమును జెప్పుట ఉచితమే. అట్లే అద్యః అను దానికి 'యకారము అకారముతో కూడి యుండును.' అని విధిగా జెప్పరాదు. అచట విధిలేదు. ఈ పద్ధతిలో అత్, యః అనువాని కన్వయము గూడ కుదురుటలేదు. అద్మిశ్రమయిన యకారము అను విగ్రహముతో మధ్యమ పదలోపి చెప్పుటచే అద్యః అని యేర్పడును.

---

[1] కవిశిరో. క్రియ 9 సూ.

[2] అందే 10 సూ.

[3] అందే 32 సూ.

ఈ వ్యాఖ్య ననుసరించి క్రియల యందు అకారముతో గలిసిన యకారము భూత తద్ధర్మములలో నుండదను భావము వచ్చును. భూత తద్ధర్మము లందలి యకారమే అచ్చుతోఁగూడి యుండునని ప్రశ్న.

'ప్రథమైకస్యైద్భవేచ్చ భూతార్థే' (భూతార్థమున ప్రథమ పురుషైక వచనమున ఎత్వము వచ్చును.)[1] అను విధిచే చనియెను, పోయెను ఇత్యాదులలో యకార మెత్వముతో గలసి యుండును. పోయెదరు ఇత్యాది తద్ధర్మక్రియలలో యకార మెత్వముతో నున్నది. ఇట్లు వ్యాఖ్యానించుటచే ఈ సూత్రమున కవ్యాప్త్యతివ్యాప్తి దోషములు కలుగవు. ఇదిక్రియలకు సంబంధించిన సూత్రమగుటచే క్రియేతరములందిది వర్తించుట లేదు. క్రియలలోఁగూడ అన్మిశ్రయకారము తద్ధర్మాతీత క్రియలను వదలి యుండుననియే కలదు గాని తదితరములందు అన్మిశ్రయకారము వచ్చి తీరునను విధి లేనందున వ్రాయుట మొదలగు చోట్ల యకారాదులుండుట విరుద్ధము కానేరదు.

ఈ సూత్రము తాను నిర్దేశించిన భూత తద్ధర్మములలో నున్న యకారమే యచ్చుతోఁ గూడి యుండునో చెప్పక పోవుటకు హేతువిది. భూతార్థమున ఎత్వము వచ్చునని వేఱొక చోట చెప్పుటచే నా విషయమిచట చెప్పనక్కరలేక పోయినది. యకారము గలిగిన తద్ధర్మ క్రియలు (1) చేయును, చేయదురు, (2) పోయెడిని పోయెదరు అని రెండు వర్గములుగా నున్నవి. ఇందు మొదటి వర్గమందలి క్రియలనే చింతామణి సాధించినది. వీనియందు 'ఉ' కారయుక్తమై యకారము కానవచ్చును. రెండవ వర్గమందు ఎత్వసహితమయిన యకారమున్నది. వీనిని పూర్వ లాక్షణికులు వర్తమానార్థకములుగా జెప్పిరి.[3]

---

1. కవిశిరో. క్రియ. 30 సూ.
2. కవిశిరో. క్రియ. 30 సూ.
3. కేతన ఆం. భా. భూ. 143 ప. పెద్దన కావ్యా. 9 ఉ. 150, 157 పు.

చింతామణిలో వర్తమానార్థమున 'ఉన్న' అను ననుబంధమును, భావ్యర్థమున 'కల' అను ననుబంధమును, భూతార్థమున ఇత్వమును ఎత్వమును విధించబడినవి. ఏతత్త్రితయ విలక్షణ మగుటచే పోయెడిన్ పోయెదరు మున్నగువానిని తద్ధర్మములుగనే చెప్పవచ్చును. కావుననే చిన్నయసూరి కూడ వీనిని తద్ధర్మము లందే చేర్చెను.[1] వానిని గూడ ఎత్వయుత యవర్ణము కలవిగా జెప్పవలసి యుండును. కాని చింతామణి సంస్కృత సమములను దృష్టిలో నిడుకొని ప్రక్రియ జెప్పినది. సంస్కృత సమధాతువులకు స్వార్థమున ఇంచుగాగమము వచ్చును. వానికి ఎదగాగమమును జేర్చుటచే రక్షించెదరు, ఘటించెదరు సుఖించెదరు వంటి రూపము లేర్పడును. ఈ 'చెద' అనుదానితో గూడిన రూపము లితనికి నచ్చియుండక పోవచ్చును. కావున వీటిని ప్రత్యేకముగా సాధింపలేదు.

కాని సంజ్ఞాపరిచ్ఛేదమున దేశ్యపదములలో ఉచ్చారణ సంశయములను దీర్చబూనినపుడు పోయెదరు వంటి ఎదగాగమ యుక్త రూపములలో అత్వముండదని చెప్పవలసి వచ్చినది. ఇట్లు తద్ధర్మ క్రియలలో వైవిధ్యముండుటచేత వానిలో యకారమే స్వరముతో గూడి యుండునను విషయమును లక్ష్యముల ద్వారా గ్రహింపుడని పాఠకులకు వదలినాడు. అచట అకారయుతయకారము మాత్రముండదని తెలిపినాడు.

ఇక నిచ్చట అత్వయుత యకార మెక్కడెక్కడ కలదో ప్రత్యేకముగా జెప్పక పోవుటకు హేతువును గమనింపవలెను. చింతామణి వేరొకచోట భావ్యర్థమున, వ్యతిరేకార్థము మొదలగుచోట్ల అత్వము వచ్చునని చెప్పినది.[2] కావున దానినిచట పునరుక్తము

---

1. బాలవ్యా. క్రియ 23 సూ.
2. కవిశిరో. క్రియ 16 సూ.

చేయనక్కరలేదు గదా! ఇక తద్ధర్మ వర్తమానాతీతాగామములలో మిగిలినవి వర్తమాన క్రియలు. ఇందు యకారముత్వముతో గాని కనిపించుటలేదు. కాని అచట సంశయము లేనందున వానిని గూర్చి వేరే చెప్పలేదు.

కాగా నీ సూత్రములో లోపములున్నవను విమర్శయుక్తము కాదు.

సర్వత్రా జ్వత్కార్యం జ్ఞేయం యస్య

'అద్యఃక్రియాసు' ఇత్యాది సూత్రములో 'ఆద్యగం' అనుదానికి పదాది యకారమర్థము కానిచో 'సర్వత్రాజ్వత్కార్యం జ్ఞేయం యస్య' (అంతట యకారమున కచ్చునకు వలె కార్యము లగును) అనునతిదేశము వ్యర్థమగును గదా![1] కావున 'ఆద్యగం' అనుదానిచే బదాది యకారము నంగీకరింపవలెనని పూర్వపక్షము చేయవచ్చును. దానికి సమాధానమిది.

చింతామణి 'యశ్రుతి మార్యా లఘుయంప్రవదన్తి ప్రాణతః పరంప్రాణమ్' (అచ్చుకంటె పరముగానున్న అచ్చును లఘుయకార శ్రవణముగలదానినిగ చెప్పుచున్నారు) అనియశ్రుతిని దెల్పినది.[2] దీనిని చిన్నయసూరి సంధిలేనిచోట ప్రవర్తించు యడాగమముగా జెప్పెను. ఇందట్లు చెప్పబడకుండుట గమనింపదగినది. ఈ యశ్రుతి సంధి చేయవలసినచోట, సంధి వర్తింపనిచోట గూడ ప్రాప్తించవలసి యున్నది. సంధిపరిచ్ఛేదముకంటె ముందే యశ్రుతివిధి యుండుటచే నిట్లు చెప్పవలసి వచ్చినది. దీని కపవాదముగా "సర్వత్రాజ్వత్కార్యం జ్ఞేయం యస్య" అను విధి బయలుదేరినది. దీనిచే ఉకారాది సంధులు

---

[1] కవిశిరో. సంధి 26 సూ.

[2] అండే సంజ్ఞ 21 సూ.

బ్రవర్తింపవలసినచోట, యశ్రుతి మొదట ప్రాప్తించును కాని సంధి లేనిచోట మాత్రమే యశ్రుతి నిలుచును. పైయపవాద సూత్రముచే తక్కినచోట్ల యశ్రుతితో కూడిన స్వరమచ్చువంటిదయి సంధ్యాదికమును బొందును. ఇట్లు చెప్పుటచే రాముడు + ఎవడు = రాముడెవడు, రాముడు + అతడు = రాముడతడు, హరి + ఇతడు = హరియితడు, అనురూపములు సిద్ధించును.

ఉత్సర్గాపవాదపద్ధతిలో జెప్పబడిన పై విషయమును "సంధి లేనిచోట స్వరంబుకంటెం బరంబైన స్వరంబునకుయడాగమం బగు" నని సూరియొక సూత్రముచే సంగ్రహించెను.[1]

మఱియు చింతామణి వళిని 'వళిరాద్యం' అను సూత్రముచే జెప్పినది. కావున యతిస్థానమున యకారమచ్చువంటిదగునను విషయమును గూడ నిచ్చట సూచించి యుండవచ్చును. ప్రాచీనుల వ్యాఖ్య ననుసరించి 'సర్వత్రాజ్వత్కార్యం జ్ఞేయం యస్యైదుత్ప్రకృతికేభ్యః' అని సూత్రచ్ఛేదముచేసి కేవలపదాది యకార విషయముగా నీ సూత్రము వ్యాఖ్యానించినచో 'సర్వత్ర' యను దళము వ్యర్థమగును. రామున్ + యింతి అనుచోట మాత్రమే అజ్వద్భావము ప్రవర్తించి సంహిత గలుగును. రాముడు + యెవడను చోట సంధి ప్రాప్తికి దారియుండదు. కావున పైన జెప్పబడిన వ్యాఖ్యయే మూలకారుని భావమును వెల్లడిచేయును.

అద్దన్త్యౌ స్తాలవ్యౌశ్చవర్గ స్సాన్త్యౌన్మిథస్సవర్ణౌశ్చ

"దంత్యమైన చవర్గము అకారము, తాలవ్యమైన చవర్గము ఎకారము (కలది) అగును. దంత్యతాలవ్యములు రెండును దమలో

---

[1] బాలవ్యా. సంధి ౨ సూ.

డాము సవర్ణములవును" అని యీ సూత్రమునకు బాలసరస్వతి వివరణము.[1]

ఈ వ్యాఖ్యప్రకారము ఓ ఓలతో గూడిన చజలు తాలవ్యములను నపార్థమీసూత్రమునకు గలుగుచున్నదని డాక్టర్ చిలుకూరి నారాయణరావు తెల్పియున్నారు.[2]

చఱకు - చెఱకు, జండా - జెండా, చాట - చేట, జాన - జేన, చాద - చేద, చాప - చేప మున్నగుచోటులందు అత్వవిశిష్టము సాధువా ? ఎత్వవిశిష్టము సాధువా ? అనుసందేహమును వారించుటకు మాత్రమే ప్రకృత సూత్రము బయలుదేరెనని కళాప్రపూర్ణ వఝల చిన సీతారామస్వామి శాస్త్రిగారు తెలిపిరి.[3]

వీరి యుద్దేశ్యములో చేటయన వలెనా చాటయనవలెనా యను సందేహము వచ్చినపుడీ సూత్రము సమాధానించును: గావున ఒ ఓలతో గూడిన చజల విషయమున నీ సూత్రము ప్రవర్తింపదు. ఇట్లు చెప్పిపైన జూపిన యనుపపత్తిని వీరు వారించినారు.

కాని యిట్లు చెప్పినచో చేట, చాపయను పదములందున్న చకారములకు సావర్ణ్యమును చెప్పవలసి యుండును. ఈ రెండింటికి యతి పనికిరాదు గాన ప్రాసకు మాత్రము దీని యుపయోగము పరిమితమగును. సందిగ్ధ స్థలమునందు మాత్రమే యీ సూత్రము వర్తించుననుట చేత ఉ ఊ ఒ ఓ ఇ ఈ లతో గూడిన చజలకీ సూత్రము ప్రవర్తింపదన వలెను.

---

1. ప. బాలస. 10 పు.
2. ఆం. భా. చ. - 1579 పు.
3. వై. పారిజాతము 575 పుట.

'కచటతపాస్తు పరుషాః' 'గజడదబాస్తు సరళాః' అని పరుష సరళ సంజ్ఞలను విధించిన సూత్రములలోని చజలకు తాలవ్యోచ్చారణముండి యుండవలెను. సంస్కృతమున దంత్యచజలు లేకుండుట యిట్లు చెప్పుటకు గారణము. ఆ సూత్రములు సంస్కృత భాషలోనే రచింపబడినవి గదా! ఒకవేళనవి దంత్యోచ్చారణముతో రచింపబడినవని చెప్పినచో తాలవ్యచజలకు పరుష సరళ సంజ్ఞలు సిద్ధించవు. కావుననీ దంత్య తాలవ్య చకారములకు పరుష సంజ్ఞ, దంత్య తాలవ్య జకారములకు సరళ సంజ్ఞ సిద్ధించుటకు దన్త్యతాలవ్యములకు సావర్ణ్యమును విధింపవలసి యున్నది. అట్లు విధించుటకు అగ్దన్త్యేత్యాది సూత్రము తప్ప మఱి యొకటి కానరాదు. కావున నీ సూత్రము కేవల సందిగ్ధ విషయ నిర్ణాయకమని నిర్ణయింప వీలులేదు. అట్లు చెప్పనిచో ఒ ఓలతో గూడిన చ, జలు గూడ దాలవ్యములగు నను నపార్థమువచ్చునంటిరి గదా! గతియేమి? మూలకారుని హృదయమేమి? పరిశీలింతము.

ఇంతకు ముందు సూత్రము, 'నాన్యేషాం వైధర్మ్యం లఘ్వలఘూనాం రయోస్తు నిత్యంస్యాత్' (లఘ్వలఘువులయిన యవలలకు వైరుధ్యములేదు. రఱలకు మాత్రము వైధర్మ్యము గలదు) అనునది.[1]

ఇదిరఱల వైధర్మ్యమును గుఱించి చెప్పుసందర్భము. ఏకాకారములో గనబడుచున్న రఱలకే వైధర్మ్యమును విధించుచున్నచో భిన్న స్థానములు గలిగిన దంత్యతాలవ్యచజలకు వైధర్మ్యముండునని సహజముగా దోచునుగదా! దీనిని నివారించుటకీ సూత్రము బయలుదే యుండును. కావున నిటదంత్యతాలవ్యములయిన చజలకు వైరుధ్యము లేదని చెప్పుటలో నౌచిత్యమున్నది. కాని ఏ స్వరముతో గూడిన చజలకయినను సావర్ణ్యము చెప్పవలెను. కేవలము అకార వక్రవర్ణములతో గూడిన వానికి మాత్రమే సావర్ణ్యము చెప్ప నేలయని ప్రశ్న.

---

[1] కవిశిరో. సంజ్ఞ 22 పు.

కళాప్రపూర్ణ వఝుల చిన సీతారామ స్వామి శాస్త్రిగారు చెప్పినట్లు చేట జేన ఇత్యాదులలో దంత్యోచ్చారణమా ? తాలవ్యోచ్చారణమా యని సందేహము గలుగుచున్నది. అట్టిసందేహము గల్గు చోటులోనే సావర్ణ్యమున్నదని చెప్పుచుండగా తక్కిన చోట్ల వైధర్మ్యము లేదని వేరే చెప్పనక్కరలేదు గదా !

కావున అద్ మిశ్రమయిన (అకారముతో గూడిన) దంత్య చవర్ణము తాలవ్య మయిన వక్రవర్ణముతో గూడిన చవర్ణము గూడ పరస్పర సావర్ణ్యము గలదగునని సూత్రతాత్పర్యము చెప్పవచ్చును. అనగానిది వైధర్మ్య నిరాకరణ ప్రాధాన్యము గలదియే కాని అకార వక్రములతో గూడిన చజలకు దంత్యతాలవ్యత్వములను విధించుటలేదని తాత్పర్యము. ఇట్లు చెప్పుటచే ఒ ఓ లతో గూడిన చజలు తాలవ్యములను నపార్థమీ సూత్రమునకు రానేరాదుగదా !

వర్ణకము

చింతామణి వర్ణకసంజ్ఞను జెప్పినది. "ప్రత్యయాన్ని వర్ణకంగా చెప్పడంవలన సిద్ధించిన ప్రత్యేక ప్రయోజనం కనబడడంలేదు" అని ఒకరు వ్రాసినారు.[1] చింతామణి కర్త లాఘవ ప్రియుడు. తన భావము నొకచో సూచించునేగాని ప్రతి విషయమును వివరముగా జెప్పడు. సంస్కృతమున సమాసమున్నది. కేవలము తెలుగు పదములతో నేర్పడిన సమాసములను సమాసకము లనవలెనని ఒకచో తెల్పినాడు.[2] ఇట్లు క ప్రత్యయము చేర్చుటచే నవి తెలుగువని మనమింక గ్రహింపవలెను. ప్రత్యయ పదము సంస్కృత ప్రత్యయములను దెలుపును. 'ప్రత్యయ ఇహావర్ణకః' (ఈ తెలుగున ప్రత్యయము

---

1. సం. ప్ర. వ్యాకరణాలు 156 పుట.
2. కవిశిరో. హలంత 46 సూ.

వర్ణకము) అని యాతడు చెప్పెను.[1] అనగా కేవలము తెలుగు ప్రత్యయములకు వర్ణకములని పేరన్నమాట.

తెలుగున తత్సమ తద్భవములు, దేశ్యపదములు నుండుటచే నిచట సంస్కృతాంధ్ర ప్రత్యయములను వేఱుగా వ్యవహరించుట అవసరమని యతడు భావించెను. కావున వేరే సంకేతము నేర్పరచుకొనెను. కావున నిది నిష్ప్రయోజనము కాదు.

ప్రాణము – ప్రాణి

ప్రాణము అచ్చునకు, ప్రాణి హల్లునకు పేరు. 'ఈ పేరు పెట్టడం చింతామణి ఎందుకు చేసిందో తెలియ'దని ఒకరు వ్రాసిరి.[2] ఇవి చింతామణి కర్త కంటె బూర్వుడగు త్రిలింగ శబ్దానుశాసనకర్త అథర్వణుడు పెట్టిన పేరులు.[3] తనకు ముందున్న ఆంధ్రవ్యాకర్త పెట్టిన సంకేతములను దరువాతివాడు గౌరవముతో స్వీకరించుట జరుగుచుండును. ఇచట చింతామణి చేసిన పని అదియే.

తమిళములో ప్రాణము (అచ్చు) నకు సమానార్థకముగా ఉయిర్ అనియు, ప్రాణి (హల్లు) కి సమానార్థకముగా ఉయిర్ మెయ్ అనియు కలవని ఆచార్య బొడ్డుపల్లి పురుషోత్తముగారు తెలిపినారు.[4] ఆ తమిళ పదములను బట్టి యీ ప్రాణ ప్రాణి సంజ్ఞలు త్రిలింగ శబ్దానుశాసన కర్త ఏర్పరచి యుండవచ్చును. సంస్కృతమున ప్రాణ

---

1. కవిశిరో. సంజ్ఞ 25 సూ.
2. సం. ప్ర. వ్యాకరణాలు 157 పు.
3. త్రిలింగశబ్దానుశాసనము 1 కాం. 8 శ్లో.
4. తె. వ్యా. వికాసము ప్రథమ. గుంటూరు : శ్రీగిరిజా ప్రచురణలు (1969).

పదమునకు 'స్వరమ' ను నర్థము కలదని తెలియుచున్నది.[1] దీనినైన త్రిలింగ శబ్దానుశాసన కర్త గ్రహించి యుండవచ్చును.

ప్రాణము - ప్రాణి సంజ్ఞలను జింతామణి కల్పింపలేదనియు బూర్వ వ్యాకరణ సంప్రదాయములో నున్న విందు గ్రహింపబడిన దనియు సారాంశము.

"ద్రుతాఖ్యోనః" ఈ సూత్రమునకు నకారము ద్రుతమను పేరుగలది అని బాలసరస్వతి వివరణము.[2] ఈ సూత్రమునకు నకారపు పొల్లు ద్రుతమను నర్థమును జెప్పవీలులేదని డాక్టర్ చిలుకూరి నారాయణరావుగారు తెల్పియున్నారు.[3] నకారము, ద్రుతాఖ్యః = ద్రుతమను పేరుగలది అని చెప్పినచో అత్వముతో గూడిన నకారము ద్రుతమను నర్థము వచ్చునని వారి భావము. అనగా 'న' కారపు పొల్లు ద్రుతమని గ్రంథకర్త హృదయమైనను తదనుగుణమైన సూత్ర రచన జరుగలేదని వారి యాక్షేపము,

సంస్కృత వ్యాకరణ సంప్రదాయమున హలుచ్చారణమున సౌకర్యమునకై అకారమును జేర్చుకొనుట ప్రసిద్ధవిషయము. మాహేశ్వర సూత్రములందలి హల్లులలో 'అ' కారముచ్చారణ సౌకర్యము కొఱకు జేర్చబడెనని భట్టోజీ దీక్షితులు చెప్పెను.[4]

---

[1] శబ్దార్థ కల్పతరువు. 915 పుట.

[2] ఆం. భా. చ. 1591 పుట.

[3] ప. బాలస. 11 పుట.

[4] హకారాదిష్వకార ఉచ్చారణార్థః వైయాకరణ సిద్ధాన్త కౌముది 1 పుట.

సారస్వత వ్యాకరణము నందలి వర్ణ సమామ్నాయ సూత్రములలో గూడ హలుచ్చారణమున సౌకర్యమునకు అకారమును జేర్చుకొనుట కలదు.[1] కావున బాలసరస్వతి చెప్పినట్లు నః=నకారమని యర్థము చెప్పినను అకారముచ్చారణ సౌకర్యము కొఱకు జేర్చబడినదిగా భావించినచో 'నకారహా పొల్లు' అనునర్థము వచ్చుట కాటంకము లేదు. కావున నిట్టి చిన్నవిషయము లందు చింతామణి కర్తది అసమర్థ రచన అని యాక్షేపించరాదు.

వక్ర వక్రతమములు

ఒకరు "హ్రస్వాలయిన ఎ, ఒలను వక్రాలుగా స్వీకరించడం చింతామణికి సమ్మతం కాదనియు వక్రసంజ్ఞకు వినియోగం ఆంధ్రశబ్ద చింతామణిలో కనబడ్డం లేదు" అనియు భావించిరి.[2]

దీనికి వీరు చూపిన హేతువు 'ఏదంతతా నామ్నామన్యతరస్యామియాంతానామ్ (ఇయ అనునదంతమున గల నామములకు వికల్పముగా ఎదంతత వచ్చును).[3] ప్రథమైకస్యైద్వా భూతార్థే (భూతార్థమున ప్రథమ పురుషైకవచన క్రియాపదమునకు ఎత్వము వచ్చును).[4] అను సూత్రములందు చింతామణి కర్త హ్రస్వ వక్రసంజ్ఞను వాడకపోవుట. హ్రస్వవక్రసంజ్ఞను వాడినచో ఇచట ఎ వర్ణము వచ్చునని స్పష్టముగా దెలిసియుండుననియు, 'ఏత్'ను

---

1. స్వరహీనం వ్యఞ్జనమ్. తేష్వకారః సుఖోచ్చారణత్వాదిత్సంజ్ఞకమ్ శ్రీ మదనుభూతి స్వరూపాచార్యులు; సారస్వత వ్యాకరణమ్, ముంబయీ : క్షేమరాజ్ శ్రీకృష్ణదాస్, (1978), 10 పు.
2. తె. వ్యా. సం. ప్రా. వ్యా. ప్రభావం 23, 22 పు.
3. కవిశిరో. అజంత. 81 సూ.
4. అందే క్రియ. 30 సూ.

నువిధించుటవలన హ్రస్వమో దీర్ఘమో తెలియకుండ పోయినదనియు వీరి భావము.

చింతామణి వక్రసంజ్ఞ నేర్పరచినది కాని హ్రస్వ వక్ర సంజ్ఞను జెప్పుకొనలేదు. వక్రశబ్దముచే హ్రస్వదీర్ఘములు రెండును గ్రహింపబడునవకాశముండుటచే దానిని వాడినను స్పష్టత కలుగు నవకాశములేదు. చింతామణి సంస్కృతములో వ్రాయబడినది. ఆ భాషలో ఎ, ఒ లు లేవు కదా! మన లిపి బ్రాహ్మిలిపి నుండి యేర్పడినది. ఆలిపిలో హ్రస్వములయిన ఎ, ఒ, అనునవి లేవు. దాని నుండి ఏర్పడిన తెలుగు లిపిలో గూడ మొదట ఎ, ఒ. లకు ప్రత్యేక లిపులు లేవు. ఉన్నవి దీర్ఘలిపులు మాత్రమే. వానిని 'ఎ, ఒ' అని వ్రాసెడివారు. పాఠకులు సందర్భానుసారముగా హ్రస్వదీర్ఘములను జదివెడివారు. తరువాతి కాలమున లేఖకులు వీనిని హ్రస్వములని భ్రాంతిపడి, వీసకి కుడివైపున ప్రత్యేక సంకేతమును వ్రాసినారు.[1] ఈ పద్ధతిచే హ్రస్వదీర్ఘములను స్పష్టముగా జదువు నవకాశముకలుగు చున్నది. కావున ఈపద్ధతి వ్యాప్తినందినది. కాని అంతకు ముందు

---

[1] 'సంస్కృత ప్రాకృతాలలో హ్రస్వఏకారంలేదు గనుక తెలుగు పదాలు వ్రాసినప్పుడు సందర్భానుగుణంగా హ్రస్వదీర్ఘాలతో చదవ వలసి వచ్చేది. తర్వాత ఈ దీర్ఘఏకారాన్నే హ్రస్వంగా భావించి దీర్ఘాక్షరం చూపడానికి ఆ అక్షరం కుడివైపున చెక్కారు. ...ఎ, ఏ, ఒ, ఓ ల హ్రస్వదీర్ఘాల భేదం 15 శతాబ్దివరకు అంతగా పాటించినట్లు కనిపించదు.'

శ్రీ తిరుమల రామచంద్ర 'తెలుగు లిపి పరిణామం' *తెలుగు భాషా చరిత్ర* ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి సంకలనము, హైదరాబాదు: ఆం. సా. అకాడమి (1974), 346, 347 పు.

దీర్ఘమును సూచించు 'ఏ' అను లిపి తరువాత హ్రస్వ వాచకముగా వాడబడుట సంప్రదాయజ్ఞులకు నచ్చదు. ఇది భ్రాంతి జన్యమయిన లిపి యగుటచేతనే సంస్కృతాంధ్రసంప్రదాయజ్ఞుడయిన చింతామణి కర్త 'ఓ ఏ' లిపిని స్వీకరించి యుండడనితోచును.

అతడు పూర్వమార్గమున 'ఎత్' అని వాడెను. దంత్యతాలవ్య చజలకు లిపిలో భేదమును సూచించుటకు గుర్తులు పూర్వము తెలుగులో లేవు. తరువాత కొందరు దంత్యచజలకు చుక్కను చేర్చవలెనని సూచించిరి. మరికొందరు '౧' అను తెలుగు అంకెను, మఱికొందరు '౨' అను తెలుగు అంకెను వీనిపై వ్రాసెడివారు. ఇపుడది వదల బడినది.[1] ఇట్టిదే ఏ, ఓ ల లిపి విషయముగూడ : కాని రెండు విశేషములున్నవి. ఏ ఓ ల లిపి యేర్పడుటను మూలమయిన భ్రాంతి చ జ ల లిపి నిర్మాణములో లేదు. కాని ఏ ఓల లిపి స్థిరపడినది : చ జ ల లిపి అదృశ్యమయినది. ఇంతకు నిట చింతామణిలో దోషము నెన్ననక్కరలేదు.

"అద్దంత్య స్తాలవ్య శ్చుర్వక్రిసాన్యన్మిథస్సవర్ణశ్చ"
అనుచోట చింతామణి వక్రసంజ్ఞను వినియోగించినది,[2]

కావున చింతామణి వక్రసంజ్ఞను వినియోగించ లేదనరాదు. ఇక నీ సంజ్ఞల సార్థక్యమును గమనింపవలెను. ఏ ఓ ల లిపియందు

---

[1] ఆంగ్లమున రమ అనుదానిని, రామ అనుదానిని రమ అనియే వ్రాయవలెను గదా! ఇపుడు దీర్ఘసూచనమునకై Ā అని కొందరు వ్రాయుచున్నారు. కాని కొందరీపద్ధతిని గ్రహింపక పూర్వరీతిలోనే వ్రాయుచు సందర్భమునుబట్టి చదువుచున్నారు. దీనిని తప్పుగా నెవరును బరిగణించుట లేదుగదా!

[2] కవిశిరో. సంజ్ఞ. 22 సూ.

వంకర ఉండుటచే వానికి వక్రములనియు, ఐ, ఔలిపి యందు ఆవక్రత మరింత ఉండుటచే వానికి వక్రతమములనియు పేరులు వచ్చినవని కొందరు భావించిరి.[1]

కాని "ప్రత్యక్షరమున కేదోరీతి వక్రత్వ ముండును" కావున 'లిపి సంబంధమైన వక్రతచే వక్ర. వక్రతమ సంజ్ఞ లేర్పడినవనుట యుక్తము కాదని ఆచార్య బొడ్డుపల్లి పురుషోత్తముగారు దెల్పినారు.[2]

ఐకారమును బోరగిలపడవేసి పైకివచ్చు భాగమునకు మరికొంత వంకర కలిగించిన ణకారము వంటి లిపి వచ్చును. అనగా ఐకార లిపి కంటే ణకార చిపి యందు వంకర ఎక్కువన్నమాట. 'ఒ' వర్ణలిపిని తలక్రిందులుచేసి, తిరుగవేసి కుడివైపునకు వచ్చునిలువు గీతను కాస్త పెంచినచో ఌకారము లిపి ఏర్పడును. అనగా 'ఒ వర్ణలిపికంటె ఌకార లిపిలో వంకర తక్కువ కాదన్నమాట. దీనికంటే ఎన్నో వంకర కొమ్ములతో నున్న ఋకారలిపి యందు వంకర ఎక్కువ : కావున వీరి యభిప్రాయము సముచితమే. ఆచార్య పురుషోత్తము గారు వక్రవక్ర తమముల ఉచ్చారణమున గల వక్రతను బట్టి యీ పేరు లేర్పడెనని ప్రతిపాదించిరి,[3]

ఏ ఐ లు కణ్ఠతాలువులు, ఐ ఔలు కంఠోష్ఠములు, ఇట్లు ద్విస్థానోద్భూతములగుట వలన వీనికి వక్ర, వక్ర తమ సంజ్ఞలేర్పడె

---

1. రావు బహదూర్ కం. వీరేశలింగం పంతులుగారు, కళాప్రపూర్ణ వఝల చినసీతారామస్వామి శాస్త్రిగారు, తె, వ్యా. వికాసము ప్రథమ 18 పు.
2. అందే
3. అందే,

నని వీరుచెప్పిరి.[1] సంస్కృతమున ఏ ఓ ఐ ఔలు సంధ్యక్షరములు, తెలుగున ఏ ఓ లు సంధ్యక్షరములుకావు. కావున తెలుగు వైయాకరణులు ఏ ఓ లకు వక్ర సంజ్ఞను, ఐ ఔ లకు వక్రతమ సంజ్ఞను బెట్టుకొనిరని వీరు సముచితముగా దెల్పిరి.[2]

ఒకరు "ఛందశ్శాస్త్రమున గురువునకు సంకేతమయిన 'U' అను దానిని వక్రమనియు, లఘువునకు సంకేతమయిన 'I' అనుదానిని ఋజువనియు పిలిచిరి. ఆంధ్రశబ్ద చింతామణిలో ఏ ఓ లకు మాత్రమే వక్ర సంజ్ఞ వర్తించును. ఇవి గురువులు కావున వీనికి వక్రసంజ్ఞయు, ఐ ఔ లకు వక్రతమ సంజ్ఞయు నేర్పరచి యుండు"రని యూహించిరి.[3]

తెలుగులో ఎ, ఒ అను వర్ణములుకలవని చింతామణి చెప్పినది.[4] 'అద్దంత్యస్తాలవ్య శ్చర్వక్రః' అను సూత్రమందలి వక్రశబ్దము హ్రస్వమయిన ఎ వర్ణమునకు వర్తించదనుట కాధారములేదు. జేవురు, చెమట, చెలువు మొదలగు పదములు తాలవ్యయుతములే. ఇవి గూడ వ్యాఖ్యాతలచే నీ సూత్రము నొద్ద నుదాహరింపబడినవి. ఇందు హ్రస్వమగుఎవర్ణముకూడఉన్నది గదా! ఏజ్ ప్రత్యాహారముచే ఎ, ఒ అనువానిని గూడ గ్రహించుట శాస్త్రవిరుద్ధము కాదని వేఱొకచో నిరూపింపబడినది.[5] తెలుగులో ఎ, ఒ లు గూడ కలవని అంగీకరించిన చింతామణి ఎల్ల వేళల గురువులను భావముతో ఏ ఓ, అను వానికి వక్రసంజ్ఞ పెట్టెననుట యుక్తిసహము కాదు.

---

1. అండే 19 పు.
2. అండే.
3. తె. వ్యా. సం. ప్రా. వ్యా. ప్రభావం. 25 పు.
4. కవిశిరో. సంజ్ఞ 16 సూ.
5. 'ఏజథోవక్రః' అనువ్యాసము చూ.

జ్యోతిస్తంత్రమున 'రాశిలో గ్రహములున్న అంశకు 5, 6 త్రింశాంశలలో రవి యున్నచో ఆగ్రహముల గతులు వక్రములగును. ఇతర గ్రహములున్న త్రింశాంశకు 7, 8 అంశలలో రవియున్నచో నాగ్రహముల గతులతివక్రములగును' అని చెప్పబడినది. [1]

ఇందులో "పంచషష్ఠ స్థానాల్లోని రవిస్థితికి గ్రహాంతర వక్రగతికి సంబంధం ఉన్నందున స్వరముల యందు 5. 6 స్వరాలయిన ఏ, ఓలకు వక్రసంజ్ఞ వచ్చె"నని పై పరిశోధకులే వేఱొక ఊహ చేసిరి. అట్లే ఏడు ఎనిమిది స్థానాల్లో రవిస్థితికీ గ్రహాంతర అతి వక్రగతికీ సంబంధం ఉన్నందున స్వరములలో ఏడు ఎనిమిది స్థానాలలో నున్న ఐ ఔ లకు అతి వక్రములు అను నర్థము వచ్చునట్టి వక్రతమ సంజ్ఞను బెట్టి ఉందురని కూడ వీరూహించిరి. [2]

కాని అ ఇ ఉ ఋ ఌ ఏ ఓ ఐ ఔ
1 2 3 4 5 6 7 8 9

అని వర్ణమాలలోని స్వరముల లెక్కబెట్టినచో వక్రవర్ణములు 6, 7 స్థానములందు, వక్రతమ వర్ణములు, 8, 9 స్థానములందును కన్పడును. అనగా వారు పైన ప్రతి పాదించిన ఊహ సరి కాదన్న మాట.

వీరు "ఋ ఌ వర్ణములకు . పాణినీయులే సావర్ణ్యమును చెప్పుచున్నారు కనుక 'తవల్కారః' అనునుదాహరణము వలన ఌ వర్ణాదులయిన పదాలు లౌకిక సంస్కృతంలో లేవు అనే విషయం

---

1. "వక్రాః స్యుః పంచషష్ఠే ర్కేఽతివక్రానగాష్టమే.
"వక్రః - సతుయస్యగ్రహస్యాశ్రితాత్ రవ్యధిష్ఠితరాశీయ త్రింశాంశాంతర్గతాదంశాత్ పంచమషష్ఠాంశేరవి స్తిష్ఠతి
తె. వ్యా. సం. ప్రా. వ్యా. ప్రభావం 26 పు.
2. అందే. 37 పు.

సుప్రతిష్ఠిత మవుతోంది" అని భావించి ఌ కారమును వదలినారు. కావున వక్ర వక్ర తమములకు వారు చెప్పిన సంఖ్యలు వచ్చినవి. కు, చు, టు, తు, పు అను ఉదిత్తులకు సావర్ణ్యము చెప్పబడినది.[1] అందుచే కు=కవర్గము అను నర్థము వచ్చును. అంత మాత్రముచే కవర్గమందలిక కారేతర హల్లులను వర్ణమాలలో లెక్కపెట్టుట మానము కదా! కావున ఋ ఌ వర్ణములకు సావర్ణ్యము చెప్పుట అను హేతువు చేత ఌ వర్ణమును వదలనక్కరలేదు.

లౌకిక సంస్కృతమున ఌ కారమున్నది.[2] కావున ఌ కారమును వదలరాదు.

ఌ కారమును లెక్కించినచో పైన పేర్కొనిన గ్రహవక్రతల సంఖ్యలకు వక్రవక్రతముల సంఖ్యలకు సంబంధముండదు. ఇంతకు జ్యోతిస్తంత్ర మందలి వక్రాతి వక్రతలకు తెలుగు వ్యాకరణమందలి వక్ర వక్రతమ సంజ్ఞలకు పొంతన లేదు. కావున నీయూహకుదురదు.

వీరు "ఒకానొక ఉక్తివైచిత్రిని వక్రతగా ఆలంకారికులు (కుంతక) భావించినారు. వీటిలోని సంధ్యక్షరతారూపమైన వక్రతను సంభావించి ఆంధ్రవ్యాకర్తలు ఈ సంజ్ఞలను ఏర్పరచి యుండవచ్చు" అని కూడ ఊహించినారు.

"ఒక విధముగా జెప్పబడిన వాక్యమును కాకు స్వరముచేగాని శ్లేషచేగాని ఇంకొక విధముగా యోజింపచేయుట యెందుండునో అది వక్రోక్తి..............................

---

1. సిద్ధాంత కౌముది 14 సూ.
2. క్ఌప్తిః = కల్పించుట, చేయుట, నిశ్చయము, నియమము కలిగి వుండుట, క్ఌప్తః = రచింపబడినది, కల్పింపబడినది, విధింపబడినది, నిర్మింపబడినది, గోతిగింపబడినది.
బాలా మర శ్రీ మామిడి వెంకటార్యులు. శబ్దార్థకల్పతరువు 337 పు.

ఈ వక్రోక్తి అలంకారమె కాని కావ్యమునకు జీవితముగాదు. కావ్య జీవితమని కుంతకుడు చెప్పిపదపూర్వార్థవక్రము .... మొదలగునవి చెప్పెను. ఇవి అన్నియు అలంకారములోనే యంతర్భవించును. వక్రోక్తియను దానికి చమత్కృత్యుక్తి రమణీయోక్తియని యర్థము చెప్పినచో అది .... కావ్యలక్షణ వివరణమే యగును."

అని సమగ్రాలంకార శాస్త్రము నాపోశనము బట్టిన చర్ల గణపతి శాస్త్రిగారు వ్రాయుచున్నారు.[1]

వక్రోక్తియర్థాలంకారము. శ్లేషచేగాని, కాకువుచేగాని ఒక విధముగా సిద్ధించిన అర్థమును వేఱొక విధముగా యోజించుటకలది వక్రోక్తి: కావున నిది అర్థమునకు సంబంధించినది. సంధ్యక్షరతా రూపమయిన వక్రత శబ్దమునకు సంబంధించినది. కావున నీరెండింటికిని ముడి పెట్టనక్కరలేదు.

"ఋగ్వేదప్రాతిశాఖ్యమునసంధానాక్షరమగు వకారమునకు భుగ్నమని సంజ్ఞ. భుగ్నమనగా వంకర యని యర్థము. యీ వక్రత ఉచ్చారణ సంబంధియే" దీని ననుసరించి సంధ్యక్షరతా రూపమయిన వక్రతగల ఎ ఏ ఒ ఓ లకు వక్రసంజ్ఞ. ఐ ఔ లకు వక్రతమ సంజ్ఞ పెట్టియుందురని ఆచార్య పురుషోత్తముగారి మతము. ఇది సముచితమే[2]

అ+ఇ = ఏ, అ+ఎ = ఐ, అ+ఉ =ఓ అ+ఓ = ఔ, ఈ విధముగా రెండు మారులు సంధివచ్చుటచే ఐ ఔ లు ఏర్పడినవి.

---

1. సాహిత్య సౌందర్య దర్శనము హైదరాబాదు : లలితాప్రెస్, (1972), 647 పు.
2. తె. వ్యా. వికాసము ప్రథమ. 10 పు.

తెలుగున ఐ ఔ లకు అయి, అవు అను నుచ్చారణముగూడ నున్నది. ఏ,ఓల కంటె వీనియందు సంధి అతిశయముగా కానవచ్చుచున్నది. దీనిని తెలుపు "తమప్" ప్రత్యయముతో వక్రతమ సంజ్ఞ నేర్పరచి యుందురు. [1]

ఏని విషయము

విమర్శకులు 'అపిశబ్దార్థస్యైతః' అను సూత్రమును విమర్శించుచు "ఇందు 9వ సూత్రమునుండి ప్రాయశ్శబ్దమును దెచ్చుకొన వలెనో 7వ సూత్రమునుండి 'వా యనుదానిని తెచ్చుకొనవలెనో తెలియదు. ఇది కళయో ద్రుత ప్రకృతికమో తేలదు. ఏని యనునది ఏఁడు అను సర్వనామమునకు ద్వితీయైక వచన రూపమనుకొని 'నిరమో మహతాం' అను సూత్రమును బట్టించుటకు......నన్నయ ప్రయోగము లాటంకము లగుచున్నవి. ఇక ఏనిలోనినివర్ణము ద్రుతము కాదుగదా! 'కవిభల్లైః' ఆను సూత్రమును వర్తింపజేయుద మన్ననునదినిస్థానమున వచ్చినదియుగాదు. కావున నట్టి సంధి స్థలములందు 'అపిశబ్దార్థస్యైతః' అను సూత్రము ననుసంధించు కొనవలెను. కాని సంధియందే యీ సూత్రము వలన నిత్వమునకు లోపము గలుగ గలదు గాని, వాక్యావసానమునను నట్టిలోపము కలుగుట సాధింపబడ నేరదు. సంధియందేకాక స్వతంత్రముగను నేని శబ్దములోని ఇకారము లోపించును. ఇకారము లోపింపగా మిగిలిన ఏన్‌లోని నకారపు బొల్లు ద్రుతముగాకున్నను ద్రుతమునకు గలుగు కార్యములు గలుగుచుండును" అని వ్రాసిరి. [2]

ఇందు పలుసందిగ్ధాంశములున్నవి. వానిని వరుసగా బరిశీలింతము. ఇది 8 వ సూత్రము. (1) దీనిలోనికి 7 వ సూత్రమునుండి

---

[1] 'అతిశాయనే తమ బిష్ఠనా.'
సిద్ధాంతకౌముది 200 1 సూ.

[2] ఆం. భా. చ. 2 సం. 1606 పు.

ప్రాయశ్శబ్దమును దెచ్చుకొనవలెనా ? 9వ సూత్రమునుండి వా తెచ్చుకొనవలెనా ? అనునది ప్రశ్న. 'అపిశబ్దార్థస్య' అనునది శ్లోకారంభము. 'చారే రుపధాత్మనశ్చలుగ్వా స్యాత్' అను 11వ సూత్రమిా శ్లోకములోనిదే. దీనిలో 'లుగ్వా స్యాత్' అనుదానిని 'అపిశబ్దార్థస్యైతః' అను సూత్రములోనికి గూడ అన్వయించి వ్యాఖ్యాతలు ఏని శబ్దమందలి ఇకారమునకు లోపము వికల్పమని పై సూత్రమునకు భావమును జెప్పిరి. ఒక శ్లోకములోని పదముల నిట్లన్వయించుట యుక్తమే. ప్రాయశ్శబ్దము ముందుశ్లోకము లోనిది. కావున దాని నీశ్లోకములోని సూత్రములోని కనువృత్తి తెచ్చుకొన నక్కరలేదు.

(2) ఈ 'లు.గ్వా స్యాత్' అనుదానిని 'అపిశబ్దార్థస్యైతః' అను సూత్రములోని కన్వయించుటచేత సంధి వచ్చుచోటగాని, రాని చోటగాని ఏని లోని ఇకారమునకులోపము కలుగుట కవకాశ మేర్పడినది. కాన వాక్యావసానమునగూడ ఇకారలోపము నీసూత్రముచే సాధింపవచ్చును.

(3) ఇది ద్రుతప్రకృతికమా ! కళయా అని ప్రశ్న. చింతామణి యీ విషయమును వాచనికముగా జెప్పలేదు. కావున ప్రయోగములను బట్టి నిర్ణయించుకొనవలెను. "మానవనాయక ! యగ్రజుడైనను ననుజన్ముడేనియున్యాయంబుంబూని." అను కవిబ్రహ్మ ప్రయోగమునందు 'ఏని+అన్యాయము అనుచోట యడాగమము వచ్చినది. కావున దీనిని కళ అనవలెను. [1]

ఏని అనునది ఏనియున్ అనుదాని సంక్షిప్త రూపమని నైఘంటికులు చెప్పుచున్నారు. [2] కావున చివరి నకారపుబొల్లు ద్రుతకార్యము

---

1. ఆం. భా. ఆను 4 ఆ. 136 ప. సూ. ని 1 సం. 857 పు.
2. అందే.

లను బొందుట కభ్యంతరముండదు. ఏనియున్ అనుదానిలోని 'యు' వర్ణము లోపింపగా 'ఏనిన్' అను రూప మేర్పడును. దీనిపై గూడ సరళాదేశాదికము రావచ్చును.

'అది కాదేఁ దెగిబంటవై' (కాదేన్ + తెగి) అనుచోట 'ఏన్' అనుదానిని, [1] 'ఏచోచ్చనైనను నిల్చు నాకటికి నేమేనిం గొనున్' (ఏనిన్ + కొనున్) అనుచోట ఏనిన్ అనుదానిని ద్రుతకార్యములతో ఉభయకవిమిత్రుడు తిక్కన ప్రయోగించెను.

(4) 'ఏని' అనునది ఏడు అను సర్వనామమునకు ద్వితీయైక వచన రూపమగునాయని ప్రశ్న. ఇది అపశబ్దార్థకమని చింతామణి చెప్పినది. ఏడు అనునది సర్వనామము. దీనినుండి 'ఏని' అనుదానిని దయారు చేసినచో నదియు సర్వనామమేయగును గాని అపశబ్దార్థము కాదు గదా. కావున నివి రెండు భిన్నములు. మఱియు నీ 'ఏని' సర్వనామ మనుటకు నన్నయగారి ప్రయోగములా టంకముగా నున్నవని యీ విమర్శకులే తెల్పిరిగదా !

కాన పై విషయములేవియు చింతామణికి లోపములని చెప్పుటకు వీలులేదు.

నుమ్మోచ్ఛతః

విమర్శకులు 'సుమ్మోచ్ఛతః' (సమాసములందు హ్రస్వోకారాంతమునకు 'నుమ్' వచ్చును.) [2] అనుసూత్ర వ్యాఖ్యలో "నుమ్' అనుదానిలో యిద్వర్ణమగు మకారమునకు ప్రయోజనము చింతామణియందు తెలుపబడలేదు"అని వ్రాసిరి. [3] మకారము నిత్సంజ్ఞగా పెట్టుట

---

1. ఆం. భా. ఉద్యో. 3 ఆ. 97 ప. సూ. ని. అందే.
2. కవిశిరో. సంధి 31 సూ.
3. ఆం. భా. ఛ. 2 సం. 1609 పు.

చేత ఉదంతశబ్దమున కంతావయవముగా నువర్ణము చేరును.[1] ఇట్లు నువర్ణము ప్రకృత్యంతావయవ మగుటచే ఆసముదాయమునకు ద్రుత ప్రకృతికత్వము సిద్ధించి ద్రుతకార్యములు వచ్చునని యహోబల పత్యాచార్యుడు చెప్పెను.[2] కావున 'నుమ్' లోని మిత్తు వ్యర్థము కాదు. గ్రంథకర్త ప్రయోగముల కర్థమును జెప్పవలసిన వాడు వ్యాఖ్యాత. మహా వ్యాఖ్యాత అయిన అహోబలపత్యాచార్యుడా పనిని నేరవేర్చెను.

ఆ పని గ్రంథకర్తదికాదు. కావున నిట విమర్శకుల విమర్శ యుక్తముకాదు.

సూత్రము నసమర్థముగా నిరూపించురీతి

చింతామణి 'ప్రథమా వైభక్తిక మోర్బిందుశ్చ మహాన్పతి క్రియార్థేషు' (ప్రథమా విభక్తి యందున్న మువర్ణమునకు పడుమొదలగునవి పరముగా నున్నప్పుడు లుక్ పూర్ణబిందువులు వికల్పముగా వచ్చును.) అని చెప్పినది.[3] ఇది వికల్ప లుక్ సందర్భము. 'అపి శబ్దార్థస్యైతః' అను ముందు శ్లోకమునుండి 'లుగ్వాస్యాత్' అనునవి సూత్రములోనికి గ్రహింపవలెను.[4] కావున లుక్కు వికల్పమను నర్థము వచ్చినది. దీనికి ముందున్న సూత్రము 'పోశ్చతదాద్యర్థ వాచకేషూతః'

---

1. 'మిదచోన్త్యాత్పరః' అచాంమధ్యే యోన్త్యస్తస్మాత్పర స్తస్యైవాన్తావయవో మిత్స్యాత్. శ్రీ భట్టోజీదీక్షితులు సిద్ధాంత కౌముది పరిభాష 37 సూ.
2. 'అత్రనుమో మిత్త్వేన ప్రకృత్యవయవత్వాత్ ద్రుత ప్రకృతిత్వే తత్కార్యమ్ కవిశిరో. సంధి. 31 సూ. వ్యాఖ్య.
3. కవిశిరో. సంధి. 16 సూ.
4. అందే. 10 సూ.

అనునది.[1] అచట నుండి 'ఉతః' అను వృత్తి తెచ్చుకొని విమర్శకులు "ప్రథమా విభక్తికి సంబంధించిన ము వర్ణము మీఁది యుత్వమునకును పడు మొదలగు క్రియలు బరమగునప్పుడు లోపము వైకల్పికముగా నగును. అట్టి యెడ శేషించిన ముకారస్థానమున పూర్ణబిందువు గూడ వచ్చును అని సూత్రార్థము. కాని మువర్ణమునకంతటికిని లోపము కలుగునని సూత్రకారుని యభిప్రాయము." అని వ్యాఖ్యానించిరి.[2] అనగా సూత్రకారుని అభిప్రాయమును సూత్రము చెప్ప లేకపోయిన దని వారి భావమన్న మాట.

పూర్వసూత్రము నుండి 'ఉతః' అనుపదమనువృత్తి తెచ్చుకొననిచో ఉత్తునకు లోపము వచ్చునను నర్థమురాదు. అనువృత్తి తెచ్చుకొనుట, మానుట అనునవి సూత్రకార వివక్షితార్థమును రాబట్టుటకు వ్యాఖ్యాతలు చేయుపనులు. ఈ సూత్రములో 'ఉతః' అనునది లేదు. వ్యాఖ్యాతలెవరుననువృత్తిగా దెచ్చుకొనలేదు. ప్రయోగములలో గూడ నిట్టి ఉకార లోపమెచటను కానరాదు. 'పోశ్చ' ఇత్యాది సూత్రము నుండి 'ఉతః' అనునది తరువాత నున్న ఏ ఒక్క సూత్రములోనికి నను వృత్తి నచ్చుట లేదు.

కావున సూత్రకారుని అభిప్రాయమునకు విరుద్ధముగా నను వృత్తి దెచ్చి, గ్రంథకర్త ఉద్దేశించని యర్థమును జెప్పి, దానికి జింతామణి హృదయమని పేరు పెట్టిన యీ విమర్శకుని ధోరణి సహృదయులకు దిగ్భ్రాంతి కలుగజేయును. ఇది సూత్రమునసమర్థమని చెప్పుటకు విమర్శకుడవలంబించిన మార్గమే తప్ప ఆ సూత్రమున నిట్టిదురర్థము లేదని విజ్ఞులకు దెల్లము. ఇట్టిదే మఱి యొకటి. 'తస్యాస్యాచ్చ పూర్ణ బిందురపి' అను సూత్రమును వీరు విమర్శించుచు "ఇచట

---

1. అందే 15 సూ.
2. ఆం. భా. చ. 2 సం. 1614 పు.

తచ్ఛబ్దముచే బూర్వసూత్రమున జెప్పినట్లు ఉత్తున కని చెప్పవలెను. కాని సువర్ణమున కని సూత్రకారుని యభిప్రాయమైనట్లనుకొనవలెను. అని గ్రంథకార భావమును సూత్రము వెల్లడి చేయలేదని తెల్పి యున్నారు.[1]

దీనికి ముందు సూత్రము 'శతిర్ద్వే తూతశ్చానోః' అనునది.[2] ఇందు 'ఉతః నోః'అను రెండు షష్ఠ్యంత పదము లున్నవి. 'నోః' అను నదియే తరువాతి సూత్రమునకు దగ్గర. చింతామణి సూత్రరూపరచన కాదనియు, శ్లోకరూపమనియు నిరూపించబడినది. కావున 'నోః' అనునది దేహళీ దీప న్యాయమునే పూర్వోత్తర వాక్యములలోనికి అన్వయించినచో సువర్ణమునకే పూర్ణ బిందువు గలుగునని చెప్పవచ్చును. పూర్వసూత్రమున ఉత్వమునకు కార్యము విధించినంత మాత్రమున తరువాతి సూత్రమున గూడ అట్లే జరుగవలెనను నియమము లేదు. కావున గ్రంథకర్త అభిప్రాయమునకు భిన్నముగా వ్యాఖ్య చేసి సూత్రమునసమగ్రముగా జేయ యత్నించుట పాడిగాదు.

ఇంకొకటి చూతము. 'సంధిర్నాచోచ్యనుతః'

“హ్రస్వఉకారమునకు గాక తక్కిన అచ్చులకచ్చుపరమగునప్పుడు సంధికాదు. ఇందువలన ఉత్తునకచ్చుపరమగునప్పుడు సంధి నిత్యముగానగునని యీ సూత్రము దెల్పుచున్నదని యందురు. కాని యీ యర్థము నొసగదు. ధైర్యము లేనివానికి జయము పొసగదు. అన్నపుడు ధైర్యము గలవాని కెల్లప్పుడును జయము కలుగునని చెప్పవీలులేదుగదా!” అని విమర్శకులు నుడివిరి.[3]

---

1. ఆం. భా. చ. 2 సం. 1607.
2. కవిశిరో. సంధి 12 సూ.
3. ఆం. భా. చ. చింతామణి హృదయము 2 సం. 1599 పు.

ధైర్యము గలవాని కెల్లప్పుడును జయము గలుగునని చెప్పవీలు లేకపోయినను ధైర్యము గలవానికి జయము గలుగునను నర్థము పై వాక్యమునకు వచ్చునుగదా! రాజుగారి చిన్న భార్య మంచిది అను వాక్యముచే ఆయన పెద్దభార్య మంచిది కాదని పరిశేష న్యాయముచే సిద్ధించుట లేదా? కావున ఉత్తున కచ్చుపరమగునపుడు సంధి యగునని యీ సూత్రము సూచించినదనుటలో దొసగులేదు. అల్పాక్షరములలో ననల్పార్థమును గ్రథించిన చింతామణి యీ విధముగా విషయము నందించిన దనుటలో సందేహింప బనిలేదు.

తెలుగు నందలి పదాంతోకారము పెక్కుచోట్ల ప్రాచీన కాలమున లేదనియు నది ఉచ్చారణ సౌకర్యమునకై తరువాత చేరినదనియు పరిశోధకులు చెప్పుచున్నారు.[1] పదములో భాగము కాని యిది సంధిలో లోపించుట సహజము. ఉకారసంధి తక్కిన సంధులకంటె ప్రచురముగా నున్నది. ఈ విషయమును గమనించిన చింతామణి దీనిని సూచించుటకు నిషేధముఖమున ఉద్భిన్నాచ్చునకచ్చు పరమగునప్పుడు సంధి లేదను తీరున రచించి యుండును. కావున నిట లోపము నెన్న బనిలేదు.

అసంగత ధ్వని

ఒకరు చింతామణిలో “దారార్థేత ఉదపిరః’ అను సూత్రమున ‘దారార్థే’ అనుటవలన భార్యయను నర్థమును గ్రహించ వలెనని ధ్వనించుచున్నదిగాని దానిని స్త్రీ మాత్రపరముగా గ్రహింపవలెను” అని వ్రాసిరి.[2] చింతామణి తన ఉద్దిష్టార్థమునకు దగిన పదములను వాడలేదని వీరి ఉద్దేశ్యము కాబోలు. ‘ఆలు’ అను తెలుగు పదమును

---

[1] విద్వాన్ గంటి జోగి సోమయాజి,
ఆం. భా. వికాసము 318 పుట.

---

[2] ఆం. భా. చ. 2 భా. చింతామణి హృదయము 617 పు.

సంస్కృతీకరించవలెను. స్త్రీ పదము చింతామణిలో స్త్రీలింగార్థమున బలుసార్లు వాడబడెను. దానిని వాడిన స్త్రీలింగార్థమే స్ఫురించును. కావున ఆలు అను నర్థమున 'దారార్థే' అని వాడబడినది. ఆలు శబ్దమునకు 'దారాః' అనుదానికి నొకపోలిక గలదు. దారాః అను శబ్దమున బహువచనము కలదు. కాని దానిచే చెప్పబడు వ్యక్తియందు ఏకత్వమే ఉండును. అట్లే ఆలు శబ్దము లువర్ణాన్తముగా కనబడుచున్నది. అది ఒక వ్యక్తినే చెప్పును. ఈ సామ్యమున్నందున ఆలు అనుదానిని 'దారాః' అను పదముచే చింతామణి చెప్పినది. సంస్కృతమున వృక్షవిశేష వాచకమయిన వనస్పతి పదము వృక్షసామాన్యమునకు వాచకముగా వాడబడుచున్నదని అహోబలపతి తెల్పెను.[1] అట్లే ఆలుశబ్దము వ్యస్తముగా నున్నపుడు భార్యావాచకమయినను సమాసములో స్త్రీ సామాన్య వాచకముగా నగుచున్నది.

'దారార్థే' అను పదమునకు దార అను పదముయొక్క అర్థమునందుఅని గాని, దార అను దాని కర్థమైన ఆలు శబ్దము పరముగా నుండగా అని గాని అర్థము చెప్పవలెను. అర్థమునందు ఉత్వము రేఫవిధించుటఅసంభవము కనుక రెండవ అర్థమే చెప్పవలెను.

ఇది సమానాధికరణ సమాస సందర్భము. ముందు సూత్రమున 'సామానాధికరణ్యేషు' అను పదమున్నది.[2] వ్యస్తముగా నున్నపుడు, వ్యధికరణ సమాసము నందు, ఆలు శబ్దమునకు భార్య అను నర్థమున్నను సమానాధికరణ సమాసములో నా అర్థముండు నవకాశము లేదు.

కావున దార అను పదమున కర్థమయిన 'ఆలు' పరముగా నున్నపుడు అదంతశబ్దమునకు ఉత్వ రేఫలు వచ్చుచున్నవను నర్థముతో

---

[1] కవిశిరో. సంధి 34 సూ.

[2] కవిశిరో. సంధి 33 సూ.

పాటు, వ్యస్తముగా భార్యార్థకమయిన ఆలు శబ్దము సమాసములో స్త్రీ మాత్రమును బోధించుచున్నదను విషయమును గూడ పాఠకుల దృష్టికి దెచ్చుటకు గ్రంథకర్త యిట్లు వ్రాసెనని తోచును.

వాచ్యార్థము కంటె అందముగానున్న అర్థమును ధ్వని యందుము. వాచ్యార్థము కంటే అసంగతముగా నున్నదానిని ధ్వని యనము కదా !

ఇచట గ్రంథకర్త ఉద్దేశించిన అర్థము వ్యాఖ్యాతల కందరకు ఒకేవిధముగా గోచరించినది. కావున గ్రంథకర్త ఉద్దిష్టార్థమును సూత్రము బోధింపలేకపోయిన దనరాదు. కావున నీ విషయము చింతామణిలో నొకలోపముగా నెన్నదగినదికాదు.

ప్రథమలుగపిద్వినుల్వోః

ఆధునికులు చింతామణిలో దప్పు బట్టిన సూత్రములలో 'ప్రథమలుగపిద్వినుల్వోః' అనునదొకటి. దీనికి ద్వి = ద్విత్వము గల, నుల్వోః=నులు అనువానికి, ప్రథమలుగపి = ద్విత్వములలో మొదటి వర్ణములకు లోపమునగును, కనుదమ్మి ములుగంపలని బాలసరస్వతి మహోపాధ్యాయుని వివరణము, [1]

"(ఈ) సూత్ర నిర్మాణంలో లోపం ఉంది. ద్వినుల్వోః అంటే రెండు నులులుగల పదాలేగాని నకార లకారాలున్న పదాలని అర్థంకాదు. అంటే సూత్రానికి ఉన్న అర్థం కనును, ములులు అను వాటిలో మొదటి నులులు లోపిస్తాయి. కాని వ్యాఖ్యాతలు కన్నుముల్లు వంటివి ఈ సూత్ర విషయాలన్నారు. బాలసరస్వతిని బట్టి సూత్రకర్త ఉద్దేశమదే అనడంలో సందేహంలేదు" అని ఒక రాక్షేపించినారు, [2] వారూహించినట్లు "ద్వినుల్వోః అంటె

---

[1] ప. బాలస. సంధి. 11 శ్లోకటీక.

[2] సం. ప్ర. వ్యాకరణాలు ౩౩౬ పుట.

రెండునకార లకారాలున్న పదాలని బాలసరస్వతి చెప్పలేదు. ద్విత్వము గలనులు అను వానిలో మొదటిదానికి (న్, ల్ అనువానికి) లోపము వచ్చునని మాత్రమే అతడు చెప్పెను.

ఇంతకు సూత్రకర్త తన ఉద్దేశ్యమును సరిగా వెల్లడించ గలిగెనా ? లేదా ? యను విషయమును పరిశీలింతము. బాలసరస్వతి భాష్యాంతవైయాకరణుడు. సూత్రములో లోపమున్నచో నది యతనికి తెలియదా ? అహోబలపతి అనేక శాస్త్ర పరిచయము గలవాడు. సూత్రములో దప్పున్నచో నతడైనను సూచింపడా? పై పెచ్చు అతడు వ్రాసిన వ్యాఖ్యనే యథాతథముగా స్వీకరించునా ? [1]

మండ లక్ష్మీనరసింహాచార్యులష్టభాషాపండితుడు. మంచెళ్ళ వాసుదేవకవి అష్టభాషాకవిత్వ సామ్రాజ్య పట్టభద్రుడు, నానావిధ విద్యాప్రవీణ విద్వత్కవితా వితానసంస్తూయమాన పాండితీమణి. వారిరువురు స్వతంత్రులు. వారు గూడ ఇట్టి విధానమునే చేయుట గమనింపదగినది. [2]

చింతామణి సూత్రములో లోపమున్నచో వీరా విధానమును వదలకుందురా? ఇంతకును చింతామణిలోని సూత్రార్థములో ఔచిత్య

---

1. సద్విత్వయో ర్నలోర్వాః ప్రథమ వర్ణస్యలుగపిస్యాత్
కవిశిరో. సంధి 36 సూ. వ్యాఖ్య.

2. ద్వినులోర్వా రాదే ర్వాలుక్.
నులు వర్ణయో రాద్యవర్ణస్య వాలోపస్స్యాత్ (వృత్తి)
శ్రీ మండ లక్ష్మీనరసింహకవి. ఆంధ్రకౌముది సంధి. 44 సూ.
"ద్వినులోర్వరనచి పూర్వస్యలుగ్వా" సమాసేద్వినులోర్వాః
పూర్వవర్ణస్యలుగ్వాస్యాత్ అనచి పరే (వృత్తి)
శ్రీ మంచెళ్ళ వాసుదేవకవి వైకృత చంద్రిక సంధి. 44 సూ.

మును గమనింతము. ఏకాదిసంఖ్యావాచకములు ఏకత్వాదులను, ఏకత్వాది విశిష్టమైన సంఖ్యేయ పదార్థములను గూడ దెలుపునని శాబ్దికుల నిర్ణయము.[1]

కావున ద్వినుల్వోః అనుచోట ద్విత్వముతో గూడిన నులులని యర్థమును జెప్పవలెను. నువర్ణమొకటి,లు వర్ణము ఒకటి, ఈ రెంటికిని ద్వివచనము నుల్వోః అనునది. హల్లునకు అచ్చునకు గూడ ద్విత్వమును జెప్పినచో (న్ + ఉ, న్ + ఉ, ల్ + ఉ, ల్ + ఉ) బహువచనము వచ్చును. సూత్రమున ద్వివచన ముండుటచే నీయర్థమును జెప్పరాదు. హల్లునకు మాత్రము ద్విత్వమును జెప్పినచో 'న్న' ల్లు అనువర్ణములగును. అపుడు ద్వివచనము సార్థకము. నేటి వాడుకలో గూడ ద్విత్వవర్ణమున హల్లునకే ద్విరుక్తి కనబడుచున్నది గాని అచ్చునకు గాదు కదా!

శాబ్దిక మూర్ధన్యుడగు చింతామణికర్త పై విషయము నంతయు నెఱిగిన వాడగుటచే 'ద్విత్వముతో గూడిన నులులయందు అనునర్థమున 'ద్వినుల్వోః' అని ప్రయోగించెను. సంస్కృత వ్యాకరణ జ్ఞానము గాఢముగా గలవారగుటచే బాల సరస్వత్యాదులు మూలకారుని భావమును గ్రహించ గలిగిరి. కావున ప్రథమలుగపి ద్వినుల్వోః అను సూత్రరచనమున లోపమేమియు లేదని సారాంశము.

---

[1] శ్లో. ద్వ్యేకయోరితి నిర్దేశాత్ సంఖ్యా మాత్రేపి సంభవః
ఏకాదీనాం ప్రసిద్ధ్యాతు సంఖ్యేయార్థత్వ ముచ్యతే.

(ద్వ్యేకయోర్ద్వివచనైకవచనే అను సూత్రమున ద్వ్యేకయోః అను నిర్దేశముండుటవలన ఏకాదిశబ్దములు ఏకత్వాది సంఖ్యామాత్రమునుగూడ బోధించును. లోకప్రసిద్ధిననుసరించి యాయేకాది శబ్దములు సంఖ్యేయమును బోధించునని చెప్పవలెను. భర్తృహరి వాక్యపదీయము పదకాండము, సంఖ్యాసముద్దేశము, హైదరాబాదు: తెలుగు అకాడమీ, (1980),32 శ్లో. 531 పు.

ఊహల ఊసులు

ఒకరు చింతామణి తానున్, ఏనున్ అను ప్రథమాన్త శబ్దములను సాధించెనని యూహించిరి.[1] చివరి నకారమునకు "వాత్మాస్మద్భ్యోద్రుతస్యస్యాల్లుక్" అనుసూత్రముచే వికల్పలోపము గల్గునని యూహించిరి. సంధిచేయునప్పు డచ్చు పరమగుచో ఏనునిప్పుడు, ఏనిప్పుడు అనియు హల్లులలో పరుషము పరమగునప్పుడు ఏనుమ్బలికితి, ఏనున్బలికితి, అనియు రూపము లేర్పడునని ఊహించిరి. పై సూత్రముచే ద్రుతము లోపించినపుడు ఏనునలికితి అని గసడదవాదేశము వచ్చుననిరి. చింతామణి వలన సాధింపదగు రూపము లివియై యుండగా వ్యాఖ్యాతలు నేఁజదివితి, తాఁజదివె, తావచ్చె, మొదలగు రూపములను సాధింప నెంచుట చింత్యమనివాపోయిరి. "కవి భల్లటైః క్రియాణాం" ఇత్యాది సూత్రములచేత తాను నేను పదములతుది యుత్వము లోపించినను మిగిలిన నకారపు బొల్లు ద్రుతమనుటకు చింతామణి యందాధారము లేదని తిరస్కరించిరి. తాన్, నేన్ అను రూపముల లోని నకారపు బొల్లు లోపించుటకును చింతామణి యందు గతికాన్పింపదని చింతామణి లోపము నెన్నిరి. వీరి కల్పనము విచిత్రమనిపించును.

తానున్, నేనున్ అని వీని చివర నకారమును జేర్చనేల? దానికి లోపమును విధింపనేల? వీరు చూపిన ఏనునిప్పుడు, ఏనున్బలికితి అను రూపములకు సముచ్చయార్థక నువర్ణక యుతములను నర్థస్ఫూర్తి గలుగుచున్నది. కాని నేను పలికితిని అను నర్థము స్ఫురించుట లేదు.

"గసడదవాస్స్యుః ప్రథమా మాత్రాదాత్మాస్మదోర్వ్యైన్తైస్తే" (తాను నేను శబ్దములను విడచి ప్రథమామాత్రము కంటె పరముగా నున్న పరుషములు క్రమముగా గసడదవలగును.) అనుచోట తాను నేను శబ్దములను విడువవలెనని చెప్పుటచే వీని తరువాత గసడదవా

---

[1] ఆం. భా. చ. 2 సం. 1620 పు.

దేశము నిషేధింపబడెను.[1] కావున ఏనావలికిలి ననుసూపమును జింతామణి ద్వారా సాధింపరాదు. చింతామణి ప్రథమా విభక్తిని కళలలో బరించినది.[2] వీనికి తరువాత నున్న పరుషములు గడసడదవలు కావలసి యున్నవి. కాన 'గసడవాస్స్యుః' ఇత్యాది సూత్రముచే వీనికి బరముగా నున్న పరుషములకు గసడదవాదేశము నిషేధింపబడినది.

తాను నేను శబ్దములు ప్రథమాన్తములగుటచే వీనికి కళాసంజ్ఞ ప్రాప్తించుచుండగా "వాత్మాస్మదోర్ద్రుతస్యస్యాల్లుక్" అను సూత్రముచే వీనిచివరి నువర్ణము ద్రుతమని స్పష్టము చేయబడినది.[3] ఇదిపై కళా సంజ్ఞ కపవాదమైనది. ఈ ద్రుతమున కిచట లోపము గూడ చెప్పబడినది. తాను నేను పదములలోని ఉకారము

కవి భల్లటైః క్రియాణాం
నామ్నాంచోల్లోప ఇష్యతేఽన్యేషు
ప్రథమైక వచన మాత్రే
వికృతౌ నాన్తాదయోపికథ్యన్తే

(కవి భల్లటులచే క్రియలకు నామములకు ఉకారలోపమంగీకరింపబడుచున్నది. ఈ లోపప్రదేశమందు తెలుగు ప్రథమైక వచన మాత్రమున నాన్తాదులుగూడ(ద్రుతప్రకృతికములుకూడ) చెప్పబడుచున్నవి)[4] అను సూత్రముచే లోపించుటకు, శేషించిన నకారమునకు "వాత్మాస్మదోః" ఇత్యాది సూత్రముచే లోపము గల్గుటకు చింతామణిలో గతి ఉన్నదనియే చెప్పవలెను. కవిభల్లటైః ఇత్యాది సూత్రముచే ఉకారము

---

1. కవిశిరో. సంధి. 23 సూ.
2. కవిశిరో. సంజ్ఞ. 40 సూ.
3. అందే సంధి. 40 సూ.
4. కవిశిరో. హలంత. 23 సూ.

లోపింపగా మిగిలిన ప్రథమైక వచనాన్త నకారమునకు నాన్త సంజ్ఞ (ద్రుతసంజ్ఞ) కూడ వాడబడినది. కావున దీనిని ద్రుత మనుటకు గూడ ప్రమాణమున్నదని చెప్పవలెను. ఇచట చింతామణిలో లోపము నెన్నుటకు వీలులేదు.

ఇతడు సంప్రదాయానభిజ్ఞాతయా ?

ఒకరు "డుముపులవః ప్రథమాస్యాత్, కూర్చిలనునయోఽథ శేద్ద్వితీయాతు" అను సూత్రములు సంస్కృత సంప్రదాయమునతిక్రమించినవని భావించిరి.[1] సంస్కృత భాషలో వ్రాయబడిన గ్రంథము సంస్కృత భాషా మర్యాదల నతిక్రమింపరాదు గదా! 'డుముపులవః' అను విశేష్యము బహువచనము నందు, ప్రథమా అనునదేక వచనమునందు కలవు. విశేషణ విశేష్యములు సమానవచనములందు లేవు గనుక నిచట సంస్కృత సంప్రదాయము తప్పెనని వారి ఊహ. కనుక "డుముపులవః" అనునది సమాహార ద్వంద్వముగా దీసికొనవలెను. సమాహార ద్వంద్వమయిన యెడల సమాసము నపుంసక లింగైక వచనమున నుండవలెను. ఇతరేతరయోగ ద్వంద్వమయినచో "ప్రథమాస్స్యుః" అని యుండవలెను. అట్లు లేదు గావున సంస్కృత సంప్రదాయమునకు దప్పిన దని వారు చెప్పిరి. ఇందు సత్యము కలదేమో అరయవలెను.

పాణినీయము సంజ్ఞావాచక విశేషణములకు విశేష్యముల లిఙ్గవచనములు రానక్కరలేదని యంగీకరించినది. "తదశిష్యం సంజ్ఞాప్రమాణత్వాత్" (సంజ్ఞా ప్రమాణత్వమున్నందున విశేషణముల లిఙ్గవచనములు విశేష్యములకు నుండునని శాసింపరాదు. అనగా

---

[1] ఆం. భా. చ. 2 సం. 1623 పు.

నీనియమము సంజ్ఞావాచకముల విషయమున వర్తింపదనినమాట.[1] దీనికనుగుణముగా పాణినిముని "హలోఽనన్తరాస్సంయోగః" అనుచోట హలః అను బహువచనాన్తమునకు సంయోగః అను ఏకవచనాన్త సంజ్ఞను వాడెను.[2] అట్లే "క్తక్తవతూ నిష్ఠా" అనుచోట గూడ క్తక్తవతూ అనునది ద్వివచనమున, నిష్ఠాయను సంజ్ఞావాచక మేకవచనమున నున్నవి.[3] ప్రథమా విభక్తి సంజ్ఞావాచకమే కదా! ఈ సంప్రదాయము ననుసరించియే 'సు ఔ జస్ ప్రథమా విభక్తిః'[4] అనియు, 'డు, ము, వు, లు ప్రథమ' అనియు[5] వైయాకరణులు వ్రాసిరి.

కావున నిచట చింతామణి కర్త సంస్కృత సంప్రదాయము నుల్లంఘింపలేదని నిర్ణయింపవచ్చును.[6]

---

1. తదితి ప్రకృతం యుక్తవద్భావలక్షణం నిర్దిశ్యతే. తదశిష్యం సవక్తవ్యమ్ కస్మాత్ ? సంజ్ఞా ప్రమాణత్వాత్. సంజ్ఞా శబ్దాహి నానా లిఙ్గ సంఖ్యాః ప్రమాణం పఞ్చాలావరణా ఇతిచ నైతే యోగ శబ్దాః కింతర్హి ? జన పదాదీనాం సంజ్ఞా ఏతాః.
   తత్రలిఙ్గవచనఞ్చ స్వభావ సిద్ధమేవ నయత్న ప్రతి పాద్యమ్. యథా ఆపోదారాః గృహాః, సికతా, వర్షా ఇతి. కాశికావృత్తి వారణాసి; ప్రాచ్యభారతీ ప్రకాశన్, (1963), 1-2-53 సూ.
2. సిద్ధాంతకౌముదీ 30 సూ.
3. సిద్ధాంత కౌముదీ మద్రాసు : (1879), 3012 సూ.
4. శ్రీగరణి వైయాకరణ కృష్ణాచార్యులు, శబ్దరత్నావళి పూర్వ ముద్రణము 16 పు.
5. శ్రీ చిన్నయ సూరి బాలవ్యా. తత్సమ. 1 సూ.
6. ఈ సందర్భమున క్రిందిశ్లోకములు గమనింపదగినవి.

శ్లో. విశేష్య స్యచయే లిఙ్గం విభక్తి వచనేచయే, తానికార్యాణి
యోజ్యాని విశేషణపదేష్వపి (109 శ్లో.) యతోద్దేశ్య విధేయ
త్వం తత్రాయం నియమోనవా (114 శ్లో.)

‘లోపల’ చింత

ఒకరు చింతామణి నాక్షేపించుచు లోపలనుజెప్పి ‘లో’ను విడుచుట యెందుకో తెలియదు......యొక్కను విభక్తి ప్రత్యయములలో నేల జేర్పనలేనో గూడ జింత్యము. అది కావ్యములలో గానరాదు. వ్యాఖ్యానములందు మాత్రము తెలుగుతెలియని సంస్కృత సండితులు కొందరు వాని (దాని ?) నుపయోగించుట కలదు. యొక్కాన్యా అని సంధిచేయుట విచార్యము. యొక్కా అన్యాయాః అనవలసి యుండెను” అని వ్రాసిరి. [1]

విన్నకోట పెద్దన గూడ ‘షష్ఠికిం గిరుకారంబులును యొక్క లోపలయను పదములు’ను చెప్పినాడు. [2] కావున ఆనాటికి ‘లో’ను విభక్తిగా గుర్తించుట జరుగలేదని చెప్పవలెను. లో, లోపల యను నవి పర్యాయములయినను, లోపల సంక్షిప్త రూపమే లో అనునది యైనను దానినిగూడ విభక్తి ప్రత్యయముగ వారు పెట్టుకొనకుండుటలో వింతలేదు. కూర్చిని విభక్తిగా చెప్పిన చింతామణి ‘గుఱించి’ని వదలెను గదా! దానిని విభక్త్యర్థాభిధాయక దేశ్య శబ్దముగా నహోబలపతి చెప్పెను. [3]

---

262 పుట అధస్సూచికకు తరువాయి

శ్రీ గరణివైయాకరణ కృష్ణాచార్యులు శబ్దరత్నావళి విభక్త్యర్థ ప్రకరణమ్ 119, 120 పు.

లిఙ్గసంఖ్యా విభేదేపి విశేషణ విశేష్యతా, విభక్తిః పునరేకైవ విశేషణవిశేష్యయోః ఉపయుక్తాంశ సఙ్గ్రహః 3 శ్లో. పు. 3.

[1] ఆం. భా. చ. 2 సం. 1623 పు.

[2] కావ్యా. చూ. 9 ఉ. 92 గ.

[3] కవిశిరో. అజంత. 17 సూ. వ్యాఖ్య.

వీరే మఱియొకచోట "అందు వర్ణకమునుగూడ నిర్ధారణార్థమున నుపయోగింప వచ్చును. అయిసను చింతామణి దానిని సప్తమీప్రత్యయముగ దెలుపుచున్నది. అందు అను నర్థమున లోపల వర్ణకము నుపయోగింపవచ్చును. అయినను నది షష్ఠీప్రత్యయముగ జెప్పబడినది." అని ఆక్షేపించిరి.[1]

పెద్దనగూడ లోపల యనుదానిని షష్ఠి గను, అందును సప్తమిగను చెప్పెను.[2] ఒక విభక్తి అనేకార్థములందు వచ్చుచున్నను దాని ప్రయోగ ప్రాధాన్యమును బట్టి ఒక స్థానమున విధించుట, తక్కినచోట్లగూడ గలుగవచ్చునని యనుమతించుట, ఒక మార్గము. చింతామణి పైరీతిగా లోపలను షష్ఠీ విభక్తిగను, అందును సప్తమీ విభక్తిగను చెప్పి "అన్యస్యాః క్వచిద్భవేచ్చాన్యా" (ఒక విభక్తికి మరియొక విభక్తియు నగును) అని తెల్పినది.[3] తరువాత చిన్నయసూరిగూడ యీ మార్గమునే యవలంబించెను.[4] దీనిని తప్పనుటకు వీలు లేదు.

ఇక యొక్క మాట. దీనికి కావ్యములలో ప్రయోగము లేక పోలేదు.[5] కాని దీనిని వాడుకలో షష్ఠీ తత్పురుష విగ్రహము చెప్ప

---

1. ఆం. భా. చరిత్రము 2 సం. 1031 పు.
2. షష్ఠికింగికు కారంబులును, యొక్కలోపల పదములును సప్తమికి అందు న యను పదంబులు నయ్యె. కావ్యా. చూ. ఉ.9-92 గ.
3. కవిశిరో. హలంత 41 సూ.
4. కుయొక్క లోపల షష్ఠి, అందున సప్తమి. బాలవ్యా. తత్సమ. 6, 7 సూ. అందే కారక. 21 సూ.
5. వెంపరాల సూర్యనారాయణ శాస్త్రిగారు, కవిశిరో భూషణ వివృతి పీఠిక, విజయనగరం : ఆకెళ్ళ అప్పాచలశాస్త్రిగారు (1972), XXXIX పు.

నపుడు మాత్రము ఎక్కువగా వాడుచుండురు. కేతన గూడ దీనిని ప్రస్తావించెను.[1]

పెద్దన దీనిని చెప్పెను గదా ! దీనికి కావ్యములలో ప్రయోగ మంతరాదని కూడ లాక్షణికులు భావించిరి.[2] కావున 'యొక్క'నుషష్ఠీ ప్రత్యయముగా చెప్పుటలో దోషము లేదు.

వ్యాకరణ రచనమున తెనుగు సంస్కృతపదములకు సంధి చేయుట మన తెలుగు లాక్షణికుల కలవాటే. తెలుగు సంస్కృతములలో సూత్రరచన చేసిన శ్రీమాన్ బహుజనపల్లి సీతారామాచార్యులు,[3] శ్రీ చిన్నయసూరి,[4] శ్రీ మంచెళ్ళ వాసుదేవ కవి[5] మొదలగువారు పలువురు లక్షణ గ్రంథరచనలో సంస్కృతాంధ్ర పదములకు సంధిజేసినవారే. 'మహాజనో యేనగత స్సపన్థాః' ఇంతమంది ఉద్దండ లాక్షణికులు వెళ్ళినదారిని తప్పనుటలో నౌచిత్యము లేదు. దాని వలన వచ్చిన నష్టమును లేదు.

---

1. 'ఎలసినప్పుడు చేతకై వలనయొక్క యందునను నివియగుఁ దృతీయాదులందు' ఆం. భా. భూ. 83 ప.
2. "ప్రయోగానర్హాశ్చ" 'కావ్యేషు యొక్క శబ్దః ప్రయోగానర్హశ్చస్యాత్ ... ప్రయోగార్హాః షష్ఠీసమాస విగ్రహవాక్యే చేతి వాచ్యమ్' శ్రీ మండ లక్ష్మీనృసింహకవి ఆంధ్ర కౌముది, అజంతాః విశాఖ: ఆర్ష ప్రెస్, (1895), 158 సూ. వృత్తి.
3. 'అడుగ్వాదులుద్వికర్మకంబులు' ప్రౌఢక్రియా. 135 సూ.
4. చిన్నాదులకు ఱికవర్ణకంబగు బాలవ్యా. తద్ధిత. 3 సూ.
5. ప్రామరాసపూసాల కాలేపనే(పూస+అలక); వైకృతాచంద్రికా అజంత. 140 సూ.

సంబోధన ప్రశ్నలు

ఒకరు 'ఓయీ త్యామన్త్రిణశ్చ వికృతౌ స్యాత్' (తెలుగున ఓయి అనునది సంబోధనమున వచ్చును.) అను సూత్రమును విమర్శించుచు 'దీనిని విభక్తి ప్రత్యయములలోఁ జేర్చియేల చెప్పవలెనో తెలియదు. 'రామోయి, రాముడోయీ' అని నన్నయ కాలమున పిలుచుచుండిరందురా? చకారమును బట్టి ఓయి తోఁ పాటు మఱికొన్ని ప్రసిద్ధములగు (చింతామణి చెప్పినట్టి) ఆమన్త్రిణ సంజ్ఞలుండెడివందురోఁ. అయిన నవియేవి? వానినేల చింతామణి వివరింపలేదు?' అని ప్రశ్నలను వర్షించిరి. [1]

సంస్కృతమున సంబోధన వాచకములుగా 'హేంభో' మొదలగు నవ్యయములను వాడుదురు. ఇవి విభక్తులు కావు. వీని ప్రయోగము గూడ నియతము కాదు, వికల్పము. [2] కావున సంబోధన వాచకములు సంస్కృతాంధ్రములందు విభక్తులు కావు. చింతామణి ఇది విభక్తియని చెప్పలేదు. ఓయి యనునది సంబోధనార్థకమని మాత్రము చెప్పినది. ఓయి రామ, ఓ రామ వంటి ప్రయోగములు లోకమున గలవు. 'సిద్ధిస్లోకాద్దృశ్యా' అని చింతామణి గూడ చెప్పెను గదా! వీరు రామోయి వంటి అపరూపముల నెచట నెందుకు సంపాదించిరో!

చింతామణి సంక్షేప శ్లోక గ్రంథము. ఇందలి చకారముచే ఓరి ఓసి, రో వంటి ఇతర సంబోధన వాచకములనుద్దేశించెననవచ్చును. లేదా చకారము పాద పూరణార్థము పడెనని సరిపెట్టుకొన వచ్చును. కావున నిది ఆక్షేపింపదగిన విషయము కాదు.

---

1. ఆం. భా. చ. 2 సం. 1624 పు.
2. అహోబలపత్యాచార్యుడు, కవిశిరో. అజంత 8 సూ. వ్యాఖ్య
3. కవిశిరో. సంజ్ఞ 6. సూ.

దీర్ఘ లేదా ?

ఆమన్త్రిణ సుజసో స్తః క్రమేణచాదార డాగమౌ వక్తే (సంబోధన ప్రథమ యందలి ఏకబహు వచనముల చివర వరుసగా అట్, ఆరత్ అను నాగమములు వచ్చును) అను సూత్రమును వ్యాఖ్యానించుచు 'అనితః' అని పూర్వ సూత్రము నుండి (మహతస్సోర్డుజనితో భవేత్పుంసి అనుదానినుండి) యను వర్తింపక పోయిన యెడల హరియ (- యా) అను మొదలగు సంబోధనైక వచన రూపము లేర్పడును. అను వర్తించిన యెడల హరి, (రీ) హరులార మొదలగు రూపములకు చింతామణి యందు దీర్ఘ లేకుండ (డుః)ను' అని యొకరు విమర్శించిరి. [1] ఇది సరి కాదు.

సోర్లు గితః (హ్రస్వేకారాంత శబ్దములకంటె పరమందున్న ప్రథమైక వచనమునకు లోపము వచ్చును) [2] అను సూత్రము చేత హరి మొదలగు వాని 'సు' కు లోపము వచ్చును. కావున నిచట అకారము చేరదు. హరియ వంటి రూపము లేర్పడవు. ఇచట 'అనితః' అని అనువృత్తి గూడ చేసికొన నక్కరలేదు. కాగా ఆర వచ్చుట కభ్యంతరము లేదు. హరులారవంటి రూపములు సిద్ధించును.

దీనిని సాధింప లేదా ?

ఒకరు 'మహతో నిలౌ విభక్త్యాటాదౌ వచన ద్వయే క్రమేణ స్తః' (మహద్వాచకమునకు తృతీయాది విభక్తులు పరమయినపుడు ఏకబహు వచనములందు వరుసగా ని, ల, లు వచ్చును.) అను సూత్రమును విమర్శించుచు 'ఏకవచనమున నిగాగమము వైకల్పికమని సూత్రము వలన దెలియదు, గాన (నిః) రాముచేత మొదలగు రూపములును

---

[1] ఆం. భా. చ. 2 సం. 627 పు.

[2] కవిశిరో. అజంత. 36 సూ.

గలవు.' అని వ్రాసిరి. అనగా రాముచేత వంటి వానిని చింతామణి సాధింపలేదని తెల్పుట. కాని 'చింతామణి టాది విభక్తౌనిర్నేష్యేకే' (తృతీయాది విభక్తులు పరమయినపుడు 'సి' అను నాగమము లేదని కొందరనిరి) అని నిగాగమమునకు మతాంతరమున లోపము నంగీకరించినది. కావున రాముచేత వంటి రూపములను గూడ చింతామణి సాధించినట్లే. ఈ సందర్భమున బాలసరస్వతి ఆ రూపము నుదాహరించెను,[1]

కాని యిట్టిరూపములు చింతామణి కర్త కిష్టమగునో కావో యని విమర్శకులు సందేహించిరి.[2] ఇష్టము కానిచో నీ గ్రంథమున దానికి స్థానమెట్లు లభించును? ఇష్టము కాదని చెప్పదలచినచో వాచ్యముగానే చెప్పును గదా! అట్లు చెప్పనందున ఒకరి మతమున కలవని చెప్పినందున అట్టి రూపములు మతాంతరములుగా ఇష్టములనియే చెప్పవలెను,

కర్మప్రవచనీయకే కూర్చిః

కొందరు "చింతామణికర్త పెద్ద వైయాకరణుని వలె కన్పించడు. అతని వ్యాకరణజ్ఞానం కొన్నిచోట్ల అపర్యాప్తంగాఉంటుంది. విభక్తి విధానం చేసేటప్పుడు కూర్చిని 'కర్మప్రవచనీయకే కూర్చిః' అనే సూత్రంలో చెప్పాడు. సంస్కృతవ్యాకరణంలో కర్మప్రవచనీయ సంజ్ఞ 'అను' మొదలగు ఉపసర్గలకు అవి ద్వితీయా విభక్త్యంత రూపాలపై చేరి కర్మను స్పష్టంగా ప్రకటిస్తాయి కాబట్టి ఏర్పడింది.

దీనినిబట్టి కర్మప్రవచనీయం ఒక విభక్తి ప్రత్యయం కాదని తెలిసికోవచ్చు. చింతామణి కర్త మాత్రం కూర్చిని ద్వితీయా

---

1. ప. బాలస. అజంత. 5 శ్లో. వ్యాఖ్య.
2. ఆం. భా చ. 2 సం. 1629. పు.
3. సం. ప్ర. వ్యాకరణాలు 175, 176 పు.

ప్రత్యయంగా నిర్దేశించాడు. దానిని విధించేటప్పుడు కర్మప్రవచనీయ మంటున్నాడు." అని విమర్శించినారు.[1]

ఇందలి సత్యము నరయవలెను. ఈ విమర్శకులు భావించినట్లు చింతామణి కర్త కూర్చిని కర్మప్రవచనీయముగా జెప్పినచో నీవిమర్శ నంగీకరింపవచ్చును. కాని చింతామణి కర్త కూర్చినికర్మప్రవచనీయమని చెప్పలేదు. వారు కర్మప్రవచనీయక పదమును జూచి చింతామణికర్త కూర్చిని కర్మప్రవచనీయమనెనని భ్రాంతిని పొందియుందురు. కర్మప్రవచనీయక పదమునకు చివర నున్నకప్ ఇది బహువ్రీహి సమాసమని తెలుపును.[2] కావున దీనికి కర్మప్రవచనీయ మను నర్థము కానేరదు.

చింతామణి కర్త 'కర్మప్రవచనీయకే కూర్చిః' అని చెప్పెను. కర్మను (క్రియను) ప్రకృష్టముగా జెప్పునవి కర్మ ప్రవచనీయములు. కర్మప్రవచనీయమ్ యస్మిన్సః కర్మప్రవచనీయకః అను విగ్రహము ననుసరించి కర్మ (క్రియ) బాగుగా చెప్పబడు ద్వితీయా ప్రదేశము కర్మ ప్రవచనీయక మనబడును. కావున అట్టిచోట కూర్చి వచ్చునని పై చింతామణి సూత్రమునకు నర్థమును చెప్పవలెను. కాగా చింతామణి కర్త ఇచట పొరపడలేదని తేలుచున్నది. యీ సూత్ర రచనమును బట్టి చింతామణి కర్తకు వ్యాకరణ జ్ఞానమల్పమను విమర్శ గూడ భ్రాంతి జన్యమే అని స్పష్టమగుచున్నది. మహోపాధ్యాయుడు భాష్యాంత వైయాకరణుడునగు బాలసరస్వతి, అనేకశాస్త్రపండితులు మిత్రులుగా గల అహోబల పత్యాచార్యుడు వ్యాఖ్యానించిన

---

1. ఆం. భా. చరిత్రము గూడ నిట్టి అభిప్రాయమును ప్రకటించెను. ఆం. భా. చ. 1628 పు.
2. ఇచట, 'శేషాద్విభాషా' సిద్ధాంతకౌముది 891సూ. అనుదానిచే కప్ ప్రాప్తించును.

గ్రంథము చింతామణి. దీనిలో తప్పుండుట నిజమైనచో దీనిని వారెట్లు గ్రహింతురు ? ఈ సందర్భమున వేరొకరు "కూర్చి అనునొక్కదానినే కర్మప్రవచనీయార్థమున జెప్పి తత్తుల్యములగు వంక - ఎడ-అందు వెంబడి-పక్క--వైపు-పట్టి-చేసి మొదలగువానిని గూడ కర్మప్రవచనీయసంజ్ఞికములుగ నుదాహరింప కుండుట చింత్యము' అని చింతామణిని విమర్శించిరి. [1]

చింతామణి కూర్చి అను విభక్తి ప్రత్యయమును జెప్పినదిగాని కర్మప్రవచనీయార్థమున వాడదగు తెలుగు పదముల పట్టికను జెప్ప దలచలేదు. వందల వత్సరములకు బూర్వము బయలుదేరిన ఆ గ్రంథమునకు తరువాత బయలుదేరిన శతాధిక వ్యాకరణగ్రంథములును నట్టి ప్రయత్నమును చేయలేదు. ఇట్లితరులు చెప్పని విషయమును గూర్చి చింతించుట నారంభించినచో జీవితాంతము చింతింపవలసిన వారమే అగుదుము.

ఈ కూర్చి విభక్తి ఇత్థంభూతాఖ్యానార్థమున వచ్చుచున్నదని కళాప్రపూర్ణ వఝలచిన సీతారామస్వామిశాస్త్రి వెల్లడించినారు. [2]

---

1. ఆం. భా. చ. 2 సం. 1628.

2. ఒకానొక ప్రకార విశేషము నొందిన వాడిత్థంభూతుడనిపించుకొనును.

అట్టివానిరీతియిందా (భక్తోవిష్ణుం ప్రతి, విష్ణుని గూర్చి భక్తుడు అనుచోట) జెప్పబడెను గావున నిద్ది యిత్థంభూతాఖ్యానమగును. విష్ణువు విషయము, భక్తి విషయి. విష్ణునకును భక్తికిని గల విషయవిషయ భావరూపసంబంధము 'అభి, ప్రతి' మున్నగు కర్మప్రవచనీయములచేద్యోతితమగుచున్నది. ఇచట వైషయిక సప్తమి రావలసియుండగా గర్మప్రవచనీయ యోగమున ద్వితీయ వచ్చినది. తెలుగున నిట్టియర్థమున, గూర్చి విభక్తి ప్రయోగదృష్టమగుచున్నది. ఆం. వ్యా. సం. సర్వస్వము. 2 సం. వాల్తేరు : ఆంధ్ర విశ్వకళా పరిషత్తు, (1952), 963, 964 పు.

ఈ ప్రత్యయముద్దేశార్థము నందును ప్రయుక్తమగుచున్నదని శ్రీమాన్ బహుజన పల్లి సీతారామాచార్యులు చెప్పినారు.[1] ఇది యీ విషయమున గలిగిన క్రమాభివృద్ధి.

దీని ప్రయోజనమిది

ఒకరు 'వ్యవహితాశ్చ సర్వే స్యుః' (ప్రథమ యందున్నయన్ని విశేషణములకు వాని విశేష్యములకును మధ్యమున మఱికొన్ని పదములును రావచ్చును) అను సూత్రమును వ్యాఖ్యానించుచు 'ఈ సూత్ర ప్రయోజనము తెలియదు. సంస్కృతమునను విశేష్యత ద్విశేషణములు వ్యవహితములుగ నుండవచ్చును గదా'! అని శంకించిరి.[2]

ప్రథమాన్త విశేషణములకు విశేష్యములకు నడుమ అగు, అయిన మొదలగు అగుధాతుజ విశేషణములు చేరుట తెలుగులో ప్రత్యేక లక్షణము. దీని నిచట చింతామణి సూచించి ఉండవచ్చును.[3] ఇట్టిది సంస్కృతమున లేదు. కావున ప్రత్యేకముగా జెప్పుకొనవలసి యుండును. దీనికి ముందు సూత్రము 'షష్ఠీ విశేషణానాం ప్రథమా స్యాత్' (షష్ఠీ విభక్త్యంత శబ్దముల విశేషణములకు ప్రథమా విభక్తి వచ్చును)[4] అనునది. ఇందు షష్ఠీవిశేషణముల మాట మాత్రము చెప్పబడినది. ఇట్లు చెప్పుటచే షష్ఠ్యంత విశేష్యముల విశేషణములు అగుధాతుజ విశేషణ వ్యవధానము లేకున్నను ప్రథమలగుననియు

---

1. ప్రౌఢ. కారక. 2 సూ. వృత్తి.
2. ఆం. భా. చ. 2 సం. 1637 పు.
3. వ్యవహితాః = వ్యవధానముకలవై, సర్వే = అన్ని విభక్త్యంత మందుగల విశేష్యముల విశేషణములును, స్యుః = ప్రథమలగును అని దీని ప్రతి పదార్థము.
4. అందే.

అగు ధాతు వ్యవధానమున్నచో సర్వ విభక్త్యంత విశేష్యముల విశేషణములును ప్రథమ నంద వచ్చుననియు సారాంశము గలుగును.

అమహతీనామ్ విమర్శ

ఒకరు చింతామణి యందలి 'ఉభయ విధ మమహతీనామ్' (అమహతీ వాచకములకు స్త్రీలిఙ్గ, అస్త్రీలిఙ్గ విశేషణములు రెండును గలుగును) అను సూత్రమును విమర్శించుచు "అమహతీనామ్ అనుట వలన మహద్వాచకములును మహతీతరా మహద్వాచకములును గ్రహించవలసియున్నను సూత్రకారుని యాశయమున మహద్వాచక పదములకీ సూత్రముతో ప్రసక్తిలేదు. మహాతీతరా మహద్వాచకములను మాత్రమే సూత్రమువలన గ్రహింపవలెను" అని వ్రాసిరి.[1] అనగా గ్రంథకర్త తన ఉద్దేశమును సరిగా వెల్లడించలేక పోయెనని వీరి భావమన్న మాట.

'న + మహతీనామ్' అనునది నఞ్ తత్పురుషము. ఇచటి నఞ్ పర్యుదాసము. ఇది తద్భిన్నము, తత్సదృశము నగు వస్తువును చెప్పుట సంప్రదాయము.[2] ఇది శబ్దశాస్త్రము (1) మహద్వాచకములు (2) అస్త్రీలింగా మహత్తులు, (3) స్త్రీ లింగాప్రాణి వాచక

---

1. ఆం. భా. చ. 2 సం. 1638 పు.

2. ఈ సందర్భమున 'నఞివయుక్త మన్య సదృశాధికరణే తథా హ్యర్థ గతిః' అను పరిభాషయు, 'నఞ్ యుక్త మివయుక్తంచ యత్కిఞ్చిద్దృశ్యతే తత్ర తస్మాద్భిన్నే తత్సదృశేఽధికరణే ద్రవ్యే కార్యం విజ్ఞాయతేహి, యతస్తదార్థ గతిరస్తి. నహి అబ్రాహ్మణ మానయేత్యుక్తే లోష్ఠమానీయ కృతీభవతి' అను నాగేశభట్టు వ్యాఖ్యయు గమనింపదగినవి. పరిభాషేన్దుశేఖరః 74 పు. వ్యాఖ్య.

అను మూడు రకముల శబ్దములును మహతీ భిన్నములే. అమహతీ శబ్దము స్త్రీలింగము. పై మూడింటిలో స్త్రీలింగా ప్రాణి వాచకములకు మహతీ సాదృశ్యము కలదు. అతడు స్త్రీత్వము కావలెనని తలపనిచో 'అమహతాం' అని చెప్పియుండును. అమహత్వము, స్త్రీత్వము అను రెండు ధర్మములు మొదటి రెండింటియందు లేవు కదా! కాన గ్రంథకర్త ఆశయమును సూత్రము వ్యక్తము చేయుచునే ఉన్నదని తలపవలెను.

స్త్రీ సమములకు సులోపము

ఒకరు 'సులోపము గలుగుటయే స్త్రీ సమత్వమునకు లక్షణమగునపుడు స్త్రీ సమములకు సులోపము గలుగునని చెప్పుట నిర్వచన పద్ధతి కాదు. "అనుతాం స్త్రీణాం సమానాం సర్వస్య స్త్రీ సమస్యచ సులోపః" (ఉదంతములు కాని స్త్రీ లింగ తత్సమ శబ్దములకు, అన్ని స్త్రీ సమములకు సులోపము వచ్చును) అను సూత్రమును విమర్శించుచు వ్రాసిరి.[1] సులోపము గలుగుట స్త్రీ సమత్వమునకు లక్షణమని చింతామణి చెప్పలేదు. ఇచటనిర్వచనమునుగూడ చెప్ప బూనుకొనలేదు. వీరు చెప్పిన స్త్రీ సమలక్షణము మంచిదనుటకుగూడ వీలులేదు. ఇకారాంతమహద్వాచకములకు గూడ సులోపము వచ్చుచున్నది. వానిని స్త్రీ సమములనము గదా! 'స్త్రీవత్స్యుః స్త్రీ సమాః, (స్త్రీలింగ తత్సమ పదములవలె స్త్రీ సమ పదములు కార్యముల నందును) అని చింతామణి కర్త చెప్పెను.[2] మహద్వాచకములకు చెప్పబడిన ఉత్వడుజ్జులుగాని, అమహన్నపుంసకములకు జెప్పబడిన మువర్ణముగాని స్త్రీ లింగ శబ్దములకు గలుగవు. పై అతిదేశ విధిచే స్త్రీ సమములకుగూడ నీకార్యములు గలుగవని సూచింపబడినది.

---

[1] ఆం. భా. చ. 2 సం. 1645 పు.

[2] కవిశిరో. అజంత. 84 సూ.

'అనుతాం' అను సూత్రముచే స్త్రీలింగ తత్సమములకు స్త్రీ సమములకుగూడ సులోపము విధింపబడినది. ఇచట తత్సమ స్త్రీ లింగములకు సులోపము చెప్పినచో తెలుగు స్త్రీ సమములకు గూడ వచ్చునుగదా ! మరల వీనికి వేరుగా సులోపమును విధింపనేల యను సందేహము గలుగును. ఉదంత తత్సమ స్త్రీలింగములకు సులోపమురాదు. తదితర తత్సమ స్త్రీలింగములకు వచ్చుచున్నది. తెలుగు స్త్రీ సమములలోగూడ నిది ఇట్లే ప్రవర్తించునని భ్రాంతి కలుగునేమోయని దానిని నివారించుటకు 'అన్ని (తెలుగు) స్త్రీ సమశబ్దములకు సులోపము గలుగు'నని వేరే చెప్పికొనవలసి వచ్చినది. ఇంతకు నిచట పై విమర్శకుల ఆక్షేపణమునకుతావులేదనుటస్పష్టము.

హలంత శబ్ద విభాగము

చింతామణిలో హలంత పరిచ్ఛేదమున మెత్తము హలంత శబ్దములను గుణవద్గణము అగుణవద్గణము అనురీతిగా విభజించిని వ్యాఖ్యాతలు వ్రాసిరి.[1] దీని వలన చింతామణిలోని గుణవద్గణ విభాగము సరిగానే యున్నదనియు,నగుణవద్గణ విభాగము మాత్రము సమగ్రము కాదనియు ననవలసి యున్నదని పరిశోధకులు భావించిరి.[2] అగుణవద్గణ శబ్దములకు ప్రాతిపదిక సంస్కృత ప్రథమైక వచనాంతతుల్యము. గుణవద్గణములకు ప్రాతిపదిక సంస్కృతద్వితీయైకవచనాంత తుల్యము. కాని భువి, దివి అనుసప్తమ్యంతములు గూడ దెనుగున ప్రాతిపదికములుగా గాన వచ్చుట, ఋత్విగాది శబ్దముల ప్రాతిపదిక సంస్కృత ప్రథమైక వచనాంతి తుల్యముగను, సంస్కృత ద్వితీయైక వచనాంత తుల్యముగను గూడ నుండుటచే వారగుణవద్గణ విభాగమసమగ్రమని భావించిరి. గుణవద్గణము మొదలగు వానిని వివరింపకయే చింతా

---

1. ప. బాలస. హలంత. 1, 2 సూ. వ్యాఖ్య.

2. ఆం. వ్యా .వికాసము. ప్రథమ. 387 పుట.

మణి వాడుకొనినదని మఱియొక లోపమును బరిశోధకులు తెల్పుచున్నారు.[1]

ఇదంతయు హలంత శబ్దములన్నియు గుణవద్గణా గుణవద్గణములను ద్వివిధములుగా విభజింపబడినట్లు భావించుటచే వచ్చిన పరిస్థితి. 'ప్రథమైక వచన తుల్యం సర్వత్ర హలన్త మగుణవత్ప్రభృతి' సర్వత్ర = అంతటను, ప్రథమైక వచన తుల్యం = సంస్కృత ప్రథమైక వచనముతో సమానమగు ప్రాతిపదిక గలది, అగుణ వత్ప్రభృతి = అగుణవద్గణము (అగును) 'గుణవద్గణోద్వితీయైక వచన తుల్యోభ వేద్వికృతౌ, 'వికృతౌ = తెలుగున, ద్వితీయైక వచన తుల్యః = సంస్కృత ద్వితీయైక వచనముతో తుల్యమైన ప్రాతిపదిక గలది, గుణవద్గణః = గుణవద్గణము, భవేత్ = అగును. అనివీనిని వ్యాఖ్యానించినచో సూత్ర కర్త గుణవద్గణాగుణవద్గణములను వివరించినట్లగును.

ఋత్విగాదులు ద్వివిధ రూపముల నందుచున్నవను మాట నిజమే. ఒక శబ్దము రెండుగణములలో నుండి రెండురకముల రూపముల నందుట దోషము కానేదు. చిన్నయ సూరి బాలసరస్వత్యాదులు వ్యాఖ్యానించినట్లు గుణవద్గణ భిన్నములగు సకల హలంత శబ్దములను 'హలంతంబు ప్రథమైక వచనాంత తుల్యం బిందునామంబగు' అని ప్రథమైక వచనాంత తుల్య ప్రాతి పదిక కలవిగా చెప్పెను.[2] వానిలో ఋత్విగాదులు గూడ జేరుటచే ఋత్విక్కు వంటి రూపములు సిద్ధించినవి. 'ఋత్విగాదులు ద్వితీయైక వచనాంత తుల్యంబులు విభాషనగు' అని ఋత్విగాదులకు ద్వితీయైక వచనాంత తుల్యతను గూడ విభాషగా విధించుకొనుటచే ఋత్విజుడు వంటి రూపములను సిద్ధింప జేసికొనెను

---

[1] ఆం. వ్యా. వికాసము ప్రథమ. 388, 389 పుటలు.

[2] బాల వ్యా. తత్సమ. 67 సూ.

గదా ! [1] అనగా చింతామణిలో వలెనే బాల వ్యాకరణమున గూడ అగుణవద్గణ గతములయిన ఋత్విగాదులు గుణవద్గణమునకు వలెనే ద్వితీయైక వచనాంత ప్రాతిపదిక నందుచునే యున్నవి.

ఇక సప్తమ్యంతములయిన భువి దివి శబ్దముల మాట. వానిని 'భూ దివోస్తు జాయ త్తత్' (భూదివ్ శబ్దములకు సంస్కృత సప్తమ్యంత రూపములు తెలుగున ప్రాతిపదికలగును) అని చింతామణి షేశ సాధించినది. [2]

పై తీరుగా నర్థమును జెప్పి 'ద్విత్వోత్త్వే సర్వహలాం హ్రస్వాత్' అను సూత్రమునకు ఈ హలంత శబ్దములలో హ్రస్వాత్ = హ్రస్వము కంటె పరముగా నున్న, సర్వ హలాం = అన్నిహల్లులకు, ద్విత్వోత్వే = ద్విత్త్వము, ఉత్వము గలుగును. అని అర్థమును జెప్ప వలెను. అనగా కేవలమగుణవత్ప్రభృతి శబ్దములకే కాక తదితర హలంత శబ్దములకు జివరి హల్లునకు ద్విత్వోత్త్వములు వచ్చునన్న మాట. ప్రత్యేకముగా చివరి హల్లునకు లోపము విధింపబడిన శబ్దములకు దప్ప తక్కిన హలంత శబ్దముల కన్నిటికి నీవిధి ప్రవర్తింప వచ్చును. సంస్కృత ప్రాతి పదికములను గ్రహించినపుడు గూడ ద్విత్త్వోత్త్వములు ప్రవర్తించునని శ్రీ పాద లక్ష్మీనారాయణ శాస్త్రిగారు గూడ తెల్పియున్నారు. [3] ఇట్లు గుణవదగుణవద్గణములనే కాక సంస్కృత ప్రాతిపదికలను గూడ గ్రహించినచో దక్కిన సూత్రములకు సమన్వయము కుదురునా ? యను విషయము పరిశీలింపవలెను.

'అగుణవతాం సర్వహలాం సోర్లోపః' అగుణవద్గణ శబ్దములకు, హల్లు అంతముగా గల అన్ని శబ్దములకు సులోపము వచ్చును. [4] ఇచట

---

[1] అండే. 73 సూ.

[2] కవిశిరో. అజంత. 64 సూ.

[3] కవిశిరో భూషణ చంద్రిక హలంత. 8 పుట.

[4] కవిశిరో. హలంత. 5 సూ.

అగుణవత్ప్రభృతులకు సులోపమును జెప్పుటకు 'అగుణవతాం స్యోర్లోపః' అని వ్రాసిననే సరిపడుచుండగా 'సర్వహలాం' అని వేరే చెప్పుట వలన 'అగుణవత్ప్రభృతు'లలో లేకున్నను హల్లు అంతమందు గల హలంత శబ్దములకు గూడ నీసులోపము వర్తించునని వ్యాఖ్యానించుట ఉచితము.

ఈవ్యాఖ్యచే వికల్పముగా చివరి వర్ణము లోపించిన 'ఉరము' మొదలగు వానికి అంత్యవర్ణలోపవిధులు వికల్పములు గనుక గదిలోపించినప్పుడు 'ఉరస్సు' వంటి రూపములలో సులోపము గలుగును. దీనిచే సులోపముగల అగుణవత్ప్రభృతులకు సంస్కృత ప్రథమైక వచనాంతములను బ్రాతి పదికగా దీసికొంటిమి. 'సాన్తాదపయః ప్రభృతేః స్లోపః' అనుచోట సాన్తములయిన అపయః ప్రభృతులకు సంస్కృత ప్రాతిపదికనే ప్రాతిపదికగా గ్రహించుట యుక్తము.[1] ఉరస్, శిరస్ మొదలగు శబ్దములు సంస్కృత ప్రథమ ద్వితీయైక వచనములు రెండింటియందును ఉరః, శిరః అని విసర్గాంతముగ నుండును. సకారాంతత్వము సంస్కృత ప్రాతి పదికలోనే కనబడును. 'సాంతాత్' అని మూలకారుడు ప్రత్యేకముగా బేర్కొని నందున వీనికి సంస్కృత ప్రాతి పదికలనే తెలుగున గూడ బ్రాతి పదికలుగా గ్రహించుట యుక్తము.

అట్లే 'ఆత్మన ఇమనంతానాండావా' (ఆత్మన్ శబ్దమునకు 'ఇమన్' అంతముగా గల వానికి డా ప్రత్యయము వికల్పముగా వచ్చును.)[2] 'డుస్సాన్యత్సదారాజ్ఞః' (రాజన్ శబ్దమునకెపుడునుడు, వచ్చును.)[3] అను సూత్రములందు బేర్కొనబడిన ఆత్మన్, మహిమన్, రాజన్ శబ్దములకు గూడ సంస్కృత ప్రాతి పదికనే ప్రాతి

---

1. కవిశిరో. హలంత. 9 సూ.
2. కవిశిరో హలంత. 7 సూ.
3. అందే 8 సూ.

పదికగా గ్రహించుట ఉచితము. ఆత్మన్ మొదలగు వానికి సంస్కృత ప్రథమైక వచనమును ప్రాతిపదికగా తీసికొనినచో డిత్వ ప్రయోజనము మృగ్యము. 'ఆత్మా' అను ప్రథమైక వచన రూపమునకు 'దీర్ఘానాం హ్రస్వస్యాత్' (నామంబుల తుది దీర్ఘంబునకు హ్రస్వంబగు)[1] అని హ్రస్వమువచ్చి 'ఆత్మ' అను రూపమగును. అర్థమును బట్టి మహద మహన్మహాతీ వివక్షను బట్టి ఆత్ముడు, ఆత్మ, ఆత్మము వంటి రూపములు సిద్ధించును.

సంస్కృత ప్రాతిపదికనే ప్రాతి పదికగా గ్రహించుటచే డిత్వముచే టి లోపము వచ్చి ఆత్మా అను రూపము సిద్ధించును. దానికి హ్రస్వము వచ్చి ఆత్మ అగును. 'డా' వికల్పము గనుక అది రానపుడు 'అన్యేషాఞ్చ వాలు గంతస్య' (సాంతవ్యతిరిక్తములకు గూడ చివరి వర్ణమునకు లోపము వికల్పము)[2] అను దానిచే నకారలోపము వచ్చి ఆత్ముడు, ఆత్మము వంటి రూపములు సిద్ధించును.

ఈ 'అన్యేషాం' అను సూత్రము చేతనే పథిన్ మొదలగు శబ్దముల యందు చివరి వర్ణము లోపింపవలెను. పథిన్ శబ్దమునకు ప్రథమైక వచనము 'పన్థాః' అనునది. ద్వితీయైక వచనము 'పన్థానమ్' అనునది. ఇచట సంస్కృత ప్రాతి పదిక యగు పథిన్ అను దానినే ప్రాతి పదికగా నహోబలపత్యాచార్యుడు గూడ గ్రహించెను.[3] ఇచట గూడ సంస్కృత ప్రథమైక వచన తుల్యమునే ప్రాతి పదికగా గ్రహించినచో పంథము అను రూపమగునుగాని పథము కానేరదు.

ఈ పరిశీలనముచేగొన్ని హలంత శబ్దములలో సంస్కృత ప్రాతి పదికలను తెలుగున ప్రాతిపదికలుగా గ్రహించుట యవసరమనియు,

---

[1] కవిశిరో. అజంత. 46 సూ.

[2] కవిశిరో. హలంత. 10 సూ. వ్యాఖ్య.

[3] అంధ్ర హలంత. 10 సూ.

నట్లు గానిచో అపయః ప్రభృతులకు సకారలోపమును విధించుట, ఆత్మన్ మొదలగు వానికి 'డా' ప్రత్యయమును విధించుట పథము మొదలగువాని రూపసాధనము నసంగతములగునని తేలినది.

కావున తెలుగున గల హలంత శబ్దములను అగుణవద్గుణవద్భేదముచే ద్వివిధముగా విభజించుట చింతామణి చేసిన పనియని చెప్ప రాదనియు, అగుణవత్ప్రభృతులకు, చివరి వర్ణము లోపింపని హలంతములకు ప్రథమైక వచనతుల్యమును, గుణవద్గణమునకు ద్వితీయైక వచన తుల్యమును, అపయః ప్రభృతులకు, ఆత్మన్ శబ్దమునకు, ఇమన్నంతములకు, రాజన్ శబ్దమునకు సంస్కృతప్రాతిపదికను తెలుగున బ్రాతిపదికగా తీసికొనవలెనని సారాంశము.

ఇది అసమర్ధ సూత్రమా ?

చింతామణిలో 'ఆత్మన ఇమనంతానాండావా' (ఆత్మన్ శబ్దమునకును ఇమనిజంత శబ్దములకును 'డా' ప్రత్యయము వికల్పముగా నగును) అను సూత్రమున్నది.[1] ఈ సూత్రముద్దిష్టార్థమును నెరవేర్చలేక పోవుచున్నదని విమర్శకు లిట్లు వ్రాసియున్నారు. "సూత్రము ఇక 'డా' చేరుటవైకల్పికమని చెప్పుటచేత (డా చేరని పక్షమున) ఆత్మన్, గరిమన్, లఘిమన్, అనురూపములట్లే మిగులును. ఆ రూపములకు దత్సమత్వమున బ్రథమైక వచన రూపములేమగునో చింతామణి తెలుపలేదు. 'ద్వితోత్వే' అను సూత్రమువలన ఆత్మన్ను, గరిమన్ను, లఘిమన్ను అను ననిష్టరూపము లేర్పడుచున్నవి. అట్టి రూపము లేర్పడుట చింతామణికర్త యాశయము కాదు. ఆత్మ, గరిమ, లఘిమ మొదలగు రూపములతో పాటు ఆత్మము, ఆత్ముడు, గరిమము, లఘిమము మొదలగు రూపములు గలుగునని తెలుపుటయే యాతని యుద్దేశము. ఆ రూపకల్పనమునకు

---

[1] శవిశిరో. హలంత. 7 సూ.

‘డావా’ యని చెప్పుటవలనఁ బ్రయోజనములేదు. ఆత్మము మొదలగు రూపము గలుగుటకుముందు ‘డా’ నిత్యముగ వచ్చితీరవలెను. అట్లు వచ్చిన రూపము వైకల్పికముగా (స్త్రీ) సమమగునని వేరే చెప్పవలసి యుండును” అని వారి యభిప్రాయము. [1]

ఇచటి సందర్భము లోతుగా పరిశీలింప దగినది. చింతామణి యందు హలంత పరిచ్ఛేదాదిలో అగుణ వత్ప్రభృతి, గుణవద్గణము అనుగణములు పేర్కొనబడినవి. పిదప అందలి శబ్దములు తయారగు రీతులు చెప్పబడినవి. ఆత్మన్ శబ్దము, ఇమనిజంతములు పై రెండు గణములలోను చేరుటలేదు.

అగుణ వత్ప్రభృతి శబ్దములకు సంస్కృత ప్రథమైకవచనమును, గుణవద్గణ శబ్దములకు సంస్కృతద్వితీయైక వచనమును ప్రాతిపదికలగును. ఆత్మన్ శబ్దమునకు సంస్కృత ప్రథమైన వచనము ‘ఆత్మా’ అనునది. ఇచట చివర హల్లు లేనందున అగుణ వత్ప్రభృతి శబ్దములకు విధింపబడిన ద్విత్వోత్వములు వచ్చు నవకాశము లేదు. ఆత్మన్ శబ్దమునకు ద్వితీయైక వచనాంతరూపము ‘ఆత్మానమ్’ అనునది. దీనికి గుణవద్గణ శబ్దములకు విధింపబడిన డుఙ్, ము వర్ణములను జేర్చినచో ఆత్మానుడు, ఆత్మానము వంటి అపరూపము లేర్పడును. వీనిని నివారించుటకు గ్రంథకర్త ఆత్మన్, ఇమనిచ్ ప్రత్యయాంతములకు సంస్కృతప్రాతిపదికలే తెలుగునగూడ ప్రాతిపదికలగునని ఉద్దేశించినాడు. ‘డా’ ప్రత్యయమును విధించినాడు. డకారమిత్తుగా గలిగిన ప్రత్యయము పరమయినచో టి లోపము వచ్చును.

ఆత్మా అను ప్రథమైక వచనరూప ప్రాతిపదికకు అకారము పరమయినప్పుడు టి లోపమువచ్చినను రాకున్నను భేదము లేదు. ‘ఆత్మానమ్’ అను ద్వితీయైక వచన ప్రాతిపదికకు టి లోపము రాగా

---

1. ఆం. భా. చ. 2 సం.

ఆత్మాన్ అగును. దీనికి ఆకారమును జేర్చుటచే 'ఆత్మానా' అను నప రూప మేర్పడును.

కావున టి లోపమును సూచించు 'డా' ప్రత్యయమును విధించుటచే నిచట ప్రాతిపదిక సంస్కృత ప్రాతిపదికయే యని సూచింపబడినది. దానికి 'డా' ప్రత్యయము వచ్చిన పిదప టి లోపము, డకారమునకు నిత్సంజ్ఞ, లోపము సిద్ధించినచో ఆత్మ్ + ఆ = ఆత్మా అనియగును.[1] "దీర్ఘాణాం హ్రస్వస్స్యాత్" (దీర్ఘాంత శబ్దముల చివరి దీర్ఘమునకు హ్రస్వము వచ్చును)[2] అను విధిచే ఆత్మ అను రూపమగును. అచట 'అగుణవతాం సర్వహాలాం సోర్లోపః' (అగుణవత్ప్రభృతి శబ్దములయొక్క, ఇతర హాలంత శబ్దములయొక్క 'సు' కు లోపము వచ్చును.) అను దానిచే 'సు' లోపించి, ఆత్మ' అను ప్రథమైక వచన రూపము సిద్ధించును.[3] ఇచట టి లోపము వచ్చినందున (ఆత్మ్ + ఆ) హాలంతత్వమునకు భంగము లేదు.

డా ప్రత్యయము వికల్పము. అది రానపుడు ఆత్మన్ అను సంస్కృత ప్రాతిపదికకే 'అన్యేషాఞ్చ వాలుగంతస్య' (ఇతర శబ్దముల చివరి యక్షరమునకు వికల్పముగా లోపము వచ్చును.)[4] అను సూత్రముచే నకారమునకు లోపము వచ్చును. దీనిచే హాలంతత్వము తొలగినది. కావున సులోపము రాదు. పిదప అజంత శబ్దములకు వలె మహత్వమున ఆత్ముడు, అమహత్వమున ఆత్మము అను రూపములు గూడ నగును.

---

[1] కవిశిరో. హాలంత. 7 సూ. వ్యాఖ్య.

[2] కవిశిరో. అజంత. 46 సూ. వ్యాఖ్య.

[3] కవిశిరో. హాలంత. 5 సూ.

[4] అందే 10 సూ.

విమర్శకులు ఆత్మన్ మొదలగు సంస్కృత ప్రాతిపదికలకు, అగుణవత్ప్రభృతులకు (ప్రథమైకవచన రూప (ప్రాతిపదికలకు) చేయదగిన ద్విత్వోత్వములు చేయుటచే అపరూపము లేర్పడినవి. ఆకార్యములు చింతామణి కర్త విధించినవి కావు. ఆత్మము, ఆత్ముడు అను రూపములను సాధించునపుడు 'డా' ప్రత్యయమును జేయుట అనవసరము.

డా ప్రత్యయాంతములకు టి లోపము వచ్చుటచే హలంతత్వము తొలగనందున సులోపము సిద్ధించుచున్నది. కావున వీనిని స్త్రీ ప్రత్యయాంతములని చెప్పుకొన నక్కరలేదు.

కావున నిట అనిష్టరూపము లేర్పడుచున్నవని కాని, గ్రంథకర్త ఉద్దేశ్యమును సూత్రము వ్యక్తము చేయలేదని కాని యాక్షేపించ నక్కరలేదు.

ఒకరు "గుణవద్గణము" కానిడెల్ల నగుణవద్గణము లోనిదే కావలసి యుండుటం జేసి ఆత్మా మున్నగు ప్రథమైకసచన తుల్య రూపములను బ్రాతిపదికములుగా గ్రహించి, ఆత్ముడు, ఆత్మము మున్నగు రూపములను సాధించుట యుక్తము. సంస్కృత ప్రాతిపదికములగు ఆత్మన్ మున్నగు వానిని గ్రహించి 'అన్యేషాఞ్చ వాలుగన్తస్య' అను చొప్పున నంత్య హల్లోపము చేసి రూపసాధనము చేయుట యుక్తము కాదు. మరియు నీపక్షమున ఆత్మన్ + సు ఇత్యాది స్థలములందు 'వాలుగన్తస్య' అని చొప్పున నంత్య హల్లోపా భావ పక్షమున ననిష్ట రూపోత్పత్తి సంభవించుటయు, నట్టి యనిష్ట రూపములను వారించును 'వాలుగన్తస్య' అను చోటి వాశబ్దమునకు వ్యవస్థావాచిత్వమును గల్పించుకొనుటయు మున్నగు చిక్కులు సంభవింపక తీరదని వ్రాసిరి.[1]

---

[1] ఆం. వ్యా. సం. సర్వస్వము 1 సం. 622 పు.

కాని ఆత్మన్ శబ్దము నగుణవద్గణము లోనిదిగా భావించి, ప్రథమైక వచన రూపములను ప్రాతిపదికముగా దీసికొనినపుడు 'అగుణవతాం సర్వహాలాం సోర్లోపః' అను సూత్రముచే సులోపము వచ్చుటచే ఆత్ముడు, ఆత్మము అను రూపములు సిద్ధింపవు.

'ఆత్మా' అను నగుణవద్గణ ప్రాతిపదికము ద్వారా ఆత్మము, ఆత్ముడు అను రూపములే సాధింపబడినచో దాని దీర్ఘమునకు హ్రస్వమును, అగుణవద్గణములకు విధింపబడిన సులోపమును జేసినచో ఆత్మ అను రూపము సిద్ధింపదా ? దానికై మరల, 'ఆత్మన ఇమనన్తానాండావా' అని డా ప్రత్యయమును విధించు టెందులకు ?

కావున వీరు చెప్పిన మార్గము గ్రంథకర్త ఉద్దేశించినది కాదని చెప్పవలసి వచ్చుచున్నది. 'అన్యేషాఞ్చ వాలుగన్త్యస్య', 'ఆత్మన ఇమనన్తానాండావా' అను రెండు విధులును వికల్పములే. కావున ఒకటి ప్రాప్తించనపుడు రెండవది ప్రాప్తించుటద్వారా వికల్పమునకు సార్థక్యము కలుగుచున్నది. కావున 'అన్యేషాఞ్చ వాలుగన్తస్య' అను సూత్రము ప్రాప్తింపనపుడు అనిష్ట రూపోత్పత్తి యగుటగాని, దానిని వారించుటకేవో చిక్కు దారులను ద్రొక్కుటగాని యవసరము కాదు.

అర్థగ్రహణ క్లిష్టతయట !

చింతామణిలో 'దేశ్యా దస్మ ద్యుష్మ చ్ఛబ్దా త్సుజసో ర్నుమూవు రూచస్తః' (దేశ్యములయిన అస్మత్ యుష్మత్ శబ్దముల కంటె పరముగానున్న సు, జస్ ప్రథమైక వచన, బహువచనములకు వరుసగా ను, ము, వు, రు అనునవి వచ్చును) అని కలదు [1]

“ఇందు అస్మత్ అనిన మా వలన ననియు, యుష్మత్ అనిన మీ వలన ననియు పంచమ్యర్థములు గలుగును. అది ప్రాతిపదికము

---

[1] కవిశిరో. హాలంత. 14 సూ.

లుగా నిలుచునేని నా, నీ, మా, మీ అను నర్థములను బొందును. వాని ప్రథమైక వచన రూపము లీ సూత్రముననుద్దిష్టములయిన యెడల అహమ్ త్వమ్ అను నర్థములను గ్రహింపవలెను. ఈ మూడర్థములలోను సూత్రకారుడు సాధింపవలసిన రూపములు ప్రథమైక వచన రూపములగు ఏ (నే) ను, ఈ (నీ) వు అనునవి. కావున సూత్రమందలి దేశ్యాస్మ ద్యుష్మచ్ఛబ్దములకు నా, నీ అనియే అర్థము చెప్పవలెను. 'నా,' 'నీ 'అను పదములు ప్రాతిపదికములని ముందుగ తెలిసియుండిన గాని యీ సూత్రమునకును ముందు సూత్రములకును నర్థమును వివరించుట కష్టము" అని విమర్శకులు భావించినారు.[1]

చింతామణి సంస్కృత హలంత శబ్దములలో కొన్నిటిని ప్రథమాతుల్యములు గను,గొన్నిటిని ద్వితీయాతుల్యములుగను గ్రహించవలెనని చెప్పినది. కావున నచట సంస్కృత విభక్త్యంతములనే తెలుగున ప్రాతి పదికలుగా గ్రహించవలసి వచ్చినది. దేశ్య శబ్దములను గూర్చి అట్టి విధులు లేవు. కావున నిచట విభక్త్యంతములను గ్రహింపవలసిన అవసరము లేదు. అస్మత్, యుష్మత్ అనునవి సంస్కృత ప్రాతిపదికలు. వానికి తెలుగు ప్రాతిపదికలయిన నా, నీ అను నర్థములను గ్రహించుటలో శ్రమ పడవలసిన అవసరము లేదు.

పంచమ్యంత బహువచన రూపములయిన అస్మత్, యుష్మల్ (మా వలన, మీ వలన) అను వానిని ప్రథమాంతములయిన అహమ్, త్వమ్ (నేను, నీవు) అను వానిని ప్రాతిపదికలుగా తీసికొని వాని సు, జస్ (ప్రథమైక వచన, బహువచన) ప్రత్యయములకు నుము, వురులు విధించవలెనన్న అర్థమును లాగుటలో నౌచిత్యము లేదు. పాణినీయములో యుష్మదస్మద్భ్యాం జసోఽశ్ "యుష్మ దస్మదోరనా

---

1. ఆం. భా. చ. 2 సం. 1648, 1649 పు.

దేశే" అనుచోట్ల యుష్మ, దస్మత్ప్రయోగమున్నది.[1] వీనిని వ్యాఖ్య చేసిన వారెవరును ఇవి పఞ్చమ్యంతములని సందేహింపలేదు. ప్రత్యేకముగా చెప్పికొనిన సందర్భమున తప్ప విభక్త్యంతముపై మరల విభక్తిని జేర్చుట, పంచమీ బహువచనముపై ప్రథమా ప్రత్యయములను జేర్చుట అను విషయములసంగతములు గదా!

అస్మద్యుష్మచ్ఛబ్ద రూపములను గమనింతము

అస్మచ్ఛబ్దము

	ఏ.	బ.
ప్ర.	నేను	మేము
ద్వి.	నన్నున్	మమ్ము్న్
తృ.	నాచేతన్	మాచేతన్
చ.	నాకొఱకున్	మాకొఱకున్
పం.	నావలనన్	మావలనన్
ష.	నాయొక్క	మాయొక్క
స.	నాయందున్	మాయందున్

యుష్మచ్ఛబ్దము

	ఏ	బ
ప్ర.	నీవు	మీరు
ద్వి.	నిన్నున్	మిమ్మున్
తృ.	నీ చేతన్	మీచేతన్
చ.	నీ కొఱకున్	మీకొఱకున్
పం.	నీ వలనన్	మీవలనన్
ష.	నీయొక్క	మీయొక్క
స.	నీ యందున్	మీయందున్

---

[1] సిద్ధాంత కౌముది 399, 1393 సూ.

అస్మచ్ఛబ్దమునకు వివిధ విభక్త్యంతములకు నే, మే, న, మ, నా, మా అనునవి ప్రకృతులు. "ఏ తయోర్బహుత్వేమః" అను సూత్రముచే 'మకారము' బహుత్వమున ఆదేశముగావచ్చుచున్నది.[1] కాన మకారాది రూపములకు స్థాని ప్రాతిపదికత్వము తొలగినది. అట్లే 'ప్రథమాయామే దస్మదః' అని ప్రథమా విభక్తి యందస్మచ్ఛబ్దమున కేత్వము విధింపబడుటచే ఏత్వముతో గూడినది గూడ స్థాని ప్రాతిపదిక కాదని తేలినది.[2] 'న్న మ్మా హ్రస్వశ్చాదే రమిశసిచ' అను సూత్రముచే ద్వితీయా విభక్తి యందు హ్రస్వము విధింపబడుటచే 'న', అనునది స్థానిప్రాతిపదిక కాదని తేలినది.[3] ఈ విధముగ బరిశీలించిన అస్మచ్ఛబ్దమున 'నా' అనునది ప్రాతిపదికయనియు, యుష్మచ్ఛబ్దమున 'నే' అనునది ప్రాతిపదిక అనియు తేలును.

లక్ష్యజ్ఞానము కలవారు పూర్వాపరములను పరిశీలించినచో నిచట ప్రాతిపదికను గ్రహించుట అశక్యము కానేరదు. కావుననే వ్యాఖ్యాతలు గ్రహించి సరిగా ఉదాహరించిరి. ఈ సందర్భమున నీ విమర్శకుల ఆక్షేపణమింకొకటి ఉన్నది. 'సూత్రమునాదిని 'న్న' అని యెట్లుచ్చరింపవలెనో తెలియకున్నది. వాక్యాదిని భిన్నవర్ణసంయోగము గల సంయుక్తాక్షరముల నుచ్చరింప వచ్చునుగాని, ద్విత్వాక్షరముల నుచ్చరింప వీలులేదు గదా! అని 'న్న, మ్మా హ్రస్వశ్చాదేరమిశసిచ' అను రచనము నాక్షేపించుచు వీరు చెప్పిరి.

పదాది ద్విత్వము లుండుట తప్పుకాదు. వాని నుచ్చరించుటయు అసంభవము గాదు. కొంచెము ప్రయత్నపూర్వకముగా నుచ్చరింపవలెను. భట్టోజీ దీక్షితులవారు యమ్మ్రలనుదాహరించుచు

---

1. కవిశిరో°. హలంత. 13 సూ.
2. అందే. 15 సూ.
3. అందే. 18 సూ.

‘ఘ్ఘ్నత్త్రి’ అను రూపము నిచ్చిరి.[1] పదాది ద్విత్వమ సంభవమయిన యెడల వారేల అంగీకరింతురు ? కావున నీ ఆక్షేపణము సరికాదు.

న్నుమ్మూ హ్రస్వాశ్చాదే రమిశసిచ

ఒకరు “నన్ను, మమ్ము, నిన్ను, మిమ్ములలోని ద్విత్వయుత న్నుల్లులలోని యొక హల్లు ‘అన్యతర లుక్చ యుక్తస్య’ అను సూత్రము వలన లోపింపగా వీనికి ద్వితీయా విభక్తి ప్రత్యయము చేరగా ‘నననున్’ మమునున్ నినునున్, మిమునున్ అను ననిష్ట రూపము లేర్పడుచున్నవి. ఈ రూపములపై నచ్చు చేరునపుడు ‘అనాదిషు’ మొదలగు సూత్రముచే నననునేల, నినునునేల, మమునునేల, మిమునునేల మొదలగు ననిష్ట సంధులు నేర్పడుచున్నవి”[2] అని చింతామణిలో ప్రక్రియ నాక్షేపించిరి.[3] ఇది బాగుగా బరిశీలింప దగిన విషయము. చింతామణిలో ‘న్ను మ్మూ హ్రస్వశ్చాదే రమిశసిచ’ అనునది నన్ను మమ్ము ఇత్యాదులలో ‘న్ను, మ్ము’ అను వానిని విధించు సూత్రము. ఇచట న్ను, మ్ము అనునవి ఆగమములా ? విభక్త్యాదేశములా అని ప్రశ్న. ఆగమములుగా విధించుట చేత నన్ను నున్ వంటి రూపములు, వానికి ద్విత్వములోపింపగా నననున్ వంటి రూపములు, వానికచ్చు పరముకాగా నననునేల వంటి రూపములు నేర్పడినవి. వీనినే విమర్శకులధిక్షేపించిరి.

చింతామణిని ‘నిరమో మహతామ్’ (మహద్వాచకముల ‘అమ్’ నకు (ద్వితీయైక వచనమునకు) నివర్ణకము వచ్చును) అని విధించినది.[4] తదితరార్థములకు నువర్ణకము రావలెను. నన్ను, నిన్ను

---

1. సిద్ధాంత కౌముది సంజ్ఞ 12 సూ. వ్యాఖ్య.
2. ద్వితీయా బహువచనమున లువర్ణము చేరును. ‘ను’ విభక్తి చేరదు. కాన ‘మమునున్’ అను రూపమేర్పడదు.
3. ఆం. భా. చ. 2 సం. 1601 పు.
4. కవిశిరో. అజంత. 66 సూ.

అనునవి మహన్మహత్యమహత్తులలో వేనికి చెందినవని ప్రశ్న. పురుష వాచకములు వాని విశేషణములు మహత్తులు. మహతీ వాచకములను జింతామణి స్త్రీ పదముచే వ్యవహరించినది. కాగా స్త్రీ పుంభిన్నము లమహత్తులు కావలెను. నన్ను, నిన్ను మొదలగు వానిని మహన్మహత్యర్థములలో వాడుట కలదు. జడములు 'నన్ను' 'నిన్ను' అని వ్యవహరించవు. వాని యందు కవి మహదాదికము నారోపించి, గౌణముగా వానిచేత గూడ నట్టి వ్యవహారమును జేయింపవచ్చును. ఈ స్థితిలో వీనికి నివర్ణకము రావలెనా? నువర్ణకము రావలెనా? యని ప్రశ్న. నా, నీ యను వానికి పురుషార్థమున నివర్ణము వచ్చిన రూపములు ప్రయోగములలో లేవు. భాషలో నున్న ప్రయోగములకు వ్యాకర్తలక్షణములను జెప్పవలెను గాని క్రొత్త శబ్దములను బుట్టింపరాదు గదా?

మహద్వాచకములందు 'నన్ను నిన్' అనియు, తదితరార్థములందు నన్ననున్ అనియు రూపములను జింతామణి సాధించెనన లేము గదా! కావున చింతామణి నా, నీ శబ్దములకు ను, ని వర్ణకములనుద్దేశింపలేదని తోచుచున్నది. ఈ శబ్దములకు ప్రథమా విభక్తిలో గూడ డుమువులను గాక ను, వు అని ప్రత్యేక విభక్తులను విధించుకొనుట గూడ ఈ సందర్భమున గమనింపదగునంశము. సాధారణముగా ద్వితీయా బహువచన ప్రత్యయమయిన లవర్ణము చేరిన 'మమ్ములన్, మిమ్ములన్' వంటి ప్రయోగములను ప్రాచీన కవులు చేయలేదనియు, నివి చింతామణికి సమ్మతములు గావనియు కళాప్రపూర్ణ వఝుల చినసీతారామస్వామి శాస్త్రిగారు చెప్పుచున్నారు.[1]

కావున నా, నీ అనువానికి ప్రథమా ద్వితీయా విభక్తులు ప్రత్యేకముగా విధింపబడుట చేత, సాధారణ మహదాదులకు విధింప

---

[1] ఆం. వ్యా. సం. సర్వస్వము. 1 సం. 881 పు.

బడిన ప్రథమా ద్వితీయా విభక్తి ప్రత్యయము లిచట ప్రవర్తింపవని యంగీకరించుట ఉచితమనిపించును. ఈ నా, నీ శబ్దములకు దృతీయాది విభక్తి ప్రత్యయములు వేఱే విధింపబడలేదు. ఒక్క నవర్ణకము తప్ప తృతీయాది విభక్తి ప్రత్యయములు మహాత్వాది లక్షణములనుద్దేశించి ప్రత్యేకముగా విధింపబడినవి కావు.[1] కావున వాని విషయమున నీ సమస్య లేదు. అందుచే న్ను, మ్ము లు, నా, నీ అనువానికి ద్వితీయా విభక్త్యాదేశములుగా విధింపబడెనని చెప్పవలెను.

ఈ వాదమున కొక ప్రతిబంధకమున్నది. 'న్ను, మ్మా' ఇత్యాది సూత్రమున అమి, శసి అను సప్తమ్యంత రూపములున్నవి. సంస్కృత వ్యాకరణ మర్యాదానుసారము అమ్, శస్‌లు పరముగా నున్నపుడు న్ను, మ్ము లు వచ్చునని చెప్పవలెను. విభక్తి ప్రత్యయములు పరముగా నున్నపుడు వచ్చున వాగమములు కాని యాదేశములు కావు. కాన 'న్ను, మ్ము' అను వాని నాగమములని యనవలయును. కాని ఆగమములనినచో మొదట పేర్కొనిన యిబ్బందులుండనే యున్నవి.

ఇచట వేఱొక దారి త్రొక్కవలెను. 'ప్రత్యయ గ్రహణే తదన్తా గ్రాహ్యాః' (ప్రత్యయమును గ్రహించునపుడు తదంతములు గ్రహింపదగినవి) అను పరిభాషచే అమి, శసి, అను ప్రత్యయములచే ఆ ప్రత్యయములంత మందుగల నా, నీ అను సర్వనామములను గ్రహింపవచ్చును.[2] అప్పుడు అమ్, శస్, ప్రత్యయాంతములగు నా, నీ శబ్దములందు ఆద్యక్షరమునకు హ్రస్వమును, న్ను, మ్ము లును వచ్చునని

---

1. నవర్ణకము జడ వాచకములకు విధింపబడినది. బాల వ్యా. కారక 18 సూ. కవిశిరో. అజంత. 20 సూ. వ్యాఖ్య.
2. శ్రీ భట్టోజీ దీక్షితులు సిద్ధాంత కౌముది అజంత. 218 సూ. వృత్తియందలి పరిభాష.

భావము వచ్చును. న్ను, మ్ము లు వేనికి వచ్చునను ప్రశ్నకు విభక్తి విధాన సందర్భముగాన అమ్, శస్ లకని అధ్యాహారము చేసికొన వచ్చును. లేదా అమి, శసి అనువాని నా వృత్తి చేసికొని మొదట పైన వ్రాసినట్లర్థమును జెప్పి తరువాత నహోబల పత్యాచార్యుడు చెప్పినట్లు విభక్తి వ్యత్యయము జేసికొని అమ్, శస్ లకు న్ను, మ్ము లు వచ్చునని యర్థము చెప్పుకొన వచ్చును. ఇట్లర్థము చెప్పవలసి యున్నచో అమ్, శసోః అని షష్ఠ్యంతములుగా గ్రంథకర్త ఏల వ్రాయ లేదని ప్రశ్న.

'న్ను, మ్మూ హ్రస్వ శ్చాదే రమ్ శసోః' అని వ్రాసినచో ఆదేః, అమ్ శసోః అనునవి రెండును షష్ఠ్యంతములుగా నుండును. అపుడు అమ్‌శస్సుల ఆదికి హ్రస్వము, న్ను, మ్ము లు వచ్చునని గాని, ఆదివియైన అమ్ శస్సులకు (అస్మచ్ఛబ్దము యొక్క అమ్ శస్సులకు) హ్రస్వమును న్ను, మ్ము లు వచ్చుననియు నపార్థములు వచ్చు నవకాశమున్నది.[1] ఎట్లు చెప్పినను సందర్భమును, ప్రయోగములను దృష్టిలో నిడుకొని అర్థ నిర్ణయము చేసికొనవలసినదే. ఈ స్థితిలో ఈ విధముగనే చెప్పవలయునని నియమింప నక్కరలేదు గదా !

'అమి, శసి' అని సప్తమ్యంతములుగా నుంచినచో 'ఆదేః' అను దానికి,వీనికి విభక్తి భేదమున్నందున కొంత స్పష్టత కవకాశమున్నది. కనుకనే ప్రాచీన వ్యాఖ్యాతలు న్ను, మ్ము లను విభక్త్యాదేశము లుగనే విధించు కొనుటజరిగినది.[2]

---

[1] ఈ సూత్రమునకు ముందున్న "దేశ్యాదస్మ ద్యుష్మ చ్ఛబ్దాత్సు జసోర్న్నమావుహూచ స్తః" అను సూత్రమునుండి అస్మద్యుష్మచ్ఛబ్దాత్ అనునది సూత్రములోనికి నన్వయించును. అందు అస్మచ్ఛబ్దమాదియందుండుటచే నీరీతి యర్థము కలుగుచున్నది.

[2] (నా, నీ శబ్దముల) ద్వితీయైక వచన బహువచనములందు న్ను, మ్ము అను నాదేశములును, మొదటి యక్షరమునకు హ్రస్వమును వచ్చును.

కాని ఒకరు "అమి, శసీ అని యథాతథముగ సప్తమ్యంతములుగనే అన్వయింపవలెనని చెప్పి అమ్, శస్‌లు (ద్వితీయైక వచన బహువచనములు) పరముగా నుండగా న్ను, మ్ము అను న వాగమములుగనే వచ్చునను చున్నారు. ఈ పక్షమున 'నన్నునున్' 'మమ్ములన్' అను రూపము లేర్పడవలసియున్నవి. కాని మమ్ములన్ వంటి వానిని ప్రాచీన కవులు ప్రయోగింపలేదట. కావున శస్‌నకు లవర్ణము రాదనుచు చింతామణి 'తస్య జసోముశ్మసోలః' అని యిట్లు నీ, నా, తా, మన శబ్దముల రూప సాధన సందర్భమున మనశబ్దవు శస్సునకు మాత్రమే లాదేశమును ప్రత్యేకముగా విధించుట చేత నా సందర్భములోని శబ్ద చతుష్టయ మందలి మన శబ్ద శస్సునకు మాత్రమే లాదేశము వచ్చుననియు, దక్కిన నీ, నా, తా శబ్దముల శస్సునకు లాదేశమును జెప్పుట చింతామణి స్వరసము కాదనియు జెప్పక తీరదు." అని వ్రాసిరి. [1]

దీని ననుసరించి లవర్ణము చేయక పోవుటచే మమ్ము ః శస్ అని యుండును. ఇట శస్ లోపించుటకు దారి చూపవలసి యుండును. వీరు 'న పదాన్యవ్యయ సుప్తిఙ్క్త్వాతుము నామ్'(సంస్కృతమందలి అవ్యయములు, సుబంత తిజంత పదములు, క్త్వాతుమున్ ప్రత్యయాంతములు తెలుగునకు రావు) అను సూత్రముచే శస్ ను లోపింపజేయుచున్నారు. [2] ఈ సూత్రము సంస్కృత పదముల ననుకరణము

---

290 పుట అధసూచికకు తరువాయి

ప. బాల. స. హలంత 5 శ్లో. వ్యాఖ్య.

"అమ్శసోః న్ను, మ్ము ఇత్యేతౌ స్తః" కవిశిరో. హలంత 15 సూ. వ్యాఖ్య.

[1] ఆం. వ్యా. సం. సర్వస్వము 1 సం. 210, 211 పు.

[2] అందే. 211 పు.

లేకుండ దెలుగులోనికి దెచ్చుకొనకూడదని నిషేధించునది. అనుకరణమున్నచో సంస్కృత వాక్యమును దెచ్చుకొనవచ్చునని తరువాతి సూత్రము తెలుపును.[1] ఈ స్థితిలో నపదానీత్యాది సూత్రముచే దేశ్య శబ్దమయిన నుమ్ము అనుదాని ద్వితీయా బహువచన ప్రత్యయము లోపించుననుటలో ఔచిత్యము కనబడదు.

మఱియొక మాట. వారు చెప్పినట్లు ద్వితీయా బహువచనమును లోపింపజేసినచో ప్రకృతి కాగమమయిన మ్ము అనుదానికచ్చు పరమగుచో 'అనాదిషు విభక్తి షూతో వా' (ప్రథమేతర విభక్తులందున్న ఉత్తునకు సంధివికల్పము) అను సూత్రముచే సంధి రాదు.[2] మ్ము అను దాని యందలి ఉత్తు ప్రకృత్యవయవమే కాని విభక్తిగతము కాదు గదా! కాని యీ విమర్శకులు మ్ము లోని ఉత్తు విభక్తికి చెందినదిగా నంగీకరించుచున్నారు.[3]

ఒకే సూత్రముచే విధింపబడిన న్ను, మ్ము అను వానియందు న్ను అను దానిని ప్రకృత్యవయవముగ జెప్పి దానికి 'అనాదిషు' ఇత్యాది సూత్రముచే సంధిరాదని నిషేధించి[4] మ్ము అనుదానిలోని ఉకారము మాత్రము విభక్తికి సంబంధించినదేయని, దానికి 'అనాదిషు' ఇత్యాది సూత్రముచే సంధి వచ్చునని వీరంగీకరించుచున్నారు.[5] విభక్తి లోపించినంత మాత్రమున ప్రకృత్యవయవమైన

---

[1] 'అనుకృతేస్తి వాక్యంతు' కవిశిరో. సంజ్ఞ. 39 సూ.

[2] కవిశిరో. సంధి 3 సూ.

[3] ఆం. వ్యా. సర్వస్వము 2 సం. 211 పు.

[4] 'న్ను అనునది విభక్తి ప్రత్యయము కామింజేసి నన్నున్ + ఏలెన్ అనుచోట ప్రకృత (అనాదిషు) సూత్రముచే సంధి కలుగనేరదు.' అందే. 209 పు.

[5] 'మమ్మున్ అనుదానిలోని మ్ము అనుదానిమీద ఉకారము విభక్తి ప్రత్యయ సంబంధిగా బరిగణింపదగిన దగుచున్నది.' అందే. 211 పు.

అచ్చు ప్రత్యయావయవముగా మారిపోదు గదా ! కావున వీరిపద్ధతి యుక్తిదూరము. ఇంతకు న్న, మ్ముల నాగమములుగా దలంచుట సముచితముగా లేదు. ఆదేశముగా నంగీకరించినచో చింతామణి ప్రక్రియపై గల ఆక్షేపములు తొలగును.

న్న ఆగమమేయని వాదించువారు 'నన్నును గాగిలించుకొని' అను నన్నయ ప్రయోగము బట్టి నన్నునున్ అనుదానిలోని 'ను' అనునది సముచ్చయార్థకమగు నుశబ్దము కాదనియు, ద్వితీయా'ను' ప్రత్యయమే అనియు జెప్పుచున్నారు. [1] 'న్న' ఆగమమే యనుటకు నన్నయ ప్రయోగమును ప్రమాణముగా జూపుచున్నారన్న మాట. ఇందలి ను విభక్తి అయినచో దానికి ముందున్న న్న ఆగమమే యగును గదా ! అని వీరి భానము. పాదపూరణమున ను వర్ణమును వాడునలవాటు నన్నయ భట్టారకునకు లేకపోలేదు. [2] కావున పై ప్రయోగములోని ను వర్ణమును పాదపూరణార్థ మనవచ్చును. ఇంతకు న్న, మ్ముల విధి విషయమున చింతామణిలో లోపము లేదని నిర్ణయము.

---

[1] ఆం. శ. చిం. వి. పరిశోధనము 141 పు.

[2] ఆధారము లేకను ఆం. భా. ఆది. 2 ఆ. 142ప. ప్రౌఢవు శబ్ద. 116 సూ. వృత్తి. పై విమర్శకు లీ ప్రయోగమున 'ఉన్' శబ్దద్వయము కలదనియు, నది 'అనుపమ దుఃఖితుల మగుటచేతను నెవ్వరును నాధారము లేకుండుటచేతను, అనురీతిని సముచ్చయార్థ దార్ఢ్యమును బోధించుచున్నదనియు జెప్పుచున్నారు. లేక + ఉన్= లేకన్(?) + ఉన్=లేకనున్; అని వీరిచట పదచ్ఛేదమును జేసిరి. (ఆం. వ్యా. సం. సర్వస్వము 313 పు. విస్తర III 84 I విష.

ఇచట శ్రీ వఝులవారు చూచిన ప్రతిలో 'దుఃఖితులమగుట' అను పాఠము కలదేమో ! ఆ పక్షమున దుఃఖితత్వమునకు హేతువు సంతానచ్ఛేదము కావలెను.

ఇది అనావశ్యకమా ?

ఒకరు 'కిర్నజసః' అను సూత్రమును వ్యాఖ్యానించుచు "షష్ఠ్యేక వచనములందు నీనిపై (నీ అనుదానిపై) కి వర్ణకము

---

293 పుట అధస్సూచికకు తరువాయి

భారత మందలి పద్యమిది :

అనఘ ! యిది యేటితపమే
మనుపమ దుష్కృతుల మగుట నాధారములే
కను సంతాన చ్ఛేదం
బున వ్రేలెద మధమ లోకమున తెరువుసనన్.

తలక్రిందుగా వ్రేలాడు పితరులను జూచి జరత్కారువు 'ఇదిగూడ ఒక విధమగు తపమా ? చెప్పుడు. నేనుగూడ జేయుదుననెను. వారు 'ఇది యేమి తపస్సు! (తపస్సు కాదు) మేము మిక్కిలి దుష్కృతుల మగుట వలన సంతాన విచ్ఛిత్తి నంది ఆధారము లేక అధోలోకమునకు వెళ్ళుటకు వ్రేలాడు చున్నామనిరి.

ఇచట దుష్కృతత్వముచే సంతాన విచ్ఛిత్తి, దానిచే ఆధారము లేకుండుట కలుగుచున్నది. కాన నిచట సముచ్చయ ద్వయము చెప్పవలసిన అవసరము కానరాదు.

మూలమున అస్తీకుడు తపస్సును ధారపోసి మిమ్ముద్ధరింతు ననగా వారు

"అస్తిన స్తాత తపసః ఫలం ప్రవదతాం వర
సంతాన ప్రక్షయా ద్బ్రహ్మన్ పతామ నిరయే శుచౌ

(నాయనా ! మాకు తపః ఫలమున్నది. సంతాన చ్ఛేదముచే మేము అపవిత్రమయిన నరకమున బడుచున్నాము) అని పల్కిరి. (భారత. ఆది. 45 అ. 13 శ్లో.) ఈ విషయము గూడ నిచట సముచ్చయ ద్వయమును జెప్పుట అనవసరమని సూచించును.

చేరదు. కువర్ణకము చేరునని యభిప్రాయము. 'జమః కురనితామ్' అను సూత్రము వలన నిదంతములపై కు చేరదనుటచే కి చేరునని తెలియుచున్నది. కావున నీ అను దానిపై కి చేరి నీకి అను రూపమేర్పడదనియు నీకు అనియే యేర్పడుననియు నీ సూత్రము నభిప్రాయమయి యుండును. 'అని తామ్' అనుటవలన హ్రస్వమైన ఇకారమునే గ్రహింపవలసి యుండుట చేతను ఈ కారమనిత్తే కావునను బ్రస్తుత సూత్రమనావశ్యకమనియే చెప్పవలెను." అని భావించిరి.[1]

కాని చింతామణిలో 'ఈదన్తా ఇద్వదేవ కృతహ్రస్వాః' (ఈకారాన్త శబ్దములు హ్రస్వము నందినపై ఇదంత శబ్దముల వలె కార్యముల నందును) అను సూత్రమున్నది.[2] దీనిచే నీ అనుదానికి హ్రస్వము, ఇదంత శబ్ద కార్యములు రావలసి యుండగా 'నచదేశ్య పదే నచైక వర్ణేపి' (దేశ్య పదమందు, ఏక వర్ణ పదమునందు హ్రస్వము రాదు) అను దానిచే హ్రస్వము నిషేధింపబడినది.[3] కాని 'ఇతాం జసః కిస్స్యాత్' (ఇదంత షష్ఠ్యేక వచనమునకు 'కి' వచ్చును)[4] అను సూత్రముచే 'ఈదంతా ఇద్వదేవ' అను అతిదేశము ద్వారా కి వర్ణకము ప్రాప్తించుచునే యున్నది. దానిని నివారించుటకు 'కిర్న జమః' అను నిషేధ సూత్ర మావశ్యకమే.

"ఇదమదసేతద్యత్తచ్ఛబ్దాః"

చింతామణిలో "ఇదమద సేత ద్యత్తచ్ఛబ్దాశ్శబ్దాన్తరాన్వయే బహుళం, హ్రస్వం ప్రపద్య దీర్ఘా ద్విత్వముపర్యక్షరస్యజనయన్తి"

---

1. ఆం. భా. చ. 2 సం. 1649 పు.
2. కవిశిరో. అజంత 41 సూ.
3. అందే 47 సూ.
4. కవిశిరో. అజంత 39 సూ.

(ఇదమ్, అదస్, ఏతద్, యత్, తత్ అనువానికి తెలుగు పదములయిన ఈ, ఏ, ఆ, అనునవి మఱియొక శబ్దముతో నన్వయించినపుడు బహుళముగా హ్రస్వమును బొంది, తరువాతి యక్షరమునకు ద్విత్వమును గలిగించును) అను సూత్రమున్నది.[1] "ఇక్కడ తెలుగునందలి ఈ శబ్దమునకు సంస్కృతము నందలి ఇదమ్, అదస్, ఏతత్ మూడు శబ్దములు పర్యాయములుగా బ్రయుక్తమయినవి ... ఒక్క శబ్దమునకు బర్యాయముగా మూడు సంస్కృత శబ్దములను బేర్కొనుట సమర్థనీయము కాదని ఒకరు విమర్శించినారు.[2]

సంస్కృతమందలి ఇదమ్ సమీపమందున్న వస్తువును నిర్దేశించునపుడు వాడదగినది. 'ఏతద్' మిక్కిలి దగ్గరగా నున్నదానిని నిర్దేశించునపుడు, అదస్ అనునది కొంచెము దూరముగా నున్న దానిని నిర్దేశించునపుడును వాడవలెను.[3] తెలుగున ఈ మూడర్థములందును 'ఈ' అను దానినే వాడుదురు. చింతామణి ఈ విషయమును సూచించుటకై ఇట మూడింటిని బేర్కొనినది. అహోబలపతి యీ విషయమును గుర్తించుట చేతనే కాబోలు ఇదంశబ్దార్థకమయిన 'ఈ' అను దానిని గ్రహించి ఈ దేశము, ఇద్దేశము అనువానిని సాధించి, అదసీ తచ్ఛబ్దములకు గూడ నిదియే రూపమని చెప్పినాడు.[4] కావున నిట చింతామణిలో సమర్థనీయము కాని విషయమేమియు లేదు.

---

[1] కవిశిరో. హలంత. 24 సూ.

[2] సం. ప్ర. వ్యాకరణాలు 178, 179 పుటలు.

[3] ఇదమస్తు సన్నికృష్టం సమీప తరవర్తిచైతదోరూపమ్
అదసస్తు విప్రకృష్టం తదితి పరోక్షే విజానీయాత్
ఉపయుక్తాంశ సంగ్రహః 9 శ్లో. 2 పు.

[4] కవిశిరో. హలంత. 24 సూ. వ్యాఖ్య.

డొంక తిరుగుడు వ్యాఖ్య

చింతామణిలో 'అస్మద్యుష్మద్వాచ్యాదేకత్వ ఇతోనివీ'(అస్మద్యుష్మచ్ఛబ్దములచే జెప్పబడు ఇదంత శబ్దముల కంటె ఏకవచనమున ని, వి వర్ణకములు వచ్చును.)[1] 'పరేషాంతు ధర్మోత్తమ మధ్యమవత్' (ఇతరములకు) (అస్మద్యుష్మ ద్వాచ్యములయిన ఇదంత శబ్దముల బహువచనములకు, అస్మద్యుష్మద్వాచ్యము లయిన అదంతోదంత శబ్దముల యేక బహువచనములకు) తద్ధర్మార్థకములగు ఉత్తమ మధ్యమ పురుష క్రియలకు వలె వర్ణకములు వచ్చును.) [2] అను సూత్రములున్నవి. ఇది హలంత పరిచ్ఛేదము. కావున ఈ విధులు నామములకు చెందినవని తెలియును. అస్మద్యుష్మచ్ఛబ్దములచే వాచ్యములయిన శబ్దములు నా, నీ మొదలగు సర్వనామములగును. ఇవి ఇదంతములు కావు. కావున వీనితో సామానాధికరణ్యమునందిన హరి, కవి మొదలగు ప్రథమాంత నామ విశేషణముల నిట గ్రహింపవలసియుండును. వానికి అస్మద్యుష్మద్వాచ్యత, ఇదంతత గూడ కలదు. ఇదంతైక వచన భిన్నములయిన అస్మద్యుష్మద్వాచ్యములకు తద్ధర్మోత్తమ మధ్యమ క్రియలకు వలె ప్రత్యయములు వచ్చునని అతిదేశించుచున్నాడు. ఈ అతిదేశముచే ఇచట క్రియలను సాధింపబోవుట లేదనియు, క్రియలకు చివర వచ్చిన ప్రత్యయములను నామములకు చివర అతిదేశించుచున్నాడనియు స్పష్టము. ఇచట క్రియలకు గూడ ని, వి, వర్ణకములు మొదలగు వానిని విధింపదలచినచో ఘటించితిని, ఘటించితివి మున్నగు వానిని సాధింపవలెను. వీనిని క్రియా పరిచ్ఛేదములో సాధించుట జరిగినది. [3] అట్టివానికి హలంత పరిచ్ఛేదమున

---

1. కవిశిరో. హలంత 36 సూ.
2. అందే 37 సూ.
3. కవిశిరో. క్రియా 13, 17, 25, 31 సూ. మొదలగునవి.

కేవలము అంత్య వర్ణకములను మాత్రము మరల విధించెననుటలో నౌచిత్యము లేదు గదా !

ఈ సందర్భమున ఈ ను, వు, రు, ము వర్ణకములు పరమగునపుడు 'ఉతోఽచ్చసర్వేషు' అను సూత్రము అత్వమును విధించుచున్నది.[1] మేము చేయుదుము, మీరు చేయుదురు వంటి రూపములలో అత్వము ప్రవర్తించుటలేదు గదా ! ఈ విధిగూడ ఇది క్రియా పదములకు చెందిన సందర్భము గాదని తెలుపును. 'అస్మద్యుష్మద్వ్యాచ్యాత్' మొదలుకొని 4 సూత్రముల వరకు నిట్టి విధేయములకు వర్ణకములను విధించుట కన్పడును.

ఈ స్థితిలో విమర్శకులు పరేషాంతు అను సూత్రమ స్పష్టముగానున్నదనుచు నీ సూత్రములను క్రియా పదములకు వర్తింప జేసిరి. వాడు, ఆమె వంటి తచ్ఛబ్ద విశేషణములను గూడ ఇచట ఇరికింప జూచిరి. వాడు రాముడు, ఆమె సీతవంటి చోట్ల విశేషణ రూపములకు చివర క్రియా విభక్తులేవియు చేరుటలేదు. కావున వానికి "ప్రథమైక వచన లోపస్తద్ధర్మాతీతయోః క్రియాణాం స్యాత్" (తద్ధర్మ భూత క్రియలకు ప్రథమైక వచనలోపము గలుగును) అను సూత్రముచే లోపమును చెప్పిరి.[2]

ఇదంతయు అనవసరముగా అడుసుత్రొక్కి కాలుకడుగుట వంటిది. ఇంతచేసినను అపరూపము లేవియు వారికి గోచరము కాలేదు. చివరకు "ఇట్లర్థ వివరణము జేయవలసి యున్నను నీ సూత్రమేకవచనములకే వర్తించుననియు, చేయుదును మొదలగు క్రియారూపముల నిష్పత్తి క్రియా పరిచ్ఛేదమందలి సూత్రములచే గలుగుచున్నది గావున నట్టివానికి వర్తింపదనియు, నామ పదముపై క్రియా ప్రత్యయములు చేరు విధానము నే న (అః) ది బోధించుచున్నదనియు ననుకొనవలెనని ముక్తాయించిరి.

---

1. కవిశిరో. హలంత. 39 సూ.

2. “పరేషాం ధర్మోత్తమ మధ్యమనత్’ ఈ సూత్రమున కర్థము స్పష్టముగా లేదు. (300 పుట తరువాయి)

సూత్రమునస్పష్టముగా నున్నదని చెప్పుటకు వారుపడిన పాట్లివి. కాని వారు భావించినట్లు పరేషాం అను సూత్రమేకవచమునకే వర్తించునని చెప్పనక్కరలేదు. అస్మద్యుష్మ ద్విశేషణములలో ఇదంత భిన్నములకు ఏకత్వ బహుత్వములందు తద్ధర్మోత్తమ మధ్యమ పురుషములందు వలెను, వు, రు, ము వర్ణకములు వచ్చుచున్నవి. కాన నేను రాముడను. నీవు రాముడవు, మేము రాములము వంటి రూపములు సిద్ధించుచున్నవి. ఇంతకు నీ సూత్రము నింత అల్లరిపాలు చేయనక్కరలేదని సారాంశము.

షష్ఠి భవే ద్వితీయా తుల్యా

‘షష్ఠీ భవేద్ద్వితీయా తుల్యా తత్పురుష సంస్థితానామ్నామ్’ ఈ సూత్రము గూడ విమర్శలకు గురియయినది. సమాసవిభక్తికి లోపమును జెప్పుట సంస్కృత వ్యాకరణ సంప్రదాయము. ఇచ్చట రాముని గుణములు వంటి షష్ఠీ తత్పురుషమున షష్ఠి ద్వితీయవంటి దగునని చెప్పబడుట యుక్తము కాదని విమర్శకుల భావము.[1] ‘నిఁలు ద్వితీయా ప్రత్యయాలుగా గుర్తించి ఉండటం వలన షష్ఠి ద్వితీయగా మారినట్లు చింతామణికి తోచింది. నిజమే కాని అలా తోచడం వైయాకరణునకు తగునా ? అని’ విమర్శకుల విసురు.[2]

నేటివైయాకరణ పద్ధతిని బట్టి రామునియొక్క గుణములు అనుచోట సమాసవిభక్తికి లోపమురాగా రాముని గుణములు అను రూపమేర్పడును. ఇందలి రాముని అనునది ద్వితీయ వలె కన్పించుచున్నది. ఇది ద్వితీయ కాదనియు ద్వితీయవంటి ఆకారముతోనున్నది మాత్రమే అని చింతామణి కర్త చెప్పదలచెను. కొన్నిచోట్ల ‘ని’ అనుదానికి లోపమువచ్చి రాము గుణములు అనువిధముగా నగును.

---

1. ఆం. వ్యా. వికాసము ప్రథమ. 396 పుట.
2. సం. ప్ర. వ్యాకరణాలు 181 పుట.

చింతామణిలో 'నిరమో మహతాం లుక్చస్యాత్ (మహద్వాచకముల ద్వితీయైక వచనమునకు ని వర్ణకము వచ్చును : నివర్ణకమునకు లోప

---

298 పుట అధస్సూచికకు తరువాయి

(1) అస్మద్యుష్మద్వాచ్యములు కాని ఇదంత శబ్దములకు,
(2) అస్మద్యుష్మద్వాచ్యములై ఇదంతములు కానివానికి,
(3) అస్మద్యుష్మ ద్వాచ్యములునుగాక ఇదంతములును గాకయుండు వానికి అని మూడు విధములుగా నర్థమును జెప్పవచ్చును" అని వారి మాటలు.

ఇచట ప్రథమ ద్వితీయ పక్షములందు వాడుకవి, వాడు రాముడు, ఆమె సీత అనున వుదాహరణములు. ఇచట విశేషణమునకు చివర ఏ ప్రత్యయమును జేరుటలేదు. కాని ప్రథమైక వచన ప్రత్యయమును విధించుకొని దానికి 'ప్రథమైక వచనలోప స్త్వధ్రాతీతయోః క్రియాణాంస్యాత్' అను సూత్రముచే దానికి వీరు లోపమును జెప్పిరి. ఇది అనవసరమైన ప్రక్రియ కావున నీ అర్థమను చెప్పరాదు.

రెండవ పక్షము సగము యుక్తమే. పై సూత్రమున ఏకశ్శే అని యున్నది. కావున అస్మద్యుష్మద్వాచ్యములగుఇదంతములలో ఏకవచన భిన్నములైన బహువచనములను గూడ ఈ సూత్రమున గ్రహింప వచ్చును. ఆ విమర్శకులు 'పరేషాం అను పదమును ఏకశ్శే అను పదముతో నెట్లో అన్వయింప జేసినయెడల అస్మద్యుష్మద్వాచ్యములు కాని వానికి బహువచనమున మురు వర్ణకములు వచ్చును అను నర్థము వచ్చునని తెల్పివారు రాములు, సీతలు' అని యుదాహరించిరి. (ఆం. భా. చ. 2 సం. 1657 పు). ఈవ్యాఖ్య సరియగుచో తద్దర్మోత్తమ మధ్యమ పురుషలలో చేరు 'ము', 'రు' వర్ణకములు చేర్చవలెను. అపుడు వారు రాములరు, సీతలరు వంటి రూపములు తయారగును. ఏకవచనమునందు వలె ఇచట

మును వచ్చును) అను సూత్రముచే నీ ని అనుదానికి లోపమును గూడ చెప్పవలెను.[1] వీనిని సులభముగా సంపాదించుటకు నన్నయభట్టు షష్ఠి ద్వితీయ నంటిదని చెప్పెను. ఒక వాక్యముచే షష్ఠ్యర్థమున ద్వితీయ వచ్చుటయు, దానికి వికల్పముగా లోపము వచ్చుటయు జరిగినది. ఈ పద్ధతిలో రాముని గుణములు అను సమాసములో యొక్కకులోపమును జేసికొననక్కర లేదు. ఇతని దృష్టిలో రాముని గుణములు వంటివి అలుక్ సమాసములగును.

ఇట్లు ప్రక్రియా లాఘవమున కీతడవలంబించిన పద్ధతిని వీరు విమర్శించినారు. మఱి తాతంభట్టు

ధరఁబురుష వాచకములపైఁ
బరఁగుఁదృతీయాదులగు విభక్తుల మొదలన్
దిరముగ ద్వితీయయగు, శ్రీ
ధరువలనన్, శివునిచే గదాధరునందున్.

అని తృతీయాది విభక్తులు పరమగునపుడు చెప్పదగు నిగాగమమును ద్వితీయా విభక్తిగా వ్యవహరించి విధించెను. ఇతని పక్షమున నిక్ అని, షే రే ఆగమము నంగీకరింప నక్కర లేదన్న మాట. ఈ పద్ధతిని బైపరిశోధకులు సమర్థించిరి.[2]

---

299 పుట అధస్సూచికకు తరువాయి

వర్ణక లోపము వచ్చుటకు దారిగూడ లేదు. ఇట్టి రూపములు భాషలో లేవు. వాడు వారు అను తచ్ఛబ్దములకు ప్రసక్తి లేని చోట ఇట్లు తచ్ఛబ్దమును దెచ్చిపెట్టి అపరూపములను దయారు చేయుట ఉచితము కాదుగదా !.

1. కవిశిరో. అజంత. 16 సూ.
2. "తాతంభట్టు కావించిన యీ సమన్వయము కుదురుననుటలో నెట్టి సందేహము లేదు." ఆం. వ్యా. వికాసము ద్వితీయ. 46 పుట.

అడుగడుగున నాంధ్రశబ్దచింతామణిని దుయ్యబట్టిన విమర్శకులు గూడ వేఱొక సందర్భమున తాతంభట్టును ఎంతో వాఙ్మయ పరిశీలనము గలవాడనియు, భాషాస్వభావమును బాగుగా నాకళించుకొనిన వాడనియు, అష్టభాషావతారుడుగా ప్రసిద్ధుడనియు ప్రశంసించినారు. [1] పై పద్యమున తాతంభట్టు శివునిచే ఇత్యాదులలో ద్వితీయా తృతీయా విభక్తులు రెండును గలవని ప్రతిపాదించినాడు. అచట ద్వితీయార్థము చెప్పుట కుదురదు. అచటనున్న 'ని' అనుదానిని నిగాగమముగా వ్యవహరించుట లెస్స.

నన్నయభట్టు రాముని గుణములు ఇత్యాదులతో 'ని' అను దానిని ద్వితీయాతుల్యమగు షష్ఠియనెను. అనగా షష్ఠ్యర్థమును జెప్పెదము. కాని అచటి విభక్తి ద్వితీయాకారముతో గనబడును. కావున దాతంభట్టు చెప్పిన పద్ధతిలో గలలోటు (రెండు విభక్త్యర్థముల నొక పదమున జెప్పవలసి వచ్చుట) నన్నయభట్టు రచనలో లేదు. దీని నొక్కదానిని గ్రహించినచో నాంధ్రశబ్ద చింతామణి కవిచింతామణి కంటె తరువాతిదనవలసి వచ్చును. కాని తక్కిన విషయములనేకములు కవిచింతామణియే యర్వాచీనమని నిరూపించుచున్నవని వేఱొకచోట దెల్పబడెను. [2] ఇంత మాత్రముచే దాతంభట్టు లాక్షణికత్వమునకు, గౌరవమునకు నేమియు లోపములేదు. ఇది ఆంధ్రవ్యాకరణ దర్శన తపస్సులో గలిగిన ఒక ఒడుదుడుకు మాత్రమే. ఎందరెందరెంతెంత వారు వాఙ్మయ జలధిని మథింపగా నాంధ్రవ్యాకరణ సరస్వతి యీనాటి రూపమును సంతరించుకొనెనో తెలుపుటకీ విషయముపయోగించును. ఇంతకును నన్నయభట్టు 'షష్ఠీ భవేద్ద్వితీయాతుల్యా' అను విధి దోషజుష్టము గాదనియు,

---

[1] సం. ప్ర. వ్యాకరణాలు 404 పుట.

[2] 'వీనిలో నేది యాద్యము' అను వ్యాసము చూ.

ప్రక్రియాలాఘవ దృష్టితో జెప్పబడిన యొక పద్ధతి యనియు సారాంశము.

ఉపమాన సమాసము

చింతామణి కర్తది నిశితమైన ప్రజ్ఞ. అది చింతామణిలో ప్రతిఫలించినది. కావున చింతామణిలో ప్రతి పదము సూక్ష్మేక్షికతో బరిశీలింపదగినది

చింతామణి ఒక శ్లోకములో ద్విగు కర్మధారయ తత్పురుష ద్వంద్వ బహువ్రీహుల నొక వర్గముగను, ఉపమానోత్తర పద లోప రూపకములను వేఱొక వర్గముగను జేసి చెప్పుచున్నది. ఇందు మొదటి వర్గమునకు వ్యాప్తి ఎక్కువ. రెండవ వర్గము క్వాచిత్కము. ఒకరు మొదటి వర్గము సంస్కృతములోనిదనియు, రెండవ వర్గము తెలుగునకు ప్రత్యేకమయినదనియు నూహించినారు. అచట నున్న శ్లోకమిది :

> 'ద్విగు కర్మధారయౌ తత్పురుష ద్వంద్వౌ బహువ్రీహిః
> అన్యేచ కేచి దుపమా నోత్తరపదలోప రూపకాఖ్యాద్యాః'

(ద్విగువు, కర్మధారయము, తత్పురుషము, ద్వంద్వము, బహువ్రీహి, ఇతరములయిన ఉపమానము, ఉత్తర పదలోపము, రూపకము మొదలగునవి కొన్ని (తెలుగున సమాసములు).

ఒకరు ఉపమానమును "సంస్కృతేతర సమాసములలో నేల చేర్చవలెనో తెలియదు." అని వ్రాసిరి.[1] శ్లోకములో ఇవి సంస్కృత సమాసములు. ఇవి సంస్కృతేతరములు నను విభాగము కానరాదు. ఉపమానము మొదలగు సమాసములు కొన్ని కలవని మాత్రము చెప్పబడినది. ఉపమాన సమాసము రెండు రకములు : ఉపమాన

---

[1] ఆం. ప. ప. 2 సం. 1661 పు.

పూర్వపద కర్మధారయము, ఉపమానోత్తర పద కర్మధారయము ఉపమానోత్తర పదకర్మధారయములు సంస్కృతమున కలవు. కాని పూర్వ పద కర్మధారయములు సంస్కృతమున లేవు. ఉపమాన పదములు సమానధర్మవాచకములతో సమాసమగుట మాత్రము సంస్కృతమున నున్నది.[1] అనగా ఉపమానములకుపమేయములతో ఉపమాన పూర్వ పద కర్మధారయ సమాసము చేయు రీతి సంస్కృతమున లేదన్నమాట.

ఈ విషయమును దృష్టిలో నిడుకొనియే చిన్నయసూరి "ఉపమానోత్తర పదంబులు గలవు గాని, విపరీతంబులు సిద్ధంబులు లేవని యెఱుంగునది." అని చెప్పెను.[2] తెలుగులో మాత్రముపమానములుపమేయములతో ఉపమానపూర్వపద కర్మధారయమునుబొందును.

ఉదా :- చిగురుఁగేలు, జుంటి మోవి. ఇట్టివి భాషలో కొన్ని మాత్రమే కాన వచ్చుటచే వీనిని కేచిద్గణములలో చేర్చెను. కావున నిచట చింతామణిలో ఆక్షేపింపదగు విషయము లేదు.

చింతామణి సాధించిన క్రియా రూపములు

చింతామణిలో 'వసతి రనుబంధకస్స్యా ద్వ్యర్తతలడర్థో వివక్షిత స్తతి)' (ఎచట వర్తమానార్థము విసక్షింపబడునో అచట వసధాత్వర్థము అనుబంధకమగును) అనియు, 'అస్తిరనుబంధకస్స్యా ద్వ్యర్త లృడర్థో వివక్షితో ధాతోః' (భవిష్య దర్థమును వివక్షించిన చోట అసధాత్వర్థమను బంధమగును) అనియు వర్తమాన భవిష్యదర్థములందు క్రమముగా వస, అస, ధాతువుల అర్థములనుబంధములగునని చెప్ప

---

1. 'ఉపమానాని సామాన్య వచనైః' సిద్ధాంత కౌముది తత్పురుష 734 సూ.
2. బాల వ్యా. సమాస. ౬ సూ. వృత్తిలో.

బడినది. ఇచట వస, అస, ధాతువుల అర్థములుగా వ్యవహరింపబడినవి 'ఉన్న, కల' అను ననుబంధములని ప్రాచీన వ్యాఖ్యాతలు చెప్పిరి.[1]

"వసతి ధాతువునకు తెలుగున ఉండు అనునది గాని ఉన్న అనునది కాదు. అయినను ఉన్న అనునది చెప్పకొనక పోయినచో ముందు సూత్రముల కర్థము నడవదు. అస్తి అన్నను ఉండు ధాతువునే చెప్పికొనవచ్చును. కాని వ్యాఖ్యాతలు కలుగు ధాతువును చెప్పికొమ్మందురు. అట్లే చేయుదమన్నను కల అనున దనుబంధ మను నర్థ మెట్లు వచ్చునో తెలియదు." అని విమర్శకుల అభిప్రాయము.[2]

ఇపుడు కలుగు అనురీతిగా ధాతుస్వరూపమును గ్రహించుచున్నాము. కాని పూర్వము ధాతు స్వరూపమును గ్రహించుటలో వివిధ పద్ధతులున్నవి. త్రిలింగ శబ్దాను శాసనమున అయిపోయి కని చూచి అని ధాతువులు ఇదంతములుగా నంగీకరింపబడినవి.[3] బార్హస్పత్య సూత్రములందు గూడ 'అయి' పోయి, కని ఆదయోదేశ్యాః అని ఇకారాంతములుగనే దేశ్య క్రియలు పఠింపబడినవి.[4]

---

1. కవిశిరో. క్రియ 11, 12 సూ. వ్యాఖ్య.
2. ఆం. భా. చ. రెండవ భాగము చింతామణీ హృదయము 1666, 1667 పుటలు.
3. "అయి పోయి కనిచూచి రిత్యాద్యా ధాతవో మతాః" త్రిలింగ శబ్దాను శాసనము తిజంతాః 93 శ్లో.
4. బార్హస్పత్య సూత్రాణి క్రియాః 1 పంక్తి.
ఈ బార్హస్పత్య సూత్రములు త్రిలింగ శబ్దానుశాసనము వ్రాత ప్రతికి చివర, ఆంధ్ర కౌముదికి చివర వ్రాయబడియున్నవి. త్రిలింగ శబ్దాను శాసన కర్తయగు నథర్వణుడు

వాసుదేవుడు 'ఉంత, కలగ' అని అదంతములుగా ధాతువులను గ్రహించెను.[1]

భాషా శాస్త్ర విదులు చూచి వంటి క్త్వార్థకములు గూడ బూర్వకాలమున భావార్థకములే యనియు చూచిన యది అను దానికి చూచి + న్ + అది - చూచుట (గల) యది కర్మ, లేక కర్త) అని అర్థమనియు చెప్పుచున్నారు.[2] మఱియు కలుగు ఇత్యాదులలో చివరి గువర్ణాదులు లేనివి ప్రాచీన ధాతురూపములనియు, వానికి గు మొదలగు వర్ణకములు చేరుటచే మఱల క్రొత్తధాతువు లేర్పడినవనియు నిర్ణయించిరి.[3]

కలడు, కలరు మొదలగు క్రియా రూపములందు కలవాడు మొదలగు తృజర్థములందు మూల రూపము కల అను నాకారముతో గన్పడుచున్నది. కాన పూర్వము కల అను దానిని ధాతువుగా గణింప నవకాశమున్నట్లు వెల్లడి యగుచున్నది. ఇక అసధాతువునకు ఉండు అను నర్థమును గూడ గ్రహింప వచ్చును గదా! కల అను

---

305 పుట అధస్సూచికకు తరువాయి

బార్హస్పత్యాని సర్వాణి కాణ్వాం వ్యాకరణం విదన్ (1.3) అని బార్హస్పత్య సూత్రములను స్మరించెను. మండ లక్ష్మీనరసింహాచార్యులు గూడ బృహస్పతి వచనము నుదాహరించినాడు. బార్హస్పత్య సూత్రములు కొన్ని ఆంధ్రకౌముదిలో జేర్చుకొనబడినవి. 'లృటః కలః' ఆంధ్రకౌముదిలో బార్హస్పత్య సూత్రములు, (414 సూ.) లృటో స్తిశ్చ, అస్తేః కలః (ఆంధ్రకౌముది క్రియా. 340, 341 సూ).

1. వైకృత చంద్రిక తిజంత. 7, 12 సూ.
2. జి. జోగి సోమయాజిగారు ఆం. భా. వికాసము 503 పుట.
3. అందే 493 పుట.

నర్థమునే ఏల గ్రహింపవలెనని ప్రశ్న. వర్తమానమున విధింపబడిన వసధాతువునకు ఉండుట అను నర్థము నంగీకరింపవలెను గదా! భవిష్యదర్థమున విధింపబడిన అసధాతువునకు దానికంటె ఇతరమగు నర్థమును జెప్పుట యుక్తము.

'తదస్యాస్త్యస్మిన్నితి మతుప్' అను పాణిని సూత్రమునకు అది దీనికి గలదు అను నర్థమునగాని, 'అది దీనియందు గలదు అను నర్థమున గాని ప్రథమాసమర్థము కంటెబరముగా మతుప్ (మత్) అను ప్రత్యయంబగును'. అని పండితులయనువాదము.[1] 'మతు ప్ప్రత్యయమను నర్థమున' అనుదానికి వివరణమును వ్రాయుచు 'కలవాడను నర్థమున' అని శ్రీ భాష్యం వేంకటనరసింహభాష్యకారాచార్యులుగారు వ్రాసిరి.[2] మతు బర్థమును వివరించుచు కలవాడు, కలది అను నర్థమున అని బులుసు వేంకట రమణయ్యగారు వ్రాసిరి.[3] ఈ వ్రాతలవలన అసధాతువునకు కల అను నర్థము చెప్పుట సుప్రసిద్ధమే అని తెలియును. ఇంతకును చింతామణి కల, ఉన్న అను ననుబంధములతో గూడిన రూపములను కృతకముగా గల్పించినచో శబ్దార్థము తెలియుట దుష్కరమగునేమో. కాని చింతామణి కాలమునకీ క్రియలు ప్రచారములో నున్నట్లు శాసన భాష సాక్ష్యమిచ్చును. జరపంగలవాండు. (ద. హిం. శా. 5-129-7, 1422) చేయంగలారు (పై 5-1180-12, 1402) పెటంగలారు (పై 5-1100-8, 1407) పెటంగలడు (పై 6-1062-11, 1403) కొలువంగలదు(పై 5-1072-8, 1413) ఇట్లు భవిష్యత్క్రియాజన్యనిశేషణ రూపములు భవిష్య

---

[1] చంద్రాభట్ల సూర్యనారాయణ శాస్త్రిగారు, పంచాంగం వేంకట నరసింహాచార్యులుగారు ఆంధ్రీకృత లఘుసిద్ధాంత కౌముది మత్వర్థీయ ప్రకరణము 424 పుట.

[2] ప్రౌఢ. తత్త్వబోధిని తద్ధిత. 6 సూ. వ్యాఖ్య.

[3] బాలవ్యా. లఘుటీక, చెన్నపురి. వావిళ్ళ. తద్ధిత. 17 సూ. వ్యాఖ్య

త్సమాపక క్రియలు 13వ శతాబ్దికి తెలుగులో నున్నవని యంగీకరింపక తప్పదు.[1]

అక్లే సేవ చేస్తున్నాండు (ద. హిం. శా. 4-936, 27, 1453) వంటి వర్తమాన క్రియారూపములు గూడ కన్పడుచున్నవని శాసన భాషా పరిశోధకులు తెల్పియున్నారు.[2] కావున తనకాలమున వాడుకలోనికి వచ్చిన భవిష్యద్వర్తమాన రూపములనే చింతామణి కర్త చెప్పెనని భావింపవలెను.

ఇచట మఱియొక విషయము గమనింపదగినది. "అన్నంత క్రియా రూపాలకు 'కల' చేరితే భవిష్యత్క్రియాజన్య విశేషణ మేర్పడుతుంది. చేయు-చేయంగల మొ.వి. ఇట్టి వానికి రెండు రకాలైన ప్రత్యయాలు చేర సమాపక క్రియలు అవుతాయి.

(1) పై భూత వర్తమాన క్రియలు లాగానే వాండు, ఆండు, వారు, ఆరు, అది అవిచేరి సమాపకక్రియలు కావచ్చు.

(2) విశేషణ రూపాలకు - ండు, - రు, - వు, - రు, - ను, - ము, - చేరి సమాపక క్రియలు కావచ్చు"

అని 15వ శతాబ్ది భాషను పరిశీలించిన ఎం. కంపప్ప శెట్టిగారు జరపంగల వాండు, చేయంగలారు, పెటంగలడు, కొలువంగలరు మొదలగు ఉదాహరణముల ద్వారా నిర్ణయించినారు.[3] వీనిలో విశేషణ రూపాలకు - ండు, - రు, మొదలగు క్రియా విభక్తులు చేరుటచే నేర్పడిన పెటంగలడు, కొలువంగలరు వంటి రూపాలు సమాపక

---

1. యమ్. కందప్పసెట్టిగారు 'శాసన భాషాపరిణామం' తె.భా.చ. ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తిగారి సంకలనం, 163 పు.
2. అందే 162 పు.
3. అందే 163 పు.

క్రియలు మాత్రమే అగును. "మిగిలినవన్నీ క్రియా విశేషణాలపైన సర్వనామాలు చేరగా ఏర్పడినవే కాబట్టి అవి కర్తృస్థానంలోను క్రియా స్థానంలోను వస్తాయి. ఉదా :-ఈ క్షేత్రం అపహరించినవారు పంచమహాపాతకాలున్ను చేసినవారు (ద. హిం. శా. 6-242 24-1427) అని శ్రీ కందప్ప సెట్టి స్పష్టము చేసినారు.[1]

చింతామణిలో రక్షింపగలడు వంటి రూపములు సాధింపబడిన పిమ్మట 'పునరాగమః క్రియాణామ్' (క్రియలకు మరల ఆగమము వచ్చును.) అను విధికలదు. అచ్చట ఆగమ స్వరూపమేదియో చెప్పబడలేదు. జరపగలవాడు వంటి రూపములలోని 'వా' వర్ణమును చేయంగలారు వంటి రూపములలోని 'ఆ' వర్ణమును తచ్ఛబ్ద రూపాంతరములే గనుక నట్టి ద్వివిధాగమములు ప్రత్యేకముగా విధింప నక్కరలేకుండ 'పునరాగమః క్రియాణామ్' అను సామాన్య విధినే చెప్పి యుండవచ్చును. కావున చింతామణిలోని క్రియా నిర్మాణమును గూర్చి తప్పుబట్ట పనిలేదని సారాంశము.

మఱియొక మాట. చింతామణిలో భవిష్య దర్థకములందలి సమాగమము చెప్పబడి యుండలేదని ఒక విమర్శకుని వచనము.[2] చింతామణి కళల పట్టికను జెప్పి 'అన్యేద్రుత ప్రకృతయః యేస్యుర్హ్యను జీవిత ద్రుతా నిత్యమ్' (కళా భిన్నములును ద్రుతాంతములయిన పదములు ద్రుత ప్రకృతులు) అని చెప్పినది.[3] కళల పట్టికలో చేయన్ వంటి నుజ్యన్తములు లేవు గదా! చింతామణి ననుసరించి జరపంగలవాడు వంటి వానిని క్రియాజన్య విశేషణములుగను క్రియాపదములుగను జెప్పుటకు నవకాశమున్నది.

---

[1] అందే 163 పు.

[2] ఆం. భా. చ. 2 సం. చింతామణి హృదయము 1675 పుట.

[3] కవిశిరో. సంజ్ఞ. 41 సూ.

కావున భవిష్యత్క్రియా జన్య విశేషణమునందు భవిష్యత్క్రియలయందు నున్న రక్షింపవంటి వానిని 'అన్యేద్రుత ప్రకృతయః' అను దానిచే ద్రుతప్రకృతికముగా జెప్పుకొన వచ్చును. చిన్నయ సూరి ద్రుత ప్రకృతికముల పట్టికలో కొట్టన్ అని నుజ్యన్త రూపముల నుదాహరించుట యిచట గమనింపదగినది.[1] లాఘవ ప్రియుడగు చింతామణి కర్త ఇట్లు సాధింప నవకాశ ముండుటచే మరల విధించుకొన లేదని భావింపవచ్చును. అహోబల పత్యాచార్యుడు గూడ నట్లే అభిప్రాయపడెను.[2] కావున పైన విమర్శకులు చేసిన విమర్శలు నిలువనివి.

వైరుధ్య మున్నదా ?

'ప్రథమైక వచన లోపస్తద్ధర్మా తీతయోః క్రియాణాంస్యాత్'

చింతామణి పై సూత్రముచే తద్ధర్మ భూత క్రియలందు ప్రథమ పురుషైక వచనమునకు లోపమును విధించినది.[3] దీనికి కొన్ని సూత్రముల తరువాత నున్న 'ప్రథమైక స్యైద్భవేచ్చ భూతార్థే' అను సూత్రము ప్రథమైక వచనమునకు ఎత్వమును విధించుచున్నట్లు కనపడును.[4] దీనిచే 'ఘటించె' వంటి రూపములు సిద్ధింపవలెను. మొదట ఎత్వమును విధించి, పిదప లోపమును జేసినచో రూపసిద్ధి కాదు. మొదట ప్రథమైక వచనమునకు లోపమును జెప్పి పిదపెత్వమును విధించినచో మొదటి లోపమునకు ప్రయోజన ముండదు. కావున ప్రథమైక వచన

---

[1] బాల. వ్యా. సంజ్ఞ 12 సూ. వృత్తి.

[2] పోషింపగలడు, పోషింపింపగలడు ఇత్యాది భావ్యర్థే. ఏతాదృశ స్థలేషు సర్వత్రా ఉకళాత్వాద్ద్రుత ప్రకృతి కార్యమ్; హ్రస్వత్పరత్వేనచ బిందోర్ద్వైవిధ్యంచసిద్ధ్యతి.
కవిశిరో. క్రియ. 16 సూ. వ్యాఖ్య.

[3] కవిశిరో. క్రియ 18 సూ.

[4] ౦దే - 30 సూ.

లోప ఇత్యాది సూత్రమున నతీత శబ్దమును దొలగించినచో నీ వైరుధ్యము తొలగునని యొకరు చెప్పిరి.[1]

పై రీతిగా జూచినచో చింతామణిలో పూర్వోత్తర వైరుధ్యమున్నదనిపించును. ఈ విషయము మరింత పరిశీలింపదగినది. మొదటి సూత్రమున 'ప్రథమైక వచనలోపము' చెప్పబడినది. తరువాతి సూత్రములో ప్రథమైకమునకు ఎత్వము విధింపబడినది. ఇందు 'వచన' పదము లేకుండుట గమనింపదగినది. రెండవ సూత్రమందలి ప్రథమైక పదముచే ప్రథమైక వచన మని గాని ప్రథమ పురుషైక వచనాంత రూపమని గాని అర్థము చెప్పవచ్చును. అంతకు ముందే భూతార్థమున ప్రథమైక వచనమునకు లోపము చెప్పబడినది. కావున నిచట ప్రథమ పురుషైక వచనాంత రూప మనియే అర్థము చెప్పవలసి యుండును. అహోబలపతి గూడ దీనికి భూతార్థమున ప్రథమ పురుషైక వచనాంత క్రియా పదమునకు ఎత్వము వచ్చుననియే వ్రాసెను.[2] వ్యాకరణమున ప్రత్యయము లోపించినను ప్రత్యయాంతముగనే వ్యవహరించు సంప్రదాయమున్నది.[3] చింతామణి కూడ ఈ పద్ధతిని పాటించినది.[4] కావున ప్రథమైక వచన ప్రత్యయము లోపించినను దానిని ప్రథమైక వచనాంత పదముగా వ్యవహరించుట కభ్యంతరము లేదు.

కావున మొదటి సూత్రమున ప్రథమైక వచన ప్రత్యయ లోపము విధింపబడగా రెండవ సూత్రమున మిగిలిన క్రియా పదము

---

1. ఆం. వ్యా. వికాసము ప్రథమ. 402 పుట.
2. 'ప్రథమపురుషైక వచనాన్త క్రియా పదస్య ఎత్వంస్యాత్ భూతార్థే' కవిశిరో. క్రియ. 30 సూ. వ్యాఖ్య.
3. 'ప్రత్యయ లోపే ప్రత్యయ లక్షణమ్' సిద్ధాంత కౌముది అజంత నపుంసకలింగ. 262 సూ.
4. కవిశిరో. అజంత. 36 సూ. హలంత. 80 సూ.

నకు జివర ఏత్వమును విధించెనన్న మాట. కాగా పై రెండు సూత్రములకు వైరుద్ధ్యము లేదని చెప్పవలెను. చింతామణి కర్త మతమున 'ఏ'త్వము క్రియా విభక్తి కాదు. దానికి తరువాత ద్రుతము చేరుటచే 'ఘటించెన్' వంటి రూపము లేర్పడును.

'వ్యాఖ్యానతో విశేష ప్రతిపత్తిః'

సంస్కృత వ్యాకరణమున 'వ్యాఖ్యానతో విశేష ప్రతిపత్తిః నహి సందేహా దలక్షణమ్' (వ్యాఖ్యానము వలన విశేష జ్ఞానము కలుగును. సందేహము కలిగినంత మాత్రమున శాస్త్ర మలక్షణము (అననుష్ఠాపక లక్షణము) కానేరదు.) అను పరిభాష కలదు.[1] ఇది గ్రంథకర్త ఏదైన విషయమును సందిగ్ధముగా జెప్పినపుడువ్యాఖ్యాత లక్ష్యానుగుణముగా దాని అభిప్రాయమును జెప్పి శాస్త్రమును వాడుకొనవలెనని తెల్పును. చింతామణి ని బూర్వము వ్యాఖ్యానించిన వారు లక్ష్యజ్ఞానమును సంపాదించినవారై గ్రంథకర్త హృదయము నావిష్కరించుటకు ప్రయత్నించిరి. ఈ ప్రయత్నములో కొన్ని పదముల నధ్యాహారము చేసికొనుట, క్రమమును వివక్షించుట, లక్ష్యానుగుణముగా నర్థమును దెలుపుట వీరవలంబించిన పద్ధతులు.

పదముల నధ్యాహారము చేసికొనుట :

'అనుబంధ ప్రార్థనయో ర్ణా వ్యతిరేకాదికే చచోః పస్స్యాల్' (అనుబంధము పరమగునపుడు ప్రార్థనార్థము నందు, వ్యతిరేకాద్యర్థము లందు ణిజర్థమందును, చువర్ణము యొక్క చకారమునకు పకారము

---

[1] శ్రీ నాగేశభట్టు పరిభాషేందు శేఖరః 1 పరి.

వచ్చును.[1] ఇందు 'చకారమునకు' అనునది అధ్యాహారము చేసి కొనిన పదము. ఇట్లే మరికొన్నిచోట్ల గూడ చేసికొనవలెను.[2]

క్రమమును వివక్షించుట :

'స్త్ర్యర్థే పునర్దుదీ భవతః' (మహత్యర్థక క్రియకు వ్యతిరేక భవిష్యదర్థములందు వర్తమానార్థమున ప్రథమ పురుషైక వచనమునందు దు, ది వర్ణకములు వచ్చును) అను సూత్రమున దువర్ణకము ఏనికి వచ్చునో, ది వర్ణకము ఏనికి వచ్చునో వివరింపబడలేదు.[3] దీనికి ముందున్న సూత్రము 'వ్యతిరేకార్థేల్ృటి లటి డుజ్స్యాత్' (వ్యతిరేకార్థమున, భవిష్యదర్థమున, వర్తమానార్థమున డుజ్ వచ్చును.) అనునది.[4] ఇందు వ్యతిరేకార్థము భవిష్య దర్థము, వర్తమానార్థము అను మూడు కలవు. పై రెండు సూత్రములు నొక శ్లోకములోనివి. వ్యతిరేకార్థాదులు తరువాతి సూత్రములోని కన్వయించును. వ్యతిలేకార్థాములు మూడు. దు, ది వర్ణకములు

---

1. అనుబంధే ప్రార్థనాద్యర్థేచ ఇంచుక్ సంబంధిన శ్చో శ్చకారస్య పస్స్యాత్, కవిశిరో. క్రియ. 15 సూ. వ్యాఖ్య.
2. 'ఏతయోర్బహుత్వే మః' (దేశ్యములగు నస్మద్యుష్మచ్ఛబ్దముల 'నకారమునకు' బహువచనమున మకారము వచ్చును.) ఇచట 'నకారమునకు' అనున దధ్యాహార్యము. కవిశిరో. వాలంత. 19 సూ.
   బిందు పరస్య తకారో దోస్స్యాత్.
   (బిందువుకంటె పరముగా నున్న దువర్ణముయొక్క దకారమునకు తకారము వచ్చును). ఇచట 'దకారమునకు' అధ్యాహార్యము. కవిశిరో. క్రియ. 34 సూ.
3. కవిశిరో. క్రియ. 19 సూ.
4. అందే 20 సూ.

రెండు. వీనికి క్రమాన్వయము కుదురదు. క్రమాన్వయము చేయనిచో అర్థజ్ఞానము కలుగదు. కావున వ్యాఖ్యాత లక్ష్యానుగుణముగా వ్యతిరేక భవిష్యదర్థముల నొక వర్గముగను, వర్తమానము నొక వర్గముగను, విభజించి క్రమాన్వయము చేసెను. దీనిచే వ్యతిరేక భవిష్య దర్థములందు దువర్ణకమును, వర్తమానమున దివర్ణకమును వచ్చునని సిద్ధించెను.

లక్ష్యానుగుణముగా నర్థమును జెప్పుట :

'అనుబంధ ప్రార్థనయో ర్జ్ఞా వ్యతిరేకాదికేచ చోః పస్స్యాత్' (అనుబంధము పరమయినపుడు, ప్రార్థనార్థమున, ప్రేరణార్థమున, వ్యతిరేకార్థములందు చువర్ణమునకు చెందిన చకారమునకు పకారము వచ్చును) అను సూత్రము చకారమునకు పకారము నాదేశముగా విధించినది.[1] స్వార్థమున ప్రేరణార్థమున జేరు 'ఇంచుక్'లలో చువర్ణ మున్నది.[2] వర్తమానార్థమున విధింపబడిన చువర్ణమొకటి కలదు.[3]

ఇందే చకారమునకు పత్వము వచ్చునని ప్రశ్న. స్వార్థ ప్రేరణార్థములలో చేరు ఇంచుగాగమము పత్వ విధానము (క్రియా పరిచ్ఛేదమున నొకే శ్లోకమున జెప్పబడినవి. లక్ష్యములలో గూడ ఇంచుక్‌నకు చెందిన చువర్ణమందలి చకారమునకే పత్వము కనబడుచున్నది. కావున వ్యాఖ్యాతలు ఇంచుగాగమ చకారమునకే పత్వము వచ్చునని చెప్పిరి.[4]

సూత్రమున పకారము వచ్చునని కలదు. (పస్స్యాత్) సంస్కృత వ్యాకరణమున కొన్ని చోట్ల ఉచ్చారణార్థము కొన్ని

---

1. కవిశిరో. క్రియ. 15 సూ.
2. అందే 13, 14 సూ.
3. అందే హలంత. 30 సూ.
4. కవిశిరో. క్రియ 15 సూ. వ్యాఖ్య.

అచ్చులను జేర్చుట కలదు.[1] ఇచట పకారములోని అకారము చ్చారణార్థమా ! లేక అది గూడ ఆదేశముగా పచ్చునా అని సందేహము కలుగును. లక్ష్యమును బట్టి చూచినచో పొల్లు పవర్ణ మే ఆదేశముగా వచ్చునని తెలియును. వ్యాఖ్యాతలట్లే చెప్పిరి. ప్రమాణాంతర వైరుధ్యము లేనపుడు ఇంతకంటే ఉత్కృష్ట మార్గమును మనము చూపలేనపుడు వీరి మార్గమును మనము కాదనరాదు.

కాని విమర్శకులు పూర్వ వ్యాఖ్యాతలవలంబించిన యీ దారులను వదలివేసి చింతామణిలో లోపము లున్నవనియు అది అసమగ్ర గ్రంథమనియు నిందించుచున్నారు. ప్రాచీన వ్యాకరణములందు, భాష్య వార్తిక గ్రంథములందు నున్నవియు పాణినీయ సూత్రములందు జ్ఞాపక న్యాయ సిద్ధములునగు పరిభాషల ద్వారా పాణినీయ సూత్రములను వ్యాఖ్యానించుట లేదా ?[2]

కుశశబ్దము పుంనపుంసకము లందు వర్తించునని పాణినిముని కంఠోక్తిగా జెప్పెను. ఆయన వేఱొక చోట కుశా అని స్త్రీలింగ శబ్దముగా బ్రయోగించెను. వైయాకరణ పారీణులు దానిని గూడ బ్రమాణముగా స్వీకరించుచున్నారు.[3] కావున గ్రంథకర్త వాచనికముగా జెప్పినవియు, వివిధ రీతులలో సూచించినవియు నగు విషయముల వ్యాఖ్యానముల ద్వారా గ్రహించుట సంప్రదాయ మార్గము.

కాని చింతామణి హృదయమును లోకమునకు జూపుటకు బూనుకొనిన యీ విమర్శకులు చింతామణి సూత్రములకు తాము సరిగా

---

[1] 'హకారాది ష్వకార ఉచ్చారణార్థః' సిద్ధాంత కౌముది సంజ్ఞ. మహేశ్వర సూత్ర వృత్తి. 1 పు.

[2] శ్రీ నాగేశభట్టు పరిభాషేందు శేఖరము గ్రంథాది.

[3] శ్రీ భట్టోజీదీక్షితులు సిద్ధాంత కౌముది లిఙ్గాధికారము 180 సూ. అండే విసర్గ సంధి 160 సూ.

నర్థమును జూపక ప్రాచీన వ్యాఖ్యాతలు చెప్పిన అర్థమును గ్రహింపక, అపరూపములను దయారుచేసి చింతామణి యిట్టి వానిని తయారు చేయుచున్నదని చూపినారు.[1] అపరూపములను సాధించినది తాము చేసిన వ్యాఖ్యారీతియే గాని మూల గ్రంథము కాదని వారు గమనింప వలసియున్నది. వీరి వ్యాఖ్యాప్రభావముచే చింతామణి సూత్రము వ్యాప్త్యతి వ్యాప్తి ప్రగస్తమగుట గమనింతము.

వీరు 'స్యాదమహతాం విభక్తౌ సోశ్చము' అను సూత్రమునకు అమహద్వాచకాదంత (తత్సమ) పదములకు విభక్తి పరమగుచుండగా ప్రథమైక వచనమున మువర్ణకము కూడ వచ్చును. వనము, ఫలము మొదలగునవి. ఇందు చకారము ఛందస్సు కొఱకు అని వ్యాఖ్యానించిరి.[2] ఇది సరికాదు.

సు అనునది ప్రథమా విభక్త్యేక వచనము. విభక్తి పరముగా నుండగా దానికి ముందు సు ఉండుట కుదురదు. వీరి వ్యాఖ్యవలన ప్రథమా బహు వచనాదులు పరమగునపుడు ము అను నాగమము గూడ చింతామణి చెప్పనట్లగును. ఇచట బాల సరస్వతి చేసిన వ్యాఖ్య యిది. 'అమహత్తులకు సప్తవిభక్తులు పరమగునపుడు (ఆగమముగను) ప్రథమైక వచనమున కాదేశమయి ము అనునది వచ్చును.'[3] ఈ వ్యాఖ్య యందు పై విమర్శకుని వ్యాఖ్యలోని లోటులు తొలగుచున్నవి. విమర్శకులు వ్యాఖ్యలో మువర్ణకము కూడ వచ్చుననుటచే మువర్ణకము రాని రూపములుండునను నపోహ కలుగును. దానిని వారించుటకు చకారము ఛందస్సు కొఱకని వ్రాసిరి. బాల సరస్వతి వ్యాఖ్యచే చకారమునకు గూడ సార్థక్యము కలిగినది. ముందు విభక్తి పరమగునపుడు చెప్పబడుటచే తరువాత సు విభక్తి కాదేశముగ

---

1. ఆం. భా. చ. 2 సం. 1675 పు.
2. ఆం. భా. చ. 1632 పు.
3. ప. బాలస. అజంత. 9 శ్లో. వ్యాఖ్య.

గూడ నగునను నర్థమును చకారము వలన చెప్పవచ్చును. కాననిట పూర్వ వ్యాఖ్యయే బాగున్నది.

ఇచట పై విమర్శకుల వ్యాఖ్య వలన చింతామణి ముగాగమమును జెప్పలేదనియు, సు పరముగా నుండగా మువర్ణకమును విధించినదనియు రెండు దోషముల నారోపించుటకు వీలు కలిగినది. అనగా వీరి వ్యాఖ్య సూత్రమును అవ్యాప్తి దోషగ్రస్తముగను అసమర్థముగను జేసినదన్నమాట. వీరు చింతామణి సూత్రము నతివ్యాప్తముగ చేసిన ఘట్టముగూడ గలదు. చింతామణిలో 'విషయ నిమిత్తాది జాతశ్చైవాన్యా' అను సూత్రమున్నది. దీనిని ప్రాచీనులు 'విషయ నిమిత్తాద్యర్థములందు వచ్చు సప్తమి ప్రథమాంతములయిన విషయ నిమిత్తాది పదములతో ప్రయోగింపబడునని తెల్పిరి.[1] కాని దీనిని వీరు నవర్ణకమును విధించునదిగా జెప్పిరి.[2] ఇట్లు చెప్పుటచే జీప్ప్రత్యయాదేశములకు విధింపబడిన అలిగాగమము నవర్ణకమునకు గూడ రావలసి వచ్చినది. అనగా అలిగాగమ మతివ్యాప్తమయిన దన్నమాట. ఆ విషయము బరిశీలింతము.

---

1. విషయ నిమిత్తాదిజా=విషయ నిమిత్తాద్యర్థములంబుట్టిన, అన్యా= సప్తమికి, తథైవ = అట్టిలాగుననే యుండును. హరి విషయము, హరి నిమిత్తము ప. బాలస. అజంత 8 శ్లో. వ్యాఖ్య. విషయ నిమిత్తాద్యర్థజా అన్యా విభక్తిః సప్తమీత్యర్థః తథైవ తేన ప్రకారేణ ప్రథమాన్తత్వ లక్షణేన తిష్ఠతీత్యర్థః. భృత్యుల విషయము గౌరవ మత్యంత చలంబు సత్యమవనీశులకున్.
కవిశిరో. అజంత. 33 సూ. వ్యాఖ్య.

2. అట్లే 'న' అను సప్తమీ ప్రత్యయము విషయ నిమిత్తాద్యర్థములందు వచ్చును. ఉదా:- నీ కృతమున ఆం. భా. చ. 2 సం. 1632 పు.

అలిగాగమ విధి అతి వ్యాప్తమా ?

చింతామణిలో 'జేరలిచ' అను సూత్రము అలిగాగమమును విధించినది.[1] దీనిచే నీ యందలి కరుణ వంటి రూపములు సిద్ధించును. "ఇందు 'జేః' అనుట వలన గ్రహింపవలసి యున్నను న ప్రత్యయముపై నలిగాగమము రాదు" అని యొకరు చింతామణి విధి అతి వ్యాప్తమగుచున్నదని భావించిరి.[2]

చింతామణి 'అంద్వింందు నాస్తు సప్తమీ' అని అందు, ఇందు, న అనునవి మూడును అధికరణార్థమును జెప్పునని తెల్పెను.[3] కాని 'అందు జీ పః' అని జీప్పున కాదేశముగా అందును మాత్రము విధించెను.[4] 'సవిధవర్తి నామీందు' అని అధికరణత్వముతో కూడి సమీపముననున్న దానికి ఇందు అనుదానిని వాడుదురని తెల్పెను.[5] అనగా దీనిని సప్తమీ విభక్తి ప్రత్యయమగు జీప్ న కాదేశముగా విధింపలేదన్న మాట. కావున ఇందునకు అలిగాగమమును చింతామణికర్త విధింపలేదని చెప్పవలెను. ఇందలి రత్న సానువులు వంటి ప్రయోగములు నాతడు సాధింపలేదని చెప్పవచ్చును. నిన్న మొన్నటి వారు గూడ తెనుగునకు వ్యాకరణ దీపము చిన్నదనుచుండగా సంక్షిప్తమై పురాతనమైన ఆ గ్రంథము నుండి సంపూర్ణ వ్యాకరణాంశముల నాశించుటలో నౌచిత్యములేదు. ఇక జీప్ న కాదేశముగా నవర్ణమును గూడ చింతామణి విధింపలేదు. కాని 'కేషాఞ్చి దుదన్తానాంనేరి విభక్త్యావునోలుక్స్యాత్' అనికొన్ని ఉదన్తములకు 'న' అను విభక్తి పరమగునపుడు 'ఉన్' నకు లోపమును మాత్రము

---

1. కవిశిరో. సంధి. 38 సూ.
2. ఆం. భా. చ. 2 సం. 1619 పు.
3. అందే. అజంత. 7 సూ.
4. అందే. 26 సూ.
5. అందే. 27 సూ.

విధించెను.[1] జిప్ న కాదేశము చేయలేదు. కావున నవర్ణమున కలిగాగమము ప్రాప్తించునవకాశము లేదు. కేతన

వృక్షము మొలచెను నఱికెను
వృక్షము వృక్షమున బ్రదికె వృక్షమునకునీ
వృక్షమునఁ బండు పడియెను
వృక్షము తుది వృక్షమునఁ దవిలె నాచూడ్కుల్

అని వ్రాసెను. ఇందు 'వృక్షమున బ్రదికె' (వృక్షముచేత) 'వృక్షమున బండు పడియె' (వృక్షమునుండి) 'వృక్షమున దవిలె నాచూడ్కుల్' (వృక్షమునందు), అను వాక్యములయందు నవర్ణకము తృతీయ పంచమీ సప్తమ్యర్థములలో వాడబడెను.[2] నవర్ణమునకు సప్తమ్యర్థము గూడ ఉన్నను తృతీయా పంచమీ సప్తమీ విభక్త్యర్థములలో గనబడు నవర్ణకము నొక్క సప్తమీ ప్రత్యయమున కాదేశముగా విధించుట చింతామణి కిష్టము లేదన్నమాట. దీనికి సప్తమ్యర్థమున్నందువలన అలిగాగమము గలుగవలెననినచో కొన్ని శబ్దములకు సప్తమీ తృతీయార్థములందు ప్రాప్తించు అత్వమునకు గూడ నీ ఆయాగమమును శంకింపవలసి యుండును. గ్రంథకర్త చెప్పని యిట్టి శంకలను చేసి గ్రంథము నతి వ్యాప్తమని చెప్పబూనుటలో నౌచిత్యము లేదు. కావున నవర్ణకమునకు అలిగాగమము చింతామణి ననుసరించి రానేరదనియు అలిగాగమ విధి అతి వ్యాప్తము కాదనియు చెప్పుట యుక్తము.

చింతామణిలో ఛందో భంగమా ?

విమర్శకులు చింతామణిలో ఛందోభంగములు కలవని తెల్పినారు. ఆ విషయమును బరిశీలింతము. "నస్యాత్తద్ధర్మ్మతః" అను

---

[1] కవిశిరో. అజంత. 78 సూ.

[2] ఆం. భా. భూ. 92 పు.

నార్యాగీతి గణములను సరిచేయవలెనని విమర్శకులు చెప్పిరి.[1] నస్యాత్తనునది గీతి. ఆర్యలో ప్రథమార్థమున 7 చతుర్మాత్రా గణములును, ఒక గురువు నుండును. బేసిస్థానమున జగణముండదు. 6వ గణము జగణము కాని నలము కాని కావలెను.[2] ఆర్యా ద్వితీయార్థమున 6వ గణము స్థానమున ఒక లఘువు మాత్రమే ప్రయోగింపబడును. తక్కిన లక్షణములు ప్రథమార్థమునకు వలె నుండును.[3] ఆర్య ప్రథమార్థమునకువలె ద్వితీయార్థముకూడ ఉన్నచో నది గీతి యగును.[4] అనగా నిందు 6వ స్థానమున జగణ నలములలో యొకదానిని వాడుదురు గాని కేవల లఘువును కాదన్నమాట.

గ గ గ గ గ గ గ గ గ గ జ స గ
UU UU UU UU UU IUI IIU U
నస్యా తద్ధ ర్మోత శోచర్యా, స్యాద్వ, ర్తమాన,విహిత, స్య

---

1. ఆం. భా. చ. 2 సం. 1106 పు.

2. శ్లో. లక్ష్మైతత్సప్తగణా గోపేతా నేహ విషమేజః
షష్ఠోయం నలఘూవా
ప్రథమే ర్ధేనియతమార్యాయాః
శ్రీ కేదారః, వృత్తరత్నాకరః
చెన్నపురి : వావిళ్ళ, (1898), 1 శ్లో.

3. శ్లో. షష్ఠే ద్వితీయలా న్లే పర కేముఖలాచ్చ సయతిపదనియమః
చరమేర్థే పఞ్చమకేతస్మాదిహ భవతి షష్ఠోలః
అందే ఆర్యా ప్రకరణము 2 శ్లో.

4. ఆర్యా ప్రథమ దళోక్తం
యది కథమపి లక్షణం భవేదు భయోః
దళయోః కృతియతి శోభాం
తాంగీతిం గీతవాన్ భుజఙ్గేశః.
అందే గీత ప్రకరణము 1 శ్లో.

గ గ   జ   గ గ   గ గ   గ గ   జ   గ గ గ
UU IUI UU UU UU I U I U U U
తద్వ త్తదాది జస్య ప్రాయ స్తుస్యా, త్క్రమాది కస్యే తః

ఇందు పూర్వార్థాంత మందలి స్య అనునది లఘువు కదా! గురువుగా లెక్కించుట తప్పనిపించును. అందుచే విమర్శకు లిట్లు గణములను సరిచేయవలెనని భావించిరేమో. కాని పాదాంతమందున్న లఘువు వికల్పముగా గురువగును.[1] కావున స్య అనునదియు గురువే. ఇందలి గణములు గీతలక్షణమున కనుగుణముగనే యున్నవి. కావున దీనిని సరిచేయనక్కర లేదు.

ఈ విమర్శకులు వేఱొకచోట "రోలో డలటా ముదితాం తస్య చవాలుక్ సలోలోశ్చ" అనునది యార్యాగీతి యర్థభాగమునకు గొఱవడి యున్నది." అని వ్రాసిరి.[2] అచటి మొత్తము శ్లోకమిది.

గగ   గగ   గగ   గగ   స   జ   గగ   గ
UU UU UU UU IIU IUI UU U
నిత్యం దారా దేశ్చ స్యాల్లో, ర్లలయో, రురాచ, తత్ర, స్తః
గగ   స   స   భ   గగ   ల   గగ   గ
UU IIU IIU UII UU I UU U
రోలో డలటా ముదితాం తస్యచ, వాలు, క్న, లోలో, శ్చ,

---

[1] శ్లో. సానుస్వారో విసర్గాన్తో దీర్ఘోయుక్త పరశ్చయః
వా పాదాన్త స్త్వసౌగ్వక్రో జ్ఞేయోన్యో మాత్రికోల్పృజుః
వా పాదాన్త ఇతి. పాదాన్తే యోలఘు స్తిష్ఠతి
సోప్యపేక్షాయాం గురుర్భవతీత్యర్థః. వృత్తరత్నాకరము కసక
సభాపతి వ్యాఖ్య. కవిశిరో. ంజ్ఞ. 17 సూ. వ్యాఖ్యలో.

[2] ఆం. భా. చ. 2 సం. 1643 పు.

ఇది పథ్యార్య, ఆర్యా ద్వితీయార్ధమున 6వ గణస్థానమున ఒక లఘువు మాత్రమే ప్రయోగింపబడునని పైన చెప్పుకొంటిమి. శ్చ అను చివరి వర్ణము పాదాంతమున నుండుటచే గురువైనది. ఆర్యా ప్రథమోత్తరార్ధములు రెండును మూడేసి గణముల దరువాత పాదచ్ఛేదము నందినచో పథ్యార్య అగును.[1] పాదాంత లఘువు వికల్పముగా గురువు కానచ్చునని నియమమును గమనింపనందువలననో దీని నార్యాగీతిగా భావించినందువలననో విమర్శకులు దీనిలో ఛందోభంగము కలిగినదని భావించియుందురు. ఆ లోప మిందు లేదనుట స్పష్టము.

వీరే ఇంకొకచోట "చింతామణికర్త నేరక ఆర్యాగీతులలో సూత్ర రచన నారంభించినాడు. సుర శబ్దము (నకు?) మాత్ర మసమాసమునందు స్త్రీత్వ బహుత్వములు కలుగునని చెప్పుట అతని యభిప్రాయము. గణము కుదరక సురశబ్దము నాది శబ్దముతో గలిపి సమాసము చేసినాడు. కాని ఆది శబ్దము వలన గ్రహింపదగిన సురశబ్దమునుబోలు పదములు లేవు. స్త్రీత్వ బహుత్వే అ. సూత్రమందుండవలెను. కాని యిట్లున్నచో గణభంగము కలుగును. స్త్రీత్వ బహుత్వ సమాసే అని గణముకొఱకు వ్రాసిన నర్థమే యుండదు" అని విమర్శించిరి.[2]

భ స గగ స గగ జ గగ గ
UII UUI UU IIU UU IUI UU U
స్త్రీత్వబ, హుత్వేసు, రాదే రసమా, సేలు, గ్భవేత్సు. శాదే, ర్నో॥

---

1. శ్లో. త్రిష్వంశకేషు పాదో, దలయో రాద్యేషు దృశ్యతే యస్యాః
పథ్యేతి నామ తస్యా, శ్ఛందో విద్భి స్సమాఖ్యాతమ్.
శ్రీ కేదారః వృత్తరత్నాకరః 2,3 శ్లో.

2. ఆం. భా. చ. 2 సం. 1636 పు.

ఇది గీతి శ్లోకమున ద్వితీయార్ధము. రెండవ గణము తగణము. ఇంద్రైదు సూత్రములుండును. ఇది ఆర్యలలో నుండదు. కావున నిట ఛందోభంగమున్నది. ఇటతప్ప మరెచ్చటను ఛందోభంగము కానరాదు. ఇది లేఖక లోపము గూడ కావచ్చునుగదా! భావార్థమున త్వ, తల్ అను ప్రత్యయములు పర్యాయముగా చేరును. గ్రంథకర్త 'స్త్రీత్వ బహుతేసురాడే రసమాసీ' అని ప్రయోగింప సంస్కృత జ్ఞానము చాలని లేఖకుడు స్త్రీత్వ పదసామ్యముచే బహుతే అను దానిని బహుత్వే అని దిద్దియుండవచ్చును. బహుతే అను పాఠమున జగణము గును. గీతిలో సరిస్థానమున జగణముండవచ్చును.

చింతామణిని సూత్రగ్రంథముగా భావించుటచే నిందు గీతి లక్షణము పట్టినదా లేదా యని వ్యాఖ్యాతలు చూడరైరి. అందుచే నీ దోషయుక్త పాఠమే వ్యాపించినది. చింతామణిలో ప్రత్యక్షరమును పరీక్ష గావించిన కళాప్రపూర్ణులు వఝుల చిన సీతారామస్వామి శాస్త్రిగారు మాత్రము స్త్రీత్వ బహుతే అను పాఠమునే చూపిరి.[1] చింతామణి 15వ శతాబ్దినడుమ బయలుదేరినది. తరువాత సుమారు 150 సంవత్సరములకు బాలసరస్వతికి లభించినది. ఈ లోపల ఒకటి రెండు లేఖన దోషములు చేరుట వింతకాదు.

చింతామణిలో "ఛాపవిభక్తిక సంజ్ఞాః (సంధి. 30 శ్లో.) నిత్యం దారాదేశ్చ (అజంత. 49 శ్లో.) అనుతాం స్త్రియాం (అజంత. 52 శ్లో.) ప్రథమైక వచన తుల్యం (హలంత. 54 శ్లో.) అను నాలుగు శ్లోకములు మాత్రమార్యా శ్లోకములయియున్నవి. కేషాంచి దుదన్తానాం (అజంత. 51 శ్లో.) ఆత్మన ఇమనన్తానాం (హలంత. 56శ్లో.) ద్విగుకర్మధారయా (హలంత. 69శ్లో.) అను మూడు ఉద్గీతులు. తక్కినవి గీతి శ్లోకములు".[2]

---

[1] ఆం. వ్యా. సం. సర్వస్వము 1 సం. 533 పు.

[2] వైయాకరణ పారిజాతము వాల్తేరు : ఆంధ్ర విశ్వకళాపరిషత్, (1957), 15, 16 పు.

అని కళాప్రపూర్ణ వఝల చిన సీతారామస్వామి శాస్త్రిగారు తెలిపిరి. కాన చింతామణి కర్త నేరక ఆర్యాగీతులలో రచన చేసెననరాదు.

ఇకసురాది మాట. ఇచట ఆది శబ్దముచే గ్రంథకర్తయేశబ్దములనుద్దేశించెనో పెక్కుమంది వాఖ్యాతలు దెలుపరైరి. కాని మండ లక్ష్మీనృసింహకవి లాజలు, అక్షతలు అను వానిని సురాది గణములో జూపెను.[1] మనకు లభించిన కవి ప్రయోగములను బట్టి అక్షతలాజశబ్దములు వ్యస్తముగా నున్నపుడు స్త్రీత్వబహుత్వముల నందిన వనియు, సమాసమున మువర్ణమును బడసెననియు దెలియుచున్నది.[2] కావున ఛందస్సు కుదురక చింతామణి కర్త సురాది యనుచోట ఆది శబ్దమును వాడెనను వాదము యుక్తము కాదు.

---

1. ఆంధ్ర కౌముది అజంతాః. 186 సూ. వృత్తి.
2.1) 'పుణ్యసతులు పుష్పాక్షతంబులు సల్లుచుండ' రం. రామాయణము యుద్ధ. 685 పు. విద్యారత్న నిడుదవోలు వేంకట రావుగారు, శబ్దరత్నాకరము అనుబంధము, తత్సమ పదములు, చెన్నపట్టణము : దేశభాషా గ్రంథకరణ సభ, (1969), 2 పు.
2. 'లలితాక్షతముల కుసుమంబుల' ఆం.భా. శాంతి. 6.267. 'ఆర్ద్రాక్షతంబులు రాల్చెన్.' వసు. 1-152 ప.
'అర్థిఁబుణ్యాంగన లక్షత లలుకంగ' హరి. ఉ.భా. 3 ఆ. 65 పు.
సీ. శ్రే. అక్షతలు మౌళి దాల్చిరి. మనుచ. 5 ఆ. 95 పు.
కళాప్రపూర్ణ వఝల చిన సీతారామస్వామిశాస్త్రి, ఆం. వ్యా. సం. సర్వస్వము 595 పు.
3) దనుజ విరోధి మీాద నొక తన్వికరంబున లాజలెత్తి చల్లిన (పారిజా.) మంగళాచార మనోజ్ఞలాజముల చల్లిరి (వసు.) ఇవి

చింతామణిపై గల విమర్శల తీరులు.

విమర్శకులు చింతామణిపై అనేక విమర్శలను గుప్పించినారు. వారి విమర్శల ఫలితము "ఆంధ్ర శబ్ద చింతామణి నన్నయ కృతము కాదన్న నాతని కీర్తి గౌరవములకు హానికలుగు నంతటి ముఖ్య

---

324 పుట అధస్సూచికకు తరువాయి

కూచిమంచి తిమ్మకవి సార్వభౌముడు చూపిన ప్రయోగములు. ఆం. వ్యా. సం. సర్వస్వము 595 పు. నిఘంటువులందు, అక్షతలు = సేసబ్రాలు (దీనిని కొందరు నపుంసకముగాను ఏకవచనాంతముగాను చెప్పుచున్నారు), అక్షతము = నొప్పింపబడనిది, పేడి అని కలదు. (శ్రీ బ. సీతారామాచార్యులు, శబ్దరత్నాకరము చెన్నపట్టణము : దేశభాషా గ్రంథకరణ సభ (1965), 9 పు).

సేసబ్రాలు అనునర్థము కల అక్షతములు సురాదులలో జేరదగినది, కొందరు చెప్పిన నపుంసకము ఏక వచనాంతము నయిన శబ్దము చింతామణి కాలమున లేదని భావించవలెను. లాజ. సం. వి. ఆ. (స్త్రీ). ఆ. పుం. బ. పేలాలు అ. న. వట్టిపేరు, పుం. నానబియ్యము, అందే 679 పు.

వీరు ప్రయోగముల నీయలేదు, పేలాలు అనునర్థము గల లాజలను సురాదులలో చింతామణి గ్రహించి యుండును, లాజ అను నేకవచన రూపము చింతామణి కాలమున లేదని తలంపవచ్చును. తరచుగ ధాన్యహాచక శబ్దములు నిత్య బహువచనాంతములని శ్రీ బహుజనపల్లి వారు చెప్పియున్నారు. (ప్రౌఢ. శబ్ద. 37 సూ.) బియ్యము జీలకర్ర మాత్రము నిత్యైకవచనములని వీరిచట తెల్పిరి. కాన ధాన్య వాచకములనదగిన లాజలు, అక్షతలు నిత్య బహువచనాంతములలో చేరదగినవే యగును,

గ్రంథము కాదు. అది సమగ్ర గ్రంథము కాదు. దాని యందలి పరిభాషయందును, సూత్రరచన యందును, భాషయందును ననేక లోపములున్నవి" అను నిర్ణయము.[1] ఈ విమర్శకులు వ్రాసిన ఆంధ్ర శబ్ద చింతామణి హృదయమను వ్యాఖ్య కారంభము లోనివీ వాక్యములు. వీనిని సిద్ధాంతములు చేయుటకు వీరి వ్యాఖ్యానములో ప్రయత్నము సాగినది. వీరు లోపములన్న పలు విషయములు లోపాభాసములే యని యింతకు ముందే గమనించితిమి. వీరి విమర్శ పద్ధతులు గూడ గమనింపదగినవి. వీరి విమర్శములో నీ క్రింది రీతులు కన్పడును.

1. అర్వాచీన వైయాకరణులు తెల్పిన విషయముల నాధారముగ జేసికొని చింతామణి సూత్రముల నసమగ్రములుగా జెప్పుట: చింతామణి యందలి 'లోపోనమ ఆదికే విసర్గస్య' (అనుకరణమున నమః మొదలగు వాని విసర్గమునకు లోపము వచ్చును), అను సూత్రమును వీరు విమర్శించుచు "...... నమ ఆదికములు గాని శబ్దముల విసర్గమున కనుకరణముల కేమి యగునో యితరములగు నచ్చులు గాని, హల్లులు గాని యంతమందు గల సంస్కృత పదములపై ననుకరణము గలుగునపుడేమి యగునో చింతామణి వివరింపలే" దని వ్రాసిరి.[2]

'అహమాదీనాం ద్విత్వమ్' (అనుకరణమున అహం మొదలగు శబ్దముల తుది హల్లులకు ద్విత్వము వైకల్పికముగా నగును) అని చింతామణి సూత్రము. 15వ శతాబ్దిలో బయలిడిన చింతామణి అనుకరణ విషయమున నీ రెండు సంధికార్యములను దెలుపగా దరువాత చాల కాలమునకు నథర్వణ కారికలలో అనుకరణమున నమశ్శబ్దమున కోత్వమును, ఉదంతనామమునకు వుగామమును జెప్పబడినవి.[3] అను

---

[1] ఆం. భా. చ. 2 సం. 1583 పు.

[2] ఆం. భా. చ. 2 సం. 1610 పు.

[3] కవిశిరో. సంధి. 20 సూ. వ్యాఖ్య. అథర్వణ. సంధి. 10 కా.

కరణంబున దుది హల్లునకు ద్విత్వమును జెప్పిన వాడు గూడ నథర్వణుడే.[1] 19వ శతాబ్దివాడగు చిన్నయసూరి విసర్గమున కనుకరణము నందు లోపముగలుగుననియు, మకారమునకు ద్విత్వము వికల్పమనియు రెండు విశేషములను జేర్చెను.[2]

అనగా చింతామణి చెప్పిన 'లోపోనమ ఆదికే విసర్గస్య' 'అహమాదీనాం ద్విత్వమ్' అను విధుల నీయన విస్తరించె నన్నమాట. వందల సంవత్సరముల పరిశీలనముచే బయటపడిన విషయములివి. ఈ స్థితిలో కొన్ని వందల సంవత్సరములకు ముందు బయలుదేరిన గ్రంథమున అవి లేవు; ఇవి లేవని యాక్షేపించుటయందౌచిత్య మేమి? ఏశాస్త్రమైనను కాలక్రమమున నభివృద్ధి నందును. తరువాత పరిణతి గ్రంథములు వెలువడుటకు మొదటి గ్రంథములే పునాదులగును. కావున చెప్పిన విషయములు నాటి దేశకాల పరిస్థితులను బట్టి విలువయినవా? కావా? అని పరిశీలింపవలెనే కాని కాలాంతరమున గుర్తింపబడిన విశేషవిషయములను బట్టి ప్రాచీన లక్షణ గ్రంథముల నసమగ్రము లనుట యుక్తముకాదు.

2, సూత్రములలో చ, తు, మున్నగు వాని నాధారముగా జేసికొని యనిష్టార్థములను లాగుట. చింతామణియందు 'న్వన్తా న్నామ్నః కుజోఽర్బహువచనే' (ను వర్ణాంత వైకృత శబ్దములకు బహువచనలువర్ణము పరమగునపు డా నువర్ణమునకు బిందుపూర్వక కువర్ణ మాదేశమగును.) కొలను, కొలఁకులు; వలను, వలఁకులు, 'కుత్ర చిన్నులోపశ్చ' (కొన్నిచోట్ల నువర్ణాంత శబ్దములకు బహువచన లువర్ణము పరమగునపుడు నువర్ణమునకు లోపము గూడ వచ్చును). మేను, మేలు; పేను, పేలు; చేను, చేలు;

---

[1] కవిశిరో. సంధి. 19 సూ. వ్యాఖ్యలో.

[2] బాలవ్యా. సంధి. 50, 53 సూ.

అను సూత్రములున్నవి. ఇచట విమర్శకులు "ఈ సూత్రమందలి చకారము వలన మేకులు, పేకులు, చేకులు అను ననిష్ట రూపములును నేర్పడుచున్నవి. కాని సూత్రకారుడిట్టి రూపము లుండునని యభిప్రాయ పడి యుండడు" అని విమర్శించిరి.[1]

అనగా స్వాభిప్రాయ ప్రకటనమున కసమర్థమైన రచనమని వారి ఆక్షేపణమన్న మాట. చింతామణి శ్లోక గ్రంథము. చ, తు మొదలగునని పాద పూరణము చేయునవి. వానికి ప్రత్యేకార్థమును జెప్పకొని తీరవలెనని నియమము లేదు. ప్రయోగములను బట్టి విశేషార్థములను జెప్పుకొనుటయు గలదు. అది విశేషార్థ గ్రహణమున బ్రయోగించు పద్ధతియేగాని అపరూపములను దయారుచేసి సూత్రము నసమర్థముగా నిరూపించుట కది ఉపకరణము కారాదు. రెండవ సూత్రమందలి చకారముచే విధి వికల్పమని చెప్పవచ్చును. అపుడు చేనులు, పేనులు, మేనులు వంటి రూపములుగూడ నేర్పడును. కావున నిట చకారముచే పూర్వ సూత్ర కార్యము నను వృత్తి దెచ్చి భాషలో లేని యపరూపము లేర్పడుచున్నవని చెప్పుట వ్యాఖ్యాతలు చేయదగిన పని కాదు. వీరి విమర్శ లీతీరుగ నుండుటచే వీని నాధారముగా జేసికొని చింతామణిని న్యూనముగా జూచుట తగదు.

విషయాలు మరుగున పడినవా ?

చింతామణిలోని "సంజ్ఞలో, రూప నిష్పాదన ప్రక్రియలో బాలవ్యాకరణం వేటేసి ఉపేక్షించిందో, స్వీకరించలేదో అవి తెలుగు వ్యాకరణంలో మరుగున పడిపోయాయి." అని యొకరు భావించిరి. చింతామణిలోని ఉత్తర పద లోపము, ఉపమానము, రూపకమువంటి వానిని బాల వ్యాకరణము విడచుట వలన వాని సమాసత్వం నష్టప్రాయమయిందని వీరి యూహా.[2]

---

[1] ఆం. భా. చ. 2 సం. 1641 పు.

[2] సం. ప్ర. వ్యాకరణాలు 478 పుట.

నిజమునకు చిన్నయసూరి వీని నుపేక్షించెనా ? స్వీకరించ లేదా ? పరిశీలింప వలెను. ఈ సమాసములు దెనుగునఁ బుట్టినవి గావు. సంస్కృత వైయాకరణులు చెప్పినవి. ఉపమాన సమాసము, రూపక సమాసము, తత్పురుష భేదమయిన కర్మధారయములోని రకములు.

తత్పురుష స్సంస్కృత వత్ప్రాయశః. [1]

(తత్పురుషము తరచుగా సంస్కృతము వలె కార్యముల నందును)అని చిన్నయసూరి చేసిన అతిదేశముచే పై సమాసములు దెనుగులోనికి రాకుండ నెట్లుండును ? చిన్నయసూరి మఱియొక వ్యాకరణములో జెప్పినను బాల వ్యాకరణములో జెప్పలేదందురా ?

“సిద్ధంబు సర్వంబు గ్రాహ్యంబు” అని బాల వ్యాకరణము నందును స్పష్టముగా జెప్పెను. [2] ఉపమాన సమాసము రెండు రకములు. ఉపమాన పూర్వపదము, ఉపమానోత్తర పదము. “చిగురు గేలు, జుంటి మోవి ఇత్యాదులయిన ఉపమాన పూర్వపద కర్మధారయములు, ముఖపద్మము, చరణ కమలములు ఇట్టి యుపమానోత్తర పదంబులు గల”వని ఆయన జెప్పియుండగా నీ సమాసములను బాల వ్యాకరణము పేక్షించె నన నేల ? [3]

ఈ సమాసములను గ్రహించినను ఆ పేరులను వదలెనని వీరి ఉద్దేశ్యము గాబోలు.

ఉపమాన సమాస మొక సంజ్ఞ గాదు. అందరిచేత నుపమానోత్తరపదమనబడుదానిని అనంతుడు ‘ఉత్తర పదోపమానమ’ ని

---

1. సూత్రాంధ్ర వ్యాకరణము 15 పుట.
2. బాల వ్యా. సమాస. 3వ సూత్రమునకు వృత్తి.
3. అందే.

వ్యవహరించెను.[1] అర్థస్ఫూర్తి గలుగుచున్నపుడు పదముల నిటు నటు మార్చినచో మునుగునది లేదు. ఉపమానము పూర్వపదముగా నున్నదాని నుపమాన పూర్వపదమని, ఉపమాన ముత్తర పదముగా గల దాని నుపమానోత్తర పదమని వ్యవహరించుచున్నాము. ఆరెంటిని గలిపి చింతామణి కర్త ఉపమాన సమాసమని సంగ్రహముగా పేర్కొనెను. వ్యాఖ్యాతలు ఉపమాన పదము ఉపమానోత్తర పదమునకు ఉపమాన పూర్వపదమునకు సామాన్య వాచకము గాన కేలుదమ్మి, మోము దామరవంటి ఉపమానోత్తరము పదములను[2] పండుమోవి, తమ్మికేలువంటి ఉపమాన పూర్వపదములను గ్రహించి వివరించిరి.[3] చిన్నయసూరి గూడ పై రెండు సమాసములను గ్రహించుచు స్పష్టతకై వ్యాఖ్యాతలు సూచించిన విధమున శబ్ద మంజర్యాదులలో ప్రసిద్ధము లయిన ఉపమానోత్తర పదము, ఉపమాన పూర్వపదము నను పదములను వాడెను. ఇందాయన చింతామణిని వదలిన దేమి ?

ఉత్తర పదలోపము, రూపక సమాసము, సంస్కృతము నందే క్వాచిత్కములు. అట్టివిగూడ గొన్ని గలవని తెలియ జేయుటకు చింతామణి కర్త పేర్కొనెను. ప్రసిద్ధ విషయములను మాత్రమే చెప్ప దలచిన బాల వ్యాకర్త వీనిని వేరే చెప్పలేదు. 'సిద్ధంబు సర్వంబు గ్రాహ్యమ'ని ఆయన చెప్పుటచే నివియన్నియు గ్రహించబడినట్లే. "విభక్తధనాః విభక్తాః పీతోదకాః పీతాః" అనుచోట్ల పతంజలి ముని ఉత్తర పదలోపము నంగీకరించెను.[4] కంఠేస్థః కాలోస్య కంఠే కాలః, ఉష్ట్రముఖ మివ ముఖ మస్య ఉష్ట్రముఖః అను బహువ్రీహులలో

---

[1] ఛందో. 4 - 103 ప.

[2] కవిశిరో. హలంత. 43 సూ. వ్యాఖ్య: 525 పుట.

[3] కవిశిరో. ఆం. ర. సంఘ ప్రచురణము (1965), 531 పు.

[4] వ్యాకరణ మహాభాష్యము 3-4-6 సూత్ర వ్యాఖ్యలో.

గూడ నాయన ఉత్తర పదలోపమును జెప్పెను.[1] ఉష్ట్రముఖుః, ఖర ముఖుడు మొదలగు సిద్ధ సమాసములలో తెనుగు వారు గూడ ఆ మార్గ మవలంబించవలసినదే. ఇవిగాక జవ్వాది సెట్టి, గాజుల సెట్టి వంటి తెలుగు సమాసములున్నవి. ఇచట 'అమ్ము' అను పదము లోపించినది. వీని నుత్తర పద లోపములుగా దెలుగు వైయాకరణులు పేర్కొనిరి.[2] దీనిని గుర్తింపనిచో బై పదముల లోనే సమాసమున్నదని చెప్పుదురు?

ఇట్టి సమాసము లతి స్వల్పముగా నున్నవి. ఆ విషయమును చింతామణి "కేచిత్ (కొన్ని మాత్రము) అను పదముచే సూచించినది. అట్టి దానికి నెక్కువ వ్యాప్తి యెట్లుండును? ఆ పదము వచ్చినపుడట్లు గాక మరి యే విధముగా జెప్పుదురు? అట్లే చెప్పుకొనుచున్నపుడు నష్టప్రాయమగుట యేమి? ఇక రూపక సమాసము మాట. ఉపమానోత్తర పద కర్మధారయ సమాసము వంటిదే రూపక సమాసము గూడ. సామాన్య ధర్మమును బ్రయోగించనపుడు 'ఉపమితం వ్యాఘ్రాదిభి స్సామాన్యాప్రయోగే' అను సూత్రముచే ఉపమేయము ఉత్తరపదముగా నున్న ఉపమానముతో సమాసమును బొందును.[3]

దీనినే యుపమానోత్తరపద సమాసమందురు. సామాన్య ధర్మము ప్రయోగింపబడినపుడు పై సూత్రము ప్రవర్తింపదు. అపుడు పై సమాసమే రూపక సమాసమగును. క్వాచిత్కముగా నుండుటచే రూపకోత్తరపదలోప సమాసములను బాల వ్యాకర్త వేరే పేర్కొనక పోవచ్చును. సిద్ధంబు సర్వంబును గ్రాహ్య మనుటచే నీ సమాసములాయన కిష్టమని చెప్పక తప్పదు. అవధారణ పూర్వ

---

1. అందే. 2. అ. 2. పా. 3. ఆహ్నికము.
2. కవిశిరో. హలంత 43 సూ. ఆం. ర. సం. (1965), 531 పుట.
3. సిద్ధాంత కౌముది తత్పురుష. 735 సూ.

పద కర్మధారయ సమాసము రూపక సమాసము పర్యాయములు. విద్యాధనము వంటి రూపక సమాసములకు సంస్కృతమున 'విద్యైవ ధనమ్' అని పూర్వపదమునకు చివర అవధారణార్థకమైన 'ఏవ' నిలుచును. కావున సంస్కృతమున అవధారణ పూర్వపదమను మాట సార్థకము, తెనుగున 'విద్య యనెడి ధనము' అను విగ్రహము చెప్పుదుము. ఇచట అవధారణార్థకము లేదు. రూపకాలంకారములో వాడెడి 'అనెడి' అను ధాతుజ విశేషణము వాడబడుచున్నది. కావున రూపక సమాసమను మాట తెలుగున సార్థకము. దీనిని "కర్మధారయ భేదముగా చెప్పుదురేగాని రూపక సమాసాలనరని విమర్శకుల మాట. కర్మధారయమున 9 భేదము లున్నవి. [1] అందే భేదమో ప్రత్యేకించి చెప్పవలసినపుడేమి చేయుదురు? సంస్కృతము నందువలె అవధారణ పూర్వ పద కర్మధారయ మందురా? సమాసార్థము నెఱింగించెడి వాక్యమునకు విగ్రహమని పేరు. తెనుగున ఆ సమాస విగ్రహ వాక్యములో నవధారణార్థక పదమును జేర్చుటలేదు. కావున సమాసార్థమున నవధారణము లేదని తెలియుచున్నది. అపుడది నేతి బీరకాయ వంటిది కాదా?

ఇంతకును రూపక సమాసమునకు బ్రసిద్ధి లేదా? ఉన్నత పాఠశాలలో నిప్పటికిని రూపక సమాసము బోధింపబడుచునే యున్నది. [2]

మఱియు పండితులు వ్రాసిన వ్యాకరణములో గూడ నీ రూపక సమాస పద ముపయోగింపబడుచునే యున్నది. [3]

---

1. శ్రీ గరణి వైయాకరణ కృష్ణాచార్యులు శబ్దరత్నావళి కర్మధారయ సమాసః 95 పుట.
2. శ్రీ ఉత్పల సత్యనారాయణాచార్య, తెలుగు వాచకము, 9వ తరగతి, హైదరాబాదు : ఆంధ్రప్రదేశ ప్రభుత్వ ప్రచురణము (1983), 4 పుట.
3. ఒకరు 'అవధారణ మనగా నొక వస్తువును మఱియొక వస్తువుగ నిశ్చయించుట' అవధారణాపదము పూర్వమందు గలది యన

దీనికి ప్రయోజనమున్నది

ఒకరు 'వ్యవహితాశ్చ సర్వేస్యుః' (ప్రథమ యందున్న యన్ని విశేషణములకు వాని విశేష్యములకును మధ్యమున మఱికొన్ని పదములును రావచ్చును); అను సూత్రమును వ్యాఖ్యానించుచు "ఈ సూత్రము ప్రయోజనము తెలియదు. సంస్కృతమునను విశేష్య తద్విశేషణములు వ్యవహితములుగ నుండవచ్చును గదా!" అని శంకించిరి. [1]

ప్రథమాన్త విశేషణములకు విశేష్యములకు నడుమ అగు, అయిన మొదలగు అగు ధాతుజ విశేషణములు చేరుట తెలుగులో ప్రత్యేక లక్షణము. దీని నిచట చింతామణి సూచించి ఉండ వచ్చును. ఇట్టిది సంస్కృతమున లేదు. కావున ప్రత్యేకముగా జెప్పుకొనవలసి యుండును.

దీనికి ముందు సూత్రము 'షష్ఠీ విశేషణానాం ప్రథమా స్యాత్' (షష్ఠీ విభక్త్యంత శబ్దముల విశేషణములకు ప్రథమా విభక్తి వచ్చును); అనునది. [2] ఇందు షష్ఠీ విశేషణముల మాట మాత్రము

---

౩౩౨ పుట అధస్సూచికకు తరువాయి

ధారణా పూర్వపద కర్మధారయ సమాసమని నిర్వచించిరి. దీనికి రూపక సమాసమనియు బేరు కలదని వివరవ్రాసిరి. విద్య అనెడి ధనమనుచోట పూర్వపదమున ఒకవస్తువును మరొక వస్తువుగ నిశ్చయించుటెట్లు కలదో నాకు బోధపడలేదు. మొత్తము సమాసములో విద్యయందు ధనము నారోపించుట కలదు. కావున రూపక సమాసనామము సార్థకమే. శ్రీ వావిలికొలను సుబ్బారావు, సులభ వ్యాకరణము, చెన్నపురి: బ్రిటీష్ మోడల్ ప్రెస్, (1927), సమాస. 27 సూ. వృత్తి.

[1] ఆం. భా. చ. 2 సం. 1687 పు.

[2] అందే,

చెప్పబడినది. 'వ్యవహితాః' అను సూత్రమున "అగు ధాతు వ్యవధానము నందిన సర్వ విభక్త్యంతముల విశేషణములును ప్రథమ లగును అని చెప్పియుండ వచ్చును. [1]

ఇట్లు చెప్పుటచే షష్ఠ్యంత విశేష్యములు విశేషణములు అగు ధాతుజ విశేషణ వ్యవధానము లేకున్నను ప్రథమ లగుననియు, అగు ధాతు వ్యవధానమున్నచో సర్వ విభక్త్యంత విశేష్యముల విశేషణములును ప్రథమ నంద వచ్చుననియు సారాంశము గలుగును.

చింతామణి ప్రభావము లేదా ?

గణపవరపు వేంకటకవి తన ఆంధ్ర కౌముదిలో చింతామణి ఫక్కిని స్పృశించలేదని విమర్శకులు ప్రతిపాదించినారు. 18వ శతాబ్ది ముగిసిన తరువాత మాత్రమే చింతామణి ఫక్కికకు వ్యాప్తిగలిగెనని చెప్పుటకు వీరీ ప్రతిపాదనము చేసిరి. [2]

వేంకటకవి మహా పండిత కవి, ఆత్మ విశ్వాసము గలవాడు. 12వ సంవత్సరమందే తారావళిని, మునిముని మీసములు మొలుచు వేళ యమకశతకమును జెప్పినవాడు. సుమారు ముప్పది కృతులను వ్రాసినవాడు. తెలుగున నిఘంటు ఛందోవ్యాకరణాలంకార గ్రంథములను లిఖించినవాడు. తన లక్షణ గ్రంథము సర్వలక్షణాతిశాయి యను భావముతో సర్వలక్షణ శిరోమణి యను పేరును బెట్టినవాడు. "నీకె చెల్లుగాక పెఱకవులకు నెట్లు కలుగనేర్చు నౌర నీశక్తి యెక్కడనైన గలదే" అని కృతిపతి యితని ప్రస్తుతించినట్లితడు వ్రాసికొనెను. [3]

---

1. వ్యవహితాః=వ్యవధానము కలవై, సర్వే = అన్ని విభక్త్యంతమందు గల విశేష్యముల విశేషణములును, స్యుః = ప్రథమ లగును; అని దీని ప్రతి పదార్థము.
2. సం. ప్ర. వ్యాకరణాలు 452 పుట.
3. ఆంధ్ర కౌముది గ్రంథ ప్రశంస 1 పుట.

ఇతడు చిత్ర కవిత్వ శిఖరాగ్రముపై తిష్ఠవేసికొనిన వాడని, ఉద్దండ పాండిత్య ప్రకర్ష గలవాడని, కవిపండిత ప్రశంసనందుకొనెను.[1] ఆంధ్రకౌముది కాదిలో సంస్కృత ప్రాకృతములకు వలె[1] నాంధ్రమునకు లక్షణము బయలుదేర లేదనియు, మున్ను తెలుగున నెవ్వా రెరుంగని యాంధ్రకౌముది యను కృతిని రచించుచుంటిననియు దెలిపెను.[2]

పై విషయములను బరిశీలింపగా దెలుగున నున్న లక్షణ గ్రంథము లన్నింటికంటె గొప్ప గ్రంథమును వ్రాయదలచెననియు, ప్రాచీన లాక్షణికులకంటె దానధికుడనను భావము గలవాడనియు స్పష్టపడును. ఇట్టివాడు 82 ఆర్యలలో రచించబడిన ఆంధ్ర శబ్దచింతామణిని స్మరింపక పోవుటలో వింతలేదు.

ఈ కవి 1630-1673 ప్రాంతమువాడు. అనగా నప్పకవికి సమకాలికుడన్న మాట.[3] ఇతడు ప్రాచీన లక్షణ గ్రంథములను బెక్కింటిని బరిశీలించినాడు. చింతామణి ఫక్కికలో నప్పటికి మండ లక్ష్మీ నరసింహకవి యాంధ్ర కౌముది, అథర్వణ కారికలు తప్ప బయలుదేర లేదు. వాని నీతడు చూచెనో లేదో తెలియదు. ఆంధ్రభాషా భూషణము, కావ్యాలంకార చూడామణి, కవిచింతామణి మొదలగు పలు గ్రంథములు, నడచిన దారిలో తన గ్రంథమును గొంతనడపినను వైయాకరణ సిద్ధాంత కౌముదిలోని పలు నంశములను తన గ్రంథములో బ్రవేశపెట్టి దానికి ఆంధ్ర కౌముది యను నామమును సార్థకమొనరించుటకు యత్నించెను. వానితోపాటు కొన్ని చింతామణి విషయములను గూడ నతడు గ్రహించెను. (ఎ) 'కూర్చి' ని విభక్తి ప్రత్యయములలో మొదట జెప్పినవాడు చింతామణికర్త.

---

1. శ్రీ ఆరుద్ర సమగ్రాంధ్ర సాహిత్యం 11 సం. 159, 160 పుటలు.
2. ఆంధ్ర కౌముది సీసమాలిక కాకినాడ : ఆం. సా. ప. ముద్రణము, (1935), 1 పుట.
3. శ్రీ ఆరుద్ర సమగ్రాంధ్ర సాహిత్యం 11 సం. 165, 167 పుటలు.

కర్మ ప్రవచనీయకే కూర్చిః (కర్మ ప్రవచనీయకమున కూర్చి వచ్చును)[1] దాని నీతడు గ్రహించి 'కూర్చను ద్వితీయకు గుఱించి యూ' అని చెప్పినాడు.[2]

(బి) ఆంధ్ర శబ్ద చింతామణి 'అంద్వ్యందు నాస్తు సప్తమీ' అని ఇందును సప్తమ్యర్థకముగా జెప్పినది.[3] వెంకటకవి దీనిని గ్రహించి 'ఇందు నందు ననగ నివి సప్తమిగ నొప్పు' అని వ్రాసెను.[4]

(సి) హరి రవి కవి మొదలగు ఇదంత సంస్కృత శబ్దములను తెలుగు చేయు పద్ధతిని కేతన ప్రత్యేకముగా జెప్పలేదు.[5]

'రవి యరి తిమి రాపహారిం
బవి బర గిరి విహతి రస విభావ ప్రతిభం
గవి విశ్వేశ్వరుడనగా
భువి నీ ద్వ్యయమునకు నిదియపో తెనిగింపన్.'

అని విన్నకోట పెద్దన ఈ ద్వయము (ఇ ఈ లు అంతమందు గల శబ్దములు) తెలిగించునపుడు రవి అరి పవి అను రీతిగా నుండునని తెలిపినాడు.[6]

---

1. కవిశిరో. అజంత. 17 సూ.
2. ఆం. కా. శాకినాడు: ఆం. సా. ప. ముద్రణము, (1935), 5 పుట. 28 పంక్తి.
3. కవిశిరో. అజంత. 7 సూ.
4. ఆం. కా. 6 పుట. 3వ పంక్తి.
5. ఆం. భా. భూ. 28 నుండి 42 వరకు.
6. కావ్యా. చూ. 9 ఉ. 28 పంక్తి.

ఆం. శ. చింతామణి 'సోర్లుగితః' (ఇదంతముల ప్రథమైక వచనమునకు లోపము వచ్చును)[1] అని తెలిపినది. వేంకటకవి గూడ 'ఇదంతశబ్దముల కన్నింటికి ప్రథమైక వచనంబు పరగదొందు' అని చెప్పినాడు.[2] (డి) 'క్వచిదమహతోఽపి డుజ్ స్యాత్' (ఒకచోట మహద్వాచకములకు గూడ డుజ్ వచ్చును) అని చెప్పెను.[3] బాలసరస్వతి దీనిని వ్యాఖ్యానించుచు కత్తళడు కైరడు జన్నడు అశ్వవాచకములు. వీనికి 'క్వచిదమహతోఽపి డుజ్స్యాత్' అని డుజ్ వచ్చును. అని వ్రాసెను.[3] వేంకటకవి 'జాత్యశ్వ వాచక శబ్దములకును డు ప్రత్యయ మె, యొప్పెడు' అని చెప్పెను.[4] చింతామణి 'కర్మాదేః కర్తృత్వం ప్రథమాచ నసర్ణకశ్చ తద్వత్తాస్యాత్' (కర్మాదులకు కర్తృత్వము ప్రథమ, క్రియకు నవర్ణకము అట్లే వచ్చును) అను సూత్రముచే నుతించిన రాజు వంటి రూపములను సాధించినది.[5] ఇవి తెలుగున గల ప్రత్యేక ప్రయోగములు. వీని వైశిష్ట్యమును గమనించి వేంకటకవి

> "విశిష్టాన్వయములనఁ జెలగు నింకఁ
> గర్తృ కర్మార్థముల్గలిగిన క్రియలందు
> నినయన ప్రత్యయంబెసగుచుండు
> వచ్చిన వాడన నిచ్చిన సొమ్మన"

అని వ్రాసియున్నాడు.[6] (ఇ) కేతనాదులు పలికెడి, పలికెడు వంటి రూపములను వర్తమానములని చెప్పగా చింతామణి పల్కుచున్నాడు,

---

[1] కవిశిరో. అజంత 36 సూ.

[2] ఆం. కౌ. 6 పుట 29 పంక్తి.

[3] ప. బాలస. 213 శ్లో. 28 పుట.

[4] ఆం. కౌ. 6 పుట. 24 పంక్తి.

[5] కవిశిరో. హలంత. 33 సూ.

[6] ఆం. కౌ. 21 పుట. 1, 2, 3, పంక్తులు.

పలుకుచున్నారు నంటి రూపములను సాధించెనని బాలసరస్వతి తెలిపెను. వేంకట కవి మొదట "వర్తమానార్థైక వచన బహువచనములనెడి నెదరునై పలికెడి బలికెదరననిట్లు రాగిలు" అని కేతనాదులు చెప్పిన వర్తమానార్థకములను సాధించి పిదప "పురుషులను జెప్పనవుడే యాడనగ వచ్చు ముని పల్కుచున్నాడనగ నల్లయున్న యన్మాటపై నొప్పునార్భహూతను ధీరులు పల్కుచున్నారనంగ" అని బాలసరస్వతి వ్యాఖ్యలో జెప్పిన ఉన్న అను ననుబంధములతో గూడిన రూపములను సాధించినాడు. వేంకటకవి చింతామణిని జూచి యందలి విషయములను గ్రహించెననుటకు పైన జూపిన వానిలో 1, 2, 5, 6 విషయములు ప్రబల ప్రమాణములు. వీనిని చింతామణికి బూర్వులు చెప్పలేదు.

చింతామణి విధించిన వానిలో గొన్నింటిని వేంకటకవి గ్రహించెనని గమనించిన యీ విమర్శకులు "తెలిసో, తెలియకో ఈ షణ్మాత్రంగా చింతామణి ఫక్కి వ్యాపిస్తున్నదని గూడా అనవచ్చు" అని అంగీకరించినారు.[1] కేతన చెప్పిన వర్తమాన రూపాలను చెప్పిన పిదప, బాలసరస్వతి చింతామణిద్వారా సాధించిన ఉన్న అను ననుబంధముతో గూడిన రూపమునుగూడ వేంకటకవి చెప్పుటచే నిది తెలిసి చేసిన పనియే గాని తెలియక చేసిన పనిగాదని చెప్పవలెను.

వేంకట కవి అనేక గ్రంథ పరిచయము వలన సంస్కృతభాషా పాండిత్యము వలన ప్రాచీను లెవరును జెప్పని పలు విశేషముల నుదాహరణములతో నిచ్చి తన గ్రంథమును సర్వోత్కృష్టముగా నొనరించితినని నమ్మినాడు. కావున వ్యాకరణమున కేతనాదుల పేరెత్తినట్లె చింతామణికర్తపేరెత్తలేదుగాని యతనికి చింతామణి కర్తపైగాని తద్గ్రంథముపైగాని నిరసన భావము లేదని చెప్పవచ్చును. చింతామణి

---

[1] సం. ప్ర. వ్యాకరణాలు 456 పు.

కర్త రచించిన లక్షణ సారమును నన్నయభట్టనామముతో పాటు తన ప్రయోగసారమున నుదాహరించుట యీ విషయమున ప్రమాణము.[1]

ప్రయోగ ప్రదర్శన ప్రాధాన్యమున్న అందు, తక్కిన గ్రంథ కర్తలతో పాటు నన్నయభట్టును పేర్కొనినాడు. ఇందు పూర్వ వైయాకరణుల గ్రంథములను నామముల నుదాహరించు బని పెట్టుకొనలేదు. కావున చింతామణి, తత్కర్తల ఊసెత్తలేదు. వేంకటకవి సంజ్ఞాదికము విషయమున కేతనాదులను కొంత అనుసరించినను దశవిధ లకారముల వంటి సంస్కృత వ్యాకరణ సంప్రదాయములను, అధికోదాహరణముల జూపుట, పూర్వ ప్రయోగములు, శవర్ణయుత పదములు, సకారయుత పదములు వంటి అనేక విశేషములను జూపుట, మొదలగు విషయములలో స్వాతంత్ర్యమును వహించి కొన్ని విషయములలో చింతామణి ననుసరించెను.

ఆంధ్రకౌముదిలో కేతన మార్గము గంగ, సంస్కృత వ్యాకరణమునుండి గ్రహించినదియు కవి నూతనముగా జెప్పినదియు యమున. చింతామణి మార్గము సరస్వతి. ఇట్టి గ్రంథము త్రివేణీసంగమము వంటిదైనది. కాని వేంకట కవి చింతామణి ఫక్కిని స్పృశించలేదనుట, 19వ శతాబ్దికి గాని చింతామణికి వ్యాప్తి కలుగలేదనుట సత్యదూరము.

దీనినెవరు మార్చిరి ?

'చింతామణి కళా ద్రుత ప్రకృతిక విభాగాన్ని చేయడంలో కళల్ని పేర్కొని శేషించినవి ద్రుత ప్రకృతికాలంటే ఆ పద్ధతిని వ్యత్యస్తం చేసి, ద్రుత ప్రకృతికాలు నిర్దేశించి, శేషించినవి కళలని సూత్రించడంతో ఆ విధానమే అనంతర వ్యాకరణ విద్యార్థులకు శిరో

---

[1] ఆచార్య కోర్లపాటి శ్రీరామమూర్తి, అపర నన్నయభట్టు లక్షణ సారము ఆంధ్ర శబ్దచింతామణి, భారతి (మార్చి 1983), 21 పు

ధార్యమైంది' అని ఒక విమర్శకుని అభిప్రాయము.[1] ద్రుతప్రకృతికములను నిర్వచించి తదితరములు కళలని మొదట చెప్పినవాడప్పకవి.

వలసినచోఁ దుది ద్రుతములు
తలచూపెడు శబ్దములు ద్రుత ప్రకృతులనన్
వెలయునవి వొడమకుండెడు
తెలుగు పదంబులు కళా ప్రదేశములయ్యెన్.[2]

సూరి యీమార్గము ననుసరించెను. మొదట చిన్నయసూరి గూడ చింతామణి మార్గముననే కళలను దెలిపి తదితరములు ద్రుత ప్రకృతికములని చెప్పెను.

బహువచన క్రియా పదములు మధ్యమ
పురుష క్రియా పదములను డజాది
పర్ణకాంత క్రియా పదములు, యొక్క ష
ష్ఠీ విభక్తియు, ప్రథమా విభక్తి
కర్మప్రవచనీయకంబులు కయి పట్టి
యను విభక్తులు కించిదర్థకములు
సంతాప చిత్ర ప్రశంసా యదా తదా
కర్హ్యాధునార్థ ప్రకాశకములు

కిలకిమేవ తూష్ణీక్స్వార్థకములు మొద
లయిన శబ్దంబు లెల్ల గళాహ్వయంబు
లన్యములు ద్రుత ప్రకృతులంటడు) బుధులు
విమల కరుణా రసావేశ వేంకటేశ ![3]

---

1. సం. ప్ర. వ్యాకరణాలు 475 పుట.
2. అప్పక. 5-22 ప.
3. పద్యాంధ్ర వ్యాకరణము, సూత్రాంధ్ర వ్యాకరణములు, కాకినాడ ఆం. సా. ప. ముద్రణము, (1931), 48 ప. 4 పు.

తరువాత నీ పద్ధతిని విడనాడి అప్పకవి మార్గములో కళలు ద్రుతప్రకృతిక భిన్నములని చెప్పెను.

ఈ మార్పుకొక ప్రధాన కారణము కనబడును. తెనుగు వ్యాకరణమున ద్రుతప్రకృతికములకు ప్రముఖ స్థానమున్నది. ప్రధానములయిన వానిని పేర్కొనుట ఉచితము గదా! ఈ విషయమును పద్యాంధ్ర వ్యాకరణ రచనానన్తరము గ్రహించిన సూరి తరువాత చింతామణి పద్ధతిని వీడి అప్పకవి దారిని త్రొక్కెను. వ్యాకరణ రచనలో ననేక ప్రయోగములు చేసినవాడగుటచే నాయన మేలేర్చి గ్రహించెను. కళా సంజ్ఞ లేకున్నను దెనుగు వ్యాకరణమునకు నష్టము లేదని భావించినవాడగుటచే మంచెళ్ల వాసుదేవకవి ఆసంజ్ఞనే వదలివైచెను.[1]

చింతామణికర్త త్రిలింగ శబ్దానుశాసన కర్తపై గల గౌరవముచే నీ పద్ధతిని స్వీకరించి యుండును.[2] ప్రతిభావంతుడగు చిన్నయసూరి ప్రాచీన వ్యాకరణములలో పెక్కింటిని చదివినను ఆంధ్రశబ్దచింతామణినే ప్రధానాదర్శముగ జేసికొని తన వ్యాకరణ రచనము సాగించెను. చింతామణి ముద్ర బాల వ్యాకరణమునందు కంటె నాయన పూర్వవ్యాకరణములందు ప్రస్ఫుటముగ గనబడును. చింతామణికి దరువాత 4 శతాబ్దులు గడచినందున, అనేక వ్యాకరణములు బయలుదేరినందున వ్యాకరణ రచనలో క్రమాభివృద్ధి కలుగుట సహజము. వ్యాకరణ రచనలో పలు ప్రయోగముల నొనరించిన చిన్నయసూరి రచనలలోనే క్రమ పరిణామమున్నది. ఈ స్థితిలో నాయన కొన్ని మార్పులు చేర్పులు చేసికొనుటలో వింత మేమియు లేదు.

---

1. వైకృత చంద్రిక, సంజ్ఞ 1 నుండి 12 పుటలు.
2. అథర్వణుడు, త్రిలింగ శబ్దానుశాసనము ప్రథమ 19, 20 శ్లో. మద్రాసు : ప్రాచ్యలిఖిత గ్రంథాలయం: డి/12457.

చింతామణి ప్రసిద్ధి

ఒకరు ఆంధ్రశబ్ద చింతామణికి 19వ శతాబ్దివరకు బ్రసిద్ధి లేదని భావించినారు. దానికి ప్రమాణముగా అడిదము సూరకవి, గణపవరపు వేంకటకవి ఆంధ్ర శబ్దచింతామణి మార్గమును గ్రహించలేదని జెప్పినారు.[1]

ఒక్కొక్కరికి ఒక్కొక్క మార్గముపై నభిలాష యుండ వచ్చును. తదనుగుణముగా వారి గ్రంథరచన సాగుచుండును. ఒకరిద్దరు గ్రహించనంత మాత్రమున నొక గ్రంథమునకు వ్యాప్తిలేదని నిర్ణయించుటకు వీలులేదు. ఆంధ్ర శబ్ద చింతామణి 17వ శతాబ్ది ప్రారంభములో బయలుపడినది. అది బాల సరస్వతికి దొరకుటకు ముందే దాని కొక టీక ఉన్నది. దాని నహోబలపతి సారంగధర టీక యని చెప్పెను. తరువాతిది బాలసరస్వతీయము. మండ లక్ష్మీనృసింహ కవి చింతామణివిషయము నంతను కేవల సూత్రరూపముగా బరివర్తనము చేసి ఆంధ్ర కౌముదిని రచించెను. అథర్వణుడు చింతామణిలోని పెక్కు సూత్రములకు పూరణాదికమును జేయుచు కొన్ని కారికలను నిర్మించెను.

చౌడేశ్వరీ విలాసకర్త చింతామణిలో బెక్కు విషయములను జేర్చెను. అదియే అప్పకవి కాధారప్రతి. అందలి విషయములను కొన్నింటిని చిన్నయసూరి గూడ గ్రహించెను. బాలసరస్వతిమొదలు చౌడేశ్వరీ విలాస కర్తవరకు నున్నవారు 17వ శతాబ్ది పూర్వార్థము వారే.

తరువాత (1658) అప్పకవి వ్రాసిన విస్తృత పద్యమయ వ్యాఖ్య వెలువడినది. 1707 ప్రాంతమున చింతామణి పై నతి విస్తృత వ్యాఖ్యయగు కవిశిరోభూషణము వెలువడినది. 1758 ప్రాంతమున

---

[1] సం. ప్ర. వ్యాకరణాలు. 451 నుండి 458 వరకు.

మంచెళ్ళ వాసుదేవ కవి ఆంధ్రశబ్ద చింతామణికొక వృత్తిని వ్రాసి దానితో దృప్తి నందక వైకృత చంద్రిక యనునొక బృహద్గ్రంథమును చింతామణి మార్గములో స్వతంత్రముగా నిర్మించెను. వీరందరు నుద్దండులయిన పండితులే. ఇంత మంది అనుయాయులుండగా 19వ శతాబ్దికి బూర్వము చింతామణికి ప్రసిద్ధిలేదనుటెట్లు కుదురును? ఆచార్య అమరేశం రాజేశ్వర శర్మగారు 16 చింతామణి వ్యాఖ్యానములను సంగ్రహముగా సమీక్షించినారు. శ్రీ సి. పి. బ్రౌనుదొర చింతామణికి ఆంగ్ల వివరణమును వ్రాసెను. ఇవిగాక కర్తలపేరు తెలియని పెక్కు చింతామణి వ్యాఖ్యలు మదరాసు,తిరుపతి, కాకినాడలలో పుస్తక భాండాగారములందు గలవనియు, ఉస్మానియా విశ్వవిద్యాలయ సంస్కృత అకాడమీ యందొకటి గలదనియు ఆచార్య అమరేశము వారి వచనము.[2] డాక్టరు ఆకురాతి పున్నారావుగారు 19వ శతాబ్ది నుండి చింతామణి ప్రభావము గల 15 స్వతంత్ర వ్యాకరణములను పేర్కొనినారు. ఇంతటి ప్రసిద్ధిగల ఆంధ్ర శబ్ద చింతామణి సంప్రదాయము 'తెలుగు వ్యాకరణాల మీదనట్టి ప్రభావం నెరపడం చిన్నయసూరి బాలవ్యాకరణ రచనతోగాని జరుగలేదని' ఒకరనిరి.[2]

19వ శతాబ్దిలో గూడ చిన్నయ సూరికి పూర్వమే పండిత శ్రేష్ఠులు వ్రాసిన కవిజనాంజనము, పట్టాభిరామ పండితీయము, తెనుగు వ్యాకరణములపై చింతామణి ప్రభావమున్నట్లు పైవిమర్శకులే వ్రాసి యున్నారు.[4] కాన బాల వ్యాకరణమునకు బూర్వము వ్యాకరణములపై చింతామణి ప్రభావము లేదను వ్రాత సత్యదూరము.

---

1. ఆంధ్ర వ్యాకరణ వికాసము ప్రథమ. 404 పుట.
2. అదే. 481 పుట.
3. సం. ప్ర. వ్యాకరణాలు 478 పుట.
4. సం. ప్ర. వ్యాకరణాలు 458 నుండి 462 వరకు.

చిన్నయసూరికి చింతామణిపైగల గౌరవము

బహుశాస్త్ర పండితుడు, పలు తెలుగు వ్యాకరణములను వ్రాసినవాడునగు చిన్నయసూరి తన వ్యాకరణ గ్రంథములన్నింటిలో చింతామణి మార్గమునే యనుసరించుట ఆయనకు చింతామణిపైన, తన్మార్గము పైన గల గౌరవమును స్పష్టము చేయుచున్నది. చింతామణి కర్తను పేరుతో గూడ వ్యవహరింపక [1] వాగనుశాసనులు అని వ్యవహారించుట చిన్నయసూరికి చింతామణి కర్తపై గల గౌరవమునకు గొప్ప సాక్ష్యము. కావున చిన్నయ సూరి పై గౌరవము గలవారెవరును చిన్నయసూరికి మార్గదర్శక మైన చింతామణిని దూలనాడరాదు. అట్లు చేసినచో చిన్నయసూరిని చిన్న బుచ్చినట్లే.

చింతామణి విశేషములు

చింతామణిపై గల ఆరోపణలను బరిశీలించితిమి. అవేవియు నిలుచునవి కావని తేలినది. ఇక చింతామణీ పరిశోధనముచే బయట పడిన విశేషములను గమనింతము.

ఏది సరియగు చింతామణి ?

బాలసరస్వతీయ చింతామణికి అప్పకవీయ చింతామణికి పాఠభేదము లున్నవి. ఇందేది మూల గ్రంథకర్త వ్రాసినది ? ఏది తరువాతి వారు ప్రక్షేపము చేసినది ? తెలిసికొనవలెను.

కొందరు అప్పకవీయ చింతామణిలోగల అథర్వణాచార్య, హేమ, త్రివిక్రముల పేర్లు బాలసరస్వతీయ చింతామణిలో తొలగింపబడినవనుచున్నారు. [2] అనగా వారి యభిప్రాయము ప్రకారము అప్ప

---

1. గురుస్థానమున నున్నవారిని పేరుతో వ్యవహరించుట ధర్మశాస్త్రవిరుద్ధము. 'ఆత్మనామ గురోర్నామ నామాతికృపణస్యచ, శ్రేయ
స్కామోనగృహ్ణీయాజ్జ్యేష్ఠాపత్యకళత్రయోః'
2. ఆం. క. త. 1 సం. 42 పు.

కవీయ చింతామణియే మూలకర్తకభిప్రేతమని తోచును. అహోబలపత్యాచార్యుడు తఱచుగా బాలసరస్వతీయ పాఠమునే గ్రహించితినని చెప్పుకొనెను.[1] బాల సరస్వతీయ చింతామణి పాఠముకంటె అప్పకవీయ చింతామణి పాఠమనేక విశేషరూపములను సాధించుచున్నది.[2] అహోబలపతి కవిశిరోభూషణమును గవి శిరోభూషణముగా దీర్చిదిద్ద దలచెను. కావుననే యథర్వణ కారికావళినుండి యనేక విశేషాంశములను గ్రహించి తన గ్రంథము నలంకరించెను. అతడు విశేష విషయవిలసితమగు నప్పకవీయ చింతామణిని సంపూర్ణముగా ననుసరింపకుండుటకేదియో బలీయమగు హేతువుండవలెను.

బాలసరస్వతీయ చింతామణిలో 88 శ్లోకములు, అప్పకవీయ చింతామణిలో 82 శ్లోకములు నున్నవని యహోబలపతి చెప్పెను.[3] శ్లోక సంఖ్యనుబట్టి చూచినచో నప్పకవీయ చింతామణికంటె బాలసరస్వతీయ చింతామణిలో విశేషము లధికముగా నుండవలెను. ఇపు డప్పకవీయమున 50 శ్లోకములు మాత్రమే కానవచ్చుచున్నవి. తక్కినవానికప్పకవి వివరణము వ్రాయనందున నది యప్పకవీయము నుండి తొలగింపబడినవేమో. ఆ యేబది రెండు శ్లోకములలోను బాలసరస్వతీయములో లేని యనేక విశేషములు చోటుచేసికొన్నవి. మఱియొక ముఖ్యవిషయ మేమనగా చింతామణియందలి సంజ్ఞా సంధి పరిచ్ఛేదములే ప్రకృత మప్పకవీయమున గన్పడు చున్నవి. అవి రెండే యేబది శ్లోకములలో నిబంధింప బడిన వన్నమాట. బాలసరస్వతీయ చింతామణిలో సంజ్ఞా (17) సంధి (13) పరిచ్ఛేదములలో 30 శ్లోక

---

[1] కవిశిరో. పీఠిక 72 శ్లో.

[2] అతడు చింతామణి నెట్లతిశయిల్ల జేసెను ? అను వ్యాసము.

[3] కవిశిరో. పీఠిక 70, 71 శ్లో.

ములు మాత్రమే కలవు.[1] అనగా నీరెండు పరిచ్ఛేదములలోనే బాలసరస్వతీయములో కంటె నప్పకవీయ ప్రతిలో 20 శ్లోకములధికముగా నున్నవన్నమాట. ఈ పెరుగుదల యెట్లు కలిగెనని ప్రశ్న. పై రెండు పరిచ్ఛేదములలో బాలసరస్వతీయ విషయమేమియు నప్పకవీయము నందు తగ్గలేదు. లిపిశ్లోకములు(3) ఛందో విషయక శ్లోకములు (5) కొన్ని వ్యాకరణ విశేషములు నప్పకవీయమున నధికముగా నున్నవి.

ఇవి బాలసరస్వతీయ చింతామణిలో తగ్గింపబడిన వందుమా? తగ్గింపబడినచో నెవరు తగ్గించి యుందురు? బాలసరస్వతి తగ్గించి యుండడు. అతనికి దొరకిన దొక ప్రతియేగదా! అకారణముగా నిట్లు తగ్గించి గ్రంథగౌరవము నేల తగ్గించును? బాలసరస్వతికి దరువాతి వారెవరైన తగ్గించిరందుమా? అట్లొక ప్రతిలో దగ్గింపవచ్చును. కాని యన్ని ప్రతులలో నొకరు తగ్గించుటకు వీలు కాదు గదా! కావున నప్పకవికి దొరకిన చింతామణి ప్రతిలో నీయధిక పాఠములు చేర్చ బడి యుండవలెను.

అప్పకవి బాలసరస్వతి వ్యాఖ్య నాధారముగా చేసికొనియే తనరచనను సాగించెను.[2] ఇపుడు లభించుచున్నయే బాలసరస్వతీయ ప్రతిలోను అప్పకవీయ చింతామణి పాఠములుగాని వానికి వ్యాఖ్య గాని లేదు. బాలసరస్వతీయ ప్రతులలో భేదములున్నను బాలసరస్వతీయ చింతామణులలో ఎక్కువగా పాఠభేదములు కానరావు. అహోబలతి పండితీయ చింతామణియు బాలసరస్వతీయ చింతామణియు నేకరూపముగా నుండుట గమనింపదగినది. కావున నప్పకవికి దొరకిన బాలసరస్వతీయము గూడ నేటి బాలస్వతీయ చింతామణివంటి దానితో కూడినదే అయియుండవలెను.

---

[1] ప. బాలస. 13, 20, పుటలు.

[2] అప్పక. పీఠిక. 1-96.

నిజమున కప్పకవీయ చింతామణిలో నధిక పాఠములు చేర్చబడిన వనుటకంటె అప్పకవీయచింతామణి రూపాంతరమును బొందిన చింతామణి యనుట లెస్స. ఏలయన అప్పకవీయ చింతామణిలో సంజ్ఞ, సంధి, తత్సమ, దేశ్య, క్రియా పరిచ్ఛేదంబులను నయిదు పరిచ్ఛేదములున్నవట.[1] బాలసరస్వతీయ చింతామణిలో అజంత హలంత పరిచ్ఛేదములు విడివిడిగా నున్నవి. అందు దేశ్య పరిచ్ఛేదము లేదు. అహోబలపండితీయ చింతామణియందు, ఆంధ్ర కౌముదియందు గూడ దేశ్యపరిచ్ఛేదము లేదు. బాలసరస్వతీయ చింతామణి శ్లోకము లప్పకవీయ చింతామణిలో క్రమము మారుట,[2] పాదములు స్థానభ్రంశమునొందుట[3] వేరువేరు శ్లోకములలో నున్న విషయమేక శ్లోకములో గూర్చబడుట,[4] అధిక విషయములు చేరుట[5]

---

1. అప్పక. పీఠిక. 1-96 వ.
2. బాలసరస్వతీయ చింతామణిలో సంజ్ఞాపరిచ్ఛేదములోని 17వ శ్లోక మప్పకవీయములోని భాషా పరిచ్ఛేదమున 6వ శ్లోకమయినది. ఇట్టి మార్పులనేకములు. (అప్పక.1 ఆ. ఆర్యావృత్త శ్లోకములు. 6 శ్లో.)(పైది ప. బాలసరస్వతీయమున 16వ శ్లోకముగా గుర్తింపబడినది. అది ప్రామాదికము. 2వ శ్లోకమునకు సంఖ్య నిచ్చుట మరచుటచే నీ పొరపాటు గల్గినది.
3. బాలసరస్వతీయ చింతామణిలో 10వ శ్లోకమందలి పూర్వార్థము అప్పకవీయ చింతామణిలో 13వ శ్లోకమందలి ఉత్తరార్థమయినది. (అప్పక. 2. ఆశ్వా. మొదటనున్న శ్లోకములు 13 శ్లో.)
4. బాలసరస్వతీయ చింతామణిలోని సంధి. 10వ శ్లోకములోనున్న 'సుమోచ్చతః' అను సూత్రము సంధి. 11 శ్లోకములోని 'మాస్త్రి విభక్త్యేక వచనకే పుంపూ' అను సూత్రము అప్పకవీయ చింతామణిలో సంధి. 13 శ్లోకములో నుత్తరార్థమైనది. (అప్పక 5 ఆశ్వా - మొదటి శ్లోకములు 13 శ్లో.)
5. అతడు చింతామణి నెట్లతిశయిల్ల జేసెనను వ్యాసము చూ.

అను లక్షణములు గన్పడును. బాలసరస్వతీయ చింతామణి విషయము మాత్ర మప్పకవీయ చింతామణిలో తొలగలేదు. దీనినంతను గమనించినపుడు బాలసరస్వతీయ చింతామణియే రూపాంతరము నొంది యప్పకవీయ చింతామణి యైనదని చెప్పవలెను.

ఇట్లు చింతామణిని రూపాంతరము నొందించు ప్రయత్నమంతకు ముందే జరిగినది. మండ లక్ష్మీనరసింహాచార్యులు చింతామణిని పటువైన సూత్రములుగా మార్చి కొంచెము విశేషములను జేర్చి వృత్త్యుదాహరణములను సంస్కృతమునందే వ్రాసి యాంధ్రకౌముది యను పేర ప్రకటించెను. అతడు దాని నాంధ్రశబ్ద చింతామణి యని మాత్ర మనలేదు.

అప్పకవికి గ్రంథము నిచ్చినతడు దానిని నన్నయ భట్టీయమని పేర్కొనెను.[1]

బాలసరస్వతి మాత్రము తనకు లభించిన 'దంధ్ర శబ్ద చింతామణి' యని చెప్పెను.[2] అంధ్రశబ్ద చింతామణి యన్ననేమి? నన్నయ భట్టీయ మననేమి? ఒక గ్రంథమున కిట్టి భిన్ననామ వ్యవహారములేక పోలేదు. కాని పైన పేర్కొనిన విషయ విభేదమును బట్టి అప్పకవీయ చింతామణి రూపాంతరము నొందిన ఆంధ్రశబ్ద చింతామణియని చెప్పుటలో దొసగులేదు. కావున నప్పకవీయ చింతామణి అధికపాఠములు మూలకారుడు వ్రాసెనని చెప్పుటకు వీలులేదు.

ఆంధ్రకౌముది యందు బాలసరస్వతీయ చింతామణి సూత్రములు దాదాపు గ్రహింపబడినవి. కాని అప్పకవీయ చింతామణిలోని అధిక పాఠమొకటియు గ్రహింపలేదు. ఆంధ్ర కౌముది అప్పకవి కంటె అథర్వణుని కంటె బూర్వమున రచింపబడెనని వేఱొక చోట నిరూ

---

[1] అప్పక. 1. 65 పీఠిక.

[2] ప. బాలస. పీఠిక. ౩వచనము.

పింపబడెను.[1] బాలసరస్వతీయ పాఠముకంటె అధికాంశములు గల అప్పకవీయ చింతామణి నాతడు చూచియున్నచో దానినేల గ్రహించి యుండడు?

స్వల్పాంశములను బ్రతిపాదించు గ్రంథము ముందుండుటయు, నధికాంశములతో గూడిన గ్రంథము తరువాతి దగుటయు సామాన్యవిషయము. కొందరు భావించినట్లు అథర్వణ, హేమ, త్రివిక్రమ పదములు కాలవైరుధ్యమును బరిహరించుటకై నెవరైన బాల సరస్వతీయము నుండి తొలగించిన తొలగింప వచ్చును. కాని విశేష రూపములను సాధించునప్పకవీయ పాఠములనేల తొలగింతురు?

కావున బాలసరస్వతీయ చింతామణియే మూలకర్త యభిప్రాయమును వెల్లడి చేయగలిగిన దనియు, తరువాత నెవరో కొన్ని యంశములను ప్రక్షేపించి అప్పకవీయ చింతామణిని రూపొందించిరనియు నిర్ణయము.

అప్పకవి శీలము

అప్పకవీయ మందేర్పడిన యీ పాఠముల నప్పకవియే కల్పించెనా? అంతకుముందెవరైన కల్పించిరా? అని ప్రశ్న. ఆంధ్ర శబ్ద చింతామణి పుట్టుకకు సంబంధించిన ఒక కల కథను నిబంధించినాడితడు. ఇది యీతడు కల్పించిన పుక్కిటి కథ అని చెప్పుదురు.[2] ఈ కథ చింతామణికి గల్గిన భూషణ దూషణములకు కారణమైనది. దీని నితడు కుటిల బుద్ధితో గల్పించినచో దోష మితనిదే యగును. అట్లుగానిచో నితనిని నిందించుట తగదు. ఇతనికి కౌటిల్యము గలదా? లేదా యను విషయము నీతని శీలము నిర్ణయించును. ఆ శీలమే చింతా

---

[1] 'కారికావళి కంటె ఆంధ్రకౌముది ప్రాచీనము' అనువ్యాసమునుచూ.

[2] ఆచార్య పింగళి లక్ష్మీకాంతం, *ఆంధ్ర సాహిత్య చరిత్ర* మచిలీపట్నం: త్రివేణి పబ్లిషర్స్, (1985), 65 పు.

మణి కీతడు పాఠాంతరములను గల్పించెనా లేదా యనియు నిర్ణయించును. కావున నీతని శీలమును పరిశీలింతము. ఇతడు గోపాల స్వామి భక్తుడు. అప్పకవీయము నా స్వామికే యంకిత మొనరించెను.[1] శ్రీ కృష్ణాష్టమినాడుపవాసముండి, జాగరణమును జేయుచు గోపాల స్వామి యాలయమందే భగవత్కథా శ్రవణాదికముతో నితడుండెను. భగవద్రూపము కలలో దనబడె ననగా నీతని భగవద్భావన మెంత లోతయినదో స్పష్టపడును. ఇతడు మంచి కవి అప్పకవీయములోని పద్యములు ధారాశుద్ధి శోభితములై సులభ సుందరములై యలరారును. ఇతడనేక విషయముల నెఱింగిన విద్వాంసుడు. అప్పకవీయము జ్యోతిశాస్త్రమందు,[2] మంత్ర శాస్త్రమందు,[3] ఛంద శాస్త్రము నందు[4] అనేక ప్రయోగములందు సంస్కృత ప్రాకృత వ్యాకరణములందు,[5] అలంకార శాస్త్రమునందు,[6] నీతనికి విజ్ఞానము గలదని తెలియజేయును.

ఇతనికి వీలయినన్ని విశేషములను తన గ్రంథములో జేర్చవలెనను కోరికయున్నది. ఏపనినైనను విస్తృతముగా జేయుట యీతని స్వాభావిక గుణ మనిపించును. దేవతాస్తుత్యాదికమును 32 పద్య గద్యములలో జేయుట, గణములను చెప్పు చింతామణి శ్లోకములయిదింటిని వివరించు వంకతో మొత్తము ఛందస్సునంతను జెప్పివేయుట, యతి ప్రాసల లక్షణమును చెప్పు నొక శ్లోకము నాధారముగా గొని 395 పద్య గద్యములుగల ఆశ్వాసమును వ్రాయుట మొదలగునవి దీని కుదాహరణములు. అంత విస్తరముగ వ్రాసినందువలననే

---

1. అప్పక. 1 - 99 నుండి 104 ప.
2. అందే 2 - 325 నుండి 335 ప. వరకు
3. అందే 2. 389 నుండి 486 ప. వరకు
4. అందే 3, 4 ఆశ్వాసములు.
5. అందే 5 ఆ.
6. అందే 1-32 నుండి 40 వరకు.

ఇది చదివిన పిమ్మట మఱి
యెది యేనియు జదువు బుద్ధియేలా వొడమున్
బదపడి గ్రంథములన్నియు
వెదకి వెదకి సారమెల్ల వివరింపంగన్

అని చెప్పుకొనగలిగినాడు.[1] గ్రంథమును సర్వస్వముగా వ్రాయవలయునను ధోరణిచేతనే కొన్ని యనవసర విషయములు పునరుక్తులు గూడ దొరలినవి.[2] 'ప్రమాదోధీమతామపి' ఈ విషయాలాతని కౌటిల్యమును దెల్పవనుట తెల్లము. ఇతడు స్వతంత్రుడు. సూత్రార్థమొక తీరుగ నుండగా ప్రయోగములను బట్టి వివరణము వేఱొక విధముగా జేయుటకు గూడ జంకడు. 'నస్యాత్తద్ధర్మ్యేతిః 'యను సూత్రము అన్ని తద్ధర్మ క్రియా పదోకారములకు సంధిని నిషేధించునట్లు కనబడుచున్నది. కాని తద్ధర్మ క్రియలలో ప్రథమోత్తమ పురుషైక వచనములకు దప్ప సంధి ప్రవర్తించుచునే యున్నది. ఈ స్థితిలో సూత్రము నాంధ్రీకరించుటెట్లు ?

ఉర్వి దద్ధర్మమున, బ్రథమోత్తమాఖ్య
పురుషముల నేకవచనముల్ పోవవిడిచి
కడమ పదములు తిఙ్మధ్యకములు గాన,
గొమ్ములను బ్రాణ సంధులు గూర్చుటొప్పు[3]

అని ప్రథమోత్తమైక వచనములకు దప్ప మిగిలినవాని యుకారమునకు సంధి వచ్చుననియే చెప్పినాడు. ఇట్లు స్వాతంత్ర్యము చూపిన

---

[1] అప్పక. 1-7 ప.

[2] విద్వాన్ రావూరి దొరసామి శర్మ అప్పకవీయ భావప్రకాశిక 'అప్పకవి చెప్పిన యనవసరపు యతుల పరిశీలనము' అను నను బంధము.

[3] అప్పక. 5-74 ప.

ఘట్టములు పెక్కుగలవు. ఈ లక్షణము గలవాడు చింతామణిలో లేని విశేషములు దనకు తెలిసినపుడు తనవిగనే వెల్లడించగలడు. దానికి బాధములను మార్చవలసిన అవసరము లేదు. ఇతడు మూలములో వైరుధ్యము గల్గినపుడు సవరింపలేదు. తాను జూచిన ప్రయోగముల ననుసరించి తన భావములనే వెల్లడించినాడు.

చింతామణి పదాది యకారము నంగీకరించెనని బాలసరస్వతి తెలిపెను. అతడు 'సర్వత్రా జ్వత్కార్యం జ్ఞేయం యస్యద్రుత ప్రకృతికేభ్యః' (ద్రుత ప్రకృతికముల మీద నుండెడు యకారమున కంతటను అచ్చునకు వలె వచ్చెడి కార్యము తెలియదగినది) అను పాఠముచే బదాది యకారమున కచ్త్వము నతిదేశించెను.[1] కాని అప్పకవికి బదాది యకార మిష్టము గాదు. కావున 'సర్వత్రా జ్వత్కార్యమ్' అను సూత్రమునకు

ఉ. ఆరయ వైకృతోక్తులఁ బదాదులయందు యకారముంట దా
తీరునఁ బల్కు వ్రాత గణుతింపగ నచ్చగు దానిడాపలన్
నీరజనాభ! నాంతములు నిల్చిన నచ్చటఁ బ్రాణ సంధి చె
న్నారు నితండు చైద్య వసుధాధిపు నే పడఁగించె నేడనన్[2]

అని సూత్రము చెప్పిన అచ్త్వాతిదేశమును త్రోసిరాజని "పదాదిని యకారంముండదనియు, నట్లు వినబడునది అచ్చేయనియు జెప్పినాడు. ఇచట మూలసూత్రమును వదల లేదు. దానికిని దన వ్రాతకును గలుగు వైరుధ్యమును దొలగించ లేదు. మూలము దారిలో మూలము నడువగా, దనకు దోచినట్లు తాను వ్రాసినాడు. ఇట్టి

---

1. ప. బాలస. సంధి 9 శ్లో. వ్యాఖ్య.
2. అప్పక. 5 - 40 ప.

స్వభావము గల వాడగుటచే నప్పకవి ప్రక్షిప్త పాఠముల నేర్పరచెననరాదు.[1] అతనికి ముందే చింతామణిలో ప్రక్షిప్తములు చేరినవి.

అఖండయతి నిరాకరణ సందర్భమున నితడు ప్రాచీన మహాకవుల పాఠములను దిద్ద లేదా యని ప్రశ్నింపవచ్చును. ఇది పరిశీలింపదగిన విషయము. అఖండయతి నంగీకరించినచో ఉభయ యతులక్కర లేదు. ఉభయ యతులన్నియు నొక్క అఖండ యతిలోనే యంతర్భావము నొందును. కవి జనాశ్రయమునుండి ఉభయ యతులు నఖండ యతియు గాన వచ్చుచున్నవి. కారణమేమని ప్రశ్న గలుగును. బహుగ్రంథ పరిశోధకుడైన అప్పకవి పలు తాటాకు ప్రతులు పరిశీలింపగా నఖండ యతి పాఠముల స్థానమున పాఠాంతరములు కన్పడినవి. అఖండయతి లేని పాఠములనే గ్రహించి పై సమస్యను పరిష్కరించెను. ఈ విషయము నాతడు స్పష్టముగా జెప్పికొనెను.[2]

అప్పకవి యిచ్చిన పాఠములకంటె అఖండవళీ పాఠములే సముచితముగా నున్నవని పంశోధకులు తెల్పుచున్నారు.[3] నిజమే. కాని యా పూర్వుల యఖండవళి యందిష్టము లేని లేఖకు లొకటి రెండు ప్రతులలో జేర్చియుందురు. ఉభయాఖండ వళులలో నేదియో యొకటే యుండదగు నను భావముతో ఆ మారుమూల ప్రతిలోని పాఠమునే యప్పకవి గ్రహించి యుండవచ్చును. కావున నా పాఠములనప్పకవి మార్చెననుటకు ప్రమాణము లేదు. అట్లే చింతామణి పాఠములనుగూడ నప్పకవి మార్చెననుటకు బ్రమాణము లేదు.

---

1. ఒకరప్పకవి శీలమును గ్రహింపక ఆతడే ప్రక్షేపములను జేసెనని యారోపించిరి. సం. ప్ర. వ్యాకరణాలు 135 పుట.
2. అప్పక. 3-203 ప.
3. విద్వాన్ రావూరి దొరసామి శర్మగారు, భావ ప్రకాశిక అప్పకవీయ వ్యాఖ్య, మద్రాసు : త్రివేణి పబ్లిషర్స్, (1570), 269 పు.

అప్పకవి మేధావి. కవి. పండితుడు. అట్టివాడసత్యమును చెప్ప వలసి వచ్చినచో గోడకట్టినట్లే చెప్పగలడు. అసంగతమైన కలను జెప్పి యూరకుండడు. కావున కలకథనతడు కల్పింపలేదని చెప్ప వలెను. వచ్చినకలను చెప్పుట మాత్రమే అప్పకవి చేసినపనియనియు, దానివలన నిన్ని సమస్యలు వచ్చెననియు నూహింపవచ్చును. కావున పుక్కిటి కథను జెప్పెనని యప్పకవిని నిందింపబనిలేదు. అప్పకవి శీల పరిశీలనముచేత చింతామణిలో ప్రక్షేపముల నాతడు చేసియుండడని తేలినది. మఱి ప్రక్షేపములను జేసిన వారెవరను ప్రశ్న మిగిలినది. ఆ విషయము నరయుదము.

ప్రక్షిప్తములను జేర్చినవారెవరు ?

నిర్దుష్టముగా, సుందరముగా నొక గ్రంథమును వ్రాయుటకు ప్రతిభ, పాండిత్యము, ఓరిమి కావలయును. ఎంతో మానసిక శ్రమ నందవలయును. విలువైన కాలమును, కాగితములను వెచ్చింప వలయును.

ఇంత శ్రమకు ఫలమైన స్వీయగ్రంథమునకు కర్తృత్వమును వేఱొకరికేల కట్టెదరని ప్రశ్న. దారిద్ర్యదోషముచే గావచ్చును. గ్రంథ కర్తృత్వమును తెగనమ్ముకొని ఆ డబ్బుతో కుటుంబ పోషణము చేయుటకీ స్థితికి దిగజారవచ్చును. ఇది దయనీయావస్థ.

ఆవలివా డధికారి యగుటచే నాతనికి జడిసి కూడ కృతికర్త తన కర్తృత్వము నతని కర్పించుట జరుగవచ్చును. ఇది కృతికర్త, నకిలీకృతికర్త సమకాలికులైనప్పటి విషయము. కాని పూర్వకాలికు డగు వ్యక్తికి కర్తృత్వము నేల అర్పించును ? అతనిపై గౌరవాతిశయ ముచే కావచ్చును. ఆ గ్రంథ కర్తృత్వము తనపేర నుండుట కేదేని యాటంక మేర్పడినను ఇట్లు జరుగును. ఎఱ్ఱన మహాకవి భారతారణ్య

పర్యాశేష కర్తృత్వమును సమర్పించుట కిట్టి కారణమునే పరిశోధకులు చెప్పుచున్నారు. రచన విలువైనదైనపు డీ కారణములు సముచితములే.

రచనలో సారము లేనపుడుగూడ కర్తృత్వమును ప్రసిద్ధిచెందిన వేఱొక మహాకవి కర్పించుట జరుగవచ్చును. రచన గొప్పదైనచో దానివలన కవికి ప్రతిష్ఠ యేర్పడును. అట్టి రచనకు కర్తృత్వమును వీడుట త్యాగమగును. రచన నిస్సారమయినచో దాని కర్తృత్వమును వేరొకరి కర్పించుట లోభముచే నగును. దానివలన దనకెట్లును పేరు రానేరాదు. ఆ మహాకవికి కర్తృత్వము నర్పించుటచే రచనయైనను శాశ్వతము కావచ్చునన్నది యాలోభము. చెట్టు పేరు చెప్పి కాయ లమ్ముకొనుట యన్నట్టిదేగదా !

చాముండికా విలాస కర్త తవ కర్తృత్వమును భారత కర్తకు ధారవోసెను. చాముండికా విలాసము 120 పద్యములుగల చిన్న పుస్తకము. ఇందు నందవరీక బ్రాహ్మణుల కథ, తొగటకులము వారయిన దేవాంగుల కథలు కలవు.[1] ఇతడు చేసిన చిత్రమైన పని యేమన చింతామణి కర్తను భారతకర్తను నైక్యము చేసి యాతనికి తన గ్రంథ కర్తృత్వము ధారవోసెను. భారతగద్యలలో నన్నయ 'సకలసుకవిజనవినుత' యని విశేషింపబడెను. చింతామణి గద్యలలో తత్కర్త 'సకల భాషా వాగను శాసన' అని విశేషింపబడెను. ఇందు ప్రథమాశ్వాస గద్యలో 'సకల భాషా వాగను శాసన, అనియు ద్వితీయాశ్వాసగద్యలో సకలసుకవి జన శ్రేష్ఠ' అనియు, తృతీయాశ్వాసగద్యలో 'సకల విబుధ వినుత సర్వవిద్యావిచక్షణ' అనియు విశేషణములున్నవి. ఇంతకంటె క్రింది పద్యములో భారత చింతామణి కర్తల నైక్యముచేయు యత్నము గాన వచ్చును.

---

[1] ఆంధ్ర కవి తరంగిణి 1 సం. 26 పుట.

సీ. వ్యాసాదిఋషులకు వందనం బొనరించి
కవి భల్లటుల చాలఘనత నెంచి
సుకవీశ్వరులనెల్ల సొంపుగా వినుతించి
గురుపాద పద్మముల్ సరసగాంచి
యిష్టదేవాళి సంహృష్టత సేవించి
మంత్రాధి దేవతల్మదిని నుంచి
సర్వజనాళికి సంతోషమొనరించి
పార్థివసభలవైభవముగాంచి

యాంధ్ర వాక్యానుశాసనం బతిశయిల్లఁ
జేసిలోకోపకారార్థ సిద్ధిఁజెంది
ఘనత రాజనరేంద్రుని కరుణవడసి
నట్టివాడను నన్నయభట్టు నేను. [1]

ఇందలి కవి భల్లటులు చింతామణిలో కనబడుదురు. [2] ఆంధ్ర వాక్యానుశాసనము చింతామణిని సూచించును. పార్థివ సభ వైభవము, లోకోపకారార్థసిద్ధి (జగద్ధితము) భారతమునందున్నవి.[3] 'రాజనరేంద్రుని కరుణ నడసినట్టి వాడను నన్నయభట్టు నేను' అని చెప్పికొనుట వాచనికముగా నీ గ్రంథకర్తృత్వమును భారత కర్తకు సమర్పించుటయే.

ఇందలి శైలి, భారత శైలి భిన్నముగా నుండుట, ఈ సీసమున ప్రాసయతి, వడులకు సాంకర్యమొనరించుట మొదలగు కారణములచే నీ గ్రంథమునకు కర్త భారతకర్త కాడని పరిశోధకులు నిర్ణయించినారు. నన్నయ సీసములలో అన్ని పాదములలో వడినిగాని, ప్రాస

---

1. అందే 27 పుట.
2. కవిశిరో. హలన్త. 23 సూ.
3. ఆం. భా. ఆది. 1-23, 25 ప.

యతినిగాని వాడెడు వాడు గాని ఒక పాదమున నొకటి వేఱొక పాదమున నొకటి వాడడు. ఆ నియమ మీతఁడు పాటింపలేదు.[1]

ఈ కవి తాను భాంతమును రచించితినని చెప్పలేదు. ఆంధ్ర వాక్యాను శాసనమును (ఆంధ్ర శబ్ద చింతామణిని) రచించితినని చెప్పలేదు. అతిశయిల్ల జేసితినని మాత్రము చెప్పెను. అతిశయిల్ల జేయుట అనగా నేమి? అంతకు ముందు సామాన్యముగా నున్న దానిని గొప్ప గ్రంథముగా జేయుట. చింతామణిలో విశేషాంశములను జేర్చుటయే యీ అతిశయిల్ల జేయుట అని తోచుచున్నది.

కొందరికి సత్యముపై గౌరవముండును. కాని పరిస్థితుల ప్రభావముచే నసత్యము చెప్పవలసివచ్చును. ఆ స్థితిలో తా మసత్య మాడకుండగనే ఇతరులలో నసత్యభావమును గల్గింతురు. అది "అశ్వత్థామా హతః కుఞ్జరః" వంటి పల్కు. ఈ చౌడేశ్వరీ విలాస కర్త గూడ నిట్టివాడేయని తోచును. ఇతని పేరుగూడ నన్నయ భట్టే కావచ్చును.[2] ఒక రాజనరేంద్రుని (రాజశ్రేష్ఠుడు) కరుణను బడసి యుండవచ్చును. భారతాంధ్రీకరణమును జేసితిననికాని, ఆంధ్ర శబ్ద చింతామణిని రచించితిననికాని చెప్పకుండుట, ఆంధ్రవాక్యాను శాసనం బతిశయిల్ల జేసితినని చెప్పుటయు పై యూహాను బలపరచుచున్నవి. చింతామణి కర్తయే చౌడేశ్వరీ విలాసమును రచించి యుండగూడదా అని ప్రశ్న. అతడే వ్రాసినచో వ్రాసితినని స్పష్టముగనే చెప్పవచ్చును. రచియించితినను భావముతోనే "అతిశయిల్ల జేసితి"నని చెప్పికొని యుండవచ్చును గదా! అట్లును గావచ్చును. కాని యిరువురు గ్రంథకర్తలకు వారి మనోభావములలో గొంత భేదము కానవచ్చును. చింతామణికర్త మితభాషి. అతడు వ్రాసిన శ్లోకములు సూత్రములుగా విరిగినవి. అతడు ప్రార్థనాదికమును జేయలేదు. తనను గురించి గూడ గద్యలో

---

[1] కవి తరంగిణి 1 సం. 27 పుట.

[2] చాముండికా విలాసమునకు మఱియొక పేరు చౌడేశ్వరీ విలాసము,

నొక్క విశేషణమును దప్ప నేమియు జెప్పికొనలేదు. ఆవిశేషణము 'సకల భాషావాగనుశాసన' యనునది. తాను తెలుగు పై ప్రాకృత ప్రభావము సూచించుచున్నవాడు, సంస్కృత ప్రాకృత వ్యాకరణ పద్ధతులను దన వ్యాకరణమున ప్రవేశ పెట్టుచున్నవాడు. కావున ఆభాషల వ్యాకరణములను దాను జదివితిసను విషయము చెప్పుట అవసరమే. పయి విశేషణ మా విషయమును సూచించునదియే. ఇతడింతకుమించి మరియేమియు జెప్పికొనలేదు. మఱి చౌడేశ్వరీ విలాస కర్తయో! తనకు సంబంధము లేని రాజనరేంద్రుని, పార్థివ సభల వైభవమును తన పద్యములో చొప్పించెను.

ఉపలక్షణ విధులచే నల్పాక్షరములలో ననల్పార్థమును వ్రాయువాడు చింతామణి కారుడు. ఘనత, సొంపు సరస వంటి పదములను యతులకొఱకు వాడు నట్టివాడు చౌడేశ్వరీ విలాస కర్త. ఇట ఇష్టదేవాళిని మంత్రాది (ధి) దేవతలను బేర్కొనుట యేల? 'మంత్రాది (ధి ?) దేవతల్మదినినుంచి" అను వాక్యమున సచేతనులయిన దేవతలను పదమునకు ద్వితీయార్థమున ప్రథమ వచ్చినది. 'తస్యాః ప్రథమాచజడ పదానాంస్యాత్' (జడ వాచకముల ద్వితీయకు ప్రథమ గూడ వచ్చును.)[1] అను చింతామణి జడవాచకముల ద్వితీయకు మాత్రమే ప్రథమ వచ్చునని తెల్పుచున్నది. కావున నీతడు చింతామణి కర్త కాలేడు. మరేదేని యనుపపత్తి బయట పడనిచో యితడే ప్రక్షిప్త పాఠకర్తయని మాత్రము చెప్పుకొనుటకభ్యంతరము లేదు.

అతడు చింతామణి నెట్లతిశయింప జేసెను ?

చింతామణి బయలుదేరు నాటికి తెనుగు లిపికి కర్ణాటక లిపికి పెద్ద భేదములేదు. తెనుగు భాషకంటె ముందే వాఙ్మయము నందినది కర్ణాట భాష. కన్నడ లిపియే తెలుగువారు వాడుకొనుచుండిరని

---

[1] కవిశిరో. అజన్త. 61 సూ.

యెంచి తెలుగువారి కొఱకు పాతలిపిని సంస్కరించుటద్వారా ఒక ప్రత్యేక లిపి నేర్పాటుచేసిన వాడతడు.[1] ఇది యీ ప్రక్షేపకారుని ప్రతిభను దెలుపును. చింతామణి 'వళిరాద్య మనన్త, రాక్షరం ప్రాసః' (మొదటి వర్ణము వళి, తరువాతి యక్షరము ప్రాసము) అని ఛందో విషయము నొక దానిని సంగ్రహముగా జెప్పి వదలి పెట్టినది.[2] దానినీతడు వివరించినాడు.[3] "ఆద్యోవళిః ద్వితీయోవర్ణః ప్రాసోత్ర పాద పాదేషు, స్వస్వ చరణేషు పూర్వః ప్రాసస్సర్వేషు చై ఏవస్యాత్", (తెనుగున పద్యమునందలి ప్రతిపాదమున మొదటి వర్ణము వళి. రెండవవర్ణము ప్రాస. పద్యమునగల పాదములన్నిటిలో మొదటి పాదమున ప్రాసవేయబడిన వర్ణము మాత్రమే తక్కిన పాదములలో గూడ బ్రాసగా వేయవలెను.)[4] ఈసందర్భమున వృత్త జాతుల నిర్వచనములు. గురులఘు నియమములు, సూర్యేంద్ర చంద్ర గణములు, కావ్యాది ప్రయోగింపదగు వర్ణములు మొదలగు వానిని గూడ ఈతడు ప్రక్షేపించినాడు.[5] ఈతని శ్లోకములకు మూలము అనంతుని ఛందోదర్పణము.[6] చింతామణి 'షట్త్రింశదత్ర' (తెలుగునకు వర్ణములు ముప్పదియారు) అని చెప్పినది.[7] వానిలో శకట రేఫము చేరదు. కావున 'సప్తత్రింశదిహ' (తెలుగున వర్ణములు ముప్పది యేడు) అని యితడు చింతామణిని సవరించెను. దీని కనుగుణముగా చింతామణి యందు తెలుగు హల్లులను బరిగణించుచు

---

[1] అప్పక. 2, 3, 5, 6, శ్లో. 44, 45 పుటలు.
[2] కవిశిరో. సంజ్ఞ. 37 సూ.
[3] అప్పక. 3 ఆ. 3 ప. తరువాత.
[4] అప్పక. 2 ఆ. 15 శ్లో. 45 పు.
[5] అందే.
[6] డా. ఆకురాతి పున్నారావుగారు, సం. ప్ర. వ్యాకరణాలు 131 పు.
[7] కవిశిరో. సంజ్ఞ. 14 సూ.

'క గ చ జ యు గ ట డ ణ త ద న ప బ మ
య ర ల వ స హ ళం తు హ ల్వ ర్గ ః'

అను శ్లోక పాదమును

'క గ చ జ యు గ ట డ న త ద న ప బ మ
య ర యు గ ల యు గ వ స హో శ్చ హ ల ః'

అను రీతిగా మార్చి ర యుగమున (రఅల జంట శకట రేఫమును జూపినాడు.[1] చింతామణిలోనే

'అన్యః క్రియాసు భూతార్థద్యోతిన మాద్యగం వినా సర్వః'

అను పాదమును "క్రియలలో భూతార్థకములందు (పోయెన్, మొ॥) పదాదిని (యెవరు మొ॥) తప్ప తక్కినచోట్ల అకారముతో గూడిన యకారముండు" నని వ్యాఖ్యాతలు వివరించిరి.[2] ఇట్లు చెప్పుటచే పోయెదను వంటి తద్ధర్మ ప్రయోగములలో 'యె' కారము మాట వదలినట్లగును. పదాదిని యకారమంగీకరించుటచే సంధి స్థలములందు దానికి లోపము చెప్పకొనవలసి వచ్చును. ఈ చిక్కులను దొలగించుచు 'అద్యః క్రియాసు భూతాద్యర్థసముద్యోతినం వినా సర్వః' (క్రియలయందు భూతార్థము మొ॥ వానిని జెప్పనట్టిది తప్ప తక్కిన యకారమకారముతో గూడినది. భూతాది క్రియలందున్న 'యె' కారముతో గూడినది.) అని పాఠమును మార్చెను.[3] ఈ మార్పుచే పదాది యకారము చెప్పక వదలినది. పోయెదన్ వంటి క్రియలలో యెకారముగూడ గ్రహింపబడినట్లైనది గదా! చిత్రకవి పెద్దన

"ఆంధ్ర సంస్కృత పదముల యందు మొదలి
వైన ఉ ఊ లు ఓకార మనెడు లిపులు

---

1. అప్పక. 2 ఆశ్వా. 8 శ్లో.
2. ప బాలస. సం. 8 శ్లో. వ్యాఖ్య.
3. అప్పక. 2 ఆశ్వా. 12 శ్లో.

స్వరములగును గాని హల్లులై చొరవు గనుక
వాకును నుత్వోత్వముల నవి వ్రాయరాదు
ఉల్లమువిద యుదుటు నూరును నోపిక
యనెడు పలుకులెల్లఁ దెలుగు లోను
ఉదధి యున్నతంబు నూర్వశి యోంకార
మమర ననగ సంస్కృతమునఁ జెల్లు.[1]
“తెలుగుల మొదళ్ళ నెయిలివి
యల హల్లులు గావు స్వరములగు వ్రాయంగన్......”

“......ఎఱుక యిరవనంగ నీ రెండు వర్ణంబు లచ్చులగును హల్లులాదిగావు...”[2]

అని సోదాహరణముగా తెలుగున వు, వూ, వొ, యి, యె అను వర్ణములు పదాది నుండవని తెలిపెను. తెలుగున బదాదినున్నట్లు చ్చారణమున వినబడుచున్న సర్ణములివి. వీనిని బదాది నంగీకరించినచో సంధివేళ మరల లోపము చెప్పికొనవలయును. వాక్యరచనమున అర్ధమాత్ర తగ్గినచో మన వైయాకరణులకు కొడుకు పుట్టినంత సంతోషము గదా! ఈ స్థితిలో పదాది నీసర్ణములున్నట్లంగీకరించుట, సంధివేళ లోపింపజేయుట ఎందులకు? అనవసర ప్రక్రియ అని తోచినది. కావున

“వికృతి పదాదౌ ప్రథమాంతస్థతృతీయా నునాసికౌన స్తః” (తెలుగు పదాదియందు య, ణ లుండవు.)[3] క్వచి దపి న స్త ఉ దోతౌ దంతోష్ఠ భవస్య వికృతి శబ్దాదా (తెనుగు పదాది యందు వువూ

---

1. ల. సా. సం. 3-8, 9 ప.
2. అందే 3-6, 7 ప.
3. అప్పక. 2 ఆ. 9 శ్లో.

వా వో లెచ్చటను లేవు.)[1] అని సవరణములను వ్రాసెను. కొందఱు కవులు ఉకారమునకు పదాది ఉకారముతో యతి వేయుచుండిరి. అట్టి దోషము నెఱిగించుటకు గూడ నీ శ్లోకమును రచించి యుండవచ్చును. ఉదా : "గోవులగణియింప ధాతయును నోపడు" దే, వు నకునసుంగు వాడనని యుత్సుకతన్" "ఒక్కని డించిపోవుటయు భీతిల్లి"[2]

చింతామణి 'క్వచిద్గకారోవః' (ఒకానొకచో గకారము వకారమగును.)[3] అని చెప్పినది. దానిని సవరించుచు నతడు 'వాస్యాత్క్వచిద్గకారో నాదిగత స్యాద్యవర్గ సరళస్య' (అపదాది నున్న గకారమొకచో వికల్పముగా వకారమగును.) అని వ్రాసెను.[4]

చింతామణి సంధిపరిచ్ఛేదమున గొన్ని పదమధ్యాచ్చులకులోపము చెప్పినది. మఱి కొన్నిటికి గూడ నట్టిలోపము వచ్చుచుండుటచేత వానిని గూడ కలుపుటకై యిచటి సూత్రముల యాకారములను మార్చివైచినాడు. చింతామణిలోని (1) 'అపిశబ్దార్థస్యేత శ్చేరు పధాత్మనశ్చలుగ్వాస్యాత్' (ఏని యనుదాని ఇవర్ణమునకు, చువర్ణము పరమగునపు డుపధగానున్న రివర్ణేకారమునకు వికల్పముగా లోపము వచ్చును.[5]

(2) శబ్దాత్తచ్ఛబ్దాతః పోశ్చతదాద్యర్థవాచకే ఘాతః (కాపు మొదలగు శబ్దములకంటె పరముగానున్న అదియనుదాని అకారము

---

1. అండే 2 ఆ. 13 శ్లో.
2. పోతన భాగవత. 10 ఉ. 462 ప. పాల్కురికి సోమన వృషాధిప. 98 ప. గౌరన నవనాథ. 92 పుట, శ్రీ రావూరి దొరసామి శర్మ అప్పక. భావప్రకాశిక అనుబంధము 287 పుట.
3. కవిశిరో. అజన్త. 87 సూ.
4. అప్పక. 2 ఆశ్వా. 10 శ్లో.
5. ప. బాలస. సంధి. 3 శ్లో.

నకు, అపుడు మొదలగువానిలో నున్న ఉకారమునకు వికల్పముగా లోపము వచ్చును.[1]

(౩) నలడాదే రంత ఋత శ్చాన్యేషాంచ ప్రయోగమహితానామ్ (పదమధ్యముననున్న నలడాదులలోని ఉకారమునకు, ప్రయోగప్రసిద్ధములయిన ఇతర వర్ణములకు వికల్పలోపము గలుగును.)[2] అను మూడు శ్లోకార్ధములలో 'అపిశబ్దార్థస్యైతః' అను సూత్రమును 'అపిశబ్దేతః' అని సంగ్రహించెను,[3]

'శబ్దాత్తచ్ఛబ్దాతః' అను దానిని యథాతథముగ వేఱ్గ్రహించెను.[4] తక్కిన వానిని 'బోరద్భుత శబ్దాగ్రే, పోశ్చతదాద్యర్థ వాచకేషూతః, వికృతి పదే లాటోరవ్యుపధారేశ్చావితశ్చలుగ్వా స్యాత్, పదమధ్య నరలడానా ముతశ్చ పూర్వ ప్రయోగసిద్ధానామ్.[5]

లోపోవాస్యాత్తేషామితశ్చతద్వృత్తి)విక్రమ మతేన"[6] (అబ్బరము అనుపదమున బువర్ణోకారమునకు, అపుడు మొదలగు శబ్దములందున్న పువర్ణోకారమునకు లు వర్ణము పరమయినపుడు (ఇటులు అనుచోట)[3]టువర్ణోకారమునకు, చువర్ణము పరముయి నపుడు ఉపధగానున్న రివర్ణేకారమునకు లోపము వికల్పము. పదమధ్యమందు నల

---

1. ప. బాలస. సంధి 4 శ్లో.
2. అందే 13 శ్లో.
3. అప్పక. 5. 6 శ్లో. 302 పుట.
4. అందే.
5. అప్పక. 5-9 శ్లో.
6. అందే 5 ఆశ్వా. 10 శ్లో.
7. ఈ విషయము కవిచింతామణి నుండి గ్రహింపబడియుండును. వెల్లంకితాతంభట్టు కవి చింతామణి 1-99 ప.

రడల ఉకారమునకు (పూర్వప్రయోగ సిద్ధములయిన వానికి) లోపము వికల్పము. (త్రివిక్రమ మతము ననుసరించి అట్టి ఇకారములకు గూడ లోపము వికల్పము) అను శ్లోకములో సంగ్రహించుచు విశేషములను దెలిపెను. పై వానిలో క్రింద గీతగల భాగములో ప్రక్షిప్తకారుడు చెప్పిన విశేషములున్నవి. చింతామణి ప్రయోగ ప్రసిద్ధము లయిన ఇతర వర్ణములకు గూడ లోపము వచ్చునని చెప్పగా ప్రక్షిప్తకారుడు ఆ యితరము ఇకారమని స్పష్టము చేసెను. "ప్రథమావైభక్తిక మోర్బిందుశ్చ మహాన్ పతి క్రియార్థేషు" (ప్రథమా విభక్తికి చెందిన మువర్ణమునకు పద్వాదులు పరముగానున్నపుడు పూర్ణబిందువు (లోపము) గూడ వచ్చును.) [1] అని చింతామణి లోపమును వాచనికముగా చెప్పక గమ్యమగునట్లు చేసెను. ప్రక్షేపకారుడు 'ప్రథమావైభక్తిక మోర్లుక్ పూర్ణోవాపతిక్రియార్థేతు' అని లోపమును గూడ వాచనికము చేసెను.[2]

చింతామణిలో నుమాగమములు కొన్ని కలవు. కాని ధాతుజ విశేషణములకు 'నుమ్'ను విధించునవి లేవు. 'నుమ్ చోతః' అను దానిచే చేయు + అది ఇత్యాద్యుకారాంతములకు నుమ్ రావచ్చును. కాని ప్రక్షేప చింతామణికారుడు "నుమోచ్చతో హల్యథర్వణాచార్య మతాత్" అని పాఠమును మార్చెను. ఈ మార్పుచే హల్లు పరమయినపుడే యీ సూత్రము ప్రవర్తించును. కావున చేయు + అది మొ॥ చోట్ల నుమ్ వచ్చుటకు "ధాతు పద సంభవానాం విశేషణానా ముత స్తథానుమచి" అను పాఠమును కల్పించెను. దీనిని జిన్నయ సూరి గూడ గ్రహించెను.[3]

---

1. కవిశిరో. సంధి. 16 సూ.
2. అప్పక. 5 ఆశ్వా. 13 శ్లో.
3. ఉదంత. తద్ధర్మార్థ విశేషణమున కచ్చు పరంబగునపుడు నుగాగమంబగు బాలవ్యా. సంధి. 33 సూ.

తెలుగున గసడదవాదేశమున్నది. దీనిని పోలినది ప్రాకృత వ్యాకరణము లందు గూడ గలదు. చింతామణి తెలుగునకు గౌరవమును బెంచుటకు సంస్కృత ప్రాకృత వ్యాకరణ పద్ధతులలో రచించబడినది. ఆ విషయమును గమనించిన ప్రక్షేపకారుడు హేమచంద్రాచార్యుడు చెప్పిన విధానము నిట సూచించి తెలుగు వ్యాకరణ గౌరవమును బెంచుటకు యత్నించెనని తోచును.[1] 'నుమ్మోచ్చతః' అను సూత్రము కడ అథర్వణుని పేరు కూర్చుటయు నిట్టిదే. కావున జింతామణిని మరింత ప్రయోజనకరముగ మలచుటకు జింతామణి ప్రక్షేపకారుడు ప్రయత్నించెనని స్పష్టము. చింతామణిలో పాఠభేదము లేర్పడుట కీతని ప్రయత్నమే హేతువని వేరే చెప్పనక్కరలేదు.

లిపిసంస్కారము

ప్రక్షిప్త చింతామణి కర్తచేర్చిన వానిలో లిపి సంస్కారమొకటి. అప్పకవికిప్రక్షిప్త పాఠములతో గూడిన చింతామణి ప్రతి నిచ్చిన వాడు మతంగ నగ నివాసి. ప్రక్షిప్త చింతామణి కర్తగూడ ఆ ప్రాంతమువాడే కావచ్చును. మతంగ నగమున నేడు కన్నడభాష వాడుకలో నున్నది. 16 వ శతాబ్దిలో తెలుగు భాషకు స్వర్ణయుగ

---

[1] "అనాదౌ స్వరాదసంయుక్తానాం కఖ తథ పఫాం గఘ దధ వభాః" హేమానుశాసనము అపభ్రంశ విచారము 8-4-396 ప్రాకృత ప్రకాశ పరిశిష్టము 150 పుట. హేమచంద్రుడు ప్రాకృత లాక్షణికుడు. తెలుగునకు చెందిన గసడదవాదేశమును దెల్పుట యసంగతము. గసడదవాదేశమును బోలిన హేమ చంద్రుని యీ విధిని ప్రక్షేపకారుడు సూచించి యుండవచ్చును. త్రిలింగ శబ్దానుశాసనమున హేమచంద్రుడను నాంధ్రలాక్షణికుని పేరున్నది. (హేమచంద్రాది మునిభిః కథిత ఞ్చాన్ధ్రలక్షణమ్. 1-1) అతడు చెప్పిన శ్లోకమేదేని యీ ప్రక్షేపకారునకు దొరకియుండవచ్చును. దానిని సూచించెనని తలంచినను తప్పులేదు.

యోగము గల్గినదా దేశముననే కదా! 1650 ప్రాంతమున నచట తెలుగు కన్నడములు రెండును సహజీవనము సల్పుచుండి యుండును. 16వ శతాబ్దిలోని తెలుగులిపి నేటి తెలుగులిపికి రెండు మూడక్షరము లలో దప్ప సమానముగా నున్నది. ఉ,ఋ,క, చ, హ, శ అను లిపులు తప్ప నేటి తెలుగులిపికి కన్నడ లిపికి పెద్ద భేదములేదు. కన్నడ ప్రాంత మున నున్న ప్రక్షిప్త చింతామణీ కారుడు తెలుగునకు ప్రత్యేకలిపి యున్న బాగుండునని భావించి కొన్ని మార్పులు సూచించెను. ఆ కారికలివి.

బాలేందు పరిధి శృంగా వర్త కుశగ్రంథి దాత్ర పరశు సమాః
ఆద్యా ఇభకర తుల్యాస్త దీర్ఘాశ్శూల సన్నిభా వన్యా
దర శార్ఙ్గ పిప్పల దళాఙ్కుశ పన్నగ సన్నిభాః క్రమాత్పరుషాః
స్తమ్భవిలేఖాధిక్యైస్త ఏవ వర్గ ద్వితీయ వర్ణాద్యాః
కీర తరి హస్తి మస్తక శుక్తి తులాసన వితర్ది సీర సమాః
అన్తస్థా శ్చోష్మాణో దన్త్యచజౌ గురురలా చ బిన్దు యుతౌ

వాడుకలోని లిపికి అతడు చేసిన మార్పులివి. గుణింతపుగుర్తులనే అకారాదులకు చిహ్నములుగా చెప్పుట.

ఉదా: బాలేందు = అర్ధ చంద్రా)కారము; ✓ తలకట్టన్న మాట. పరిధి = గుడి 'ి' శృంగ = కొమ్ము 'ు' ఆవర్త = సుడి 'ృ' కుశగ్రంథి = దర్భముడి, ఇది దేవపవిత్రము పిత్రు పవిత్రము అని రెండు రకములు. దేవ పవిత్రమునకు ఌ కారమునకు పోలిక కలదు. దాత్ర=కొడవలి  పరశుసమాః=గండ్రగొడ్డలి అను వానిని పోలినవై.  ఆద్యాః = ఆదుల లిపులుండును, అనగా అ, ఇ, ఉ, ఋ. ఌ, ఎ, ఒ వర్ణముల లిపులన్న మాట, వీని దీర్ఘములు, ఇభకర తుల్యములు=ఏనుగు తొండమువంటి ఆకారముకలవి ' ఐ, ఔ, ల గుర్తులు శూలము వంటివి '  ' '  ' తెలుగు కన్న

డములలో అచ్చులకు గుర్తులు వేరుగను, గుణింతములకు గుర్తులు వేరుగను గలవు. కాన అచ్చులందే 32 లిపులు నేర్వవలసి యున్నది. గుణింతములనే అచ్చులకు లిపులుగా స్వీకరించుటచే 16 లిపులు తగ్గినవి.

ఒత్తులనే హల్లులకు లిపులుగా జెప్పుట, ఉ :-దర = శంఖము, తెలుగున నిన్న మొన్నటి వరకు కకారమును రెండురకములుగా వ్రాసెడివారు, క, కే ఇందులో రెండవ రకము కన్నడ కకారమునకు దగ్గర. ಕ ఇది కన్నడ కకారము. ఇది శంఖమును బోలియున్నది. ఇదియే అచ్చట కకారపు ఒత్తు, శార్ఙ్గ = ధనుస్సు 'ఁ' పిప్పలదళ = రావియాకు 'ω' అంకుశము '_ం' పాము 'ఎ' వీనివంటి ఆకారములో పరుష వర్ణములుండునని చెప్పెను, పరుషాక్షరములలో కతలకు తప్ప తక్కిన వానికి అక్షరములును, వాని ఒత్తులును ఒకే విధముగనే ఉండును. పైలిపిలో తకారము అంకుశ సన్నిభముగా నుండునని చెప్పుటచే ఇచ్చట గూడ పరుషముల ఒత్తులే పరుష లిపులుగా సూచింపబడినవని చెప్పవలెను. దీనిని బట్టి అంతస్థోష్మములందు గూడ ఇట్లే జరిగెనని చెప్పవచ్చును.

పరుషాక్షరములకే స్తంభాకార రేఖ చేర్చుటచే వర్గ ద్వితీయాదు లేర్పడునని యితడు చెప్పెను. వర్గ ద్వితీయములకు క్రింద గీతను వ్రాయుట ఛ మొదలగు వర్ణములలో కలదు. కాని ఖ, ఠ, థ, అను వర్ణముల లిపులు క, ట, త, లలిపులకంటె బిన్నముగా నున్నవి. వానిని వదలి క, ట, త, అని వ్రాయవలెనని ఇతని సంస్కరణము.

'వర్గ ద్వితీయవర్ణాద్యాః' అని ఆద్య శబ్దము వాడుటచే వర్గతృతీయ చతుర్థ పంచమాక్షరములను గూడ ఇట్లే ఒక్కొక్క గీత నధికముగా వ్రాసి చూప వచ్చునని యితడుద్దేశించినట్లు తెలియును. సరళములకు రెండు గీతలు, వర్గ చతుర్థములకు మూడు గీతలు, వర్గపంచమములకు 4 గీతలు వ్రాయు రీతి పఠన లేఖనములలో భ్రాంతికి కారణమగును,

కావుననే యీ పద్ధతి నప్పకవి ననుసరించి వేరొక రీతిని ప్రతిపాదించి నాడు.[1] దానినథర్వణుడు గూడ నామోదించెను.[2] పరుషములకు క్రింద గీత నిచ్చుటచే వర్గద్వితీయము లేర్పడునను రీతి సహేతుకము సులభమునయినది. ఇట్లే సరళములకు గీత బెట్టుటచే వర్గ చతుర్థముల నేర్పరచి ఘ, ఝ, భ, అను లిపులను వదలినచో మనలిపి సులభతర మగును. గ, జ, బ, అని ఆ లిపులను వ్రాయవలెనన్న మాట.

అప్పకవి పరుషములకు + అను గుర్తునుబెట్టినచో వర్గ పంచ మాక్షరము లేర్పడునని చెప్పెను. ఇదియు సముచితమే. పరుష సరళా క్షరములకే క్రిందగీత పెట్టుటచే వర్గయుక్కులుగా మారు పద్ధతి, వర్గ పంచమాక్షరములకు ప్రక్క + గుర్తు నుంచు పద్ధతి మన లిపిలో కొన్ని చోట్ల ఉన్నవియే కదా! ఈ పద్ధతులను సార్వత్రికము చేయుటచే కొన్ని లిపులు తగ్గుట, నేర్చుకొను వారికి సులభమగుట జరుగును. కావున తెలుగులిపిని సంస్కరింపదలచిన వారీ సూచనలను గూడ దృష్టిలో నుంచుకొనవలెను. ఇక అంతస్థోష్మ లిపుల విషయ మును జూతము.

కీర = చిలుక '్య' తరి = పడవ '◡' హస్తిమస్తక = ఏనుగు తల 'ന' శుక్తి = ముత్యపు చిప్ప 'ృ' తులా = త్రాసు 'ష' ఆసన= పీట 'ఎ' వితర్ది = వేదిక 'ఽ' సీర = నాగలి 'ా'

వీనితో సమానమైనవి అంతస్థోష్మముల లిపులు. ఇచట య,ర, ల అను వర్ణములకు చిలుక, పడవ, ఏనుగు తలలతో సామ్యము చెప్పుటచే అంతస్థోష్మములకు గూడా ఆయావత్తులే లిపులుగా సూచింప బడెనని యూహింపవచ్చును. దీనిచే య, ర, ల అనువానికి ఒత్తుల కంటె భిన్నములగు లిపులు తగ్గిపోవును. దంత్య చజలకు శకట రేఫము

---

1. అప్పక. 2. 34 ప.

3. కవిశిరో. 43 సూ. వ్యాఖ్యలో (1965), 221 పు.

ళ వర్ణమునకు ఒక చుక్కను బెట్టుమని యాతని సూచన. ఈరీతిచే ఱ, ళ అను రెండు లిపులు తగ్గినవి.

ఇట్లీతడు సులభము సహేతుకము నయిన కొన్ని మార్పులను జేసి తెలుగు లిపిని సంస్కరించినాడు. సరియగు చింతామణి యేదో, అందు ప్రక్షిప్తముల నెవరు చేర్చిరో గమనించితిమి. ఆ ప్రక్షిప్తములు చింతామణి నతిశయింపజేసిన వని కూడ గ్రహించితిమి. ఇక చింతామణి గ్రంథమండలి విశేషములను గమనించుదము. మొదట చింతామణి యందలి కొన్ని సంజ్ఞల సార్థక్యమును గమనింతము.

నామము

చింతామణి 'ప్రాతి పదికం హి నామ' అని సంస్కృత వ్యాకరణ ప్రసిద్ధమగు ప్రాతి పదికకు నామమను సంజ్ఞను బెట్టినది. ఇది నిరుక్తముదున్నది.[1] శబ్దశక్తి ప్రకాశికలో గూడ నామ ప్రసంగము గలదు.[2] త్రివిక్రముని ప్రాకృత వ్యాకరణమున నీనామ వ్యవహారమున్నది.[3] అనేక విషయముల నందుండి గ్రహించిన చింతామణి నామ సంజ్ఞను గూడ నచటనుండియే గ్రహించి యుండవచ్చును.

---

1. నామాఖ్యాతయోస్తు కర్మోప సంయోగద్యోతకా భవన్తి' (యాస్కనిరుక్తము, 1-3: 3-22) మహోపాధ్యాయ తల్లావఝుల శివశంకర స్వామి, 'శాకటాయనాదుల వాద ప్రతివాదములు' శ్రీ ఎమ్. ఆర్. అప్పారావు సమ్మాన సాహిత్య సంచిక విశాఖపట్నం: డా. లకంసాని చక్రధరరావు సంకలనం, (1978), 49 పు.
2. 'నిరుక్తా ప్రకృతి ద్వేధా నామధాతు ప్రభేదతః
   నామప్రకృతికశ్చైవ ధాతు ప్రకృతికస్తథా, శబ్దశక్తి ప్రకాశిక, అందే 50 పు.
3. ప్రాకృత శబ్దానుశాసనము 2-2, 3, 4, సూ.

'ణముప్రహ్వత్వే శబ్దే నమ్యతే అనేనేతి నామ' (దీనిచేత పలుకబడును. కావున నామము) అనగా మనుష్యాదులకు వాచక శబ్దమని యర్థము. వ్యాకరణమున సుప్ ప్రత్యయములు చేరుటకు అర్హమైన ప్రకృతికిది సంకేతముగా బెట్టబడినది.

ఒకరు 'కవిభల్లటైః క్రియాణాం నామ్నాం చోల్లోప ఇష్యతే హేల్యషు' అను సూత్రమున 'పేరు' వంటి విభక్త్యంతములను నామములుగా వ్యవహరించుట జరిగెనని చెప్పిరి. ప్రాతి పదికకు నామమని పేరు పెట్టిన చింతామణికర్త యిట్లు వ్యవహరించుట తగదని వీరి వాదము.[1]

'అపదం న ప్రయుఞ్జీత' (పదము కాని దానిని ప్రయోగింపరాదు.) అని సంస్కృత వ్యాకరణ సంప్రదాయము. పేరు మొదలగు వానికి పదత్వము కల్గించుటకు చింతామణికర్త వీనికి గూడ విభక్తి ప్రత్యయములను జేర్చి పిదప లోపమును జెప్పెను.[2] కాగా ప్రాతిపదికగా నున్నపుడే కవిభల్లట సూత్రముచే నిచ్చట ఉకార లోపమును జెప్పి పిదప సులోపమును జేసికొనినచో పై యారోపణమున కాస్కారముండదు. కావున నిదియొక లోపము కాదు.

ఏజథోవక్రః

దీనికి 'ఏ ఓలు వక్రము లనబడును' అని బాలసరస్వతివివరణము.[3] 'ఒ ఓ లు వక్రములని ప్రాచీనులు వ్యవహరింతు'రని శ్రీ చిన్నయసూరి చెప్పెను.[4] శ్రీ పారనంది రామశాస్త్రి ఏ జ్ = ఎ ఏ ఒ ఓ అని

---

[1] సం. ప్రి. వ్యాకరణాలు 156 పుట.

[2] కవిశిరో. అజంత. 80 సూ.

[3] ప. బాలస. సంజ్ఞ. 10 శ్లో. వ్యాఖ్య.

[4] బాలవ్యా. సంజ్ఞ. 2 సూ. వృత్తి.

వ్రాసిరి.[1] ఇంతకును ప్రక్రమనగా ఏ ఓలు మాత్రమేనా ఏ ఐ ఓ ఔలు నాల్గును గావచ్చునా యనునది ప్రశ్న.

ఈ ఏఙ్ అనునది ఏ ఓ ఙ్ అను మహేశ్వర సూత్ర ప్రత్యాహారము. అందు ఏ ఓ లు రెండు మాత్రమే ఉండుటచే బాలసరస్వత్యాదుల వ్యాఖ్య యుక్తమనుటలో సందేహము లేదు. మఱి రెండవ పక్షమయుక్తమనవలెనా ? పరిశీలింతము.

“ప్రత్యాహారేషు తద్వాచ్యవాచ్యే నిరూఢా లక్షణా” (ప్రత్యాహారములు తద్వాచ్య వాచ్యములను నిరూఢా లక్షణముచే జెప్పును.) అని భట్టోజీ దీక్షితులు చెప్పెను.[2] ప్రత్యాహారముచే ప్రత్యాహారమందున్న వర్ణములు చెప్పబడును. వానికి సవర్ణములయిన వానినిగూడ నిరూఢాలక్షణచే ప్రత్యాహారము బోధించు నన్నమాట. మహేశ్వర సూత్రములలోనున్న అ ఇ ఉ ఋ ఌ ఏ ఓ అను నచ్చులు తమకు సవర్ణములగు దీర్ఘపుతములను గ్రహించును. అనగా అకారాదుల దీర్ఘ ప్లుతములకు గూడ అజాది సంజ్ఞలు వర్తించును. కాని సంస్కృతమున ‘ఎ ఒ’ అను హ్రస్వ వర్ణములు లేవు. ఏఙ్ ప్రత్యాహారముచే ‘ఏ ఓ’ ల ప్లుతములు గ్రహింపబడినను హ్రస్వములు గ్రహింపబడుటకు వీలు కానరాదు.

ఏ ఓ ఙ్ సూత్రమునకు వ్రాయబడిన భాష్యము ప్రస్తుత చర్చకుపయోగించును. ఏ ఓ ఐ ఔ అను వర్ణములను తపరములుగా నుచ్చరింపవలెనా ? ఆయవసరము లేదా యని యచట చర్చ సాగినది.[3] తపరములుగా నుచ్చరింపనిచో ద్విమాత్రికములగు వీనికి

---

1. ‘ఉద్యోతిని’ ఆంధ్రశబ్ద చింతామణి టీక 24 పు.
2. ప్రౌఢ మనోరమ స్వరసంధి. 69 పుట.
3. ఇమాని సంధ్యక్షరాణి తపరాణి వోపదిశ్యేరన్ అతపరాణివా” మహాభాష్యమ్. పస్పశాహ్నికమ్ ఏ ఓ ఙ్ సూత్రభాష్యమ్ - 66పు.

హ్రస్వము విధింపబడిన చోట్ల ఏకమాత్రికములగు (అర్ధ) ఎకార (అర్ధ) ఒకారములు ఆదేశములుగా వచ్చెడివి అని శంకింప బడినది. ఆ భాషలో లేవు కనుక రాలేదు. ఉన్నచో వచ్చెడివే కదా! వారికి ఇ, ఉ వర్ణములే ఆదేశముగా వచ్చుట ఇష్టముగాని ఎ, ఒ లు కాదు. కాని వీనికంటె సస్థాన తరములయిన ఎ, ఒ లు వచ్చుట కవకాశ మున్నది. కావున వట్లు శంకించిరి. తెలుగున ఎ, ఒ, లున్నందున ఏజ్ చే నవి గ్రహింప డుట ఉచితమే. ఇట్లు ఎ, ఒ, లకు గూడ అచ్ మున్నగు సంజ్ఞలు తెలుగున వర్తించుచుండుటచేతనే 'సంధిర్నాచో చ్యనుతః' ఇత్యాది సూత్రములందు ఏ, ఓ, లు గూడ అచ్ సంజ్ఞచే గ్రహింపబడుట, రాముడెవడు, రాముడొకడు ఇత్యాదులలో సంధి ప్రాప్తి కుదురుచున్నవి. కావున శ్రీ పారనంది రామశాస్త్రి ఏజ్ ప్రత్యాహారముచే 'ఎ, ఒ' లను గ్రహించుట శ్రీ చిన్నయసూరి ఎ, ఒ, లను వక్రములుగా జెప్పుట సముచితమే యని చెప్పవలెను.

సమాన స్థానము గలవగుటచే ఏజ్ ప్రత్యాహారముచే ఎ ఒ లు గ్రహింపబడినను హల్ ప్రత్యాహారముచే దంత్య చజలు గ్రహింప బడుటెట్లు! తాలవ్య చ జ లకు వీనికి స్థానము వేఱుగదా! నిజమే. కావుననే "అర్ధస్య స్తాలవ్యశ్చుర్వ్యక్ర స్సాన్యన్మిథ స్సవర్ణశ్చ" అను సూత్రము సావర్ణ్యమును విధించుకొనినది. "అణుదిత్సవర్ణస్య చాప్రత్యయః" అను పాణినీయ సూత్రముచే ప్రత్యాహార గత వర్ణములు సవర్ణములను గ్రహించునుగదా! కావున హల్ సంజ్ఞచే దంత్య చజలు గ్రహింపబడుట కాటంకము లేదు.

'ద్రుతము - ద్రుత ప్రకృతి'

చింతామణిలో ద్రుత ద్రుత ప్రకృతి సంజ్ఞలున్నవి.[1] ఇవి త్రిలింగ శబ్దానుశాసన మందు గూడ కలవు.[2]

---

1. కవిశిరో. సంజ్ఞ 32, 41 సూ.
2. త్రిలింగ శబ్దానుశాసనము 1-18, 29 శ్లో.

ఈ సంజ్ఞల అర్థమును గమనింపవలెను. ఒకరు 'ద్రుత మనగా నొల్లనియెడ మఱెగిపోవునది' అని దీనికి వ్యుత్పత్తిని చెప్పిరి.[1]

మఱుగు ధాతువునకు చాటగు, తిరోహితమగు, దాగు మొదలగు నర్థములు కలవు.[2] కొన్ని సందర్భములలో ద్రుతము లోపమును బొందుటచే నీ వ్యుత్పత్తిని చెప్పి యుందురు. వేరొకరు 'సంగీత శాస్త్రమున అల్పకాల వ్యవధానము (?) దీనికి (ద్రుతమునకు) లక్షణంగా కనబడుతోంది. ఈ లక్షణాన్ని బట్టి వ్యాకరణంలో కూడా ద్రుత సంజ్ఞ ఏర్పడి ఉండవచ్చు' అని భావించారు.

'స్వర సహితమయిన వ్యంజనాన్ని ఉచ్చరించడానికి పట్టే కాలం తక్కువ .... స్వర రహితమయిన స్థితిలోనే నకారమునకు ద్రుత సంజ్ఞ అనువర్తిస్తున్నది. కాబట్టి దాని ఉచ్చారణలోని అల్పకాలికతకు సూచకంగా ఈ సంజ్ఞ ఏర్పడినదని భావించవచ్చు. అయితే తక్కిన పొల్లు హల్లులకు ఇది వర్తించడం లేదు. కాబట్టి దీనిని యోగరూఢ సంజ్ఞగా భావించాలి. స్వరరహితమయిన ఇతర హల్లును ఉచ్చరించడానికి పట్టేకాలంకన్నా ద్రుత సంజ్ఞాకమయిన పొల్లు నకారాన్ని ఉచ్చరించడానికి పట్టేకాలం తక్కువగా భాసిస్తోంది. ఇది అనుభవైక వేద్యమే అయినా ఈ ప్రతిపాదనకు హేతువు లేకపోలేదు. ద్రుత సంఖ్యాక మయిన హల్లు లోపించడం వల్ల యథోద్దిష్టార్థావగతికి ఏ విధమైన అసౌకర్యమూ కలుగదు. ఉచ్చారణలో దీనిని పలకకపోయినా, పదార్థావగతికి అవరోధం లేదు. కాబట్టి ఇతర వర్ణాలఉచ్చారణలో ఉన్నంత జాగరూకత,

---

[1] శ్రీమాన్ బహుజనపల్లి సీతారామాచార్యులు, ప్రౌఢ. సంజ్ఞ. 7 సూ. వృత్తి.

[2] సూ. ని. 6 సం. హైదరాబాదు : ఆం. ప్ర. సా. అ. (1982), 138 పు.

విలంబమూ, దీని ఉచ్చారణలో ఉండక పోవడం నైజం" అని ప్రతిపాదించిరి.[1]

ద్రుతమునకు ఖండ, పూర్ణబిందు, సంశ్లేష, స్వత్వ, లోపము లయిదును వికారములనియు. అందు స్వత్వస్థితి 'ను' స్వరూపమనియు వీరంగీకరించుచున్నారు.[2] "స్వత్వంబనగా ద్రుతంబునకు ప్రకృతి భావంబు" అని చిన్నయసూరి నిర్వచనము.[3] "ప్రకృతి భావము ద్రుతమునకు బిందుసంశ్లేషరూపమగు సంధి కలుగక సహజస్థితి యొప్పుట" అని వ్యాఖ్యాతల వివరణము.[4]

అనగా ద్రుతముయొక్క సహజస్థితియే స్వత్వమన్న మాట. ఈ స్వత్వస్థితిలో 'ను' స్వరూపము నంగీకరించు బరిశోధకులు స్వర రహిత మగుటచే అల్పకాలోచ్చారణము కలదను నర్థమున ద్రుత నామ మేర్పడెననుట యుక్తముగా లేదు.

సంగీత శాస్త్రమందలి ద్రుతమధ్య విలంబితముల యందున్న ద్రుతము శీఘ్రతమ మయిన నడక కలది.[5] 'ద్రవతే త్వరత ఇతి ద్రుతమ్' అని దీని వ్యుత్పత్తి. వ్యాకరణమందలి ద్రుతము మిగిలిన వర్ణముల కంటె శీఘ్రముగా పలుకబడునని చెప్పుట కాధారము కానరాదు.

---

1. తె. వ్యా. సం. ప్రా. వ్యా. ప్రభావం. 71, 72 పుటలు.
2. అండే 70 పు.
3. బాలవ్యా. సంధి. 17 సూ.
4. విద్వాన్ దూసి రామమూర్తిశాస్త్రి. గ్రాంథికాంధ్ర కల్పకము బాలవ్యాకరణ టీక చెన్నపురి : వావిళ్ళ (1937), 74 పు.
5. అండే 71 పు.

వర్ణమును శీఘ్రముగా బలికినపుడు తక్కువ కాలము పట్టును గాన అల్పకాలోచ్చారణము ద్రుతమునకు లక్షణమని వీరు తలంచుచున్నారు. ఇది తాత్పర్య సిద్ధమైన అర్థమేకాని శబ్ద వ్యుత్పత్తి సిద్ధముగాదు. సాధారణముగా హల్లు అర్థమాత్రా కాలములో నుచ్చరింపబడును. కాని హ్రస్వము కంటె పరముగా నున్నదియు, అవసాన మందలిదియు నగు ననునాసికమునకు ద్విమాత్రాకాలము పట్టును.[1] కావున పొల్లు నకారము నుచ్చరించుట కల్పకాలము పట్టునను మాట గూడ సరికాదు.

ద్రుధాతువునకు గతి యర్థము,[2] గతి యనగా ప్రాప్తియని చెప్పవచ్చును,[3] బిందు సంశ్లోష లోపములను బొందునది గావున ద్రుతమని చెప్పనగును. లేదా 'ద్రవతీతి ద్రుతమ్' కరగునది కాన ద్రుతమనవచ్చును,[4] లేదా నశించునది కాన ద్రుతమనవచ్చును,[5] వర్ణము కరగుట యనగా రూపాంతరమును బొందుటయని గౌణముగా జెప్పవచ్చును; ద్రుతము పూర్ణార్థ బిందువులుగా మారుచున్నది గదా! కొన్నిచోట్ల నశించుచున్నది గూడ.

---

1. జ ఞ ణ న మానాం త్వవసాన వర్తినాం కాలాధిక్యం శిక్షాయాం స్మర్యతే 'హ్రస్వాత్పరోఽవసానస్థః పదాధ్యాయేఽను నాసికః ద్విమాత్రోఽమాత్రిక స్త్వన్యః సంహితాయాం తథాఽఖిలమ్' శ్రీ గార్గ్య గోపాల యజ్వ వైదికాభరణమ్, ప్రాతి శాఖ్య వ్యాఖ్య, మైసూరు : గోమఠం శ్రీనివాస జోస్యర్ (1931), 1-67 సూ. వ్యాఖ్య.
2. 'ద్రుగతౌ' శబ్దార్థ కల్పతరువు 674 పు.
3. అందే 463 పు.
4. 'విలీనే విద్రుత ద్రుతౌ' 'ద్రుగతౌ' కరగినది. అమర సంస్కృతాంధ్ర వ్యాఖ్య. 3 కాండ. విశేష్య నిఘ్న. 100 శ్లో. 586 పు.
5. విలీనః = నశించునది, శబ్దార్థ కల్పతరువు 1332 పు.

ఇక కళా వ్యుత్పత్తి గమనింపవలెను. చింతామణి కళలపట్టికను జూపి తదన్యములు ద్రుత ప్రకృతులనినది.[1] చింతామణిలో మరెచ్చటను పదముల పట్టికలనిచ్చి సంజ్ఞను విధించుట జరుగలేదు. 'కలశబ్ద సంఖ్యానయోః' కల్యతే = సంఖ్యాయత ఇతికలా, సంఖ్యానము = ప్రకథనము = చక్కగా చెప్పుట,[2] ప్రకథనము చేయబడినది కళ. పట్టికగా ప్రదర్శించి చెప్పుట ఇచట ప్రకథనమగును. నశించునది ద్రుతమనుకొంటిమి గదా! లోపించక శబ్దించునది కళ, ద్రుతభిన్నమన్న మాట.

ఇక ద్రుత ప్రకృతిమాట. దీనికి 'ద్రుతః ప్రకృతౌ యస్యసః ద్రుత ప్రకృతికః' ప్రకృతావేవ ద్రుతాంతః నతు ప్రత్యయేన = ప్రత్యయము చేత గాక ప్రకృతి యందే నాంత శబ్దము ద్రుత ప్రకృతికము' అని పారనంది రామశాస్త్రిగారు నిర్వచించిరి.[3]

ఇచట వీరు ప్రకృతి శబ్దార్థమును వివరింపలేదు, ఈ పదమునకు ప్రాతిపదికయను నర్థమును గ్రహించి ఆచార్య బేతవోలు రామబ్రహ్మముగారు ఈ నిర్వచనము చేత 'వలెన్, పోలెన్, ఎల్లన్ ఇత్యాదులు మాత్రమే ద్రుత ప్రకృతిక సంజ్ఞకు అర్హాలయి తక్కినవి కాకపోవడమూ, ప్రాతిపదికావస్థలో నాంతములయినవన్నీ ద్రుత ప్రకృతి కాలే కావలసిన అవసరం ఏర్పడడమూ ఇత్యాదిగా అవ్యాప్త్యతి వ్యాప్తులు సంభవిస్తున్నాయి" అని విమర్శించినారు.[4] పరిశోధకు

---

1. కవిశిరో. సంజ్ఞ - 41 పు.
2. శబ్దార్థ కల్పతరువు 1522 పు.
3. ఆంధ్రశబ్ద చింతామణి ఉద్యోతిని వ్యాఖ్య 44 పు. తె. వ్యా. సం. ప్రా. వ్యా. ప్రభావం గుంటూరు : డా. బేతవోలు రామబ్రహ్మం (1983), 73 పు.
4. అందే 73 పు.

లోకరు ద్రుత ప్రకృతిక శబ్దము నందలి ప్రకృతిశబ్దమునకు స్వభావార్థమును జెప్పుచు “ద్రుతః ప్రకృతిః = స్వభావః యస్యసః ద్రుత ప్రకృతికః’ స్వభావ సిద్ధముగా ద్రుతము అంతమందు గలిగినవి ద్రుత ప్రకృతులు” అని విగ్రహపూర్వకముగా వివరించినారు. [1]

ఇచటి సంస్కృత విగ్రహమునకు ‘ద్రుతము స్వభావము దేనికో అది ద్రుతప్రకృతికమని యర్థము. స్వభావ పదమునకు స్వరూపము, సహజమగు నొక ధర్మము మొదలగు నర్థములున్నవి. [3] ద్రుత ప్రకృతికమునకు ద్రుతము స్వరూపము కాని, సహజ ధర్మము కాని కానేరదు. కావున వీరి విగ్రహము కుదురదు. ద్రుత ప్రకృతిక స్వరూపమందు ద్రుతము గూడ కలదు. కాన శ్రీ పారనంది వారు చెప్పినట్లు ‘ద్రుతః ప్రకృతౌ యస్యసః’ అను విగ్రహమును చెప్పి ‘ద్రుతము స్వరూపము నందు కలది ద్రుత ప్రకృతికము’ అను నర్థమును జెప్పవలెను. అపుడు పై పరిశోధకు లాశించిన స్వభావ సిద్ధముగా ద్రుతమంత మందు గలవి ద్రుత ప్రకృతికములను తాత్పర్యము సిద్ధించును.

పరుష సరళములు

చింతామణి యందు పరుష సరళ సంజ్ఞలున్నవి. [3] క, చ, ట, త, ప, లను పరుషము లనియు, గ, జ, డ, ద, బ, లను సరళము లనియు వ్యవహరింతురు. వీని వ్యుత్పత్తిని బరిశీలింపవలెను.

“‘క’ను ఉచ్చరించడంలో కన్నా ‘గ’ను ఉచ్చరించడంలో ఒక సారళ్యం ఉన్నదనీ, అందుచేత వర్గతృతీయాలకు సరళ సంజ్ఞ ఏర్పడి,

---

1. తె. వ్యా. సం. ప్రా. వ్యా. ప్రభావం 75 పు.
2. శ్రీ మామిడి వెంకటార్యులు, శబ్దార్థ కల్పతరువు 1582 పు.
3. కవిశిరో. సంజ్ఞ 33, 34 సూ.

సాపేక్షంగా ప్రథమాలకు పరుష సంజ్ఞ ఏర్పడి ఉంటుందనీ" డా. ఆకురాతి పున్నారావుగారు తెల్పినారు.[1] డాక్టర్ బేతవోలు రామబ్రహ్మంగారు పై వ్యుత్పత్తులను సందేహించుచు "వర్ణోచ్చారణలోని పారుష్య సారళ్యాలు వైయక్తికాలు. దానిని బట్టి సంజ్ఞల నేర్పరచి ఉంటారా? ప్రాచీన లాక్షణిక నిరూపితాలయిన అల్పప్రాణ మహాప్రాణతాదుల కంటే భిన్నంగా పారుష్య సారళ్యాదుల కవకాశం ఉన్నదా? అని ప్రశ్నించినారు.[2]

'పిపర్తి వక్తారమితి పరుషమ్' (పలికెడు వానిని పూర్ణముగా జేయునది.) అను విగ్రహముతో పరుష పదము కఠినమైన వాక్కును జెప్పుచున్నది.[3] ఈ కఠినార్థకమయిన దీనిని దీసికొని ఖ, ఛ, ఠ, థ, ఫల కంటె మృదువయిన కచటతపలను కఠినార్థమున పరుషములుగా బిలుచుటలో నౌచిత్యమేమి? సరళాక్షరములు నాదములు, కచటతపలు శ్వాసములు. ఈ రెండిటికి నిదియే భేదము. సరళముల కంటె పరుషములలో కాఠిన్యమున్నదనుటకు గూడ ఆధారము కానరాదు.

డాక్టర్ బేతవోలు వారు 'పిపర్తి పూరయతీతి పరుషః' అను వ్యుత్పత్తిచే పరుష శబ్దమునకు వాయువు అను యౌగికార్థమును చెప్పిరి. అట్లే 'సరతి గచ్ఛతీతి సరళః' అను వ్యుత్పత్తిచే సరళ పదమునకు భూమి యను నర్థమును జెప్పిరి,[4]

ఆ, ఊ, ఏ, క, చ, ట, త, ప, య, ష వర్ణాలను వాయు బీజములనియు, ఇ, ౠ. ఓ, గ, జ, డ, ద, బ, ల, హ లను భూ బీజము

---

1. సం. ప్ర. వ్యాకరణాలు 162 పు.
2. తె. వ్యా. సం. ప్రా. వ్యా. ప్రభావం 33, 34 పు.
3. అమరకోశము సంస్కృతాంధ్ర వ్యాఖ్య 1 కాం. వాగ్వర్గ. 19 శ్లో. వ్యాఖ్య.
4. తె. వ్యా. సం. ప్రా. వ్యా. ప్రభావం 34, 35 పుటలు.

లనియు కస్తూరి రంగకవి మున్నగు లాక్షణికులు పేర్కొనిరి. ఆ సంప్రదాయము ననుసరించి వాయుబీజాక్షరములయిన కచటతపలను వాయువాచకమయిన పరుషశబ్దము చేతను, భూ బీజాక్షరములయిన గజడదబలను భూవాచకమయిన సరళశబ్దము చేతను చింతామణి కర్త వ్యవహరించి యుండునని వీరూహించిరి.[1]

పరుష శబ్దము వాయు వాచకముగా ప్రయుక్తముగాదు. అట్లే సరళ శబ్దము భూవాచకముగా ప్రయుక్తము కాలేదు. మఱియు భూవాచకములుగా స్థిరా, అచలా అను నామములు ప్రసిద్ధములు.[2] చలించు జీవజాలము దృష్టికి చలన రహితముగా గన్పట్టు చుండుటచే భూమి కేర్పడిన పేరులివి. వీనికి విరుద్ధముగా 'చలించనిది' అను నర్థమున భూవాచక పర్యాయముగా 'సరళ' అను యౌగిక శబ్దమును నన్నయ భట్టేర్పరచునా? కావున నీ అర్థములు గ్రంథకర్త ఉద్దేశించిన వనుటకు వీలు గలుగుటలేదు. ఇట్టి అస్వారస్యము లుండుట చేత కాబోలు వీరు వేరొక వ్యుత్పత్తిని జూపినారు. "గణిత శాస్త్రమున సమ రేఖ సరళరేఖ అనునవి పర్యాయ పదములుగా వాడబడినవి. దీని ననుసరించి సమాంక సరళాంక పదములు పర్యాయములన వచ్చును. ఆచ్ఛిక వర్ణమాలలో గల పంచవర్గాక్షరాలలో గజడదబలు ద్వితీయాక్షరములగును. రెండు సమ సంఖ్య కనుక వీనికి సరళ సంజ్ఞను బెట్టి యుందురు. సరళ శబ్దమునకు వ్యతిరేకముగా పరుష పదమును ప్రథమాక్షరాలయిన కచటతపలకు వాడి యుందురు." అని వీరి ప్రతిపాదనము.[3]

చింతామణి యందలి ఆచ్ఛిక వర్ణమాలలో చ జ లు వర్ణాంతరములుగా లెక్కింపబడినవి. దాని ప్రకారము చవర్గమున జకారము తృతీయాక్షరమగును గాని ద్వితీయాక్షరము కాదు.

---

[1] అందే 37, 43 పుటలు.

[2] అమరకోశ. 2 కాం. భూమి వర్గ. 2 శ్లో.

[3] తె. వ్యా. సం. ప్రా. వ్యా, ప్రభావం 45, 46 పుటలు,

తెలుగున తత్సమములందు గూడ కచటతపలకు పరుష సంజ్ఞయు, గజడదబలకు సరళ సంజ్ఞయు వర్తించుచున్నవి. కావున పరుష సరళ సంజ్ఞా కల్పనమున తత్సమాచ్ఛిక సాధారణమయిన ఆంధ్ర వర్ణమాలను గ్రహించుట ఉచితము. ఇటకేవలాచ్ఛిక వర్ణమాలను గ్రహించుట ఉచితము కాదు. ఆంధ్ర వర్ణమాలలోని పంచ వర్గాక్షరములందు గ, డ, ద, బ లు తృతీయములగును. జవర్ణము చతుర్థమగును. పరుషములను ప్రథమ వర్ణములుగను, సరళములను దృతీయ వర్ణములుగను సథర్వణుడు వ్యవహరించెను.[1] ఈ స్థితిలో ద్వితీయాక్షరములను నూహాతో సమాంక వర్ణములను నర్థమున సరళ సంజ్ఞ నేర్పరచిరనుట అయుక్తము,

సమశబ్ద పర్యాయమయిన సరళ శబ్దమునకు వ్యతిరేకార్థమున (బేసి సంఖ్య యను నర్థమున) పరుష శబ్దము వాడుకలో కానరాదు. గణిత శాస్త్రమున గూడ వంకరలేని గీత అను నర్థమున సరళ రేఖా పదము వాడబడెనే కాని సరి సంఖ్య అను నర్థమున సరళ పదమునకు వాడుక కానరాదు. కలదని పయి పరిశోధకులును చెప్పలేదు. సమ పదమునకు వంకర లేనిది, సరి (సంఖ్య) అను నర్థము లున్నవి.[2] సరళ పదమునకు వంకర లేనిది అను నర్థము కలదు.[3] కావున 'వంకరలేనిది' అనునర్థమున సమ, సరళ పదములు గణిత శాస్త్రమున పర్యాయములుగా వాడబడినవి. సరళ పదమునకు 'సరి సంఖ్య' అను నర్థము లేదు. కావున పరుష సరళ శబ్దములకు వీరు చెప్పిన వ్యుత్పత్తులౌచితీ శోభితములు కావు.

---

1. 'తృతీయే ప్రథమే వర్ణే పరఏవహి దృశ్యతే'
   కవిశిరో. సంజ్ఞ 18 సూ. వ్యాఖ్యలో.
2. సమరాశులు 2, 4, 6, 8 మొ. శబ్దార్థ కల్పతరువు 1540 పు.
3. అందే 1574 పు.

క చ ట త ప ల కు వివార ప్రయత్నము చెప్పబడినది. వివార మనగా కంఠము విస్తరించుట. కంఠము విస్తరించినపుడు శ్వాస వాయువు కంఠము నందు నిండును. అపుడు పుట్టునవి కచటతపలు.[1] వివర్తి కంఠమితి పరుషమ్ (కంఠమును శ్వాసతో బూరించునది) అని దీనికి వ్యుత్పత్తి చెప్పవచ్చును. వివార ప్రయత్నము ఖ, ఛ, ఠ మున్నగు వానికున్నను చింతామణి కర్త 'కచటతపాః పరుషాఖ్యాః' అని వీనికే యోగగూఢముగా నీ సంజ్ఞను విధించుటచే నిది తదితరములకు వర్తించదు.

సృగతౌ సరతి, విస్తరం ప్రాప్నోతీతి సరళః (విస్తరమును బొందును గావున సరళము) అని దీని వ్యుత్పత్తి.[2] తెలుగున ద్రుతమునకు బరముగా నున్న పరుషములు సరళములగుచున్నవి. కావున సహజ సరళములకు, ఆదేశ సరళములు కలియుటచే వానికి విస్తృతి కలుగుచున్నది. ఏ ఆదేశ కార్యమును దెల్పుటకీ సంజ్ఞ ఏర్పడెనో ఆ కార్యము నీ వ్యుత్పత్తి సూచించుచుండుచే నీ యర్థమును గ్రంథకర్త ఉద్దేశించి యుండునని తోచును.

తద్ధర్మక్రియలు – సంధి నిషేధము

ఆంధ్ర శబ్ద చింతామణిలో తద్ధర్మకారమునకు సంధి నిషేధింపబడినది.[1] ఇచట తద్ధర్మ పదము చేత తద్ధర్మక్రియయును, తద్ధర్మ

---

1. "వివరణం కణ్ఠస్య విస్తరణమ్, సఏవ వివారాఖ్యో బాహ్యః ప్రయత్నః తస్మిన్ సతి శ్వాసోనామ బాహ్యప్రయత్నః క్రియతే "శ్రీ గార్గ్య గోపాల యజ్వ, వైదికాభరణమ్, తై. ప్రాతిశాఖ్య వ్యాఖ్య, మైసూరు: గోమఠం శ్రీనివాస జోస్యర్, (1931), 2 అ. 5 సూ. వ్యాఖ్య.
2. అమరకోశ. సంస్కృతాంధ్ర వ్యాఖ్య. 2 కాం. వనౌషధి. 60 శ్లో. 268 పు.
3. 'నసాప్యత్తద్ధర్మ్మతః' కవిశిరో. సంధి. 6 సూ.

క్రియా జన్య విశేషణమును గ్రహింపబడునని యహోబలపతి వ్రాసెను.[1] బాలసరస్వతి "తద్ధర్మ క్రియల యందుండు ఉకారమునకు సంధి లేదని వ్రాసి 'రక్షించునంబ, పోషించునీశ్వరి' అని యుదాహరించెను.[2] ఈ రెండు నుదాహరణములు ప్రథమైక వచనములో, క్రియాజన్యవిశేషణములో నిర్ధారణము చేయుటకు వీలులేదు. పై రెండింటికిని సంధిని నిషేధించిన అహోబలపతికి యుదాహరణములే దారినిచూపినవి.

రక్షించు రక్షింతురు, రక్షింతువు రక్షింతురు, రక్షింతువు రక్షింతుము, ఇవి తద్ధర్మక్రియలు. వీనిలో "ప్రథమైక వచనలోప స్తద్ధర్మాతీయోః క్రియాణాంస్యాత్" అను సూత్రముచే ప్రథమ పురుషైక వచనమునకు క్రియావిభక్తి లోపించి రక్షించు అను రూపమేర్పడినది.[3] ఇచట 'నస్యాత్తద్ధర్మతః అను సూత్రముచే తద్ధర్మధాతూకారమునకు సంధి నిషేధింపబడెనని చెప్పుట యుక్తము. తక్కిన క్రియారూపములలో చివర క్రియా విభక్తి యున్నది గావున నచట సంధి వచ్చుట కభ్యంతరములేదు. క్రియాజన్య విశేషణములందు గూడ సంధిప్రాప్తికవకాశముండుటచే నచటగూడ ఈ సంధి నిషేధము ప్రవర్తింపవలసి యున్నది. కావున తద్ధర్మ ధాతూకారమునకు సంధిని నిషేధించినచో నిచట గూడ సంధి నిషేధము వర్తించును.

అథర్వణుడు ఉత్తమైక వచనమునకు గూడ సంధిని నిషేధించెను.[4] చింతామణి ప్రణాళిక ప్రకారము రక్షింతును అనునది ఉత్త

---

1. అందే వ్యాఖ్య.
2. ప. బాలస. సంధి. 2 శ్లో. సంధి. 6 సూ.
3. కవిశిరో. క్రియ. 18 సూ.
4. ప్రథమశ్చోత్తమశ్చైవ తాసు తద్ధర్మ సంజ్ఞికౌ ... ఉదంతౌచ సదానాంతౌ నసంధి స్తత్ర కల్ప్యతే కవిశిరో. హలంత. 39 సూ. వ్యాఖ్య.

మైక వచనము. దీని కచ్చు పరమగునపుడు సంధి వచ్చుటకభ్యంతర ములేదు. అథర్వణుడు ఉదంతమును నాంతమునైన ఉత్తమైక వచనమునకు సంధిని నిషేధించెను. అనగా రక్షింతున్ అను రూపమున కచ్చుపరమగునపుడు సంధి రాదనెనని భావము. రక్షింతున్ + అతనిని అనుచోట నడుమ నున్న నకారమున కథర్వణుని మతమున లోపము ప్రాప్తించును.[1] కావున అతని పక్షమున నిచట సంధినిషేధము అవసరమే.

తద్ధర్మ విషయమున సంధి నిషేధ పద్ధతియందు చింతామణికి కారికావళికి పద్ధతి భేదములుండుట చేతనే అహోబలపతి తద్ధర్మ సంధి నిషేధకములగు సూత్ర కారికలను నస్యాత్తను సూత్రము క్రింద కాక వేరు స్థలములో వివరించెను.[2] మరియు తద్ధర్మ విషయమున నన్నయకును అథర్వణునకును భేదము కలదని స్పష్టపరచెను.[3] కావున నీ తద్ధర్మ సంధి నిషేధములు చింతామణికి మాత్రమే అథర్వణ కారికావళి శేష గ్రంథము కాదని స్పష్ట పరచుచున్నవి.[4]

కాని ఆధునిక పరిశోధకులు “ప్రథమే చోత్తమే చైవ” ఇత్యాది కారికలు “నస్యాత్తద్ధర్మతః” అను సూత్రమునకు శేషములనియు, చింతామణి చెప్పిన సంధి నిషేధము తద్ధర్మ ప్రథమోత్తమైక వచనములకు మాత్రమే వర్తించునని ఈ కారికలు నియమించు చున్నవనియు చెప్పుచున్నారు.[4]

---

[1] “అచాంసంధాదృతోదృశ్యః స్థితోపిచ భవేత్సదా” కవిశిరో. సంధి. 3 సూ. వ్యాఖ్య.

[2] అందే హలంత. 39 సూ. వ్యాఖ్యలో.

[3] అందే క్రియ. 9 సూ. వ్యాఖ్య.

[4] శ్రీవఝుల చిన సీతారామస్వామి శాస్త్రి. ఆం. వ్యా. సం. స. 3 సం. 1324 పు.

"ప్రథమశ్చోత్తమశ్చైవ తాసు తద్ధర్మ సంజ్ఞికా" అనుచోట తాసు = ఆక్రియల యందు అని అర్థము చెప్పవలెను. ఏవి ఆ క్రియలు? వారిపక్షమున చింతామణి చెప్పిన తద్ధర్మ క్రియల యందు అని చెప్పవలసియున్నది. అది సరియైనచో ఆ కారికలలో సంధి నిషేధమును పొందు క్రియలను విశేషించు 'భూతాద్యవిషయా' అనుదళము వ్యర్థమగును. కావున తద్ధర్మ సంధిని నిషేధించు చింతామణి సూత్రమునకు అథర్వణ కారికలకు శేష శేషి భావము చెప్పుట సముచితము కాదు.

చేసెనునంటి భూతకాలిక ప్రథమ పురుషైక వచనమున, చేయుచున్నాను, చేయగలను, వంటి వర్తమాన భవిష్యదుత్తమ పురుషైక వచనము లందు ఉదంత నాంతత్వము లున్నవి. వాసికి నిషేధము వర్తింపకుండుటకు 'భూతాద్యవిషయా' అను దళమవసరమయినది. చేయును, చేయుదును వంటి వానిని కేతన భవిష్యదర్థములనెను.[1] చింతామణి వీనిని తద్ధర్మము లనినది.[2] కాన స్పష్టత కొఱకింత వర్ణనమవసరమయినది. కావున నిచట సూత్ర కారికలకు శేష శేషి భావమును జెప్పరాదు. ఇచట చింతామణి కారికావళులకు ప్రణాళికా భేదము కలదనుట స్పష్టమే.

మఱి యీ కారికల కర్థమును జెప్పుటెట్లని ప్రశ్న. 'తాసు = ఆ క్రియల యందు, భూతాద్యవిషయా = భూతాది కాలములకు విషయము కానటువంటివియు, తద్ధర్మ సంజ్ఞికా = తద్ధర్మ సంజ్ఞ కలవియు, ఏకత్వార్థాభిధాయకా = ఏకత్వార్థమును దెలుపునవియునగు, ప్రథమ శ్చోత్తమ శ్చైవ = ప్రథమోత్తమ పురుషములు మాత్రమే, సదా = ఎల్లపుడు, ఉదన్తాచ = హ్రస్వోకారమంత మందు కలవియు, నాన్తా = ద్రుతాంతములు (అగును)

---

[1] ఆం. భా. భూ. 145 ప.

[2] కవిశిరో. క్రియ. 18. 31 సూ.

తత్ర = అచ్చట, సంధిః = సంధి, నకల్ప్యతే=చేయబడుటలేదు' అని దీని కర్థమును జెప్పవచ్చును.

చేయున్.చేయుదున్ అనువానికి సంధిరాదని భావమన్నమాట. ఇతడు 'ఉన్స్యా ద్భవిష్యదర్థే ..." అని 'ఉన్' అనుదానిని క్రియా విభక్తిగా విధించుకొనుటచే నిట్టి నిషేధ మవసరమయినది.[1]

స్త్రీ లిఙ్గకము

"వికృతౌచ స్త్రీలిఙ్గాః స్త్రీలిఙ్గక సర్వనామధేయాః స్యుః" స్త్రీలింగ పదములు తెలుగునందును స్త్రీ లింగములైన విశేషణ విశేష్యములు గలవి యవును. చకారము వలన సంస్కృత స్త్రీలింగ పద విశేషణములు స్త్రీ లింగములే యనుట ఉ. గౌరి భక్తవత్సల,గట్టురాపట్టి యాపన్నవరద' ఇది బాలసరస్వతి వివరణ సారము.[2] 'ఈ సూత్రంలో విశేష్యార్థకంగా నామధేయ శబ్దం వాడబడింది. ఆ శబ్దాని కా అర్థం ఉన్నట్లు ఏ నిఘంటువూ చెప్పడం లేదు. ఎక్కడా ప్రయోగమైనా కనబడదు. కాగా అది సూత్రకర్త సంకేతించిన అర్థం. ఆ అర్థం బాల సరస్వతి గ్రహించి వ్యాఖ్యానించాడంటే అతనికి సూత్రకర్తతో అభేదాన్ని మనం అంగీకరించాలి." అని విమర్శకులు వ్రాసినారు.[3]

నామధేయము 'ణము ప్రహ్వాత్వే శబ్దే' అను ధాతువు నుండి పుట్టిన శబ్దము. దీనిచే పలుకబడును గనుక నామధేయమని దీని నిర్వచనము. నామధేయము నామము పర్యాయములు.[4] నామ వాచ

---

1. ప. బాలస. క్రియ. 6 శ్లో. వ్యాఖ్య.
2. ప. బాలస. అజన్త, 14 శ్లో. వ్యాఖ్య.
3. సం. ప్ర. వ్యాకరణాలు 299 పు.
4. అమరకోశము సంస్కృతాంధ్ర వ్యాఖ్య 1 కాండ, వాగ్వర్గము 8 శ్లో. వ్యాఖ్య.

కమునుసంజ్ఞా ప్రయుక్త విశేషణముగా వైయాకరణులు గుర్తించిరి.[1] కనుక నామధేయ పదమునకు విశేషణమను నర్థమును సూత్ర కర్తయే సంకేతించెననుట సత్యదూరము.

సంజ్ఞా వాచకము విశేషణమయినను దానికి వేఱొక విశేషణమును జేర్చినపు డాసంజ్ఞా వాచక పదమే విశేష్యమగును. 'పదునొకండురుద్రులు' అనుచోట 'రుద్రులు' అను సంజ్ఞా వాచకము పదునొకండ్రు అను సంఖ్యా ప్రయుక్త విశేషణమునకు విశేష్యమయినది గదా! [2]

కనుక సూత్రము నందలి నామధేయ పదమునకు విశేషణమని మాత్రమే చెప్పవలసిన అవసరములేదు; విశేష్యమనియు జెప్ప వచ్చును.

శ్లో. యల్లిఙ్గం యద్వచనం యాచ విభక్తిః విశేష్యస్య
తల్లిఙ్గంత ద్వచనం సాచ విభక్తిః విశేషణస్యాపి

అను నియమముచే సంస్కృతమున విశేష్యమున కుండు లింగ విభక్తి వచనములు విశేషణమునకును గలుగును.[3] సంస్కృత ప్రాకృత వ్యాకరణ విషయములను తెలుగు వ్యాకరణమున వర్తింపజేసి కొనుచున్న చింతామణి స్త్రీలింగ పదములు తెలుగు నందును స్త్రీలింగములయిన విశేషణ విశేష్యములు కలవియున్నవని ప్రత్యేకముగా చెప్పె ఎందులకు? సంస్కృత స్త్రీలింగ పద విశేషణములు స్త్రీలింగములే కావలయునని సూచించు ఎందులకు? ఇచట వ్యాఖ్యాభిప్రాయ మస్ప

---

[1] శ్రీమాన్ బహుజనపల్లి సీతారామాచార్యులు ప్రౌఢ. శబ్ద. ౩ సూ. వృత్తి.

[2] ప్రౌఢ. శబ్ద. 5 సూ. వృత్తిలో.

[3] ఉపయుక్తాంశ సంగ్రహము మైసూర్ : ధర్మాధికారి చక్ర వర్తియ్యంగార్, (సన్ 1965) పు.

ష్టము గానున్నది, దీని కహోబలపతి వ్రాసిన వ్యాఖ్యను జూడవలసి యున్నది.

"వికృతౌ చ యేస్త్రీ వాచకాః శ్శబ్దాః తేసర్వే స్త్రీలిఙ్గక విశేషణ విశేష్యాభిధాయినస్స్యుః"

(తెలుగులో స్త్రీ వాచక శబ్దములు స్త్రీ లిఙ్గక విశేషణ విశేష్యములను తెలుపును.[1] ఈ సూత్రమునకు ప్రయోజనమును గూడ అతడు తెలిపెను. "ఈ సూత్రమునకు సీత భక్త వత్సల" ఇత్యాది రూపములను సాధించుట ఉద్దేశ్యము గాదు. "నియతః స్త్రీ ప్రత్యయస్తు సర్వాసామ్" అను సూత్రము వలన స్త్రీ ప్రత్యయాంత శబ్దమునకు హ్రస్వము రాగా 'ఏకదేశ వికృత మనన్యవద్భవతి' అను న్యాయముచే స్త్రీ వాచకత్వము తొలగదు. కాన వానిని సాధించుటకు ప్రస్తుత సూత్ర విధాన మావశ్యకము కాదు. 'పంట చెలిపట్టి లోకైక భద్ర చరిత' ఇత్యాది రూపములను సాధించుటకీ సూత్రవిధి అవసరము. సంస్కృతము నందు టాబాది ప్రత్యయములు వచ్చినట్లు తెలుగు స్త్రీ వాచక శబ్దములన్నింటికి వచ్చునట్టి స్త్రీ ప్రత్యయములు లేవు కదా! సంస్కృతమున గౌరి మున్నగు శబ్దముల వలె తెలుగులో స్త్రీత్వమును తెలుపు పదములకు స్త్రీత్వము కలుగునని చెప్పుట వలన తెలుగు స్త్రీ వాచక పదములకు విశేషణములుగా వాడు తత్సమ పదములకు గూడ స్త్రీత్వము సిద్ధించుననుట ఈ సూత్రమునకు ప్రయోజనము అని అహోబలపతి వ్రాసెను.[2]

తెలుగులోని స్త్రీవాచక శబ్దములు సంస్కృత స్త్రీలింగ విశేషణములను విశేష్యములను తెల్ప లేదా? స్త్రీలింగక విశేష్య విశేషణాభిధాయకములగునని విధించుటెందులకు? సంస్కృతమున టాబాది

---

1. కవిశిరో. అజంత. 57 సూ.
2. కవిశిరో. అజంత. 57 సూ వ్యాఖ్య

ప్రత్యయములు స్త్రీత్వద్యోతకములు. అవి అంతమున చేరినపుడు శబ్దములకు స్త్రీవాచకత్వము ప్రస్ఫుటమగు చుండును. తెలుగున స్త్రీ వాచకముల కన్నింటిని స్త్రీ ప్రత్యయములు చేరక పోవచ్చును. కాని వానికి స్త్రీ వాచకత్వము కలదు. చెలి అను పదము స్నేహితురాలిని చెప్పుచునే యున్నది. కావున 'వికృతౌ' ఇత్యాది సూత్రముచే తెలుగు స్త్రీ వాచకములకు స్త్రీ వాచకత్వమును విధించుట అనవసరము. సంస్కృతమున గూడ టాబాది ప్రత్యయములు స్త్రీత్వమును వెల్లడి చేయునవే కాని స్త్రీ వాచకములు గావు.[1] మఱియు సూత్రమున వాచకము అను నర్థము నిచ్చు 'అభిధాయక' అను పదము లేదు. స్త్రీ ప్రాతిపదికములే స్త్రీ వాచకములు. కావున అహోబలపతి స్త్రీలింగ విశేష్య విశేషణాభిధాయకములగు ననుట సముచితము గాదు.

ఇచట తన వ్యాఖ్య అహోబలపతికే సంతృప్తిగ లేదు. కావుననే సూత్ర వివరణమున "స్త్రీ వాచక శబ్దములు స్త్రీలింగ విశేషణ విశేష్యములకు వాచకము"లని చెప్పిన అతడు తెలుగు శబ్దములకు విశేషణములుగా ప్రయుక్తములగు సంస్కృత పదములకును స్త్రీత్వమే వచ్చునని సూత్ర స్వారస్యమును చెప్పినాడు.[2] విశేష్యమును బట్టి విశేషణమునకు లింగ నిర్ణయము చేయవలసి యుండుటచే తెలుగు స్త్రీ వాచకములకు విశేషణములైన తత్సమ శబ్దములు స్త్రీ లింగ రూపముతో నుండుటకు ప్రస్తుత సూత్రమవసరమని అహోబలపతి భావము.

---

[1] "తథాచ స్త్రీత్వ మిహ ప్రాతిపదికస్యైవ వాచ్యమ్ ; టాబాదయస్తు తద్ద్యోతకాః" శ్రీ వాసుదేవ దీక్షితులు, బాలమనోరమ, సిద్ధాంత కౌముదీ వ్యాఖ్య 453 సూ. వ్యాఖ్య 426 పు.

[2] తద్విశేషణత్వేన ప్రయుక్తస్య సంస్కృతపదస్యాపి స్త్రీత్వమేవేత్యత్ర సూత్రస్యాస్య స్వారస్యమ్' కవిశిరో. అజన్త. 48 సూత్ర వ్యాఖ్య 367 పుట.

బాలసరస్వతి చెప్పిన అర్థము వలన సూత్రార్థము స్పష్టమగుటలేదు. అహోబలపతి సూత్రమునకొక ప్రయోజనమును సాధించెను. కాని ఈ పద్ధతిలో గూడ సూత్రము సమగ్ర ప్రయోజనము కలది కానేరదు. తెలుగు స్త్రీ వాచకములకు సంస్కృత స్త్రీలింగములను విశేషణములుగా వాడవచ్చునని అతడు చెప్పినాడు. కాని సంస్కృత స్త్రీలింగములకు తెలుగు స్త్రీవాచక విశేషణములను వాడవచ్చునా ? 'యల్లింగం యద్వచనం' అను న్యాయమును బట్టి స్త్రీలింగ విశేష్యములకు స్త్రీలింగ విశేషణములే వాడవలెనుగదా ! ఈ విషయమును గూడ ప్రస్తుత సూత్రము పరిష్కరింప గల్గినదే.

స్త్రీలింగాః = తత్సమ స్త్రీలింగ పదములు, వికృతౌ = తెలుగునందు, స్త్రీలిఙ్గక సర్వనామధేయాః = తెలుగు స్త్రీవాచక విశేషణ విశేష్యములు, స్యుః = అగును. సంస్కృత స్త్రీవాచక శబ్దములకు తెలుగు స్త్రీవాచకములను విశేషణములు గను, విశేష్యములుగను వాడవచ్చునని భావము. ఇచట స్త్రీలిఙ్గక పదముచే ఆచ్ఛిక స్త్రీవాచకములు చెప్పబడినవి.

చింతామణి అల్పాక్షరములలో ననల్పార్థముల సూచించు పద్ధతిని పెక్కుచోట్ల అవలంబించినది. "కేవల వికృత పదైః యస్సమాసకం తం బ్రువన్తి వాక్యజ్ఞాః" అని చింతామణి తెలుగు పదముల సమాసమునకు సమాసక మని పేరు పెట్టినది.[1] స్త్రీలింగమని ప్రత్యేక సంజ్ఞను విధించలేదు. కాని స్త్రీలింగ పదమును వాడినది. ఒకే సూత్రమున స్త్రీలింగ స్త్రీలింగక పదములున్నవి. కాన సమాసక సంజ్ఞా సామ్యమును బట్టి కేవల వికృతి స్త్రీవాచక పదములకు స్త్రీలింగక సంజ్ఞ నేర్పరచుట చింతామణ్యభిప్రాయమని తోచుచున్నది.

---

[1] కవిశిరో. హలంత. 56 సూ.

అనుచిత విభాగము

చింతామణి సూత్ర రూపములో రచింపబడలేదని తెలియుచున్నది.[1] కావున నొకచోట సూత్రవిభజన చేయుటకంటె మానుటయే మేలనిపించును.

శ్లో. ద్విగు కర్మధారయౌ తత్పురుష ద్వంద్వౌ బహువ్రీహిః
అన్యేచ కేచిదుపమానోత్తర పద లోప రూపకాఖ్యాద్యాః[2]
పరిదృశ్యా ఇహ కార్యా ఔపవిభక్తికవదంత విధయశ్చ
లోపశ్చ విభక్త్యాదేశశ్చైషు స్యాత్సమాస కాంగేషు.[3]

ఇచట ప్రాచీన వ్యాఖ్యాతలు "ద్విగుకర్మధారయౌ" అను పూర్వ శ్లోకములోనికి "పరిగృశ్యా ఇహ' అను ఉత్తర శ్లోకములోని పదములను అన్వయించు చున్నారు. ఒక శ్లోకమును, తరువాతి శ్లోకములోని పాదాంత్యమును కలిపి యొక సూత్రముగా నేర్పరచుట విచిత్రముగా కన్పడును. పరిశీలించగా రెండవ శ్లోకమున కాదిలో ఉన్న 'పరిదృశ్యా ఇహ' అనుదానిని పూర్వశ్లోకములోని కన్వయించుట కన్న ఉత్తర శ్లోకములోని కన్వయించుటయే ప్రయోజననంతము. 'ద్విగుకర్మధారయములు, తత్పురుష ద్వంద్వములు, బహువ్రీహి సమాసము, ఉత్తర పదలోప సమాసము, రూపకాదులు, ఇచట పేర్కొనబడిన యితర సమాసములు కొన్ని' అని సూత్రార్థము. 'కలపు' అని అధ్యాహారము సామాన్యముగా లభించునదే. అట్టి అధ్యాహారము చేయనక్కరలేకుండ తరువాతి సూత్రములోని 'ఇహపరిదృశ్యాః' (ఇచట చూడదగినవి.) అనుదానిని వారన్వయించినారు.

---

[1] ఆంధ్రశబ్ద చింతామణి సూత్ర గ్రంథమా ? అనువ్యాసము చూ.

[2] ప. బాలస. హలంత. 16 శ్లో.

[3] అందే 17 శ్లో.

ఈ రెండుపదములను తరువాతి సూత్రములోని కన్వయించుట వలన కలుగు ప్రయోజనమిది. 'ఇహపరిదృశ్యాః = ఈ తెనుగులో కనబడుచున్నట్టి, అంత విధయః = సమాసాంత విధులు, ఔప విభక్తికవత్ = ఔప విభక్తికములవలె, కార్యాః = చేయదగినవి.'

శ్లో. ఔప విభక్తిక సంజ్ఞా వర్ణాః టింట్యాదయో భవన్తీహ,
రుల్వాదేర్నామ్నాం స్యుస్తేహి విభక్తౌ సమాసే చ.

అని ఔప విభక్తికములు సంధి పరిచ్ఛేదములో విధింపబడినవి. టింట్యాదులు ఔప విభక్తికములు. ఇవి నామముల చివర నున్న రు, లు, మొదలగువానికి వచ్చును. ఇవి విభక్తి పరమయినపుడు సమాసమునందును వచ్చును. హి వర్ణము ప్రయోగ ప్రసిద్ధిని సూచించును.

ముక్కంటి అనుచోట బిందుపూర్వ టివర్ణము కలదు. ఇది సమాసాంత ప్రత్యయము. అలరు విల్తుడు అనుచోట విభక్తి పరముగా నున్నపుడు అంత విధి జరిగినది. నామము చివర ఆదేశముగా వచ్చుట, సమాసమున విభక్తి పరమగునపుడు వచ్చుట అను లక్షణములు ఔపవిభక్తిక సమాసాంత ప్రత్యయములకు తుల్యములు. కాని ఔపవిభక్తికము వ్యస్తపదమున విభక్తిపరముగా నున్నపుడు గూడ ప్రవర్తించును; సమాసాంత విధి అట్లు ప్రవర్తింపదు కదా! ఔప విభక్తికము సమాసమున పూర్వపదాంతమున ప్రవర్తించును. అంత విధి సమాసమున ఉత్తర పదమునకు చివర వచ్చును. ప్రయోగ ప్రసిద్ధి రెంటికి కావలసినదే. అంత విధులకు ఔప విభక్తులకు పోలిక కొంత మాత్రమే కలదు. కావున 'ఔపవిభక్తికవత్' అను అతిదేశము అంత విధులు చేరు తీరు తెన్నులను స్పష్టము చేయలేక పోవుచున్నది.

కావున ప్రయోగములలో కనబడునట్టి అంత విధులనే చేయవలయునని తెల్పుటకు 'పరిదృశ్యాః' అను పదమీ సూత్రములోనికి అన్వయించుట అవసరము. ఈ పక్షమున 'ఔప విభక్తిక వత్' అను అతిదేశము' వ్యర్థమగుననిపించును. కాని ఔపవిభక్తులకు అంతవిధులకు పోలికలున్నవని యీ అతిదేశముచే తెలియును. కావున నిది వ్యర్థము కాదు. తరువాతి శ్లోకమున కాదియందున్న 'పరిదృశ్యా ఇహ' అను దళమును విభజించి, పూర్వశ్లోకములోని కన్వయించుట ఉచితము కాదని సారాంశము.

ఇవి రెండు సూత్రములా ?

చింతామణిలో

శ్లో. కేషాంచి దుదన్తానాం నేతి విభక్తావునోలుకా స్యాత్
ఔపవిభక్తిక నామ్నా మత్వం స్యాత్సప్త మీతృతీయార్థే.

అను శ్లోకమున్నది. దీనిని రెండు సూత్రములుగా వ్యాఖ్యాతలు విభజించిరి. [1] మొదటి సూత్రమునకు 'కొన్ని ఉకారాంతములకు న' అను విభక్తి పరముగా నుండగా 'ఉన్' నకు లోపము వచ్చునని చెప్పిరి. [2] రెండవ సూత్రము 'ఔప విభక్తిక నామములకు సప్తమీ తృతీయార్థములందు అకారము వచ్చునని వివరించిరి. [3] ప్రథమ సూత్రముచే చోటునన్ ఊరునన్ మొదలగునవి 'చోటన్' 'ఊరన్' వంటి రూపముల నందును. ద్వితీయ సూత్రముచే మింటన్, కంటన్ మొదలగు రూపములు సిద్ధించును.

చోటన్, మింటన్ అను రెండు రకముల ఉదాహరణములలో అత్వమే వినబడుచున్నందున నవర్ణకము పరముగా నున్నపుడు 'ఉన్'

---

1. ప. బాలస. అజంత. 20 శ్లో. కవిశిరో. అజంత. 78, 79 సూ.
2. కవిశిరో. అజంత. 78 సూ. వ్యాఖ్య.
3. ప. బాలస. అజంత. 20 శ్లో. వ్యాఖ్య.

నకు లోపము విధించుట వ్యర్థమనిపించును. అత్వమును విధించిన చాలునన్నమాట. చింతామణిలో విభక్తుల పట్టికలో అత్వము చెప్పబడలేదు.[1] అట్టిదానికి సప్తమీ తృతీయార్థములను చెప్పుటయు వింతగనే కనబడును. ఈ విషయమును గమనించినపుడు పై శ్లోకమును రెండు సూత్రములుగా విభజించుట సరి కాదనిపించును. ఈ రెండు పాదముల కైకాన్వయము గల్గించినపుడు "సప్తమీ తృతీయార్థములందు కొన్ని ఉదంత శబ్దములకు 'న' అను విభక్తి పరమగునపుడు 'ఉన్' (ప్రకృతి భాగమందలి ఉకారము, ప్రత్యయమునకు మొదట నున్న నకారము) లోపించును. ఔపవిభక్తిక నామములకు సప్తమీ తృతీయార్థములందు (నకారము లోపించగా శేషించిన) అత్వము వచ్చును" అనుభావము వచ్చును.

చింతామణి విభక్తుల పట్టికలో నవర్ణకమును బఠించినది.[2] అదియేశబ్దములకు జేరునో అచట జెప్పలేదు. ఇచట దాని విషయమును సూచించుచున్నదన్నమాట. కొన్ని ఉదంత శబ్దములకు నవర్ణకము వచ్చుననియు, అది సప్తమీ తృతీయార్థములందు చేరుననియు, ఉదంతములకది పరమగునపుడు కొన్నిచోట్ల 'ఉన్' అనుదానికి లోపము వచ్చుననియు, నకారము లోపింపగా శేషించిన అకారము సప్తమీ తృతీయార్థములందే ఔపవిభక్తిక నామములకు జేరుననియు గ్రంథకర్త చెప్పినట్లగును.

ఈ అన్వయముచే మొదట బేర్కొన్నదోషములు కలుగవు. అల్పాక్షరములలో ననల్పార్థమును గ్రహించు నలవాటున్న చింతామణికర్త యీ తీరుగా విషయమును దెల్పుట వింతకాదు. నవర్ణకము సప్తమీ తృతీయార్థములలో ప్రవర్తించుటయు, ఈ రెండు

---

1. అందే 2 శ్లో. వ్యాఖ్య.
2. అందే 7 సూ.

విషయములోకే శ్లోకమునందు జెప్పబడుటయు నీ యేకాన్వయమును బలపరచు విషయములు.[1]

"Forwarded free of cost, and with the Compliments of the department of Education, Government of India, New Delhi."

నాన్తములు

చింతామణి 'కవిభల్లట' సూత్రమున 'నాన్తాదయః' అను పదమును వాడినది.[2] దీనికి వ్యాఖ్యాతలు "నకారాంతాది శబ్దములు" అని వివరించిరి.[3] కేతన ద్రుత ప్రకృతికములను నర్థమున 'నాన్తములు' అని వాడెను.[4] అప్పకవి నాన్తములనగా ద్రుత ప్రకృతులని వివరించెను.[5] కావున చింతామణి వాడిన 'నాన్త్యాదయః' అనుదానికి సరియగు సత్యమేదో తెలిసికొనవలెను. చింతామణి నాన్తపదమును వాడిన మొత్తము శ్లోకమిది.

శ్లో. కవి భల్లటైః క్రియాణాం నామ్నాంచోల్లోప ఇష్యతే హ్యేషు
ప్రథమైక వచన మాత్రే వికృతౌ నాంతాదయోపి కథ్యంతే.

"కవి భల్లటులచేత ధాతువులకు శబ్దములకు ఉకారలోపము ఇచ్ఛయింప బడుచున్నది. ఈ లోప ప్రదేశములయందు ప్రథమైక వచన మాత్రమున నకారాంతములు మొదలయిన శబ్దములును

---

1. "ఉదంత జడంబు తృతీయకు నవర్ణకంబగు" రాముడోర్క బాణంబున 'వాలిం గూలనేసె' శ్రీ చిన్నయ సూరి బాలవ్యా. కారక. 27 సూ. "ఉకారాంత జడంబునకు నవర్ణకంబగు" ఘటంబున జలంబున్నది. అందే 16 సూ.
2. కవిశిరో. హలంత 23 సూ.
3. ప. బాలస. 8 శ్లో. టీక.
4. ఆం. భా. భూ. 54 ప.
5. అప్పక. 5-41 ప.

తెలుగునందు చెప్పబడుచున్నవి. ఆది శబ్దముచే లాంతములును ళాంతములును గ్రహింపవలెను." ఇది బాలసరస్వతి వివరణసారము.[1]

ఇందు పూర్వార్ధము చేతనే నామములకు క్రియలకు ఉల్లోపము కలుగుచుండగా ఉత్తరార్ధము వలన క్రొత్తగా విధింపబడున దేమి ? నాంతములగు పదములకు ద్రుతప్రకృతికములను నర్థము నంగీకరించినచో నొక ప్రయోజనము కలుగును. చింతామణి చెప్పిన కళల పట్టికలో ప్రథమాంతములున్నవి. కళలకంటె భిన్నములే ద్రుత ప్రకృతికములని 'అన్యేద్రుతప్రకృతయః' అను సూత్రము తెలుపుచున్నది.[2] కాన 'తాను, నేను' అను ప్రథమాంతములకు ద్రుత ప్రకృతికత్వము కలుగరాదు. కాని వాని చివరి నకారమునకు ద్రుత వ్యవహారమున్నది.[3] వానికి ద్రుతత్వము కల్గు సూత్రమేది ? అహోబలపతి 'సలోలోశ్చ' అను సూత్రము నందలి చకారము చేతనే తాను, నేను శబ్దములందున్న ఉకారమునకు లోపమును జెప్పి తక్కిన దానిని ద్రుతప్రకృతికముగా చెప్పెను.[4] కాని 'సలోలోశ్చ' అను సూత్రమునకు తాను, నేను శబ్దముల ఉకారలోపమునకు సంబంధమేమియు కానరాదు.[5] కావుననే అహోబలపతి నన్నయగారి ప్రయోగము వలననే ఈ ఉకారలోపము వచ్చునని చెప్పుకొనెను. కేతన వలెనే నాన్తములను పదమును చింతామణి గూడ ద్రుత ప్రకృతిక పర్యాయముగా వాడెనని తెల్పినచో నీ పాట్లు తప్పును.

---

[1] ప. బాలస. హలంత. 8 శ్లో. టీక.

[2] కవిశిరో. సంజ్ఞ. 41 సూ.

[3] కవిశిరో. సంధి. 40 సూ.

[4] అందే వ్యాఖ్య.

[5] 'లకార యుక్తమయిన ళుకారమునకును ఉకార లోపమగును' అని దీనికి బాలసరస్వతి టీక ప. బాలస. అజంత. 18 శ్లో. టీక.

"Forwarded free of cost, and with the Compliments of the department of Education, Government of India, New Delhi."

ఈ పక్షమున శ్లోకమునందలి ఉత్తరార్ధమునకు క్రింది విధముగా నర్థమును జెప్పవలెను.

వికృతౌ = తెలుగున, ఏషు = ఈ ఉకారలోపమును పొందిన పదములయందు, ప్రథమైక వచనమాత్రే = ప్రథమైక వచన మాత్రమందు, నాన్తాదయోపి = ద్రుత ప్రకృతికములు మొదలగునవి గూడ, కథ్యన్తే - చెప్పబడుచున్నవి. ఇచటి ఆది శబ్దముచే క్రియాభిన్నములయిన కళలు గూడ గ్రహింపవచ్చును. తెలుగున ఈ ఉకారలోపము పొందిన ప్రథమైక వచనములందు ద్రుతప్రకృతికములు కళలు గూడ కలవని తాత్పర్యము. ఇట్లు చెప్పుటచే తాన్, నేన్ శబ్దములను చింతామణి 'ద్రుతప్రకృతికములు' అని వ్యవహరించుట సముచితమగుచున్నది. ఇచట ఉకారలోపము పొందిన ప్రథమాంతములందు ద్రుతాంతములు గూడ కలవని తెల్పబడుటచే నిది త్రిజ్మధ్య సూత్రమునకు అపవాద సూత్రమగును.

బాల సరస్వత్యాదులు చెప్పిన అర్థము ననుసరించినచో శ్లోక పూర్వార్ధముకును ఉత్తరార్ధము వివరణము మాత్రమే యనవలసి వచ్చును. చింతామణిపై ఆంధ్రభాషా భూషణ ప్రభావము మిక్కిలి కలదని తెలియుచున్నది.[1] కావున కవి భల్లట సూత్రము నందు వాడబడిన నాన్తములను పదమునకు ద్రుతప్రకృతికములను నర్థమును చెప్పుట ఉచితము.

"శాస్త్ర మపౌరుష మాద్యమ్"

చింతామణి సంస్కృత ప్రాకృతములను తెలుగునకు ప్రకృతులుగా దెలిపినది. పెక్కు సంస్కృత ప్రాకృత వ్యాకరణ మర్యాదలను దన గ్రంథమున పాటించినది. సంస్కృత ప్రాకృత వ్యాకరణములను జదువని వారి కది సరిగా నర్థముగాదు. సంస్కృత శబ్దములను దెలుగులోనికి దెచ్చుకొను పద్ధతులను పెక్కింటిని చింతామణి దెల్పినది.

---

[1] 'చింతామణికి మూల పాఠములు' అను వ్యాసము చూ.

ప్రాకృత పదములను దెలుగులోని కెట్లు గ్రహింపవలెనో యొక శ్లోకముచే నుపదేశించినది. కాన చింతామణి జదువదలచినవారు సంస్కృత వ్యాకరణమును జదువుట యవసరము. ఆ విషయ మొక శ్లోకముచే చెప్పబడినది.

శ్లో. శాస్త్రమపౌరుష మాద్యం ప్రాయిక నిత్య ప్రయోగ లక్ష్మైతత్
దృశ్యమతి స్థవిరం యజ్ఞాత్వాశబ్దాః ప్రయుక్త ఆర్షసమః.

దీనికి బాలసరస్వతి అర్థమును వ్రాయలేదు. కాని అతనిచేతిలో వ్రాయబడిన ప్రతిలోనీ శ్లోకమున్నది.[1] అహోబలపతి మాత్రము సంస్కృతమునకు ఆద్య ప్రకృతిత్వమును నిర్ధారణము చేయుటకీ శ్లోకమును ప్రమాణముగా చూపెను.

టీకా కారుడు దీనికి వ్రాసిన అర్థమిది. ఏతత్ శాస్త్రమ్ = ఈ శాస్త్రము. అపౌరుషమ్ = పురుష ప్రణీతము గానిది, ఆద్యమ్ = మొదటిదియు, ప్రాకృత నిత్య ప్రయోగ లక్ష్మైతత్, ప్రాయిక = బహుళములైన, నిత్య = నిత్యములైన, ప్రయోగ = ప్రయోగములే, లక్ష్మ = చిహ్నములుగా గలదియు, అతిస్థవిరమ్ = అనాదిగా, దృశ్యమ్ = చూడదగినది, యత్ = ఏ శాస్త్రమును, జ్ఞాత్వా = ఎరిగి, ప్రయుక్తః = ప్రయోగింపబడిన, శబ్దః = శబ్దము, ఆర్షసమః, ఆర్ష = వైదికశబ్దముతోడ, సమః = సమానమో.[2] ఇందు టీకా కారుడు దీనిని తెలుగు వ్యాకరణపరముగా వ్యాఖ్యానించెను.

---

[1] 'క్వచిత్పుస్తకే సరస్వతీ కరలిఖిత ఏవ శబ్దానుశాసన ప్రణీతత్వేన పద్యం స్థితమ్'అని ఒక ముద్రిత ప్రతిలో అహోబలపతి వచనముగా కలదు. కాని లిఖిత మాతృకలో నిదిలేదట. ఇది పరిశీలింప దగిన విషయము. కవిశిరో. సంజ్ఞ. 11 శ్లో. తరువాత. ఆం. ర. సం. (1965), 146 పు.

[2] సటీకాంధ్ర శబ్ద చింతామణి సంజ్ఞ. 11 సూ. టీక.

కాని కేవలము తెలుఁగు వ్యాకరణ పరముగా వ్యాఖ్యానించుటకు శ్లోకమునందలి 'అపౌరుషమ్' 'అతిస్థవిరమ్' లను పదములడ్డములు. అపౌరుషమ్ = పురుషునిచే వ్రాయబడనిది, వైదిక శబ్దము వంటిదని భావము. అతి స్థవిరమ్ = అతి ప్రాచీనమైనది. మూల శ్లోకకారుడు తాను వ్రాయు గ్రంథమున కిట్టి విశేషణములు వాడుటకంటె అసంగత విషయ మేముండును?

దీనిని గమనించియే బాలసరస్వతి వ్యాఖ్యానించుట మాని యుండును. వ్యాఖ్యలేనందున తరువాతి లేఖకులు వదలియుందురు. శ్రీ వఝల చిన సీతారామస్వామి శాస్త్రిగారు దీనిని కేవల సంస్కృత వ్యాకరణ పరముగా అన్వయించినారు.[1] ఋషి ప్రోక్తము, ప్రాయిక నిత్యప్రయోగముల నుపదేశించునది, మిక్కిలి ప్రాచీనమైనది అగు సంస్కృత వ్యాకరణ శాస్త్రము తెలిసికొనదగినది. దానిని తెలిసికొని ప్రయోగించిన శబ్దము ఋషి ప్రయోగముతో సమానము అని వారు శ్లోకమున కర్థమును తెల్పి ఆంధ్రభాషా పాండిత్యము గోరువారెల్ల దీని నభ్యసింప వలసినదే యని శ్లోకమునకు చింతామణితో సంబంధమును తెల్పిరి. వారి తాత్పర్యము సరియైనదే కాని వారర్థమును తెల్పిన తీరులో కొంత అసంగతియున్నది.

(అ) శ్లోకమునకు గ్రంథములో గల సందర్భమును మూలకారుడు తెల్పకుండుట.

(ఆ) ఏతత్ అను పదము సమీప తరముగ ఉన్నదానిని తెల్పును. కావున చింతామణినే తెల్పుట న్యాయము.

(ఇ) ప్రాయిక నిత్య ప్రయోగ లక్ష్మ అను దళమునకు 'ప్రాయికములు, నిత్యములు మున్నగా గల ప్రయోగముల లక్షణములు గలది యనగా నాని నుపదేశించునట్టియు' అని వారర్థమును వ్రాసి యున్నారు.

---

1. అందే 65, 66 పుటలు.

సంస్కృత వ్యాకరణము ప్రాయికాదులయిన ప్రయోగములు లక్షణములుగా కల్గినను వాని నుపదేశించినను ప్రకృత గ్రంథమునకు లాభమేమి ? ఇచట లక్ష్మ, లక్షణ, లక్ష్య పదములకు గల అర్థము పరిశీలించదగినది. లక్ష్యతే అనేనేతి లక్ష్మ = దీనిచేత జూడబడును గాన లక్ష్మము. లక్షణ, లక్ష్య పదములు పర్యాయములు. లక్ష్యము ప్రయోగము. [1] 'లక్ష్యత ఇతి లక్ష్యమ్' చూడబడునది గనుక లక్ష్యము. [2] వ్యాకరణాదులలో సూత్రము లక్షణమగును. ఉదాహరణము లక్ష్యమగును. కనుక ప్రాయికాదులయిన ప్రయోగములను లక్షణముగా కల్గినది అని వ్రాయుటచే మూలకారుని అభిప్రాయము స్పష్టము కానేరదు. "లక్షణములుగా కల్గియుండుట యనగా వాని నుపదేశించుట" అను వివరణము గౌణముగా చెప్పబడిన అర్థము మాత్రమే.

ఆద్యం శాస్త్రమ్ = సంస్కృత వ్యాకరణ శాస్త్రము,అపౌరుషమ్ = పురుష సామాన్యునిచే గాక మహర్షులచే వ్రాయబడినది, ఏతత్ = ఈ తెలుగు వ్యాకరణము, ప్రాయిక = ప్రాయికము, నిత్య = నిత్యములు అయిన, ప్రయోగ = ప్రయోగములే, లక్ష్మ = ప్రధానముగా గలది, [3] కావున అతిస్థవిరం = మిక్కిలి ప్రాచీనమైన సంస్కృత వ్యాకరణము, దృశ్యమ్ = చూడదగినది. యత్ = దేనిని, జ్ఞాత్వా = ఎఱిగి, ప్రయుక్తః = ప్రయోగింపబడిన, శబ్దః = శబ్దము, ఆర్షసమః = ఆ ఋషి ప్రయుక్తముతో సమానమైనది అనగా ప్రామాణికమైనది అగునో అని దీనికి అర్థము చెప్పనగును.

---

1. కళఙ్కాఙ్కౌ లాఞ్ఛన ఞ్చ చిహ్నం లక్ష్మచ లక్షణమ్, అమర. 3 కాం. నానార్థ. 1-125 శ్లో.
2. అందే 2 కాండ 86 శ్లో.
3. లక్ష్మ చిహ్న ప్రధానయోః అమర. 3వ కాండ. నానార్థ వర్గము 125 శ్లో.

ప్రయోగ ప్రధానమైన తెలుగు వ్యాకరణములో సంస్కృత వ్యాకరణ విరుద్ధములగు తత్సమ పదములను గొందరు ప్రయోగించిరి. వానిని జూచినచో దెలుగుపై చిన్న చూపు గల సంస్కృత పండితులు మొత్తము భాషనే యవహేళన చేయవచ్చును. అట్టి యవకాశము నీయకుండుటకై యాంధ్ర పండితులు సంస్కృత వ్యాకరణమును గూడ నధ్యయనము చేయవలెనని గ్రంథకర్త తెల్పుటలో నౌచిత్య మున్నదిగదా! ఈ శ్లోకమున కర్థమును వ్రాయకుండుటచే బాలసరస్వతి చింతామణిని వ్రాసెననుట కుదరని మాట. తన శ్లోకము తనకె యనుచితముగా గనబడుట అసంభవము గదా! పై యర్థమును చెప్పుటచే పూర్వోక్త దోషము లేకుండుటయే కాక మరియొక లాభమున్నది. చింతామణి వ్యాఖ్యాతలు 'అనుక్త మన్యతో గ్రాహ్య' మ్మను నియమము ననుసరించినారు. వారట్లు చేయుటకు చింతామణిలో గల ప్రమాణమును వారు చూపలేదు. ప్రస్తుత శ్లోకము సంస్కృత వ్యాకరణము చూడ దగినదని కంఠోక్తిగా జెప్పుటచే వారి ప్రవృత్తి సూత్రకారుడు నిర్దేశించినదే యని తెలియును.

పర్యాప్తో మన్మతే తు సఙ్కేతః

ఈ సూత్రమును బాలసరస్వతి సంప్రదాయైక వేద్యమని వ్రాసెను.[1] అహోబలపతి "పర్యాప్తః పూర్ణః. సుప్రసిద్ధ ఇతి యావత్, యద్యత్సఙ్కేతితం శిష్ట ప్రయోగా రూఢఞ్చ పదం తత్ప్రయోజ్య మిత్యత్రాస్మాక మభినివేశః. శాస్త్రస్యతు దిక్ప్రదర్శనార్థత్వేన సార్థక్య మితిభావః (పర్యాప్తః = పూర్ణము, సుప్రసిద్ధమనుట, సఙ్కేతిము కలదియు, శిష్టప్రయోగములను బొందినదియు నగు పదమును బ్రయోగింపవలెనని మా పట్టుదల. శాస్త్రము దిఙ్మాత్రముగా దారిని జూపి సార్థక్యము నందును) అని వ్రాసెను.[2]

---

1. ప బాలస. క్రియ. 14 శ్లో. వ్యాఖ్య.
2. కవిశిరో. క్రియ 42 సూ. వ్యాఖ్య.

సంకేతము పూర్ణమగుటయేమి ! దానికి సుప్రసిద్ధమను వివరణమేమి ? సంకేతిత సుప్రసిద్ధమునే వాడవలెనను సారాంశమేమి ? ఇచట సంకేతమనగా వృత్తి సంబంధమనియు, వృత్తి యనగా నీ పదమువలన నీ యర్థమును గ్రహించవలయునను నీశ్వరేచ్ఛ యనియు నహోబలపతి వివరించెను.

సంకేతమనగా శబ్దశక్తి (వృత్తి)యను నర్థమున్నను పై వ్యాఖ్య యుక్తముగా దోచుటలేదు. అతడు చెప్పిన భావమునే యెట్లో స్వీకరించెదమన్నను 'ఇహతు ప్రవ్యాహార్యం సంకేతిత సుప్రసిద్ధమేవ పదమ్' అను సూత్రమున జెప్పబడిన విషయమే యిచట బునరుక్తమని చెప్పవలెను.[1] ఆ పునరుక్తి గూడ దార్ఢ్యము కొఱకని యహోబలపతి చెప్పుచుండెను. అట్లు పునరుక్తులను వ్రాయుట మితభాషియైన చింతామణి కర్తకలవాటు లేని పని. కావున నీ సూత్రార్థము పరిశీలనీయము.

చింతామణి సంక్షిప్త రచన. ఇందు తత్సమ క్రియా నిర్మాణము తత్సమ శబ్ద నిర్మాణము కొంత విస్తరింప బడినను దక్కిన విషయము లతిసంగ్రహముగా నున్నవి. ఆచ్ఛిక పదసాధన మత్యల్పముగా నున్నది. కాని సంజ్ఞలు మాత్రము పెక్కు ప్రయోగింపబడినవి. చింతామణిలో నుపయోగింపబడని సంజ్ఞలు గూడ కొన్ని కలవు. సమాసకము, మిశ్ర సమాసము అను సంజ్ఞలను చింతామణి నిర్వచించినది.[2] కాని వానిని తానెచ్చటను ఉపయోగించుకొనలేదు. అనగా దన గ్రంథమున నుపయోగించుకొనకున్నను దెనుగు వ్యాకరణమున నుపయోగింపదగు సంకేతముల (సంజ్ఞలను) నన్నిటిని చెప్పదలచెనని వ్యాఖ్యానింప వచ్చును. ఆ పక్షమున

---

1. కవిశిరో. సంజ్ఞ. 43 సూ.
2. కవిశిరో. హలంత. 46, 47 సూ.

'నా అభిప్రాయమున సంజ్ఞలు చాలును.' అని ప్రస్తుత సూత్రమున కర్థము వచ్చును. కాని చింతామణి సంగ్రహ గ్రంథము. తత్కర్త ఏర్పరచిన ప్రణాళిక విస్తృతమైనదే కాని ప్రక్రియా పద్ధతి సమగ్రము గాదు. దానిని పూరించుచు దరువాతి వారు వ్యాకరణ రచనము సాగించినచో నందు జింతామణి సంజ్ఞలే చాలుననుట వాస్తవ విరుద్ధము. తరువాతి వారు పెక్కు సంజ్ఞలను కల్పించుకొనిరి. తెనుగు వ్యాకరణమునకు విస్తృత ప్రణాళిక నేర్పరచిన మేధావి యగు చింతామణి కర్త ఇట్లు సంకుచితముగా నూహించెననుట యుక్తమనిపించదు. కావున నీ సూత్రభావ మింకను బరిశీలింప వలెను.

చింతామణిలోని సంజ్ఞలన్నియు సార్థకములు. అవి గ్రంథకర్త ప్రణాళికను సూచించు చుండును. చింతామణికర్త చెప్పిన వానిలో సంజ్ఞలు, సంధులు, తత్సమ శబ్ద సాధనము, కొన్ని ఆచ్ఛిక విశేషములు, ప్రాకృత ప్రకృతిత్వము, క్రియా ప్రణాళిక ప్రధానములు. వీనిలో సంధులు, తత్సమ శబ్ద సాధనము, ఆచ్ఛిక విశేషములు కొంతవరకు పూర్వ వ్యాకర్త లెత్తుకున్నవే. కాని తెలుగునకు ప్రాకృతము ద్వితీయ ప్రకృతి యనుట, క్రియా ప్రణాళిక చింతామణ్యుపజ్ఞములయిన విషయములు. ఉపకృతి పరిణతి సంవృతి అను క్రియలు సంస్కృతమునుండి దెనుగునకు క్రియల నెట్లు దెచ్చుకొనవలెనో సూచించును.

'స్యాదుపకృతిః కృదంతా'[1] (ఉపకృతి క్రియలు సంస్కృత కృత్ప్రత్యయాంతము లయి దెలుగున గ్రహింపబడును.) 'సా పరిణతి రయవరన్వితైవ భవేత్'[2] (పరిణతి క్రియ అయ్, అవ్, అర్ అను వానితో గూడి తెలుగున వాడబడును.) 'సంవృతి రహతాకారా' (సంవృతిక్రియలు సంస్కృత ధాతు రూపముతోనే తెనుగునకు

---

1. కవిశిరో. క్రియ. 5 సూ.
2. అందే 6 సూ.
[illegible]

వచ్చును.)[1] 'తద్ధర్మ వర్తమానా, తీతాగామ్యర్థకాః క్రియాః జ్ఞేయాః' (తెలుగు క్రియలు, తద్ధర్మము, వర్తమానము, అతీతము, ఆగామి అను నాల్గర్థములను కలిగియుండును,)[2]

ఉపకృతి పరిణతి సంవృతి సంజ్ఞలు సంస్కృతములో నున్న సంకేతిత సుప్రసిద్ధ ధాతువు లన్నిటిని తెలుగులోనికి దెచ్చుకొనుటకు దారిని దిఙ్మాత్రముగా జూపుచున్నవి. కావుననే అహోబలపత్యాచార్యుడు తన కవి శిరోభూషణమున నీ సందర్భమున నూట ఏబది పైగా ధాతువులను ఉపకృతి పరిణతి సంవృతి విభాగ పూర్వకముగా ప్రదర్శించినాడు. చింతామణి చెప్పిన తద్ధర్మాది క్రియార్థములు గూడ అంతకుముందున్న క్రియాప్రణాళికను మార్చి క్రొత్తదారిని చూపుచున్నవి. అంతకుముందు లాక్షణికులు అనుబంధములతో గూడిన చేయుచున్నవాడు, చేయగలవాడు వంటి వానిని క్రియాపదములుగా గుర్తింపలేదు. ఇతడీ యనుబంధ సహిత రూపములను వర్తమాన భవిష్యదర్థకములుగా జెప్పినాడు. అంతకుముందు భవిష్యదర్థకములుగా నున్న చేయుదును వంటివానిని తద్ధర్మార్థములుగా జెప్పెను.

'ప్రాకృత భవ సంస్కృత భవ సంస్కృతవత్ ప్రాకృత భవ వికృతి భవాః' (ప్రాకృత భవ వికృతి భవములు (ప్రాకృతమునుండి దెనుగునకు వచ్చిన పదములు) ప్రాకృత భవ సంస్కృత భవముల వలెను (ప్రాకృతమున గల తద్భవ పదములవలెను) ప్రాకృతము నందున్న సంస్కృతము వలెను (తత్సమముల వలెను) కార్యముల నందును)[3] అను నతిదేశముచే ప్రాకృత పదములను దెనుగులోనికి వచ్చు మార్గముపదేశింపబడెను. ఈ దారిలో వైకృత చంద్రిక తద్భవములు దెలుగులోనికి వచ్చు పద్ధతులను మరింత విస్తరించెను.

---

1. అందే 7 సూ.
2. అందే 8 సూ.
3. కవిశిరో. హలంత. 11 సూ.

ఇట్లు తాను ప్రక్రియను విస్తృతముగా జూపకపోయినను తన సంకేతములే తన భావమును (ప్రణాళికను) తెలుపగలవను నుద్దేశ్యమునే "పర్యాప్తోమన్మతేతు సంకేతః" అను సూత్రము దెలుపుచున్నదని తోచుచున్నది. దీనిచే చింతామణి ప్రణాళిక విస్తృతమైనను గ్రంథము మాత్రము సంగ్రహరూపమే యని తత్కర్తయే సూచించెనని తెలియును.

చింతామణికర్త లాఘవప్రీతి

చింతామణికర్త లాఘవప్రియుడు. ఆలక్షణ మాయన భావములను గొన్నిటిని లోకము గ్రహించుటకు వీలు లేకుండ చేసిన దనినచో నాయన లాఘవప్రీతి యెట్టిదో అవగతమగును.

అతడు 'స్త్రీపశు జడాన్ వినాన్యే మహదాఖ్యాః' (స్త్రీపశు జడములను విడచి యితరములు మహద్వాచకములు) అని మహత్సంజ్ఞను విధించుట ద్వారా అమహత్సంజ్ఞను సూచించి వదలినాడు.[1]

'నిరమో మహతాన్' (మహద్వాచకముల అమ్‌నకు నివర్ణకము వచ్చును.) అను విధి ద్వారా అమహద్వాచకములకు నువర్ణకము వచ్చునని పరిశేష న్యాయముచే సిద్ధింప జేసెను.[2] 'కేవల వికృతపదైర్య స్సమాసకం తంబ్రువన్తి వాక్యజ్ఞాః' (కేవలము తెలుగు పదములతో నేర్పడిన దానిని సమాసక మని వాక్యజ్ఞులందురు.)[3] అని తెలుగు పదముల సమాసములను సమాసక మని నిర్వచించెను. స్త్రీలింగకము, వర్ణకము అని యితర ప్రదేశములందు 'క' ప్రత్యయములను ప్రయో

---

[1] కవిశిరో°. అజంత. 9 సూ.

[2] అందే. 16 సూ.

[3] కవిశిరో°. హలన్త. 46 సూ.

గించెను.[1] స్త్రీవాచకమగు తెలుగు పదము స్త్రీలింగకమనియు, తెలుగు ప్రత్యయమును వర్ణకమని వ్యవహరింపవలెనని సమాసక సంజ్ఞను బట్టి మనము గ్రహింపవలె నన్న మాట.

సంస్కృత సమములను సాధించి, దేశ్యపదములకు గూడ నా విధుల నతిదేశించుట ద్వారా వానిని సాధించెను.[2]

'శాస్త్రమపౌరుషం' అను శ్లోకము ద్వారా తెలుగు వ్యాకరణ విద్యార్థి సంస్కృతి వ్యాకరణమును జదువ వలెనని సూచించి, పలు సంస్కృత వ్యాకరణ పద్ధతులను వివరణ రహితముగనే తన గ్రంథమున వాడుకొనినాడు.[3]

తెనుగునకు ప్రాకృతము ద్వితీయ ప్రకృతియని తెలిపి, 'ప్రాకృతభవ' శ్లోకముచే ప్రాకృతమందలి తత్సమ తద్భవ దేశ్య శబ్దములను దెలుగులోనికి వచ్చు మార్గములను సూచించినాడు.[1] తరువాతి వైయాకరణులు ప్రాకృత పదములను దత్సమ తద్భవ దేశ్యములుగా దెలుగులోనికి దెచ్చుకొనుట కితడు కారణమయినాడు. కేతన పెద్దన తత్సమ తద్భవ దేశ్య గ్రామ్యములతో పాటు అచ్చ తెనుగునుగూడ పఠింపగా నీతడు దేశ్యమునచ్చతెనుగు నొకటి చేసినాడు.[5] వ్యాకరణావసరమును జెప్పు సందర్భమున 'అనియ

---

1. 'వికృతౌచ స్త్రీలిఙ్గాః స్త్రీలిఙ్గక సర్వనామధేయాస్స్యుః' 'ప్రత్యయ ఇహ వర్ణకః' 'నామ్నః కవర్ణక స్స్యా త్స్వార్థే స్యాదుత్వమపి పరే తస్మిన్, అందే అజన్త. 57 సూ. సంజ్ఞ. 25 సూ. హలన్త. 29 సూ.
2. కవిశిరో. అజంత. 82, 83, 84. 85 సూ.
3. అందే సంజ్ఞ. 11 సూ. వ్యాఖ్యలో.
4. అందే హలన్త. 11, 12, 13 సూ.
5. కవిశిరో. సంజ్ఞ. 42 సూ.

మాద్గ్రాన్యుంహి' అని గ్రామ్యనిర్వచనమును జేయుటచే తత్సమ తద్భవాది నిర్వచన సందర్భమున గ్రామ్య నిర్వచనమును వీడినాడు.[1] ఈ విషయమును గుర్తింపక ఒకరు

విరళాన్ పేచోషాదిక శబ్దాన్, ప్రవ్యాహరన్తు శబ్దజ్ఞాః
ఇహాతు ప్రవ్యాహార్యం సంకేతిత సుప్రసిద్ధమేవ పదమ్.

(సంస్కృత వైయాకరణు లప్రసిద్ధమైన పేచ, ఊష మొదలగు సంస్కృత శబ్దములను వాడిన వాడుదురు గాక. తెనుగున నైతే సంకేతముగల సుప్రసిద్ధ పదమునే వాడవలయును.[2]) అను దానిని గ్రామ్య పరముగా నన్వయించినారు.[3] పై శ్లోకములో బూర్వ పాదము పేచ, ఊష అను సంస్కృత ధాతువులకు జెందిన విషయమును జెప్పుచున్నందున నుత్తరార్థము గూడ సంస్కృత శబ్దములకు చెందినదియని చెప్పుట ఉచితము. ఈ లాఘవ ప్రీతిచే నాతడు పెక్కు విషయములను సూచించి వదలినాడు. అందు కొన్ని వెలుగు చూడలేదు. చింతామణి పరిశోధకులు గ్రంథకర్త లాఘవ ప్రీతినిగూడ దృష్టిలో నిడుకొనినచో నా విషయములు బయటపడవచ్చును.

గ్రంథకర్త లాఘవ దృష్టి గ్రంథమును గంభీరమొనర్చినది. దానిని గమనింపని యొకరు 'చింతామణిలో సూత్ర నిర్మాణం శిథిలమైన'దని యాక్షేపించినారు. ఆ విషయమును బరిశీలింతము.

ఆ విమర్శకులు "కేవలం పదమధ్యాజ్లోపం, దాదాపు సమానాకారం, నిర్మాణక్రమం కలిగిన పదాల్లో విధించడంకోసం చింతా

---

1. అందే.
2. అందే సంజ్ఞ. 43 సూ.
3. డాక్టర్ చిలుకూరి నారాయణరావుగారు ఆం. భా. చ. 2 సం. చింతామణీ హృదయము. సంజ్ఞ. చివరి సూత్రము.

మణికర్త అయిదు సూత్రాలు వ్రాశాడు. అందులో 5వ సూత్రం 'అన్యేషాఞ్చ ప్రయోగ మహితానామ్'. పరిధినిబట్టి చూస్తే నిర్నిమిత్తంగా ముందు నిర్మించిన వాటిలో మూటిని తీసివేసినాతరిగేదిలేదు" అని వ్రాసినారు. అంతటితో ఆగక చింతామణి దిఙ్మాత్రముగా లక్షణము చెప్పినదనుచు తెలిపిన పండితుల వాదమును ఖండించుచు 'ఒక చిన్న సందర్భంలో ఇంత విస్తృత సూత్ర నిర్మాణం చేయడం దిఙ్మాత్ర ప్రదర్శన మెలా అవుతుందో వారికే తెలియాలి. ఒక వేళ అక్కడక్కడ చింతామణి లక్షణాల్లో విస్తృతి కొరవడితే అది సూత్రకర్త రచనా ప్రణాళికలో లోపమే అవుతుంది గాని దాన్ని దిక్ప్రదర్శనమనడం విచారాసహమైన మాట". అని వివరించినారు.[1]

'తెలుగు జాతికి వ్యాకరణ మొకటి యిచ్చుటకేయీలోకంలో అవతరించినట్లు' వీరిచే సంభావింపబడిన చిన్నయసూరిగూడ ఇట్లే సూత్రనిర్మాణము చేయుట గమనింపదగినది.

(1) నలడాదే రంతరుతశ్చ (పద మధ్యమున గల న, ల, డ మొదలగు వర్ణములందున్న హ్రస్వోకారమునకు లోపము వికల్పము.)[2] ఆచ్ఛికము లంబద మధ్యంబు నలడరల యుత్వంబునకు లోపంబు బహుళంబుగా నగును.[3]

(2) అన్యేషాఞ్చ ప్రయోగ మహితానామ్'(ఇతర వర్ణములకు గూడ నీ వికల్పలోపము వర్తించును. కాని అవి ప్రయోగ పూజితములు గావలెను.)[4] లాతి యచ్చునకు సహిత మొకానొకచో నుడి

---

1. సం. ప్ర. వ్యాకరణాలు 192, 193 పుటలు.
2. కవిశిరో. సంధి. 43 సూ.
3. బాలవ్యా. ప్రకీర్ణక. 17 సూ.
· కవిశిరో. సంధి. 43 సూ.

నడుమ లోపంబు గానంబడియెడి[1] (3) 'పోశ్చ తదాద్యర్థ వాచకేషూత్వః' (అపుడు మొదలగు వాని పువర్ణోకారమునకు లోపము వికల్పము)[2] 'అబ్బురాదులందుత్వంబునకు లోపంబు విభాషనగు' అబ్బురము, అపుడు, ఇప్పుడు ఎప్పుడు, చప్పుడు, నెత్తురు ఇత్యాదులు.[3]

(4) 'శత్రర్థేతూతశ్చనోః' (శత్రర్థ చువర్ణము పరమయినపుడు నువర్ణోకారమునకు లోపము వికల్పము) (5) 'తస్యాస్యాచ్చపూర్ణ బిందు రపి' (మిగిలిన నకారమునకు బూర్ణబిందువుగూడ వచ్చును.)[4] 'చువర్ణకంబు పరంబగునపుడన్వాదుల కుత్వలోపంబేని ను స్థానంబున బిందువేని విభాషనగు'[5] పైన చింతామణి యందలి మూడు సూత్రములకు బాలవ్యాకరణమున మూడు సూత్రములు వెలసినవి. 4, 5 సంఖ్యగల చింతామణి సూత్రములనొక సూత్రముగ చేసినాడు చిన్నయసూరి. రెండు వాక్యము లొక వాక్యముగా రూపొందెనే కాని విషయమున తగ్గింపు లేదు.

వీరాక్షేపించినట్లు చింతామణిది శిథిల నిర్మాణమయినచో చిన్నయసూరిది గూడ నట్లే కావలసివచ్చును. నందల వత్సరములకు వెనుక, వ్యాకరణము వికాసము నందని కాలమున బయలుదేరిన చింతామణిలో నట్టు కలదనిన బెద్దలోపము కానేరదు. వందల వ్యాకరణములకు పిదప బయలుదేరిన వైయాకరణ సార్వభౌముని కృతిలో నిట్టి రచన పెద్ద లోపమనవలసి వచ్చును.

---

1. బాలవ్యా. ప్రకీర్ణక. 18 సూ.
2. కవిశిరో. సంధి. 18 సూ.
3. చిన్నయ సూరి బాలవ్యా. ప్రకీర్ణక. 19 సూ.
4. కవిశిరో. సంధి. 12, 13 సూ.
5. బాలవ్యా, క్రియ, 60 సూ.

కావున నీ శిథిల నిర్మాణ వాదము సరిగాదు. ఈ విషయమున చింతామణిలోతును చిన్నయసూరి గ్రహించెననియు దానిని మనము గూడ గుర్తింపవలసి యున్నదనియు గ్రహించుట మేలు.

ఇచట చింతామణికర్త ఉద్దేశ్యమేమి? 'చారే రుపధాత్మన శ్చలుగ్వాస్యాత్' (చివర్ణము పరముగా నుండగా ఉపధగానున్న రివర్ణేకారమునకు గూడ వికల్పముగా లోపము వచ్చును.) అను సూత్రముచే 'అమర్చి' మున్నగు చోట్ల ఇకారలోపము సిద్ధించును.[1] అమరు ధాతువునకు ప్రేరణమున చు వర్ణకము చేరగా 'అమరుచు' అయినది. భూత కాలికా సమాపక క్రియ యందు 'అమరిచి' అను రూపమగును. ఇచట రి వర్ణమందున్న 'ఇ' కారము భూతార్థమును దెలుపును. ఇట్టిది లోపించినచో భూతార్థ స్ఫూర్తికి భంగము కలుగును. ఇట్లర్థ స్ఫూర్తికి భంగము కలుగుచున్నందువలననే మొదటి వైయాకరణులు క్త్వార్థేకారమునకు సంధి నంగీకరింపలేదు. కాని స వర్ణము పరమగునపుడర్థము స్ఫురించు చున్నందున, క్వాచిత్కముగా ప్రయోగములు కనబడుచున్నందువలన 'క్వాపి సవర్ణే దృశ్యతే' (ఒకచో సవర్ణము పరమగునపుడు క్త్వార్థంబైన యిత్తునకు గూడ సంధి కనబడుచున్నది.)[2] అని చెప్పికొనిరి. ఇట్టిదే చింతామణి చేసిన యీ విధి. తరువాతి చివర్ణముచే భూతార్థము స్ఫురింపుచున్నందున భూతార్థకేకారముగూడలోపించునని చింతామణి ప్రత్యేకముగా జెప్పుకొనెనన్నమాట.

అమర్చ్వవంటి రూపములు 'నలడాదేరంత ఋతశ్చ' అను సూత్రమున గల ఆది పదముచే సాధింపవచ్చును. ఆది పదముచే 'ముర్వ'

---

1. కవిశిరో. సంధి. 11 సూ.
2. శ్రీ చిన్నయసూరి సంస్కృత సూత్రాంధ్ర వ్యాకరణమ్ సంధి 3 పు.

'దార్వ్వా' ఇత్యాదులలోని రేఫయందున్న ఉకారమున కహోబలపతి గూడ లోపమును జెప్పెను.[1] ఇచట చిన్నయసూరి న, ల, డల తో రేఫను గలిపి నలడరల శత్వంబునకు లోపమును విధించుట గమనింప దగినది.[2] 11వ సూత్రమువ 'అమర్చి' మొదలగువానిని సాధించినాడు. 42 వ సూత్రమున నలడ మున్నగు వానిలోని ఉకారమునకు లోపమును జెప్పినాడు. అమర్చి సాధించినవానికి 'అమర్చు' అను రూపము దృష్టిలో లేదన వీలులేదు. కావున 'నలడాదేః' అను సూత్రము నందలి ఆది పదముచే 'తు' వర్ణమందలి ఉకారమును గ్రంథకర్త ఉద్దేశించెననిపించును.

'శ్రత్ర్థేతూతశ్చ్వనోః' తస్యస్యాచ్చ పూర్ణబిందు రపి' అను సూత్రములు 'అను' మొదలగు ధాతులువులందున్న ఉకారమునకు గూడ లోపము, నకారమునకు బిందువు వచ్చుచున్నందున ప్రత్యేకముగా సూత్రించియుండును. అమర్చి అనుచోట భూతార్థము; ఇచ్చట వర్తమానార్థము. ఇక 'నలడాదే రంత రుతశ్చ' పెక్కు చోట్ల ప్రవర్తించు విధి. అన్యేషాఞ్చ ప్రయోగ మహితానామ్' అనునది క్వాచిత్కముగా వర్తించునది. ఈ భేదమును సూచించుటకు వేరే సూత్ర రచన మవసరముగాదా ? చివరి సూత్రము ఉంగ్రము, కల్కి మొదలగు చోట అకారమునకు, ఇకారమునకు గూడ లోపమును జెప్పెను.

కావున చింతామణి రచన శిథిలమను మాట వాస్తవముగాదు. కాగా మొదట గమనించినట్లు చింతామణి కర్త లాఘవప్రియుడని చెప్పుటలో దోసగు లేదు.

ఆంధ్రశబ్ద చింతామణి సూత్రగ్రంథమా ?

ఏ గ్రంథమునైనను గ్రంథకారుని హృదయమున కనుగుణముగా వివరించుట ఉచితము. అట్లు జరుగని నాడు గ్రంథకారున కభి

---

[1] కవిశిరో. సంధి. 42 సూ.

[2] బాలవ్యా. ప్రకీర్ణక. 18 సూ.

ప్రేతము గాని విషయమును గ్రంథకారాభిప్రాయముగా నారోపించు నిబ్బంది కలదు. ఆంధ్ర శబ్ద చింతామణిలో నట్టి యిబ్బందులు గలిగి నవి. ఆ వ్యాకరణమును సూత్ర రూపముగా భావించుట అట్టివానిలో నొకటి.

సూత్ర పదానికి దారము మొదలగు అర్థములు కలవు. సంజ్ఞ, పరిభాష, విధి, నియమము, ప్రతిషేధము, అధికారము, అతి దేశము అను భేదములు కలిగినది, వ్యాకరణాది శాస్త్రములలో నుండునదియు నగు పద సముదాయమును సూత్రమందురు. చింతామణి యందున్న సూత్రములను పై వానిలో నేదో యొక కోవకు చేర్చుట చాల కష్టము.

శ్లో. స్వస్థాన వేష భాషాభిమతా స్సన్తోరసప్రలుబ్ధధియః
లోకే బహుమన్యన్తే వైకృత కావ్యాని చాన్యదపహాయ

స్వస్థాన వేష భాషాభిమానము కల్గిన పెద్దలు రసలోభముతో నితర కావ్యములను విడచి తెలుగు కావ్యములను గౌరవించు చున్నారు.[1] ఈ సూత్రమున బయిని పేర్కొనబడిన సంజ్ఞా పరిభాషాది లక్షణము లేవియు కనిపించవు. వాక్యమునకు చోదకత్వముండవలెనను పూర్వమీమాంసా శాస్త్ర సంప్రదాయమును మనస్సులో నిడుకొని 'ఇతర కావ్యములను వదలవలెను. తెలుగు కావ్యాలను గౌరవించవలెను' అని నిషేధమును విధిని కల్పించుకొనవలెనని వాదింపవచ్చును. ఆ పక్షమున ఇతర కావ్యములనగా నేమి? అని ప్రశ్న బయలుదేరును. శ్లోకమున వైకృత కావ్యములు పేర్కొనబడినవి కావున తదితరములు సంస్కృత ప్రాకృతములు, ఇతర దేశ్యములు నగును. సంస్కృత ప్రాకృతములను 'ఆద్యప్రకృతిః ప్రకృతిశ్చాద్యే' అని తెలుగుకు ప్రకృతులుగా నంగీకరించిన గ్రంథకర్త వానిని వదలవలెనని చెప్పె

---

1. ప. బాలస. సంజ్ఞ. 5 సూ.

ననుట అసంగతము.[1] కాన ఇతర దేశీయ భాషలను వదలవలెనను నర్థమును జెప్పికొనవలెను. వ్యాఖ్యాతలట్లే చేసిరి.[2] కాని ప్రాప్తి లేనిదే నిషేధముండదు. పూర్వకాలము మనదేశమున గొప్ప భాషా పండితులు సంస్కృతమును షడ్విధ ప్రాకృతములను తమ తమ దేశ భాషలను చదువుకొనెడివారు. అన్యదేశ భాషలను జదువుకొనుట అసాధారణ విషయము. కనుక పై విధి నిషేధములు పై అష్టభాషలలో కొన్నింటికి వర్తించు ననవలసి ఉన్నది. అట్లు చెప్పినచో తెలుగు భాషాభివృద్ధికి దోహదమును జేయు సంస్కృత ప్రాకృతాధ్యయనము నిషేధింపబడినట్లగు ననియు, నది యనుచితమనియు బైని బేర్కొనబడెను. కావున నీ శ్లోకమును విధి నిషేధపరముగా నన్వయింపరాదు. అన్వయింపనిచో నీ శ్లోకమునకు సూత్రలక్షణము వర్తింపదు.

శ్లో. అల్పాక్షర మసందిగ్ధం సారవద్విశ్వతోముఖమ్
అస్తోభ మనవద్యఞ్చ సూత్రం సూత్ర విదో విదుః

(తక్కువ అక్షరములు కలదియు, సందిగ్ధము కానిదియు, సారము గలదియు, విస్తృతి గలదియు, అస్తోభమును, దోషము లేనిదియు నగు దానిని సూత్రమందురు.[3] ఈ లక్షణము పట్టిన దానిని గూడ సూత్రమనవచ్చును. అస్తోభమనగా వ్యర్థపదములు లేనిది. 'అథభూజ్యాదిః పరిణతిః'[4] 'కూర్చలను నయో భవే ద్వితీయాతు'[5] 'ఏ జథోవక్రః'[6] మొదలగు సూత్రాలలో అథ, అథో, తు మున్నగు

---

1. కవిశిరో. సంజ్ఞ. 11 సూ.
2. అందే. 5 సూ. వ్యాఖ్య.
3. శబ్దార్థ కల్పతరువు 1560 పు.
4. కవిశిరో. క్రియ 3 సూ.
5. అందే అజంత. 2 సూ.
6. అందే సంజ్ఞ. 29 సూ.

స్తోభములు కనబడును. ఇందు 'అథో' అనునది పాదపూరణార్థమని తొలుత నహోబలపతి చెప్పెను. సూత్రములలో పాదపూరణ పదముల నంగీకరించుటకు మనసొప్పక కాబోలు మంగళార్థమని కాని, విశేష సంజ్ఞ ప్రారంభమగుచున్నదని కాని తెల్పుచున్నవనెను.[1]

శ్లోకములో పాదపూరణ పదములుండుట సాధారణ విషయము. సూత్రములలో స్తోభము లుండరాదని నిషేధింపబడెను గదా! పదముల కేమి ? మొత్తము సూత్రము వ్యర్థముగా రచింపబడిన సందర్భము గలదు. ఇవన్నియు చింతామణిని సూత్ర రూపముగా భావించినందు వలన కల్గినయిబ్బందులు. శ్లోక రూపముగనే చింతామణి ఉన్నదని అంగీకరించినపుడివి దోషములు కానేరవు. వ్యర్థసూత్రమును జూచెదము. ప్రతి సూత్రమునేదో విశేషమును జెప్పవలెనుగదా! 'స్యాదుపకృతిః కృదన్తా' (ఉపకృతి క్రియ కృత్ప్రత్యయాంత మగును.)[2] 'సాపరిణతి రయవరన్వితైవ భవేత్' (పరిణతి క్రియ అయ్, అవ్, అర్ అను వానితో గూడిన దగును.[3] సంవృతి రహతాకారా' (సంవృతి క్రియ ఆకారము మార్పు చెందదు.)[4] 'జ్ఞేయం త్రివిధాసుచ క్రియాస్వేవమ్' (ఇట్లు మూడు క్రియలయందు నెరుగదగినది)[5] నాలుగు సూత్రములుగా బాలసరస్వతి చేతను, అహోబలపతి చేతను విభజింపబడిన శ్లోకమిది. ఇందు చివరి సూత్రము వలన తెలియదగిన నూతన విషయమేమి ? దీనికి సూత్ర లక్షణ మేవిధముగను వర్తింపదు. ఈ విషయములు చింతామణి సూత్రరూపముగా రచింపబడలేదని వెల్లడించును.

---

[1] కవిశిరో. సంజ్ఞ. 28 సూ. వ్యాఖ్య.

[2] అందే. క్రియ. 5 సూ.

[3] అందే 6 సూ.

[4] అందే 7 సూ.

[5] అందే 8 సూ.

వ్యాఖ్యాతలు దీనిని సూత్ర రూపముగా భావించుట చేత పాణినీయ వ్యాకరణములో నున్న అనువృత్తి, అపకర్షమున్నగు పద్ధతులు దీని యందు ప్రవేశ పెట్టిరి.[1] కొందరు చింతామణి మొదట సూత్రరూపములో నుండెడిదనియు, తరువాత పాదపూరణ పదములను జేర్చుకొని శ్లోకరూపమును ధరించినదనియు నభిప్రాయ పడినారు.[2]

చింతామణిలో అనువృత్తి ఒక్క చోట అవసరమగును.[3] చింతామణి మొదట సూత్ర రచనయే అయినచో సూత్ర లక్షణములతో ఆ స్థాయికి జెందిన గ్రంథములలో నగ్రశ్రేణిలో నిలిచెడిది. కాని గ్రంథకర్త సూత్ర రూపముగా రచింపనందువలననే సూత్ర లక్షణము పట్టుటలేదు. ఈ విషయమును గుర్తింపనిచో 'చింతామణి కర్తకు సూత్రరచన చేయుట చేతకాదని' చెప్పవలసి వచ్చును. గ్రంథకర్త ఉద్దేశించని పద్ధతిలో నాతని గ్రంథమును సూత్రరూపముగా విభజించి, ఆయనకు లోపము నాపాదించు పరిస్థితిని గల్గించుట న్యాయమా?

ఆంధ్ర శబ్ద చింతామణి భాష రమ్యమైనది. చిన్న పదములతో ధారాశుద్ధితో, అక్షర రమ్యతతో నిందలి శ్లోకములు మనోహరముగా

---

[1] అందే సంధి. 10 సూ. వ్యాఖ్య. అందే 7 సూ. వ్యాఖ్య.

[2] ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారు, కాశీభట్ట కృష్ణరాయ శాస్త్రిగారు ఇట్లభిప్రాయపడిరి. ఆచార్య అమరేశం రాజేశ్వర శర్మగారు, కవిశిరో. ఉపక్రమణిక ఆం. ర.సం. (1965), 33 పు.

[3] ఏకత్రైధ (కవి శిరో. క్రియ .81 శ్లో.) అను శ్లోకమునుండి 'తద్ధర్మే' 'భూతార్థే' అను పదములు తరువాతి శ్లోకములోని కన్వయింప వలసిన అవసరమున్నది. ఈ ఒక్క సందర్భము కొఱకు మొత్తము చింతామణిలో ననువృత్తి పద్ధతి నంగీకరించుట కంటె నీ ఒక్క చోట పూర్వ శ్లోక సందర్భమును బట్టి ఆ పదములధ్యాహార్యము లని చెప్పుట ఉచితము.

నుండును. అలతి అలతి పదములతో రచన సాగుటచే ఆ శ్లోకములు సూత్రగర్భితములనిపించును. ఆయన సూత్రరచననే ఉద్దేశించినచో ఆంధ్రకౌముది కంటె వైకృత చంద్రిక కంటె ముందే మనకొక సూత్రాంధ్ర వ్యాకరణము లభించియుండెడిది. అతనికా ఉద్దేశ్యము లేనందువలననే చింతామణిలోని సగము శ్లోకములకు సూత్రలక్షణము పట్టదు.

చింతామణి సూత్రరూపములో వ్రాయ లేదనుటకు క్రింది విషయములుగూడ ప్రమాణము లగును. ఆంధ్రశబ్ద చింతామణిని వ్యాఖ్యానించిన వారిలో బాల సరస్వతి, అప్పకవి, అహోబలపతి వేరు వేరు తీరులలో సూత్ర విభజనము చేసిరి. గ్రంథకర్త సూత్ర విభజనము నుద్దేశించినచో ముగ్గురు పండిత వ్యాఖ్యాతలకు విభజన విషయములో విశేష భేదము వచ్చు నవకాశము గల్గదు.

బాలసరస్వతి విభజనము

హావిళ్ళవారి బాల సరస్వతీయ చింతామణిలో 88 ఆర్యలు కలవు. అందు మొత్తము సూత్రములు 258. వానిలో శ్లోక సూత్రములు 13, అర్ధశ్లోక సూత్రములు 67, అనగా 33 1/2 శ్లోకములన్న మాట.

13 + 33 1/2 = 46 1/2: 88-46 1/2 = 41 1/2 ఇవి చిన్న సూత్రములుగా విభజింపబడిన శ్లోకములు. వీనిలో నాల్గొక్కొక్క శ్లోకము 6, 4, 5, 3 సూత్రములుగా విభజింపబడినవి.

పరిషత్తు వారి బాల సరస్వతీయ చింతామణిలో మొత్తము 87 1/2 ఆర్యలున్నవి. ఇవి 254 సూత్రములుగా విభజింపబడినవి. వీనిలో రెండు శ్లోకములెన్ని సూత్రములుగా విభజింపవలెనో బాల సరస్వతి చెప్పలేను. కాని అతడర్థము వ్రాసిన తీరును బట్టి అతడు

చేసిన విభజనను గ్రహింపవచ్చును.[1] ఇందలి చెందుర్తి ప్రతికి కృష్ణపురాగ్రహార (నెం. 4095) ప్రతికి సూత్రవిభజమున భేదమున్నది. క్రియా పరిచ్ఛేదమునందలి 15వ శ్లోకము చెందుర్తి ప్రతిలో 4 సూత్రములుగను, కృష్ణాపురాగ్రహార ప్రతిలో 3 సూత్రములుగను విభజింపబడెను. అట్లే 14వ శ్లోకము చెందుర్తి ప్రతిలో 4 సూత్రములుగను కృష్ణాపురాగ్రహార ప్రతిలో 3 సూత్రములుగను విభజింపబడెను. ఈ పరిషత్తు బాలసరస్వతీయ ప్రతిలో 2 శ్లోకముల సూత్రము గూడనున్నది.[2]

అప్పకవి విభజనము

అప్పకవికి దొరకినవి 32 శ్లోకములని యతడు చెప్పెను.[3] కాని అతడు వ్యాఖ్యానించిన శ్లోకములు 44 మాత్రమే. అవియే అప్పకవీయ చింతామణిలో నిపుడు దొరకుచున్నవి. అందు

	సూత్రములు	శ్లోకాలు
రెండు శ్లోకముల సూత్రములు	2	4
శ్లోక సూత్రములు	16	16
అర్ధశ్లోక సూత్రములు	29	14 1/2
త్రిపాది సూత్రము	1	3/4
మొత్తము	48	35 1/4

---

1. ప.బాలస. హలంత. 13 శ్లో. ఇందు గ్రంథపాతము గలుగుటచే నీ శ్లోకము నెన్ని సూత్రములుగా విభజించెనో తెలియదు. దీని నహోబలపత్యాదులు 2 సూత్రములుగా విభజించిరి. ప.బాలస. సంధి. 4 శ్లో. దీనినెన్ని సూత్రములుగా విభజింపవలెనో బాలసరస్వతి చెప్పలేదు. కాని మూడుగా విభజించి అర్థమును చెప్పెను.
2. ప.బాలస. అజంత. 1, 2 శ్లోకాలు
3. అప్పకవీయ పీఠిక 65-ప.

అప్పకవీయములో మొత్తం 87 సూత్రములున్నవి. అందులో పైన పేర్కొనబడిన

పెద్ద సూత్రముల శ్లోకములు	35 1/4
చిన్న సూత్రములుగా విభజింపబడిన శ్లోకములు	8 3/4
మొత్తము శ్లోకములు	44

కవిశిరోభూషణ విభజనము

'మయాప్రాయ స్సరస్వత్యాః పుస్తకం పరిగృహ్యతే'(నా చేత తరచుగా బాలసరస్వతి పుస్తకమే గ్రహింపబడుచున్నది.) [1] అని అహోబలపతి చెప్పుకొనెను. కావున కవిశిరోభూషణ బాలసరస్వతీయములలో శ్లోక సంఖ్య ఒకే తీరుగా నుండు ననిపించును కాని బాలసరస్వతీయ చింతామణిలో లేని విశేషములను దెల్పు నప్పకవీయ చింతామణి శ్లోకములను కొన్నింటి నహోబలపతి గ్రహించెను.

శ్లో. అప్పార్వ్య పుస్తకాగూఢ పాఠ భేదాద్యదుత్థితమ్
మయా సంగృహ్యతే రూపం తదప్యాథర్వణోక్తితః

అప్పకవీయ చింతామణి పాఠముల వలన దెలియు విశేషాంశములు అథర్వణ కారికల ద్వారమున సంగ్రహింతును. [2] అని అహోబలపతి చెప్పుకొనెను. కాని వికృతి వివేకములో లేని విశేషములు కొన్ని అప్పకవీయ చింతామణిలో నున్నవి. వానికి ప్రత్యేక శ్లోక సంఖ్య ఇవ్వక సూత్ర విభజనము చేయక అహోబలవతి సంగ్రహ వివరణమును జేసెను. వానిలో లిప్యుద్ధారక శ్లోకములు 3, యతి, ప్రాస, గణములను గురించి చెప్పునవి - 6, గురులఘువులను గురించి చెప్పునది - 1, మొత్తము 10 శ్లోకములు - ఇవిగాక బాలసరస్వతి

---

1. కవిశిరో. కృత్యాది 72 శ్లో.
2. కవిశిరో. కృత్యాది 73 శ్లో.

స్వయముగా వ్రాసికొనిన ప్రతిలో నున్నట్లు చెప్పబడిన 'శాస్త్ర మపౌరుష మాద్యమ్' అను శ్లోకమునకు గూడ శ్లోక సంఖ్యలేదు.[1] ఇది ఒక ప్రతిలో మాత్రమే ఉన్నది. ఇక అహోబలపతి సూత్ర విభజనము. 88 ఆర్యలలో

	సూత్రములు	శ్లోకములు
సార్ధశ్లోక సూత్రము	1	1 1/2
సపాదశ్లోక సూత్రము	1	1 1/2
శ్లోక సూత్రములు	8	8
అర్ధశ్లోక సూత్రములు	66	33
త్రిపాది	2	1 1/2
2 వర్ణములు తక్కువ అర్ధశ్లోకము	1	1/2
మొత్తము	79	48 3/4

మొత్తము శ్లోకములు 88	
పెద్దసూత్రములు గల శ్లోకములు	45 3/4
చిన్న సూత్రములుగా విభజింపబడిన శ్లోకములు	42 1/4
కవి శిరోభూషణములో మొత్తము సూత్రములు	271
ప. బాలసరస్వతీయ సూత్రములు	254
కవి శిరోభూషణములో నధికముగా నున్నవి	17

ఒకేపాఠమును బరిగ్రహించిన బాల సరస్వత్యహోబలపతులలో నీ భేదమేల వచ్చెను ? బాల సరస్వతి ఒక సూత్రముగా భావించిన దాని నహోబలపతి రెండు సూత్రములుగా కొన్నిచోట్ల భావించెనన్న మాట. బాలసరస్వతి విభజనము కంటె నహోబలపతి విభజనము చాల చోట్ల సముచితముగా గన్పడును. ఉ :-'ఆద్యాయాః' అను

---

[1] కవిశిరో. సంజ్ఞ. 11 సూ. వ్యాఖ్య.

శ్లోకమును బాలసరస్వతి రెండు సూత్రములుగా విభజించెను.[1] దీని నహోబలపతి 4 సూత్రములుగా జేసెను.[2]

ఆద్యాయాః పఞ్చాశద్వర్ణాః[3]
సంస్కృతమునకు వర్ణము లేబది[4]
ప్రకృతేస్తు తేదశోనాస్స్యుః[5]
ప్రాకృతమునకు వర్ణములు నలువది[6]

షట్త్రింశదతః[7] తెలుగునకు నర్ణములు ముప్పదియారు[8] తేన్యైచాను ప్రవిశత్తి శబ్దయోగ వశాత్[9] ఋ ౠ ఌ ౡ విసర్గ ఖ, చ, ఠ, థ, ఫ ఘ ఝ ఢ ధ భ ఙ ఞ శషలు సంస్కృత సమంబులంగూడి తెలుగున వ్యవహరింపబడు.[10]

ఇందు మొదట చింతామణి సూత్రములు, తరువాత బాల వ్యాకరణ సూత్రములు నుదాహరింప బడినవి. సూరి అహోబలపతి విభజనమునే యనుసరించె ననుట స్పష్టము. విషయ భేదము కలదు గాన భిన్న సూత్రములుగా గణించుట న్యాయ్యము. ఇట్టివి చాలకలవు.

---

1. ప. బాలస. సంఖ్య 4 శ్లో.
2. కవిశిరో. సంజ్ఞ. 12, 13, 14, 15 సూ.
3. కవిశిరో. సంజ్ఞ. 12 సూ.
4. బాలవ్యా. సంజ్ఞ. 1 సూ.
5. కవిశిరో. సంజ్ఞ. 13 సూ.
6. బాలవ్యా. సంజ్ఞ. 2 సూ.
7, కవిశిరో. 14 సూ.
8. బాలవ్యా. సంజ్ఞ. 3 సూ.
9. కవిశిరో. సంజ్ఞ. 15 సూ.
10. బాలవ్యా. సంజ్ఞ. 4 సూ.

సూత్ర లక్షణాలలో ‘అల్పాక్షరమ్’ అనునదొకటి. అనగా సూత్రము చిన్నదిగా నుండవలెనని కదా ! చింతామణిలో చిన్న సూత్రాలుగా విభజింపబడిన శ్లోకముల కంటె పెద్ద సూత్రములుగా విభజింపబడినవే యెక్కువ అని పైన తెలిసికొంటిమి.

మఱియొక మాట. అప్పకవి ప్రథమాశ్వాసాదిలో 6 చింతామణి శ్లోకములు వ్రాసి ‘ఈశ్లోకము లాఱునుం బంద్రెండు సూత్రంబులయ్యె’ అని తెలిపినాడు.[1] కాని ఆయాశ్వాసములో 14 సూత్రములు కనబడును. అనగా నాదిలో సర్వశ్లోక సూత్రములను చేయ దలచి యుండును. చినరకా అభిప్రాయము మారి 14 సూత్రములను చేసెనన్నమాట. తాటాకు పుస్తకములలో పూర్వోత్తర వైరుధ్యములను సవరించుకొనుట సామాన్యమైన పనికాదు. పై ముగ్గురిలో చివరివాడహోబలపతి యైనను కొన్నిచోట్ల అప్పకవి విభజనమేఉచితముగా నుండును.

శ్లో. తజ్జా సమాచ దేశ్యా గ్రామ్యాచేయం చతుర్విధా భవతి
ప్రకృతి ద్వయజాతజ్జాతుల్యాతు సమాప్రవాహినీ దేశ్యా [2]

ఈశ్లోకము నహోబలపతి, బాల సరస్వతి ఒక సూత్రముగా లెక్కించిరి. ఆప్పకవి యిందలి ప్రథమార్ధము నొక సూత్రముగా జేసి ద్వితీయార్ధమును మూడు సూత్రములుగా జేసెను. వానిని చిన్నయసూరి గ్రహించెను. ‘తజ్జా సమాచ దేశ్యాగ్రామ్యా చేయంచతుర్విధా భవతి’

‘ఈ భాష తత్సమంబు తద్భవంబు దేశ్యంబు గ్రామ్యంబునా నలు విధంబులం బరగు’ [3]

1, అప్పక. 1 ఆశ్వా. 3వ పద్యమునకు దరువాత
2. కవిశిరో. సంజ్ఞ. 42 సూ.
3. శబ్ద లక్షణ సంగ్రహము సంజ్ఞ. 36 సూ.

'తుల్యాతుసమా' ప్రకృతి ద్వయ తుల్యంబు తత్సమంబు [1]
'ప్రకృతి ద్వయజా తజ్జా' తజ్జాతంబు తద్భవంబు [2]
'ప్రవాహినీ దేశ్యా' ప్రవాహ సిద్ధంబు దేశ్యంబు [3]

చిన్నయసూరి అప్పకవి దారినే యవలంబించుట గమనింపదగినది. [4] విషయ భిన్నత ఉన్నందున సూత్ర భిన్నత నంగీకరించుట ఉచితమే, అట్లు చేయనిచో సూత్ర విభజన ప్రయోజనమేమి ?

వింత సూత్ర విభజనము :

చింతామణిలోని సూత్ర విభజనమున రెండు శ్లోకముల సూత్రములు [4] సార్ధశ్లోక సూత్రములు [5] సపాద శ్లోక సూత్రములు,[6] త్రిపాది సూత్రములు, [7] రెండక్షరములు తక్కువగా నున్న అర్ధశ్లోక సూత్రములు, [8] పాద సూత్రములు, [9] పాదార్ధ సూత్రములు, [10] కూడ కలవు.

---

1. అందే 37 సూ.
2. అందే 38 సూ.
3. అందే 59 సూ.
4. అప్పక. 1 ఆ. 8 సూ.
5. ప. బాలస. అజన్త. 1 సూ.
6. కవిశిరో. సంజ్ఞ. 40 సూ.
7, అందే హలంత. 43 సూ.
8, అందే 21 సూ.
9. అందే క్రియ. 13 సూ.
10. బాలస. సంజ్ఞ. వావిళ్ళ ప్రతి 1, 2, 3, 4 సూ.
11. అందే 26, 27 సూ.

సందిగ్ధ సూత్ర విభజన :

కొన్ని చోటులందు భిన్న విషయములను విధించు సూత్రములకు ఏకాన్వయ ముండును. వావిళ్ళవారి బాల సరస్వతీయ ప్రతిలో అట్టివాని నొకచోట వ్రాసి వ్యాఖ్యానించి భిన్నసూత్రములుగా లెక్కించుట జరిగినది. 'నాన్యేషాం వైధర్మ్యం లఘ్వలఘూనాం రయోస్తు నిత్యం స్యాత్' ఇవి రెండు సూత్రములుగా లెక్కింప బడినవి. ఒకచోటనే వ్యాఖ్యానింప బడినవి.[1] వీని నొక సూత్రముగనే లెక్కించిన వా డహోబలపతి. పరిషత్తువారి బాలసరస్వతీయ ప్రతిలో ఏ శ్లోకము నెన్ని సూత్రములుగా జేయవచ్చునో చెప్ప బడెను గాని సూత్రములకు విడిగా సంఖ్యనిచ్చుటగాని సూత్రములను విడిగా చూపుటగాని జరుగలేదు.

బాలసరస్వతికి, అహోబలపతికిని తెగని సందిగ్ధ విభక్త సూత్రములుగూడ నున్నవి. 'ఉర్ద్వంద్వేరః క్వచిద్గకారోపః' అనువానిని వీరిద్దరును రెండు సూత్రములుగనే లెక్కించిరి. బాల సరస్వతి 'క్వచిచ్ఛబ్దమును పూర్వసూత్రములోని కన్వయించి, 'కొందరీ 'క్వచిచ్ఛబ్దము నుత్తరమునకే యన్వయించు కొందురు' అని వ్రాసెను.[2]

అహోబలపతి 'క్వచిత్' ను ఉత్తర సూత్రముతో గలిపి విభజించి 'క్వచిద్గ్రహణస్య ఉభయత్రాప్యన్వయే మాతా పితృబుద్ధి సీత మదిలో నెంతున్ ఇత్యాది రూపాంతరం సిద్ధ్యతి' (క్వచిచ్ఛబ్దమును రెండు సూత్రములలోనికి నన్వయించిన యెడల 'మాతాపితృబుద్ధి సీత మదిలో నెంతున్' మొదలగు రూపాంతరములు సిద్ధించును) అని వ్రాసెను.[3] క్వచిచ్ఛబ్దము నుభయ సూత్రములలోనికి నన్వ

---

1. బాలస. సంజ్ఞ. వావిళ్ళప్రతి 19, 20 సూ.
2. ప. బాలస. అజంత. 16 శ్లో. వ్యాఖ్య.
3. కవిశిరో, అజంత. 66 సూ. వ్యాఖ్య.

యించు నుద్దేశ్య మీతని కున్నచో మొదట పూర్వ సూత్రములోని కన్వయించి, తరువాతి సూత్రమున కనువృత్తి తెచ్చుకొనవచ్చును. అట్లు చేయక మొదట పూర్వసూత్రములోని కన్వయించి, తరువాత 'రెండు సూత్రములలోని కన్వయించిన యెడల' అని వ్రాయుటచే నీతని కీ సూత్ర విభజనమున నిశ్చయ జ్ఞానము కలదనుటకు సంశయము గల్గుచున్నది.

సపాద శ్లోక సూత్ర విభజనమును బరిశీలింతము.

శ్లో. ద్విగుకర్మధారయా తత్పురుష ద్వంద్వా బహువ్రీహిః
అన్యేచ కేచి దుపమానోత్తరపద లోప రూపకాఖ్యాద్యాః. [1]

ఇది ఒక శ్లోకము. 'పరిదృశ్యా ఇహ కార్యాఔపవిభక్తిక వదంత విధయశ్చ' ఇది తరువాతి శ్లోకములోని భాగము. [2] అహోబలపతి "ద్విగుకర్మధారయా... రూపకాఖ్యాద్యాః పరిదృశ్యా ఇహ" వరకు నొక సూత్రముగా విభజించెను. [3]

పై సూత్రములో 'పరిదృశ్యాః' లేకపోయినను 'సత్రి' అధ్యాహారము చేసికొనవచ్చును. 'ఇహపరిదృశ్యా అత్ర విధయశ్చ ఔపవిభక్తిక వత్కార్యాః' అని ఉత్తర సూత్రములోనికి 'పరిదృశ్యాఇహ' అనుదాని నన్వయింపవచ్చును. గ్రన్థకారుడు అంత విధులను ప్రత్యేకించి ప్రదర్శించలేదు, గనుక మహాకవి ప్రయోగములలో కన్పించు వానిని గ్రహింపవచ్చునని అభ్యనుజ్ఞ ఇచ్చెనని చెప్పవచ్చును. ప్రయోగము లేకుండ క్రొత్త సమాసాంత విధులను గల్పించుట కెవరు నంగీకరింపరు గదా !

---

1. ప. బాలస. హలన్త. 16 శ్లో.
2. అందే 17 శ్లో.
3. కవిశిరో. హలన్త. 42 సూ.

కొన్నిచోట్ల బాలసరస్వతి విభజనమే సముచితముగా కనబడును. 'నిరమో మహతాం లుక్చస్యాత్' అనువానిని బాలసరస్వతి రెండు సూత్రములుగా గణించెను.[1] మహద్వాచకముల ద్వితీయైక వచనమునకు నివర్ణకమును విధించునది మొదటి సూత్రము. దానికి లోపము విధించునది రెండవ సూత్రము. ఈ విధి లోపములకు వేరు వేరు సూత్రములుండుట ఉచితమే యన్పించును. కాని యహోబలపతి వీని నొక సూత్రముగనే లెక్కించెను.[2] వికృతి వివేకము 'మహత్తో మస్తునిర్లుక్స్యాత్' అని యీ విధి లోపములను గలిపి చెప్పుటచే ఆకారిక నీ సూత్రము నొద్ద వివరింపదలచి యీ రెండింటి నీతడు కలిపి యుండును.[3] 'వికృతౌత్వచిచ్చ లోపో మోః' 'దీర్ఘశ్చాత ఆదిమస్య భవేత్' (తెలుగున ఒకచో మువర్ణమునకు లోపము వచ్చును. ఆ మువర్ణమునకు ముందుండు అకారమునకు దీర్ఘము వికల్పముగా వచ్చును.) అనువానిని బాలసరస్వతి రెండు సూత్రములగను, అహోబలపతి ఒక సూత్రముగను లెక్కించిరి.[4] ఇచట విధులు రెండు గనుక రెండు సూత్రములగును. పూర్వసూత్రావసర ముత్తర సూత్రమునకు నుండుటచే ఒక సూత్రము గూడ నగును. పై పరిశీలనమువలన దేలిన సారాంశ మిది.

ఆంధ్రశబ్ద చింతామణిలో వ్యాఖ్యాతలచే సూత్రములుగా గణింపబడిన పెక్కింటికి సూత్ర లక్షణము పట్టదు. చింతామణి వ్యాఖ్యాతలు చేసిన విభజనములో ఏకరూపత లేదు. ఒక్కొక్కచోట ఒక్కొక్కరి విభజన ముచితముగా కన్పడును. చింతామణిలోని

---

1. ప. బాలస. అజంత. 5 శ్లో. వ్యాఖ్య.
2. కవిశిరో. అజంత. 16 సూ.
3. అందే వ్యాఖ్యలో.
4. ప. బాలస. అజంత. 10 శ్లో. వ్యాఖ్య. కవిశిరో. అజంత. 42 సూ.

సూత్రవిభజన మొక పద్ధతికి లోబడిలేదు. కొన్ని సూత్రాలను ఎక్కడికి విభజించవలెనను విషయము వ్యాఖ్యాతలకు సందిగ్ధముగా కన్పట్టును. కనుక ఆంధ్రశబ్ద చింతామణి శ్లోకరూపములో వ్రాయబడినదనియు, అలతి పదములతో నున్న ఆరచనను చూచి, వ్యాఖ్యాన సౌలభ్యముకోరి వ్యాఖ్యాతలు దానిని సూత్రరూపములో విభజించిరనియు, కాని గ్రంథకర్త దానిని సూత్రగ్రంథముగా నుద్దేశింపలేదనియు చెప్పవలెను.

ఇది సంస్కృత సమ సాధన ప్రవణము గాదా ?

చింతామణి సంస్కృత శబ్దములను దెనుగులోనికి దెచ్చుకొనెడు పద్ధతులను మాత్రమే ప్రధానముగా నుపదేశించునని కళాప్రపూర్ణ వఝుల చిన సీతారామస్వామి శాస్త్రిగారు వ్రాసినారు.[1] కొందరు అది అట్టిది కాదని ఖండించినారు.[2] ఇందేది సత్యమో తెలియవలెను.

సంజ్ఞావిధులు వ్యాకరణమున వ్యవహార సౌకర్యము కొరకేర్పరచుకొనునవి. వానికి తత్సమ దేశ్య విభేదము సామాన్యముగా నుండదు. తెనుగున సంధి విధులు గూడ తత్సమ దేశ్యములకు రెంటికి వర్తించునవగుటచే వానిని బట్టికూడ గ్రంథము తత్సమ ప్రవణమా ? కాదా ? అని నిరూపించుటకు వీలులేదు. ఇక అజంత హలంత క్రియా పరిచ్ఛేదముల ద్వారా యీ విషయము నిర్ణయము చేయవలెను.

అజంతమునకు చివర

వికృతౌ సర్వే శబ్దాః క్లీబ సమాః స్త్రీ సమాశ్చ నాన్యే స్యుః
క్లీబసమా అమహద్వత్ స్త్రీవత్స్యుః స్త్రీసమాః సమాస్తు సమాః

---

[1] ఆం. చిం. వి. పరిశోధనము 48 పుట.

[2] ఆం. భా. చ. 2 సం. చింతామణీ హృదయము 1678 పుట.

(అచ్చ తెలుగువ అన్ని శబ్దములు క్లీబసమములు స్త్రీసమములు పుంలింగ సమములు నయి యున్నవి. క్లీబసమములు అమహద్వాచకములవలెను, స్త్రీ సమములు స్త్రీవాచకముల వలెను,) పుంలింగ సమములు పుం వాచకముల వలెను కార్యముల నందును.[1] అను కార్యాతిదేశ విధి యున్నది.[2] దీనిచే చింతామణి కర్త మహదమహద్వాచకములకు జెప్పిన విధులను దేశ్యపదముల కతిదేశించుచున్నాడు. ఈ అతిదేశమువలన నతడు మహదమహత్సంజ్ఞలను సంస్కృత సమములకు విధించెననియు, మహదమహత్తులకు విధించిన విధులను గూడ సంస్కృత సమముల నుద్దేశించియే విధించెననియు స్పష్ట మగుచున్నది. ఈ అతిదేశమే అజంత హలంత పరిచ్ఛేదముల లోని అజంత హలంత విధులు సంస్కృత సమములకు సంబంధించినవని తెలుపుచున్నది.

క్రియా పరిచ్ఛేదము చివర 'అత్వాది తత్సమానా మివ దేశ్యానాం క్రియా పదానాంచ వర్ణాగమో విశేషః పురుషేష్వర్థేషు చాపి వచనేషు' (అత్వము మొదలగువవి తత్సమ క్రియలకు వలెనే దేశ్య క్రియలకు వర్తించును. దేశ్య క్రియ లందు ప్రథమాది పురుష లందు తద్ధర్మాద్యర్థములందు ఏకాది వచనములందు వర్ణాగమము విశేషము.)[3] అని తత్సమ క్రియలకు విధింపబడిన అత్వాదులను దేశ్య క్రియలకు గూడ అతి దేశించి దేశ్య క్రియలకు గలుగు విశేషమును సూచించెను. ఈ యతిదేశము చింతామణిలో క్రియాపరిచ్ఛేద మందలి

---

1. కవిశిరో. అజంత. 82, 33, 84; 85 సూ.
2. ఇచట వతి ప్రత్యయము ప్రయోగించబడుటచే నిది కార్యాతిదేశ విధి యని చెప్పవలెను. 'తేన తుల్యం క్రియాచేద్వతిః' సిద్ధాంత కౌముది (1778 సూ.) ఈ విషయము 'వికృతౌ సర్వే శబ్దాః' అను వ్యాసమున విస్తరముగా తెలుపబడినది.
3. కవిశిరో. క్రియ. 50, 51 సూ.

విధులు మొదట తత్సమక్రియల నుద్దేశించి బయలు దేరినవని స్పష్టపరచును.

ఇట్లు సంస్కృత శబ్దములను దత్సమములుగా జేయు పద్ధతిని ప్రధానముగా స్వీకరించిన వాడగుటచే చింతామణికర్త సంస్కృత వైయాకరణులు విధించిన సు ఔ జస్ మొదలగు నామ విభక్తులను తాను గ్రహించి వానికే డుమువులు మొదలగు తెలుగు విభక్తులను విధించినాడు.[2]

చింతామణి కర్త 'సర్వ విభక్తి స్సంస్కృత తుల్యా' (అన్ని విభక్తులు సంస్కృతముతో తుల్యములు) అని సంస్కృత కారక పద్ధతిని గ్రహించి దానికి 'అన్యస్యాః క్వచిద్భవేచ్చాన్యా' (ఒకచోనొక విభక్తికి వేఱొక విభక్తి వచ్చుట గలదు.) అని తెలుగునకు గల ప్రత్యేక కారక పద్ధతిని సూచించెను.[3]

ఇట్లాంధ్రశబ్ద చింతామణిలో సాధింపబడిన పద జాలములో ప్రధానమన దగిన అజంత హలంత శబ్దములందు, క్రియా పదములందు తత్సమ పదములను సాధించి ఆ విధులనే దేశ్యములకు గూడ నన్వయించుటచేత, సంస్కృత విభక్తుల నంగీకరించి దానికి తెనుగు విభక్తులను విధించుటచేత, తాను సాధించిన (తత్సమ) భాషకు సంస్కృత కారక విధితో తుల్యమైన కారక విధి గలదని చెప్పి తరువాత తెనుగునకు గల కారక విధిని సూచన మాత్రముగా జెప్పుటచేత చింతామణి తత్సమ శబ్దములను ప్రధానముగా సాధింప దలచినదని స్పష్టముగా తెలియుచున్నది. అట్లని దేశ్య శబ్దముల విషయ మిందు విడువబడినదని చెప్పుటకు వీలులేదు. ఈ విధులను దేశ్య శబ్దముల కతిదేశించుట

---

1. 'మహత స్సోర్ద్ధు జసతో భవే త్పుంసి' మొదలగునవి.
కవిశిరో. అజంత. 12 సూ.

2. అందే హలంత. 40. 41 సూ.

చేతనే వానిని గూడ సాధించినట్లైనది గదా! అది గాక దేశ్య సర్వనామ సాధన మొదలగు కొన్ని ఆచ్ఛిక విషయములు చింతామణిలో లేకపోలేదు.

మఱి దీనిని సంస్కృత సమ సాధన ప్రవణముగా జెప్పుటెందులకు? అని ప్రశ్న. గ్రంథకర్త ఉద్దేశ్యమును గ్రంథరచనా విధానమును గుర్తించుట కని సమాధానము. సంస్కృత పండితులకు తెలుగుపై సద్భావము నేర్పరచుటకు, సంస్కృత పద జాలమును తెలుగు లోనికి నధికముగా దెచ్చుకొనుటకు మార్గములను సంస్కృత ప్రాకృత వ్యాకరణ రీతులలో సంస్కృత భాషలో నుపదేశించిన ఆంధ్రశబ్దచింతామణి సంస్కృత సమముల సాధించు పద్ధతుల నధికముగా జెప్పుటలో ననౌచిత్యము లేదు గదా! కావున సంస్కృత సమములను సాధించి ఆ విధులను దేశ్యములకు గూడ నతిదేశించిన చింతామణి ప్రధానముగా సంస్కృత సమములను సాధించినదని చెప్పుటలో సంశయము లేదు.

ఈ చింతామణి మార్గమును సరిగా గమనింపకుండుటచే నొకరు చింతామణి సూత్రములలో సమేతర భాషకు చెందినవి 76, కేవలము సమభాషకు చెందినవి 47, ఉభయమునకు జెందినవి 132 అని తెల్పి ఇది ప్రధానముగా సంస్కృత సమశబ్దములను సాధించునదను వాదము ఖండింపజూచిరి.[1] కాని ఉభయమునకు జెందిన 132 సూత్రములు సంస్కృత సమముల నుద్దేశించి రచింపబడి పిదప దేశ్య శబ్దముల కతిదేశింపబడినవి. ఈ అతిదేశము వలన సంస్కృత సమశబ్దములకు దేశ్యములకు వర్తించు విధులు చెప్పినట్లయినను కేవలము దేశ్యములకు వర్తించు పెక్కు విషయములు చెప్పినట్లు కానేరదు. కావున చింతామణి సంస్కృత సమశబ్దములను ప్రధానముగా జేసికొని రచింపబడినదనుటలో సంశయము లేదు.

---

[1] సం. ప్ర. వ్యాకరణాలు 72 పుట.

అతి దేశ పదమునకు 'అన్యత్రశ్రుతస్యాన్యత్రాన్వయే' (ఒకచో వినబడిన దానిని మరొకచో అన్వయించుట.) అని నైఘంటికు లర్థమును చెప్పినారు.[1] దానినిచట అన్వయించినచో చింతామణి కర్త సంస్కృత సమ పదములకు జెప్పబడిన విధులను దేశ్య పదముల కన్వయించెనని చెప్పవలెను.

ఒకరీ చింతామణి దృష్టిని గుర్తింపక సంస్కృత పదములకు విభజించిన కార్యములను దేశ్య శబ్దముల కతిదేశించుట చింతామణి రచనా ప్రణాళికలోనే లోపము వలన జరిగినదనియు, తాను విధించు విధులు తత్సమములకే వర్తించుచున్నట్లు చింతామణికర్త పరిచ్ఛేదము చివరకు వచ్చిన తరువాతగాని గమనించలేదనియు నూహించినారు.[2] కాని చింతామణి సంస్కృత సమములను ప్రధానముగా సాధింపదలచె ననుటకీ క్రింది విషయములు ప్రమాణములగును.

(అ) సంస్కృత కారకములకు, విభక్తి ప్రత్యయములకు దెనుగు విభక్తుల నాదేశముగా విధించుట.

(ఆ) సంస్కృత కారకములను దెనుగున విస్తృతముగా జెప్పి తెనుగునకుసహజమగు కారకపద్ధతిని 'అన్యస్యాః క్వచిద్భవేచ్చాన్యా' (ఒకచో నొక విభక్తికి వేరొక విభక్తియు గలుగును.)[3] అని సంగ్రహముగా సూచించుట,

(ఇ) తత్సమ సాధనమున అజంత పరిచ్ఛేదమున సంస్కృత వ్యాకరణము నందువలెనే ఆకారేకారోకారాంతములను సాధించుటయేకాక విధాత్రాదులు, సురాదులు, ఘకాదులు, రై,

---

1. బాలామర శ్రీ మామిడి వెంకటార్యులు శబ్దార్థ కల్పతరువు 116 పుట.
2. సం. ప్ర. వ్యాకరణాలు 304, 305 పుటలు.
3. కవిశిరో. హలంత. 40, 41 సూ.

స్వా, భూ, దివ్, శబ్దముల నెత్తుకొని వరుసలో సాధించుట, చివర తెలుగు శబ్దములను సంస్కృత సమముల వలె సాధించుకొనవలెనని కార్యాతి దేశము చేయుట.

(ఈ) హలంత పరిచ్ఛేదమునగూడ దేశ్యవిధులను చివర నతి స్వల్పముగా జెప్పుటకు మొదట అగుణవత్ప్రభృతి, గుణవద్గణము, ఆత్మన్, ఇమన్ (ఇమనిచ్) ప్రత్యయాంతములు, రాజన్, అపయః ప్రభృతులు అని సంస్కృత సమపదముల నెత్తికొని సాధించుట, తరువాతనే దేశ్యవిధులను జెప్పుట.

(ఉ) క్రియా పరిచ్ఛేదమున గూడ ఉపకృతి, పరిణతి సంవృతి అని సంస్కృత ధాతువులకు సంబంధించు పద్ధతిలోనే రూపసాధనము నారంభించి చిట్టచివర నీ పద్ధతులలో దేశ్య ధాతువులను గూడ చేసికొనుడని యతిదేశించుట.

ఈ విషయములను బరిశీలింపగా చింతామణి కర్త దృష్టి సంస్కృత సమసాధనమును బ్రధానముగానిడుకొన్నదనియు, నానుషంగికముగా దేశ్య పదజాలమును గూడ సాధించిన దనియు చెప్పక తప్పదు.

తెలుగున కపభ్రంశ వ్యవహారము

ఆంధ్రశబ్దచింతామణిలో 'అనియమాద్గ్రామ్యంహి యత్త్వపభ్రంశః'[1]

(నియమము లేక పోవుటచే గ్రామ్యమగును; ఏది యపభ్రంశమో) అని చెప్పబడెను. ఇచట గ్రంథకర్త గ్రామ్యమునకు లక్షణమును చెప్పదలచెనా) అపభ్రంశమునకా ? అని ప్రశ్న.

---

1. కవిశిరో. సంజ్ఞ. 9, 10 సూ.

శ్లో. తజ్జాసమాచ దేశ్యా, గ్రామ్యాచేయం చతుర్విధాభవతి
ప్రకృతి ద్వయజాతజ్జా తుల్యాతుసమాప్రవాహినీ దేశ్యా [1]

(తెలుగు తద్భవ తత్సమ దేశ్య గ్రామ్యములని నాల్గు విధములు. సంస్కృత ప్రాకృతమునుండి పుట్టినది తద్భవము. సంస్కృత ప్రాకృత తుల్యము తత్సమము. ప్రవాహిని దేశ్యము)అని చింతామణి తెలుగును గ్రామ్యముతో కలిపి నాల్గువిధములుగా విభజించెను. గ్రామ్యమునకు తప్ప తక్కినవాని కిచట నిర్వచనములు చేసెను. అంతకు మునుపు గ్రామ్యమునకు లక్షణమును చెప్పుటచేతనే యిచట విడిచి యుండును. కాన 'అనియమాద్గ్రామ్యమ్' అనునది గ్రామ్య లక్షణమునే చెప్పినదని యంగీకరింపవలెను.

తత్సమాది భాషాభాగములలో లెక్కింపబడని అపభ్రంశ ప్రసక్తి 'అనియమాద్గ్రామ్య' మనుచోట ఏలవచ్చెను? నియమము లేనిచో గ్రామ్యమగును గాన నియమము కావలెనని చెప్పకూడదా? గ్రామ్యము, అపభ్రంశము పర్యాయములే యనుట యెందుకు? "అపభ్రంశము అపశబ్దము పర్యాయములు.[2] ఇచట గ్రామ్యాపభ్రంశ శబ్దములుపర్యాయములని చెప్పినట్లైనది. కాగా అపశబ్దత్వనివారణము కొఱకు నియమమావశ్యకమని భావము"[3] అని అహోబలపతి సమాధానము చెప్పెను. ఆ అర్థమునే గ్రంథకర్త ఉద్దేశించినచో అనియమముచే అపశబ్దమగునని చెప్పలేడా? వికృతి వివేకములో గ్రంథమునకు శ్రీకారము చుట్టినపుడే తెలుగునకపభ్రంశత్వము లేదని సహేతుకముగా ప్రతిపాదింపబడెను. నియమాభావముచే అపభ్రంశత్వము కలుగునని తెలుపబడెను.[4]

---

1. అందే 4, 2 సూ.
2. 'అపభ్రంశోపశబ్దస్స్యాత్' అమర. వాగ్వర్గ. 2 శ్లో.
3. కవిశిరో. సంజ్ఞ. 10 సూ. వ్యాఖ్యలో.
4. అందే.

తెలుగున కపభ్రంశత్వ మే హేతువు చేతనైన కల్గినపుడే నిషేధము కుదురును. ప్రాప్తిలేనిచో నిషేధమేల ? ఈ రెండింటిని పరిశీలించినపుడు పూర్వము తెలుగునకు అపభ్రంశమను వాడుక కలదేమో యనిపించును. దీనికి సాయము విన్నకోట పెద్దన తెలుగునకు ప్రాకృత మని పేరున్నదని చెప్పినాడు.[1]

షడ్విధ ప్రాకృతములలో అపభ్రంశ మొకటి. తెలుగున కపభ్రంశ మనువాడుక ఉన్నచో పై మూడు గ్రంథములకు సమన్వయ మేర్పడును. తెలుగుపై అపభ్రంశ ప్రాకృత ప్రభావము మిక్కిలి కలదని తరువాత నిరూపించబడును.[2]

కావున తెలుగున కపభ్రంశమను వాడుక కలదన వచ్చును. అపభ్రంశాపశబ్దములు పర్యాయములని అమరుడు తెలిపెను. అపశబ్దము అసాధుశబ్దపర్యాయముగా గ్రహింపబడుచున్నది.[3] కావున తెలుగున కపభ్రంశత లేదని తెలుగు వైయాకరణులు నిషేధించుటలో నౌచిత్యమున్నది. (ప్రాకృతమునకు తెలుగునకు ఈ యపభ్రంశమను వాడుక యెట్లు కలిగినది ? అపభ్రంశపదమున కర్థమేమి ? పరిశీలింపవలయును.

అపశబ్ద దుష్టశబ్దములు పర్యాయములుగావు

పతంజలిముని వ్యాకరణ ప్రయోజనములను దెలుపుచు మేచ్ఛమనగా అపశబ్దమని తెలుపు శ్రుతినుదాహరించి 'మ్లేచ్ఛశబ్దములను మాటాడువారము కాకుండుటకై వ్యాకరణము చదువవలెను' అని యొక ప్రయోజనమును జెప్పెను[4] పిదప దుష్టశబ్దములను ప్రయో

---

1. కావ్యా. చూ. 9 ఉ. 8 ప.
2. సూ. ని. 1 భాగ. (1936), 209 పు.
3. తెలుగుపై నపభ్రంశ ప్రాకృత ప్రభావమను వ్యాసము చూ.
4. 'మ్లేచ్ఛామాభూమేత్యధ్యేయం వ్యాకరణమ్' వ్యాకరణమహాభాష్యమ్ పస్పశాహ్నికము కాశీ: శ్రీరాజరాజేశ్వరీప్రెస్, (సంవత్ 1948), 8 పు.

గింప కుండుటకై వ్యాకరణమును చదువవలెను. [1] అని మఱియొక ప్రయోజనమును దెల్పెను. ఇచ్చట మ్లేచ్ఛదుష్టశబ్దములు పర్యాయములయినచో పైన పేర్కొనినట్లు రెండు ప్రయోజనములుగా జెప్పుట అసంగతమగును. కావున మ్లేచ్ఛదుష్టశబ్దముల అర్థములు భిన్నములు.

మహాభాష్యకారులు 'దుష్టశ్శబ్దస్స్వరతో వర్ణతో వా మిథ్యాప్రయుక్తో న తమర్థమాహ, (స్వరముగాని వర్ణముగాని తప్పుగా ప్రయోగింపబడిన దుష్టశబ్దము వక్త ఉద్దేశించిన అర్థమును జెప్పదు.) [2] అను పాణినీయ శిక్షావచనమును దుష్టశబ్దవిషయమున నుదాహరించిరి. కావున స్వరవర్ణములుతప్పిన శబ్దమును దుష్టమని చెప్పవలెను. ఇంద్రశత్రుశబ్దము దుష్టశబ్దమునకుదాహరణము, తత్పురుష సమాసమున నింద్ర శత్రు శబ్దము నంతోదాత్తముగా నుచ్చరింతురు. అపుడింద్రుని చంపువాడను భావము వచ్చును. బహువ్రీహి సమాసమున ఆ శబ్దము నాద్యుదాత్తముగా బలుకుదురు. ఇంద్రుడు నాశకుడుగాగల వాడని దీనియర్థము. త్వష్టప్రజాపతి ఇంద్రునిచంపు కుమారుడు కావలెనను కోరిక కలవాడయినను పొరపాటున ఇంద్రశత్రు శబ్దము నాద్యుదాత్తముగా నుచ్చరించుచు యజ్ఞము చేసెను. ఇచట వక్తఉద్దేశించిన అర్థమునకు వ్యతిరేకమయిన స్వరముతో పలికి నందున ఇంద్రశత్రు శబ్దము దుష్టశబ్దమయినది. అపశబ్దమట్టిదిగాదు. 'గౌః' అను శబ్దమునకు గావీ, గోణీ, గోపోతలికా, గోతా మొదలగు నపభ్రంశములున్నవని భాష్యకారులు తెలిపిరి. [3] ఎచ్చట కలవను ప్రశ్నకు 'వాఙ్కలో' అని సమాధానింపవలెను.

---

1. 'దుష్టాఞ్ఛబ్దాన్మాప్రయుంక్ష్మహీత్యధ్యేయం వ్యాకరణమ్' అందే.
2. అందే.
3. అందే 19 పు.

ఇంద్రశత్రుశబ్దము నొకడు తానుద్దేశించిన అర్థమునకు వ్యతిరేకార్థమువచ్చునట్లు పొరపాటున ఉచ్చరించెను; అది దుష్టశబ్దము. గావీ ఇత్యాదులు పలువురవాడుకలో నున్నవి. అవి అపభ్రంశములు; అనగా పలువురు జనుల ఉచ్చారణములో రూపాంతరమును బొందిన పన్నమాట. సంస్కృత జన్యము లయిన ప్రాకృత రూపము లట్టివేకదా! ఈ విషయ మీ క్రింది వచనములచే నిరూపింపబడును.

వ్యాకరణములో శబ్దములనుపదేశింపవలెనా ? అపశబ్దములనుపదేశింపవలెనా ? అని చర్చించుచు 'లఘీయా ఞ్ఛబ్దోపదేశః గరీయానపశబ్దోపదేశః, ఏకైకస్యశబ్దస్య బహవోపభ్రంశాః, గౌరిత్యస్యగావీ, గోణీ, గోతా, గోపోతలికేత్యేవ మాదయో పభ్రంశాః' (శబ్దములనుపదేశించుట తేలిక. అపశబ్దములనుపదేశించుట కష్టము. ఒక్కొక్కశబ్దమునకు అపభ్రంశములు పెక్కులు. గౌః అను శబ్దమునకు గావీ, గోణీ, గోతా, గోపోతలికా మొదలగు నపభ్రంశములు) [1] అని భాష్యకారులు వ్రాసిరి.

ఇచ్చట అపశబ్దాపభ్రంశ శబ్దములను పర్యాయములుగా వాడిరిగదా ! గోశబ్ద వికృతులను అపభ్రంశములుగా వ్యవహరించుట గమనింపదగినది. ఈ వికృతుల నుండి యేర్పడిన గోణి [2] గోద [3] అనునవి తెలుగున గలవు. ఈ తెలుగు పదములకు మూలములయిన గోణీ గోతా యనునవి ప్రాకృత శబ్దములు కావలెనుగదా ! కావున పతంజలిముని వాక్యమును బట్టి సంస్కృత జన్యములయిన ప్రాకృత పదము లపభ్రంశములని తేలుచున్నది. దండి మహాకవి

---

1. అందే.

2. సూ. 2 భాగ. (1939), 861 పు.

3. అందే 862 పు.

"శాస్త్రేతు సంస్కృతా దన్యదపభ్రంశతయో దితమ్" (శాస్త్రమున సంస్కృతము కంటె నితరమయిన దపభ్రంశమని చెప్పబడినది)[1] అని తెలిపెను. పూర్వశాస్త్రములలో ప్రాకృతమున కపభ్రంశవ్యవహారము కలదనుట కిది ప్రమాణమగును. మహాభాష్యమున అపశబ్దము నకుదాహరణముగా నీయబడినది. 'హేలయో హేలయః' అనునది ఇట 'హేరయః 'అనుటకు' 'హేలయః'అని కలదు. 'రస్యలః క్వచిత్' ఒకానొకచో రేఫకు లకారము వచ్చును.[2] 'రసోర్లశౌ' (రేఫకు లకారమును సకారమునకు శకారమును వచ్చును.)[3] అని ప్రాకృత వ్యాకరణములందు రేఫకు లకారము విధింపబడెను. కావున భాష్యకారుడు అపభ్రంశాప శబ్దములను ప్రాకృతమునుద్దేశించి వాడెనని చెప్పవచ్చును.

తరువాత అపభ్రంశ శబ్దమున కర్థము మారినది.

"ఆభీరాది గిరః కావ్యేష్వపభ్రంశ ఇతి స్మృతాః" (కావ్యములందు ఆభీరులు మొదలగు వారి వాక్కు లపభ్రంశములు.)[4] ఆభీరాదులనుచోట ఆది శబ్దముచే ఘూర్జరాదులను గ్రహింపవలెనని అహోబలపతి 'చెప్పెను.[5] ఈ యాదిశబ్దముచే శబరశకచండాలాదులకు గ్రహణమని కావ్యాదర్శ వ్యాఖ్యాతలు చెప్పిరి.[6]

---

1. కావ్యాదర్శ. ప్రథమ. హైదరాబాదు : ఆం. ప్ర. సా. అ.(1981), 36 శ్లో.
2. మార్కండేయ మునీంద్రకృత సర్వస్వానుసారి శౌరసేనీ విశేష కార్యాణి. ప్రాకృత ప్రకాశానుబంధము 139 పు.
3, నవకిశోరకరశాస్త్రీ, కిశోరకేళి అభిజ్ఞాన శాకుంతల వ్యాఖ్య, వారాణసీ: చౌఖామ్బా సంస్కృత సీరీస్, (1964), 385 పు.
4. కావ్యాదర్శ. ప్రథమ. 36 శ్లో.
5. కవిశిరో : సంజ్ఞ. ఆం. ర. సం. ముద్రణము (1965), 159 పు.
6. డా. పుల్లెల రామచంద్రః, బాలానందిని కావ్యాదర్శ వ్యాఖ్య, హైద్రాబాదు: ఆం. ప్ర. సా. అ. (1981), 19 పు.

చివరకీ అపభ్రంశ శబ్దము దేశభాషలకు గూడ వాచకమైనది. "అపభ్రంశస్తుయచ్ఛుద్ధం తత్తద్దేశేషు భాషితమ్" (ఆయాదేశములలో వాడబడు శుద్ధమగు దేశభాషలపభ్రంశములు) [1] ప్రాకృత ప్రకాశమున ప్రాకృతము పైశాచి మాగధి శౌరసేని యనువానికి మాత్రమే లక్షణము తెలుపబడెను. త్రివిక్రముని ప్రాకృత వ్యాకరణమున చూలికా పైశాచి, అపభ్రంశముపైనాల్గింటికి కలుపబడినవి. ఇందు మొత్తమారు ప్రాకృతములు సంస్కరింపబడినవి.

అపభ్రంశ ప్రాకృతమునకు ముందున్న శౌరసేన్యాదులు సంస్కరింబడినవై అవివాడబడు దేశమును బట్టి శౌరసేని,మాగధి మొదలగు పేరులను సంపాదించుకొనినవి. అట్లు దేశీయక నామమును పొందనిదియు, బాగుగా రూపాంతరమును పొందినదియునగు నొక ప్రాకృత విశేషమునకు అపభ్రంశమను పేరు మిగిలిపోయి యుండును.

కొందరు "జనని సంస్కృతంబు సకల భాషలకు" అను విశ్వాసముతో గాబోలు దేశ భాషలను గూడ అపభ్రంశములని తలంచియుందురు. మఱికొందరపభ్రంశమును ప్రాకృతపదముచే గ్రహింపరాదనియు కావుననే కాత్యాయనుడు ప్రాకృత ప్రకాశమున అపభ్రంశమును గ్రహింపలేదనియు జెప్పుచున్నారు. [2] అతడు గ్రహింపకున్నను త్రివిక్రముడు దానిని ప్రాకృత భేదముగా గణించి సంస్కరించెను. [3] కాత్యాయనముని నాటికి త్రివిక్రముడు సంస్కరించిన అపభ్రంశమొక ప్రత్యేక భాషగా రూపొందకుండుటచేత నతడు వదలి యుండవచ్చును. పతంజల్యాదు లపభ్రంశపదమును పేర్కొనినను "శాస్త్రీయ

---

1. వృద్ధవాగ్భటః, పర్వతీయ ఉదయరామ డమరవాల్ కృతం ప్రాకృత ప్రకాశ ప్రాస్తావికమ్ (విక్రమసంవత్ 1977), 4 పు.

2. అందే 5 పు.

౩. ప్రాకృత శబ్దాను శాసనము. ౩-4-1

సంస్కృతాదన్యదపభ్రంశతయోదితమ్” అను దండివలె సంస్కృతేతరమునే అపభ్రంశ పదముచే వారు వ్యవహరించిరని చెప్పవచ్చును.

దేశభాషలకు గూడ అపభ్రంశవ్యవహారముండుట చేతనో, అపభ్రంశ ప్రాకృత ప్రభావము దెనుగున బాగుగా గనపడుటచేతనో కొందరు తెనుగు నపభ్రంశముగా భావించియుందురు. తెనుగు వైయాకరణులు అసాధుశబ్దమునకు పర్యాయముగా వాడుక కెక్కిన అపశబ్దాపభ్రంశ పదములు తెలుగునకు వర్తించవని నిరాకరించి పిదప వ్యాకరణ రచనకు పూనుకొనిరి. నియమము లేని భాష అపభ్రంశమగునని చింతామణి వికృతివివేకములు నిర్వచించినవి.[1] లక్షణోపేతము సంస్కృతము అగు శబ్దములను పర్యాయములుగా జెప్పిన అమరసింహుని భావముగూడ మన వైయాకరణులు చెప్పిన నిర్వచనమును బలపరచును.[2] శాస్త్రములు, వ్యాకరణ యుక్తమైన సంస్కృతము కంటె ఇతరములగు ప్రాకృతాదుల నపభ్రంశముగా వ్యవహరించుట, పిదప ప్రాకృతములను సంస్కరించిన వరరుచి ఆయా దేశనామములను బట్టి ప్రాకృతములకు గూడ మాగధి మొదలగు పేరులను పెట్టుటయు నాలోచింపగా ప్రాచీనులు వ్యాకరణరహితమైన దానినపభ్రంశముగా దలంచిరని చెప్పుటకు వీలగుచున్నది.

శౌరసేని వికృతి నందుటచే ఏర్పడిన భాషకు దేశనామములను బట్టి వేరొక పేరు పెట్టుటకు కుదురనందున ప్రాకృత భాషలకు

---

1. ‘అనియమాద్గ్రామ్యంహి యత్త్వపభ్రంశః’ చింతామణి. కవిశిరో. సంజ్ఞ. 9, 10 సూ. ‘నాపభ్రంశత్వ మేతస్యనియమాభావతస్తు తత్’ 10 సూత్ర వ్యాఖ్యతో.

౨. అమర. ౩ కాం, నానార్థవర్గ౮౨ శ్లో.

సామాన్యనామ మయిన అపభ్రింశపదము శౌరసేనీ వికృతికి రూఢ మయియుండును.

వ్యాకరణ సంస్కారమును పొందిన తక్కిన ప్రాకృతముల కపభ్రంశాప శబ్ద వ్యవహారములు తొలగినట్లే వ్యాకరణ సంస్కారము కల్గిన తెనుగు భాషకును ఆ పదములు వర్తించవని చింతామణి వికృతి వివేకములు తలంచి యుండును.

అథర్వణుడు తెలుగున కపభ్రంశత్వము లేదని నిరాకరించిన కారికలివి 'సన్మూలవత్త్వా ద్రూఢత్వాద్గృహీతత్వాచ్చ సాధుభిః, నా పభ్రంశత్వమేతస్యని యమాభావతస్తుసః, నివారణాయతస్యైవ ప్రవృత్తిర్విదుషామభూత్, తదర్థమేవహివయం భూయసా ప్రయతామహే' (శ్రేష్ఠమైన భాషలు మూలముగా నుండుట వలన, రూఢమగుటవలన, సత్పురుషులచే గ్రహింపబడుట వలన దెనుగు భాష కపభ్రంశత్వము లేదు. నియమము లేకుండుటచే భాషకు అపభ్రంశత కలుగును. దానిని నివారించుటకే విద్వాంసులు ప్రవర్తించిరి. దానికే మేము మిక్కిలి ప్రయత్నించుచున్నాము) [1]

శ్రేష్ఠ భాషలుగా నెన్నబడుచున్న సంస్కృత ప్రాకృతములు తెలుగునందలి తత్సమ తద్భవములకు మూలములు. నిరూఢముగాని భాషలో అస్పష్టత చోటుచేసికొనును. తెలుగున కాదోషమును పట్టదు. తెలుగానాటికే రూఢమయినదన్న మాట. సత్కవులు తెలుగున గ్రంథమును వ్రాయుట, సహృదయులు చదువుటగూడ జరుగుచున్నది. సాధుపురుషులు అసాధు శబ్దమును గ్రహించరు గదా! కావున తెలుగున కపభ్రింశత లేదు. అను నవి అథర్వణుడు చెప్పిన హేతువులు.

---

[1] కవిశిరో. సంజ్ఞ. ఆం. ర. సం. (1965), 133, 134 పు.)

పై చర్చనలన పూర్వము తెలుగును అపభ్రంశ ప్రాకృతముగా వ్యవహరించెడివారనియు, అపభ్రంశాపశబ్దపదములు పర్యాయములనియు, అసాధు శబ్దపర్యాయములుగా నర్థవిపరిణామమును నొందిన యీ శబ్దములు తెలుగునకు వర్తించవని చింతామణీ వికృతి వివేకములు సహేతుకముగా నిరాకరించిన వనియు సారాంశము తేలినది.

తెలుగునాట నపభ్రంశ ప్రాకృతవ్యవహారము

తెలుగునాట ఆంధ్రరాజుల కాలమున పాలకుల వ్యవహారమున ప్రాకృతమున్నది. ఆ రాజుల భృత్యులును ప్రాకృతమునే వాడి యుందురు. దేశీయులు దేశ భాషను వాడి యుందురు. పాలకులును వారి భృత్యులును వాడినది ప్రాకృతమే అయినను పాలకులు నాగరక ప్రాకృతమును వాడగా భృత్యులు ప్రాకృత గ్రామ్యమును వాడి యుందురని యూహించుట సముచితము. హాలుడు సేకరించిన గాథా సప్తశతి మహారాష్ట్రి ప్రాకృతమున సున్నది. అది గాని దానికి దగ్గరి భాష గాని నాటి పాలకులలో వ్యహరింపబడ వచ్చును.

మేధావులును ప్రభుత్వ సంబంధము కలిగిన వారు నగు దేశీయులపై నాగరిక ప్రాకృత ప్రభావము పడినను పామరులును పాలితులు నగు దేశీయులపై పాలకుల భృత్యులువాడెడి ప్రాకృతగ్రామ్య ప్రభావమే ప్రసరించుట యుక్తము.

ఆంధ్రరాజులు వేయించిన శాసనములు పరిశీలించినచో నందలి భాష అపభ్రంశ ప్రాకృతము కాదని తేలును. తెలుగు భాష పై నపభ్రంశ ప్రాకృత ప్రభావము మిక్కిలి కన్పట్టుచున్నదని తరువాత నిరూపింపబడును. కావున ఆంధ్రరాజుల భృత్యులు వాడిన ప్రాకృత గ్రామ్యమపభ్రంశ ప్రాకృతమేయనియు, దాని ప్రభావమే తెలుగుపై ప్రసరించి యుండునని చెప్పవలసియున్నది.

సంస్కృత నాటకములలో పాత్రోచిత భాష వాడబడినది. అందు మహారాజాదులకు సంస్కృతము (అరుంధతి వంటివారికి దప్ప) స్త్రీలు మొదలగు వారికి ప్రాకృతము, సామాన్యులగు పామరులకు శౌరసేని, అపభ్రంశము వాడబడెడివి.

శ్లో. మధ్యమస్యాధమస్యా పిశౌరసేనీ ప్రయుజ్యతే
చండాలయవనాదీనా మపభ్రంశః ప్రయుజ్యతే
(మధ్యమాధమ పాత్రలకు శౌరశేనియు, చండా
ల యవనాదుల కపభ్రంశమును ప్రయోగింపబడును.)

అని బాల సరస్వతి చెప్పెను.[1] దీనిని బట్టి పూర్వకాలమున నెవరే భాషలను మాట్లాడిరో చూచాయగా నూహింపవచ్చును.

ఆంధ్రరాజులు ప్రాకృతాభిమానులగుటచే ప్రాకృతమునే వాడిరి. ఇక సామాన్యవ్యక్తులు పామరులు (ప్రభుత్వమునకు చెందిన వారు) శౌరసేని అపభ్రంశము వంటి వానిని వాడియుందురు. అపభ్రంశమునకు మూలము శౌరసేని. పై విషయము గూడ ఆంధ్రరాజుల సేవకులపభ్రంశప్రాకృతమును గాని తత్తుల్యమును గాని వాడిరని సూచించును.

త్రిలింగ శబ్దాను శాసనములో నొక కథ కలదు. ఇది బ్రహ్మాణ్డ పురాణములో గూడ కలదు.[2]

శ్లో. ఆంధ్రనాథో మహావిష్ణుశ్శుమ్భదనుజాపహః
పురాస్వాయమ్భువ మనోః కాలే కలియుగే హరిః
కాకులే రాజవర్యస్యసుచన్ద్రస్యతనూభవః
ప్రభవత్సర్వ దే వైశ్చశేష్టితో లోక పూజితః

---

1. షడ్భాషా వివరణమ్ కవిశిరో. (1965), 159 పు.
2. డా. వడ్లమూడి గోపాలకృష్ణయ్య వైకృతచంద్రిక, పై. స్వ. స్వ మహాగవేషణ. 88 పు.

అవసత్తత్ర ఋషిభిర్యుతో గోదావరీతటే
తత్రత్యాస్తత్సమాలాపాస్తత్కాలీనా హరేర్భటాః
కాలేనమహతా సర్వంతత్సమంస్వల్పబుద్ధిభిః
అస్ఫుటేనోచ్చరితానితద్భవానీతి సమ్మతిః
బ్రహ్మణానిర్మితావాచః పూర్వమాంధ్రేశితుర్హరేః
అచ్ఛాఇతిచ కథ్యంతే సుప్ష్ఠ (?) ద్ధాతు సమన్వితమ్

కాకుళరాజగు సుచంద్రుని కుమారుడు, లోక పూజితుడు నిశుమ్భదనుజుని చంపినవాడు, ఆంధ్రనాథుడు నగు మహావిష్ణువు పూర్వము స్వాయంభువ మన్వంతరమున కలియుగమున సకలదేవ పరివేష్టితుడై ఋషిసహితుడై గోదావరీ తటమున నివసించెను. అచటనున్న వారు, అతని కాలమువారు, అతని భటులు తత్సమము మాటాడుచుండిరి. చాలా కాలమునకు ఆతత్సమములు స్వల్పబుద్ధులచే నస్ఫుటముగా నుచ్చరింపబడి తద్భవములైనవి. ఆంధ్ర విష్ణువునకు బూర్వమే బ్రహ్మచే నిర్మింపబడిన వాక్కు "అచ్ఛ భాష" అని చెప్పబడును. ఇది సుబంతములతో (?) ధాతువులతోడను కూడియున్నది.)[1] ఈ శ్లోకములు తెలుగున తత్సమతద్భవదేశ్యము లెట్లు కలిగెనో సూచించుచున్నవి.

పాలితుల ప్రభావముకొంత పాలకుల పైన పాలకుల ప్రభావ మధికముగా పాలితులపైన ప్రసరించుట సహజము. కావున ప్రభువులును వారి నాగరకానుయాయులును వారి భాషను దేశీయభాషానుగుణముగా స్వల్పముగా మార్చియుచ్చరించుటచే తత్సమము లేర్పడెననియు పిదప ఆభాషసామాన్యులవలన బాగుగా రూపాంతరమునందు

---

[1] త్రిలింగ శబ్దానుశాసనము, తత్సమకాండ మద్రాసు : ప్రాచ్య లిఖిత భాండాగారము నెం. డి /12457, 1,2,3,8, 11 శ్లో.

టచే తద్భవమేర్పడెననియు, నీరెండునేర్పడుటకు పూర్వమే దేశభాష కలదనియు నిందు సూచితమైన అర్థము. తెనుగు తత్సమముల నస్ఫుటముగా నుచ్చరించుటచేత తెనుగు తద్భవములేర్పడెనని చెప్పినను, ప్రాకృత గ్రామ్యము మాటలాడువారి ప్రభావముచే తెలుగున ప్రాకృత తద్భవము లేర్పడెనని చెప్పినను, తెనుగు గ్రామ్యముపై ప్రాకృత గ్రామ్యము మాటాడు వారి ప్రభావమున్నదని చెప్పుటలో సంశయములేదు.

తెనుగుభాషలో గనబడుచున్న రూపములను బట్టి ఆప్రాకృత గ్రామ్యమపభ్రంశ ప్రాకృతమే యని తెలియును. కాగా నీయపభ్రంశ ప్రాకృతము పూర్వము తెలుగునాట పాలకులకు చెందిన సామాన్య వర్గములో వాడుకలోనుండెడిదని చెప్పవలసియున్నది.

తెనుగుపై నపభ్రంశ ప్రాకృత ప్రభావము

తెనుగున కపభ్రంశ ప్రాకృతమను వ్యవహారము కలుగుటకు గల హేతువులలో ఆ ప్రాకృతప్రభావము తెనుగుపై ప్రసరించుట కూడ ఒకటి. ఆవిషయమును బరిశీలింతము.

(౧) ఉత్వము :-

తెలుగున శంకరుడు ఇత్యాదులలో ప్రాతిపదికకు చివర ఉత్వము కనబడును. శంకర శబ్దము తమిళమున శంకరన్ అనియు కన్నడమున శంకర అనియు నుండును. కావున నీ ఉకారము మూల ద్రావిడము నుండి వచ్చెననుటకు వీలులేదు. సంస్కృతము నందు మూల ద్రావిడము నందును లేని యీ ఉకారమెచట నుండి వచ్చెనని ప్రశ్న: 'రాముడు అనియున్నపుడు నడిమి అకారముకారముగా మారుట ఉకారము యొక్క ఆకర్షణము వలన జరిగినదని పరిశోధకులూహించినారు.[1] కాని విభక్తి యందుకారము లేని ద్వితీయాదులు పరముగా

---

[1] శ్రీ. జి. జె. సోమయాజి. ఆం. భా. వి. మచిలీపట్నం : త్రివేణి పబ్లిషర్స్, (1971), 380 పుట.

నున్నపుడును ప్రాతిపదికాంత్యమున కుత్వము వచ్చుచున్నది. డు వర్ణకము చేరనపుడు గూడ వృద్ధాదులకు ఉత్వము కలుగుచున్నది. డు జ్వర్ణకము పరముగా నున్నపుడును దేశ్యములయిన మగడు మొదలగువాని కుత్వము గలుగుట లేదు. ఆ స్వరాకర్షణ మిచట ఏమైనదని ఆచార్య బొడ్డుపల్లి పురుషోత్తముగారు నిలదీసినారు.[1] కావున స్వరాకర్షణముచే నత్వముత్వమైనదనుట యుక్తము గాదు.

ప్రాకృతమున 'సోః అతః పరస్యసోః స్థానే డోభవతి' (అదంతము కంటె పరముగానున్న సుప్రత్యయు స్థానమున డో వచ్చును) అని డిత్తగు ఓత్వము విధింపబడినది.[2] కావున కొందరు పరిశోధకు లీ ఉత్వము ప్రాకృతీయమా ? యని యనుమానించినారు.[3] అపభ్రంశమున "స్వమ్యైత ఉత్" అపభ్రంశే స్వమోః పరయోరుకారో భవతి. (అపభ్రంశమున ప్రథమైక వచన ద్వితీయైక వచనములు పరమగునపుడు ఉత్వము వచ్చును.)[3] అనువిధిచే ఉత్వము సిద్ధించును. పిదప నిచటి 'సు' కు 'అన్త్యస్యహలః' శబ్దానాం యోన్త్యో హల్ తస్య లోపోభవతి. (శబ్దములకు జివరి హల్లు లోపించును)[4] అను సూత్రముచే లోపము వచ్చును. ప్రాకృత సంబంధియగు ఓత్వయుత రూపము కంటె అపభ్రంశమున గల రాము వంటి ఉకారాన్త రూపము తెలుగునకు సన్నిహితము. సంస్కృత ద్రావిడములలో లేని యీ ఉత్వము తెలుగున కపభ్రంశప్రాకృత ప్రభావమున వచ్చియుండును,

---

1. తెనుగు వ్యాకరణ వికాసము ప్రథమ. 234 పు.
2. ప్రాకృతశబ్దానుశాసనము 2. 2. 13.
3. తె. వ్యా. సం. ప్రా. వ్యా. ప్రభావం. 120 పు.
4. ప్రాకృత శబ్దాను శాసనము 3-4-2.
5. ప్రాకృత ప్రకాశము 4-3 సూ.

(బి) లిఙ్గ విధానము

"లిఙ్గమతన్త్రమ్" 'అపభ్రంశే లిఙ్గమతన్త్రం వ్యభిచారి ప్రాయోభవతి' (అపభ్రంశమున సంస్కృత లింగవిధానము తరచుగా తారుమారగును.)[1] ఈ విధి తెనుగున గూడ బాగుగా వర్తించుచున్నది. సంస్కృతమున పుంలింగముగల వృక్షశబ్దము తెనుగున వృక్షము అని యున్నది. నపుంసకలింగముగల మిత్రశబ్దము 'మిత్రుఢు' అను రూపమును పొందినది. సంస్కృత లిఙ్గవిధానము సంస్కృత ప్రాకృతములనుండి తెలుగునకు వచ్చిన తత్సమ తద్భవములకు గూడ సరిపడక పోవుటచేతనే తెనుగు వైయాకరణులు తెలుగునకు మహదమహద్విభాగము నేర్పరచినారు.

(సి) వర్ణవ్యత్యయము

'హ్మోమ్హమ్' అపభ్రంశే హ్మ ఇత్యయం మకారాక్రాన్తహకార మాపద్యతే (అపభ్రింశమందు హ్మ అనునది మ్హ అగును.)[2] బ్రహ్మ బ్రాహ్మణ్య మొదలగు పదములకు తెలుగున బ్రమ్హ, బ్రామ్హణవంటి యుచ్చారణము నేడును వినబడుచున్నది.

(డి) సంయుక్తమందలి రేఫలోపము

'రోలుకమధః' అపభ్రంశే సంయోగస్యాధో వర్తమానో రేఫో లుకం=లోపమాప్నోతితు. (అపభ్రంశమున సంయోగమునకు క్రిందనున్న రేఫము వికల్పముగా లోపించును.) తెలుగున క్రొత్త ప్రాత ఇత్యాదులలో రేఫోచ్చారణము వ్యావహారికమున తొలగినది గదా. ఈలోపమీనాడు కల్గినదిగాదు. "పదాది సంయుక్తాక్షర గత సాధు రేఫ

---

1. ప్రాకృత శబ్దానుశాసనము 8-4-67.

2. అందే 8-3-4.

లోపము క్రీ.శ. 7వ శతాబ్దంలోనే మొదలయిందనటానికి నిదర్శనాలు కనిపిస్తున్నాయని శ్రీ బూదరాజు రాధాకృష్ణగారు తెలిపియున్నారు.[1]

(ఇ) మకారమున కనునాసిక వకారము :

“మోనునాసి కోవోవా” తథోక్తస్య (అనాదౌ వర్తమానస్య స్వరాదసంయుక్తస్య) మస్య అనునాసికో వకారో భవతి (అపదాది యందున్నట్టిదియు, స్వరముకంటె పరముగా నున్నదియు, అసంయుక్తమయినదియునగు మకారమునకు అను నాసిక వకారము వికల్పముగా వచ్చును.)[2] తెలుగున రాముడు, సోముడు, కాముడు మొదలగు పదములలో రావుఁడు సోవుఁడు కావుఁడు మున్నగురీతిగా సానునాసిక వకారోచ్చారణము వినబడుచున్నది.[3] ఇది పూర్వకాలమున గూడ కలదేమో ?

(ఎఫ్) రేఫాగమము :

‘క్వచిదభూతోఽపి’ అపభ్రంశే క్వచిదవిద్యమానోఽపి రేఫో భవతి (అపభ్రంశమున నొకచో ప్రకృతిలో లేని రేఫవచ్చును)[4] తెలుగున పక్ష > పక్ఖ > ప్రక్క మొదలగు రూపాలలో మూల రూపమునందు లేని రేఫ ఆగమముగా వచ్చుచున్నది[5]

---

1. ‘తె. భా. చ. ‘శాసన భాషా పరిణామం’ 57 పు.
2. ప్రాకృత ప్రకాశ పరిశిష్టమ్, ‘హేమాను శాసనమ్’8-4-397 సూ. 150 పు.
3. ఇట్లే మామ > మావ.
4. ప్రాకృత శబ్దాను శాసనము 3-3-6 సూ.
5. ఆచార్య దోణప్పగారు, ‘తెలుగులోని వైకృత పదాలు’ తె. భా. చ. ఆచార్య భద్రిరాజువారి సంకలనం, 320 పుట.

(ఇ) భూతార్థక ప్రత్యయము :

‘క్త్వ ఇ, ఇఉ, ఇవి, అవి’ అపభ్రంశే క్త్వాప్రత్యయస్య ఇ, ఇఉ, ఇవి, అవి, ఇతి చత్వార ఆదేశా భవన్తి. (అపభ్రంశమునందు క్త్వా ప్రత్యయమునకు ఇ,ఇఉ,ఇవి,అవి అను నాల్గు నాదేశములువచ్చును.)[1] తెలుగున ‘క్త్వాభూతయోః క్రియాన్త్యస్యేత్‘ (భూతకాలికసమాపకా సమాపకార్థములందు ధాత్వంతమున ఇత్ వచ్చును.)[2] అని క్త్వార్థమున ఇకారము చెప్పబడెను.

జగమెరిగిన భాషాచరిత్ర విదులు శ్రీ గంటి జోగి సోమయాజి ఈ యి వర్ణ చరిత్రను రెండు విధములుగా నూహించుచు (అ) “దు, వర్ణకము ప్రాచీనమైన భూతార్థకముగా నుండినచో నడుమనజ్భక్తిగా నీ ఇకారము అర్వాచీనముగా వచ్చి స్వతంత్రముగా భూతార్థక మయినది. బా ల్దెం-బాళిదం (కన్నడము) పేర్దెం-పేళిదను. (ఆ) ఇది (భూతార్థక మగు ఇకారము) స్వతంత్రముగానే యేర్పడినదనుట. పై రెండు పద్ధతులలో ఏది సత్యమనవచ్చును? రెండును సరియైనవే యని సమాధానము. ప్రాచీన కాలమున ధాతు మాత్రములే సమాపక క్రియలుగాను భావార్థకములు గాను వాడబడుచుండినవి. ఉకారాంత ధాతువులతుదినున్న ఉకారము ఇ ఉలకు నడిమి యుచ్చారణతో నుండి భూతార్థకముగా ఇకార రూపముగా స్థిరపడినదనుట స్పష్టము. దువర్ణమునకు బూర్వము కొన్ని క్రియా రూపములలో ఇవర్ణమాగమ మాత్రముగా గూడ నేర్పడియుండెను” అని తెల్పియున్నారు.

వారు చెప్పిన రెండు పక్షములలో మొదటి దానియందు ఇకారము ద్రావిడమైనను, దానికి భూతార్థకత్వము స్వతంత్రముగా నేర్ప

---

1. అందే 3-3-18.

2. ఆంధ్రశబ్ద చింతామణి. క్రియ. 17 సూ.

3. ఆ. భా. వి. 513 పుట.

డినదని తెలియును. రెండవపక్షమున ఇకారముగూడ నాగమమే యగును. ద్రావిడేకారమునకు భూతార్థకత్వము వచ్చుటలోను, స్వతంత్రముగా తెనుగున భూతార్థకాకారమేర్పడుటలోను అపభ్రంశ ప్రభావముండునని చెప్పవచ్చును.

పూర్వమాంధ్ర కర్ణాటభాషలు కలిసి యుండుటచే కర్ణాటకమున గూడ నీయపభ్రంశప్రభావము ప్రసరించియుండవచ్చును.[1] పైన పేర్కొనబడినవిగాక మఱికొన్ని విశేషములు అపభ్రంశమున, తెనుగునందు తుల్యముగా నున్నవి. కాని యట్టి మార్పు లితర ద్రావిడ భాషాదులయందు గూడ నుండుటచేత నెచటినుండి యెచటి కేగినవో చెప్పుట కింకను పరిశోధింప వలయును. ఆతుల్యాంశముల నిచట పేర్కొందును.

(హెచ్) రేఫ హకార సంయుక్తములకుచ్చారణ లాఘవము :

'హ్రోః స్త్రో రుచ్చార లాఘవమ్' (హ్రోః=హకార రేఫయోః, స్త్రోః సంయుక్తస్యఉచ్చారలాఘవ మపభ్రంశే ప్రాయోభవిష్యతి. (అపభ్రంశమున తరచుగా హకార రేఫ సంయుక్తములు తేలికగా నుచ్చరింపబడును.)[2] సంయుక్తాక్షరమునకు బూర్వ వర్ణము సాధారణముగా గురునగును. హకార రేఫ సంయుక్తములకుచ్చారణ లాఘవము విధించబడినందున దత్పూర్వాక్షరమునకు గురుత్వముండదు.

'సంయుక్తే సంస్కృతాద్యేస్యాత్సర్వ మాంధ్రపదం లఘు, పదేచపి తథాత్వంస్యాత్' (సంస్కృతపదమున కాదియందున్న సంయుక్తము పరముగా నుండగా ఆంధ్రపదాంత వర్ణము లఘువే యగును. ఒకప్పుడేక పదమున గూడ సంయుక్తమునకు బూర్వాక్షరము లఘువే యగును.[3]

---

1. అందే అధస్సూచిక.
2. ప్రాకృత శబ్దాను శాసనము 8-4-64 సూ.
3. అథర్వణుడు, కవిశిరో. సంజ్ఞ 18 సూ. వ్యాఖ్య.

వికృతి విశేకము సంస్కృతపదాది సంయుక్తము పరమగుటచే లఘుత్వ మేర్పడునని చెప్పినను ఉదాహరణములు రేఫ సంయుక్తములు పరమగునప్పుడు మాత్రమే లభించుచున్నవి. “రావణుని ద్రోహిఁజంపగా రాదటయ్య” “నిన్న ప్రామిన్కగములెల్ల నెన్నునయ్య” “శతతాళదఘ్న హ్రదమున బడియెన్” అద్రువన్, విద్రువన్, మొదలగు ప్రయోగములలో రేఫ సంయుక్తములకు పూర్వ వర్ణములు లఘువులని అహోబలపతి యుదాహరించెను.[1]

ఈ లఘుత్వము అపభ్రంశ ప్రభావము వలన వచ్చెనన వచ్చునుగాని యితర భాషలలోగూడ నిట్టి లఘుత్వము గలదని కొందరు చెప్పిరి.

శ్లో. సర్వాస్వపిచ భాషాసురహాయుక్తేషు రేఫరే
పూర్వవర్ణస్యలఘుతా శేష్టామల్హా దికేవిచ.

(అన్ని భాషలయందును రేఫ హ కారసంయుక్తములు పరములుగా నుండగా పూర్వవర్ణమునకు లఘుత్వము వికల్పముగా నిష్టము. మల్హాది పదములలో గూడ హకార సంయుక్తముల కిట్టి లఘుత్వము గలదు.)[2] అని సారావళి చెప్పినది.

(ఐ) పదాన్తబిందువునకుచ్చారణ లాఘవము :

అపభ్రంశేపదాన్తే వర్తమానస్యబిందో రుచ్చార లాఘవమ్ భవిష్యతి (అపభ్రంశమున పదాంతమందున్న బిందువునకుచ్చారణ లాఘవము తరచుగా కలుగును.[3] తెనుగున గుఱ్ఱంఇత్యాది వ్యావహారిక పదములలో చివరి సున్న ఉచ్చారణలాఘవమును బొందు

---

1. కవిశిరో. సంజ్ఞ. 18 సూ. వ్యాఖ్యలో.
౨. అందే.
౩. ప్రాకృత శబ్దాను శాసనము ౩-4-65

చున్నదని పరిశోధకులు చెప్పిరి. కాని యీస్థితి తక్కిన ద్రావిడ భాషలలో గూడగలదని వారి నిర్ణయము.[1]

(జె) సరళాదేశ గసడదవాదేశములు :

"అచో స్తవో ఽఖౌ కఖతథపఫాగఘదధబభాన్" అపభ్రంశే అచః పరే అ స్తవః=అసయుక్తాః, అఖౌ = అనాదౌ వర్తమానాః, కఖతథపఫ ఇత్యేతేవర్ణాః గఘదధబభ ఇత్యేతాన్ (ప్రాయో యథాసఙ్ఖ్య మాపద్యన్తే) అపభ్రంశమున అచ్చు కంటె పరమందున్నట్టివియు అసంయుక్తమైనట్టివియునగు కఖతథపఫలు తరచుగా గఘదధబభలుగా మారుచున్నవి.[2] పై విషయము హేమానుశాసనమున గూడ చెప్పబడినదిగాని యందు పకారమునకు వకారము వచ్చునని చెప్పబడినది.[3]

తెలుగున ద్రుతమునకు బరముగా నున్న కచటతపలు గజడదబలుగను ప్రథమమీది పరుషములు గసడదవలుగను మారుచున్నవి. టకారము డకారముగా మారుట మాత్రము అపభ్రంశసూత్రములో చెప్పబడలేదు.

"అనునాసికమందలి నాదసాహచర్యమున ప్రక్కనున్న పరుషము సరళమగుట భాషలోని సుస్వర స్వభావమునకు లక్షణమని పరిశోధకులు తెలిపిరి.[4] అచ్చులు గూడ నాదములే కదా! కావున సరళాదేశ గసడదవాదేశములు రెండును సుస్వర ధర్మసూచకములే యనవచ్చును.

---

1. ఆం. భా. వి. 131 పు.

౨. ప్రాకృత శబ్దానుశాసనము ౩-౪-౨.

౩. ప్రాకృత ప్రకాశ పరిశిష్టము. 8-4-396.

౪. ఆం. భా. వి. 137 పు.

అరవమునను మలయాళమునను బదాదిని పరుషములును బద మధ్యమున సరళములును ప్రయోగింపబడుచుండుట సుప్రసిద్ధమని భాషా చరిత్రజ్ఞులు తెలిపినారు.[1] తెలుగు పదాది నున్న పరుషములు రూపాంతరమునందుచుండగా అపభ్రంశతమిళ మలయాళములలో పదాదిని పరుషములే పలుకబడుచున్నవి. తమిళ మలయాళములలో సరళాదులైన దంతము, భాగ్యము మొదలగు సంస్కృత పదములును తద్భవములగునపుడు తందము, పాక్కియము అను పరుషాది రూపములను బొందుట విశేషము.[2]

ప్రాకృత వ్యాకరణము మొదట ప్రాకృతములకు చెందిన సామాన్యలక్షణమును దెలిపినది. పిదప శౌరసేన్యాదుల విశేషలక్షణములను జెప్పినది. శౌరసేన్యాదుల సామాన్యలక్షణములను ప్రాకృతమునుండి గ్రహించవలెనని యతిదేశించినది. "అపభ్రంశేతు ప్రాయః శౌరసేనీవత్కార్యః లిఙ్గాతన్త్రితాచ" శౌరసేనీశేషం ప్రాకృత వత్" (అపభ్రంశమున తరచుగా శౌరసేనికి వలెనే కార్యములు చేయదగినవి. శౌరసేనిలో చెప్పబడనివి ప్రాకృతమునకు వలెనే యెరుగవలెను)[3]

పై అతిదేశముననుసరించి అపభ్రంశమునకు సామాన్యలక్షణములను శౌరసేని నుండి, ప్రాకృతము నుండి గ్రహించవలెనని స్పష్టపడును.[4] అప్పుడు గాని అపభ్రంశప్రాకృతము యొక్క సమగ్రలక్షణము గ్రహించినట్లు కాదు. శౌరసేనియందు, ప్రాకృతమునందును తెలుగునకు వర్తించునవి కొన్ని లక్షణములు గలవు.

---

1. అందే 131 పుట.
2. అందే.
3. ప్రాకృత శబ్దానుశాసనము 3-4-1 సూ.
4. ఆరుప్రాకృతములకును, ప్రాకృత వ్యవహారమున్నను మహారాష్ట్రి నిఘటు ప్రాకృతముగా వ్యవహరించిరి.

(కె) రస్యోలః క్వచిత్ (ఒకానొకచో రేఫకు లకారము వచ్చును.[1] తెలుగున 'రోలః' అని రేఫకు లాదేశము విధింపబడి గోరులు - గోళ్ళు మొదలగు రూపములు సిద్ధించుచున్నవి.[2] (ఎల్) త్రిష్వపికాలేషులడేనప్రాయేణ (మూడు కాలములందును లట్టే తరచుగా వాడబడును.)[3]

అడిగెడు అడిగెదరు మొదలగు రూపములు వర్తమానార్థకములని కేతన తెలిపెను.[4] ఎడిన్చనర్తమానార్థే ఇంచుక్చాపి క్వచిద్భవేత్ (వర్తమానార్థమున ఎడిన్ అనునదియు వచ్చును. ఒకచో ఇంచుక్ గూడ వచ్చును.)[5] అని యాథర్వణునిచే వర్తమానార్థకములు దెల్పబడినవి. ఇవి కాలత్రయమునను నన్నయ్య భారతముననే ప్రయోగములలో నున్నవి.[6] కావున లక్షణవేత్తలు వర్తమానార్థకములన్నవి కాలత్రయమున వాడబడుచున్నట్లే గదా! ఇవి కాక (ఎమ్) ఇంతి[7] (ఎన్) చందమామ[8]

---

1. మార్కండేయమునీంద్ర కృత ప్రాకృతసర్వస్వము, ప్రాకృత ప్రకాశ పరిశిష్టమ్ 140 పు.
2. కవిశిరో. అజన్త. 73 సూ.
3. ప్రాకృత ప్రకాశ పరిశిష్టమ్ 141 పు.
4. ఆం. భా. భూ. 144 ప.
5. కిమ్మూరి నరసరాజు. కవి. అంజ. నెం. 322, మద్రాసు: ప్రాచ్య లిఖిత భాండాగారము.
6. ఎడిన్ ఎడున్ అంతమందు గల పదములు వర్తమానార్థమునను, భూతార్థమునను భవిష్యదర్థమునను నన్నయ భారతమున గలవు. ఆం. భా. వి. 233 పుట.
7. 'స్త్రియా మిత్థీ' స్త్రీ శబ్దస్య స్థానే ఇత్థీ ఇత్యాదేశో భవతి. ఇత్థీ> ఇంతి, ప్రాకృత ప్రకాశము 12-22 సూ.
8. 'ద్రో రేఫో వా' ద్రశబ్దే రేఫస్య వా లోపో భవతి చంద్రమస్> చందమామ. ప్రాకృత ప్రకాశము 3-4 సూ.

(ఓ) అయ్య,[1] అనునవి శౌరసేనినుండి తెలుగునకు వచ్చినవి. శౌరసేనిలోని సామాన్య లక్షణమును ప్రాకృత విధుల ద్వారా తెలిసికొనవలెను గదా! కొన్ని ప్రాకృత విధులును తెలుగుపై ప్రభావము చూపినవి. (పి) సమాసమున దీర్ఘమునకు హ్రస్వము :- 'దిహా మిథస్సే' సే=సమాసే, దిహా = దీర్ఘహ్రస్వౌ, మిథః= అన్యోన్యం' బహులంభవతః ఉదా :- గౌరీగృహమ్ గౌరిఘరం (సమాసమందు దీర్ఘ హ్రస్వములు బహులముగా మారుచుండును.)[2] తెలుగున 'నదిసుత గురుకర్ణ శల్యనాగ పురీశుల్'[3] 'నలిన రజస్సుగంధియమునా నది తుంగ తరంగ హార్మ్యరేఖలన్'[4] 'రాకసుధాంశుమండలము'[5] 'తమసతీర సికతా విలసనములు'[6] మొదలగు చోట్ల సమాసములందలి దీర్ఘములు హ్రస్వములయినట్లు తెలియును. వీనిని వ్యాఖ్యాతలు వేరు వేరు దారులలో సరిపెట్టుటకు యత్నించిరి.

(క్యు) పదాంత మకారమునకు బిందువు :- 'బిందుల్' శబ్దానామన్త్యమకారస్య బిరిదుర్భవతి (శబ్దముల చివరి మకారమునకు బిందువు వచ్చును)[7] తెనుగున నీనియమము బాగుగా వ్యాప్తి చెందినది. వికృతి నివేకము

---

1. 'నవార్యోర్య్యః' శౌరసేన్యాం ర్యస్యస్థానే య్యోవాభవతి. ఆర్య > అయ్య, హేమశబ్దానుశాసనము 8-4-266. ప్రాకృత ప్రకాశ 139 పు.
2. ప్రాకృత శబ్దానుశాసనము 1-1-18 సూ.
3. ఆం. భా. ఆది. 1-69 ప.
4. ఆం. భా. ఆది. 2-32 ప.
5. శృంగారనైషధము 2-137 ప.
6. పింగళి సూరన్న, రా. పాం. మద్రాసు: ఆర్. వెంకటేశ్వర్ అండ్ కో, 1-18 ప.
7. ప్రాకృత శబ్దానుశాసనము 1-1-41 సూ.

శ్లో. 'శబ్దానామన్త్యభాగేషు యోఽనుస్వారః ప్రదృశ్యతే,
తస్యాచిపరతో మస్స్యాత్సర్వత్రకవి సమ్మతేః'

అని శబ్దముల చివరి యను స్వారమునకు అచ్చుపరమగునప్పుడు మకారమును విధించుకొనినది.[1] సంస్కృత శబ్దమునకు చివర అనుస్వారముండదు. తెలుగు శబ్దములకు చివర అనుస్వారము నెవరును విధింపలేదు. ప్రాకృత ప్రభావముచే అనుస్వారాంతములుగా నుచ్చరింపబడుచున్న శబ్దముల ననుసరించునప్పుడు అథర్వణుడు పై రీతిగా అనుస్వారమునకు మకారమును విధించుకొనవలసి వచ్చినది.

(ఆర్) నకారమునకు బిందువు :- 'హలిజఞణనామ్' జ ఞ ణ న ఇత్యేతేషాం హలి = వ్యఞ్జనేపరే బిందుర్భవతి (జ ఞ ణ న అను వానికి హల్లు పరముగా నున్నపుడు బిందువు వచ్చును)[2] తెలుగున జ ఞ లు లేవు గదా! 'ద్రుతస్యహలిబిందుస్స్యాత్' (ద్రుతమునకు హల్లుపరముగా నున్నపుడు బిందువు వచ్చును.) అని వికృతి వివేకము తెలిపినది.[3] పరుష సరళములకు ముందే యీ బిందువు కల్గుట, ణకారమున కీ బిందువిధి వర్తింపకుండుట తెలుగున విశేషము.

నౌ శబ్దమునకు ప్రాకృతమున 'ణా వా' అను రూప మేర్పడినది.[4] దానికి నావ వికృతియై యుండును. ణకారమునకు నకారమును, దీర్ఘమునకు హ్రస్వమును విధించుట అను ప్రక్రియాధిక్యమును వదలి తత్సమముగనే దానిని చింతామణి సాధించినది.[5] మతుబంతములైన ధనవంతుడు మొదలగువానికి సంస్కృత ద్వితీయైక వచనాంతము

---

[1] కవిశిరో. సంధి. 19 సూ.

[2] ప్రాకృత శబ్దానుశాసనము 1-1-41 సూ.

[3] కవిశిరో. సంధి. 27 సూ. వ్యాఖ్యలో.

[4] ప్రాకృత శబ్దానుశాసనము 1-2-104 సూ.

[5] స్త్రీవాచ్యార్థే నావోః. కవిశిరో. అజన్త. 63 సూ.

లను ప్రాతిపదికలుగా గ్రహించి మన వైయాకరణులు రూపములను సాధించిరి. కాని వీరు గ్రహించినవి ప్రాకృత పదములే యని పరిశీలించినచో దెలియును.

"మన్త, మణ, వన్త, మా, ఆలు, ఆల, ఇర, ఇల్ల, ఉల్ల, ఇన్త మతుపః"(మన్త, మణ, వన్త, మా, ఆలు, ఆల, ఇర, ఇల్ల, ఉల్ల, ఇన్త అను పదియున్ను మతుప్ ప్రత్యయమునకు ప్రయోగము ననుసరించి యాదేశములగును.) [1] ఇచట ధనవన్తో హనుమాన్ హణుమా మొదలగున వుదాహరణములు. అపభ్రంశ లక్షణము ననుసరించి ధనవన్తో మొదలగునవి ధనవన్తు అనురీతిగా ఉకారాన్తములుగా నుండును. వానికి డుజ్ చేరుట తెలుగులో జరిగినది. హణుమయను ప్రాకృత రూపమునకు వికృతియగు హనుమగూడ తెలుగున నున్నది. హనుమాన్ వంటి రూపములు సంస్కృత ప్రథమైక వచనతుల్యములు. ప్రాకృతములో నివియు నున్నవి. వీనికిగూడ అపభ్రంశ సంబంధియగు ఉకారముచేరి హనుమానుడు మొదలగు రూపములు సిద్ధించినవి. (టి)సంస్కృతమున స్వార్థమున కప్రత్యయము ప్రసిద్ధము.[2] ప్రాకృతమున గూడ నిట్టిది గలదు.[3] తెలుగున చింతామణి గూడ ఇట్టి దానిని విధించినది.[4] దీనిచే నెలతుక వంటి దేశ్య రూపము లేర్పడినవి.

సంస్కృతమున నామ విభక్తులయందును క్రియా విభక్తులయందును ద్వివచనము గలదు. తెలుగునలేదు. ద్వివచనస్థానమున

---

1. ప్రాకృత శబ్దాను శాసనము 2-1-65 సూ.
2. శ్రీ భట్టోజీ దీక్షితులు సిద్ధాంతకౌముది 2096 సూ.
3. 'స్వార్థేతు కశ్చ' ప్రాకృత శబ్దాను శాసనము 2-1-18 సూ.
4. నామ్నః కవర్ణకస్యాత్స్వార్థే స్యాదుత్వమపి పరేతస్మిన్, కవిశిరో. హలంత. 29 సూ.

గూడ బహువచనము ప్రాకృతమున విధింపబడెను.[1] తెనుగునగూడ అట్లే యున్నది. సంస్కృతమున సంప్రదానమున చతుర్థి వచ్చును. తెనుగు వైయాకరణులును నట్లే విధించు కొన్నను తెనుగున నట్టి స్థలమున కువర్ణకమును వాడుటయే యీ భాషకనుగుణమైనపద్ధతి.[2] ప్రాకృతమునందు సంస్కృత చతుర్థిస్థానమున షష్ఠి విధింపబడినది.[3] (డబ్ల్యు) ప్రాకృతమున ద్వితీయ, తృతీయ, పంచమి, సప్తమీ విభక్తుల స్థానమున షష్ఠి క్వాచిత్కముగా విధింపబడినది.[4] తెనుగున కుషష్ఠి పై విభక్తులందే కాక చతుర్థియందును వచ్చుచున్నది.[5] ప్రాకృతమున పఞ్చమీ స్థానమున తృతీయా సప్తమీ విభక్తులు గలుగుచున్నవి.[6] తెలుగున తృతీయావిభక్తి ప్రత్యయమగు చేతవర్ణకము గ్రహ్యాది యోగజమగు పంచమికి వచ్చుచున్నది[7]

పంచమీ ప్రత్యయమగు 'వలన' స్థానమున సప్తమి వచ్చుటయు గలదు.[8] సంస్కృత పదాదియకారము జకారమగుట ప్రాకృత

---

1. ద్వివచనస్యబహువచనమ్, ప్రాకృత శబ్దానుశాసనము 2-3-34.
2. చతుర్థికి మారుగా షష్ఠి తఱచుగా ప్రయోగంబులంగానంబడియెడి. బాల వ్యా. కారక. 6 సూ.
3. 'జే సోజమ్' ప్రాకృత శబ్దానుశాసనము 2-3-35 సూ.
4. 'క్వచిదసాదేః, ప్రాకృత శబ్దానుశాసనము. 2-3-38 సూ.
5. షష్ఠీ స్థానికంబగు కువర్ణకంబొక్కొక్కచో ద్వితీయాది విభక్తులకు మాఱుగాదత్త దర్థంబులం జూపట్టెడి ప్రౌఢ. కారక. 13 సూ.
6. 'జసిస్టాచ' చ కారాత్ సప్తమీ చక్వచిద్భవతి.
7. చేత వర్ణకంబు హేతుకరణంబులకు గ్రహ్యాదియోగజంబగు పంచమికిని బహుళంబుగా నగు బాలవ్యా. కారక. 4 సూ.
8. ఉండి శబ్దము పరంబగునపుడు వలనకు ద్వితీయా సప్తములు ప్రాయికంబుగ నగు బాలవ్యా. కారక. 11 సూ.

మున గలదు.[1] తెలుగున యముడు-జముడు అను రూపమున్నది. ఇట్లపభ్రంశ విధులు శౌరసేనీ విధులు, ప్రాకృత విధులు, తెలుగున వర్తించుచున్నవి. ఇన్ని కాదుగాని కొన్ని పైశాచీ విధులు వర్తించిన పదములును దెలుగున గలవు. సిరి, సంతోసము వంటి పదములలో శ ష లకు సకారము వచ్చుట,[2] కళ, మంగళము వంటి పదములలో లకారమునకు ళకారము వచ్చుట[3] పైశాచిలో గనబడును.

పై వానిలో ద్రావిడ భాషల సహజలక్షణములను దొలగింపగా దక్కినవి ప్రాకృత భాషల ప్రభావముచే నేర్పడినవని చెప్పవలసి యున్నది. వీనిలో అపభ్రంశ విధులు, ప్రాకృత విధులు నధికముగ నున్నవి. ప్రాకృత సమములనదగిన ధనవన్తో ఇత్యాదులలో గూడ అపభ్రంశలక్షణమైన ఉత్వము కలిగి తెలుగునకు వచ్చుట, ప్రాకృత వ్యాకరణములలో అపభ్రంశసామాన్యలక్షణములను శౌరసేనివలన, ప్రాకృతమువలన గ్రహింపవలెనను విధులుండుట అను హేతువులచే ఈ ప్రాకృతలక్షణములలో పెక్కు అపభ్రంశము ద్వారముననే తెలుగునకు వచ్చినట్లు తెలియుచున్నది. కొన్ని మాత్రము షడ్విధ ప్రాకృతములను జదివిన తెలుగు పండితుల వలన చేరియుండవచ్చును. కావున అపభ్రంశప్రభావము తెనుగుపై కలదని చెప్పుటకు సందేహము లేదు.

చింతామణిపై త్రివిక్రమ ప్రాకృత వ్యాకరణ ప్రభావము

తెనుగునకపభ్రంశత్వమును నిరాకరించినను తెలుగుపై ప్రాకృత ప్రభావమును గమనించిన చింతామణి కర్త త్రివిక్రముని ప్రాకృత

---

[1] 'ఆదేర్జః' ప్రాకృత శబ్దానుశాసనము 1-3-74 సూ.

[2] 'శషోస్సః' ప్రాకృత శబ్దానుశాసనము 3-2-1 సూ.

[3] 'లోళః' అందే 2-2-47 సూ.

వ్యాకరణమున కడుగు జాడలలో నడచెను. చింతామణి పై ఆ వ్యాకరణము చూపిన ప్రభావమును బరిశీలింతము. ఈ పనికి ముందా ప్రాకృత వ్యాకరణ స్వరూపమును స్థూలముగా గమనింపవలెను.

ప్రాకృత సూత్రాధ్యాయ త్రయి యను పేర సూత్రరూపమున నీ వ్యాకరణమును త్రివిక్రముడు రచించెను. అతడే దాని యర్థము సులభముగా దెలియుటకై ప్రాకృత వ్యాకరణ వృత్తిని రచించెను. త్రివిక్రమ వ్యాకరణమునకే శబ్దానుశాసనమను పేరు తరువాత నేర్పడి యుండును.[1]

---

1. పశ్చిమ గోదావరిజిల్లాలో గల పోడూరు రామచంద్రగ్రంథాలయములో నీ పుస్తకము నాగరిలిపిలో నున్నది. దీనికి ముఖపత్రము లేదు. మొదట ప్రాకృత సూత్రాధ్యాయత్రయి, అకారాది సూత్రానుక్రమణిక, ప్రాకృత పదానుక్రమణిక, ఉదాహృత శ్లోకానుక్రమణిక గలవు. పిదప ప్రాకృత వ్యాకరణవృత్తి సూత్రసహితముగా ముద్రింపబడినది. ప్రాకృత సూత్రాధ్యాయ త్రయిలో కర్త పేరు లేదు. వృత్తిప్రారంభములో నున్న క్రింది శ్లోకము త్రివిక్రముడే సూత్రకర్త వృత్తికర్త అని తెలుపును. "ప్రాకృత పదార్థ సార్థ, ప్రాప్త్యై నిజ సూత్ర మార్గమను జిగమిషతామ్, వృత్తి ర్యథార్థ సిద్ధ్యై, త్రివిక్రమేణాను క్రమాత్క్రియతే."
ప్రాకృత శబ్దానుశాసనము 1 పు.

వృత్తికి చివర నున్న క్రింది శ్లోకమీ గ్రంథమునకు శబ్దానుశాసనమని పేరున్నదని తెలుపును.

శ్లో. "సప్రత్యయ ప్రకృతి సిద్ధ మదీర్ఘ సూత్ర
సత్కారకం బహువిధక్రియ మాప్తదేశ్యమ్,
శబ్దానుశాసన మిదం ప్రగుణ ప్రయోగమ్,
త్రైవిక్రమం జపత మన్త్ర మివార్థసిద్ధ్యై"

ఈ ప్రాకృత వ్యాకరణమునకు ఆంధ్రశబ్ద చింతామణికిని తుల్యముగానున్న సామాన్య విషయములను బరిశీలింతము.

సంజ్ఞలు : త్రివిక్రముడు పాణినీయమున లేని సంజ్ఞలను కొన్నింటిని కల్పించుకొనెను. చింతామణి గూడ పరుష సరళాది సంజ్ఞల నేర్పరచుకొనినది. మఱియు త్రివిక్రముడు కల్పించిన 'సః' మొదలగువానిని [1] అందు వాడబడిన యశ్రుతి [2] నామము [3] [4] బిందువు మొదలగు వానిని చింతామణి వాడుకొనినది. [5]

"సానునాసికోచ్చారంజిత్" [6] "సుప్స్వాది రంత్యహలా"[7] మొదలగు ప్రాకృత వ్యాకరణ పరిభాషలను గూడ చింతామణి ఉపయోగించుకొనినది. [8].

---

457 పుట అధస్సూచికకు తరువాయి

కాని యిది కొన్ని ప్రతులలోనే కలదు. ఈ గ్రంథమునే ప్రాకృత శబ్దాను శాసనమని యిందు వ్యవహరించితిని. కాని శబ్దానుశాసనము వాల్మీకి కృత మని తెలుగు పండితులు భావించుచున్నారు. వారు ప్రాకృత సూత్రాధ్యాయత్రయిలోని సూత్రములను వాల్మీకివిగా నుదాహరించియున్నారు. (అప్పకవి, అప్పక. 1-79, 85 నుండి) ఇంతకును ఈ వాల్మీకి యెవరో ? యితని వ్యాకరణమేదియో భావి పరిశోధనల వలన తేలవలసియున్నది.

[1] "షష్ఠ్యా ఉతోచి నుమ్‌సే" సంధి. కవిశిరో. 17 సూ.
[2] "యశ్రుతి మార్యాలఘుయం ప్రవదన్తి" అందే సంజ్ఞ. 21 సూ.
[3] "ప్రాతి పదికం హినామ"అందే 24 సూ.
[4] "బిందురను స్వారః" అందే సంజ్ఞ. 28 సూ.
[5] ప్రాకృత శబ్దాను శాసనము 1-1-8, 1-1-41, 1-3-10 సూ.
[6] కవిశిరో. అజంత. 12 సూ. (7) అందే 21, 22, 23 సూ.
[8] ప్రాకృత శబ్దానుశాసనము. 1-1-16 సూ. 1-1-4 సూ.

సంధి నిషేధ విధి :

ప్రాకృతమున 'సంధిస్త్వపదే' అని నిషేధముతో సంధులు ప్రారంభింప బడెను.[1] (సంస్కృతోక్తః సంధిః ప్రాకృతే భవతి, పదేతునభవతి. (సంస్కృతము నందు చెప్పబడిన సంధులన్నియు ప్రాకృతము వంగగును. ఏక పదమునందు గలుగవని దీనియర్థము.) ఇచట 'అపదే' యనుపర్యుదాసముతో సంధులారంభింప బడినవి.

చింతామణియందును "సంధిర్నాచోచ్యనుతః" (ఉకార వ్యతిరిక్తమయిన అజంతమున కచ్చు పరంబగునపుడు సంధిలేదు. ఉకారమునకు సంధి వచ్చునని తాత్పర్యము) అని ఉకార పర్యుదాసముతో సంధి పరిచ్ఛేదమారంభింప బడెను.[2]

ప్రాకృతమున పదసంధిని నిషేధించుచు సంస్కృత సంధులను ప్రాప్తింప జేసికొనినది ప్రాకృత సూత్రము. ఉకారాంత భిన్నములకు నిత్యసంధిని[3] నిషేధించుచు ఉకారాంతములకు సంధిని ప్రాప్తింప జేసినది చింతామణి. తెనుగు పదములు మొదట హలంతములు. తరువాతి కాలమున నుచ్చారణార్థము ఉకారమును చేర్చుకొనినవి. కావున వానికి మాత్రమే నిత్యసంధిని విధించుటలో నౌచిత్యమున్నది.

లోపవిధులు : త్రివిక్రమ వ్యాకరణమున "అంత్యహలో శదుది" అని సంధుల తరువాత లోప విధులు చెప్పబడినవి.[4] చింతామణిలోగూడ 'అపిశబ్దార్ధస్యైతః'[5] ఇత్యాది సూత్రములచే లోపవిధులు, తెలుప బడినవి. ప్రాకృత వ్యాకరణములో హల్లోపవిధులు చింతామణిలో అజ్లోపవిధులునుండుటవిశేషము.

---

1. ప్రాకృత శబ్దానుశాసనము 1-1-19 సూ.
2. కవిశిరో. సంధి 1 సూ.
3. ఇచటి నిత్యపదము వికల్పాభావమునకు పర్యాయముగా వాడ బడినది.
4. ప్రాకృత శబ్దాను శాసనము 1-1-25 సూ.
5. కవిశిరో. సంధి. 16 సూ.

బిందువిధులు : ప్రాకృతవ్యాకరణము "బిందుల్‌" 'శబ్దానామంత్య మకారస్య బిందుర్భవతి" (శబ్దములకు చివరి మకారము బిందువగును) అని బిందువిధులను తెల్పినది.[1] చింతామణిగూడ 'ప్రథమావైభక్తికమోర్బిందుశ్చ మహత్ పతిక్రియార్థేషు (పద్యాదులు పరమగునపుడు ప్రథమావిభక్తి మువర్ణమునకు పూర్ణబిందువు గూడవచ్చును) అని విధించుకొన్నది.[2] మకారమునకు బిందువు విధింప బడుట రెండు గ్రంథములందును సమానము.

త్రివిక్రముడు సంస్కృత విభక్తుల స్థానమున ప్రాకృత విభక్తులనాదేశముగా విధించుకొనెను. ఉ-'అమః' సుపఇత్యనువర్తతే. నామ్నః పరస్యసుపః సమ్బన్ధినః అమః ద్వితీయైక వచనస్యస్థానే మకారోభవతి (ప్రాతిపదిక కంటె పరముగా నున్న ద్వితీయైక వచన ప్రత్యయమైన అమ్ స్థానమున మకారమగును.[3]

ఇట్లే చింతామణిలో సంస్కృత విభక్తుల స్థానమున తెనుగు విభక్తులాదేశముగా విధింప బడినవి.[4] ఆంధ్రభాషా భూషణాదులలోనీ సంప్రదాయము లేదు.

శబ్దవిశేషవిభక్తి విధులు : ప్రాకృత సూత్రాధ్యాయత్రయి సంస్కృత విభక్తులకు ప్రాకృత విభక్తులను మొదట విధించిన తరువాత కొన్ని శబ్దములను ప్రత్యేకముగా సాధించుకొనెను. అందు

---

[1] ప్రాకృత శబ్దానుశాసనము. 1-4-41 సూ.

[2] కవిశిరో. సంధి. 16 సూ.

[3] ప్రాకృత శబ్దాను శాసనము 2-2-2 సూ.

[4] కవిశిరో. హలన్త. 40 సూ.

రాజన్ [1] ఆత్మన్ [2] శబ్దములు, సర్వనామములు గలవు. [3] చింతామణిలో గూడ అజన్త పరిచ్ఛేదమున సంస్కృత విభక్తులకు దెనుగు విభక్తులను విధించుకొనిన తరువాత అవిధాత్రాదులు, విధాత్రాదులు మొదలగునవి ప్రత్యేకముగా సాధించబడినవి. [4] హలన్త పరిచ్ఛేదములో సామాన్యముగా హలంత పదములు సాధింపబడిన పిమ్మట ఆత్మన్, రాజన్ మొదలగువానికి విశేష విధులుండుట గమనింపదగినది. [5]

యుష్మదాదులకు నామవిభక్తి విధులు :

త్రివిక్రముడు సర్వనామ విభక్తి విధులను ప్రత్యేకముగా జెప్పిన పిదప అస్మచ్ఛబ్దాదులకు ప్రాకృత సర్వనామముల నాదేశముగా విధించుకొనినాడు. [6] చింతామణిలో దేశ్యములయిన అస్మద్యుష్మచ్ఛబ్దములు ప్రత్యేకముగా సాధింపబడినవి. [7]

ప్రాకృతమున విభక్తిసహితమగు సంస్కృత ప్రాతిపదికలకు ప్రాకృత విభక్త్యంతముల నాదేశముగా సాధించుట ఉచితమే. తెనుగు

---

1. ప్రాకృత శబ్దానుశాసనము 2-2-53 నుండి 8 సూత్రములలో రాజన్ శబ్దమునకు చెందిన వివిధ రూపములు సాధింపబడెను.
2. టోవాత్మన్ ణి ఆణఇ ఆ 2-2-61. (ఆత్మనః పరస్య టావచనస్యణి, ఆ, ణ, ఇ, ఆణఇత్యాదేశా వాభవతః)
3. అండే 2-2-62 నుండి.
4. అధస్సూచిక కవిశిరో°. అజన్త. 48, 49 సూ.
5. అండే హలన్త. 7, 8 సూ,
6. ణేచశసా 2-3-18 (శసాసహాస్మచ్ఛబ్దః ణేతి, చకారాత్ అహ్మే ఇత్యాది త్రీనాదేశాం శ్చాపద్యతే)
7. దేశ్యాదస్మద్యుష్మచ్ఛబ్దాత్సుజసోర్ను మాంవురూచ స్తః కవిశిరో°. హలన్త. 14 సూ.

లోని నేను మొదలగునవి సంస్కృత వికృతులు కానందున చింతామణికర్త దేశ్యములయిన అస్మదాదులను ప్రత్యేకముగా సాధించుకొనెను.

సంస్కృతమున కారక విధి యొక తీరు. అది ప్రాకృతమునకు వచ్చునప్పటికి కొంత మారినది. కావున ప్రాకృత వ్యాకరణకర్త మారిన వానిని ప్రత్యేకముగా జెప్పుకొనెను.[1]

చింతామణి కర్త గూడ 'సర్వ విభక్తిస్సంస్కృతతుల్యాః' (అన్ని విభక్తులు సంస్కృతముతో తుల్యములు)[2] అని సామాన్యముగా జెప్పికొని, పిదప 'అన్యస్యాః క్వచిద్భవేచ్చాన్యా' (ఒక విభక్తికి మఱియొక విభక్తి వచ్చును.)[3] అని తెలుగునకు గల ప్రత్యేక విభక్తి రీతిని సూచించినాడు.

క్రియా విభక్తులు - అసమాపక క్రియా విధులు :

సంస్కృత తిఙ్ఙులు ప్రాకృత క్రియా విభక్తులుగా మారునని త్రివిక్రముడు చెప్పుకొనెను.[4] చింతామణిలో సంస్కృత లడాదుల స్థానమున తెనుగు క్రియా విభక్తులాదేశములుగా విధింపబడెను.[5]

---

[1] 'జేసోజమ్' జేస్ చతుర్థీ విభక్తిః, జమ్ ప్రాకృత షష్ఠీ విభక్తిః' జేసః స్థానే జమ్ భవతి. ప్రాకృత శబ్దానుశాసనము 23-3-5.

[2] కవిశిరో. హలన్త. 40 సూ.

[3] అందే 42 సూ.

[4] 'లట స్తిప్తావిజేచ్' లడ్వర్తమానమ్ తత్సమ్బంధినః ప్రథమ పురుషస్య ఏకత్వే వర్తమానౌ యౌ పరస్మై పదాత్మనే పదత్వేన విహితౌ తిప్ తజ్ ఇత్యేతౌ ప్రత్యేకం ఇచ్ ఏచ్ ఇత్యేతౌ భవతః ప్రాకృత శబ్దానుశాసనము 2-4-1 సూ.

[5] వ్యతిరేకార్థేల్రుటి లటి డు జ్ఞాస్యాత్ కవిశిరో. క్రియ. 19 సూ.

ఇచట చింతామణి ప్రాకృత సూత్రాధ్యాయత్రయివలె తిఙాదుల ఊసెత్తకున్నను పురుష వచనాదుల స్థానమున తెలుగు క్రియా విభక్తులను విధించుకొనుటవలన[1] తిఙాదులను గూడ చింతామణి ప్రక్రియలో గ్రహింపక తప్పదు.

కావున నీ విషయమున ప్రాకృత వ్యాకరణ ప్రభావము చింతామణిపై గలదనుట స్పష్టము. యీ పద్ధతి కేతనాదుల వ్యాకరణములలో లేదు.

అతిదేశ విధానము :

ప్రాకృత వ్యాకరణములో ప్రాకృతములకన్నింటికి వర్తించు విధులను మొదట తెల్పి, తరువాత శౌరసేన్యాదులకు ప్రత్యేకముగా వర్తించు విధులను తెల్పుట జరిగినది. శౌరసేన్యాదులలో చెప్పబడని సామాన్యకార్యములు ప్రాకృత విధులనుండి గ్రహింపవలెనని 'శేషం ప్రాకృతవత్'[2] అని అతిదేశింపబడినది. ప్రాకృత వ్యాకరణమున చెప్పబడని కార్యములు సంస్కృతమునుండి గ్రహింపవలెనని 'శేషం సంస్కృతవత్'[3] అను నతిదేశము తెల్పును. ఇట్టి యతిదేశములు పెక్కుకలవు[4] ఆంధ్రశబ్ద చింతామణిలో గూడ 'క్లీబసమాఅమహాద్వత్'[5] "అత్త్వాదితత్సమానామివదేశ్యానాం క్రియాపదానాంచ"[6] మొదలగు నతిదేశవిధులు పెక్కుకలవు. మఱియొక విశేషమును గమనింపుడు.

---

1. 'సర్వేషాం బహువచనే రు ఇతి స్యాత్' 'ఉత్తమస్యతు భవేన్మః' కవిశిరో. క్రియ 26, 27 సూ.
2. ప్రాకృత శబ్దానుశాసనము 1-3-26 సూ.
3. అందే 3-4-70 సూ.
4. అందే 3-4-68 సూ.
5. కవిశిరో. అజన్త. 83 సూ.
6. అందే. క్రియ. 50 సూ.

ప్రాకృత వ్యాకరణవృత్తి పీఠికలో ప్రాకృతములోని సంస్కృత సమముల లక్షణము సంస్కృత వ్యాకరణము నుండి తెలిసి కొనవలె ననియు, ప్రాకృత దేశ్యముల లక్షణమును సంప్రదాయము వలన నెఱుగవలయుననియు చెప్పబడినది. ప్రాకృత తద్భవములు మాత్ర మా గ్రంథమున సాధింపబడనున్నట్లు తెలుపబడినది.[1] అట్లే ఆ వ్యాకరణమున సంస్కృత భవములు మాత్రమే సాధింపబడినవి. దేశ్యములు సిద్ధములేయని మాత్రము చెప్పబడినెది.[2]

07483

చింతామణిలో అజంత పరిచ్ఛేదమున రాముడు మొదలగు తత్సమ శబ్దములు సాధింపబడినవి. చివర తెలుగులోని క్లీబసమములు, స్త్రీసమములు పుంలింగ సమములు క్రమముగా తత్సమములందలి అమహద్వాచకముల వలెను, స్త్రీ వాచకముల వలెను, మహద్వాచకముల వలెను, కార్యములను పొందునని యతిదేశము చేయబడినది.[3]

ఇట్లే క్రియా పరిచ్ఛేదములో తత్సమక్రియలను ఉపకృతి పరిణతి సంవృతి భేదములచే విభాగించి, వానికి సంబంధించిన విశేషములను తెలిపిన తరువాత చివర తత్సమ క్రియలకు వలెనే అత్వాదులు దేశ్య క్రియలకు గూడ వచ్చునని అతిదేశము చేయబడినది. దేశ్య క్రియలలో తద్ధర్మాద్యర్థములందు పురుషములందు వచనములందు వర్ణాగమము

---

1. ప్రాకృత శబ్దానుశాసనము పీఠిక
2. 'ఝాడగాస్తుదేశ్యాస్సిద్ధాః' ఝాడాదయశ్శబ్దాః దేశ్యాః దేశ విశేష వ్యవహారాదుపలభ్యమానాః సిద్ధాః నిష్పన్నాః ప్రసిద్ధా వా వేదితవ్యాః. ప్రాకృత శబ్దానుశాసనము 3-4-71 సూ.
3. 'క్లీబసమా అమహద్వత్' 'స్త్రీవత్ స్యుః స్త్రీసమాః సమాస్తు సమాః కవిశిరో. అజన్త. 83, 84, 85 సూ.

విశేషము అని సామాన్య విధి చేయబడినది గాని విశేషములు తెలుపబడలేదు.[1]

ఇట్లు త్రివిక్రముని ప్రాకృత వ్యాకరణ ప్రభావము ఆంధ్రశబ్ద చింతామణిపై మిక్కిలి కన్పడుచున్నది. కావున చింతామణిలోని సూత్రముల కర్థనిర్ణయము చేయునవుడు ఈ ప్రాకృత వ్యాకరణమును బర్యాలోచనము చేసినచో చింతామణి కర్త ఉద్దేశించిన అర్థములను గ్రహించుట కవకాశమేర్పడును.

చింతామణీ విశేషములను గమనించితిమి. చింతామణి వ్యాప్తి నందుటకు బాలసరస్వతీయము కారణము. దీని ప్రభావము తరువాతి చింతామణి వ్యాఖ్యలపై నున్నది. చింతామణిసారమును లోకమున కందించిన బాలసరస్వతి మహోపాధ్యాయుడు మొదట గౌరవమును దరువాత నగౌరవమును పొందినాడు. ఇదేక్రమమున జింతామణికి గూడ గౌరవాగౌరవములు గలుగుట గమనింపదగినది. చివరకు 'బాలసరస్వతియే చింతామణికి గర్త అను భ్రాంతిని గల్గించినది చింతామణీ బాలసరస్వతీయ సంబంధము.

కావున బాలసరస్వతీయ దర్శనము లేనిదే చింతామణీ దర్శనము సంపూర్ణము గానేరదు. బాలసరస్వతీయ దర్శనములో గనుపట్టు విశేషముల నరయుదము.

బాలసరస్వతీయ పాఠాంతరములెట్లేర్పడినవి ?

కొన్ని బాలసరస్వతీయ ప్రతులలో అథర్వణకారికలు లేవు. ప్రతులన్నిటిలో భాష ఒక విధముగ లేదు. ఈ ప్రతులలో విషయము

---

[1] 'అత్వాది తత్సమానామివ దేశ్యానాంక్రియాపదానాఞ్చ, వర్ణాగమో విశేషః పురుషేష్వర్థేషు చాపి వచనేషు' కవిశిరో. క్రియా 50, 51 సూ.

గూడ ఎక్కువ తక్కువలతో నున్నది. కొన్ని ప్రతులలో కొన్ని సూత్రములకు వ్యాఖ్యలు లేవు. ఇట్టిభేదము లేర్పడుటకు హేతు వేది?

సామాన్యముగా లేఖకుల హస్తలాఘవమే పాఠాంతరము లేర్పడుటకు కారణమగును. పద్యరచనలో కంటె వచన రచనలో లేఖక పాఠకులు పాఠాంతరములను కల్పించుట తేలిక. బాలసరస్వతీయము వచనమందుండుటచే అందు పాఠాంతరము లెక్కువ యేర్పడి యుండ వచ్చును.

లేఖకుడు తనకు లభించిన విశేషాంశములతో తన దగ్గరనున్న ప్రతిని సమగ్రముగా చేసికొనుటకు గూడ ఈహస్త లాఘవమును చూపి యుండవచ్చును. ఇపుడు పరిశోధన దృష్టితో ఫలాని విషయము మూలకారునిదేనా? తరువాతి వారేమైన ఇరికించినారా? అని గూడ పరిశీలించుచున్నాము. పూర్వము 'గ్రంథమెన్ని విశేషాంశములతో నున్న అంతమేలు' అను భావముతో తనకు దొరికిన విశేషాంశము లన్నింటిని తనవద్ద నున్న ప్రామాణిక గ్రంథమున చేర్చికొని వానిని సమగ్రముగా జేసికొనుటకు ప్రయత్నము జరిగి యుండవచ్చును. బాల సరస్వతీయమునకు పాఠాంతరము లేర్పడుటకివియన్నియు హేతువులే.

ఇంతకంటె మరియొక ముఖ్య హేతువు కాన వచ్చును. బాల సరస్వతీయమును ఆంధ్ర సాహిత్య పరిషత్తువారు వావిళ్ళవారు గూడ ముద్రించియున్నారు. వావిళ్ళవారి ప్రతిలోని భాషను కళా ప్రపూర్ణ వఝల చిన సీతారామ స్వామి శాస్త్రిగారు మిక్కిలి మార్చినారు.[1] తెనుగు వైయాకరణులలో వఝల వారు మాత్రము ప్రతిపాదించిన సంశ్లేషమీ ప్రతిలో మాత్రము కనబడును.[2] ఇందథర్వణ కారికలు

---

[1] బాలస. పీఠిక. వావిళ్ళప్రతి 15 పు.

[2] సంశ్లేషము = పూర్వ వర్ణముతో సంయోగము ... అంటే. సంధి. ౬౦ సూ. వృత్తి.

కొన్ని కలవు.[1] కావున నిది బాలసరస్వతి హృదయమును వెల్లడించ గలదనుటకు వీలులేదు. పరిషత్తువారి ముద్రిత ప్రతికి, రెండు అముద్రిత మాతృకలున్నవి. "అనంతపుర మండలములో బూదేడు కృష్ణా పురాగ్రహారములో శ్రీమాన్ వీరరాఘవాచార్యుల వారియొద్ద నుండి లభించిన మాతృక యొకటి, పిఠాపుర సమీపమునందలి చెందుర్తి గ్రామములో బ్ర. కొత్తపల్లి గంగయ్యగారి తాళపత్ర గ్రంథములలో నుండి యెరవు తీసికొని రాబడిన దొకటి"[2] ఈ రెండవ ప్రతిలో పీఠిక పద్యములు లేవు. ఇందే క్రియా పరిచ్ఛేదమున పలు నథర్వణ కారికలు దాహరింపబడినవి. ఈ రెండు లక్షణములు లేఖకుని మనస్తత్వమును బట్టియిచ్చును. వ్యాకరణ సంబంధము లేని పీఠికాంశములను వదలుట మూల గ్రంథములో గూడ తన కనవసరములని తోచిన అంశములను పదల గలడని సూచించును, ఈ విషయమే నకలు వ్రాయుటలో నీలేఖకుడు స్వాతంత్ర్యమును జూపగలడనుటకు ప్రమాణము. అనేక వ్యాకరణాంశములున్న అథర్వణకారికల నుదాహరించుట తనప్రతిని వీలయినంత సమగ్ర వ్యాకరణముగా జేయవలెనను కోరికకు గుర్తు. దీని కనుగుణముగనే విషయవివరణమునగూడ కృష్ణాపురాగ్రహార ప్రతికంటె జెందుర్తి ప్రతి బాగుగానెదిగినది.

ఏది బాలసరస్వతీయము ?

ఈ రెండింటిలో బాలసరస్వతి వ్రాసిన దానికి సరియగు నకలేది యని ప్రశ్న. బాలసరస్వతి పాకనాటివాడు. ఈ ప్రాంతమునకు పిఠాపురము కంటె యనంతపుర మండలమే దగ్గర.

కృష్ణాపురాగ్రహార ప్రతికంటె చెందుర్తి ప్రతి విస్తృతముగా నున్నది. చెందుర్తి ప్రతిలేఖకుడు మూలమునకు యథాతథముగా

---

[1] అందే. క్రియ. 40 సూ. వ్యాఖ్యలో. 273, 274 పుటలు.

[2] శ్రీ కొత్తపల్లి సూర్యారావు, ప. బాలస. పీఠిక 21 పు.

నకలు దీయవలెనను భావము గలవాడు గాదని లోగడ తెలుపబడెను. కావున కృష్ణాపురాగ్రహార ప్రతియే బాలసరస్వతి హృదయము చక్కగా ప్రకటింప గలదని చెప్పవచ్చును.

ఈ ప్రతియే బాలసరస్వతీయమనుటకు మరికొన్ని యాధారము లున్నవి. పై రెండు ప్రతులందు హలంత పరిచ్ఛేదము వరకు పెద్ద భేదములులేవు. ప్రధాన భేదము క్రియాపరిచ్ఛేదమందే. హలంతాంతము వరకు గల భాగములో నితరుల మతములను ఖండించుటగాని, యితరుల ప్రయోగములను సాధించుటగాని జరుగలేదు. క్రియాపరిచ్ఛేదమున చెందుర్తి ప్రతిలో "పూర్వస్యనవికారోనోః' అనుసూత్రము వలనను అంటకంట ఇత్యాది శబ్దములు సాధువులుగావు. 'మింటగడు దెల్లనై పాఱుచుంట జూచి' ఇత్యాది ప్రయోగములు డువర్ణక లోపముచేత వచ్చినవని తెలిసికొనునది"అని కొన్ని ప్రయోగములను ఖండించుట, కొన్నిటిని సాధించుట చేయబడినది. [1]

తెలియని దాని నంగీకరించుట బాలసరస్వతి కలవాటు. కృష్ణాపురాగ్రహార ప్రతిలో "పునరాగమః క్రియాణాం పర్యాప్తే మన్మతేతు సంకేతః" అను సూత్రమునకు వ్యాఖ్యలేదు. "ఇది సంప్రదాయవేద్యము" అని మాత్రము వ్రాయబడెను. [2] ఇట్లే ప్రాకృత భవసూత్రమునకు రెండు ప్రతుల యందును వ్రాయబడినది. [3] తెలియని దాని నంగీకరించుటకు విశాలమైన హృదయ ముండవలెను.

---

1. ప. బాలస.
2. అండే. 14 సూ.
3. అండే. 4 సూ.

చెందుర్తి ప్రతిలో 'పునరాగమః క్రియాణాం' ఇత్యాది సూత్రమునకు గూడ టీక గలదు. ఈ విషయములు గూడ కృష్ణాపురాగ్రహార ప్రతియే బాలసరస్వతీయమని తెలుపును.[1]

చెందుర్తి ప్రతి ప్రాచీనమా?

బాలసరస్వతీయము మిగుల మార్పులను పొంది చెందుర్తి ప్రతిగా రూపొందినది. ఇది ప్రాచీనమా? అర్వాచీనమా యని ప్రశ్న గలుగుట సహజము. అహోబలపతి 'అప్పకవీయ చింతామణికిని బాలసరస్వతీయ చింతామణికిని పెక్కు పాఠభేదములు కల'వనెను.[2]

ఈ రెండు ప్రతులే కాక అతడు మరికొన్ని ప్రతులను గూడ పరిశీలించినట్లు తెలియుచున్నది. సారంగధరుడనెడు పండితుడు వ్రాసిన టీక నతడు పేర్కొనినాడు.[3] కవిశిరోభూషణములో నున్న "శాస్త్ర మపౌరుషమాద్యం" అను శ్లోకము పరిషత్తు బాలసరస్వతీయమునకు మూలమగు రెండు ప్రతులలోను లేదు.[4] దానిని గూర్చి యహోబలపతి వ్రాసిన వాక్యములు గమనింపదగినవి. "క్వచిత్పుస్తకే సరస్వతీ కర లిఖిత ఏవ శబ్దానుశాసన ప్రణీతత్వేన పద్యం స్థితమ్" బాలసరస్వతి చేతితో వ్రాయబడిన ఒక పుస్తకమున శబ్దానుశాసన ప్రణీతముగా నీ పద్యమున్నది.) పద్యము కలదని చెప్పబడినను దానికి బాలసరస్వతి వ్రాసిన టీక కలదని చెప్పబడలేదు. అనగా నతడు టీకను వ్రాయకుండ శ్లోకమును మాత్రము వ్రాసికొనెననియర్థము. తరువాత దీని కర్థమును వ్రాసినవారును వేరు వేరు మార్గములను త్రొక్కిరి.[5] టీక లేకుండుటచే ప్రయోజన రహితమని కొందరీ శ్లోక

---

1. దీనినే పరిషత్తు వారి బాలసరస్వతీయమున 4095 ప్రతిగా వ్యవహరించిరి.
2. కవిశిరో. పీఠిక 72 శ్లో.
3. అందే 75 శ్లో.
4. అందే 11 సూ. వ్యాఖ్య.
5. 'శాస్త్ర మపౌరుషమాద్యం' అను వ్యాసమును చూ.

మును వదలి యుండఁడు. ఈ శ్లోకము చింతామణిలో తప్పనిసరిగా నుండదగినది. [1]

సటీకాంధ్రశబ్ద చింతామణిలో నీశ్లోకమర్థయుక్తముగనే కలదు. కాని యా అర్థము సంగతముగా లేదు. [2] ఇతర ప్రతులను సంపాదింపనిచో నీశ్లోక మహోబలపతి కెట్లు లభించును? కావున నతడు కవిశిరోభూషణ రచనమునకై పలు చింతామణి ప్రతులను, వ్యాఖ్యలను సంపాదించెననుటకు సంశయము లేదు. పరిషత్తు వారి ప్రతిలో చెందుర్తి ప్రతి పాఠములు కుండలీకరణములో చూపబడినవి. [3] 'అహోబలుడు రేఖాద్వయ ఘటితమగు ప్రతిలోని వ్యాఖ్య ననుసరించె,నని పరిశోధకులు తెలిపియున్నారు. [4] అహోబలపతి యనుసరించుటచే నిదియే సరియగు బాలసరస్వతీయ మని వారి యూహా. [5] కాని పైన పేర్కొనిన హేతువులు కృష్ణాపురాగ్రహార ప్రతియే సరియగు బాలసరస్వతీయ మగునని నిరూపించుచున్నవి. [6] అహోబల పండితీయము ననుసరించియే చెందుర్తి ప్రతి యేర్పడి యుండరాదా? అని శంకింపవచ్చును. [7] అహోబలపండితీయమతి విస్తృతము. చెందుర్తి ప్రతి దానికంటె సంక్షిప్తము. అంతకంటె కృష్ణాపురాగ్రహార ప్రతి సంగ్రహముగ నున్నది. వీనిలో క్రమవిస్తృతి యేర్పడెనని యూహించుట సముచితము. కాన అహోబల పండితీయము కంటె చెందుర్తి ప్రతి ప్రాచీనమని చెప్పవలెను. చెందుర్తి ప్రతిలో "చోరాత్మనే పదానాం గృహ్ణాతా వాగమస్య

---

1. అందే.
2. సటీకాంధ్రశబ్ద చింతామణి చెన్నపురి: వావిళ్ళ, 11 సూ.
3. దీనిని రేఖా ద్వయ ఘటిత ప్రతి యని శ్రీ చర్ల నారాయణ శాస్త్రి వ్యవహరించిరి.
4. శ్రీ చర్ల నారాయణ శాస్త్రి ప. బాలస. పీఠిక 20 పుట.
5. అందే.
6. ఏది బాలసరస్వతీయమను వ్యాసము చూ.

షేత్వం స్యాత్" (ఆత్మనే పదమర్థముగాగల 'కొను' అనునది పరమయినపుడు 'చు' అను నాగమమునకు వికల్పముగా ఇత్వము వచ్చును.) అను సూత్ర టీకలో "ఇంచుగాగమము లేకున్ననుగాని యీ వికల్పము వచ్చును" అని కలదు.[1] ఇది సూత్రమందు లేని విషయము.

అహోబలపతి "ఇంచుగ భావేపి నేర్చుకొని, నేర్చికొని, అందుకొని, అందికొని, ఇత్యాదా విత్వం భవ త్యేవ. అత్వాది తత్సమానా మిత్యుక్తేః" (ఇంచుక్కు లేకపోయినను నేర్చుకొని, నేర్చికొని, అందుకొని, అందికొని ఇత్యాదులలో 'అత్వాది తత్సమానాం' అని యుండుటచే ఇత్వము పచ్చును.) అని వ్రాసెను.[2] ఇచట చెందుర్తి ప్రతిలో చెప్పబడినదేయున్నను ఇత్వము 'అత్వాది తత్సమానాం' అను నతి దేశముచే గలుగునని ప్రమాణము నిచ్చుట విశేషము. ఇంతటితో ఆగక ఇరికికొని అను నన్నయ ప్రయోగమును జూపి, 'అమర్చుక వచ్చెన్' అను ప్రయోగము మూలరహితమని యతడు తిరస్కరించెను. కవిశిరో భూషణమును బట్టి చెందుర్తి ప్రతి బయలుదేరినచో పై విశేషముల నేల గ్రహింపలేదను ప్రశ్న బయలుదేరును.

వర్ణలోపాగమానైకే సర్వస్మిం స్తద్భవపదే (అన్ని తద్భవపదములందు వర్ణలోపాగమములు అనేకములున్నవి.) అను కారికచే తేజరిల్లు అనుచోట దేశ్య వర్ణకమగు రేఫ వచ్చెనని యహోబలపతి తెల్పెను.[3]

చెందుర్తి ప్రతిలో ఈ రూపమును సాధించునపుడు 'ర (ఱ) కారస్థానమున రేఫ వ్యవహారమన్నారు" అని కలదు.[4] ఇచట ర (ఱ)

---

1. ప. బాలస. క్రియ. 13 శ్లో.
2. కవిశిరో. క్రియ. 38 సూ.
3. కవిశిరో. క్రియ. 39 సూ. వ్యాఖ్య.
4. ప. బాలస. క్రియ. 13 శ్లో. టీక.

కారమును విధించు సూత్రమేది ? కారికచే దీనిని సాధించుకొనుట కవకాశముండగా వ్యాఖ్యాత ఏల అట్లు చేయలేదు ? అహోబలపతి వ్యాఖ్యను టీకాకారుడు చూచినచో నీ డొంకతిరుగుడు మార్గము నవలంబించునా ? మరియు నిచట నహోబలపతి యుదాహరించిన 'అకర్మణ స్సకర్మ త్వ' మిత్యాది కారికలు టీకలో లేవు.

చెందుర్తి ప్రతిలో "అద్యః క్రియాసుభూతార్థ ద్యోతి త మాద్యగం వినా సర్వః' అని చెప్పినాడు గనుక భూతార్థ ద్యోతిత క్రియయందు య కారమున కేత్వము వచ్చుచున్నది" అవి కలదు.[1] చనిమె ఇత్యాదులందు "ప్రథమైకస్యైద్భవేచ్చ భూతార్థే" అను దానిచే ఎ త్వము వచ్చునని యహోబలపతి చెప్పియుండెను.[2] ఇదియే యుక్తము. దీనిని చూచినచో చెందుర్తి ప్రతి టీకా కర్త పై విధముగా నేల వ్రాయును ? కావున చెందుర్తి ప్రతి పాఠ మహోబలపతికి పూర్వమున నున్నదే యనియు, దానిని గూడ చూచియే యహోబల పండితీయము బయలు దేరెననియు చెప్పవలసి యున్నది.

నిజమగు బాలసరస్వతీయ మేదియో తెలిసినది. బాలసరస్వతీయమున కేర్పడిన పాఠాంతరముల మాట తెలిసినది. బాల సరస్వతీయము చింతామణికి ప్రసిద్ధి తెచ్చిన వ్యాఖ్య. అందు లోపములు కలవని విమర్శకులు వ్రాసిరి. వారు లోపములని చెప్పినవానిలో కొన్ని లోపాభాసములు. ఆ విషయమును గమనింతము.

బాలసరస్వతి ప్రమాదాభాసములు :

మహాంధ్ర వైయాకరణులయిన చర్ల నారాయణశాస్త్రిగారు మహద్వాచకములకు ద్వితీయాది విభక్తులు పరమగునపుడు

---

[1] ప. బాలస. క్రియ. 6వ శ్లో. వ్యాఖ్య. 52 పు.

[2] కవిశిరో. సంజ్ఞ. 20 సూ. వ్యాఖ్య.

వచ్చు 'నిల' లు ప్రకృత్యవయవములే కాని విభక్త్యవయవములు కావని తెల్పినారు. విభక్త్యవయవములయినచో సమాసములలో సమాస విభక్తితోపాటు 'నిల' లు గూడ లోపింపవలసియుండుటచే తమ్మని నెయ్యము, తమ్ముల నెయ్యమువంటి రూపములు సిద్ధించవని వారు చెప్పిరి.

ప్రకృత్యవయవములయినచో సమాస విభక్తి లోపించినను 'నిల' లు లోపింపవు గనుక పై రూపములు సిద్ధించుట కాటంక ముండదు. 'లుక్చస్యాత్' అను సూత్రము నివర్ణక నిగాగమములకు రెంటికిని లోపమును జెప్పికొను పద్ధతి నంగీకరించుటచే తమ్మ నెయ్యము వంటి రూపములు గూడ సిద్ధించునని వారు చెప్పిరి.[1]

బాలసరస్వతి ఈ 'నిల' లు విభక్త్యాశ్రితములని చెప్పినాడు.[2] 'నిల'లను విధించిన "మహతో నిలావిభక్తౌ టాదౌ వచనద్వయే క్రమేణ స్తః" (మహద్వాచకమునకు తృతీయాది విభక్తులు పరనుగా నుండగా నేక బహువచనములందు క్రమముగా 'నిలలు వచ్చును.) అను సూత్రముగూడ 'ని' 'ల' లను ప్రకృతికే విధించెను. మహోపాధ్యాయుడును భాషాప్యాంత పైయాకరణుడు నగు బాల సరస్వతి కీ విషయము దెలియదా ? యని ప్రశ్న. విభక్త్యాశ్రితములను దానికి విభక్తిని ఆశ్రయించినవని యర్థము. విభక్తి కవయవమైన వానిని విభక్తి నిమిత్తముగా గలవానిని గూడ విభక్త్యాశ్రితములని చెప్ప వచ్చును.

నిలలు విభక్తి పరముగా నున్నపుడు వచ్చునవి గావున వానిని విభక్తి నిమిత్తముగా గలవని చెప్పుటలో నభ్యంతరములేదు. బాల

---

1. ప. బాలస. పీఠిక 18, 19 పుటలు.
2. "విభక్తి లోపమైనను దదాశ్రితమైన నిల లకు లోపములేదు" అండే హాలంత. 17 సూ. వ్యాఖ్య.

సరస్వతి నిలల లోపమును నిషేధింపవలసిన యవసర మొకటున్నది. 'అకృత వ్యూహాః పాణినీయాః' అను పరిభాషకు కైయటాది ప్రాచీన వ్యాఖ్యాతలు నిమిత్తము లోపించినచో నైమిత్తికమునకు గూడ లోపమువచ్చునను భావమును జెప్పిరి.[1] దాని ననుసరించి నిమిత్తమయిన విభక్తి లోపించినపుడు అది పరముగా నున్నప్పుడు వచ్చు 'నిల'లు గూడ లోపింపవలసియున్నది. ప్రసిద్ధమైన ఆపరిభాషచే లోపము ప్రాప్తించు నేమో యను శంకను నివారించుటకే బాల సరస్వతి 'విభక్తి లోపమయినను తదాశ్రితమయిన నిలలకు లోపము లే'దని వ్రాసినాడు. ఈ పరిభాష అప్రామాణికమని వైయాకరణ సార్వభౌముడగు నాగేశ భట్టు ఖండించెను.[2] ఈయన 1700 ప్రాంతమువాడు.[3] 1610 ప్రాంతమువాడగు బాలసరస్వతి యీతని ఖండనమును చదువుట అసంభవము గదా! కావున ప్రాచీన వైయాకరణుల మతము ననుసరించి బాలసరస్వతి యీ సమాధానమును జెప్పెను. కాగా బాలసరస్వతి చెప్పిన దానిలో లోపమేమియు లేదని సారాంశము.

'ఓ యీత్వ్య మన్త్రిణశ్చ వికృతౌ స్యాత్' అను దానికి బాల సరస్వతి' "ఓయి యనగ సంబుద్ధి యాంధ్రోక్తులందు" అని తెనిగించెను. "ఏకవచనం సంబుద్ధిః"[4] అను పాణినీయముచే సంబోధనైక వచనమునకు మాత్రమే సంబుద్ధి పదమును వాడవలసియున్నది.

---

[1] పరిభాషేందు శేఖరము 58 పరిభాషా వ్యాఖ్య, కలకత్తా : జీవానన్ద విద్యాసాగర్, (1892 సం.), 155 పుట.
[2] అందే.
[3] శ్రీ సీతారామశాస్త్రి 'నాగేశభట్టు విక్రమాబ్దము 1750 కి చెందిన వా'డని తెల్పిరి. దానిలో 57 సం. తీసివేయగా క్రీ. శ. 1693 వచ్చును. 'ప్రాస్తావికం' బృహచ్ఛబ్దేన్దు శేఖరః వారణాసిః (1960).
[4] సిద్ధాన్త కౌముది 192 సూ.

సంబోధన ప్రథమకు పర్యాయముగా సంబుద్ధి పదమును వాడుట యుక్తము కాదనుచు పండితులు బాలసరస్వతి అనువాదమును ఖండించిరి.[1] అథర్వణుడు గూడ "వికృతావత్రవాలోపః సంబుద్ధ్యే యిపదేతు యేః" అని ఇచట సంబుద్ధి పదమునే వాడినట్లు వారే గుర్తించిరి. 'ఓయి అను పదమునకు సంబోధనైక వచనమున మాత్రమే ప్రయోగములు కానవచ్చినవి. 'ఓయి దయా విహీనమతి' 'సంగతియె యోయి యిసుమంత టెంగణావు[2] 'శైనే యాత్మజుడా మురారి సుతు సాశంకంబుగా జూచి యోయీ నిట్టూర్పు లేల'[3] బాలసరస్వతి, అథర్వణుడు గూడ సంబోధనైకవచనమును మాత్రమే ఉద్దేశించి సంబుద్ధి పదమును వాడి యుందురు. పై పండితులు ఓరీ అను పదమునకు బహువచనమున వాడుక యున్నట్లే. 'ఓయీ' అనుదానికిని ఉండవచ్చునని అభిప్రాయ పడిరి. 'ఓయి' అను దానికి బహువచనమున ప్రయోగము కానరాలేదు. "ఓరి" అనుదానికి బహువచనమునగూడ పలు ప్రయోగములున్నవి. కావున సామ్యము సరిపడదు. ఒకవేళ ఏదైన మారుమూల 'ఓయి' అనుదానికి సంబోధన బహువచనమున ప్రయోగము కాన వచ్చినను, దాని నథర్వణ బాలసరస్వతులు గ్రహింపలేదని తలంచుట సముచితము. కావున నీ విషయమున బాలసరస్వతిని తప్పుబట్ట రాదు.

బాలసరస్వతి పొరపాటా !

"ఇదుపోత్తమోత్తమానా ముపోత్తమేత ఉద్భవతి" (ఇకారము పోత్తమముగను, ఉత్తమముగను గల శబ్దములకు బహువచనము

---

1. ప. బాలస. పీఠిక 12 పుట.
2. ఆముక్త. 4-60, మనుచరిత్ర 4-67 సూ. ని. 1 భా. (1936), 970 పు.
3. చంద్ర. 5.26 సూ. ని, 1 భా. (1936), 970 పు.

పరమయినప్పుడుపోత్తమే కారమునకు ఉత్వము వచ్చును.)[1] ఈ సూత్ర టీకలో బాలసరస్వతి ఉత్తమ శబ్దమున కంత్యాక్షరమని చెప్పెను. ఇట్లు చెప్పుటచే ఇరులు విరులు అనుచోట ఈ యుత్వము ప్రాప్తించుచున్నది. ఇది ప్రాయిక లక్షణముగాన పై రూపములో ప్రవర్తింపలేదని యతడు చెప్పెను. కాని సూత్రములో ప్రాయిక మను మాట లేనేలేదు. చర్ల నారాయణ శాస్త్రిగారిచట బాల సరస్వతి పొరపడినట్లు తెలిపి యున్నారు. వారు "త్ర్యాదీనామన్త్య ముత్తమమ్, తస్యసమీప ముపోత్తమమ్" అనుదానిని బట్టి మూడచ్చులు గల పదములలో చివరి యచ్చు ఉత్తమము. ఆ చివరి యచ్చునకు సమీపముగా నున్న వెనుకటియచ్చు ఉపోత్తమము. (ఇట హల్లులు పరిగణింపబడలేదు.) ఇకారముపోత్తమము గను, ఉత్తమముగను గల పదములకు బహువచనము పరమగునపుడు ఉపోత్తమ మగు నికారమునకు నుకారమగునని సూత్రార్థము. విరి శబ్ద మట్టిది గాదు గనుక నీసూత్రమునకు ప్రవృత్తియే లేదు. మఱియు బాల సరస్వతి ఇరులు అనియుదాహరించుటలో నతని యుద్దేశమేమో తెలియదు. చివర లువర్ణమును జూచి బహువచనమని భ్రాంతిపడియుండ వలెను. ఇరులను నది చీకటి యను నర్థమున నేకవచనాంత శబ్ద" మని వారు వ్రాసిరి.[1] ఈత్ర్యాదీనా మను నియమేనాడు బయలుదేరినదో! నిఘంటువులలో ఉత్తమశబ్దమునకు అంత్యవర్ణమను నర్థమే కలదు.[2] దాని నెరిగినచో బాలసరస్వతి యీ దారి త్రొక్కడు. లేని 'ప్రాయికము' ను తెచ్చిపెట్టుకొని 'విరులు' ను సమర్థించుటకంటె శ్రీ చర్ల వారు చెప్పిన పద్ధతి యుక్తముగానున్నది.

---

1. కవిశిరో°. హలంత. 26 సూ.

2. ప. బాలస. పీఠిక 13, 14 పుటలు.

3. శ్రీ మామిడి వేంకటార్యులు, శబ్దార్థకల్పతరువు 284 పుట.

'ఇరులు' అనుదానిని ప్రాచీనులు నిత్యైకవచనముగను,నవీనులు బహువచనముగను భావించిరని ఆచార్య అమరేశం రాజేశ్వర శర్మ గారు తెల్పియున్నారు.[1] నవీనులమతమే బాలసరస్వతికి నచ్చియుండును. కాన బాలసరస్వతి పొరపడెననుటకంటె శ్రీ చర్లహరి వ్యాఖ్య సముచితముగా నున్నదనుట యుక్తమనిపించును.

సున్నకు మకారము చేసికొనుట

బాలసరస్వతి 'అహమాదీనాం ద్విత్త్వమ్' అను సూత్రమును వ్యాఖ్యానించుచు "అహమ్ అనునది మొదలైన శబ్దములనుకరించు నపుడు వాని యంత్యమునకు ద్విత్త్వము వచ్చును. సున్నకు ద్విత్వము రానేరదు కాన మకారము చేసికొనునది." అని వ్రాసెను.[2] సంస్కృతమున అహమ్ మొదలగు శబ్దములు హలంతములు. వానికి చివర సున్నలేదు. కావున సున్నకు మకారము చేసికొనునది అను వచనము ప్రామాదికమని పరిశోధకులు భావించిరి.[3]

బాలసరస్వతి భాష్యాంత వ్యాకరణ పండితుడు. పాణినీయమున 'మోను స్వారః' అను సూత్రము హల్లు పరమయినపుడు మాంత పదము యొక్క మకారమునకనుస్వారమును విధించును.[4] ఇది సంస్కృత వ్యాకరణ విద్యార్థి ప్రారంభమందే పంచ సంధులలో జదువు సూత్రము. భాష్యాంతము చదివిన వానికిట్టి చిన్న విషయము తెలియదా ? 'అహమాదీనాం ద్విత్త్వమ్' అను సూత్రమునకు సమీపమున నొక బాలసరస్వతీయ ప్రతిలో పై సూత్రము వృత్తితో నుదాహరింప

---

1. ఆం. వ్యా. వికాసము ప్రథమ. 72 పు.
2. ప బాలస. సంధి. 5 శ్లో. వ్యాఖ్య.
3. శ్రీ చర్ల. నారాయణ శాస్త్రిగారు. ప. బాలస. పీఠిక 12 పుట.
4. సిద్ధాంత కౌముది. హల్సంధి. 122 సూ.

బడెను గూడ.[1] ఈ స్థితిలో పదాంత మకారము నాతడనుస్వారముగా భ్రాంతి పడుననుట వింతగా దోచును. కావున సున్నకు మకారము చేసికొనునదను వాక్యము మరింత పరిశీలింపదగినది.

ఇది యనుకరణ సందర్భము. అహమ్మని, కిమ్మని, ఝుం ఝుమ్మని అనునవి బాలసరస్వతి యుదాహృతులు.[2] ఇవి ఆలవోకగా నిచ్చిన ఉదాహృతులా? ఎచ్చటైన ప్రయోగింపబడిన పదముల కనుకరణములా? అనుకరణ సందర్భము గనుక నెచటివైన ప్రయోగముల ననుకరించి యుదాహరించుటయే జరిగియుండును. అహమ్ అను శబ్దమును వాల్మీకి ప్రయోగించెను.

శ్లో. దాసోహం కోసలేంద్రస్య రామస్యాక్లిష్ట కర్మణః
హనుమాన్ శత్రుసైన్యానాం నిహంతా మారు తాత్మజః[3]

---

1. బాలస. వావిళ్ళప్రతి, అజంత. 35 సూ. వ్యాఖ్య. 'అహమాదీనాం ద్విత్వమ్' అనునది చింతామణిలో 22 వశ్లోకము నందున్నది. వావిళ్ళ వారి బాలసరస్వతీయ ప్రతిలో 39 వశ్లోకమున గల 'తదుపరి పునర్మ్ర బూ ప్రాచామ్' అను సూత్ర వ్యాఖ్యలో 'మోనుస్వారః, మాంతస్య పదస్యానుస్వార స్యాద్ధలి" అని వృత్తితో గూడ నున్నది. 17 శ్లోకముల దరువాత స్వయముగా నుదాహరించిన సూత్రము, వృత్తి యితనికి దెలియవనుట యుక్తమా? ఒకవేళ మొదట తప్పు వ్రాసినను తరువాత నా సూత్రముదాహరించు సందర్భముననైన దనపొరపాటును సవరించుకొనడా? అది సరియైనదే యను భావముచే గ్రహించి యుండును. ఒకవేళ నిది తరువాతి వారు చేర్చిన దని భావించినను నింత చిన్న విషయము భాష్యాంతము చదివిన వానికి, త్ర్యర్థి కావ్యకర్తకు, శతాధిక గ్రంథకర్తకు దెలియదనుట యుక్తిదూరము.
2. అందే.
3. వాల్మీకి రామాయణము సుందరకాండము, చెన్నపురి: వావిళ్ళ (1925), 42 స, 34 శ్లో.

ఇందలి దాసోహామను పదబంధమునకు హల్లు పరముగానున్నది. కావున అనుకరింపబడునపుడిది 'దాసోహం' అని అనుస్వారాన్తముగనే యుండును. హల్లు పరముగా నున్నపుడు మకార మనుస్వారముగా మారినది. అనుకరించునపుడు హల్లు పరముగా లేదు గదా! ఇపుడనుస్వారాన్త మెట్లగునను ప్రశ్న ఉదయించును.

అనుకరింపబడు శబ్దము దుష్టముగా నున్నచో అనుకరించువాడు గూడ ఆశబ్దమునే యుచ్చరించి యనుకరింపవలెను. పై హనుమంతుని వాక్యము నందు హల్లు పరముగా నుండుచే మకారమునకు సున్న వచ్చినది. దాని ననుకరించునపు డనుస్వారాంతముగనే యుచ్చరింపవలెను.[1] బాలసరస్వతి యీ అహం శబ్దమునే యుద్దేశించెననుటకు ప్రమాణమేమని ప్రశ్న.

---

[1] మాహేశ్వర సూత్రములలో ఌ కారముగూడ పఠింపబడినది. సంస్కృతమున కౢప ధాతువునందు మాత్రము ఌ కారము గలదు. సంస్కృత వ్యాకరణ సంప్రదాయములను బట్టి వర్ణ సమామ్నాయములో ఌ కారోపదేశము లేకున్నను కౢప ధాతువునకు చెందిన రూపజాలములో నష్టమేమియు లేదు. కావున ఌ కారోపదేశమునకు వేరే ప్రయోజనము చెప్పవలసియున్నది. ఌ కారోపదేశ ప్రయోజనములలో అశక్తిజానుకరణ మొకటని భాష్యకారులు చెప్పిరి. (మహా భాష్యము, ఋ ఌ క్ సూత్ర భాష్యము, పస్పశాహ్నికము 57, 58 పుటలు.)
ఒక పిల్ల ఋతకుడను మాటను సరిగా పలుకలేక ఌ తకుడనెను. దానిని వేరొకరనుకరించుచు కుమారీ + ఌ తక ఇత్యాహ = కుమార్య్ ఌ తక ఇత్యాహ" అని చెప్పిరి. ఇట్టి చోట ఆదేశము వచ్చుటకు ఌకారోపదేశమవసరమని భాష్యకారులు చెప్పిరి. ఈసందర్భము 'పొరపాటుగానుచ్చరింపబడిన పదము ననుకరించు వారను కార్యుని వలెనే యుచ్చరింపవలె'నని స్పష్టము చేయుచున్నది. అప

శ్లో. "పదచ్ఛేదః పదార్థోక్తిః విగ్రహో వాక్యయోజనా ఆక్షేపోథ
సమాధానం"

అను వ్యాఖ్యానలక్షణములలో ఆక్షేపసమాధానము లతి ముఖ్యములు. పదాంతమున గాని, అచ్చు పరమగునపుడు గాని మకారము మకారముగనే యుండును. అట్టిచో ప్రశ్నయే లేదుగాన సమాధాన మవసరముగాదు. హల్లు పరమయినపుడు మకారమనుస్వారముగా మారును. అట్లనుస్వారాంతమయిన పదము ననుకరించునపుడే సమాధానము చెప్పుట అవసరమగును. కావున

పైయుదాహరణము కాకున్నను ఇట్టియుదాహరణము నుద్దేశించి మాత్రమే 'సున్నకు మకారము చేసికొనునది' యను సమాధానము చెప్పవలెను. మఱి తక్కిన ఉదాహరణముల మాట.

శ్లో. క్షాన్తిశ్చేద్వచనేన కిం కిమరిభిః క్రోధోస్తి చేద్దేహినాం
జ్ఞాతిశ్చే దనలేన కిం కిము ధనై ర్విద్యా నవద్యాయది
వ్రీడా చేత్కిము భూషణైః సుకవితా యద్యస్తి రాజ్యేన కిమ్.[1]

ఇందు 'క్షాన్తిశ్చేద్వచనేన కిం' 'జ్ఞాతిశ్చేదన లేన కిం' అను చోట కిమ్ అను శబ్దమునకు హల్లు పరముగా నుండుటచే మకారమున కనుస్వారము వచ్చును. ఇందు 'జ్ఞాతిశ్చే దనలేన కిమ్' అను వాక్యమునకు రామరాజ భూషణుని యనుకరణ ప్రయోగము గూడ గలదు. "జ్ఞాతిశ్చే దనలేన కిమ్మనెడి వాచారూఢి సత్యమ్ముగన్[2]

---

479 పుట అధస్సూచికకు తరువాయి

శబ్దమునే అనుకరించునపుడు యథాతథముగా నుచ్చరింపవలసినచో నితర శబ్దములననుకరించునపుడు అనుకార్యుని యుచ్చారణము వంటి యుచ్చారణమే కావలెనని వేరే చెప్పనక్కర లేదు గదా!

1. భర్తృహరి, 'సుభాషితత్రిశతి' భర్తృహరి సుభాషితము భీమవరం: కన్యకాపరమేశ్వరీ బుక్ డిపో, (1929), 1-19 శ్లో.
౨. వసుచరిత్ర ౩-101 ప.

ఈకవి బాలసరస్వతికి బూర్వుడే. ఈ ప్రయోగములో ననుకరింపబడిన ‘కిం’ శబ్దమునే బాలసరస్వతి యుదాహరించి యుండవచ్చును. కావున నిచట ననుకరణ సమయమున సున్నకు మకారము చేసికొనవలసి యున్నది.

ఇంతకును ‘అహం’ ‘కిం’ అనునవి ఏ భాషాపదములో మనకు దెలియదు. చింతామణి కారుడు సంస్కృత ప్రాకృతములు రెండును దెలుగునకు బ్రకృతులని చెప్పెను. కావున ప్రాకృతములోని అహం, కిం శబ్దములను గూడ బాలసరస్వతి యుదాహరించి యుండవచ్చును.[1] ప్రాకృత వ్యాకరణములందు ‘బిందుల్’[2] అను సూత్రము సంస్కృత మకారమునకు సున్నను విధించును. కావున బాలసరస్వతి వాక్యమును తప్పనవలసిన పనిలేదు.

‘ఝుం ఝుం’ అనునది అనుకరణ శబ్దము. దీనికి చివర మకారమున్నదా బిందువున్నదా యని ప్రశ్న. మన తెలుగును ప్రాచీనులు ప్రాకృత భేదముగా గణించిరి.[3] ప్రాకృత భాషా ప్రభావము తెనుగుపై నుండుటచే గొన్ని ప్రాకృత మర్యాదలు తెలుగులో చోటు చేసికొన్నవి. కావుననే ప్రాకృతమున వలె పదములను బింద్వంతముగా వ్యవహరించుట తెలుగువారి కబ్బినది. అందువలననే ‘ఝుం ఝుం’ అను నవ్యక్త శబ్దముల ననుకరించునపుడు గూడ చివరసున్న ఉన్నట్లు గుర్తించుట జరిగినది.

ఇచట సంస్కృత ప్రాకృతములు రెండింటిలో బింద్వంతములుగా నుండిన ‘అహం, కిం’ అను నుదాహరణముల నిచ్చుటలో

---

[1] ప్రాకృత ప్రకాశ 6-40 సూ. అండే ‘పదానానూనుక్రమణికా’ 282 పుట.

[2] ప్రాకృత శబ్దానుశాసనము 1-1-40 సూ.

[3] విన్నకోట పెద్దన కావ్యా. చూ. 9 ఉ. 8 ప.

బాలసరస్వతి జాగరూకత వ్యక్తమగును. కావున నిట బాలసరస్వతి పొరపడెననుటకు వీలులేదు.

పరిశోధకులొకరు ప్రాచీన కాలములో తెలుగునాట పదాంత మకారము ననుస్వారముగా వ్రాయుటగలదని గుర్తించినారు. కాని వారిది పొరపాటు వ్యవహారమని భావించుచున్నారు. [1] కేతన

ఇలసంస్కృత పదములపై
నెలకొని నిల్చిన విసర్జనీయములు సు
న్నలు నిలువవు తెనుఁగులలో
నలవడగాఁ బల్కుచోట నభినవ దండీ. [2]

అని చెప్పెను. అనంతుడు

పన్నుగ మకారహల్లగు
సున్న మకారమగు నచ్చు సోఁక సమగ్రం
బన్న మన ఋ కారం బా
సన్నంబుగ మృత్వ మగు రస సమృద్ధి యనన్. [3]

మకార మంతమందుగల ఈ 'సమ్' అను నుపసర్గను సం అని యను స్వారాంతముగానంతుని కాలమున బండితులు సైతము వ్రాసెడివారు. కావుననే 'సం' అనునప్పుడా చివరి సున్న కచ్చు పరమగుచో నాసున్న మకారమగునని" వచించినాడని పై పరిశోధకు లభిప్రాయపడిరి. [4] వీరికి వలెనే వాడుక ననుసరించి అహామ్ మొదలగు

---

1. కళాప్రపూర్ణ వడ్లమూడి గోపాలకృష్ణయ్యగారు ఆం. భా. భూ. పీఠిక కళాకృష్ణుల గ్రంథమాల 58 పు.
2. ఆం. భా. భూ. 30 పు.
3. ఛందో. 4 ఆ. 61 ప.
4. ఆం. భా. భూ. పీఠిక 44 పుట.

సంస్కృత పదములలో చివర నున్న మకారము ననుస్వారమని భ్రమించి బాలసరస్వతి సున్నకు మకారమును విధించెనని వీరి ఊహ. కాని బాలసరస్వతి వాక్యమును పొరపాటనక్కరలేదని పైన గమనించితిమి.

సంస్కృత పదాంతములందున్న మకారమును ప్రాచీనులు సున్నగా వ్రాయుచుండుట సత్యమే. దానికి కేతన అనంతుల వచనములే ప్రమాణములు.

అనంతుడు మరియొకచోట

‘బిందు పూర్వకమై తమలోన బొందు బమలు’

అని లక్షణమును దెల్పి

“... ... ... లో
కంబులెల్ల నుండు సొంమితోడ” అని యుదాహరించెను. [1]

చిత్రకవి పెద్దన,కూచిమంచి తిమ్మకవి సార్వభౌముడు పై లక్షణము నంగీకరించిరి. [2] వీరు ‘సొంము’ బింబంము, ఇంము వంటి రూపముల నంగీకరించిరి. వావిళ్ళవారి బాలసరస్వతీయ ప్రతిలో వనంము అను రూపముగూడ సాధించబడినది. [3]

వీరందరు సంస్కృతాంధ్ర పండితులు, ఆంధ్ర లాక్షణికులు. వారి వ్యవహారమే ప్రామాదిక మయినచో మరెవరి వ్యవహారము ప్రమాణమగును? సంస్కృత మకార స్థానమున సున్నను వ్రాయుచుంటిమని యీ లాక్షణికులకు దెలియుననుటకు “మకార హల్లగు సున్న మకారమగు” అను ననంతుని వచనము ప్రమాణము. అది

---

1. ‘అనంతుని ఛందము’ 1-40, 41 ప. ఆం. భా. భూ. పీఠిక 91పుట.
2. అందే ౫2 పుట.
3. బాలస. వావిళ్ళ, అజంత. 34 సూ. వ్యాఖ్య.

మకార హల్లయినను వాడుకలో సున్నగా వ్రాయు చుండిరనియు, అచ్చు పరమయినపుడు దానిని మకారముగనే వ్రాయవలయుననియు ననంతుని వాక్య భావము.

నేడు విశ్వవిద్యాలయములందు గూడ వ్యావహారిక భాషను వాడుచున్నారు. ఈ భాషను పూర్వ వ్యాకరణ సూత్రములకు సమన్వయించినచో దప్పనవలసి వచ్చును. కాని మేధావులు పండితులు లాక్షణికులును భాషాపరిణామ క్రమమును గుర్తించి వాడుక భాషను వ్రాయుట కంగీకరించియున్నారు. కావున వాడుకభాషను వ్రాయుట నేటి పద్ధతిగా స్వీకరింపవలసినదే గాని నేటివారందరును బొరపడిరనరాదు గదా!

కళాప్రపూర్ణ వడ్లమూడి గోపాలకృష్ణయ్యగారు వ్యావహారిక భాషకు గూడ వ్యాకరణమును వ్రాసినారు. అనగా దానినిగూడ బ్రామాణికమేయని లాక్షణికులు గూడ అంగీకరించిరన్నమాట.

సంస్కృతమందలి మకారాంతపదములు ప్రాకృతమున ననుస్వారాన్తముగా మారుచున్నవి. తెలుగును గూడ బ్రాకృతముగా భావించిన తెలుగు లాక్షణికులు సంస్కృత సమములకు, దెలుగు పదములకు జివరనున్న మకారము ననుస్వారముగా వ్రాసెడి వారు. అంతటితో నాగక సంస్కృతపదములకు జివర నున్న మకారములను గూడ ననుస్వారముగ వ్రాసినారు. అనగా వారి దృష్టిలో మకారపు బొల్లును బిందులిపిలో వ్రాయవచ్చునను నంగీకారము గోచరించును. పండితులంగీకరించిన వాడుక భాషను వడ్లమూడి వారు గుర్తించి వ్యాకరణమును వ్రాసినట్లే సంస్కృత పదముల ననుస్వారాంతములుగా వ్రాయుపద్ధతిని అథర్వణుడు గుర్తించి, యంగీకరించి

శ్లో, శబ్దానామన్త్య భాగేషు యోనుస్వారః ప్రదృశ్యతే
తస్యాచిపరతో మస్యాత్సర్వత్ర కవి సమ్మతేః'

(అంతట కవిసమ్మతి యుండుటచే శబ్దముల చివర కనబడు ననుస్వారమునకచ్చు పరమగునపుడు మకారమువచ్చును.) అని లక్షణమును వ్రాసెను.[1] అంతట అనుటచేత అనుస్వారాంతముగా వ్రాయుచున్న సంస్కృత పదములు అనుస్వారాంతములయిన ప్రాకృత సమములు, తెలుగు పదములు గూడ గ్రహింపవచ్చును. ఇట్లే నెంమి, ఇంము వంటి రూపముల నంగీకరించుచు

శ్లో. కేచిద్వదన్త్య భేదత్వ మనుస్వార మకారయోః

(కొందరనుస్వార మకారములకభేదమును జెప్పుచున్నారు.) అని లక్షణమును వ్రాసెను.[2] నెమ్మి నెంమి ఇంము ఇమ్ము అను రెండు రూపములు నుండ వచ్చునన్న మాట. 'కంమని లతాంతములకుం మొనసి' అను భారత ప్రయోగము గూడ నీవిషయము నంగీకరించునదే.[3] కమ్మని లతాంతములను నన్నయ పద్యమున 'కంమని' 'కుం మొనసి', మధుపంములు, నినదంములు, చూతంములు, కిసలయంములు మొదలగు పదములు ప్రాసస్థానమున నున్నవి. లతాంతములకున్ + మొనసి అనుచోట 'బిందుం ప్రవదన్తి తంక్వచిత్కేచిత్' (సరళ స్థిరములకు ముందున్న ద్రుతమునకు ఒకచో బిందువు వచ్చునని కొందరనిరి.) అను చింతామణి నకారమునకు బిందువును విధించుచున్నది గాని మకారమును విధించుటలేదు.[4] కాగా బిందుయతి నియమ ప్రకారము తక్కిన స్థలములలో గూడ బిందు వుండవలెను.

ఇట్లు 'కంమని' ఇత్యాదులలో బిందువుండుట ప్రాచీనులంగీకరించినను నేటి యలవాటునకిది వింతగా దోచుటచే నేటి లాక్షణికులు

---

1. కవిశిరో భూషణచంద్రిక సంధి. 19 సూ. వ్యాఖ్య.
2. అందే.
3. ఆం. భా. ఆది. 5-138 ప.
4. కవిశిరో. సంధి. 27 సూ.

"ప్రాసంబున మకారంబు పరంబగుచో ద్రుతంబునకు మకారాదేశం బగు" నని చెప్పికొని లతాంతముల కుమ్మెనసి' వంటి రూపములను సాధించుకొనినారు. [1]

కావున మకారాన్త పదముల ననుస్వారాన్తముగా వ్రాయుట, నెంమి ఇంము ఇత్యాదులలో బిందువును వ్రాయుట అను ప్రాచీనుల పద్ధతులను పొరపాటుగా గాక ఆనాటి పండిత కవీంద్రు లంగీకరించిన పద్ధతులుగా గౌరవించుట న్యాయ్యము.

ఆంధ్ర కౌముది రూపాంతరము నొందిన చింతామణియే

శ్రీ మండ లక్ష్మీ నృసింహకవి ఆంధ్ర కౌముదిని రచించెను. చింతామణియే రూపాంతరము నొందుటచే నట్టి గ్రంథమేర్పడినట్లు తెలియుచున్నది. వాతః,[2] నఃకా [3] డాబ విధాత్రో దేరుః,[4] మొదలగు సూత్రములు చింతామణి నుండి యథాతథముగా ఆంధ్ర కౌముదిలోనికి గ్రహింపబడినవి. పలు సూత్రములు చిరు మార్పులతో గ్రహింపబడినవి. నస్యాత్తద్ధర్మతః,[5] నతద్ధర్మే,[6] ఆద్యాయాః పఞ్చాశద్వర్ణాః,[7] పఞ్చాశదాద్యాయాః,[8] మొదలగునవట్టివి. ఇందు

---

1. శ్రీ బహుజనపల్లి సీతామాచార్యులు ప్రౌఢ వ్యాకరణము సంధి. 22 సూ.
2. కవిశిరో. సంధి. 2 సూ. ఆంధ్ర కౌముది సంధి. 65 సూ.
3. కవిశిరో. అజంత. 24 సూ. ఆంధ్ర కౌముది శబ్ద. 166 సూ.
4. కవిశిరో. అజంత. 48 సూ. ఆంధ్ర కౌముది శబ్ద, 182 సూ.
5. కవిశిరో. సంధి. 6 సూ.
6. ఆంధ్ర కౌముది సంధి. 75
7. పబాలస. సంజ్ఞ. 4 శ్లో.
8. ఆంధ్ర కౌముది భాషా. 14 సూ.

చింతామణి సూత్రములకంటె ఆంధ్ర కౌముదీ సూత్రములు సంక్షేపముగానుండుట గమనింపదగినది.

చింతామణి సంస్కృత ప్రాకృత వ్యాకరణ సంప్రదాయములను వాడుకొనినది. ఆ సంప్రదాయములకు మూలములగు సంస్కృత ప్రాకృత వ్యాకరణ సూత్రముల నాంధ్ర కౌముది ప్రమాణముగా జూపినది. దీనికి మొదటనున్న 'హలన్త్యమ్'వంటి పాణినీయ సూత్రములును,[1] కొంచెముమార్పునందిన 'హోహ్రస్వస్య'[2] ఇత్యాది ప్రాకృత సూత్రములు నుదాహరణములగును.

ఇతడు చింతామణిలో లేని మరికొన్ని సూత్రములను గూడ రచించినాడు. 'తోడుతశ్చ' 'పొంటేచ' అను సూత్రములు తృతీయార్థమున 'తోడుత, పొంటె'అను విభక్తి ప్రత్యయములను విధించును.[3] వీనిని చింతామణి చెప్పలేదు. కాని యిట్టివి తక్కువ. మొత్తము చింతామణి సారమంతయు దీనిలోనున్నది. దీనిలో చింతామణి సూత్రములకు వన్నెబెట్టు యత్నము కనబడును.

"సామానాధి కరణ్యేషూ దన్తానాం టుగాగమోఽ చిస్యాత్"
(కర్మధారయములందుత్తునకచ్చు పరమగునపుడు టుగాగమమగును.)

అని చింతామణి సూత్రము.[4] ఇచట కర్మధారయములందు అను బహువచనముచే కర్మధారయేతరములందు గూడ టుగాగమము రావచ్చునని వ్యాఖ్యాతలు వివరించిరి. బహువచనముచే తద్విరుద్ధమును గ్రహించుట వింతగా కనబడును. కావున లక్ష్మ

---

1. ఆంధ్ర కౌముది పరిభాషా. 5 సూ. సిద్ధాంత కౌముది 1 సూ.
2. అందే ౪౮ సూ. ప్రాకృత శబ్దాను శాసనము 1-8 సూ.
౩. ఆంధ్రకౌముది శబ్దాః 150, 151 సూ.
౪. కవిశిగో. సంధి. ౩౩ సూ.

నృసింహాకవి 'టుగచ్యుతః కర్మధారయే' [1] అని బహువచనమును దొలగించెను. ఇట్టివి పెక్కుకలవు. చింతామణి క్రీ. శ. 1450 ప్రాంతమున రచింపబడెనని శేఅూకచో నిర్ణయింపబడెను. [2] 16వ శతాబ్ది పూర్వార్ధములోనున్న అల్లసాని పెద్దన మహాకవి ప్రయోగమును లక్ష్మీనృసింహ కవి ఉదాహరించెను. [3] కావున నీ కౌముది చింతామణికి దరువాతిదేయనుట స్పష్టము.

పై పరిశీలనముచే లక్ష్మీనృసింహ కవి చింతామణి సూత్రములకు దనకు దోచిన మార్పులనుచేసి, వాని నాంధ్ర కౌముదిలో బెట్టుకొనెనని వెల్లడి యగుచున్నది.

ఆంధ్ర కౌముది చింతామణి నేల దలపలేదు ?

రూపాంతరము నొందిన చింతామణియే ఆంధ్ర కౌముదియైనపుడు తత్కర్త చింతామణి నేల దలపలేదని ప్రశ్న. తాము ప్రాచీనుల గ్రంథములననుసరించుట ద్వారా వారియందు గౌరవమును వ్యక్తముచేయు జాణలు కొందరుందురు. వారు గ్రంథాదిలో వేరే పూర్వుల ప్రశంస చేయరు. చింతామణి బాలవ్యాకరణము మొదలగునవట్టివి. అట్టివారు తమ గ్రంథమునకు విషయము నందించిన ప్రాచీనుల పేరులను వ్రాయకుండుటలో వింతలేదు. కాని లక్ష్మీనృసింహ కవి ఆంధ్రకౌముది కాదిలో సోమచంద్ర, కణ్వ, సోమ, భృగు, పుష్పదంత, విష్ణు చంద్ర, సురముని, నాగరాజులకు నమస్కరించినాడు. అథర్వణ, కాణ్వ, బార్హస్పత్య గ్రంథముల నెఱిగి యీ యాంధ్ర

---

1. ఆంధ్రకౌముది సంధి. 104 సూ.
2. చింతామణి కాలము అను వ్యాసము చూ.
3. 'జవరాండ్ర నెపంబిడి పల్కరించు లాగింతి యకాఁ' ఆంధ్రకౌముది శబ్దాః, అజన్తాః, 210 సూ. వ్యాఖ్యలో.

కౌముదిని రచించుచున్నానని తెలిపినాడు.[1] చింతామణి నుండి యితడు గ్రహించిన విషయము తక్కిన అన్ని గ్రంథములనుండి గ్రహించిన విషయము కంటె సుమారు పదిరెట్లెక్కువ ఉండును. ఈస్థితిలో చింతామణి కర్తను స్మరింపకుండుటలో నౌచిత్యమేమి యను ప్రశ్న అట్లే మిగిలినది.

మహోపాధ్యాయుడు, మహాపండితుడు, మహాకవియునైన బాలసరస్వతి వ్యాఖ్యానించుటతో నాంధ్ర శబ్ద చింతామణికి మంచి ప్రసిద్ధి వచ్చుచున్నది. కాని అందున్న లక్షణములలో గొన్నింటికి మూలము త్రిలింగ శబ్దానుశాసనము, ఆంధ్ర భాషాభూషణము, కావ్యాలంకార చూడామణి, అనంతుని ఛందమువంటి ప్రాచీన లక్షణ గ్రంథములలో గనబడుచున్నది. కాని చింతామణి కర్త వారెవరి పేరులను దలపలేదు. లోకము ఈ నన్నయ యెవడో ఆద్యుడను భావముతో నీగ్రంథము నందలము నెక్కించుచున్నది. ఇది బహు గ్రంథ పరిశీలన దక్షుడగు లక్ష్మీనృసింహ కవికి నచ్చియుండదు. కాని గ్రంథ విషయము బాగున్నది. శ్లోకరూపములో నున్న చింతామణిని బాల సరస్వతి సూత్ర గర్భితమని చెప్పినాడు. సూత్రరూపములో వ్రాయ దలచినచో దానిని మరింత బిగువుగా గ్రథింపవచ్చును. కావున ప్రాచీన వైయాకరణుల విషయములను గొన్నింటి నందుకొనుచు, చింతామణి సూత్రములను బరిష్కరించుచు నాంధ్ర కౌముది రచనము సాగినది. బాలసరస్వతి "చింతామణిని యుగాది సంభవుడైన నన్నయ యెవడో వ్రాసె"నని చెప్పెను. ఎప్పటినుండి ప్రారంభ మయ్యెనో గాని ఆంధ్ర వ్యాకరణమున నాతనినే ప్రథమాచార్యునిగా భావించు ధోరణి యొకటి బయలుదేరినది. అతనికి ముందే పలువు రాంధ్ర వైయాకరణులు గలరనియు, నందలి సూత్రముల నంతకంటె నంద

---

1. ఆంధ్ర కౌముది పీఠిక శ్లోకములు 1, 2 శ్లో.

ముగా రచింపవచ్చునని వెల్లడించుట కీత డీ గ్రంథమును రచించి యుండును.

తద్విషయమందున్న ఆదరముచే దానిని పరిగ్రహించినను, తత్కర్తయే ఆదివ్యాకర్తయను వాదమున గల వైముఖ్యముచే చింతామణి కర్త స్మరణమును వీడెనని తోచుచున్నది. ఇది ఊహయే యైనను నిరాధారము మాత్రము గాదు. లక్ష్మీనృసింహ కవి గ్రంథాదిలో "పూర్వ మేవాంధ్ర భాషోత్పత్తి ర్భగవతా వాల్మీకినా ప్రోక్తా ప్రాకృతాదిషు" (పూర్వకాలమే భగవంతుడగు వాల్మీకి ప్రాకృతాదులయం దాంధ్రభాషపుట్టుకను గూర్చి చెప్పెను.) [1] అని వ్రాసెను. ఆంధ్రభాష అతిప్రాచీనమని చెప్పుటకు వ్రాసిన వాక్యమే గదా యిది!

తరువాత రాపణీయమునుండి ఆంధ్రభాషోత్పత్తి కథను వ్రాసెను. [2] ఆంధ్రకౌముది సూత్రగ్రంథము. ఈ కథ శ్లోకములలో నున్నది. తరువాత తెలుగులో 'లింగమర్యాద' కలదను విష్ణువచనమును, శాస్త్ర విరుద్ధము వదలవలెనను మహేంద్ర వచనమును, అల్పజ్ఞుల ప్రయోగములు ప్రమాణములు కావను సోమ చంద్ర కణ్వుల మతములను తెలిపెను. మరియు పుష్పదంతుని ప్రయోగనిర్వచనము, ఆచార్యుని (?) ప్రయోగ ప్రాధాన్య మతమును తెలిపినాడు. కణ్వుడు చెప్పెననుచు, ఆంధ్ర భాష దేవతా సంతోషకరమనియు, అది స్వర్గమునిచ్చునదనియు, శ్రుతి స్మృతి వచనముల నుదాహరించెను.

---

1. ఆంధ్ర కౌముది - పీఠిక.
2. ఈ శ్లోకములు త్రిలింగశబ్దానుశాసనమున (తత్సమ 38 శ్లో. నుండి 43) ఉన్నవి. బ్రహ్మాండపురాణములో గలవని కళాప్రపూర్ణ వడ్లమూడి గోపాలకృష్ణయ్యగారు వ్రాసిరి. వైకృత చంద్రికా స్వ. స్వ. మ. గవేషణ XXX 111

తెలుగు మహావిష్ణువున కిష్టమనియు, ధర్మరాజు తెలుగుభాష మాట్లాడ వలెనని కోరుకొనెననియు, తెలుగును ప్రశంసించు శ్లోకముల నిచ్చెను. చివరకు కణ్వాది మహాత్ములు చెప్పినందున తెలుగు సంస్కృత ప్రాకృత తుల్యమే కనుక ఆంధ్ర శబ్దకౌముది వ్రాయుచున్నానని యుపక్రమించెను.

తన సూత్రగ్రంథముతో దగ్గర సంబంధము లేనిదియు, విభిన్న విషయములతో గూడినదియు నగు నీపీఠిక లక్ష్మీనృసింహకవి మొదట పేర్కొనినట్లు తెలుగు ప్రాచీనతను, దానికి సంస్కృత తుల్యతను సాధించుచున్నది.[1] దీనిచే చింతామణియే ఆద్యవ్యాకరణ మను వాదమును గూడ కాదనినట్లైనది.

కావున మొదట చెప్పినట్లు చింతామణి విషయమునం దాదర ముండుటచే దానిని గ్రహించినను, తత్కర్తయే ప్రథమాంధ్ర వైయాకరణుడను భావము నచ్చనందున నాతనిని లక్ష్మీనృసింహకవి తలంప లేదని తోచుచున్నది.

ఆంధ్ర కౌముది బాలసరస్వతీయమునకు దరువాతిది

బాలసరస్వతి తనవ్యాఖ్యను భాష్యమని సంభావించెను.[2] పాణినీయ వ్యాకరణములో పాణినిముని సూత్రములు, కాత్యాయన మహర్షి వార్తికములు, పతంజలిముని భాష్యము కలవు. ఈ మూడింటికి దరువాత భట్టోజీ దీక్షితుల సిద్ధాంత కౌముది పై గ్రంథముల సారాంశమును వెల్లడించుచు బయలుదేరినది. ఆ దృష్టితో జూచినచో నాంధ్ర కౌముది యను పేరు ఈ గ్రంథము బాలసరస్వతీయమునకు దరువాతిదని సూచించును.

---

[1] ఆంధ్ర కౌముది గ్రంథాది పీఠిక శ్లోకములు 1 నుండి 4 వు.

[2] ప. బాలస. పీఠిక 6 పద్యము.

బాలసరస్వతి దేవీభక్తుడు. అతడు తన వ్యాఖ్యను అంబాదేవి కర్పించినాడు.[1] అతడిచ్చిన ఉదాహరణములలో దేవీస్తుతిపరములగునవి చాల కలవు.

శ్లో. హరిముఖ సురపాలురకును
బరికింపగరాని వెలుగు పరమేశ మనో
హర హంస సరసి సంతత
కరుణ శుభము లొసఁగు శైలకన్యక మాకున్.[2]

ఇట్టి పద్యము లింకను నయిదున్నవి.[3] ఇంక పరిచ్ఛేదాంత పద్యము లుండనే యున్నవి. ఇవిగాక 'కొలిచితి నంబను విడిచితి మన్యులను'[4] 'భజియింతు నంబను త్యజియింతు నఘములు'[5] 'దేవతల లోపల గౌరి యధికురాలు'[6] మొదలగునవి కవి అంబా భక్తిని సూచించు నుదాహరణములు.

లక్ష్మీనృసింహకవి వైష్ణవుడు. అతడు వినతా కుమారుని, లక్ష్మీనృసింహులను పూజించి గ్రంథమున కుపక్రమించినాడు.[7] మఱియు గ్రంథమధ్యమున పెక్కుదాహరణములు విష్ణుసంబంధులగు నామములు కలవి. తలంతు ననంత శాయిని,[8] కంటినచ్యుతుని,[9] బలరిపు సేవ్యున్

---

1. ప. బాలస. పీఠిక 11 వ.
2. ప. బాలస. 2వ శ్లోక వ్యాఖ్య.
3. అందే సంజ్ఞ. 9, 12 శ్లో. వ్యాఖ్యలలో, పీఠిక 2వ ప.
4. అందే. సంధి. 1 వశ్లో. వ్యాఖ్యలో.
5. అందే 9 వశ్లోక వ్యాఖ్య.
6. అందే. అజంత. 8 వ సూ. వ్యాఖ్యలో.
7. ఆంధ్ర కౌముది పీఠిక శ్లోకాలు.
8. ఆంధ్ర కౌముది సంధి. 75 వృత్తి.
9. అందే 77 సూ. వ్యాఖ్యలో.

బుద్ధిన్ దేవునిగా నెంతు రామునిన్,[1] రామునర్చింతు కృష్ణునాశ్రయింతు,[2] దేవులలోపల రాముడధికుడు,[3] హరికంటె నన్యుడు దేవుడు లేడు,[4] మొదలగునవి కవి విష్ణుభక్తిని వెల్లడించును. అట్లని యీతడు వీర వైష్ణవుడు గాడు. పోషించునంధకారి, భజింతు నుమాపతి[5] వంటి శివస్తావకోదాహరణములు లేకపోలేదు. కాని యిట్టివి తక్కువ. కరుణించునంబ,[6] నుతించితినంబను,[7] తలచితినంబను[8] అని కొన్ని చోట్ల 'అంబా'పదఘటితమగు నుదాహరణము లీయబడినవి. ఇవి బాలసరస్వతీయ పఠన ప్రభావమున బడినవి గావచ్చును. అట్లయినచో నిది బాలసరస్వతీయమునకు దరువాతి గ్రంథమని చెప్పవలెను. కాని యీకవికి పార్వతీ పరమేశ్వరుల పట్ల గూడ గౌరవమున్నందున నీయుదాహరణముల నొసగెనన్నచో నట్లును గావచ్చును.

బాలసరస్వతి చింతామణిని సూత్రగర్భిత శ్లోకరూపముగా తలంచెను. శ్లోకము నట్లే యుంచి ఇది యిన్ని సూత్రములని వ్రాసి శ్లోకము మొత్తమునకే వ్యాఖ్య వ్రాసెను. ఆంధ్రకౌముదీకారుడు చింతామణిని సూత్రములుగా విభజించి, వానిని వీలయినంత సంక్షిప్తము చేసి తన గ్రంథములో నిబంధించినాడు. 'అనుతాం

---

1. అందే సంధి. 93 వ్యాఖ్యలో.
2. అందే. 100 సూ. వ్యాఖ్య.
3. అందే. శబ్ద. 153 సూ. వ్యాఖ్య.
4. అందే శబ్ద. 155 సూ. వ్యాఖ్య.
5. అందే సంధి. 75 సూ. వ్యాఖ్య.
6. అందే.
7. అందే. 68 సూ. వ్యాఖ్య.
8. అందే. 69 సూ. వ్యాఖ్య.

స్త్రియాం సమానాం సర్వస్య స్త్రీ సమస్యచ సులోపః' అను చింతామణి సూత్రము [1] 'అనుతాం స్త్రియాం సోర్లుక్' [2] అని సంక్షేపింపబడినది. ఇట్లు సంక్షేపము చేయుట అంతటను గానవచ్చును. బాలసరస్వతి సురాదిగణమును బేర్కొనలేదు. ప్రయోగముచేత దెలిసికొనుమని సూచించెను.[3] లక్ష్మీనృసింహాకవి సురలు లాజలు అక్షతలు అను వానిని సురాది గణముగా దెల్పెను. దీనిని బాలసరస్వతి చూచినచో సురాది గణము ప్రయోగముచేత దెలిసికొనుమని యేల సూచించును ?

చింతామణి సంస్కృతములో రచింపబడినది. బాలసరస్వతీయము తెనుగులో రచింపబడినది. మూలభావము నాంధ్రుల కంద జేయుట కాతడు దెనుగులో వ్రాసి యుండును. మూలమువలె వృత్తి గూడ సంస్కృతములో నున్నచో నుచితముగా నుండునను భావముతో నాంధ్ర కౌముది సంస్కృతములో రచింపబడినది. ఇది బాలసరస్వతీయము కంటె సంగ్రహముగా నుండుట విశేషము. విషయ గౌరవము జారలేదు సరికదా మరికొన్ని విశేషములు చేరినవి.

బాలసరస్వతి "ఆంధ్ర శబ్ద చింతామణి పెక్కు వత్సరము లంతర్భూతమై యున్న"దనుచు నది తనకు దొరికిన వివరము చెప్పినాడు.[4] లక్ష్మీనృసింహాకవి అట్టి వివరము లేవియు జెప్పలేదు. ఇవి గూడ బాలసరస్వతీయమే ఆద్యమనుటకు సూచకములు. కావున నిట్టి విశేషములను బరికించినచో నాంధ్రకౌముది బాలసరస్వతీయమునకు దరువాతిదేయని స్పష్టపడును.

---

1. కవిశిరో. అజంత. 80 సూ.
2. ఆంధ్ర కౌముది అజంత. 224 సూ.
3. ప. బాలస. అజన్త. 13 శ్లో.
4. ప. బాలస. పీఠిక 5 ప.

ఇప్పటికి బ్రథమ మునితత్త్వ దర్శన మయినట్లే. చింతామణి కర్తను, కాలమును గమనించితిమి. బాలసరస్వతి చింతామణికి కర్త కాడని తేలినది. అతనిపై నున్న అభాండము తొలగినది. చింతామణి స్వరూప స్వభావములను గ్రహించితిమి. చింతామణిలో లోపములుగా నెన్నబడుచున్నవి లోపాభాసములే యని వెల్లడియైనది. చింతామణి విశేషములు బయటపడినవి. తెలుగునకు, నపభ్రంశమునకు, జింతామణికి, బ్రాకృత శబ్దాను శాసనమునకుగల సంబంధమును బరికించితిమి. చింతామణి వ్యాఖ్యానమైన బాలసరస్వతీయ విశేషములను, తత్కర్తృ విశేషములను కొన్నింటిని గమనించుటతోపాటు చింతామణికి రూపాంతరమైన ఆంధ్ర కౌముదీ విశేషములను కొన్నింటిని గ్రహించితిమి. ఇక ద్వితీయముని తత్త్వ దర్శనము గావింపవలెను.

ఈ గ్రంథకర్త ఇతర రచనలు

1. **ఆత్మానాత్మ వివేకము :**

శ్రీ శంకర భగవత్పాదుల వేదాంత గ్రంథమున కనువాదము.

(ముద్రితము)

2. **వైరాగ్యమ్**

శ్రీ శంకర భగవత్పాదుల రచనలలో వైరాగ్యమును గూర్చి చెప్పిన విశేషములను వెల్లడించు సంస్కృత గ్రంథము.

(అముద్రితము)

3. **వ్యాసావళి**

ఆకాశవాణి విజయవాడ కేంద్రమునుండి ప్రసారమయిన సంస్కృత వ్యాసములు. (అముద్రితము)

4. **వ్యాసమంజరి**

వివిధ విద్యాసదస్సులలో చదివినవి, పత్రికలలో ప్రచురింపబడినవి అయిన పరిశోధనాత్మకాంధ్రసాహిత్యవ్యాసములు.

5, **వ్యాసాంజలి**

వివిధ పత్రికలలో ముద్రింపబడిన ఆధ్యాత్మిక వ్యాసకదంబము.

6. **కవితాంజలి**

సంస్కృతాంధ్ర కవితా ఖండికలు, కథలు, ఏకపాత్రాభినయములు మొ॥

సవరణములు

పుట	పంక్తి	ఉన్నది	ఉండవలసినది
2	6	వెలుపడినది	వెలువడినది
2	17	కాళిదాను	కాళిదాసు
10	15	స్వస్థావ	స్వస్థాన
13	4	అన్పుడు	అప్పుడు
18	14	ఆదివి	ఆదిని
18	17	రాదవి	రాదని
18	20	శబ్దశాశన	శబ్దశాసన
20	10	రాజరాజ	రాజరాజ
20	11	గుర్తుఅగు	గుర్తులగు '✓'
20	23	ద్ధర్మార్థక	దద్ధర్మార్థక
21	16	మధ్యను	మధ్యమ
23	18	శతాబ్ధి	శతాబ్ది
24	3	ఆంధ్ర	ఆంధ్ర
24	7	ఆంధ్రశ్య	ఆంధ్రశబ్ద
24	10	స. ప్ర. వ్యాకరణాలు	సం. ప్ర. వ్యాకరణాలు
24	10	(1)	(4)
24	12	(2)	(5)
24	24	(1)	(4)
24	25	(2)	(5)
25	11	ఆంధ్ర	ఆంధ్ర
27	11	ఉత్పృత్త	ఉత్పత్తి
29	17	చెప్పన	జెప్పిన
29	23	కాల్మీకి	వాల్మీకి

పుట	పంక్తి	ఉన్నది	ఉండవలసినది
34	14	రాజరాజ	రామరాజ
35	18	ఆచ్యుత	అచ్యుత
37	1	బాలస్వతి	బాలసరస్వతి
38	7	సంజీవిని	సంజీవనిని
42	13	అప్సుడు	అప్పుడు
43	4	మజ్జా	మజ్ఝా
43	7	మజ్జా	మజ్ఝా
43	10	(2)	(1)
43	13	(3)	(2)
43	24	2.	1.
43	25	3.	2.
45	22	ఆన్భుత	అద్భుత
46	23	విడ్వాన్	విద్వాన్
47	1	ఆనేది	అనేది
47	1	అన్వయం	అవ్యయం
47	10	దొంలి	దొరలి
52	20	1 కాల	1. కాం
53	16	ప్రసిద్ధదముల	ప్రసిద్ధపదములు
61	21	13 సూ 11	13 సూ.
62	24	మొ 11 వి	మొదలగునవి
63	8	స్సంప్రద్రాయతో	స్సంప్రదాయతో
70	20	పాజ్ఞివేసనము	ప్రాజ్ఞివేదనము
78	15	జేరలిచ	జేరలిచ
78	26	27 సూ, 1	27 సూ.
86	17	ప్రధను	ప్రథమ
86	20	విధింపబడిఫని	విధింపబడినవి

పుట	పంక్తి	ఉన్నది	ఉండవలసినది
94	18	నర్ణకము	నవర్ణకము
96	25	కనిశిరో	కవిశిరో
96	25	ర్యాఖ్య	వ్యాఖ్య
110	18	తక్కున	తక్కువ
110	24	1	2
115	13	శిప	శివ
124	4	కాపు	కావు
160	10	వ్రాయుచుంటినవి	వ్రాయుచుంటినని
169	23	సౌరము	సారము
170	13	చ్ఛందముసు	చ్ఛందమును
172	25	శబ్ధశాసన	శబ్దశాసనం
173	6	ద్వంద	ద్వంద్వ
173	20	దృష్టితో	దృష్టిలో
186	14	పువర్ణక	వువర్ణక
188	10	జనయత్వి	జనయన్తి
189	8	అఈ	ఆఈ
191	11	గ్రియల	క్రియల
196	2	మరెచ్చును	మరెచ్చటను
196	19	అం. భా. భూ. 82 ప	కవిశిరో. అజంత 60, 61 సూ.
200	4	వెన్ను	వెన్ను
208	1	308	208
210	10	ఇలు	ఇల్లు, ఇలు
210	25	అనుజిన్నయ	అనుచిన్నయ
222	5	అన	అని
243	10	చిపి	లిపి

పుట	పంక్తి	ఉన్నది	ఉండవలసినది
351	21	ప్రకృత్యనయవ	ప్రకృత్యవయవ
372	16	వాచక	వాచకములు
373	11	కాదు	కాదని
380	22	అకారము	ఆకారము
382	22	వారించును	వారించుచు
387	19	చింతామణిని	చింతామణి
391	14	మమ్ముకిశస్	మము + శస్
312	1	ఏత్వము	ఎత్వము
315	1	ఆకారము	అకారము
323	2	సూత్రము	మాత్ర
327	23	మేను, మేలు	మీను, మీలు
328	2	మేకులు	మీకులు
328	13	మేనులు	మీనులు
333	19	విద్య	1 విద్య
333	23	శ్రీవానిలి	1 శ్రీవావిలి
337	4	ఒకచోట	ఒకచోటన
		మహద్వాచక	మహద్వాచకము
339	15	ఇట్టి	ఇట్లే
339	16	కాని	కాన
339	22	చేసి దృతప్రకృతికాలు	చేసి సూరి దృతప్రకృతికాలు
340	11	డుజాది	డుజాది
340	20	లంట్రడు	లటంౖడు
344	12	అరోపణాలు	ఆరోపణాముల
345	15	నది	నవి
345	23	సూత్రము	సూత్రము,

పుట	పంక్తి	ఉన్నది	ఉండవలసినది
350	6	దనబజా	కనబజా
350	7	మంచికవి	మంచికవి.
350	10	ఛందశాస్త్రము	ఛందశ్శాస్త్రము
356	6	మంత్రాధి	మంత్రాది
359	7	సర్వేషు చై	సర్వేషు చైక
360	4	టడన	టడణ
360	16	జెప్పనట్టిది	జెప్పునట్టిది
360	17	క్రియలందున్న	క్రియలందున్నది
362	4	గోవుల, దే,వునకు	గో,వుల "దే,వునకు
363	15	8	7
367	10	ఆకారములో	ఆకారములలో
368	11	ఉన్నవి	ఉన్నది
368	18	వితరి	వితర్ది
371	13	పుతము	ప్లుతము
372	7	గ్రహింపడుట	గ్రహింపబడుట
372	19	సూత్రముచే	సూత్రముచే నిండలి
372	20	కావున	కావున సావర్ణ్య విధాన సామర్థ్యముచే
374	10	బరిశోధకులు	పరిశోధకులు
375	17	పరోఎసానస్థః	పరోవసానస్థః
375	10	సంశ్లోష	సంశ్లేష
379	10	వేరులివి	పేరులివి
382	4	రెండునుదాహరణ	రెండుదాహరణ
387	22	లేదా	లేవా
389	12	విశేష్యములు	విశేష్యములు కలిగినవి
390	12	పాదాంత్యము	పాదార్థము

శుద్ధి

పుట	పంక్తి	ఉన్నది	ఉండవలసినది
394	9	సత్యమేదో	నర్థమేదో
397	13	ప్రాకృత	ప్రాయిక
404	17	వికృత	వికృతి
407	24	కవిశిరో	4. కవిశిరో
410	8	ధాతుపు	ధాతువు
416	10	32	82
418	7	1 1/2	1 1/4
418	12	48 3/4	45 3/4
420	8	సర్గ	ర్గ
421	9	4, 5, 6	5, 6, 7
421	10	7	8
421	11	8, 9, 10	9, 10, 11
426	1	అచ్చ తెలుగఃవ	అచ్చ తెలుగున
427	5	జన్	జస్
427	16	దానికి	వానికి
429	8	విభజించిన	విధించిన
431	4	పాకృతమునుండి	పాకృతముల నుండి
432	22	2	3
432	23	3	2
443	13	3	4
443	15	4	5
446	20	తెల్పియున్నారు	తెల్పియున్నారు. 3
447	3	భూతార్థ కాకార	భూతార్థకేకార
452	7	హ్రహ్వములు	హ్రస్వములు
455	8	పై విభక్తులందే కాక చతుర్థియందును.	పై విభక్తులందు

पुस्तकालय
गुरुकुल कांगड़ी विश्वविद्यालय
0748

పుట	పంక్తి	ఉన్నది	ఉండవలసినది
460	10	వచచన్స్య	వచనస్య.
488	1	ధాంయే	ధారయే

గమనిక : తప్పుల నెన్నిసారులు దిద్దినను, పూర్తిగా తొలగించుట సాధ్యము కాలేదు. పు - వు, థ - ధ, స - న, న - వ, ప - వ, : - ః, ద - ధ, జ - జ, ను - మ, లో - తో, అ - ఆ, పు - ప, ఛ - భ, మ - య, చూ - భూ, మున్నగునవి ఒక దానికి మరియొకటి పడుట, గ్రంథ నామములకు క్రిందగీసిన గీతలు తొలగుట, బ్రాకెట్టులు, కామా, ఫుల్ స్టాప్ చిహ్నములు తొలగుట మున్నగు దోసగులు దొరలినవి. సులభముగా తెలియునని తోచిన వానిని సవరణముల పట్టికలో జూపలేదు. విజ్ఞులు గమనింప గోరెదను.

GURUKUL KANGRI LIBRARY
Accession
Class on
Cat on
Tag etc.
Checked
Any Other

గ్రంథకర్త సంక్షిప్త పరిచయము

పేరు : డా. చిఱ్ఱావూరి శివరామకృష్ణశర్మ.

జనన స్థలం : అయిభీమవరం, పశ్చిమగోదావరి జిల్లా.

పుట్టిన తేది : 14-2-51.

తల్లిదండ్రులు : 'వ్యాకరణ వేదాంత విశారద, 'గీతా వ్యాఖ్యాతృ చక్రవర్తి' అనంతపద్మనాభశాస్త్రిగారు, శ్రీమతి సుబ్బలక్ష్మమ్మగారు.

దర్శకగురువులు : ఆచార్య బొడ్డుపల్లి పురుషోత్తం M.A. Ph.D. గారు

గురువులు : తండ్రిగారు, 'వేదాధ్యాపన తపస్వి' గుళ్ళపల్లి సీతారామావధానులుగారు, 'వ్యాకరణాచార్య' జయంతి సూర్యనారాయణశాస్త్రిగారు, విజయనగరాస్థాన పండితులు 'అభినవ విద్యారణ్య' ఘండికోట సుబ్రహ్మణ్య శాస్త్రిగారు, వ్యాకరణ వేదాంతశాస్త్ర పండితులు పరిమి విశ్వనాథశాస్త్రిగారు, కొత్తపల్లి వెంకటకృష్ణ సిద్ధాంతిగారు మొదలగువారు.

విద్య : శ్రీకృష్ణ యజుర్వేదము, అద్వైత వేదాంతశాస్త్రము, వ్యాకరణశాస్త్రము.

పట్టములు : భాషాప్రవీణ, M. A., (తెలుగు) P. O. L. (సంస్కృతము) Ph. D.

కృషి : శ్రీమద్రామాయణ, భారత, భాగవతములపై సహస్రాధిక ప్రసంగములు, అక్షరావధాన నిర్మాణము, నేత్రావధానాది సాంకేతికావధానములను చేయుట, పలువురకు నేర్పుట, వివిధరచనలు.